

వింధియా
రాజేశ్వరి
(సామాజిక తమిళ నవల)
అనువాదం: ఏండి సుందరేశన్

**RAJESWARI**
A Telugu Novel by Vindhiya

ISBN No: 978-0-578-11805-5

---

First Edition, 2018

© Srimati India Devi
తెలుగు అనువాదం © Kurinji Publications, California, USA

Original title in Tamil: *Suthantirappor*
Telugu Translation: *Rajeswari*

The translator wants to acknowledge with profound thanks the generous grant from the Department of South Asian Studies at the University of California, Berkeley towards the publication of the English and Telugu translations of the novel RAJESWARI.

**Credits:**

See the last page

Printed at:
Copy World
2001 3rd Street
San Francisco, CA 94107
Phone: 800.930.COPY

# రాజేశ్వరి

## తమిళ మూలం: వింధియా

## మూల నవల: సుదందిరప్పోర్

## తెనుగు నేత: ఏండి సుందరేశన్


**Published by:**

**Kurinji Publications**

**10944 San Pablo Avenue #610**

**El Cerrito, CA, 94530-2377**

**United States of America**



**Email:**

**rangan.sundaresan@gmail.com**



భర్త V. సుబ్రహ్మణ్యన్ తో
ఇందియాదేవి (1942)

# అంకితం



(1900-1973)

రచయిత ఇందియాదేవి గురువు

శ్రీ కేశవమఠం తాండవకృష్ణయ్య గారికి

# రాజేశ్వరి

## విషయ సూచిక


అవతారిక/శేషారావు

ముందు మాట/సుందరేశన్

మొదటి భాగం:

తీయని ఊహలు/1

రెండవ భాగం:

అడుగడుగున చిక్కులు/

మూడవ భాగం:

శ్రుతి తప్పిన గానం/

నాలుగవ భాగం:

చెదిరిన ఆదర్శం/

# అవతారిక

మా నాన్నగారు కేశవమతం తాండవకృష్ణయ్యగారు. స్వతహాగా పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు వాస్తవ్యులు. ఉమ్మడి కుటుంబ సమస్యల దృష్ట్యా ఆయన మకాం మద్రాసుకి మార్చుకోవాలనే తలంపుతో, కుటుంబాన్ని తాత్కాలికంగా అత్తగారు ఊరైన బరంపురంలో దిగబెట్టి, మద్రాసు వెళ్ళిపోవాలనే క్రమంతో, దైవనిర్ణయంగా బరంపురంలోనే శాస్వత నివాశం ఏర్పరచుకోవలసి వచ్చింది.

అప్పట్లో బరంపురంలో ఉంటున్న సర్వకళాభిమాని, జమిందారైన పాకనాటి కృష్ణమూర్తి నాయుడుగారి ప్రాపకంలో వారు నిర్మించిన శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ వార్షిక కళ్యాణోత్సవాల నిర్వహణకు శ్రీ నాయుడుగారు మా నాన్నగారిని నియమించి, ఇల్లుకూడా కట్టుకునేందుకు ఒక స్తలం ఏర్పాటు చేసారు. ఇది 1930 దశంలో జరిగిన ఇతివృత్తం. అప్పటికి నా వయస్సు నాలుగు సంవత్సరాలు. మా నాన్నగారు అప్పటికే ఏలూరులో ఉంటుండగానే వారి మేనమామ వద్ద సంగీత ప్రాధమిక శిక్షణ పొందియున్నారు. ఆ విద్యనే తన జీవనోపాధిగా మలుచుకొని బరంపురంలో పేరు పొందిన పెద్దల గృహాలకి వెళ్ళి వారి పిల్లలకి సంగీత బోధకులుగా జీవితం కొనసాగించారు.

ఇంచుమించు అదే సమయంలో తిరుచునాపల్లి (తమిళనాడు) నుంచి ఉద్యోగాన్వేషణలో సుందరేశన్ భార్య త్రైలమ్మాళ్ తో బరంపురం వచ్చి కళ్ళికోట కాలేజిలో Maths ప్రొఫెసర్ గా నియమితులయ్యారు. ఇరువురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు కలిగిన వారి సంతానంలో ఇందియాదేవి ప్రధమురాలు. ప్రొఫెసరుగారికి వారి మాతృబాష అయిన తమిళం పట్ల గల అచంచల ప్రేమాభిమానంవలన, పిల్లల ప్రాధమిక విద్య తెలుగు మాధ్యమంలో జరిగినా, వారి మాతృబాషలో తన సంతానం ప్రావీణ్యులయ్యేటట్టు కృషిచేసారు.

ఇందియాదేవి మా నాన్నగారి శిష్యులలో అగ్రగామిగా నిలిచారు. నాకు ఊహ తెలిసేసరికి ఆమెచేత బహిరంగ పాట కచేరీలు చేయిస్తుండేవారు. అప్పట్లోనే ఆమె తమిళ సాహిత్యంలో కూడా ఒక పేరుపొందిన రచయిత్రిగా తమిళనాట ప్రసిద్ధురాలని మాకు తెలిసింది. ఆమె రచనలు తమిళనాట గల ప్రముఖ పత్రికలు కలైమగళ్, కావేరీ మొదలైనవాటిలో ప్రచురంపబడుతుండేవని చెప్పుకునేవారు.

ఇది ఇలా ఉంటుండగానే 1951-55 వరకు నేను కటక్ లో ఉద్యోగరీత్యా ఉండవలసినప్పుడు, ఇందియాదేవిగారి భర్త సుబ్రహ్మణ్యన్ గారు కూడా అక్కడే నివసిస్తుండడంవలన, బరంపురం పరిచయాన్ని పునస్కరించుకొని ఆ దంపతులని తరచూ కలుస్తుండేవాడినేకాని, నా అజ్ఞానం వలన ఆమె తమిళ సాహిత్య విశేషాలు ఎప్పుడూ ప్రస్తావించలేదు. 1955లో నేను కటక్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యన్ గారి Morning Collegeలో చేరాలనుకున్నప్పుడు అతను ప్రోత్సాహించి సహకరించారు. కాని అదే మొదటి, చివరి పాఠంగా అతను నిర్వహించి చెప్పిన "భూమి – బంగారం" విలువలపై ఆయన చెప్పిన మాటలు ఇప్పటికీ నా చెవుల్లో వినిపిస్తున్నాయి. దురదృష్టవశాత్తూ అదే రోజున నన్ను బలవంతంగా జాజిపూర్ S.D.O. స్టెనోగా పంపించేసారు.

1956లో నేను రైల్వేలో ఉద్యోగరీత్యా విజయనగరం చేరుకున్నతరువాత, బరంపురంలో ప్రొఫెసరు సుందరేశన్ కుటుంబం యావత్తూ అక్కడనుంచి వెళ్ళిపోయారని తెలిసి, వారి ఉనికి ఎలాగైనా తెలుసుకోవాలనే నా ప్రయత్నాలు ఫలించునందున నిరాశ, నిస్పృహలతో ఆ ప్రయత్నం విరమించుకున్నాను.

కాని, ఏమాశ్చర్యం! బహూశా 2013 ప్రాంతంలో అనుకుంటాను, ఒక శుభదినం ఇందియాదేవి చెల్లెలుగారైన సెల్వీగారు అమెరికానుంచి నాకు స్వయంగా ఫోన్ చేసేసరికి నా ఆనందానికి, ఆశ్చర్యానికి అవధుల్లేవు. ఇంతకీ ఆమె నా ఉనికిని తెలుసుకోవడానికి ఎందుకు అంత పట్టుబడి సాధించారో తెలుసుకొని నేను మరీ ఆశ్చర్యపోయాను. ఇందియాదేవి అప్పటికి స్వర్గస్తులైయ్యారని, ఆమె తమిళంలో సుమారు 100 కధలూ, ఒక నవల రాసియున్నారని, ఆ తమిళ సాహిత్యమంతా అమెరికాలోనే స్థిరనివాసం ఏర్పరచుకున్న వారి తమ్ముడు రంగన్ గారు ఆంగ్లంలో అనువదించినట్టు ఆమె తెలియజేసారు. అప్పటికే నేను భగవత్ కృపతో

రాజాజీగారు ఆంగ్ల వాడుక బాషలో రచించిన రామాయణం, మహాభారతం తెలుగులోకి అనువదించానని ఉదహరించినందున సెల్వీగారు రంగన్ గారిని వెంటనే నాకు ఫోన్ ద్వారా పరిచయం చేసారు. ఆనాటినుండి నేటివరకు మా మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆ క్రమంలో రంగన్ గారు వారి అక్కగారి 10 తమిళ కధలు ఎంచుకొని ఆంగ్లంలో అనువదించి పుస్తకరూపంలో ప్రచురించియున్నారు. ఆ దరిమిలా రంగన్ గారు ఆ కధల పుస్తకం నాకు పంపించి అందులో వారు తెలుగులోకి అనువదించిన మూడు కధల మినహా తక్కిన ఏడు కధలు నన్ను తెలుగులోకి అనువదించమని కోరారు. ఆ విధంగా ఇందియాదేవి సాహిత్య యజ్ఞంలో ఒక సమిధను అయ్యే మహాభాగ్యం కల్పించినందున సెల్వీగారికి, వారి సోదరులు నారణన్, రంగన్, శ్రీను గార్లకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అంతేకాదు, ఈ కధలను వారి Website లో చేర్చి మరింత ప్రాచుర్యం కల్పించారు.

అటుపైని ఇందియాదేవి విరచితమైన 'రాజేశ్వరి' అనే తమిళ నవల రంగన్ గారు ఆంగ్లంలో అనువదించి, ఆ నవలమూల ఇతివృత్తం సంగీత ప్రాముఖ్యతను అంతర్లీతనంగా ఆద్యంతాలు ప్రస్తావించి ఉన్నందున, చూడండి, వారి గురుభక్తి ఎంతటిదో! ఆ ఆంగ్ల ప్రతిని మా నాన్నగారికి అంకితం ఇచ్చేందుకు వారు, సోదరులు ఏకగ్రీవంగా నిర్ణయించినందున ఆ ప్రతిలో మా నాన్నగారి చిత్తరువు ప్రచురించేందుకు గాను సెల్వీ నన్ను పట్టుదలతో వెతికి పట్టుకున్నారు.

ఇక్కడ ఒక విషయం చెప్పక తప్పదు. విజయనగరంలో ప్రేమ సమాజం అనే ఒక ప్రైవేటు సంస్థ 1942లో స్థాపించబడి కొనసాగుతోంది. 2004లో నాకు ఆ సంస్థతో అనుబంధం ఏర్పడింది. అంత దివ్యమైన సంస్థకు ముఖ్యమైన ముఖద్వారం సరైనది లేదనే కారణం వలన, ముఖద్వారం నిర్మాణానికి నాకు ఆలోచన రాగా ఆ సంస్థ అధ్యక్షులు డాక్టర్ బి.ఎస్.అర్ మూర్తిగారు, కార్యదర్శి పెద్దింటి అప్పారావుగారు, కోశాధికారి స్వర్గీయ పి. నాగేశ్వరరావు గార్ల సహకారం, ఇతర పాలకవర్గ సభ్యుల సహకారం కూడా నాకు అందినందువలన ఒక అందమైన ముఖద్వారం నెలగొల్ప గలిగేను. అయితే రచయిత్రి లేదు; అంకితం పుచ్చుకోవలసిన గురువుగారు లేరు; అయినప్పటికీ సోదరీ, సోదరులు సంగీత

గురువుగారికి ఆ రచన అంకితమివ్వడం అనే విషయం గొప్పతనం ముందు నేను మా నాన్నగారి స్మృతి చిహ్నంగా నెలగొల్పిన ముఖద్వారం గొప్పతనం తీసికట్టే కదా?

మా నాన్నగారి స్మారక చిహ్నాన్ని సెల్వీగారూ, రంగన్ గారూ ఇండియాకి వచ్చినప్పుడు వచ్చి చూసారు. అంతేకాదు, సెల్వీగారు తమ గురువుగారికి ఇచ్చే గురుకట్నంగా నాకు ఇచ్చి వెళ్ళారు. వారందరూ విశాల హృదయంతో, మా నాన్నగారి మీద వారందరకు గౌరవభావంకి కారణంగా, నామీద కూడా అదే స్థాయిలోయిలో, ఈ నవలకు అవతారిక గౌరవం ఇచ్చినందుకు, మరొక్కసారి అందరకూ భగవత్ ఆశీస్సులతో నా యొక్క కృతజ్ఞనలు తెల్పుకుంటున్నాను.

విజయనగరం, కే.వి. శేషారావు

నవంబరు 11, 2017

# అనువాదకుని ముందుమాట

*"తన యందములు ప్రాంతజనుల కభిరుచి వాసన నేర్ప నలరిన తెనుగు రేఖ,*
*తన వేణికలు వసుంధరను సస్యశ్యామలనుజేయ జెలగిన తెనుగుభూమి"*

నేను పుట్టిపెరిగిన ఊరు బరంపురం రాయప్రోలుగారి వాక్యంకి ఒక మంచి ఉదాహరణ. మాది తమిళ కుటుంబమేయైనా ఇంటి బయట మా దైనిక వ్యవహారాల్లో పరస్పర చర్యలకీ, ఇక స్కూల్లో, కాలోజీలో మాధ్యమంగా తెలుగుబాషే చోటుచేసుకుంది. ఇంటిలో నాన్నగారి ప్రేరేపణతో తమిళ బాషలో రాయడం, చదవడం నేర్చుకున్నాం. తమిళ సంచికలు, కథలూ, నవలలు చదవడం మూలంగా తమిళుల సంస్కృతి, సాంప్రదాయాలూ అలవరించుకున్నాం. నా హైస్కూలు తెలుగు బోధకులు పారనంది వెంకటరమణగారిని నేనెన్నటికీ మరిచిపోలేను. నాకు తెలుగు బాషలో, సాహిత్యంలో క్రమ క్రమంగా పెరిగిన ఆపేక్షకి అతనే మూలకారణం. సుమారు అరవై సంవత్సరాల తరువాతకూడా అతని దగ్గర చదివిన గ్రాంధిక పద్యాలు నాకు కంఠస్తం. ఇటీవల పెద్దన *మనుచరిత్ర* ఆంగ్లానువాదం చదివినప్పుడు ఆ పాతరోజులు మళ్ళీ గుర్తుచేసుకున్నాను. ఆ కారణంవలనే మా అక్కయ్య ఇందియాదేవి రాసిన తమిళ నవలని తెలుగులో అనువదించాలనే ఆలోచన నాకు కలిగింది; అక్కయ్య సెల్వీ, మిత్రులు కే.వి. శేషారాపుగారు నన్ను ప్రోత్సహించడమూ ఒక ముఖ్య కారణం అనాలి.

శేషారావుగారు ప్రస్తుతం విజయనగరంలో ఉంటున్నారు. అతనూ ఒకప్పుడు బరంపురంవాసులే. అతని నాన్నగారు కీర్తిశేషులు కే. తాండవకృష్ణయ్యగారు ''తన గీతి అరవజాతిని గాయకులనుగా దిద్ది వర్ధిల్లిన తెనుగువాణి,'' అని రాయప్రోలు

వాక్యంకి తగినట్టుగా మా అక్కలిద్దరికీ కర్ణాటక సంగీతం బోధించారు. సంగీతం అన్నప్పుడు రాగ, స్వరాల అంశాలతోపాటు, సాహిత్యానికీ శ్రద్ధ చూపాలని అతను వక్కాణించి చెప్పేవారు. రాజేశ్వరి నవలలో శర్మగారుగా పాఠకులు అతన్ని కలుసుకుంటారు. అతనికి ఈ నవల అంకితం చెయ్యాలని సెల్వి ఇచ్చిన సలహాతో మేమందరం ఏకీభవించాం.

2013లో అనుకుంటాను, అదృష్టవశాత్తూ, సెల్విమూలంగా శేషారావుగారు మళ్ళీ మాకు పరిచయమన్నారు. నేను ఫోనులో అతనితో పాత బరంపురం కబుర్లు పంచుకున్న తరువాత అతని రచనలు - తెలుగులో అనువదించిన ఆంగ్ల కథలు, రాజాజీగారి పురాణేతిహాసాలు, ఉపనిషత్ వ్యాఖ్యానాలు - నాకు పంపారు. మా అక్కయ్య ఇందియా కథలని తెలుగులో అనువదించాలని కోరారు. అతను అనువదించిన కథలు http://kurinjipubs.com/Vindhiyaintelugu.htm లో మీరు చదవగలరు.

వింధియా అనే కలంపేరుతో మా అక్కయ్య ప్రశిద్ధ జనరంజిక తమిళ వార, నెల పత్రికలలో కథలు, వ్యాసాలు రాసారు. ఆవిడ సాహిత్య ఉద్యమం స్వల్పకాలమేయైనా (1947-1960), మంచి పేరు, ప్రతిష్ట అందుకున్నారు. అనుత్తమా అనే సమకాలీన తమిళ తచయిత వింధియాని "మీ కథలు చదివిన తరువాత మీరు వింధ్యపర్వతమేకాదు, హిమాలియశిఖరాన్ని చేరుకున్నారు అనే భావన కలుగుతోంది," అని శ్లాఘించారు. 1950 New York Herald Tribune ఆశ్రయంలో జరిగిన అంతర్జాతీయ కథానికల పోటీలో పాల్గొన్న తమిళ వారపత్రిక *కల్కీ* ఏర్చితీసిన నాలుగు కథల్లో వింధియాకి బహుమానం లభించింది.[1] '*కాదల్ ఇదయం*' అనే ఆ తమిళ కథని తెలుగులో, '*ప్రేమ హృదయం*' అనే పేరుతో మీరు

1 ఆ పోటీలో ప్రపంచస్థాయిలో పాలగుమ్మి పద్మరాజుగారి కథ 'గాలివాన' ద్వితీయ బహుమానం అందుకుంది. ఆఖరికి న్యూయార్క్ లో మధ్యస్తులు ఐదు కథలు ఎన్నుకున్నారు. పోటీకి ఆసియా ఖండ దేశాలనుంచి అనేక బాషలలో వచ్చిన కథల్లో ఒక తెలుగు కథకే ఆ గౌరవం లభించింది. ఏ కథ మొదటి బహుమానంకి అర్హత అనే అనిర్ణీత తరువాత ఐదువేల డాలర్ల బహుమానం ఐదు రచయితలకి పంచిపెట్టడమైంది.

http://kurinjipubs.com/STORY1_PREMA_HRUDAYAM.pdf
లో చదవగలరు.

**రాజేశ్వరి** వింధియా రాసిన ఒంటి నవల. ఆవిడ దాన్ని 1948-1950లో, మధ్య మధ్య ఆగి, రాసిన మనోదాలు తమ్ముడు - మా పెద్ద అన్నయ్య- కి అందించారు. అతను మా నాన్నగారి Bijou అనే తమిళ ముద్రాలేఖినిలో ఆ రచనలు పదిలంచేసారు. విందియా నవలను పూర్తిచేసినట్టే మా అన్నయ్య భావన. కాని దురదృష్టవసంగా కొన్ని పేజీలు కానరాలేదు. అందువలనే రాజేశ్వరి ఒక అసంపూర్ణ నవల అనే ఊహ మాకందరిలో నిలిచిపోయింది.

టైపుచేయబడిన ఆ భారీ ప్రతి ఇందియా, బావగారూ నివసించిన కటకం ఇంటిలో యాభై సంవత్సరాలకిపైగా ఒక మూల అలాగే ఉండిపోయింది. 1997లో అక్కయ్య సెల్వి కటకం వెళ్ళినప్పుడు బావగారు ఆ ప్రతిని సెల్వికి ఇచ్చి, దాన్ని ప్రచురించితే బాగుంటుందని సలహా ఇచ్చారు.

1999లో ఇందియా కన్నుమూసింది. బావగారు 2001లో పోయారు.

2007లో సుందరేశన్ కుటుంబ ఆశ్రయంతో వింధియా కథలు Cupid's Alarms అనే పేరుతో ప్రచురణమయ్యాయి. ఆ విధంగా ఇందియా నవలనుకూడా మేం ప్రచురించాలని సెల్వి ఆశించింది, నాతో చెప్పింది. ఆ సమయంలో నేను వేరే కథలూ, నవలలూ అనువాదం చేసే కృషిలో పాల్గొన్న కారణంవలన వింధియా నవల గురించి ఆలోచించలేదు. 'అదేమో యాభై సంవత్సరాలముందు రాసిన ఒక అసంపూర్ణ నవల,' అనే ఉద్దేశమే నా ధోరణికి ముఖ్యకారణమనాలి.

ఐతే, ఈ నవలని ఇంకొకసారి, పూర్వభావం, ఊహ లేకుండా పరిశీలన చేసిన తరువాత, నా దృక్పధంలో మార్పు కానవచ్చింది. ఈ నవలలో ఒక సంపూర్ణత, ముగింపు చోటుచేసుకున్నాయనే నమ్మకంకూడా కలిగింది.

పెద్దన్నయ్య నారణన్ టైపుచేసిన తమిళ ప్రతిని - మాతృక నవలని - తీర్చిదిద్దడానికి నాకు మదురైలో ఒక సంస్థ తోడ్పడింది. రాజేశ్వరి నవల ఆంగ్లానువాదం 2014 లో ప్రచురణమైంది. మాతృక నవలను 2015 లో Kurinji Website లో చేర్చడమైంది.

వింధియా కథల్లో 'విల్లన్' (ప్రతినాయకుడు) అనే పాత్ర కనిపించదు. ఇది మనం గమనించాలి. అసలు కథ, నవల అంటే అందులో దురాత్ముల పాత్రలు ఉండితీరాలని కొందరు వాదిస్తారు. "మరి సంఘర్షణలు, పోరాటాలు లేకుండా కథ సాగుతుందా, రాణిస్తుందా?" అని వాళ్ళు అడగవచ్చు. అది ఎలాగున్నా, కొంచెం ఆగి, నిదానించి, ఆలోచిస్తే, కుటుంబాల్లో విభేదాలు, భిన్నాభిప్రాయాలు, నాణ్యమైన, యోగ్యుల మధ్యకూడా లేవడం సహజం అనే సంగతి మనం స్థిరపరచుకోవాలి. అదే రాజం పాత్ర మనకి చెప్తోంది. రాజం పాత్రలో మనం చూసేవి ఆదర్శ భావాలూ, ఉత్తమ గుణాలు. ఇవన్నీ గాంధీయ నియమంతో ఆమెలో చోటుచేసుకున్నాయి. ఈ నవలలో ఒక ఆదర్శ యువతి జీవితంలో జరిగే ఆధ్యాత్మిక పోరాటం మనం చూస్తున్నాం. తను కలుసుకున్న అందరిలోనూ ప్రేమానురాగాలు పుట్టించాలని రాజం ఆశించింది. అందువలనే నీరూ, పాలూ కలిసివున్న చెంబులో హంస పాలుమాత్రమే తాగుతుందని పెద్దలన్నట్టు రాజం పైఖరి వ్యక్తమవడం మనం చూస్తాం. అందరిలోనూ తన ఉదాత్త భావాలు - తనపై బాహటంగా పగ చూపేవారైనా సరే - అధిగమించాలనే మనోభావం ఆమెలో ఎలా వచ్చింది? ఆ ప్రశ్నకి జవాబు చెప్పడం సులభం. ఆఖరికి రాజం తన తండ్రికూతురు. ఒక విధంగా నటరాజన్ ఆమె సహృదయుడు; రాజంకి అతనే వివేకం, పెద్దఱికం నేర్పారు. ఆమె ఆత్మవిచారణకి అతనే ఓజబంతి, మార్గదర్శకుడు. ఒక యువతిలో కనిపించే అమాయకత్వం, నిరాక్షేపణ సమ్మతి, బోళాతనం చూసి మనం ఆమెను నిందించగలం. కాని రాజం విషయంలో ఆమె ప్రవర్తన భవిష్యత్తులో ఆమెలో కానవచ్చే భక్తి, ధార్మిక గుణాలకి సూచన అని మనం గ్రహించాలి. రాజేశ్వరి నవలకి రాజకీయంతో ఎటువంటి సంబంధం లేకపోయినా, ఇందులో గాంధీయ ప్రభావం ఉంది. ఆ మాటకు వస్తే, ఒక ఘట్టంలో రాజం తనకి స్వంత్రత కావాలని నిశ్చయించినప్పుడు తన పోట్లాటని దేశంలో జరుగుతున్న స్వాతంత్రోద్యమంతో పోల్చుకుంది; ఆంగ్లేయులనుంచి భారతదేశంకి విముక్తి పొందడానికి సాగే గాంధీజీ పోరాటంతో తన ప్రయత్నం సార్థకమని నమ్మింది.

ఈ నవల అనువదించడంలో నేను మళ్ళీ, మళ్ళీ, గతకాల జ్ఞాపకాలు నెమరువేసుకున్నాను. బాల్యం, ఇక ఆకృతినిచ్చే వయసులో నా అనుభవాలు, మా ఊరి తమిళ - ఆంధ్రుల సాంస్కృతిక సమ్మిశ్రణంలో నేను నేర్చుకున్న పాఠాలు నన్ను మళ్ళీ రంజింపజేసాయి. ఈ నవల పాత్రలు సామాన్యప్రజలు. వారి సాంసారిక సంఘటనలు ఈ కథ మనకి చెప్తోంది. వారిలో కనిపించే గుణాలే - సభ్యత, సమృద్ధి - కథ నేపధ్యంని, వాతావరణంని ప్రతిఫలింపజేసాయి. నాలాగే పాఠకులు ఈ నవల చదివి ఆనందిస్తారని నా ఆశ.

ఈ నవలను వెలువరించాలని తలపెట్టి ఆ పని నెరవేర్చడానికి సహాయం చేసినవారు అక్కయ్య సెల్వి, శేషారావుగారు. వారిద్దరికీ నా కృతజ్ఞతలు. ఈ నవలకి అవతారిక అందించిన శేషారావుగారికి నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

El Cerrito, CA

ఏండీ సుందరేశన్
April 10, 2018

# రాజేశ్వరి

## మొదటి భాగం

## తీయని ఊహాలు

# రాజేశ్వరి

## 1

రాజేశ్వరికి మనసులో రకరకాల ఆశలూ, భావాలూ ముసురుకుంటున్నాయి. కొంచెం సమయంముందు ఆమె తన చిన్న తమ్ముడూ, చెల్లెలుతో ఉయ్యాల ఊగింది. అది పెద్ద ఉయ్యాల; దాని పలక విశాలతలో ముగ్గరు అనాయాసంగా కూర్చోవచ్చు. ఆశువుగా, తనకు తెలిసిన పాటలన్నీ, తనకు తోచిన రాగాల్లో రాజేశ్వరి పాడి తీర్చేసింది. కొన్ని నిమిషాల్లో ఎన్ని మార్పులు! ఇప్పుడు ఇంటిముందున్న తోటలో, చిన్న సిమెంటు మేడ మీద కూర్చొనివుంది; మనసంతా చేతిలోనున్న శృంగారకథల పుస్తకంమీద లీనమైపోవడంతో ఆమె చేష్టలూ, పాటలూ అమాంతంగా ఆగిపోయాయి.

ముఖంలో ప్రశన్నత, విశ్వాసంతో రాజేశ్వరి యౌవనశాల ద్వారంలో అడుగుపెట్టింది. ఎది చూసినా ఆమెకు లావణ్యంగా, చోద్యంగా, వింతగా కనిపిస్తోంది. ఇంకా కొన్ని మాసాలలో పదిహేను నిండుతాయి. దేహంలోని పరవశం, వికసించిన మనసు ఆమెకు చెప్పే సందేశం ఇదే: *నీ కలలు త్వరలో సఫలమవుతాయి.* ఇటీవల రాజేశ్వరికి తను కూడా ఇరుగుపొరుగుల అమ్మాయిలలాగ చీర కట్టుకోవాలనే ఆశ రావడంతో నాన్నగారి అంగవస్త్రమో లేక ద్వారాల్లో వేలాడే తెరల్లో కళ్ళకు ఇంపుగా కనిపించినదేదో ఒకటి ఒంటిమీద కప్పుకొని  గంభీరంగా ఇంట్లో అడుగలు వేయడం ఆరంభించింది.

"ట్రింగ్" . . . ట్రింగ్" . . .

సైకిలు గంట సంగీతం విని నాన్నగారు నటరాజన్ రావడం తెలిసింది. ఆమెను చూడగానే అతని ముఖంలో ఎదురుచూసిన భావన కనిపించింది.

"రాజాబాయ్! . . . రాణీజీ! . . . "

"నాన్నగారూ, నేను రానా?"

"వొద్దు, వొద్దు . . . నీ చదువు కానీ . . . "

బూటుల కరకర సందడితోనే అతను ఇంట్లోకి ప్రవేశించారు.

కాలేజిలో ఏదో సమావేశంకోసం వెళ్ళిన నటరాజన్ ఇప్పుడే తిరిగివచ్చారు; ముఖంలో ఎంత ఉత్సాహం కనిపిస్తోంది! అవును, ఏదో సారస్యమైన సంగతి నాన్నగారు చెప్పబోతున్నారు! చెయిలోని పుస్తకం చదువుతూనే రాజమూ ఇంట్లోకి వెళ్ళింది.

నాన్నగారు అమ్మతో మాట్లాడుతున్నారు; అమ్మ ఏమంటోంది?

"దాని నక్షత్రం స్వాతి అని మీకు తెలుసా? ఐతే మీరు జాతకం చూసారన్నమాట! మంచిది, వినడానికి నాకు చాలా సంతోషంగా ఉంది . . ."

"అసలు వాళ్ళెవరూ జాతకం చూడాలని అడగనేలేదు! అమ్మాయి నక్షత్రం స్వాతి అని చెప్పగానే అబ్బాయి తండ్రి 'ఇది ఒక పరిపూర్ణ సంబంధం,' అనేసారు. వాళ్ళకి జాతకాల్లో నమ్మకం ఉన్నాకూడా మరేం నిబంధనలూ చూడనక్కరలేదన్నారు. నీకు తెలుసా, అబ్బాయి నక్షత్రం అనురాధ, నా లాగే! అనురాధ అంటే అంత గొప్ప అన్నమాట!"

"అలాగా? బాగుంది! మరేం కావాలి? అల్లుడూ, మావగారికీ మంచి పొత్తుందన్నమాట! . . . మీరు 'రాజం కోసం వరుడు చూస్తాను,' అని చెప్పగానే నేనెలాగో ఐపోయాను . . . "

"నేను చెప్తున్నది ఈ సంబంధం గురించి! స్వాతీ, అనురాధా ఉభయధా అనుకూలంగా ఉన్నాయన్నారతను. నేనేం తమాషాకి చెప్పడంలేదు . . . సరే . . . మన సేండో ఎక్కడ?"

'అసలు అబ్బాయి ఎవరు? ఎలా ఉంటాడు? అతని తల్లితండ్రులు పెళ్ళిసంబంధం చూస్తున్నారా? సరే, చూడనీ . . . పేరేమిటి? మంచి అందగాడా? గుణవంతుడా?'

ఈ ప్రశ్నలు రాజేశ్వరి మనసులో తళుక్కున మెరిసాయి. నాన్నగారు చిన్న తమ్ముడిని తీసుకొని వరాండాకి  రావడం ఆమె గమనించింది; ఏమీ తెలియనట్టు అలాగే నిలబడింది. కాని రాజం ముఖవైఖరి చూసి ఆమె మనసులో ఏముందో నటరాజన్ అర్థం చేసుకున్నారు.  ఏమీ తెలియనట్టు, ఆమెను చూడనట్టు, అతను పిల్లవాడితో ఇంటిముందున్న తోటలోకి వెళ్ళారు.

సిమెంటు మేడ పక్కనేవున్న నల్ల పూలతొట్టినుంచి చామంతి పువ్వులు నటరాజన్ చేతిలోని బిడ్డనుచూసి  ముసిముసినవ్వులు నవ్వాయి. వాటికే నోరుంటే రాజం గురించి నిజం వెళ్ళగక్కివుంటాయి: 'చూడు, శృంగారకథలంటే ఆమెకు ఎంత ఇష్టమో! ఇంతసేపూ ఒకే పేజీలోనే ఆమె కళ్ళూ, మనసూ, నిలిచిపోయాయి!'

'ఊరుకోండి, మరేం గోల చెయ్యవద్దు!' అని దొంగకోపంతో చామంతిని హెచ్చరించే వేగంలో  రాజం  పూలతొట్టి దగ్గరకి వెళ్ళింది. నటరాజన్ దృష్టి ఇంకా ఆ పూలమీదే ఉంది. 'నాన్నగారూ, చూసారా, ఇవి ఎంత అందంగా ఉన్నాయో?' అని రాజం అతనికి చెప్పాలనుకంది; తన కొంటెతనం అణచుకున్న ధోరణిలో ఒక చామంతి పువ్వును తీసుకొని తన జుత్తు ముడిలో జోడించుకుంది; తమ్ముడ్ని తన చేతుల్లోకి తీసుకుంది.

"ఓ, పాప లేచినట్టుంది. నా పాటలువిని నిద్రపోయి అరగంటకూడా అవలేదే? సరే . . . వెళ్దాం రా," అని తమ్ముడ్ని ముద్దులాడుకుంటూ ఆమె ఇంట్లోకి వెళ్ళింది. పసిపాపని ఓదార్చి మళ్ళీ ఉయ్యాలలో భద్రంగా పడుకోబెట్టింది. ఉయ్యాలలో పక్కవాటుగా కూర్చొని, ఊగుతూ పాటసాగింది.

*"కణ్ణా . . . మణివణ్ణా . . . వా . . . "*

ఆమె పిలుస్తున్నది ఎవరిని? పసిపాపనా లేకపోతే ఆ కాచుకున్నవరుడినా?

"రాజాబాయ్! . . . పాట మాష్టారుగారు . . . "

చివాలున రాజం పాడడం ఆపేసింది: 'భగవంతుడా, నేను పాడుతున్నది సినిమా పాట! మంచివేళ . . . ఇది తమిళ పాట, ఏ హింది సినిమాల్లోనుంచి 'డబ్' చేసినదికాదు . . . !'

మామూలుగా పాటమేష్టరు రావడానికిముందే రాజం వయలిన్లతో పాఠంకి సిద్ధంగా ఉంటుంది. ఏమైంది ఇవాళ? ఆమె చూపు గుమ్మంకి వెళ్ళింది. ఏం ఆశ్చర్యం!

'నాకు '*ఉపచారములు', 'నగుమోము'* బాగా తెలుసని అమ్మ నాన్నగారికి చెప్పి ఉంటుందా?'

ఆమెకు పాట మాష్టారుగారు మాటలు వినిపించాయి: "ఇదిగో, వస్తున్నానమ్మా! . . ." ఆ ధ్వనిలో ఎంత ఉత్సాహం!

దీపాలు పెట్టేవేళ రాకముందే రెండు వయలిన్లు సమశ్రుతిలో పలికాయి. అఠతాళవర్ణ కాంబోజీలో వాయించే సమయంలో నటరాజన్ భుజాన అంగవస్త్రం వేసుకొని బయటకు వెళ్ళారు. వెళ్ళడానికిముందు అతని కడకంటి చూపు రాజేశ్వరి, ఆమె పరిసారాలమీద పడింది. సంగీత శిక్షణ కొనసాగుతూనే ఉంది. కాంబోజీ వర్ణం తరువాత వినాయక స్తుతి ఆరంభంలో నటరాజన్ వయసు చెల్లిన ఒక పెద్దాయనతో ఇంట్లోకి ప్రవేశించారు.

పాట మాష్టారుగారు శర్మగారు వచ్చినతన్ని చూసి పరిచయమున్నట్టు రెండు చేతులూ ఎత్తి నమస్కరించారు. రాజేశ్వరి ఒక క్షణం ఆగి మళ్ళీ వయలిన్ వాయించడం మొదలుబెట్టింది. మామూలుగా, అప్పుడప్పుడు, పాట మాష్టారుగారుకి అపరిచితులను తనతో తీసుకువచ్చి వారిముందు తన శిష్యుల అభిరుచిని, తన శిక్షణలోని ప్రఖ్యాతిని, నిజపరిచే అలవాటుంది. ఇవాళ నాన్నగారు అలాగేమైనా పూనుకొన్నారా? తన కూతురి సంగీత ప్రజ్ఞగురంచి ఇతరుల పొగడ్తలువిని అతనికికూడా సంగీతంలో ఆసక్తి కలిగిందా?

రాజేశ్వరి చూపు నాన్నగారి ఆదరణ ఆశించింది. అతను 'సరే, సాగనీ!' అనే ధోరణిలో తల ఊపారు. పక్కనేవున్న ఒక కుర్చీ ముందుకు లాగి అతిథిని అందులో కూర్చోమన్నారు.

"సంగీతం అనుభవించడానికి  నాకు నేలమీద కూర్చోడమే ఇష్టం," అని అతను చెప్పగానే నటరాజన్ నేలపై ఒక చాప పరిచారు.

వచ్చినతనికి సంగీతంలో మంచి అభిరుచి ఉందని రాజంకి అర్థమైంది. నటరాజన్ కర్ణాటక సంగీతంలో తనకేం ఆసక్తి లేదని చెప్పుకునేవారు. 'సరే, ఈ అతిథి ప్రభావం నాన్నగారిమీద ఈ రోజు పనిచేసిందన్నమాట!' అనే ఊహ తోచగానే రాజం తనకు వచ్చిన  నవ్వు ఆపులేకపోయింది.

ఉత్సాహం, ఇచ్ఛ కలిసివస్తే సమయం ఎలా సాఫల్యం అవుతుందని త్వరలో అందరికీ బోధపడింది. రెండు వయలిన్లతో కచేరీ బాగా రక్తి కట్టింది. రాజేశ్వరి నమ్మకం, ఆత్మ విశ్వాసంతో, ఎటువంటి ఆటంకం లేకుండా వాయించింది. శర్మగారు శిక్షణలో నేర్చుకున్న  పాటల్లోని లక్షణాలని కరలాఘువంతో నిరూపించింది.

"ఇంతబాగా వాయించుతుందే! ఎన్ని సంవత్సరాలుగా ఈ శిక్షణ?" అని అతిథి అడిగారు.

"ఆరు సంవత్సరాలు . . . శర్మగారే మొదటి గురువు!" అన్నారు నటరాజన్.

శర్మగారు మళ్ళీ  చేతులు జోడించి అభిమానంతో నవ్వారు.

"ఒకే గురువుదగ్గర అభ్యాసం చెయ్యడంవలనే నాకు ఇందులో విశిష్టత కనబడుతోంది;  చెవులకి చాలా ఇంపుగావుంది," అని అతను మెచ్చుకున్నారు.

నటరాజన్ ఒక చిరునవ్వు నవ్వి మరేం అనలేదు. కాని శర్మగారు ఉత్సాహంతో, "అందుకు శిష్యురాలి సమర్థత ముఖ్యకారణం అని చెప్పాలి. ఒకే గురువుదగ్గర పాఠమంటే ఆ శిష్యుడికి కళమీద శ్రద్ధ ఉండబట్టే ఆ గురువు కృషి, ప్రోత్సాహంతో అతనికి మంచి వాద్యగాడనే కీర్తి వస్తుంది."

"అవును, నిజం," అని అతను తల ఊపారు. "మనలో ఒకమాట. మీరు ఈ ఆంధ్రదేశంలో ఎలాగ ఇంత బాగా తమిళం మాట్లాడుతున్నారు?"

"నేను సంగీతం నేర్చుకున్నదంతా దక్షిణదేశంలోనే," అని అన్నారు శర్మగారు. "అక్కడ కర్ణాటక సంగీతం అంటే తమిళులకు ఎంత గర్వం, ఎంత అభిమానం! ఆ ప్రాంతాల్లో నేను అనుభవించిన ఆదరణ, సంతృప్తి ఎలా వర్ణించడం? . . . మరి, మన చేతిలో ఏముంది చెప్పండి?" అని విసుగ్గున్నారు.

ఇంతలో నటరాజన్ జోక్యం చేసుకొని మాట్లాడారు. "శర్మగారు సగం తమిళులే! అతను రాజంకి గురువుగా దొరకడం మా భాగ్యం. అతను దక్షిణదేశంనుంచి ఇక్కడకి రావడం దేవుడు మాకిచ్చిన వరప్రసాదమని, నా భార్య చెప్తూండేది. ఈ ఊరులో ఇతనికి మించిన గురువు ఎవరూ లేరు!"

శర్మగారు ముఖం కలకలలాడింది: "నా వంతు నూటిలో పది; రాజేశ్వరి వంతు తొంబై. దానికి పదింతలు వాళ్ళమ్మకి రాజేశ్వరి సంగీత శిక్షణ మీదున్న ఆసక్తి. పొద్దున్నేనాలుగు గంటలకి, ఎంత చలైనా సరే, కూతురు సాధన చెయ్యాలని ఆవిడ పట్టుబట్టేది. అమ్మాయితోకలిసి తనుకూడా స్వరస్థాయి అభ్యాసం చేస్తుంది. కూతురులాగే ఆమె కూడా వయలిన్ వాయించగలరు! మరి తీవ్రంగా సాధన చెయ్యకపోతే కరలాఘవం ఎలాగ మెరుగుపడుతుంది చెప్పండి?" అన్నారు అతను.

ఒక చిరునవ్వు నవ్వి ఏదో రహస్యం చెప్తున్నట్టు అతను మళ్ళీ అన్నారు. "ఆయనకి సంగీతంలో ఆసక్తి లేకపోయినా కూతురు తప్పకుండా గాత్రసంగీతంలోనూ, వయలిన్ వాద్యంలోనూ ప్రావీణ్యం పొందాలనే కోరిక ఉంది. సంగీతం విషయంలో అతనెప్పుడూ జోక్యం చేసుకోరు! ఎటువంటి ప్రశ్నలూ, వివరాలూ అడగరు! సంగీతం స్త్రీ లక్షణం అని అతని నమ్మకం. రాజేశ్వరి సంగీత ప్రతిభకి ఆమె తల్లి తోడ్పాటే పునాది."

దూరంలో నిలబడే తల్లిని రాజం చూసింది: ఇదేంటి, అమ్మ ఇవాళ తొమ్మిది గజాల చీర కట్టుకుంది! నాన్నగారు ఏదో అన్నారుగా ఇందకు ముందు? దానికీ, ఈ అతిథి రాకకీ ఏమైనా సంబంధం ఉందా?

"అవును, తన ఆశ్రయం కోరేవారికి సరశ్వతి కటాక్షం తప్పక దొరుకుతుంది," అన్నారు ఆ పెద్దాయన.

రాజేశ్వరి పాడడం ఆరంభించింది. ఖంగుమని మోగే ఆ *నగుమోము* కీర్తన అనుపల్లవి నటరాజన్ని కూడా కదిలించింది.

"అమ్మాయి, నీకు ఇంత మంచి కంఠంవుందికదా, మరి కరలాఘువంగురించి ఎందుకు చింత?" అని రాజంని నేరుగా చూస్తూ అన్నారు వచ్చిన పెద్దాయన. "నువ్వు ఈ ఆంధ్ర వాతావరణంలో మెలగడం వలనే నీ కీర్తనలో అక్షరశుద్ధి, అర్ధపుష్టి బాగా కనిపిస్తున్నాయి. నువ్వు గాత్రసంగీతంలో శ్రద్ధ చూపావంటే క్రమక్రమంగా ముందుకు రావచ్చు. దానితోపాటు కర్ణాటక సంగీతంలోని లక్షణాలన్నీ గ్రహించుకుంటే కచేరీలలోకూడా పాడవచ్చు."

'అవును, నిజమే', అని రాజం తనలో అనుకుంది. అందరూ ఏమంటున్నారు? 'ఈ ప్రాంతాల్లో తీక్షగా సంగీత శిక్షణకి అవకాశం లేకపోవడం రాజంకి ఎంత నష్టం! తమిళదేశంలోగాని ఉండివుంటే ఆమె కఠిన అభ్యాసంతో ఇంకా బాగా రాణించేది,' అనేకదా? ఇప్పుడు మొట్టమొదటిసారి ఆమె సంగీతంలోని ప్రభావం, ప్రాముఖ్యత ఇతనూ పొగడ్తున్నారు.

అతిథిని సాగనంపిన తరువాత నటరాజన్ ఇంట్లోకి తిరిగివచ్చారు. "అతనికి చాలా సంతోషం," అని శర్మగారికి చెప్పారు.

"అంతా ఆ సరశ్వతి కటాక్షం," అన్నారు శర్మ.

"నాకు అతన్ని చూస్తే ఎంత అవమానంగా ఉందో తెలుసా?" అని నటరాజన్ కప్పుమని అంగలార్చుకున్నారు. అతని భార్య, రాజేశ్వరి, శర్మ దిగ్భ్రమతో అతన్ని చూసారు.

నటరాజన్ కనుబొమ్మలు ముడుచుకున్నాయి; అరచేతి తన్నే సూచించుకుంటోంది. అంగచేష్టలతో అతని వైఖరి ఒక హాస్యనాటకంగా ఆరంభించి, చివరికి శోకంగా మారింది.

"మీకు తెలుసా? అతను అసహ్యంతో తిరస్కరించిన ఉద్యోగం నేను అత్యాశతో గుంజుకున్నాను. అది సిగ్గుమాలినపని కాదా?"

అతనేమంటున్నారో అక్కడ ఎవరికీ అర్థం కాలేదు.

"అతను 1920లో గాంధీగారు ఆరంభించిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనాలని తన ఉద్యోగం రాజీనామా చేసారు. ఆ ఉద్యోగమే ఈ ఇరవై సంవత్సరాలూ నేను చేస్తున్నాను!" అని మోకరించుకుంటూ నటరాజన్ చెయితో నోరు కప్పుకున్నారు.

విశాలం మొహంలో ఒక చిరునవ్వు కనిపించింది. రాజం ముఖం చిట్లించుకుంది. 'నాన్నగారిని చూస్తే జాలి వేస్తోంది; కాని ఈ హాస్యం నాకు నచ్చలేదు. మరి సిగ్గంటే ఇలాగే తెలియజెయ్యాలా ఏమిటి?' అని అనుకుంది.

"మీరు సిగ్గుపడడానికి ఇక్కడ ఏముందండీ?" అని శర్మ నటరాజన్ని ఎదురు ప్రశ్న వేసారు. "మీకు గాంధీజీ మీదున్న భక్తికి మీరు ఎవరికీ తీసిపోరు," అంటూనే అతను జాగ్రత్తగా వయలిన్ బయటకు తీసారు.

నటరాజన్ "సరే, మీ పాఠం కానీయండి,"అని చెప్పి అక్కడనుంచి జరిగారు.

ఒక తొమ్మిదేళ్ళ పిల్లవాడు పరుగెత్తుకొని వచ్చి ఉత్సాహంతో అతనికి చెప్పాడు: "నాన్నగారూ, నేనివాళ హరికథ చెప్పాను!"

ఒక ఐదేళ్ళ అమ్మాయి ముద్దుగా పలకరించింది: "నాన్నగారూ, నేనుకూడా డాన్స్ ఆడాను!"

"అమ్మకూడా ఇవాళ చక్కగా నాటకమాడింది!" అని నవ్వుతూ నటరాజన్ బయటకి వెళ్ళారు.

"సరే, ఇక ఈ కొత్త కీర్తన పూర్తి చేసేద్దాం. ఇవాళకి ఈ పాఠం చాలు," అని మాష్టారుగారు అనడంతో రాజం వయలిన్ తీసుకొని సిద్ధమయింది.

ఆ సమయంలో నాన్నగారు అమ్మగురించి చెప్పిన మాటలకీ, ఆ పెద్దాయన రాకకీ ఏమైనా సంబంధంవుందా అని రాజం ఆలోచించలేదు.

ఇప్పుడు రాజం మనసులోని భావాన్ని ఎలా వర్ణించడం? నిరాశా? లేక నిశ్చింతా? నాన్నగారికి ఆ పెద్దాయన అంటే ఎంత గౌరవం! సంగీతం విషయంలో అతనిముందు నాన్నగారికి ఎంత సంకోచం! అంటే రాజంకి తన వయలిన్ వాయింపు అంత బాగా రాణించలేదని వ్యాకులమా? కొన్ని నిమిషాలముందు ఆమె వయలిన్ ప్రదర్శన అందరూ మెచ్చుకోతగినట్టు లేదా? మరి, కొత్తగా ఒక కీర్తన వాయించాలని పూనుకుంటే మొదటి ప్రయత్నంలో తప్పులు రాక తప్పవుకదా . . . ?

రాజం మనసులో జొరపడిన భావాల్లో ఆఖరికి ఒకటి మాత్రం దృఢంగా నిలబడింది. ఇంతకు ముందు ఒక అభిమాని ఆమెను మాణిక్యంతో పోల్చారు. ఇంకొకతను ఆమె సంగీత ప్రజ్ఞ - గాత్రసంగీతం, వాద్యసంగీతం - రెండూ స్వయంగా విని మెచ్చుకున్నారు. ఇద్దరూ రెండు విధాలుగా పొగడారు. మరేం కావాలి తనకి? కాని ఇవాళ తను విన్న పొగడ్తలో ఒక విశేషం ఉంది: సంగీత నైపుణ్యంలో తను పుట్టిపెరిగిన ఊరు ఎంత ముఖ్యమని ఈ అభిమాని వక్కాణించారు.

## 2

ఇతరుల మెచ్చుకోలు, పెద్దల ఆదరణ, రాజం మనసుని బాగా ఆకట్టుకున్నాయి. ఆ రాత్రి తను అడమరచి నిద్రపోయింది. మరునాడు నాలుగు గంటలకి, తల్లికి ముందే నిద్రలేచి సాధనకి సిద్ధమైంది. అప్పుడే విశాలంకూడా మేలుకుంది. "టైమెంత? నువ్వప్పుడే లేచావన్నమాట!" అని అడిగింది.

వాడుకగా తల్లికూడా కూతురుతో సాధనలో కలుసుకుంటుంది. కాని విశాలం ఈరోజు తిన్నగా వంటగదికి వెళ్ళి కూరగాయలు చేరదీసి, తునకలు, తునకలుగా చేసి కంచంమీద పోగుచేసింది.

"అమ్మా, ఇవాళ ఏమైనా విశేషమా?"

"నీకు జ్ఞాపకంవుందా నిన్నరాత్రి నీ పాట వినడానికి వచ్చినతను? అతనివాళ మధ్యాన్న భోజనంకి వస్తున్నారు."

"అతను ఒకాయనేకదా వస్తున్నారు? మరి నిన్ను చూస్తే తెల్లవారడానికే ముందే లేచి తద్దినంకి వండుతున్నట్టు అనిపిస్తోందే?"

"ఒళ్ళు తెలిసి మాట్లాడు! ముందు నీ సంగీతంలో శ్రద్ధ చూపు. అది ముఖ్యం. అతిథి ఒకరే ఐనా విందంటే సుఖప్రదంగా ఉండాలి. నాకు చేదోడు కావాలంటే అడగడానికి ఎవరున్నారు? చెప్పు, నువ్వేమైనా చెయ్యగలవా? అందుకే ఈ తొందర అంతా. చూడు, ఈ గోరుచిక్కుడుకాయలు; ముందు వీటి కాడలు గిల్లి పారేయాలి. దానికే కొంత సమయం పడ్తుంది." విశాలం ఆరంభంలో కూతుర్ని చీదరించుకున్నా ఆఖరికి ఆమె కంఠం శాంతంగా మారింది. రాజం వాడిన పదం తద్దినం విని ఆమె మండిపడింది.

ఆ రోజు కొత్త అనుభవాలూ. సంఘటనలూ రాజంకోసం కాచుకొనివున్నాయి. రాజం స్కూలు పాఠాలు చదువుతూంటే నటరాజన్ ఆమెకు చెప్పారు: "'అంకుల్' నిన్నేమైనా అడుగుతే నువ్వు ధైర్యంగా జవాబు చెప్పాలి; సిగ్గు పడి పారిపోకూడదు!" అతని సలహా విని రాజం ఉలిక్కిపడింది.

"అతనికి గాంధిజీమీద తీవ్ర భక్తివుంది. మనంకూడా గాంధిగారిని అనుసరించుతాం, కాని మనం కధరు వాడటం లేదు. అతను అన్నివిధాలా - చింతనలోనూ, ప్రవర్తనలోనూ - గాంధీయవాది. అతను చాలా సంవత్సరాలముందు మా కాలేజీలో ఉద్యోగం చేసారు. ఇప్పుడు ఎలాగుందో చూద్దామని ఈ ఊరుకి వచ్చారు. నిన్ననే నేను అతన్ని కలుసుకున్నాను.

కాని అతనితో చాలా కాలంగా  పరిచయం ఉన్నట్టు నాకు అనిపిస్తోంది," అన్నారు నటరాజన్.

రాజేశ్వరి నాన్నగారి ముఖం దీర్ఘంగా చూసింది. 'పాపం, నాన్నగారు!' అని మనసులో అనుకుంది.

నాన్నగారు రసభరితంగా ఎన్ని విషయాలు చెప్తున్నారు! యౌవనంలో అతను  కూడా సహాయ నిరాకరణోద్యమంలో చేరాలని, విదేశీయ వస్తువులు బహిష్కరించాలని ఆశపడ్డారట, కాని అతని తల్లిదండ్రులు అందుకు ఒప్పుకోలేదు. అతని మిత్రులూ, సహృదయులూ స్వాతంత్ర పోరాటంలో నిర్భయంగా కలుసుకున్నప్పుడు నటరాజన్ ఎగకొట్టుకొని భీరువుగా నిలబడ్డారట. ఆ ఘటనలో తను అనభవించిన అవమానం అతని గుండెలో ఒక మరవలేని మరకగా పాతుకుపోయింది.

గాంధీజీ తన అనుచరులకి విదేశీయ వస్త్రాలు మంటపెట్టాలని ఉత్తరువిచ్చారు. "ఏం, ఎందుకు? బీదలకి ఇవ్వవచ్చుకదా? దేశంలో చాలామంది ఉన్నారే?" అని అడిగారు కవి టాగూర్. ప్రత్యుత్తరంగా గాంధీజీ గర్జించారు: "అది దైవద్రోహం! బీదలకి ఎంగిలి ఆహారం ఇవ్వడంతో నమానం!" అన్నారు. ఇంకొక ప్రశ్న: "ఇందులో హాని ఏముంది, బీదలు చలిలో వొణుకుతున్నారే?" మళ్ళీ గాంధీజీ:  “ఆ ఇంగ్లీషు గుడ్డలన్నీ కాల్చి ఆ మంటలో వాళ్ళందరూ చలి కాచుకోవడం మేలు!" ఇవన్నీ చెప్తున్నప్పుడు నటరాజన్ ముఖంలో ఎటువంటి విధేయత కనిపించేది!

ఆతను అనేవారు: "రాజం, నువ్వెందుకు నిత్యమూ 'ఇంగ్లీషు వాయిల్', 'ఇంగ్లీషు చిట్టీ' అని పదే పదే పాడతావ్? నీకు కావలసినది కొనుక్కో, వొద్దనను! కాని ప్రతీదినం ఎందుకు నీ సంభాషణలో  ఆ పదాలు వాడాలి?" ఆరోజు అతని ముఖంలో ఎంత శోకం కనిపించింది!

నాన్నగారెందుకిలాగ సిగ్గూ, అవమానం పడాలి? అతనికీ గాంధీజీ అంటే ఎంత భక్తి!

అతనికి తృప్తి కలిగించే విధంగా ఏమైనా చెప్పాలనుకుంది రాజం. "అలాగైతే, నాన్నగారూ, ఈ పెద్దాయన మన ఇంటి విందుకి ఎలా ఒప్పుకున్నారు? గాంధీజీ ఆహార విషయంలో చాలా సీదా సాదా మనిషి అని అందరూ అంటున్నారే?" అని అడిగింది.

నటరాజన్ మెల్లగా నవ్వారు: "అవును, గాంధీజీ ఏనాడూ తను ఏదీ గొప్పగా కావాలని అడగలేదు. కాని అతన్ని అనుసరించేవాళ్ళకి అతన్ని అన్ని విధాలుగా గౌరవించాలని ఆశ ఉండడం సహజమే కదా?"

రాజం మనసులో అనుకుంది: 'నాన్నగారూ, నాకూ అతనంటే మర్యాద ఉంది. నేను ఇప్పుడు  మిమ్మల్ని అతని గురించి అడగడానికి కారణం మీరు దేనిగురించీ అవమానపడకూడదనే.'

రాజం తోబుట్టువులతో భోజనం చేసింది; తిరిగి ఉయ్యాలకి వెళ్ళింది.

భోజనం చేసినతరువాత రాజం తను వంటగదిని శుభ్రం చెయ్యడానికి సహాయం చెయ్యలేదని విశాలం విసుగ్గోలేదు. కాని, కొంత సమయం తరువాత, అతిథితో నటరాజన్ వచ్చినప్పుడు రాజం ఉయ్యాలనుంచి  లేవలేదని ఆ తల్లి గాభరా పడింది.

అతిథి దొరస్వామి విశాలంతో, "మీరు ఇవాళ విందులో అప్పడాలు వడ్డించుస్తున్నారంటే అవేమో ముందే వడ్డించేయండి; తరువాత మరచిపోగలరు," అన్నారు.

విశాలం కొంచెం నిదానించి బదులు చెప్పింది: "నేనివాళ అప్పడాలేవీ వేయించలేదు; బజారులోకూడా లేవన్నారు . . . "

"నేను అప్పడాలు కావాలని అడగటంలేదు," అని దొరస్వామి శాంతంగా అన్నారు. "నాకు అప్పడాలు లేని భోజనం ఇష్టం. మీరు అప్పడాలు ముందే

వేయించారేమో లేక వేయించబోతారేమో అని తెలియక అడిగాను. ఇక్కడ చూడండి . . . పచ్చడి, కూర, పాయసం, గారెలు, తీపి భక్షణం . . . మరి సాంప్రదాయక విందంటే ఇదే కదా? అందుకే మీరు అప్పడాలు ముందే వేయించారేమో అని అడిగాను," అన్నారు అతను.

"విందంటే అప్పడాలు తప్పకుండా ఉండి తీరాలా?" అని అడిగారు నటరాజన్. "నాకు తెలియదు, అందుకే అడిగాను." విశాలంకి అతని ప్రశ్న నచ్చలేదు.

"నేనేం విందుకోసం వండలేదు . . . " అని ఆమె వెనకాడింది.

"విందు కాకపోతే దీనికి మరేం పేరు?" అని దొరస్వామి మళ్ళీ అడిగారు. "అన్నీ కచ్చితంగా ఉన్నాయి - అప్పడాలు తప్ప." అప్పడాలు మాత్రం లేకపోవడం ఇప్పుడు విశాలంకి ఇంకా పెద్ద కొరతగా అనిపించింది.

దొరస్వామి విశాలంని చూస్తూ మాట్లాడారు: "మీరేం అనుకోవద్దు. మా ఆవిడని 'అప్పడాల అమ్మ' అని కొందరు పిలుస్తారు. దానికి ఇంట్లో అప్పడాలు వొత్తడమంటే చాలా ఇష్టం. ఏ భోజనమైనాసరే, అప్పడాలు తప్పక ఉండి తీరాలి. అత్యవసరానికి అవి ఎప్పుడూ వంటగదిలో ఉంటాయి; అదే నేనంటున్నది," అని చెప్పి ఒక చిరునవ్వు నవ్వారు. ఆ మాటలు విని విశాలం తృప్తితో తన భర్తని చూసింది.

విందు సాగుతోంది.

రాజం ఉయ్యాలలో ఊగుతూ కూనిరాగంలో ఎదో సినిమా పాట పాడుతోందని విశాలం గాభరా పడింది. వెంటనే వెళ్ళి మందలించింది: "మరేదైనా పాడు. సినిమాపాటలు వద్దు!" అని దొంగ కోపంతో ఆమెకు బుద్ధి చెప్పి మళ్ళీ వడ్డించడానికి వెళ్ళింది.

"ఇదేం గొడవరా?" అని రాజం విసుగ్గుంది. "అమ్మ ఇవాళ తొమ్మిది గజాలచీర కట్టుకుంది. గాంధీజీలాగే ఇతనుకూడా సినిమాలంటే దూరంగా పోయే

మనిషా? కానీ; అమ్మా, నాన్నగారిలా నేనెందుకు భయపడాలి?" రాజంకి మొండితనం ఎక్కువైంది. "నేను సినిమా పాటే పాడుతాను! పోనీ, ఒక రాగమాలిక పాడతాను." '*మనమ్ కుళిర, కణ్ కుళిర,*' అనే తమిళ పాట ఆరంభించింది.

అది 'శకుంతల' సినిమాలో శకుంతల తన భర్తని కలుసుకోవడానికి కణ్వాశ్రమంలో పాడిన వీడ్కోలు పాట. అందులో సంతోషం, సంతాపం రెండూ కలిసివున్నాయి. రాజం కంఠంలో కలసివచ్చిన భావం విని విశాలం ఇంకా మరింత రుచితో ఆనందించింది; కూతురంటే గర్వపడిందికూడా; కాని అది రాజంకి తెలియదు.

భోజనంతరువాత నటరాజన్, దొరస్వామి పిచ్చాపాటికోసం వసారాకి వెళ్ళారు. ఇంటిముందు తోటలోని మొక్కలు దొరస్వామి చూసారు.

"ఇదేం దూది చెట్టా?" అని అడిగారు.

"అవును, బోలెడు ఉన్నాయి మా ఇంట్లో . . ."

"అదెవరు పాతారు? మీరా లేక అదే మొలచిందా?"

"అదే మొలచిందనుకుంటా . . . రాజం, ఇలా రా . . ."

రాజేశ్వరి ముందుకు వచ్చింది.

"నీకు తెలుసా? ఇది ఎవరైనా నాటారా లేక అదే మొలచిందా?"

"తలగడల్లో దూది కుక్కుతున్నప్పుడు కొన్ని దూది తునకలు తోటలో వదిలేసాం . . ."

"ఓ అలాగన్నమాట . . . ఎవరూ నాటలేదు, అదే మొలవనూలేదు! ఆ దూది బద్దలు భూమిలో పాతుకొని వేరుముట్టుగా, చెట్లుగా ఉన్నాయన్నమాట!"

"నేనెందుకు అడిగానంటే దూదిచెట్టు ఇంట్లోవుంటే దుశ్శకునం అని అంటారు. అందుకే ఎవరు పాతారని అని అడిగాను," అన్నారు దొరస్వామి.

"ఏం, ఇందులో ఏం దుశ్శకునం ఉంది? మేం చాలామందికి ఈ చెట్టు దూది పంపాం. అదే వాళ్ళందరూ పూజకి దీపాలు వెలిగించే వొత్తులకి వాడుతున్నారు."

"దూదిచెట్టు విత్తనాలు అవిసిపోయి గాలిలో చెల్లాచెదరైపోతాయి. అలాగే ఆస్తికూడా చెదిరిపోయి ఇక మన కళ్ళకి కనిపించదట."

"ఓ అలాగా? మనకి మనింటి దూది ఇతరులతో పంచుకోవాలనివుంది. అది వాళ్ళు పూజలకి, అర్చనలకి వాడుకుంటున్నారు; మంచిదేకదా! ఎవరికి తెలుసు? అలాగే ధనంకూడా ఇతరులతో పంచుకోవాలనే భావం వస్తే అది ఒక మంచి అలవాటేకదా?"

నాన్నగారు ఎంత చక్కగా, స్పష్టంగా వివరించి చెప్తున్నారు! రాజంకి అతని వ్యాఖ్యానం బాగా నచ్చింది. దొరస్వామి కూడ ఆమోదించినట్టు తల ఊపారు.

"అవును, బాగా చెప్పేరు మీరు. రెండిటికీ మంచి పోలిక కనిపిస్తోంది."

విశాలం ఇప్పుడు వరాండాకి నడచివస్తూ ద్వారం దగ్గర నిలబడింది. రాజం అక్కడ నిలబడి పెద్దల సంభాషణ వినడం చూసి లోపలికి రమ్మని పిలిచింది. రాజం రాగానే, "నువ్వక్కడే ఉండిపోయావని రమ్మన్నాను," అని చెప్పింది.

ఏం, ఎందుకు అని నిర్ఘాంతపోయి రాజం ఇంట్లోకి వెళ్ళింది.

"మీరు పోలిక అనగానే నాకు జ్ఞాపకం వచ్చింది. అవాళ మీరు నక్షత్రాలు చూసి ఇది మంచి సంబంధం అన్నారు. మీకు మా అమ్మాయి జాతకం కావాలా?" అని అడిగారు నటరాటన్. దొరస్వామి రాజం జాతకం అడగలేదని విశాలం ఆవేదన పడుతోందని అతనికి తెలుసు.

"మీరివ్వండి. నేనుకూడా మీకు రఘుపతి జాతకం పంపిస్తాను. మీ బంధువులు రెండూ చూసి ఏమంటారో చూద్దాం."

అది విని రాజం విస్తుబోయింది. ఇతనేకదా తన సంగీతాన్ని అవాళ పొగడారు? ఇతనే ఆ అబ్బాయి తండ్రి అన్నమాట! మరి, అబ్బాయి ఎలా ఉంటాడు?

సిగ్గూ, ఆరాటం కలిసిరావడంతో మరేం తోచక రాజం పెరడుకి దారితీసింది.

దొరస్వామి అతిథికి వీడ్కోలు చెప్పి, హాలుకి రాగానే విశాలం భర్తని అడిగింది:

"అబ్బాయిగురించి అతన్ని ఊహగా ఏమైనా అడిగి తెలుసుకున్నారా? ఇంతకీ మీరు అతనితో మరెన్నో సంగతులు మాట్లాడారు . . . "

"నేనెందుకు అడగాలి? అతని కళ్ళకి అతని కొడుకు ఒప్పుగా కనిపిస్తాడు. మరి మన కళ్ళకో? మన అమ్మాయి కళ్ళకి ఎలా కనిపిస్తాడని మనకి తెలియదు."

"అబ్బాయి నాన్నగార్ని పోలివుంటే మరేం అడగక్కరలేదు . . . "

రాజంగుండె తడాతడా కొట్టుకుంది. అమ్మ ఇంకా ఎన్నో ప్రశ్నలు అడుగుతే ఎంత బాగున్ను! తల్లిదండ్రులు ఆమె వరుడిగురించి మళ్ళీ మళ్ళీ మాట్లాడుతున్నారు; కాని తనకి అతని పేరుకూడా తెలియదు!

"ఊహించడం ఎందుకు?" నటరాజన్ ఉయ్యాలమీద కూర్చొని అడిగారు. "మనం అబ్బాయిని ఎదురెదురుగా చూసిన తరువాతే అన్ని వివరాలూ స్థిరపడతాయి."

"అబ్బాయి పేరు రఘుపతి అని అతను చెప్పారా?" అని విశాలం మళ్ళీ అడిగింది.

"అవును. 'రఘుపతి జాతకం పంపుతాను' ఆని ఆన్నారు."

*'రఘుపతి . . . మంచి పేరు . . .'*

"అతని కూతురు పేరు భవానికదూ? మరి అతని పేరు?

"దొరస్వామి!" అని చెప్పి నటరాజన్ నవ్వారు. విశాలంకి అతను ఎందుకు నవ్వారో అర్థమైంది. "దొరలను ఏవగించుకునే అతనికి దొరస్వామి సరైన పేరే!" అంది.

"మనకి దొరలంటే అసహ్యంకాదు; మనం ఏవగించుకున్నది దొరల నీతులే. గాంధీజీ ఈ దొరలు మన దేశస్తులు చూపే పైఖరి చూసి అసహ్యపడ్డారు . . . "

'నాన్నగారికి ఎంత జ్ఞానం! విపులంగా ఎన్ని విషయాలతనికి తెలుసు!' అని రాజం కృతజ్ఞతతో గుర్తుచేసుకుంది. అతని హృదయంలో గాంధీజీ ఆదర్శభావాలు పాతుకొనివున్నాయి; అతను తన పిల్లలకీ ఆ గుణాలు అందజేసారు.

రఘుపతి, అతని చెల్లెలు భవాని. రెండూ మంచి పేర్లే. మరి వాళ్ళకి రాజేశ్వరి అన్న పేరు మోటుగా కనిపిస్తుందో ఏమో?

"నేను అబ్బాయి ఫోటోకూడా పంపమని అతన్నిఅడిగివుండవచ్చు . . . రాజం ఫోటో అతనికి అందించినప్పుడు నేనెందుకు అడక్కూడదు?" నటరాజన్ తొందరగా ఉయ్యాలనుంచి లేచారు.

నాన్నగారు తన ఫోటోల్లో ఎది ఏరుకుంటారు? కొన్నినిమిషాలలో ఆ ప్రశ్న ఆమెను చిందరవందరచేసింది. రాజంకి నాన్నగారి అభిరుచిపై నమ్మకంవుంది. కాని తన తల్లి స్వభావం తలయెత్తడంతో కొంచెం తడబాటు కలిగింది.

## 3

నటరాజన్ విశాలంకి భర్త మాత్రమేకాదు. ఆ మాటకివస్తే అతను ఆమెకు స్నేహితుడు, యజమానుడు, గురువు, సహృదయుడుకూడా.

విశాలం గ్రామంనుంచి ఒంటరిగా పదిహేనేళ్ళ వధువుగా కాపురం చెయ్యడానికి రావడంతోనే నటరాజన్ ఆమె ఉదారగుణం, నిష్కపటం నిండిన ఒక ఇల్లాలుగా రాణించడానికి సానుభూతి, స్వతంత్రత సమకూర్చారు. విశాలంకూడా భర్త మనోభావాలు తప్పుపెట్టకుండా అతని వ్యామోహం, వక్రోక్తి

మనసార ఆదరించింది. కాని ఇటీవల ఆమె రాజం పెళ్ళిగురించి బెంగ పెట్టుకుంది. అందుకు కారణం దూరంగా నివాసం చేస్తున్న ఆమె బంధువులు రాజంకి వెంటనే పెళ్ళి చేసెయ్యాలని నొక్కిచెప్పుతూ రాసిన ఉత్తరాలే. "నువ్వు మనదేశం వదిలి ఎక్కడో ఉంటున్నావు. మా అమ్మాయిలకే ఇక్కడ తగిన వరులకోసం మేం తంటాలు పడుతున్నాం," అని వాళ్ళందరూ పదేపదే మొరపెట్టుకున్నారు. మరేం కావాలి? త్వరలో విశాలం మనసులో నిరుత్సాహం, విచారం బాగా పెరిగాయి.

విశాలం ఏమేమో ఆలోచనలతో ఇంట్లో అడుగడుగులు వేయడం నటరాజన్ గమనించారు. ఇక రాబోయే అల్లుడుగురించే ఆమె కలవరపడుతోందని అతనికి అర్ధమైంది.

గభీమని విశాలం అతన్ని అడిగింది:

"అతను అవాళ అన్నారుకదా 'దూదిచెట్టు ఇంట్లోవుంటే ఆస్తికి భంగం' అని? అతని మనసులో మనం ధనికులు కాదనే ఆలోచన ఉందేమో? . . . మరి కట్నం ఎంత అడుగుతారో?"

"అతను కట్నం అడగరు. వాళ్ళ అమ్మాయి పెళ్ళికి కట్నం ఇవ్వలేదన్నారు."

"అది అలావుండనీ. కాని వాళ్ళ అబ్బాయికి కట్నం అడగరని మీకు దృఢంగా ఎలాగ తెలుసు?"

"అతను తనంత తాను చెప్పారు కూతురుకి కట్నం ఇవ్వలేదని. మరి అబ్బాయికి కట్నం అడగరని అర్ధం చేసుకోవద్దూ?"

"అవును. మీరంటున్నది సరే."

కాని, వెంటనే ఇంకొక ప్రశ్న లేచింది.

"అతను దూదిచెట్టు గురించి అన్న మాటలు వింటే మనకేమో వాళ్ళ హోదాకి తగినట్టుగా పెళ్ళి చేసేందుకు సమర్ధత లేదనుకుంటున్నారేమో?"

"అతను అలాగ ఆలోచిస్తే అందులో న్యాయముంది. మన దగ్గర ఎంత మాత్రం డబ్బుంది కనుక? సాధ్యమైనంతవరకూ మనం పెళ్ళి బాగా జరిపిస్తాం. వాళ్ళు రాజంకోసమే ఈ సంబంధం చేసుకుంటున్నారు. నాకు తెలుసు, అతను కట్నం అడగరు."

"అవును. నిజమే. మరి అతను ఉద్యోగం త్యాగంచేసిన మనిషికదా?"

నటరాజన్ విశాలం ముఖంలో సంతృప్తి గమనించారు. దాని కాల వ్యవధిని పొడిగించాలని ఆతనికి తోచింది.

"ఎందుకీ పనికిరాని ఆరాటం నీకు? అతను 'రాజం మాయింటి కోడలు!' అని అనేసారుగా? ఇక మనమేం అడగాలి చెప్పు! అతను మరేం కావాలని వక్కాణించి అఢగనప్పుడు మనం ఏం చెయ్యాలి? మనకి అబ్బాయి నచ్చితే చాలు; మరేం గొడవ ఉండదు. వాళ్ళు తప్పకుండా రాజంని ఏరుకుంటారు."

విశాలంకి మనసు కుదుటబడింది. కాని ఎంత సేపు? ఆ సాయంకాలం మళ్ళీ కొత్త సంశయాలు తలకెత్తాయి.

"నేను పొరుగింటి సీతమ్మతో గొప్పగా చెప్పుకున్నాను: 'మా అదృష్టం చూసారా? కట్నం లేకుండా మాకీ సంబంధం వచ్చింది,' అని. ఆమె ఏమందో తెలుసా? 'జాగ్రత్త! తొందర పడవద్దు! ఇందులో ఏదో రహస్యం ఉంది,' అని తక్షణమే చెప్పేసింది. నాకలా ఏమీ తోచనేలేదు. సీతమ్మ నాకంటే వయసులో చిన్నది కాని ఆవిడకి మంచి లోకపరిచయం ఉంది. మనం ఇతరులనుంచి నేర్చుకోడానికి ఇంకా ఎన్నో ఉన్నాయి. నాకిప్పుడే బోధపడింది. మనం ఆవేశంతో తొందరపడి ఏదీ చెయ్యకూడదు!"

నటరాజన్ రెప్పలార్పకుండా విశాలంని చూసారు.

"నువ్వు ఇవాళ కొంచెసేపైనా సంతోషంగా ఉంటావా? నువ్వు మళ్ళీ మళ్ళీ ఈ విసుగుపుట్టించే ప్రశ్నలే అడుగుతున్నావు. నేనేమో అతనికి ఫోటో అందించినవెంటనే అన్నీ మరిచిపోయాను. ఇదేం నీకు పిచ్చి బుద్ధి? నాకు

అతనిమీద పూర్తిగా నమ్మకం ఉంది. అమ్మాయీ, అబ్బాయీ ఇష్టపడకపోతేనే ఈ పెళ్ళి జరగదు. నువ్వేం భయపడి చావవద్దు!" అతను లేచి త్వరగా వరండాకి వెళ్ళారు. అక్కడ తమ ఐదేళ్ళ కూతురు కనిపించగానే ఆమెకు చెప్పారు: "మనం ఇవాళ రాత్రి సినిమాకి వెళ్తున్నాం. నీ అక్కకి చెప్పు. అదేం దాని ఫ్రెండు పద్మ ఇంటికి వెళ్ళిందా?"

రాజం ఆ సమయంలో వరండాలోనే ఒక మూలగదిలో పాత సంచికల పేజీలు తిరగవేస్తోంది. అక్కడే ఉండిపోదామా లేక బయటకు వద్దామా అని ఆలోచిస్తోంది.

"అక్కయ్య అక్కడ ఉంది," అని చెల్లెలు నాన్నకు చెయ్యి చూపించింది. రాజం కదల్లేదు. ఆమెకు కొంచెం కోపం కూడాను. అమ్మా, నాన్నగారి సంభాషణలు తను వినలేదని వాళ్ళు అనుకుంటున్నారేమో? సరే, అలాగే కానీ! అందుకోసమే రాజం గదిలోనే ఇరుక్కుపోయింది.

నటరాజన్ తల చాచి గదిలోకి తొంగి చూడగానే రాజం మాట్లాడింది: "నాన్నగారూ, ఈ పత్రికలలో చాలా మంచి కథలున్నాయి. మనం వీటిని వేరుచేసి బైండు చెయ్యడం ఎప్పుడు?"

"త్వరలో క్రిస్టుమస్ సెలవులు రాబోతున్నాయ్ కదా? అప్పుడు మనందరం కలిసి పని చేద్దాం . . . సరే . . నువ్వు పరీక్షలకి చదవడం ఎంతవరకు వచ్చింది? అన్ని పాఠాలూ పూర్తి చేసినట్టేనా?"

"లేదు . . . ఇంకా చదవాలి."

"ఐతే కానీ . . . చదువు కానీ . . . ఇప్పుడు తప్పితే మళ్ళీ అవకాశం దొరకదు."

ఆ వచ్చిన పెద్దాయన ఈపాటికే తన్ను కోడలుగా స్వీకరంచారనే తలపు రాగానే రాజం మనసుకి ఆహ్లాదం కలిగింది. ఆమె ఊహా ప్రపంచంలో తాను ఒక వధువుగా, భార్యగా, తల్లిగా మెలుగుతున్నట్టు ఒక భ్రమ కూడా తోచింది.

'ఈ పెళ్ళికి మన అమ్మాయి పూర్తిగా సమ్మతించాలి,' అని నటరాజన్ విధించిన నిబంధన ఆమెకు నచ్చింది. ఆ పసి హృదయంలో ఎన్ని భావాలు ఒరుసుకుంటూ పోతున్నాయి! ఆ పెద్దాయనపై గౌరవం; నాన్నగారికి కృతజ్ఞత; తల్లిపట్ల ప్రేమ, సానుభూతి; చివరికి దూరాన, ఎక్కడో మొహం తెలియని ఆ రఘుపతి గురించి రకరకాల భావాలు!

ఆరోజునుంచి రాజం తన దిన చర్యలలో తన తల్లిదండ్రుల సంభాషణలు వినడానికి చెప్పుకోతగ్గిన సమయం గడపాలని పూనుకుంది. ఆ దంపతులు నేరుగా కూతురుకి ఏమీ చెప్పకపోయినా వ్యంగంగా సూచనలూ, అర్ధపుష్టి భరించిన పదాలూ, మాట తునకలూ చిందరవందరగా వాడారు. ఐనాకూడా రాజం అవన్నీ తను పట్టించుకున్నట్టూ, తనకు అర్ధమైనట్టూ వాళ్ళ ఎదుట చూపించుకోలేదు.

విశాలం పాటమాష్టారుగారికి చెప్పింది: "చాలారోజులుగా రాజంకి '*పక్కల నిలబడి,*' నేర్పమని మిమ్మల్ని నేను అడగాలనుకున్నాను. ఆ పెద్దాయన అవాళ దానిగురించి మాట్లాడారు. మీకు జ్ఞాపకం ఉందా?" త్వరగా శర్మగారు రాజంకి ఆ పాట నేర్పించారు. అతనికి కూడా చాలా సంతోషం. "నా ప్రార్ధన అంతా రాజంకి కర్ణాటక సంగీతంలో అభిరుచి ఉన్న కుటుంబంతో సంబంధం కుదరాలనే. తమిళులకి కర్ణాటక సంగీతంలో మంచి ఆసక్తి ఉందని తెసిసినాకూడా నేనందుకో బెంగపెట్టుకున్నాను," అన్నారు అతను.

రాజేశ్వరి ఇది విని ఉలిక్కిపడింది. 'ఇదేమిటి, వీళ్ళందరూ ఈ పెళ్ళి ఖాయమైనట్టు మాట్లాడుతున్నారే? జాతకాల్లో పొత్తుంటే అంతా సరైపోతుందా? నాకు తెలియని సంగతులు ఎన్నో ఇంకా ఉన్నాయిగా? అసలు అబ్బాయి ఎలాగ ఉంటాడు?'

రాజంకి అతనిగురించి విరుద్ధంగా ఎవరూ ఏమీ చెప్పలేదు. కాని అతను తనకి తగిన భర్త అని రాజంకి తెలియవద్దూ?

దొరస్వామి అయ్యరు తన భార్యతో కూతురు భవానిని చూడడానికి కలకత్తాకి వెళ్ళారు. భార్యని కూతురు నివాసంలో వదిలిపెట్టి తిరుగు ప్రయాణంలో తాను ఇంతకుమందు ఉద్యోగం చేసిన కాలేజీని అతను సందర్శించారు. అక్కడ తన పాత స్నేహితుడు శాంబశివం అతిధిగా రోజులు గడిపారు. ఆ సమయంలోనే అతను నటరాజన్ తో రఘుపతి - రాజేశ్వరి పెళ్ళి సంబంధం గురించి మాట్లాడడం జరిగింది. ఐతే ఆ సంగతి అతను తన భార్యకి తెలియపరచినది ఎలాగ? ఊరు చేరినవెంటనే అతను శారదాంబాళ్ కి ఉత్తరం రాసారు: "అమ్మాయి భవాని పెళ్ళి చేసుకొని అత్తవారింటికి వెళ్ళిపోయింది. ఇప్పుడు మనకి ఒక కోడలు కావాలి. అలాగే దొరికింది కూడా!" తన భర్తకి కూతురు ఇంట్లో లేకపోవడంతో బాధగా ఉందేమో అని శారదాంబాళ్ సందేహించింది. రెండు నెలల తరువాత అతనికి రాసింది: "దయచేసి మీరు రఘుపతిని కలకత్తాకి పంపించండి. నేను భవానితో ఇంటికి తిరిగివస్తాను. భవాని మనతో కనీసం ఎనిమిది నెలలు ఉంటుంది. మనకి కోడలు లేదని మీరేం బాధపడక్కరలేదు. భవాని గురించి ఇంకొక శుభవార్త. త్వరలో మనం అమ్మమ్మ, తాతయ్య అవబోతున్నాం. మేం ఇప్పుడే బయలుదేరి అక్కడికి రావాలి. భవానికి మనం చెయ్యవలసిన లాంఛనాలున్నాయి. ప్రస్తుతం భవాని భర్తకి మాకు తోడుగా రావడానికి సాధ్యం కాదు. మీరు రఘుపతిని పంపితే మేం వచ్చే వారం ఇల్లు చేరుకుంటాం."

భర్త రాసిన ఉత్తరంచూసి ఆమె విస్తుబోయింది. "నేను రఘుపతిని పంపుతాను. మీరు ఇక్కడికి రావడానికిముందు దారిలో మీ ప్రయాణం నిలుపుకొని నా స్నేహితుడు ఒకతన్ని కలుసుకోవాలి. మీకు వీలుకాకపోతే రఘుపతి మాత్రం దిగవచ్చు. నువ్వు, భవానికూడా ఆ కుటుంబంతో పరిచయం చేసుకుంటే మంచిది. మీరు ముగ్గురుగా వెళ్ళి వాళ్ళని కలుసుకుంటే ఇదేమో దుశ్శకునమని భయపడవద్దు. భవానీ కడుపులో ఇంకొక జీవి ఉంది." భర్త

తన్ను చమత్కారంగా సమాధానించుతున్నట్లు శారదాంబాళ్ కి తోచింది. ‘సరే, అతనికి అమ్మాయి నచ్చింది; మరి అబ్బాయి ఏమంటాడో తెలియవద్దూ? నాన్నగారికి ఇష్టమైతే కొడుకుకూడా సరే అనాలని శాస్త్రంలో ఎక్కడైనా రాసివుందా?’ అని కూతురుతో మొరపెట్టుకుంది.

"అమ్మా, నీకు నాన్నగారిమీద చాలా కోపం అంటున్నావు, కాని ఉత్తరంలో ప్రాణనాధా అని రాసావే?" అని భవాని నవ్వుతూ అడిగింది.

భవాని తన భర్తతో చెప్పింది: "చూడండి. అమ్మ ఎలా నాన్నగారిని పిలుస్తోందని. ముందు వద్దన్నా చివరికి నాన్నగారు చెప్పినట్టే మా ప్రయాణం నిలుపుకోడానికి ఒప్పుకుంది." భవానికి తన తల్లంటే చాలా గర్వం. "భలే అత్తగారు!" అని ఆమె భర్తకూడా అభినందించారు.

"నా ప్రశ్న అంతా మీ నాన్నగారితో ఒప్పుకోవాలా లేదా అని కాదు. మరి నీ ఆరోగ్యంగురించి నేను ఆలోచించవద్దా? నాకీ రైలు ప్రయాణం ఆపడానికి ఇష్టం లేదు," అని శారదాంబాళ్ చెప్పింది.

అల్లుడు సత్యం మళ్ళీ పొగడారు: "అత్తగారంటే ఇలాగ ఉండాలి!"

కొన్నిరోజులు గడిచాయి. రఘుపతి వచ్చాడు. ప్రయాణంకి సిద్ధమైయ్యాడు. "అమ్మా, నేను నాన్నగారికి చెప్పేసాను. నేను పెళ్ళిచూపులకి ఇప్పుడు వెళ్ళడంలేదు. మనం స్నేహితులుగా వాళ్ళని కలుసుకుందాం. వచ్చే గురువారం అర్ధరాత్రివేళ అక్కడకి మనం వచ్చి చేరుకుంటామని నాన్నగారు వాళ్ళకి ఉత్తరం రాసేసారు. విను. నేను చెప్పవలసినది చెప్పేసాను. నువ్వు పెళ్ళి, గిళ్ళి అని మరేం గొడవ చెయ్యవద్దు!"

అల్లుడు సత్యం మళ్ళీ పలికారు: "పాపం, అత్తగారు!"

## 4

దొరస్వామి అయ్యరు ఉత్తరంలో నటరాజన్ కి "మన రెండు కుటుంబాలూ కలుసుకోడానికి ఇది ఒక మంచి సమయం," అని రాసారు.

"చూసావా, పెళ్ళిచూపులకి వాళ్ళు వస్తున్నట్లు అతను నేరుగా రాయలేదు! చాలా చమత్కారంగా ఉంది అతని వ్రాత", అని నటరాజన్ ఆహ్లాదించారు.

"మనతో పెళ్ళి సంబంధం చేసుకోడానికి అతనికి ఇష్టం లేదేమో?" అని విశాలం అపనమ్మకంతో అడిగింది.

"ఏనాటికీ నిన్ను అనుమానం విడచిపెట్టదు. ఇష్టంలేకపోతే వాళ్ళెందుకు ప్రయాణం మార్చుకొని ఇక్కడకి రావాలి? అమ్మాయి ఫోటో చూసినతరువాత రావాలని నిశ్చయం చేసుకున్నారు. "

కాని విశాలంకి నమ్మకం రాలేదు.

"ఇదిగో, విను. మనం మితిమీరిన వైభవం, మర్యాదా చూపించి వాళ్ళని హడలుగొట్టవద్దు. వాళ్ళు మనింటికి స్నేహితులుగా వస్తున్నారు. మనమేమో పెద్ద నాటకం, తమాషా చూపిస్తున్నామని వాళ్ళకి అనిపించకూడదు. జ్ఞాపకం ఉంచుకో, ఇదేం అందరిలాగా అబ్బాయీ, అమ్మాయీ, అరగంటలో ఒకరినొకరు కలుసుకొని పెద్దలు నిశ్చయించే సంబంధం కాదు! నువ్వు సహజంగా, డాంబికం లేకుండా మెలిగితేనే వాళ్ళకి మనమీద మంచి అభిప్రాయం కలుగుతుంది. నువ్వు ఉత్తికే కలతపడి మనసు పాడుచేసుకోవద్దు."

విశాలం ముఖం చిన్నబుచ్చుకుంది. "నేనేం ఉత్తికే నాటకం ఆడుతున్నానా? నేను కంగారు పడడానికి కారణం లేదంటున్నారా? నేను చూపే అతిథి మర్యాద నిజం కాదా? నాకు నిజంగానే బెంగ పట్టుకుంది.  నాకెవరున్నారు? నాకు మన దేశంలోని ఆచారాలు తెలియవు!" విశాలం ఎడతెగకుండా బాధతో గిలగిలలాడింది.

ఇంటిలో జరుగుతున్న ఈ ఘర్షణలు, వాదాలు విని రాజం కూడా దిగిలుపడింది. 'అమ్మ ఊరంతా నా పెళ్ళిగురించి చెప్పి తీరాలా? ఏం, ఎందుకు నాన్నగారి మాట వినదు? పొరుగింటి ఆవిడతో ఎందుకు మొత్తుకోవాలి? అంతే,

ఆవిడ వాగుడుతో ఊరంతా తెలిసినట్టే!' అప్పుడే  రాజంని ఒక పెద్దింటి స్త్రీ అడగడమైంది: "నీ రాబోయే అత్తగారు, అబ్బాయి, ఆడపడుచు వస్తున్నారటగా?"

'రఘుపతి! . . . రఘుపతి!  . . . పేరు వినడానికి ముద్దుగా, కొత్తగా ఉంది! మరి చూడడానికి ఎలా కనిపిస్తారో?'

నటరాజన్ కూడా రాజంలోని కొత్త ధోరణి, చురుకుతనం గమనించారు; తనలో తనే చిరునవ్వు నవ్వుకున్నారు.  ఆమె అక్కడక్కడ గోడలమీద ఉన్న ఫోటోలూ, పఠాలూ తీసి, శుభ్రంచేసి వేరే వేరే జాగాలలో తగిలించడం చూసారు. తన ముఖంలోని మొడతలు అసంహ్యంగా కనిపిస్తున్నాయని కించపడుతూ వాటికి పరిహారంగా రాజం తల్లిని మీగడ అడగడంచూసి అతనికి కూతురుమీద జాలి కలిగింది. "కొంచెం నిమ్మరసం మీగడతో కలుపుకో!" అని సలహాకూడా ఇచ్చారు. కూతురు బాలికనుంచి యువతిగా మారే దశలో సాధారణంగా కానవచ్చిన తత్తరపాటు, చైతన్యం అతనికి అర్ధమైంది. అప్పుడప్పుడు అతను భార్యకి చెప్పారు: "'ఒక మనిషి ముఖంలో కనిపించే భావం, కళ్ళలోని చలనం చూస్తే చాలు. నోటినుండి మాటలు రాకపోయినా  మనం వాళ్ళని అర్ధం చేసుకోగలం,' అనే సామెతకి మన రాజం మంచి నిదర్శనం."

కాని విశాలంకి ఆరాటం తగ్గలేదు; అతను మళ్ళీ అన్నారు.

"ఇదిగో చూడు. రాబోయే అతిధులు నీకోసం రావటంలేదు, మరి నీకెందుకు బెంగ? వాళ్ళు మంచి మర్యాదస్తులు. నువ్వు నీ పిరికితనం వదిలిపెట్టాలి. లేకపోతే నీకు ఎన్నాటికీ మనశ్శాంతి దొరకదు. ధైర్యంగా ఉండు."

"'కూతురులో తల్లి లక్షణాలు కనిపిస్తాయి,' అనే సామెత ఉందికదా? వాళ్ళకి తప్పకుండా నామీద ఒక కన్నుంటుంది." ఆ మాటలంటూనే విశాలం చిరునవ్వు నవ్వింది.

"నాకు రాజంగురించి నిజంగానే ఒక చింత ఉంది. రాజంకి 'వంటగురించి ఏంతెలుసు?' అని వాళ్ళు అడిగితే నేనేం చెప్పను? దానికి వంటగదిలో

పొయ్యిదగ్గర నిలబడమంటే నచ్చదు. ఎప్పుడూ సినిమా పాటలు పాడడం, ఉయ్యాలూగడం దానికి అలవాటైపోయింది."

"వాళ్ళు నిన్నేం అడగరు; భయం వద్దు!" అని నటరాజన్ ఆమెను ఓదార్చారు. "భగవంతుడా, అనవసరంగా లేనివన్నీ కల్పించుకొని బాధపడడంలో నీకు నువ్వే సాటి!"

అదే అతని ఆఖరి ఆయుధం.

"పాపం, అమ్మ," అని రాజం బాధపడింది. ఆ రాబోయే అతిథులు ఇప్పుడికప్పుడే తన తల్లిదండ్రులమధ్య చిక్కుకున్నారని ఆమెకు బోధపడింది. 'వాళ్ళు మంచివారుకదా, మరెందుకు అమ్మకి ఈ భయం?' అని తనలో తనే ప్రశ్నించుకుంది. తల్లిదండ్రులమధ్య మాటలూ, వాదాలూ విని వచ్చే నవ్వుని బలవంతంగా ఆపుకుంది. కాని ఆమె మనస్సుకి కొంచెం కలత కలిగిందన్న మాట నిజమే.

'ఆ వచ్చే అతిథులు తన ఇంట్లో బస చేస్తారా? దేవుడా, మరి తను స్వేచ్ఛగా ఇంటిలో మెలగడం ఎలాగ? తన పాటలూ, ఆటలూ వదిలిపెట్టవలసిందేనా? ఆ రెండురోజులూ తను ఎక్కడా కదలకుండా ఇంట్లోనే ఉండిపోవాలా? ఊహూం, అది వీల్లేదు! స్కూల్లో డ్రామా రిహార్సల్ ఉంది. అదేం అంత ముఖ్యంకాకపోయినా, Girl Guide Camp లో కొత్త పాఠాలున్నాయి. తను కొత్తగా కొన్ని గాయపుకట్టాలు నేర్చుకోవాలి. అందులో ఒక పోటీకూడా ఉంది. తను ఆ అవకాశం పోగొట్టుకోకూడదు . . . '

'ఐనా, రెండురోజులు ఇంట్లోవుంటే మంచిదేనేమో? సక్రమంగా, నిశ్చలతో ఉంటే మంచిదేకదా? ఎందుకు ఎటువంటి కట్టుబాటు లేకుండా ఉండాలి . . . ముఖ్యంగా ఆ రఘుపతి వస్తున్నప్పుడు? . . . దేవుడా, నన్ను కాపాడు . . .!

అతిథుల రాకకోసం ఎదురుచూసే రోజు రానేవచ్చింది. ఆ నాడు ఉదయం లేవగానే రాజంకి ఆ ఆలోచనే తోచింది.

నటరాజన్ శర్మగారిని అడిగారు: "మీరు రేపూ, ఎల్లుండి వస్తారా?"

"తప్పకుండా! ఏం ఎందుకు అడుగుతున్నారు?"

"మీకు జ్ఞాపకం ఉందా, అవాళ రాజం పాట విని పొగడిన అతను? ఇవాళ రాత్రి అతని భార్య, కూతురు, అబ్బాయి మనింటికి వస్తున్నారు. వాళ్ళు రాజం పాట విని అతని కంటే ఇంకా  బాగా రాజంని పొగడాలని నా ఆశ." నటరాజన్ ఒక క్షణం ఆగి మళ్ళీ మాట్లాడారు: "చెప్పండి. ఆటాణా ఒక రాగమా లేక కృతియా?"

శర్మగారు నవ్వారు. "ఏం, ఎందుకు? అది ఒక రాగం."

"రాజంకి అది తెలుసా? దాన్ని పాడమంటారా?" నటరాజన్ నవ్వుతూనే అడిగారు, కాని అతని ప్రశ్నలో ఆతురత కనిపించింది.

"రాజంకి రాగం విస్తారంగా పాడే నైపుణ్యం లేదు," అన్నారు శర్మగారు. "ఆమెకు సినిమాపాటలు పాడటమే ఇష్టం. వీలయినప్పుడూ, అవకాశం దొరికినాకూడా రాగాలు అభ్యాసం చేసుకోవాలన్న కోరిక ఆమెకు లేదు. ఐతేనేం, ఆటాణా రాగంలో సునాయాసంగా పాడగలదు. నేనూ పాడమంటాను."

ఒక మూల నిలబడి ఆ సంభాషణ రాజం వినింది.

'ఇదేం గొడవరా! నేను వాళ్ళెదుట నిలబడి పాడాలంటున్నారా? అలాగేం కాదు! వాళ్ళేం పెళ్ళిచూపులకి రావడంలేదు!  ఆ అబ్బాయి ఎదుట నేను కూర్చోను; నాకు మరెవరన్నా భయంలేదు. ఏదో రేడియోలో పాట విన్నట్లు అతనూ వింటారు. అదే మంచిది. నాకూ ఏ భయమూ ఉండదు . . . '

ఇప్పుడు శర్మగారు తన శిష్యురాలితో అతిప్రేమతో మాట్లాడారు: "అమ్మాయీ, దేవుడి దయవల్ల నా ఆశ నువ్వు సభలో పాడాలన్నది త్వరలో నిజమవబోతుంది. నువ్వు మన ఊరిలో పాల్గొన్న చిన్న చిన్న సంగీత

ప్రదర్శనలద్వారా తమిళనాడులో ఇంకా పెద్ద పెద్ద సభల్లో నీకు అవకాశాలు దొరుకుతాయని నేను ప్రార్థిస్తున్నాను. నీకు నా శుభకాంక్షలు," అని చెప్పి అతను నేలమీద చాపమీద కూర్చున్నారు.

"రా, కూచో . . . *'పక్కల నిలబడి* పాడు', అని అతను మొదలుపెట్టారు.

"నేనెందుకు అబ్బాయి తండ్రికి నచ్చిన పాట పాడాలి?" అని రాజం ఆశ్చర్యపడింది. "అటాణాలో నాకు ఇష్టమైన, పొందున్న కీర్తన పాడడం ముఖ్యంకాదా?" రాజం మనసులో ఒకవేళ తనకి అబ్బాయి నచ్చకపోతే తనే ఈ సంబంధం నిదాకరించవచ్చు అనే ఆలోచన లేచింది. ఆలాగయితే ఆమెలో మొలచిన భయం, కల్పనలన్నీ వ్యర్థమన్నమాట. రాజం తన్ను మందలించుకొని పాఠంకి సిద్ధమవగానే మాష్టారుగారుగారు "సరే, *'ఏల నీ దయ* రాదు,' పాడు " అని అన్నారు.

నటరాజన్ అతిధులని కలుసుకోవడానికి రైల్వేస్టేషన్ కి వెళ్ళారు. ఇంతవరకూ ఉల్లాసంతో తీయని ఊహల్లో విహరిస్తున్న రాజంని గభీమని అర్థంలేని భయం ఆక్రమించుకుంది. పిల్లలందరూ నిద్రపోయారు; తనకీ మత్తుగావుంది; కాని నిద్రపోకూడదని రాజం నిశ్చయించుకుంది. తన స్కూలు పుస్తకాలు తీసి ధూళి దులిపి అలమారిలో చేకూర్చింది. హాలులో టేబులుమీద పూల బంతిని అలంకరించిన తరువాత ఏమైనా చదువుదామని చేతిలో ఒక పుస్తకం అందుకుంది. కాని చదువుతే నిద్ర మరీ తీవ్రంగా రావడానికి అవకాశంవుందని రాజంకి తెలుసు. మరేం చెయ్యాలో తెలియక తికమకలు పడింది. ఇంతలో తల్లి విశాలం వంటగదిలో పనులన్నీ పూర్తిచేసుకొని హాలుకి వచ్చింది. 'అమ్మతో ఏం మాట్లాడడం? మామూలుగా ఎలా సంభాషణ ఆరంభించడం?' తనకేమీ తెలియనట్టు నటించడానికి రాజం ఇష్టపడలేదు. అందువలన మళ్ళీ పుస్తకం చదవడం మొదలుపెట్టింది. కనురెప్పలు మెల్లగా

మూసుకున్నాయి; చదువులో ధారణ లేదు. "పాపం," అని విశాలంకి కూతురుమీద జాలి కలిగింది. కొన్ని క్షణాలు గడిచాయి. విశాలంకి కూతుర్ని గాఢంగా కౌగిలించుకొని నుదుటమీద ముద్దుపెట్టుకోవాలనిపించింది. "నీకు తెలుసా మన ఇంటికి స్నేహితులు వస్తున్నారని?" అని అడిగింది. "ఆవును, నాకన్నీ తెలుసులే," అని అంటూ రాజం సిగ్గుతో వొళ్ళు కదిపింది. విశాలం ఒక చిరునవ్వు నవ్వింది. కునికిపాట్లు పడుతున్న ఆమె చేతిలోని పుస్తకం చూసి ఆ మనఃపూర్వమైన కళ్ళలో దాగియున్న తీయని కలలు ఆ తల్లికి అర్థమయ్యాయి.

వాంఛతో విశాలం రాజం భుజంమీద మెత్తగా తట్టింది.

"రాజం, లేచివెళ్ళి నీ మంచంలో పడుకో! ఇక్కడ అప్పుడే సోఫాలో నిద్రపోయావు."

రాజం కళ్ళు తెరచి చూసింది. తనకి ఇంకా నిదురమంపుగానే ఉంది. ఇక అన్నీ మరిచిపోయింది: ఆ రాబోయే అతిధులు - ముఖ్యంగా - వారిలో ఆ యువకుడు. సోఫానుంచిలేచి, ఊగుతూ పడకగదికి వెళ్ళింది. అక్కడ చాలా మంచాలున్నాయి. తన చెల్లెలున్న మంచంమీద వాలింది; దాన్ని అణచుకొని అలాగే నిద్రపోయింది.

రాజం మంచం పక్కనే ఉంది. కాని అందులో ఆమె నిద్రపోలేదు. ఆమెకు తెలుసు తను ఇంకా కొంచెం సేపట్లో లేవాలని. తన మంచంలో పడుకుంటే మళ్ళీ లేవడమన్నది మరునాటి ఉదయమే అని ఆమె భావన!

అతిధులతో ఇంట్లోకి ప్రవేశించగానే నటరాజన్ కన్నులు హాలులో చుట్టుపక్కలా వెదికాయి. విశాలం తొమ్మిది గజాల చీరకట్టుతో నిలబడి, చీర కొనని భుజంమీదకి లాగి కప్పుకొని, అతిధులలలో వయసు చెల్లిన

శారదాంబాళ్ ని నమ్రతతో ఆహ్వానించింది. రాజం ఎక్కడ అని నటరాజన్ ఆలోచించారు. ఆమె ఎక్కడైనా దాక్కొందేమో?

అతిధి మర్యాద చెయ్యడానికి సిద్ధమవుతూ విశాలం రఘుపతివి చూసి రాజంకి తగిన వరుడే అని తనలో తనే చెప్పుకుంది. ఛాయలో నాన్నగారిలా లేకపోయినా అబ్బాయికూడా  ఒక యెర్రటి మనిషే. ఇక ఎత్తులో తల్లిలాగ కనిపించకపోయినా, అతన్ని ఎవరూ పొట్టి అనరు.  ముఖంలో తెలిసే ప్రకాశాన్ని ఆ కళ్ళద్దాలు మెరుగుపరిచాయి. అబ్బాయి తప్పకుండా రాజంకి నచ్చుతాడని విశాలం సంతోషించింది.

నటరాజన్ మనస్సులో అటువంటి ఆలోచనలేవీ లేవు. అతను ఎదురుచూస్తున్నదంతా అబ్బాయీ, అమ్మాయీ మొట్టమొదట ఒకరినొకరు నేరుగా చూసుకోవాలి; ఆ తరువాతనే ఈ సంబంధం సఫలమవుతుందా లేదా అని ఆలోచించాలి.

రఘుపతి పెరడుకి వెళ్ళడంతో నటరాజన్ ఇంట్లో ఒక గదికి వెళ్ళారు. రఘుపతి తిరిగి రాగానే అతను రఘుపతి మూటాముల్లెలు వేరే గదిలోచేర్చాలని అంటూ అతని సంచె, బుట్ట రెండు చేతుల్లో అందుకున్నారు. రఘుపతి తన బ్రీఫ్ కేసు తీసుకొని అతని వెనుక నడిచాడు.

మెరుగుమాసిన ఒక గదిలో ఇద్దరూ ప్రవేశించారు. అక్కడ  కొందరు పిల్లలు నిద్రపోతున్నారు. ఆ పక్కనే ఒక మంచంలో చీర కట్టుకున్న ఒక అందమైన అమ్మాయి పడుక్కొని ఉందని రఘుపతి తెలుసుకున్న తరువాత కొంచెం తడపడించి, నటరాజన్ వెంటనే నడుస్తూ ఒక మూల చేరుకున్నాడు. వెలుతురు బాగా లేకపోయినా అతనికి తన ఊహ - 'ఆ యువతి ఆ అమ్మాయే!' - సరే అని అర్థమైంది. సిగ్గూ, గాబరా, ఒకేసారి అతన్ని ఆవరించాయి.

ప్రయాణ వస్తువులు నేలమీద పెట్టి, నటరాజన్ రఘుపతిని చూస్తూ "అదే రాజేశ్వరి!" అని అంటూ ఆ మంచంలో నిద్రపోతున్న అమ్మాయిని చూపించారు.

రఘుపతి మరీ గాబరాతో ఆమెను చూసాడు. పక్కనే పడుక్కున్న తన చెల్లెల్ని అడిమి పెట్టుకొని నిద్రపోయే ఆ యువతి ఇంపైన ముఖం కనిపించింది. కళ్ళకి కట్టిన ఆ దృశ్యం ఎంతసేపు చూస్తూ నిలబడడం? తన దృష్టిని తక్కిన పిల్లలమీద మళ్ళించాడు.

తటాలున నటరాజన్ గోడమీద లైటు స్విచ్ వేయడంతో గదంతా ఒకటే ప్రకాశం! ఆ మెలకువలో రాజం లేచింది. తలయెత్తి నాన్నగారుతో ఒక అపరిచుత యువకుడ్నిచూడగానే గాబరాతో మంచం దిగి, ఒక చెయ్యితో జుత్తుని సర్దుకొని గదిలోనుంచి పరుగెత్తింది.

రఘుపతి మొహంలో ఆనందం, ఆశ్చర్యం నటరాజన్ గమనించారు.

"రండి, భోజనంకి వెళ్దాం," అని నటరాజన్ అనగానే, రఘుపతి సరే అని తల ఊపాడు.

విశాలం తనే ఒంటరిగా అతిథులకి భోజనం వడ్డించింది. రాజంకి ఇవన్నీ అలవాటు లేదు. విశాలం శారదాంబాళ్ తో మాటాడుతూ అతిథి మర్యాదలు ఇంపుగా చేసింది.

అతిథుల భోజనం అయిన తరువాతనే రాజం వంటగదికి వచ్చింది. భవాని, శారదాంబాళ్ ఒక మూలనుంచి రాజంని తీక్షణంగా చూడసాగారు. తనే వెళ్ళి వాళ్ళని కలుసుకోవడానికి రాజం వెనకాడింది.

"ఇక మీరూ భోజనం చెయ్యండి," అని శారదాంబాళ్ విశాలంకి చెప్పింది.

"ఇదిగో. . ." అని అంటూ విశాలం, "మీకు ఈ తమలపాకులు నచ్చాయా? ఇంకా కావాలా? ఈ ప్రాంతాల్లో మన తమిళదేశంలాగ తాంబూలం ఏం గొప్పగా కనిపించదు," అని అడిగింది.

"ఇవీ బాగున్నాయే!" అని శారదాంబాళ్ అనడంతో విశాలం తృప్తితో భోజనంకి కూర్చుంది.

తల్లి పులుసు, కూరగాయలు ఉన్న పాత్రలను తనముందు సర్దుతూంటే రాజంకి ఒక మంచి ఆలోచన తట్టింది. 'అతిథులతో మాట్లాడడానికి బదులు తల్లికి సేవ చెయ్యడం సులభం,' అని అర్థం చేసుకొని బిగువు పడకుండా, స్వతంగా, తల్లికి పచ్చడి, అప్పడాలు తనే వడ్డించింది.

రాజంలో కనిపించే ఉత్సాహం, చనువు చూసి విశాలం గర్వపడింది. ఆమెకు ఒక ఆలోచన: 'ఈ అతిథులముందు రాజం  తనకి పూర్తిగా ఉపచారం చెయ్యవచ్చుకదా? అది చూసిన తరువాత రాజంకి ఇంటి పనులలో మంచి పరిచయం ఉందని శారదాంబాళ్, భవాని తెలుసుకుంటారు . .  ఇవాళ - ముఖ్యంగా - రాజం మొహంలో ఎటువంటి అనిష్టత కానరాలేదు . . .  విశాలం అడిగితే రాజం తప్పకుండా సరే అంటుంది . . . '

"రాజం, నాకు అన్నం వడ్డిస్తావా?"

"ఓ, తప్పకుండా . . . " అని అంటూ రాజం ముందుకు వచ్చింది. తనకేం ఈ ఆలోచన ముందే తోచలేదు? విశాలం శారదాంబాళ్ తో ఇదీ, అదీ మాటాడుతూ భోజనం చేసింది. రాజం చూపు అప్పుడప్పుడు భవానిమీద పడింది; కాని భవాని మాత్రం ఎవరితోనూ ఏమీ మాటాడకుండా, మోనంగా స్వెటరు అల్లుతూ కూర్చుంది; రాజం భవానిని  అన్యోన్యభావంతో చూడసాగింది.

విశాలం శారదాంబాళ్ ని చనువు చేసుకునే విధంగా అడిగింది. "ఇప్పుడే బాగా రాత్రిపోయింది. రేపుకూడా మీరు ఇలాగే నిద్ర మానుకోవాలేమో? మీరు రేపు రాత్రి ఇదే ట్రెయిన్ లో తప్పనిసరిగా వెళ్ళితీరాలా? ఒకరోజు ఇక్కడ రెస్టు తీసుకొని వెళ్ళవచ్చు కదా?" అని అడిగింది.

"అదేం కుదరదండీ," అన్నది శారదాంబాళ్. "మా ఆయన ఎటువంటి ప్రయాణ మార్పులకు సమ్మతించరు. అసలు మా తిరుగు ప్రయాణంలో ఇక్కడ దిగడానికి కష్టమని నేను చెప్పాను. చూసారుగా మేం ఎన్ని సూట్ కేసులూ, లగ్గేజ్ తో ప్రయాణం చేస్తున్నామో! కాని మావారు మీ ఆయనకి మేం వస్తున్నామని

రాసినతరువాత మేం చేసేదేముంది? ఇన్ని సంవత్సరాలు కాపురం చేసినా భర్తమాటకి ఎదురుచెప్పడమంటే ఎలాగ మరి?" అని అనడంతో విశాలంకి శారదాంబాళ్ పై సానుభూతి కలిగింది.

'అవును మరి. ఆమె భర్త గభీమని ఉద్యోగం వదిలేసి స్వాతంత్రపోరాటంలో కలుసుకున్నమనిషి కదా? అప్పుడు ఆమె మనసు ఎలా బాధపడివుంటుంది! కుటుంబంలో ఎన్ని చిక్కులో?' అని విశాలం తన్నే అడుక్కుంది. ఆ భావనతోనే ఆమెకు శారదాంబాళ్ పై మర్యాద, ఆదరణ ఎక్కువైయ్యాయి.

## 5

కొంచెం సమయం తరువాత, అర్ధరాత్రి దాటగా, ఇంటిలోని అందరూ తమ తమ ఏకాంతంలో నిద్రకు సిద్ధమైయ్యారు. కాని ఎవరికీ వెంటనే నిద్ర పట్టలేదు; తమ తమ ఊహల్లో విహరిస్తూ వాళ్ళు కాలం గడిపారు.

నటరాజన్ మనసులో రాజం, రఘుపతి ఒకరినొకరు మొట్టమొదట కలుసుకున్న దృశ్యం గుర్తుకి వచ్చింది. రాజంలో కనిపించిన భ్రమ, రాజంని చూసిన క్షణమే రఘుపతి ముఖం కణకణలాడిన తీరు, అతనికి బాగా నచ్చాయి.

ఇక విశాలం మనసులో ఏముందంటే అదేం పెద్ద రహస్యంకాదు. 'వాళ్ళు ఇక్కడకి రావడం మంచిదే అయింది. కాని వారి మనసులో ఏముందో? ఇంకా ఎన్నిరోజులు మనం కాచుకొనివుండాలో . . ?' ఇదే ఆమెను పట్టిపీడించే ప్రశ్న. 'ఆవిడని చూస్తే ఈ సంబంధంకి ఒప్పుకుంటుందా అని అర్ధం కావడంలేదు. ఈ పెళ్ళి జరగాలంటే ఇంటి పెద్దాయనే కారణమనిపిస్తోంది. ఐతే మరి, పెళ్ళిసంబంధాలు కుదరడానికి మానవప్రయత్నాలు మాత్రం చాలా? దేవుడా, ఇంకా ఒక రోజే మిగిలింది; అదీ ఏ చిక్కులు లేకుండా గడిచిపోవాలి. అదే నా ప్రార్ధన. నేను ఉత్తికే రాజంగురించి గాబరా పడ్డాను. దానికి అన్నీ తెలుసు; మంచి చురుకైన పిల్ల. ఇటీవల తన చిలిపితనాలూ, చేష్టలూ, మూటగట్టేసింది. ఎవరికి తెలుసు? నా శిక్షణతో పెళ్ళై అత్తగారింటికి వెళ్ళేసరికి రాజం అన్నిరకాల

కుటుంబ బాధ్యతలు సహజంగా నిర్వహించగలదేమో? . . . మనసుంటే అన్నీసులువుగా జరుగుతాయి. . . . ఇక దేవుడి దయ!" అని విశాలం తన్ను ఓదార్చుకుంది.

ఇక రాజం మాటకి వస్తే రఘుపతిలో ఎటువంటి లోపాలు కనబడకపోయినా తన లోపాలు ఆమెకు ఇప్పుడు గుర్తుకి వచ్చాయి. 'ఇదేం అందరిలాగా ఒక అబ్బాయీ, అమ్మాయీ ఒకరినొకరు చూసుకొని పెద్దలు నిశ్చయించే సంబంధం కాదు. ఇక నాకేం భయం లేదు. రేపు నేను రఘుపతికి ఎదురుగా నిలబడి పాడాలంటే ఏదో రేడియో ప్రోగ్రాంలో పాల్గొన్నట్లు కల్పన చేసుకొని ధైర్యంగా పాడతాను. వచ్చే రోజుల్లో నా సంగీతం విని తమిళదేశంలోకూడా అందరూ పొగడుతారు. సభల్లో పాడకపోయినా రేడియోలో పాడగలనన్నే ఆత్మవిశ్వాశం నాకుంది. రేపు నేను పాడబోయేది నా భవిష్యత్తుకు ఒక పరీక్ష,' అని ఆలోచిస్తూ రాజం నిద్రపోయింది.

రాజంని మొట్టమొదట చూసిన తరువాతే రఘుపతికి తన తండ్రి చెప్పిన మాటలు గుర్తుకి వచ్చాయి. రాజం ముఖంలోని అమాయకత్వం అతన్ని ఆకర్షించింది. రఘుపతి ఇప్పుడు ఇరవైమూడేళ్ళు నిండిన యువకుడు. అలసిపోయి నిద్రపోతున్న రాజం ముఖం అతను మరవలేకపోయాడు. ఇంతవరకు ఏ అమ్మాయినీ రఘుపతి పెళ్ళిచూపులకని వెళ్ళి చూడలేదు; ఇప్పుడుకూడా పెళ్ళిగురించి అతనిలో ఎటువంటి ఆలోచనా లేదు. కాని తన తండ్రి మనసులో అది నాటుకుపోయిందని ఇప్పుడే గ్రహించాడు.

'అమ్మాయి అందంగానే ఉంది; కాని ఆమె సంగీతం ఎలా ఉంటుందో ఎవరికి తెలుసు? మరి ఈ అంధ్రదేశంలో సంగీతం ఏం గొప్ప కనుక! కాని నాన్నగారు అమ్మాయి పాట, వయలిన్ వాద్యం చెవులకి ఇంపుగా ఉన్నాయని అని చెప్పలేదూ?'

రామాయణంలో రఘుపతి ఏకపత్నీవ్రతుడు. ఈ రఘుపతికికూడా ఒకే పిల్లని చూసి పెళ్ళి చేసుకోవాలని ఆకాంక్ష. చాలామంది పిల్లల్ని చూసినతరువాత తన భార్యను ఎంచుకోవాలనే ఆలోచన అతనికి లేదు. ఆఖరికి అతను నిశ్చయం చేసుకున్నాడు: రాజంనే తను భార్యగా ఎంచుకుంటే? ఒక ఆదర్శపత్నిరూపంలో ఆమె తన్ను ఒక ఆదర్శభర్తగా చేస్తుంది.

వెంటనే రఘుపతి మనసు దేవుడిమీదకి వెళ్ళింది. 'అమ్మకి అభ్యంతరం లేదంటే ఈ అమ్మాయిని నేను చేసుకుంటాను,' అని తనలో చెప్పుకున్నాడు. తల్లి చమత్కారంగా అన్న మాటలు - 'రేపు నేను నీ పెళ్ళాన్ని నా కోడలని అందరికీ పరిచయం చెయ్యాలిగా? నువ్వు సరే అంటే మాత్రం చాలదు' - అతనికి జ్ఞాపకంలో వచ్చాయి.

చాలాసేపటివరకు శారదాంబాళ్ నిద్రపోలేదు. రాజేశ్వరిలో ఎటువంటి లోపం కనిపించకపోయినా తన భర్త ఈ పెళ్ళి సంబంధం నిర్వహించిన తీరు ఆమెకు అసంతృప్తి కలిగించింది.

'అతను రాజంని చూడగానే తన కోడలని నిశ్చయించారన్నమాట; ఆ తరువాత పిల్లని వెళ్ళి చూడమని నాకు సలహా ఇచ్చేసారు! నేనేమంటానో అతనికి తెలుసా? అతని అభిప్రాయం తప్పకుండా నేను అంగీకరించాలా? ఇప్పుడు నాకు ఈ సంబంధం ఇష్టంలేదని నేను చెప్తే? . . . ఎదీ ఎప్పుడూ అతను చెప్పినట్టే జరగాలి! నా మాటకి ఏమైనా పరువు, మర్యాద ఉందా?' అని ఆమె వాపోయింది.

మనసు నిమ్మళంగా ఉండాలంటే మనసు ఆరోగ్యమైన తలపులు కలగచేయాలి. కలవరం, మొండితవం చెలాయించే మనసుకి విముక్తి ఎక్కడ? మనసు ఉసూరుమంటుంటే మరెక్కడ నిద్ర? తన భర్త నిశ్చయించిన వధువుపై వ్యక్తిగతంగా శారదాంబాళ్ కి ఆక్షేపణ లేదు. మరెందుకు తనకి భర్తమీద ఈర్ష్య? కావాలంటే తను భర్తను తప్పుపెట్టవచ్చు. కాని అది న్యాయమేనా? ఈ

మొండితనం అవస్యమేనా? తప్పనిసరియా? తన భర్త ముందెప్పుడో తప్పు చేసాడనే బాధ వలన అతన్ని శిక్షించాలని తను పూనుకుంటే, ఇప్పుడు ఎవరికి ఏం లాభం? శారదాంబాళ్ నియతమూ భర్త ఆలోచన విని నిలకడగా అతనికి అణగి నడుచుకొనేది. ఇప్పుడెందుకు అతని మాట తను మీరాలి, తప్పు చెయ్యాలి?

హిందూ సంస్కృతిలో మరిగిన సంప్రదాయ భార్యలాగ మనసు మారినతరువాతే శారదాంబాళ్ కి నిద్ర పట్టింది.

"ముందు అబ్బాయి ఏమంటాడో విందాం; వాడికిష్టమైతే మనమెందుకు అడ్డు చెప్పాలి?' అని ఆమె సర్దుకుంది.

భవాని మనసంతా కలకత్తా మీదే. రఘుపతి రాజంని చేసుకుంటాడని ఆమెకు తోచింది. అలా కాకపోతే రఘుపతి రాజంని భార్యగా ఎంచుకోవాలని ప్రోత్సాహించాలనే ఆలోచన ఆమెకు లేదు. ఎంతసేపూ దూరంలో కలకత్తాలో ఉన్న భర్త జ్ఞాపకమే అమెను పట్టిపీడించింది.

ఆ మరునాడు ప్రొద్దున్న అందరికిముందుగా విశాలం లేచింది; కాని సంగీత సాధనకి రాజంని లేపలేదు. రాజం నిద్రలేచినప్పుడు పక్కనేవున్న మంచాలు ఖాళీగా ఉండడంచూసి గాబరా పడింది. 'ఇదేంటి, అందరూ లేచినతరువాత నాకు మెలకువ రావాలా?' అని తన్ను నొచ్చుకుంది. పరుపును చుట్టబెట్టి, అద్దంముందు జుత్తుని సర్దుకొని, హాలుకి వచ్చింది. హాలుకి పక్కనే ఒక గది మంచంలో నిద్రపోతున్న రఘుపతిని చూడగానే ఆమె మనసు కొంచెం కుదుటబడింది: మంచి వేళ! అతనికి ముందుగా తను లేవడమైంది;మరేం సిగ్గు పడనక్కరలేదు!

భవాని ఇంకా పెరడులో తాపీగా పళ్ళు తోముకుంటోంది. రాజం ఎప్పటిలాగే ప్రొద్దున్న ఒక గ్లాసు కోకో - దాని రుచి లెక్కచెయ్యకుండా - మింగినతరువాత ఇంటిపనులు చురుకుగా చేసింది. తను స్నానం చేసి, చెల్లెలికి నీళ్ళు పోసింది.

తమ్ముడ్ని - చంటిపిల్లవాడిని -పాలు తాగించింది. రఘుపతి పెరడుకి రాగానే తను ముందు వసారాకి వెళ్ళింది. అతను వసారానికి రావడంతో తను ఏదో గదిలో దూరి అతని చూపునుంచి తప్పుకుంది.

ఇప్పుడే భవాని రాజంతో చనువుగా మాట్లాడింది. రాజం చూపించిన పాత పుస్తకాలు, పాట పుస్తకాలు చూసి, "ఇవి నాకు బాగా నచ్చాయి," అని మెచ్చుకుంది.

"మనం డాబాకి వెళ్దాం, రండి," అని రాజం భవాన్ని పిలిచింది.

"ఓ, మీ ఇంట్లో డాబా కూడా ఉందా? అంటే అద్దెకూడా ఎక్కువ కదూ?" అని శారదాంబాళ్ అడిగింది.

రాజంకి బదులుచెప్పాలని తోచింది, కాని నోట ఏ మాటా పగల్లేదు. కాని శారదాంబాళ్ అడిగిన ప్రశ్నకి మారుమాట చెప్పాలనే ఉద్దేశంతో విశాలం తనే చెప్పింది: "మేం పదహారు సంవత్సరాలుగా ఇక్కడ అద్దెకు ఉంటున్నాం. అద్దె కూడా తక్కువే. అది సంవత్సరాలకొద్దీ పెరిగినా ఇప్పుడు ఇరవై రూపాయలే . . ."

"అలాగా? మీ ఇంట్లో రెండు కొళాయిలున్నాయి. ఎలెక్ ట్రిసిటీ కూడా ఉంది. ఇది చాలా పెద్ద ఇల్లే . . ." అంది శారదాంబాళ్. విశాలంకి ఆమె మాటలు గొప్పగా కనిపించాయి.

విశాలం శారదాంబాళ్ ని ఆమె ఇల్లుగురించి అడగడమా వద్దా అని వెనకాడింది. కాని అంతలో శారదాంబాళ్ తనే చెప్పింది: "గ్రామంలో మాది పెద్ద ఇల్లు; ఒక భవనంలాగ ఉండేది. కాని మా ఆయన అది అమ్మేసి ఒక చిన్న ఇల్లు కొనాలన్నారు. నాకు అతని ఆలోచన నచ్చలేదు. కాని అతను వింటేనా? . . ఒక పెద్ద ఇంట్లో కాపురం చేసిన తరువాత చిన్న జాగాలో సవరించుకోడం కష్టంగా ఉంది."

"అవును, మీరన్నది నిజం. మేం మొట్టమొదట ఈ ఇంటికి వచ్చినప్పుడు ఇది చాలా పెద్ద ఇల్లు అనుకున్నాం. కాని ఇప్పుడేమో ఇంకా రెండు గదులుంటే బాగున్ను అనిపిస్తోంది . . . పెద్దదైనా, చిన్నదైనా ఇది మేం అద్దెకున్న ఇల్లేకదా? . . నొంత ఇల్లు ఉంటే - అది చిన్నదైనా - ఒక హోదా కదా? . . . మా పొరుగింటావిడ అనేది: 'ఇన్ని సంవత్సరాలుగా మీరు నెల నెలా ఇచ్చే అద్దె సొమ్ముతో రెండు ఇళ్ళు కొనివుండవచ్చు' అని. కొన్ని సమయాల్లో నాకు ఆవిడ చెప్పినది సరేమో అనిపిస్తోంది . . . "

మేడమెట్లు ఎక్కడానికి తనకిష్టం లేదని శారదాంబాళ్ అనడంతో రాజం, భవాని మాత్రం డాబామీదకి వెళ్ళారు. అక్కడ ఒక సబ్బుపెట్టె చూసి భవాని, "రాజం, నువ్వు ఈ సబ్బు వాడుతావా? నేనెప్పుడూ చందనం సబ్బే వాడుతాను. మా అన్నయ్యకి రకరకాల సబ్బులు వాడడమంటే చాలా ఇష్టం," అని చెప్పింది,

"మా నాన్నగారుకూడా రకరకాల సబ్బులు వాడుతారు," అంది రాజం. "కాని అవేమీ నాకు సరిపడవు, నా మొహంలో మొటిమలు ఇంకా అసహ్యంగా కనిపిస్తున్నాయి; దేవుడా, కిందట సంవత్సరం నా మొహం ఇంత ఎట్బెట్టుగా కనిపించలేదు . . ."

భవాని నవ్వింది. ఒక నిమిషం ఆగి మాట్లాడింది:"మా నాన్నగారు ఏనాటికీ సబ్బు వాడడానికి ఇష్టపడరట. అన్నయ్య పన్నెండేళ్ళ వరకూ సబ్బు వాడనేలేదు. ఆ తరువాత వాడు ఒకనాడు సబ్బు కావాలని ఏడవడంతో నాన్నగారు 'సరే, ఇప్పుడు మన దేశంలోకూడా సబ్బు ఉత్పత్తి చేస్తున్నారుగా?' అని అంటూ తన అభ్యంతరం విడిచిపెట్టారట. అందుకే అన్నయ్యకి సబ్బులంటే పిచ్చి. నేనుకూడా నాకు ఏడేళ్ళు నిండినవెంటనే సబ్బు వాడడం ఆరంభించాను."

"మొటిమలు పోవడానికి సబ్బు పనికిరాదని కొందరు చెప్పడం నేను విన్నాను," అని రాజం విసుగ్గుంది. "కాగా ఈ మాత్రం సబ్బు వాడకపోతే నా మొహం ఇంకా అధ్వాన్నంగా కనిపిస్తుంది."

ఇటీవల తన భర్త తనకి బహుమానంగా కొన్న సిల్కుచీర గురించి భవాని మాట్లాడింది. ఒక యువతి తన భర్తగురించి అంత చురుగ్గా, వెల్లడిగా మాట్లాడడం చూసి రాజం విస్తుబోయింది. రఘుపతిగాని తన భర్త అయితే తను ఎన్నటికీ అలాగ మాట్లాడడం జరగదు అని రాజంకి తోచింది. భవాని కళ్ళద్దాలని తీసి, శుభ్రం చేసినతరువాత లాఘవంగా తన చేతులు స్వెటరు అల్లేముందు తిరిగి కళ్ళద్దాలు తొడుక్కోడం చూస్తే రాజంకి భ్రమ కలిగింది.

"మేం ఇంటినుంచి బయలుదేరినప్పుడు ఈ స్వెటరు అల్లడం ఆరంభించాను; మేం తిరిగి వెళ్ళేముందు ఇది పూర్తి చెయ్యాలని నా ఆశ," అని భవాని చెప్పింది.

"అలాగా? అందుకేనా మీరు నిన్న రాత్రీ, ఇవాళ ఉదయమూ స్వెటరు అల్లుతూనే ఉన్నారు?"

"టైము వ్యర్థం చెయ్యకుండా ఏ పనైనా సరే చెయ్యడం ముఖ్యం కదా?" అంది భవాని. "నేను కచేరీలూ, మీటింగులు వెళ్ళినప్పుడెల్లా అక్కడ రెండుమూడు గంటలు ఏదో అల్లుతూవుంటాను. ఒకే రాయితో రెండు పళ్ళు కొట్టడం అంటే ఇదే!"

రాజం కళ్ళు తళుక్కున మెరిసాయి. భవానికి అది నచ్చింది.

"అమ్మ నన్ను కుట్టుపని నేర్చుకోమని చెప్తూనేవుంది. నేను మాత్రం . . . "

ఇంతలో నటరాజన్ పాటమాష్టారుగారు వచ్చారని చెప్పడంతో రాజం మాటాడడం ఆపి, త్వరగా మెట్లు దిగి వచ్చింది. నటరాజన్ అంతకుముందే నేలమీద ఒక చాప పరిచారు. 'దేవుడా, నేను అందరిముందూ పాడాలంటున్నారా?' అనే భయం రాజంని ఆవరించింది. .

"నాన్నగారూ . . . . ఎందుకు ఎప్పటిలాగే ఒక మూల చాప వెయ్యకూడదు?" అని తడబడుతూ అడిగింది.

"ఏం, ఎందుకు? . . . ఇక్కడే బాగుంటుంది," అని నటరాజన్ అనడంతో రాజంకి హోరుమని ఏడవాలనిపించింది. 'నాన్నగారు కావాలనే ఇలాగ చెస్తున్నారా? నేనేమైనా తప్పు చేస్తే ఎంత అవమానం! నేను పాడితే నా కంఠం ఈ వీధిలో మూడు ఇళ్ళు దాటి వినిపిస్తుందని అందరూ అనడం నాకు తెలుసు. ఇప్పుడు నేను అందరి ఎదుట పాడాలా? సరే, ఇక ఇది ఒక అరిష్టంగా అవబోతుంది . . . " అని ఆమెకు ఒకటే దిగులు.

వచ్చే ఏడ్పుని ఆపుకొని రాజం మాట్లాడింది: "ఇవాళ నాకు పాఠం వద్దు!"

నటరాజన్ రాజం మనసు అర్థం చేసుకున్నారు. "సరే . . . అలాగే కానీ," అని అంటూ ముందులాగే హాలులో ఒక మూల చాప పరిచారు. రఘుపతిని ముందు వసారాలో కలుసుకొని "మనం ఇక్కడనుంచే రాజం సంగీతం విందాం; దానికి కొంచెం సిగ్గనుకుంటాను," అని అన్నారు. రఘుపతి ముఖం ఎర్రబడింది; మరి ఇంతవరకూ పెళ్ళిచూపులకని ఏ అమ్మాయనీ అతను ఎదురుగా చూడలేదుకదా?

భవాని అందరికీ తొలిగివుండి ఒక మూల నిలబడడం నటరాజన్ గమనించారు. "ఏమ్మా, నువ్వూ రాజం పక్కనే కూర్చో . . . అదేం అభ్యంతరం చెప్పదు," అన్నారు. భవాని చిరునవ్వు నవ్వి, "పరవాలేదండి . . . నేను ఇక్కడేవుంటాను," అంది.

నటరాజన్ రాజంని చూసి మాట్లాడారు: రాజం, "నువ్వే భవానిని రమ్మని పిలవమ్మా," అన్నారు. రాజం సరే అని జోరుగా తల ఊపింది.

శారదాంబాళ్ వంటగదినుంచి కదల్లేదు. విశాలంని తనతో హాలుకి రమ్మని అడగడానికి ఆమెకు ఇష్టంలేదు. విశాలంకి వంటగదిలో బోలెడు పనులున్నాయి.

మధ్యాహ్న భోజనం ఇంకా పూర్తికాలేదు; అప్పుడే పిల్లలందరూ, ఒకరి తరువాత ఒకరు, వంటగదికి దండెత్తడం మొదలుబెట్టారు.

శర్మగారు వయలిన్ చేతికి అందుకున్నారు; సంగీత ప్రదర్శన ప్రారంభమైంది. మెల్లమెల్లగా ఆరంభించిన కీర్తన త్వరగా లయ, శృతులతో చెవులకి ఇంపుగా పరిణమించింది. భవాని రాజం పాటపుస్తకంలో సూచించిన నాలుగు కీర్తనలు రాజం అనాయాసంగా పాడేసింది. ఇంటి ముందు వసారాలో ఉన్న నటరాజన్ రఘుపతిని చూసి, "రండి, మనం లోపలికి వెళ్దాం," అని పిలిచారు. "ఎందుకు? ఆమె ఏమంటుందో?" అని రఘుపతి వెనుకాడాడు.

కాని నటరాజన్ రఘుపతిని ఇంట్లోకి ఈడ్చుకొని వచ్చేసారు; రాజం ఉలిక్కిపడింది. తను వెంటనే లేచి వెళ్ళిపోవాలా? అలా చేస్తే బాగుంటుందా? ఇప్పుడెందుకు తత్తరపాటుబడి అంతా పాడు చెయ్యాలి? రాజం నిశ్చయం చేసుకుంది: ఏమైనా సరే, తను పాట ఆపకూడదు; పిరికితనంతో పారిపోవడం కూడదు. వచ్చిన అతిథులు తనకి ఒక పెళ్ళికూతురో లేక కోడలో అవడానికి అర్హతవుందా అని పరీక్ష చెయ్యడానికి వచ్చారన్నది తనకేమీ తెలియనట్టు నడుచుకోవాలి. వాళ్ళ సమక్షం తను లెక్కచెయ్యకూడదు; లేకపోతే తన సంగీతం కళకట్టదు.

రఘుపతికి ఎదురుగా కూర్చున్న నాన్నగార్ని రాజం తలయెత్తి చూసింది. నిమ్మళంగా అపరిచుతలమధ్య ప్రదర్శించిన తృప్తి ఆమె తనువుతీర అనుభవించింది. కాని, ఇదేంటి? అప్పుడే రఘుపతి తన చేతిలోనున్న ఒక దినసరి వార్తాపత్రికను తెరిచి తన ముఖంముంచు పెట్టుకొని చదవసాగాడు . . .

నటరాజన్ కూడా, రాజంలాగే, అదిరిపడ్డారు.

ఆ తరువాతి కీర్తన పాడినప్పుడు రాజం నాలిక వట్టిపోయినట్లనిపించింది. ఉమ్మినీరుని మింగింది. తన రాగ ఆలాపన అంత గొప్పగా లేదని ఆమెకు అర్థమైంది. రఘుపతి ఏమనుకుంటున్నాడో అని అతన్ని చూసింది.

శర్మగారు రాజంని ధైర్యపరిచారు. 'భయం వద్దు! పాడుతూనే ఉండు!" అని అతని చూపు పలికింది.

సంగీత జ్ఞానంకి, దాని ప్రదర్శనకి చాలా భేదం ఉందని శర్మగారు రాజంని హెచ్చరించేవారు. 'నేనెందుకు అతని మాటలు మరిచిపోయాను?' అని రాజం తన్ను నొచ్చుకుంది. పాట ముగించిన తరువాత ఆమె ఆతురత ఎక్కువైంది. 'బాగానే పాడాను, కాని నాకు తృప్తిగా లేదు,' అని తనలో చెప్పుకుంది.

శర్మగారు రఘుపతికి చెప్పారు: "ఆ కీర్తన - అటాణా రాగంలో - రాజంకి నేను ఒక వారంముందు నేర్పాను. మీకు అటాణా రాగమంటే చాలా ఇష్టమని విన్నాను."

"ఏం, ఆరబి, రీతిగౌళ కూడా మంచి రాగాలే", అన్నాడు రఘుపతి. తిరిగి మళ్ళీ వార్తాపత్రికలో కన్నులు వాల్చాడు.

రాజంకి ఒకటే ఆశ్చర్యం! రఘుపతికి కర్ణాటక సంగీతంలో జ్ఞానం ఉందన్న మాట!

"సరే, ఇప్పుడు వయలిన్ వాయించు," అని శర్మగారు అనడంతో అతనూ, రాజం జంటగా ఆరంభించారు. ఆ సమయంలో భవాని లేచి తన గదికి వెళ్ళిపోయింది. రాజం కీర్తన వాయించి ముగించినప్పుడే భవాని తిరిగి హాలుకి వచ్చింది.

రాజం వయలిన్ వాద్యం చాలా బాగా వాడుతోంది అని భవాని అభినందించింది. "నేను ఆశించినట్టు ఆమె ప్రదర్శన లేకపోతే నేను ఏమైనా అంటే రాజంకి సంకోచం కలుగుతుందేమో అని భయపడి నేను వెళ్ళిపోయాను. నేను ఎవరి సంగీతం విన్నా దాన్ని విమర్శించకుండా ఉండలేను. నిజంగా రాజం అద్భుతంగా పాడుతోంది, వయలిన్ వాయించుతోంది," అని భవాని పొగడింది. ఆమె మాటలు విని శర్మగారు, నటరాజన్, రాజం సంతోషించారు.

శర్మగారు మళ్ళీ రఘుపతికి చెప్పారు: "ఆ రోజు రాజం మీ నాన్నగారిముందు ఇంకా బాగా పాడింది." రాజం, రఘుపతి ఇప్పుడు ఒకరినొకరు చూసుకున్నారు.

రాజం ఇంకొక కీర్తన పాడింది. విశాలం లేచి, వంటగదికి వెళ్లి శారదాంబాళ్ ని, "ఏమండీ, మీరు భవానిని ఓ రెండు పాటలు పాడమని చెప్తారా?" అని మనవి చేసుకొని భవానిని చూసి "ఏమ్మా, నువ్వు పాడతావా?" అని అడిగింది.

భవాని, శారదాంబాళ్ ఒకరినొకరు అర్ధపుష్టితో చూసుకున్నారు. ఏం మొహమాటం లేకుండా భవాని పాట మొదలుపెట్టింది. రాజం విస్తుపోయి భవానిని చూసింది.

ఏ పాట పాడాలని తల్లిని అడగకుండానే భవాని పాడిన ధోరణి చూసి రాజం ఆమెను మెచ్చుకుంది. శర్మగారుకూడా రాజం తన్ను ఎవరడిగినా వెంటనే వెనకాడక పాడాలని అనేవారు. రాజం తల్లితో బొమ్మలకొలువులకి వెళ్ళినప్పుడు నిత్యమూ అందరి ఇళ్ళల్లో రాజంని పాడమనేవారు. ఆమెకు ఎల్లప్పుడూ సిగ్గు, సంకోచం. ఇంతకీ భవాని కంఠంలో మాధుర్యం ఏం గొప్పగా కనిపించలేదు, కాని తనకుతానే యదేచ్ఛంగా ఆమె పాడిన తీరు అందరినీ ఆకర్షించింది. భవాని ఇప్పుడు పాడిన కీర్తన తను ఇందకుముందే సూక్ష్మభేదాలతో, చెవులకి ఇంపుగా పాడిన సంఘటన రాజం గుర్తు చేసుకుంది. కాని భయం, దిగులు ఆవహించినప్పుడు పాడడం ఎలా సాధ్యం?

రాజం భవానిని దిగ్భ్రమతో చూసింది; శర్మగారు మళ్ళీ అన్నారు: "రాజం, చూసావా? నువ్వు భవానిని చూసి నేర్చుకోవాలి. ఆమెలాగ అడిగినవెంటనే పాడడం అలవాటు చేసుకోవాలి." అతనికీ భవాని గానం బాగా నచ్చింది. "ఇంకో కీర్తన పాడమ్మా, వినడానికి దివ్యంగా ఉంది. రాజంకి శృతిపెట్టె లేకుండా పాడడం అలవాటు లేదు. నిన్ను చూసి రాజం నేర్చుకోవాలి . . . సరే, కానీ . . .ఇంకొక పాట విందాం," అన్నారు.

భవాని చిరునవ్వు నవ్వింది. రఘుపతి వార్తాపత్రికనుంచి ముఖం తిప్పి ఆమెకు చెప్పాడు: "*'కాన కణ్ కోడి వేండుమ్,'* పాడు."

భవాని ఆరంభించింది. 'ఈ గానం పాడేది ఒక ఆదర్శ సంగీత విద్వాంసురాలు,' అని రాజంకి తోచింది. తనకీ స్కూలూ, మహిళా సమాజం కార్యక్రమాల్లో పాడడం అలవాటే! కాని అటువంటి అవకాశం ఎప్పుడు దొరికినా దానికి చాలారోజులముందే మాష్టారుగారూ, తల్లీ తనకి పదే పదే ధైర్యం చెప్పి కార్యక్రమానికి సిద్ధం చేసేవారు. రంగంలో నిలబడితే రాజం తన సంగీత జ్ఞానం సులభంగా చూపగలదు. కాని అందుకుముందు చేసే బ్రహ్మప్రయత్నం . . .

'నేనూ భవానిలాగ పాడాలి!' అని రాజం తనలో చెప్పుకుంది. భవాని కీర్తన ముగించిన తరువాత "ఇక చాలు, నా కంఠం నాతో సహకారం చెయ్యడం లేదు!" అని చెప్పింది. ఇదే రాజం ఎప్పుడూ చెప్పే పనికిమాలిన సాకు.

"తమిళ కీర్తనలు వినడానికి చాలా బాగున్నాయి; రాజంకి ఒకటికూడా రాదు," అని విశాలం అనగానే శర్మగారికి ఆమె మాటలు ఆరోపణగా అనిపించాయేమో, అతను వెంటనే అన్నారు: "నేను తమిళదేశంలో ఉన్నప్పుడు తమిళ కీర్తనలకి అంత ప్రఖ్యాతి లేదు. కాని ఈ రోజుల్లో మనం చాలా తమిళ కీర్తనలు వింటున్నాం."

"మీరేమంటున్నారు - తమిళ కీర్తనలకి ప్రఖ్యాతి లేదా? ఇవాళా రేపూ తమిళ కీర్తనలకే ప్రేక్షకుల ఆదరణ ఎక్కువగా ఉంది. త్యాగరాజు కీర్తనలకున్న ఘనత పోయింది . . . " అన్నాడు రఘుపతి.

అతని ముఖంలో ఎందుకు అంత ఏవగింపు! శర్మగారు నెమ్మదిగా అతనికి బదులు చెప్పారు: "తమిళ వాగ్గేయకారులుకూడా త్యాగయ్యగారి కీర్తనల పద్ధతినే - అంటే వివరణ, పరిమాణాలు- వాడుతున్నారు."

"ఓహో, అలాగా? ఏం ఎందుకు? అంటే తమిళులకి అవేం చేతకాదని అంటున్నారా? తమిళ కీర్తనలలో చెప్పుకోతగ్గిన స్పష్టత, కల్పన లేవా? ఇక

భవిష్యత్తులో తమిళ కీర్తనలకే ప్రేక్షకుల ఆదరణ! మరి ఆంధ్రులు త్యాగరాజ కీర్తనలని ఛిన్నాభిన్నం చేస్తున్నారుగా?" అని రఘుపతి ఎగరగొట్టాడు.

శర్మగారి ముఖం నల్లబడింది. రాజం రఘుపతి ముఖం చూసింది. అందులో ఏదో పందెంలో తను గెలిచినట్ట ఒక ఆహ్లాదం! కన్నులలో ప్రకాశం! ఏ యువతికైనా ఒక యువకుడి దుడుకుతనం, గర్వం చూస్తే అభినందించాలని ఆతురత కలగడం సహజమేకదా?

ఈ జగడం విడగొట్టాలని నటరాజన్ ఇప్పుడు జోక్యం చేసుకున్నారు: "శర్మగారికి తమిళం, తెలుగు, రెండు భాషలూ బాగా తెలుసు; తమిళ కీర్తనలలో అతనికి మంచి పాండిత్యం ఉంది. తమిళులకు తమిళ కీర్తనలు జనరంజకం చెయ్యాలనే ఆశ సహజమే కదా?" అని ముగించారు. ఇటీవల కర్ణాటక సంగీత చర్చలలో తమిళులు, ఆంధ్రులమధ్య జరిగే అభిప్రాయభేదాలు అతను చదివి, విని తెలుసుకున్నవే.

రాజేశ్వరి మనసంతా ఆ మరుసటిరోజు ఏం జరుగుతుందో అనే ప్రశ్నలో చిక్కుకుంది. అతిథులు ఇక్కడే ఉంటారు; మాష్టారుగారుగారు కూడాను. తను ఎలాగో అందరినీ సంబాళించుకోవాలి!

ఆ మరునాడు రాజంకి కొంగ్రొత్త అనుభవాలు కాచుకొని ఉన్నాయి. శారదాంబాళ్, భవాని, రఘుపతి బజారుకి వెళ్ళినప్పుడు రాజం తనుకూడా వెళ్ళాలని మొండిపట్టు పట్టింది. రఘుపతి తరచుగా విసిరిన చతురోక్తులు విని ఆమె ఆనందించింది: సరుకులు కొన్నప్పుడు అంగడిలో ఒక చిన్న పొరబాటు కలిగింది; శారదాంబాళ్ పేరు బిల్లులొ శ్రాద్ధాంబాళ్ అని ఎవరో రాయడం చూసి తను నవ్వు ఆపులేకపోయింది. రఘుపతికూడా రాజంకి తన హాస్యచేష్టలు నచ్చాయని గుర్తు చేసుకున్నాడు.

ముందు వసారాలో రఘుపతి ఎవడో బిచ్చగాడిని పొమ్మని గద్దించుతుంటే రాజం అక్కడికి వచ్చింది. ఆమె చేసిన దానం చూసి రఘుపతి "ఇంత

బియ్యమా?" అని అడగడంతో "ఏం, మేం భిక్షం ఇవ్వం అనుకున్నారా?" అని అంటూ రాజం ఇంటిలోకి తిరిగి వెళ్ళింది.

రఘుపతి పౌడరు పూసుకోవడం చూసి రాజం "పురుషులు కూడా ఆడవాళ్ళలాగే పౌడరు వాడుతారన్నమాట! నేను కొత్త చీర కట్టుకున్నప్పుడే పౌడరు వాడుతాను!" అని అనడంతో రఘుపతి తొందరగా తన ముఖంలోని పౌడరు తుడుచుకోవడం ఆరంభించాడు. రాజం, రఘుపతి ఇద్దరూ ఒకరినొకరు పట్టించుకోకుండా తమ తమ తల్లిదండ్రులు చెప్పినట్టు నడుచుకున్నారు. "మరునాడు రఘుపతి ముందు నేను ధైర్యంగా పాడగలనా?" అనే అనుమానం రాజంకి మళ్ళీ కలిగింది.

## 6

అతిథులు ఊరికి తిరిగి వెళ్ళారు; వారికి వీడ్కోలు చెప్పినతరువాత విశాలంలో మార్పు కలిగిందేమో అని నటరాజన్ ఎదురుచూసారు. భార్యను చూసి "ఏం, నీకు ఇప్పుడు తృప్తి కదా?" అని అడిగారు.

"నాకేమో నా బెంగ అలాగేవుంది. మరి పురుషులు, స్త్రీలు మనసులు వేరే వేరే కదా? అబ్బాయి తల్లిలో ఆఖరి వరకు ఎటువంటి చనువూ కనిపించలేదు. ఇక్కడ బజారులో అప్పడాలు ఎట్టిగావున్నాయని, తను భవాని ఊరుకి తిరిగివెళ్తున్నప్పుడు మనకి అప్పడాలు పంపిస్తానని చెప్పింది. అప్పుడుకూడా మన రెండు కుటుంబాలమధ్య చుట్టరికం త్వరలో ఆరంభమవుతందని ఒక మాటా అనలేదు! రాజం వాళ్ళముందు చలాకీగా, మర్యాదగా మెలిగిందని నాకు తృప్తి. కాని అది వాళ్ళతోబాటు బజారుకి వెళ్ళడానికి మీరు సరే అనేసారు. వాళ్ళ మనసులో ఏముందో ఎవరికి తెలుసు? దేవుడే కాపాడాలి," అని విశాలం నొచ్చుకుంది.

'తల్లిదండ్రులు నాగురించి మాటలాడుతున్నారు; మంచిది. ఆపకండి! ఇంకా కానీయండి!' అని రాజం మనసు ఆశగా ప్రాధేయపడింది. సాధారణంగా రాజం

సాధువు; ఆమెకు అణిగివుండే స్వభావం. ఐతే తను ముందులాగే ఉండడం సాధ్యమా? ఇంతకీ తన ప్రవర్తనలో మార్పులు తన తల్లిదండ్రులకి తెలుసుగా? ఉయ్యాలూగడం, తనకు నచ్చిన సినిమా పాటలు పాడడం, ఉత్తికే చెల్లెలు, తమ్ముళ్ళతో దెబ్బలాడడం - ఇవన్నీ కట్టిబెట్టి తనొక 'మంచి అమ్మాయి'గా మారలేదూ? ఆ మాటకి వస్తే విశాలం కూడా వింతబోయినట్టు రాజంని పొగడలేదూ?

ఆ భావన రాజం మనసులో క్రమక్రమంగా పెరిగింది. కొన్ని సమయాల్లో తల్లిదండ్రులమధ్య సంభాషణ వింటే ఆమెకు తత్తరపాటు కలిగింది కూడా. వాళ్ళు అస్తమానమూ తనగురించి, తనపెళ్ళి గురించే మాట్లాడారు. రాజం పొంచివుండి అంతా వింటోందని వాళ్ళు అనుమానిస్తే? అది అసహ్యం కదా?

కాని నటరాజన్ కావాలనే తరుచుగా రాజం వినాలని వ్యంగ సూచనలు పలికారు; ఆ సంగతి రాజంకి బోధపడలేదన్నది నిజం!

మరునాడు అతిథులు మొదటిరాత్రి వచ్చిన అదే సమయానికి తమ ఊరుకి తిరిగివెళ్ళారు. వాళ్ళ ఉనికి ఒక రోజే. కాని రాజంకి ఆ అనుభవం మరపురానిదిగా కనిపించింది. నాటిన మొక్కలో ఆకులు కనిపించగానే దాని వేరు భూమిలో బాగా పాతుకుపోయిందని అర్థం కదా? ఆ సూచనే ఇప్పుడు రాజం ముఖంలో నిశ్చలమైన చిరునవ్వుగా కానవచ్చింది; రఘుపతి రాజం మనసులో ఇమిడిపోయాడు. మరునాడు శర్మగారు చెప్పిన మాటలు రాజంని పులకరించాయి: "రఘుపతి ఆ దినం వార్తాపత్రిక వెనుక నీ గానం విని తలూపడం నేను చూసాను," అన్నారతను. రాజం ముఖం సిగ్గుతో ఎఱ్ఱబడింది; అన్నివిధాల ఆలోచనలూ, కల్పనలూ మనసును కొట్టవచ్చాయి.

తల్లి మారుమాట అనకబోతే తను రాజేశ్వరిని చేసుకోవాలని రఘుపతి నిశ్చయించాడు. ఆ తీర్పు అతని తల్లికి నచ్చింది.

పొరుగింటి అమ్మణి తన తల్లిని "ఏమే శారదా, నువ్వు రఘుపతికి వధువు చూడడానికి వెళ్ళావని విన్నాను. అవునా?" అని అడిగిన తరువాత రఘుపతిని చూసి "నీకు అమ్మాయి నచ్చిందా?" అడిగింది. "ఏ అమ్మాయి?" అని రఘుపతి తిరిగి అడిగాడు. అమ్మణి మళ్ళీ అదే ప్రశ్న అడగడంతో "మేం వెళ్ళిన ఇంట్లో ఏ అమ్మాయీ లేదే?" అని ధృడంగా అన్నాడు. అతని ప్రత్యుత్తరం శారదాంబాళ్ కి నచ్చింది.

కాని అమ్మణి అంత సులభంగా అతన్ని విడిచిపెట్టలేదు. "మీ నాన్నగారు నువ్వు పెళ్ళిచూపులకి వెళ్ళావని నాకు చెప్పారు," అని ఆమె అంది. "అలాగా, ఐతే అతన్నే అడగరేం?" అని రఘుపతి మళ్ళీ అన్నాడు. అది విని శారదాంబాళ్ చిరునవ్వు నవ్వింది.

"అవును, అతనికేం? ఏమైనా చెప్తారు! అసలు ఈ సంబంధం గురించి అతను అబ్బాయిని ఏమైనా అడిగారా? అతని మాట అందరూ వినితీరాలా? భవాని కూతురు కాబట్టి నాన్నగారి మాట విని అతను ఎంచిన వరుని చేసుకుంది. రఘుపతి మగవాడు, నాన్నగారి మాట వినాలని శాస్త్రంలో ఎక్కడైనా రాసివుందా? అసలు రఘుపతి ఏమంటాడో అతను విననీ - ఈ సంబంధం ఇష్టమా లేదా అని! అప్పుడతను ఏం చేస్తారో చూద్దాం; అందరూ అతని మాటలకి కట్టుబడాలంటే ఎలాగ?" అని శారదాంబాళ్ నొచ్చుకుంది.

తల్లి పలికిన ప్రతీ మాటా రఘుపతి శ్రద్ధగా విన్నాడు. ఆమె వాక్యాల్లో మరుగుతున్న కోపమూ, నిరాశా అతనికి బోధపడింది.

శారదాంబాళ్ జీవితమంతా పగటికలలుగా గడిచిపోయింది. ఆమెకున్న ఆశలేం గొప్పగా చెప్పుకోవలసినవికావు. 'ఆమె భర్త దొరస్వామి పేరుపొందిన వ్యక్తి; ఒక అమ్మాయీ, అబ్బాయీ ఉన్నారు. మరేం కావాలి?' అని అందరూ అనుకునేవారు. కాని అది నిజం కాదు. భర్తకి ఉద్యోగంలేని రోజుల్లో పడ్డ కష్టాలు ఆమె మనసులో స్థిరంగా పాతుకుపోయాయి. ఇంత కాలమూ తన విషయంలో

భర్త ఉపేక్ష చూపించారని ఆమె వేదన. తనకిష్టంలేని సమయాలు ఎదురైనప్పుడు ఆమెకు వచ్చే కోపం అందరికీ స్పష్టంగా కనిపిస్తుంది; అప్పుడు ఆమె ధోరణి గభీమని పేలగొట్టడానికి సిద్ధంగా ఉన్న ఒక అగ్నిపర్వతంలాగ మారుతుంది.

తనకి ఇల్లాలు అని అందరు స్త్రీలలాగ చెప్పుకోడానికి అర్హత లేదని శారదాంబాళ్ బాధపడింది. దొరస్వామికి ప్రాధమిక సంవత్సరాలలో మంచి కీర్తి; స్వాతంత్రపోరాటంలో పాల్గొనాలని ఎటువంటి సంకోచం లేకుండా, ఎవరికీ తెలియకుండా అతను పదవీ విరమణ చేసారు. ఉద్యోగంలేని భర్త! ఇంతకన్నా పెద్ద అవమానం ఒక ఆడదానికి కావాలా? దొరస్వామి "ఆంగ్లేయులదగ్గర ఉద్యోగం చెయ్యను!" అనే లక్ష్యంతో వేరే ఒక కాలేజిలో చేరారు, కాని అదికూడా త్వరలోనే అతను తిరస్కరించారు. దేవుడా, ఎంత ఘోరం! ఆ తరువాత రెండు పిల్లలు పుట్టారు. భార్యా పిల్లల్ని విడిచిబెట్టి మహాత్మాగాంధీలాగ తను ఆదర్శ జీవితం నడపాలనే ఆలోచన దొరస్వామి క్రమంగా వదిలిపెట్టారు. మంచి వేళ! కుటుంబ బాధ్యతలు అతన్ని బలవంతం చేసాయి. లేకపోతే అతను అన్నీ పరిత్యజించి మహాత్మాగాంధీతో వార్ధా ఆశ్రమంలో చేరివుంటారు. నిలకడగా ఆదాయం లేకపోవడంవలన కాపురంలో ఎన్ని చిక్కులు!

దేవుడిదయవల్ల పిల్లలు ఎటువంటి కష్టాలూ పడలేదు. వాళ్లు పెరిగి వయసుకి రావడానికి ముందే దొరస్వామి సమాజంలో పేరూ, ప్రతిష్ట అందుకున్నారు. మహాత్మా గాంధీ ఆరంభించిన స్వాతంత్ర పోరాట నేపధ్యంలో అతని కీర్తి ఇంకా బాగా పెరిగింది. శారదాంబాళ్ కూడా వినయంతో, ఎటువంటి ఆడంబరం లేకుండా దొరస్వామికి తగిన పత్నిగా అందరి మెచ్చుకోలు అనుభవించింది.

దొరస్వామి తను కలుసుకున్న ఉద్యమంలో ఊరూరా ప్రయాణం చేసినా నిత్యమూ తన కుటుంబంతో సంప్రదించేవారు. అతని భార్య నిత్యమూ వాడకుండా, ముడుచుకోకుండా చెట్టుతోనే ఉన్న పువ్వులాగ జీవితం గడిపింది.

మనసు బాగుంటే ఆలోచనలుకూడా ఆహ్లాదకరంగా ఉంటాయన్నది ప్రకృతి నియమం. ఆ విధంగా శారదాంబాళ్ తన ఆక్షేపణలూ, అవశ్యకతలూ అదుపులో పెట్టుకుంది: దొరస్వామి ఒక ఆదర్శ జీవి; అతనికి అన్య పురుషులలాగ బలహీనతలు లేవు; తనమేలు మాత్రమే చూసుకున్న ప్రజలమధ్య స్వార్ధరహిత మానవసేవ అతని లక్ష్యం.

కూతురు భవానికి పెళ్లి చేసినప్పుడు దొరస్వామి తన విధినియమాలని కచ్చితంగా పాటించారు. వియ్యంకులతో "మా అమ్మాయిలో ఏమైనా లోపముంటే చెప్పండి చూద్దాం. ఈ పెళ్ళికి ఎంత ఖర్చు అవుతుందో అన్న భయం నాకు లేదు; మీరు ఎదురుచూసే ఏర్పాటులకి మించి నేను అన్నీచేస్తాను. కాని కట్నం అని ఒక పైసాకూడా ఇవ్వను!" అని గద్దించారు. ఒక వాగ్ధానం చేస్తే దాన్ని నిర్ధిష్టగా కాపాడాలని అతని వాదం. తను నిర్ణయించిన అబ్బాయిని చేసుకోడానికి భవాని సమ్మతించిన తరువాత  అతనికి మరెవరిమీదా గుర్తులేదు. అందువలనే శారదాంబాళ్ ఆ సంబంధానికి ఎటువంటి ఆక్షేపణ చెప్పలేదు. అదృష్టవశంగా పెళ్ళైన కొన్ని మాసాలలోనే భవాని భర్తకి ఉద్యోగం ఉత్తరదేశంకి బదిలీ అయింది. అత్తా మామల జోలి లేకుండా భవాని కొత్తగా కాపురం ఆరంభించింది. కూతురు సమీపంలో లేదని బాధ పడినా ఆమె సుఖంగా ఉంటోందని శారదాంబాళ్ కి తృప్తి కలిగింది.

'సరే, ఇప్పుడు రఘుపతి పెళ్ళి ఎలా జరుగుతుందో?' అని ఆ తల్లికి ఆరాటం.

ఆ రోజు మధ్యాహ్నం దొరస్వామి రఘుపతిని "నీవేం నిశ్చయం చేసావ్? నేను వాళ్ళకి ఏమని రాయను?" అని అడిగారు.

"నాకిప్పుడు పెళ్ళికి ఇష్టం లేదు; ఎందుకీ తొందర?"

"పెళ్ళికి తొందర లేదంటున్నావా, లేక నీకు అమ్మాయి నచ్చలేదా?"

"మీ రెండు ఊహలకి నా సమాధానం ఒక్కటే!" అని అంటూ రఘుపతి తల్లి ముఖం చూసాడు. ఆమె తనలో తనే నవ్వుకుంది.

"సరే, నీకిప్పుడు పెళ్ళి ఇష్టం లేదని రాస్తాను. వాళ్ళు ఒక సంవత్సరం కాచుకొని ఉంటారు. ఇంతలో మనం ఈ సంబంధం రూఢీ చెయ్యవచ్చుకదా?"

"కావాలంటే వాళ్ళు ఇంకొక వరుడు చూసుకోనీ . . . పరీక్షలయి ఉద్యోగంలో చేరినతరువాతే నాపెళ్ళి."

కొడుకు చెప్పిన మాటలు శారదాంబాళ్ కి నచ్చలేదు కాబోలు; ఒక నిట్టూర్పు వదిలింది. 'మన అబ్బాయి తండ్రిలాగ తన బాధ్యతలు మరిచిపోడు. రాబోయే కోడలు ఇంటికి శ్రేయస్సు తెస్తుంది; నాలాగ అవస్థ పడదు,' అని ఆమెకు తోచింది.

"సరే, నువ్వు బాగా ఆలోచించి నీ ఇష్టం ఏమిటో చెప్పు. నీకు ఇష్టమంటే మనం కాచుకొని ఉందాం. అమ్మాయికి పదిహేనేళ్ళే కదా నిండాయి?" అన్నారు దొరస్వామి.

శారదాంబాళ్ మనసులో వెంటనే ఒక మార్పు!

"ఈ అమ్మాయినే చేసుకోవాలంటే పెళ్ళి ఈ సంవత్సరంలోనే జరగాలి!" అని శారదాంబాళ్ భవానికి చెప్పింది. "ఉద్యోగంలో చేరిన తరువాత పెళ్ళయితే రఘు కొత్త కాపురమని మనల్ని వదిలి వెళ్ళిపోతాడు; ఆ తరువాత వియ్యాలవారికి మనమీద ఏం గౌరవం ఉంటుందని?"

"మనుషల మనసులు మారుతూనే ఉంటాయి," అని భవాని తల్లికి చెప్పింది. "పదిరోజులముందు నువ్వు ఏమన్నావో నీకు జ్ఞాపకం ఉందా?" అని అడిగింది.

ఆ సాయంకాలం దొరస్వామి కళ్ళద్దాలతో, చేతిలో కలంతో కుటుంబ సభ్యులముందు దర్శనమిచ్చారు. "ఇవాళ శుక్రవారం. నేను వాళ్ళకి ఈ సంబంధంగురించి రాయబోతున్నాను. రఘు, ఏమని రాయను?" అని అడిగారు.

రఘుపతి ఈ ప్రశ్న ఎదురుచూసినదే. "మీ నాన్నగారు మాట విన్నావా? అభిప్రాయం అడగడమంటే ఇదే కాబోలు!" అని భవానితో శారదాంబాళ్ గుసగుసలాడింది; కాని ఆమె ముఖంలో ఉల్లాసం కనిపించింది.

"నేను నా చదువు ముగించుకొని ఉద్యోగంలో చేరిన తరువాతే పెళ్ళి. వాళ్ళు తొందరపడితే వేరే సంబంధం చూసుకోనీ," అని రఘుపతి అన్నాడు.

"వాళ్ళు తొందరపడుతున్నారని ఎవరన్నారు?"

"అమ్మ అభిప్రాయం నాకు తెలియాలి. అమ్మకి ఈ విషయాల్లో అన్నీ తెలుసు."

"నీకు అమ్మాయి నచ్చలేదంటే చెప్పు; ఎందుకు అమ్మమీద భారం వేస్తున్నావ్?"

"అమ్మాయి అందంగానే ఉంది; అందుకోసం నేను పెళ్ళిచేసుకోవాలా?"

"ఐతే మరెందుకు రైలు ప్రయాణం రద్దు చేసావ్ . . . ?

"అది స్నేహభావంవలన . . . ."

"అంటే ఇప్పుడు దానికి విరుద్ధంగా నడుచుకోవాలా?"

"అమ్మని అడగండి. నేను పెళ్ళిచూపులకని వెళ్ళలేదు; అమ్మ తీర్మానం ఏమిటో అడగండి."

దొరస్వామికి భార్య పక్క గదిలోనుంచి తండ్రి కొడుకుల సంభాషణ వింటోందని తెలుసు. "ఏమే, విన్నావా వీడేమంటున్నాడో? నీ అభిప్రాయమేమిటో చెప్పు!" అన్నారు.

శారదాంబాళ్ వెంటనే పలికింది: "నాకు అమ్మాయిగురించి ఎటువంటి ఆక్షేపణ లేదు; వాడి సంతోషం నా సంతోషం!"

ఆమెకు తెలుసు ఆఖరికి తన భర్తమాటే చెల్లుతుందని; ఇప్పుడూ అలాగే అయింది. అందువలన ఆమె మనసుకి కొంచెం బాధ కూడా కలిగింది.

రఘుపతికి ఆశ్చర్యం మీరలేదు.

దొరస్వామి భవానిని "నీవేమంటావ్?" అని అడిగారు.

"నాన్నగారూ, ఆ ఉత్తరమేదో ఇవ్వండి. నేను కుంకం ఒత్తుతాను."

"మంచిది! అలాగే చెయ్!"

'అమ్మకి ఎంత ఉదాత్త మనసు!' అని రఘుపతి శ్లాఘించాడు. తన వ్యక్తిగత అభిప్రాయం ఎలావున్నా ఇతరుల మనసు అర్థం చేసుకునే సానుభూతి ఆమెలో ఉంది. బాహటంగా తీయగా మాటాడి తన మాటే చెల్లాలనే మొండితనం ఆమెకు లేదు. సాధారణంగా ఎటువంటి సందర్భంలోనూ రెండు పక్షాలవారు రాజీపడడం సులభంగా జరుగదు. కాని అలాంటి సమయాల్లో తన తండ్రికంటే తన తల్లిలోనే ఆ ఉదార గుణం కనిపిస్తోందని అతనికి తోచింది.

"రఘుపతి రాజంని చేసుకోడానికి సంపూర్ణంగా సమ్మతించాడు," అనే శుభవార్త దొరస్వామి నటరాజన్ కి చేతివ్రాతతో ప్రకటన చేసారు. "ఇప్పుడు మనం మన దేశంలో స్వరాజ్యలక్ష్మిని ఆతురంగా ఎదురుచూస్తున్నాం; అలాగే మా గృహంలో మేం రాజ్యలక్ష్మిని ఆహ్వానిస్తున్నాం." టపాలో పంపించడానికి ముందు రఘుపతికి అతను అది చూపారు.

"సరేకాని, మీరు అమ్మాయి సమ్మతి అడగడం మరిచిపోయారు!" అని రఘుపతి అన్నాడు.

దొరస్వామి చిరునవ్వు నవ్వారు. "నీకు తెలుసా? మీతోబాటు అదే రైలుబండిలో నటరాజన్ ఉత్తరం ప్రయాణం చేసింది. మీరు రైలెక్కిన అదే సమయం అతను దీన్ని R.M.S. లో పోస్ట్ చేసేసారు! ఇదిగో, చదువు!" అని అతని చేతికి అందించారు.

రఘుపతి విస్తుబోయాడు. నటరాజన్ ఇలా రాసారు.

"మా అమ్మాయీ, మీ అబ్బాయీ మధ్య అన్యోన్యాంగీకారం ఉందని నా అభిప్రాయం. రాజంలో మీ భార్యా, కూతురూ, రఘుపతితో బజారుకి వెళ్ళివచ్చినతరువాత చాలా ఉత్సాహం కానవచ్చింది. వాళ్ళు ముగ్గురు సాంబశివం ఇంటికి వెళ్ళినప్పుడు రాజం తనూ వెళ్ళాలని చెప్పింది. నేను

రఘుపతికి రాజం స్కూలు పుస్తకాలు, ప్రోగ్రెస్ రిపోర్ట్ చూపించాను. ప్రతీ మాసం వేరేవేరే పాఠాల్లో రాజంకి మంచి మార్కులు వచ్చాయని అతనన్నారు. మరికొంత ప్రయత్నం చేస్తే అన్ని పాఠాల్లోనూ ఆమెకు మంచి మార్కులు రావొచ్చన్నారు. అవును, ఎంత నిజం! కిందటి మాసం సయిన్సులో మార్కులేం గొప్పగా లేవు. కాని ఈ మాసంలో రాజం సయిన్సులో మొదటి స్థానం అందుకుంది. శ్రద్ధ, ధారణ ఉంటే రాజంకి అన్నీ సాధ్యమని మనం నమ్మవచ్చు. అదే మీ అబ్బాయికూడా అవాళ నాకు చెప్పారు. రఘుపతిని చూసినతరువాత రాజం ముఖంలో ఒక విధమైన కాంతి కనిపిస్తోంది. ఆమె తన సమ్మతిని కన్నులతో మాకు చెప్పింది; మాటలకంటే కన్నులే ఆమె మనసులో పొంచివున్న ఆలోచనలు మనకి వెల్లడి చేస్తాయి. కలం కాని మరేం వస్తువు పోగొట్టుకుంటే తనేదో తప్పు చేసినట్టు ఆమె కళ్ళలో ఒక సూచన కనిపిస్తుంది. ఎప్పుడైనా కోపంవచ్చి తమ్ముడితో దెబ్బలాడినప్పుడుకూడా రాజం వాడిమీద తనకున్న సానుభూతి తెలియజేస్తుంది. తనతో కేరంబోర్డు ఆడాలని ఎవరిని పిలిచినా రాజం కన్నులతోనే ఆహ్వానిస్తుంది."

నటరాజన్ ఉత్తరం ఇలా ముగించారు.

"రఘుపతికూడా ఈ సంబంధంకి ఏకీభవిస్తే మా కలలు నిజమవుతాయి."

'ఎప్పుడతను ఇది రాసారు?' అని రఘుపతి ఆశ్చర్యబోయాడు. ఇప్పుడు రాజం అతని మనస్సుని పూర్తిగా ఆక్రమించేసింది. 'సరే, ఇలాగ నాటకమాడడం అతనికి అలవాటు కాబోలు!' అని అనుకుంటూ రఘుపతి టెన్నిస్ రేకెట్టుతో బయటకి నడిచాడు.

## 7

దొరస్వామి ఉత్తరం చదవగానే నటరాజన్ మురిసిపోయారు.

"విశాలం, విను! మన రాజేశ్వరి రాజ్యలక్ష్మిగా మారిపోయింది! ఇక రెండురోజులకైనా నువ్వు సంతోషంగా ఉండు. ఆ తరువాత పెళ్ళి పేరంటాలకి

ఆరాటపడవచ్చు," అని అతను భార్యకు చెప్పారు; సంతోషం పట్టలేక మాటాడుతునే ఇంటి వసారానుంచి పెరడువరకూ నడిచారు.

నేలమీద సుద్దతో బొమ్మలు గీస్తున్న పిల్లవాడు తల్లితో "నేను పొరిగింట్లో ఇది చెప్పాలి," అని పరుగెత్తాడు.

"అక్కయ్యా, రఘుపతి అంకుల్కీ నీకూ పెళ్ళా?" అని చెల్లెలు రాధై అడిగి, చప్పట్లు కొట్టుతూ మేజామీద గెంతింది.

టపాలో వచ్చిన వార్త విరుద్ధంగా ఉండి ఉంటే ఇక ఏమైయ్యుంటుందో అని విశాలం తనలో కల్పన చేనుకుంది.

నటరాజన్ మాత్రం 'పెళ్ళి ఈ సంవత్సరమే జరగాలని ఎందుకు దొరస్వామి రాయలేదు?' అని ఆలోచించారు. ప్రత్యుత్తరంలో "ఈ రోజు మా ఇంట్లో పండుగలాగుంది," అని తమ ధన్యవాదాలను తెలియజేసుకున్నారు.

"అక్కయ్యా, మరి నువ్వు పెళ్ళి పీటలో రఘుపతి అంకుల్ పక్కన కూర్చుంటావా?" అని చిన్నతమ్ముడు అడిగాడు.

"పోరా, నన్నేం అడగొద్దు!" అని రాజం విసుగ్గుంది.

'రాజంకి ఇప్పుడు సిగ్గంటే సహజం. కాని ఎందుకు ఆమె మొహంలో చికాకూ, మోటుతనం కనిపిస్తున్నాయి?' అని నటరాజన్ కి దిగ్భ్రాంతి కలిగింది. ఈ ఉత్తరం వచ్చినతరువాతకూడా రాజం ముఖంలో చిరునవ్వుగాని, ఆమోద సూచనగాని అతను చూడలేదు. చిన్నతమ్ముడు మీద అలా మండిపడడం ఎందుకు? 'రాజంకి ఈ సంబంధం నచ్చలేదేమో?" అని అతనికి అనుమానం కలిగింది.

కాని రాజం మనసులో ఏముందో విశాలంకి బోధపడింది. ఎలాగ?

ఒక చిన్న చీటీ మూలంగా! మరి ఆమె ప్రొఫెసరు భార్యకదా?

ఇంతకుముందొకసారి, విశాలం "రాజం, చూసావా, ఆ సబ్బుపెట్టె కింద ఒక చీటీ ఉంది; అది చదువుతావా?" అని అడిగి కళ్ళు తడిబెట్టుకుని త్వరగా

అక్కడనుంచి వెళ్ళిపోవడం రాజంకి జ్ఞాపకంలో వచ్చింది. ఆ చీటీలో "రాజం, నాన్నగారు ఏమో అన్నారని నువ్వు ఇవాళ మధ్యాహ్నం స్కూలునించి తిన్నగా ఇంటికి రాకుండా నీ ఫ్రెండు సూర్యా ఇంటికి వెళ్ళిపోయావు! నీకోసం నేను ఎంత తపించిపోయానో నీకు తెలుసా?" అని రాసింది.

మరి . . . .ఇప్పుడు . . . ఇంకో చీటీలో . . .

"నాకూ, నాన్నగారికి రఘుపతికి విరుద్ధంగా ఎటువంటి అభిప్రాయమూ లేదు. నీ మనోభావాలు మేం పూర్తిగా ఆమోదిస్తాం. నీ ఇష్టంకి అడ్డం చెప్పం. నీకు ఈ సంబంధం తృప్తిగా లేదంటే మాకు ఒక చీటి రాసిపెట్టు. ఇష్టమంటే నువ్వు మరేం చెయ్యనక్కరలేదు . . . "

'అమ్మకి ఎంత చురుకుతనం!' అని రాజం తనలో మెచ్చుకుంది. ఆ చింతనతోబాటు ఆమె శరీరం గడ్డిపోచలాగ వణికింది.

"రాజం, నువ్వు నిజంగానే అదృష్టవంతురాలు!" అని శర్మగారు ఆమెను అభినందించారు.

"నటరాజన్, మీరు నాకేం బహుమానం ఇవ్వబోతున్నారు? మా ఇంటికి దొరస్వామి రావడంవలనే కదా మీకు మంచి అల్లుడు దొరికాడు?" అని సాంబశివం అన్నారు.

"ఓ, సాంబశివం అలాగా అన్నారా? నా సంగీత శిక్షణ ఈ సంబంధంకి కారణం అని నేనంటాను," అని వాదించారు శర్మగారు.

"నా కాలేజీయే రాజం భవిష్యత్తుకి ఒక ముఖ్యమైన తోవ చూపిందని నా నమ్మకం," అని నటరాజన్ నవ్వుతూ వాళ్ళకి చెప్పారు. "ఇన్ని సంవత్సరాల సహవాసం నాకదే చెప్తోంది!"

"అంతా దేవుని దయ; మన చేతిలో ఏముంది?" అని విశాలం వైరాగ్యంతో చెప్పుకుంది.

రాజం మనసులో తోచిన ఆలోచన ఒక్కటే: 'నాకూ రఘుపతికి పొత్తు ఉంది; అందువలనే ఈ నంబంధం నిశ్చయమైంది.'

రఘుపతి తన్ను చేసుకోవాలన్న కోరికకంటే అతను తనకి తగిన భర్త అనే తలపే రాజంకి నచ్చింది. పెళ్ళిచూపులకి వచ్చిన యువకులు తన్ను తిరస్కరించవచ్చు అనే భావన ఆమెకు ఎప్పుడూ తోచలేదు. అవును మరి; రాజంలో ఏమైనా దోషముందని ఎవరైనా, ఎప్పుడైనా అన్నారా? కాని తన తల్లి చెప్పినట్టు శారదాంబాళ్ లో ఒక విధమైన నిర్లక్ష్యం - ఇతరులతో దూరంగా ఉంటూనే మెలగాలనే ఒక దృఢ నిశ్చయం - చూసినతరువాత ఆవిడ తీర్పు ఎలా ఉంటుందో అని రాజం జంకింది. అందువలనే రఘుపతి ఆమోదంతోబాటు పెళ్ళి శుభవార్త వచ్చినప్పుడు ఆమెకు ఆశ్చర్యం బదులు ఓదార్పే కలిగింది.

ఈ సంబంధం ఒక స్వదేశాభిమాని కుటుంబంతో జరుగబోతుందని రాజం సంతోషించింది. అంతేకాదు; ఇక రాబోయే రోజుల్లో తన సంగీత ప్రజ్ఞ ప్రకటించడానికి, తన కలలు సఫలమవడానికి అవకాశం కలుగతుందని నమ్మింది.

సాంప్రదాయ కర్ణాటక సంగీతంలో అభిరుచి ఉన్న ఒక కుటుంబంతో ఈ సంబంధం అవబోతుందని శర్మగారికి ఎంత తృప్తి! భవానిదగ్గర తను తమిళ కీర్తనలు నేర్చుకోవచ్చు; రఘుపతికి కూడా తమిళ కీర్తనలలో ఆసక్తి ఉందట. భవానీ, తనూ కలిసి రేడియోలో పాడవచ్చు. రాజంతో పోలిస్తే భవాని కంఠంలో తక్కువ స్థాయి కనిపిస్తుంది. కాని ఇద్దరూ జంటగా పాడితే కచేరీ బాగానే రాణిస్తుంది. ఐతే తను ఒక సంగతి జ్ఞాపకముంచుకోవాలి; భవానితో కలసి తను పాడాలంటే పాటమాష్టారుగారు లేకుండా పాడాలన్నమాట! అవును మరి; శర్మగారు తనతో కచేరీలకి రావడం ఎలా సాధ్యం?

భవాని భర్తకి పిల్లనగ్రోవి వాద్యంలో మంచి జ్ఞానం ఉందని ఎవరో చెప్పినది రాజం గుర్తుచేసుకుంది. పాటలో పదాలు జ్ఞాపకంలేకపోతే అతను అనాయాసంగా రాగ ఆలాపన చేస్తారట. అతని కంఠంలో ఆకర్షణ లేదనిపిస్తుంది. కాని అతను పాడితే శ్రోతలు గంటలకొద్దీ కూర్చొని వింటారట. శర్మగారు రాజంతో అనేవారు:

'ఏ గాయకుడైనా సాహిత్యంలో ప్రధాన అంశాలు - రాగం, రచయత పేరు, తాళం - ఎలా మరిచిపోగలడు?' అని. కాని భవాని భర్త మాటకి వస్తే అతను పదాలేనీ తెలియకపోయినా అపూర్వ రాగాలు పాడతారట.

రఘుపతికి మృదంగ వాద్యంలో పరిచయంముంటే ఎంత బాగున్ను! అలాగయితే కుటుంబ సభ్యులందరూ కలిసి ఒక కచేరీ చెయ్యవచ్చు. పెళ్ళైన తరువాత అందరూ కలిసి ఒక గ్రూప్ ఫోటో తీసుకోవాలి. గాయకులు మధ్య, భవాని భర్త పిల్లనగ్రోవితో ఒక పక్క, రఘుపతి మృదంగంతో ఇంకోపక్క. కాని రఘుపతి తనకి మృదంగంలో ప్రవీణత లేదని సిగ్గుతో ఫోటోలో కూర్చోడానికి ఆక్షేపణ చెప్తే? సరే, అలాగే కానీ! అతను శృతిపెట్టితో మాతో కూర్చోవచ్చుకదా?

రాజం కల్పనలన్నీ తెరలుతెరలుగా అమెను ఆకట్టుకున్నాయి. భవిష్యత్తులో రాబోయే ఖ్యాతి, సాధన మినహా మరేం ఆలోచనలు ఆమెకు తోచనేలేదు.

కొన్నిరోజులుగా భర్తకు విసుగుపుట్టేలాగ ఏమీ చెయ్యకూడదని విశాలం జాగ్రత్తగా మెలిగింది. కాని రాజం పెళ్ళికి ఏర్పాట్లు ఆరంభించి పొరుగింటి సీతమ్మతో చర్చించుకున్నప్పుడు మళ్ళీ విధవిధాల ఆలోచనలు ఆమె మనసులో జొరపడ్డాయి; అది చూసి నటరాజన్ కి పట్టరాని కోపం వచ్చింది.

"వాళ్ళు 'ఈ సంబంధం వొద్దు!' అని రాసివుంటే మంచిదేమో?" అని అతను భార్యను ఎగతాళి చేసారు. "విశాలం, నువ్వేమో మరీ కొత్త కొత్త సమస్యలు కనిపెడ్తున్నావ్! నువ్వెందుకు శరదాంబాళ్ కి ఒక ఉత్తరం రాయకూడదు? ఇది రెండు కుటుంబాలమధ్య స్నేహభావంతో జరిగే పెళ్ళి. ఎందుకు నీకు అర్థం పర్థం లేని భయం?" అని అతను చీవాట్లు పెట్టారు. అతని మాటలు విని విళాలం వెనుకంజ వేసింది; కాని నెమ్మదిపరచుకొని "నేను ఆవిడకి రాయాలంటున్నారా?" అని అడిగింది.

"నువ్వు రాసావంటే ఆవిడకి సంతోషంగా ఉంటుందని అంటున్నాను."

భర్తలో ఎగపాకుతున్న కోపం గమనించి విశాలం చమత్కారంగా మాటాడింది: "నేనెందుకు అడుగుతున్నానంటే నా చేతిరాత అంత బాగుండదు; మీరుకూడా నా రాత అధ్వాన్నమని అనేవారుగా?"

"అవును, నిజం. నేనే రాస్తాను," అని చెప్పి నటరాజన్ మేడమీదకి వెళ్ళిపోయారు.

కొంతసేపటికి తిరిగివచ్చి తను రాసిన ఉత్తరం అతను భార్యకు అందించారు. విశాలం మాటాడే ధ్వనిలో రాసినట్టు అది కనిపించింది, నటరాజనే రాసారు. తన ఆలోచనలు - అవి తోచినవెంటనే - అలాగే పెద్ద పెద్ద అక్షరాలతో రాయడం అతని అలవాటు. కాని ఇప్పుడు కావాలనే చిన్న చిన్న అక్షరాలతో నిలకడగా తన భావాలు బాగా ఆలోచించి వెల్లడి చేసినట్టు రాసారు.

"నేనింకా కొంచెం మర్యాదతో రాసివుంటాను," అని విశాలం అతనికి చెప్పింది: "'మీరు జవాబు రాస్తే నాకు తృప్తిగా ఉంటుంది,' అని నేను రాయను. ‘మీరు బదులు రాస్తే నాకు ఓదార్పు కలుగుతుంది,’ అని రాసేదాన్ని."

"బుద్ధిలేని మాటలవి," అని నటరాజన్ తనలో గొణుక్కున్నారు.

"సరేలెండి. నేను తరువాత సంతకం పెడ్తాను. వర్జం దాటనీ . . . "

"వర్జంకి ముందే నువ్వెందుకు సంతకం చెయ్యకూడదు?"

"నేను చేస్తే మీరు వెంటనే టపాలో వేస్తారు; వర్జం పోయేవరకూ కాచుకొని ఉండరు."

నటరాజన్ కి ఆమె మనసు తెలుసు.

వర్జం దాటినతరువాత నటరాజన్ కిందకు వచ్చి, "ఇదిగో చూడు. నీ బదులు నేనే సంతకం పెట్టేసాను," అని అంటూ ఆమె చేతికి ఉత్తరం అందించారు.

"రామ రామ! ఇదేంటి మీరే ఆడదానికి రాసినట్టుంది ఇది? . . . రాజం, చూసావా మీ నాన్నగారు ఏం చేసారో?"

కొంచెం దూరంలోనే నిలబడివున్న రాజం దిగులుపడి తల్లి పక్కకి వచ్చింది.

"మీరు నా పేరులో సంతకం చేసేసారు. కాని అది అంత మోటుగా కనిపించాలా? నేనైతే కొన్ని అక్షరాలు ఇలాగా అలాగా వంగినట్లు రాసివుంటాను; మీకు వంకరా, వంపూ లేకుండా నా పేరు రాయడం చేతకాదా? ఇదిగో చూడండి. ఈ ఆఖరి రెండు అక్షరాలు - ఒకే పదంలో - వరుసగా లేవు. నేనేం పిచ్చిదాన్ని అని అందరూ చెప్పుకోవాలా?" అని విశాలం ముఖం ముడుచుకుంది.

"అదేమో, నీ సంతకంలాగే ఉండాలని నేను చాలా ప్రయత్నంచేసాను," అన్నారు నటరాజన్.

నాన్నగారు తన తప్పు ఒప్పుకున్నట్టు నటించే ధోరణి చూసి రాజం నవ్వింది.

శారదాంబాళ్ రాసిన ప్రత్యుత్తరం చూసి విశాలం మురిసిపోయింది.

"మీరు పెళ్ళి ఎలా జరిపిస్తారు లేక ఎటువంటి బహుమానాలు ఇస్తారు అనే విషయంలో మాకు ఎటువంటి నిబంధనలూ లేవు," అని ఆవిడ రాసారు. "మీకెలాగ అనిపిస్తుందో అలాగే అన్నీకానీయండి. నేను చెప్పేదంతా అన్ని సంస్కారాలూ యధావిధిగా జరగాలి. భక్షణాలకి నెయ్యి వాడండి; కొబ్బరినూనె వద్దు!"

"మీరు అప్పడాలేవీ చెయ్యనక్కరలేదు, కొనక్కరలేదు. నేను చేసి ఇస్తాను. మా అబ్బాయి ఒడుగుకి నేను చేసిన అప్పడాలు అరటాకుని కప్పుకున్నాయి; అందరూ భ్రమించిపోయారు! అలాగే ఈ పెళ్ళికికూడా నేను అప్పడాలు వొత్తుతాను. మీకు రెండువేలు ఇవ్వదలుచుకున్నాను. మీరు సాంప్రదాయ విందుకి తగిన ఏర్పాట్లు చెయ్యండి. మనం కోరుకునేదంతా పెద్దల, పురోహితుల ఆశీస్సులే కదా? అవే మన పిల్లల శ్రేయస్సుకి తోడు చేస్తాయి."

విశాలంకి మనశ్శాంతి రాలేదు. "మనకేది ఇష్టమో మనమే నిశ్చయించుకోవాలట! కాని మనకేం తెలుసు? సరే, నేను గ్రామంలోని మా అత్తని రమ్మంటాను; ఆవిడకి అన్నీ తెలుసు!" అని తనలో గొణుక్కుంది.

నటరాజన్ మౌనం దాల్చారు. ఉయ్యాలమీద కూర్చుండి ఎడతెగకుండా విశాలం నోట వచ్చే మాటలు విని అతను చికాకు పడ్డారు. "ఈ ఇంట్లో ఎలాగ పెళ్ళి జరుగుతుందో నాకర్థం కావటంలేదు!" అని అంటూ కోపంతో బయటికి వడిచారు.

8

త్వరలోనే రాజేశ్వరి పెళ్ళి ఏర్పాట్లు ఆరంభమైయ్యాయి - కాని నటరాజన్ ఇంట్లోకాదు, తమిళదేశంలో వియ్యంకులున్న ఊరులో నివసించే నటరాజన్ మిత్రులు జగత్పతిగారి ఇంట్లో. వధూవరుల బంధువులు, స్నేహితులు అందరూ కలిసి చేసిన తీర్మానం ఇది.

పెళ్ళి జరపడానికి అనుకూలమైన స్థలం, వేదికతోపాటు అతిథి సత్కారం, తక్కిన వసతులు జగత్పతిగారు సమకూర్చారు. నటరాజన్ కి బాధ్యతలు తక్కువే. విశాలం అత్త గ్రామంనుంచి వచ్చేసింది. "అప్పడాలు వద్దంటే మరేం గొప్పగా కావాలట?" అని అడుగుతూ పిండివంటలు చెయ్యడానికి పూనుకుంది. ఆ వృద్ధురాలు అనాయాసంగా పెద్ద పోయ్యిలలో పెనం వేసుకొని, నెయ్యిలో పెద్ద పెద్ద జంతికలు వేయించడం చూసి విశాలం విస్తుబోయింది. పెళ్ళి ఏర్పాట్లు మాటాడుకోడానికి దొరస్వామి, నటరాజన్ అప్పుడప్పుడు సంప్రదించుకున్నారు; రఘుపతి అంతగా పట్టించుకోలేదు. కొన్నిరోజులు - ముఖ్యంగా చీరలు, పట్టుబట్టలు గురించి మాటాడానికి - భవాని వచ్చింది. రాజం సహజంగా అందరితోనూ కలుసుకుంది. కాని మనస్సులో ఏదో అర్థంకాని భయం; కొత్త జాగా, కొత్త వాతావరణం ఆమెకు అసౌఖ్యం కలిగించాయి. తనకి ఊపిరి తిరగ్గుండా ఏమైనా ఐపోతే? "అత్తయ్యా, నేను పాడగలనో లేదో? నాకేమైనా కషాయం ఇస్తారా?" అని బతిమాలింది.

ఆమెకు తెలుసు: ఇంకా కొన్నిరోజుల్లో పాటమేష్టరుగారు వచ్చేస్తారు; రాజం పెళ్ళిలో పాడాలని అతను నొక్కి చెప్తారు. దేవుడా, ఎలాగ పాడడం? అప్పుడే తన నోరు వాకట్టుకున్నట్టు అనిపిస్తుందే . . . ?

ఒకరోజు భవాని విశాలం, రాజంని తన ఇంటికి ఆహ్వానించింది. ఆ ఊరులో ఉన్న వర్తకుడొకడు ఇంటికి చీరలతో వస్తున్నాడని, కావలసినవి తాము ఎన్నుకోవచ్చునని చెప్పింది.

రఘుపతికూడా ఉంటాడేమో అనే హెచ్చరికతో రాజం వెళ్ళింది. కాని అతనెక్కడా కనిపించలేదు. ముందు వసారాలో తల్లీ, కూతురూ చీరలన్నీ చూసారు; రాజం తనకి అన్నిటికంటే ముదురు ఎరుపురంగు అంచుతో ఒక నీలరంగు చీర నచ్చిందని తల్లికి చెప్పింది.

అది విని భవాని పకపకమని నవ్వి, "అన్నయ్యా!" అని గొణుకుతూ ఇంట్లోకి పరుగెత్తింది; కొన్ని నిమిషాలతరువాత తిరిగివచ్చింది. ఇందులో హాస్యమేముందని తెలియక తల్లీ, కూతురూ కలవరపడ్డారు. శారదాంబాళ్ కారణం చెప్పింది: రఘుపతికూడా అదే చీర చూసాడంది. రాజంకి ఒకటే సిగ్గు: "అతనికీ ఇది నచ్చిందా?" అని తడబాటుతూ అడిగింది. భవాని అనుభవిస్తున్న వినోదం చూసి వర్తకుడు నవ్వుతూ, "రఘుపతి అయ్యరు[1] ఈ చీర చూసి 'నిజం చెప్పాలంటే ఇటువంటి చీర ఎవరయ్యా కొంటారు?' అని నన్ను అడిగారు; ఇప్పుడు ఈ అమ్మగారు ఇదే చీర కొనాలంటున్నారు. అంటే, మా సరకుకి మంచి గిరాకి ఉందన్న మాట!" అని అన్నాడు.

వర్తకుడు తన్ను పొగడుతున్నట్టు మాటాడుతున్నాడని రాజంకి అర్థమైంది; ముఖం ముడుచుకుంది. ఆఖరికి భవాని అన్నయ్యకీ, రాజంకీ కావలసినవన్నీ కొని వర్తకుడికి వీడ్కోలు చెప్పింది.

---

[1] ఇది మర్యాదకు వాడిన పదం

అప్పుడే దూరంలో నాదస్వర వాద్యం వినిపించింది.

"భవానీ, అదుగో . . . త్వరలో వియ్యాలవారూ, బంధువులూ ఇక్కడికి రాబోతున్నారు! ముందు నువ్వు వెళ్ళి తాంబూలం, పళ్ళు, పువ్వులతో వాళ్ళని కలుసుకో!" అని దొరస్వామి కూతురుని ఆదేశించారు.

వాద్యకారులు వీనసొంపుగా మోగుతుంటే పెద్దలూ, బంధువులు వెంటవస్తూ, వధూవరులు ఇంట్లోకి ప్రవేశించారు. భవాని ఆరతి కంచంతో ముందుకు వచ్చి స్వాగతం పలికింది; రాజం చెవిలో "నువ్వు పాడు, నేను ఆరతి ఆరంభిస్తాను," అని గుసగుసలాడింది. ఏంచెయ్యాలో తెలియక రాజంకి గొంతు వణికింది. మంచి వేళ, అప్పుడే ఒక ముత్తైదువ భవానిని రమ్మని పిలవడంతో భవాని మరేం అనకుండా వెళ్ళిపోయింది. రాజం ఇక్కట్టునుంచి తప్పుకుంది.

ఆ తరువాత జరిగిన స్వాగత కార్యక్రమంలోకూడా రాజం పాడలేదు; ఆ ముత్తైదువే మళ్ళీ పాడింది. ఆరతి కంచంతో బయటకు వెళ్ళే ముందు భవాని రాజంతో "రఘు అన్నయ్య ఊరుకోడు! నేనెందుకు ఇదే పాట పాడుతున్నాని తప్పకుండా అడుగుతాడు!" అని వాపోయింది.

'భవానికి పాటంటే ఇష్టం; ఎవరూ ప్రేరేపించకుండా పాడడం ఆమెకు అలవాటే కదా? కాని అన్నయ్యకి విరుద్ధంగా పాడదా? సరే, అదే నిజం కాబోలు," అని రాజం తనలో ఊహించుకొని నిట్టూర్పు వదిలింది.

అసలు భవానికి రఘుపతిపట్ల ఈ ధోరణి ఎందుకని రాజంకి తెలియదు.

భవాని భర్త సత్యమూర్తికి సంగీతంలో మంచి ప్రజ్ఞ ఉంది. అందువలన భవానికి భర్తంటే గర్వమనికూడా చెప్పవచ్చు. కాని అతనెప్పుడూ బార్య గాత్ర సంగీతం చులకన చెయ్యరు. రఘుపతికి అస్తమానం భవాని పాట విమర్శించే సహజగుణం ఉంది. భవాని ఏదైనా తెలుగు కృతి పాడితే "ఎందుకు నువ్వు ఎప్పుడూ ఇదే పాడుతావ్?" అని ఎగతాళి చేస్తాడు.

మరి ఈ సంగతి భవానికే తెలియనప్పుడు రాజంకి ఎలా అర్థమవుతుంది?

ఆ వచ్చే రోజుల్లో అలాంటి సంభవాలే రాజంని ఎదుర్కొన్నాయి.

ఒకనాడు జగత్పతిగారి భార్య వచ్చి రాజం నలుగు పెట్టే వేడుకలో పాడాలని, తను ఒక పాట నేర్పుతానని చెప్పింది. రాజం ఏమీ అనడానికి ముందే ఆవిడ పాట ఆరంభించేసింది: పెళ్ళికూతురు వేదికలో అందరిముందూ నిలబడి పెళ్ళికొడుకుని పిలవాలి; రాజంకి ఆ పాట దురుసుగా, పెడసరగా తోచింది.

తనకా పాట విపరీతంగా కనిపిస్తుందని, అందులోని మాటలు తను సరిగ్గా ఉఛ్ఛారణ చెయ్యలేననే సాకుతో రాజం వెనకాడింది.

ఆ తరువాతి పాట ఇంకా అధ్వానంగా ఉంది! వధువు సిగ్గు మాలి తన ప్రియుడిని బూతు మాటలతో పిలవాలట!

ఆ ముత్తైదువ తను పట్టినపట్టు విడువకుండా రాజం ఆ పాట పాడితీరాలని నొక్కిచెప్పడంతో రాజం "అయ్యొయ్యో!" అని కేకలు పెట్టింది.

"ఇదేంటి? పెళ్ళికూతురు పెళ్ళిలో ఇలా అపవిత్రంగా మాటాడితే ఎలాగ? నీకెందుకు కొత్త పాటలు నేర్చుకోడానికి భయం?"

"అదికాదు అత్తయ్యా, నేను పెళ్ళిలో పాడను!"

"ఏం? మరి సంగీతం ఎందుకు నేర్చుకున్నావ్?"

రాజం నోటినుంచి వెంటనే రాదలచుకున్న జవాబు ఒక్కటే: 'నేను నేర్చుకున్నది అమ్మకోసం.' కాని ఆమె బయట ఏమీ అనలేదు.

"మాటాడవేం? పెళ్ళిలో పాడకపోతే ఎందుకు సంగీతం నేర్చుకున్నావ్? నువ్వు కాదంటే అందరూ సరేలే అని వొదిలేస్తారా?"

"ఏం, నాకిష్టం లేదంటే నన్నెవరు బలవంతం చేస్తారు?"

"మరేం వాదించకు! పెళ్ళికూతురుకి హఠం కూడదు. ఈ నాలుగురోజులైనా పెద్దలు చెప్పినట్లు విను! 'నేను ఈ పూలు జుత్తులో పెట్టుకోను', 'తొమ్మిది గజాల చీర నాకు వద్దు!', "ప్రతీ బంధువుకి నేను నమస్కారం చెయ్యను!' అని అనడం నువ్వు మానుకోవాలి." అత్తయ్య కొంచెం గడుసుగానే మాటాడింది. రాజంకి నిరాశ ఇంకా బాగా పెరిగింది.

కొన్నిరోజుల తరువాత ఇంకొక ముత్తదువ -దొరస్వామి బంధువు - రాజంని పాడమంది. "నాకు జలుబుగా ఉంది . . . ఎలా పాడడం . . . ? అని సాకు చెప్పి రాజం తల్లిని చూసింది.

"ఐతే నువ్వు శృతి తగ్గించి పాడు!" అని ఆమె బోధన రాజంని అదరగొట్టింది. 'సరే, ఈవిడకి నిజంగా సంగీతంలో ఆసక్తి ఉంది కాబోలు!' అనే ఆశ రాజం మనస్సులో చోటుచేసుకుంది. ఇందకు ముందు భవాని కూడా కంఠం ఇబ్బంది పెడ్తే శ్రుతి మార్చుకొని - ఒక స్వరస్థాయినుంచి మరొక స్వరస్థాయికి పోవచ్చునని - చెప్పినది ఇప్పుడు రాజం గుర్తు చేసుకుంది. 'ఇదే మంచి ఉపాయం,' అని నమ్మింది; శర్మగారిని మళ్ళీ కలుసుకున్నప్పుడు తప్పకుండా అతనికి తన యుక్తి చెప్పాలని అనుకుంది. అదే ప్రకారంగా శ్రుతిపెట్టి సవరించుకొని పాడింది.

దేవుడా, ఎంత ఘోరం! ఆమె గాత్రం సర్వనాశనమైంది! కంఠంలోని మాధుర్యం పోయింది; అసలు రాజం పాడినట్టే లేదు! ముందు తన కంఠధ్వనిలో ఎంత విస్తారం కనిపించేది! ఇప్పుడు అదెక్కడ పోయింది? కళ్ళు తుడుచుకుంటూ రాజం తల్లిని చూసింది. విశాలం ముత్తైదువని "ఏమండీ, మీరు రాజంకి ఏమైనా మార్గం చూపిస్తారా? ఎవరైనా పాడమంటే దానికి ఒక్కటే భయం; అదిప్పుడు ఇంకా తీవ్రమైపోయింది. దానితోబాటు చలి, జలుబు కూడా! మీకేమైనా మంచి మందు తెలుసా?" అని అడిగింది.

ఈ దురదృష్ట అనుభవం వలన తల్లి రాజంని దగ్గరపెట్టుకొని అడిగిన మాటలు రాజంని ఓదార్చాయి.

"అదేమో, నాకు ఇంగ్లీషు మందులే తెలుసమ్మా!" అని ఆవిడ అన్నారు. "మీరు 'పెప్స్' అనే మందు విన్నారా? నేను జలుబుకి అదే వాడుతాను. రాజంకి అది ఇవ్వండి. నోటికి మిఠాయిలాగుంటుంది; మంచి మాత్రకూడా! పెళ్ళికూతురుకి ఎందుకు కషాయం?"

విశాలం నటరాజన్ కి రాజం మనోవేదన చెప్పింది. ఆ సాయంకాలమే ఆతను ఒక సీసా నిండా ఆ మాత్రలు కొనితెచ్చారు. "రాజం పాడాలని నేను ఇవి కొనలేదు," అని అతన్నారు. "అది పెళ్ళికూతురు; మరి నలుగురుతో కలిసి మెలిసి మాటాడాలికదా?"

శర్మగారు తను రాజం పెళ్ళికి రావడంలేదని రాసారు. అది చదివి రాజం ఒక నిర్ణయానికి వచ్చేసింది: 'ఏమైనా సరే, నేను పెళ్ళిలో పాడను!'

ఒక శుభదినం తాటాకులతో పందిరి వేసి, ముగ్గులతో అలంకరించిన తరువాత పెళ్ళి సంబరాలు ఆరంభమయ్యాయి.

పెళ్ళికి ముందురోజు వేదికని చేరుకోడానికి వరుడు కారులో సవారి చేసే ఉత్సవం కొనసాగింది. ఆ సమయంలో రాజం ఒంటరిగా ఒక గదిలో కూర్చొనివుంది. పక్కనే తాంబూలంతో కంచాలు, సరుకులతో పాత్రలు, పిండివంటలు, పూలగుత్తెలు, కుప్పవేసినట్టు ఉన్నాయి. రాజం కిటికీద్వారా పెళ్ళిపందిరి, వేదిక, అలంకారాలు చూసి నిట్టూర్పు విడిచింది. ఇంత ఆడంబరంగా ఏర్పాట్లు చేసిన పెళ్ళి ఆమె ఇదివరకూ చూడలేదు. 'సూర్యా, చిట్టీ, ఇక తన తక్కిన స్నేహితులు ఇవన్నీ చూస్తే ఎలాగ మురిసిపోతారు! దురదృష్టవశంగా శర్మగారూ రావడంలేదు; రాజం చూసిన సినిమాల్లో కథానాయకి చుట్టూ గుమిగూడిన సఖీమణులు ఎంత మంది! తనకేం ఈ గతి? ఏకాంతంగా తన భావాలను పంచుకోడానికి పక్కన ఎవరూ లేరు!' అని రాజం బాధపడింది. ఇంకా కొంచెం సేపట్లో ఊరేగింపు రాబోతుంది; రాజంకి కంగారు ఎక్కువైంది. మొట్టమొదటిసారిగా తను ఒక మగవాడిపక్కన కూర్చోవాలి! రాజం దేహం వణకడం ఆరంభించింది. కళ్ళు ఎర్రబడ్డాయి. రెండురోజులముందు రాజం వేదికలో ఏలా కూర్చోవాలని ఆమెకు నేర్పించారు. అప్పుడే రాజం ఒక తప్పు చేసింది: మఠం వేసి కూర్చున్నప్పుడు తప్పు కాలు ముందుకు పెట్టింది. రాజం అత్త వెంటనే ఆమెను ఇరుకుగా చేరుకొని చెవిలో హెచ్చరిక చేసింది. 'ఎందుకు నేనెప్పుడూ తప్పే చేస్తున్నాను?' అని రాజం తన్ను నొచ్చుకుంది. దగ్గరలో

"విజయాంబికే . . . ‘‘పాట ఎవరో పాడారు.  రాజం తలయెత్తి చూసింది; అందమైన ఒక యువతి   నడుములో ఒక చంటిపాపతో కనిపించింది.

'శ్రుతిపెట్టె లేకుండా పాడినా చెవులకి ఎంత ఇంపుగా ఉంది!' అని రాజం తనలో మెచ్చుకుంది.  శర్మగారి మాటలు గుర్తుకి వచ్చాయి.  అవును,  తమిళదేశంలో అందరిలో కర్ణాటక సంగీతంలో ఆసక్తి కనిపిస్తోంది.  ఆ తలపుతో రాజం బాధ ఇంకా ఎక్కువైంది.

'రాజం ఎందుకు ఒక్కసారైనా పక్కకి తిరిగి పెళ్ళికొడుకుని చూడటంలేదు?' అని నటరాజన్ విసుగ్గున్నారు.  అతనికి రాజం  పడుతున్న మనోవేదన తెలియదు.

పందిరిలో ఒకావిడ  "అమ్మాయిని పెళ్ళికూతురుగా చేసినప్పుడు వెల కట్టలేని వస్త్రాలూ,  నగలూ పెద్దారని విన్నాను; మరి ఇక్కడ అవేమీ లేవే?" అని అడిగింది.

శారదాంబాళ్ కూడా "అలంక్రియ కన్నికాదానమంటే వీళ్ళకు భయం కాబోలు! అవన్నీ కన్నికాదానంలో వొదిలేసారు! మరి ఇప్పుడు చెయ్యవచ్చుగా?"  అని ఎవరితోనో చెప్పిందని అక్కడ చెప్పుకున్నారు.

"నేననుకున్నట్టే అయింది.’ఇది సరిగ్గా లేదు', 'అది సరిగ్గా లేదు', అని అందరూ తప్పు పెడుతున్నారు," అని విశాలం నొచ్చుకుంది.  ఆ రాత్రంతా ఆమె నిద్రపోలేదు.

అలసటతోబాటు రాజం ఉత్సాహంతోనే కనిపించింది; రాత్రి బాగా నిద్రపోయింది. ఇంకా కొన్ని గంటలలో తనొకొక  కొత్త ప్రపంచం నిదర్శనమవబోతుందని గ్రహించింది.

"నీకు మాత్రం భయం అని అనుకుంటున్నావా? మరి నా గురించి ఆలోచించావా? నువ్వు నా పక్కన కూర్చున్నప్పుడు నేను చెమట కార్చుకున్నాను,  తెలుసా? నాకు ఏ అమ్మాయితోనూ చనువు లేదు!" అని  పెళ్ళైన తరువాత రఘుపతి తన మొట్టమొదటి భావనలు తనతో పంచుకున్నట్లు రాజం కల్పన చేసుకుంది.  ఈ వివాహదినం తనకి కొత్త అనుభవం; ఆ తరువాత వచ్చే రోజులన్నీ తన ఆదర్శ భర్తతో కొనసాగుతాయి.  అతనికి ఉద్యోగం దొరుకుతుంది; అతను ప్రేమానురాగాలతో తన్ను ఏలుకుంటాడు . . .

ఆ తరువాత, ఒకటి తరువాత ఒకటిగా జరిగిన లాలీ, ఉయ్యాలలాట, కన్నికాదానం, సప్తపది సంబరాల్లో వధూవరులు పూర్తిగా పాల్గొన్నారు.

అవాళ మధ్యాహ్నం నలుగుకి ఏర్పాటైంది.

రాజం నలుగులో ఏం జరుగబోతుందో కల్పన చేసుకుంది. పెళ్ళికూతురుగా నలుగులో ఏం చెయ్యాలో తనకి తెలీదని సాకు చెప్పాలి. అవును; అది విని అందరూ - రఘుపతితో కలిసి - నవ్వుతారు. 'కొత్త పెళ్ళికూతురు పలికే మాటలాయివి?' అని విడ్డూరుపడతారు . . . .

కాని అసలు జరిగినదేమో వేరు . . . .

నలుగులో వధూవరులు సరదాలూ, సరసాలమధ్య ఎగతాళీ, మోట హాస్యంకి గురి అవుతారని రాజం విన్నది; దానిగురించి వ్యంగ్య చిత్రాలూ, పరిహాస వర్ణనలూ ఆమె చూసివుంది.

హోమంలో చిరచిరలాడుతూ లేచిన పొగ రాజం ముఖంలో వ్యాపించింది. ఆయాసం దేహాన్ని, మనస్సుని పూర్తిగా కప్పుకుంది. ఉష్ణం, జ్వరం చోటుచేసుకున్నాయి.

మెడలోని పూలదండని తీసేసి రాజం పక్కనే ఒక బెంచిమీద పెట్టింది. చీర మార్చుకున్న తరువాత కుర్చీలో వాలింది. మనసంతా ఎక్కడో పోగట్టుకున్నట్లు భ్రమ!

"అమ్మా, నాకు జ్వరంలా ఉంది. కొంచెం రెస్టు తీసుకుంటాను."

విశాలం రాజం ముఖం చూసింది;కొత్త పెళ్ళికూతురుకి తగిన ఉత్సాహం అందులో కనిపించలేదు. కలవరపడుతూ రాజంని ఒక మూల పడుకోమంది.

అత్తయ్య మాటలు రాజంకి జ్ఞాపకంలో వచ్చాయి: పెళ్ళికూతురుకి ఏనాడూ మొండితనం కూడదని ఆమె అనలేదూ? నలుగులో తన సంగీత ప్రదర్శన ఏమవుతుందో అనే కలత రాజంకి. పెద్దలు చెప్పినట్టే తను కొట్టవచ్చే వస్త్రాలూ, నగలూ ధరించి, ఉంగరాల జుత్తుని బిగుంచుకొని (అవి ఆమె అందాన్ని కొంచెం

తక్కువగా ప్రకటించినా) దర్శనమివ్వలేదూ? తొమ్మిదిగజాల చీరకట్టుతో హోమంముందు నిలకడగా కూర్చోడానికి తనకి ఎంత బాధగా ఉందని ఎవరికైనా తెలుసా? అవును; పెద్దలమాటలు వినాలి. కాని తన కంఠం ఇబ్బంది పెడ్తూంటే పెళ్ళికొడుకు ముందు పాడి ఆత్మభంగం చేసుకోవాలా?

అతిథులందరూ - రాజంనే - శిరస్సునుంచి కాలివేలువరకూ తీక్షణంగా చూస్తున్నారు. విశ్రాంతిని ఆపుకొని రాజం లేచి కూర్చుంది. అందరూ అపరిచుతులే! వాళ్ళ ముఖాలు చూడడానికికూడా ఆమెకు ధైర్యం రాలేదు. కాని ఆ జనసమూహంలో చాలామందికి ఆమెను చూడాలనివుంది.

మొట్టమొదటగా భర్తతో కలిసి తను పంచుకున్న లడ్డు ఆమె ఆకలి తీర్చలేదు. రఘుపతి మిత్రులు కొందరు ఎగతాళిగా అతని అరటాకులోవున్న లడ్డు రాజం ఆకులోకి తోసారు. ఆ ఎంగిలి పంచుకొని రాజం తృప్తి పడింది.

సాంప్రదాయంగా రాజం పెళ్ళికొడుకుని నలుగుకి ఆహ్వానించాలి. అప్పుడే రాజం మనోభావాలు గడ్డకట్టుకున్నాయి; రఘుపతి ఆమె చెయి పట్టుకొని నడుస్తూంటే అతని మిత్రులు చేసిన అల్లరి ఇంతా అంతా?

రఘుపతి స్నేహితుడొకడు రఘుపతి తనకు తెలిసిన ఒక పద్యంలో ప్రియుడు కన్నుకొట్టుతూ తన ప్రియురాలితో పలికిన సందేశం ఆలపించమన్నాడు. "నువ్వు కొన్నిరోజులుగా ఈ పద్యం అభ్యాసం చేస్తున్నావని విన్నాను. ఏదీ, మేం విందాం!" అని అన్నాడు. ఇంకొక మిత్రుడు రఘుపతి రాజరాజేశ్వరీదేవిమీద పాడితే పెళ్ళికూతురుకి సమయోచితంగా ఉంటుందన్నాడు. రాజంకి 'అమ్మోయ్, ఈ మిత్రులందరికీ సంగీతంలో ఇంత ఆసక్తి ఉందా?' అని అనుమానం కలిగింది. ఆ తలపే ఆమెను అదరగొట్టింది. 'ఎవరికి తెలుసు? తమిళదేశంలో ఈగలకీ, కాకులకీకూడా సంగీతంలో అభిరుచి ఉంది కాబోలు!" అని తనలో చెప్పుకుంది.

దొరస్వామి అయ్యరు తన నాన్నగారికి చెప్పిన మాటలు ఆమెకు జ్ఞాపకంలో వచ్చాయి. "ఈ పెళ్ళి తమిళదేశంలో జరపాలని మీరన్నది నాకు చాలా నచ్చింది,"

అని అతను అనలేదూ? "రఘుపతి కూడా తన మిత్రులందరూ పెళ్ళికి వస్తారని ఆశపడుతున్నాడు."

ఈ రోజు తన గానం రాణించకపోతే రఘుపతి ఏమాత్రం లెక్కచెయ్యకపోవచ్చు; రాజం సంగీత ప్రజ్ఞ అతను నేరుగా ఇంతకుముందే తెలుసుకున్నాడుగా? మరి అతని మిత్రులో? వాళ్ళముందు అతను అవమానంకి గురి ఆవాలా? అంటే అది రాజంకీ ఆత్మభంగమేకదా?

రాజం వేదికమీద కూర్చొని నిదానంగా తలయెత్తిచూసింది. సభ నిండియుంది; రంగస్థలంలో ఒకపక్క హార్మోణియం; ఇంకొకపక్క వీణ, వయలిన్. వీణ వాయించడానికి సిద్ధంగా ఒక యువతి కూర్చొనివుంది. రాజంకి చేతులు వణికాయి. నుదుటలో చురక; గుండె బరువుగానూ, దేహం నీరసంగానూ అవడంతో భరించలేని తలనొప్పి కలిగింది.

"పెళ్ళికూతురు ముందు పాడనీ! మేం తరువాత పాడతాం," అని ఎవరో అన్నారు.

తడిసిన కళ్ళతో రాజం తల్లి ముఖం చూసింది. పాడమని సైగ చేస్తూ విశాలం తల ఊపింది. కాని రాజం 'పాడను!' అని వెంటనే తల పక్కకి తిప్పింది.

విశాలం దగ్గరకు వచ్చి "రాజం, నీకు పాడడానికి భయంగా ఉంటే వయలిన్ వాయించు; సరేనా?" అని ధైర్యం చెప్పింది.

'వాయించను!' అనే సూచనతో రాజం మళ్ళీ జవాబు చెప్పింది.

"తలవొంచుకొని భయం లేకుండా వయలిన్ వాయించడం నీకు అలవాటేకదా? *'నిన్ను వినా నామదెందు'* వాయించు; ఒకపాట చాలు . . ." అని విశాలం బతిమాలింది.

రాజం మౌనం వహించింది.

"పెళ్ళికొడుకూ, అతని మిత్రులూ నీ ప్రదర్శన ఆశతో ఎదురుచూస్తున్నారు: నువ్వు మొండిపట్టుపడితే ఎలాగ?"

"నాకు జ్వరంగా ఉంది". కళ్ళనుంచి ఒక బొట్టు కిందకి రాలింది.

"కూర్చోడానికి నీకు బాధగా ఉందా? కొంతసేపు పడుకోవాలని ఉందా?"

"అవును."

"నలుగు ఐపోయినవరకూ కాచుకొని ఉండలేవా . . ."

"లేను!"

రఘుపతి పీఠంనుంచి చివాలున లేచాడు. రాజమూ కన్నీరుతో లేచి చుట్టుపక్కలు చూస్తూ నిలబడింది.

"విన్నావటే? . . . . పెళ్ళికూతురు నలుగులో పాడదట!" అని రాజంని అందరూ నిందించడం ఆరంభించారు.

రాజం ఏడుస్తూ మళ్ళీ బెంచిమీద ఆశ్రయం కోరింది.

'ఇది నాకు అవమానం కాదా? నాకందరిముందూ పాడడానికి దడుపుగా ఉందని అక్కడున్నవారికెవరకీ బోధపడదేం? కొత్త పెళ్ళికూతురు పడే బిడియం అర్థం చేసుకోకుండా నాపై నేరం మోపడం న్యాయమేనా? ఈ నలుగు నేనే నాశనం చేసినట్టు వీళ్ళందరూ మాటాడుతున్నారే? . . . '

జనమంతా గోలపెట్టారు. త్వరలో చెల్లాచెదరిపోయారు.

"ఇదేం ఘోరం . . . . నా మాట మన్నించి రఘుపతి నలుగు పెట్టడానికి సరే అన్నాడు. అమ్మాయి ఆంధ్రదేశంలో పెరిగింది - అమాయకురాలు - అని అందరూ అన్నారు. కాని ఇలా హఠం చేస్తుందని ఎవరికి తెలుసు?" అని వియ్యాలవారి పక్షంలో ఒక ముత్తైదువ గొంతు చించుకొని కేకలు వేసింది,

రాజం మనస్సుకి తన ప్రవర్తన, తను చూపిన నిగ్రహం న్యాయమే అని తోచింది. కాని తప్పు తనదే అని అందరూ అంటున్నారు . . . .

"నాకు చావాలని ఉంది! నీవలన అంతా పాడైంది! ఇక వియ్యాలవారి మొహం నేను చూడడం ఎలాగ? ఒక కత్తి తీసుకువచ్చి నా మెడ కోసుకుంటాను!" అని విశాలం బొబ్బలు పెట్టింది.

"ఇది నాకు జరుగుతున్న పెళ్ళి! ఈ బాధంతా నా మెడకే!" అని రాజం తల్లిని చూసి ఎగతాళి చేసింది.

"ఈ పిల్ల పెద్ద వదరుబోతుగా కనిపిస్తోంది!" అని పక్కనేపున్న అత్త ఎత్తిపొడిచింది.

## 9

'అందరూ నన్నే తప్పుపెడుతున్నారు!' అని తనలో అనుకుంటూ రాజం ఏడ్చింది.

"నీ మామగారు వస్తున్నారు. లేచి అతనికి నమస్కారం చెయ్!" అని విశాలం కూతురుకి ఓర్పుతో చెప్పింది.

'ఎందుకు నమస్కారం? నేనేం తప్పు చేసానని?'

దొరస్వామి, నటరాజన్ గదిలో ప్రవేసించడానికి ముందు ఒక నిమిషం ద్వారం దగ్గర ఆగారు; రాజం ఇంకొకసారి వెక్కి ఏడ్చింది. ఆమె మనసులో ఎటువంటి కళంకమూ లేదు; తన అంతరాత్మలో ఉన్న వేదన ఇతరులు అర్థం చేసుకోవాలని అమె అందరినీ వేడుకుంటోంది.

ఇక్కడకి రావడానికి ముందే దొరస్వామి తనింటివారికి హెచ్చరికచేసి వచ్చారు. "అయినదేమో అయిపోయింది. ఏం జరిగిందో మళ్ళీ మళ్ళీ ఎవరూ మాటాడవద్దు! మన పక్షంలో ఎవరూ వియ్యాలవారిని విమర్శ చెయ్యరని నేను వాళ్ళకి వక్కాణించి చెప్పబోతున్నాను," అని అధికారధ్వనిలో ప్రకటన చేసివచ్చారు.

"నీకు జ్వరమని విన్నాను; అందుకే నిన్ను చూసిపోదామని వచ్చాను. నా భార్యకిగాని, రఘుపతికిగాని నీపై ఎటువంటి ఇబ్బందీ లేది. నువ్వెప్పుడూ సంతోషంగా ఉండాలి. అదే మా ఆశ, "అని రాజంని ఓదార్చారు.

'ఎంత ఉదాత్తమైన హృదయం ఇతనికి!' అని విశాలం, రాజం మురిసిపోయారు. నటరాజన్ కి అటువంటి ఆలోచనేమీ రాలేదు. అసలు రాజం తను నలుగులో పాడనని చెప్పడంలో తప్పేం లేదని అతని దృఢమైన భావన.

నటరాజన్ తన తోటల్లుడుకి చెప్పారు: " ఒక పదిహేనేళ్ళ పిల్ల పెళ్ళిపీటలో కూర్చొనే విధం వేరు; ఒక ఇరవైఅయిదేళ్ళ యువతి తీరు వేరు. ఇరవైఅయిదేళ్ళ పెళ్ళికూతురులో భయం, బిడియం కనిపించవు. ఈ ఊరులో జరిగిన పెళ్లుల్లో రాజంలాగే ప్రవర్తించిన పిల్లల్ని ఎవరూ చూడలేదంటున్నారా? రాజం సహజంగానే సాధువు; అందరితో కలసిమెలిగే స్వభావం దానికి లేదు; ఇదెందుకు ఎవరికీ బోధపడదు?"

"నటరాజన్, కొంచెం మెల్లిగా మాట్లాడండి! పెళ్ళైపోయిందనే గర్వంతో మీరిలాగ అంటున్నారని ఎవరైనా నిందించగలరు!" అని తోటల్లుడు హెచ్చరిక చేసారు. కాని నటరాజన్ వెనకాడలేదు. "మొట్టమొదట మా అల్లుడు రాజేశ్వరిని చూడడావికి వచ్చినప్పుడు నేను అతన్ని రాజం ఎదురుగా కూర్చోబెట్టాను. అతను ఒక వార్తాపత్రికని విప్పి చదవడం ఆరంభించారు! నాకు అదరగొట్టినట్టనిపించింది. 'సరేలే, చిన్నవాడు; సిగ్గు పడుతున్నాడు," అని అర్థం చేసుకున్నాను," అని అన్నారు.

ఇన్ని రోజులతరువాత నటరాజన్ కి ఆ పాత ఘటన జ్ఞాపకంలో వచ్చింది. ఆ రోజు తనలో వెంటనే కలిగిన నిరుత్సాహం తలచుకొని అతను ఇప్పుడు నవ్వుకున్నారు.

ఆ రాత్రి ఔపాసన సంస్కార సమయంలో పెళ్ళికూతురు రాజం పెళ్ళికొడుకు రఘుపతి చెయి పట్టుకొని అతని వెనుక నడిచింది. మౌనంగా కొంచెం సాహసంతోనే భర్తను నేరుగా చూసింది. అంతకుముందే రఘుపతి మిత్రులు తమ కొంటి చేష్టలన్నీ మూటగట్టేసారు. విశాలం రాజం రఘుపతిని కలుసుకోవాలని ప్రేరేపించడంతో రాజం తన ఎడం కన్నుని ఎడంచెయ్యితో రుద్దుకుంటూ కుడిచెయ్యిని చాటి రఘుపతి కరం అందుకుంది. ఆమె బిడియం రఘుపతికి నచ్చింది; వరుడుగా తనకి ప్రత్యేక

అధికారముందన్న భావంతో అతను ముందుకు నడిచాడు. ఆ రాత్రి నిద్రపోవడానికిముందు రాజం 'అతను మంచివారు,' అని తనలో చెప్పుకుంది. అన్ని రకాల ఆలోచనలూ ఆమె మనసునుండి వెలువడ్డాయి.

'నేను తెలివితక్కువగా ఏమైనా చేసిపుంటే నన్ను మన్నించండి!' అని భర్తకి తను ఒక చీటీ రాస్తే బాగుంటుందా? కాని అతన్ని ఎలా పిలవడం? 'ప్రియమైన ప్రాణనాథా' అంటే బాగుంటుందా? ఛీ, ఛీ . . . అదేం కూడదు! నిజంగా నేనలా రాస్తే పెంకిపిల్ల అని అందరూ ఎగతాళి చేస్తారేమో? సరే, మరెవరి మూలంగా అతనికి చీటీ పంపిస్తే? హూహూం, అదేం కుదరదు!'

అఖరికి పెద్దమనసుతో రఘుపతి తన్ను అప్పుడే క్షమించడమైందనే నమ్మకంతో రాజం నిద్రపోయింది.

ఆ మరుదినం ముందురోజులాగ రఘుపతిలో ఉత్సాహం కనిపించలేదు. అతని మనసులో ఇంకా విడిపోని చిక్కు ప్రశ్నలు: 'ఎందుకు రాజం పెళ్ళిలో ఏడ్చింది? అందులో ఉన్న మర్మమేమిటి? తనకి పాడడానికి ఇష్టం లేదంటే సరే, కాని ఎందుకు టెక్కిటెక్కి ఏడవాలి? రాజంకి ఈ సంబంధం నచ్చలేదా?' రఘుపతికి భవాని పెళ్ళి జ్ఞాపకం వచ్చింది: 'భవాని ఆ రోజు ఎంత చక్కగా అందరినీ ఆకర్షించింది! సత్యమూర్తి తన ఆదర్శభర్త అని ఎలాగ మురిసిపోయింది!'

పెళ్ళైన తరువాత కొన్ని సంగతులు వినడంతో రాజంకి తృప్తి కలిగింది. "ఊరేగింపులో రాజం ముఖం కోవిల ప్రతిమలాగ ప్రకాశించింది; నలుగులోలాగ ఆమె పిచ్చిపనులేం చెయ్యలేదు. వధూవరులిద్దరూ చాలా ముచ్చటగా కనిపించారు. అప్పుడప్పుడు రఘుపతి చమత్కారంగా, హాస్యంగా ఏమైనా చెప్పినాకూడా రాజం నవ్విందికాదు. ఆమెలో ఉన్న హోదా, గౌరవం అందరికీ తెలిసింది," అని ఎవరో అన్నారు. కాని నటరాజన్ అభిప్రాయం వేరు: 'నలుగు తరువాత రాజం ఎందుకు ముసురుమూతిగా కనబడుతోంది?' అని అతనూ ఆలోచించారు. రఘుపతికూడా

'కారులో సవారి చేసినప్పుడు రాజం పిల్లల్నే చూస్తూ వచ్చింది. పొరపాటునైనా ఒకసారికూడా కుడిపక్కతిరిగి నన్ను చూడలేదే!' అని ఆశ్చర్యపడ్డాడు.

కొన్నిరోజులతరువాత వధూవరులు స్టూడియోకివెళ్ళి ఫోటో తీయించుకున్నారు. అప్పుడుకూడా వాళ్ళిద్దరూ ఒకరినొకరు నేరుగా చూసుకోలేదు, మాటాడలేదు. కాని ఇద్దరి ముఖాల్లోనూ కాంతి, స్నేహభావం కనిపించడమేగాక, అప్పుడప్పుడు చిరునవ్వులుకూడా చోటుచేసుకున్నాయి. రఘుపతి కళ్ళలోని వలపు రాజంని పులకరించింది; మళ్ళీ మళ్ళీ అతన్నిచూసి పరవశపడింది. ఇద్దరిమధ్య మరేం దూరం లేదు; ఆచారాలూ, సంప్రదాయాలూ నిక్కుటంగా లేపిన తెర క్రమంగా జారిపోయింది. 'అవును, మేం ఇద్దరం ఒకటే!' అనే భావం ఇద్దరికీ కలిగింది.

ఇంకా నాలుగు రోజుల్లో నటరాజన్ దంపతులూ, పిల్లలూ జగత్పతిగారి ఇల్లువొదిలి తమ ఊరికి తిరిగు ప్రయాణం చెయ్యబోతున్నారు. తన చిన్నతమ్ముడ్ని నడుంలో ఆణుచుకొని రాజం ఇంటిముందున్న తోటలో మొక్కలూ, పూవులూ చూస్తూ నిలబడింది. 'కొన్ని విత్తనాలూ, అంటుమొక్కలూ ఊరుకి తీసుకువెళ్ళాలి,' అని ఆలోచించింది.

"చూసావా? ఆ అమ్మాయే! . . . నలుగులో పాడనంది . . . ."

అకస్మాత్తుగా ఆ మాటలు విని రాజం తిరిగి చూసింది. ఇద్దరు స్త్రీలు తమలో నవ్వుకుంటూ గేటుదాటి వెళ్తున్నారు.

తనకి ఎటువంటి పరిచయంలేని స్త్రీలుకూడా తన్ను ఎగతాళి చేస్తున్నారని రాజంకి అర్ధమైంది.

'అమ్మా! నేను అత్తమామల దగ్గర మంచి పేరు, ప్రతిష్ట తెచ్చుకోవాలని నీవన్నావ్. వాళ్ళసంగతెందుకు? ఈ ఊరిలో అందరూ నన్నే తప్పుపెడుతున్నారు! ఇక నేనేం చెయ్యను?' అని రాజం మొరపెట్టుకుంది. అప్పుడే రఘుపతి గేటు దగ్గర వచ్చి నిలబడి తడిసిన రాజం కళ్ళకి కనిపించాడు.

'ఇప్పుడు తనేం చెయ్యాలి? ఇంట్లోకి పారిపోవాలా? . . కాదు . . .. గేటు తెరిచి అతన్ని ఆహ్వానించాలి.'

రాజం గేటు తెరుస్తూంటే రఘుపతి "నాన్నగారు ఉన్నారా?" అని అడిగాడు.

"స్నానం చేస్తున్నారు," అని రాజం చెప్పింది. రఘుపతి ఆమె ముఖం గమనించాడు: ఏడ్చిందా? ఏం, ఎందుకు?

రఘుపతి ఇంటిలోకి ప్రవేశించాడు.

రఘుపతి తన నాన్నగారికీ, జగత్పతిగారికీ చెప్పిన మాటల్లో కొన్ని యదేచ్ఛగా రాజం చెవులకి అందాయి. కాని ఏమీ ఎరుగనట్టు ఒకమూల నిలబడి ఆ సంభాషణ వినడానికి రాజం ఇష్టపడలేదు.

"నేను జానవాసంకి దుస్తులు కొన్న తరువాత మిగిలినది మీకు ఒప్పగించడానికి వచ్చాను," అని అన్నాడు రఘుపతి. నటరాజన్ వద్దని బలంగా ఆక్షేపణ తెలిపినా తను ఖర్చు చెయ్యని రొక్కం వాపసు చేసితీరాలని రఘుపతి నొక్కి చెప్పాడు. అతని ధోరణి రాజంకి నచ్చింది.

రఘుపతికి విశాలం కాఫీ ఇచ్చి అతని పక్కన నిలబడడంచూసి రాజం వాళ్ళని దాటుకొని వెళ్ళింది.

"మీరిద్దరూ మా నాన్నగారి ఔదార్యంగురించి చెప్పారు; కాని నన్నడుగుతే అది మా అమ్మలో పదింతలు ఎక్కువగా ఉందంటాను. పది దొరస్వాములు ఒక శారదాంబాళ్ కి సమానం! అంటే పది తులాల ముతక బంగారాన్ని చెడగొట్టి ఒక గొలుసు చెయ్యడంలాగ! మా అమ్మ ఉదారగుణం ఎవరికీ రాదు!" అని రఘుపతి అన్న మాటలు రాజంకి వినిపించాయి.

"నాకూ అలాగే అనిపిస్తోంది: మీ అమ్మగారు చాలా అద్భుతమైన మనిషి! రాజం నిజంగా అదృష్టవంతురాలు!"

ఆ తరువాత విశాలం ఏమందో రాజంకి తెలియదు.

'చెడగొట్టాలా? ఎందుకితను ఇంత కఠినమైన మాటలు వాడుతున్నారు?" అని రాజంకి దిగ్భ్రాంతి కలిగింది. 'అతనికి తల్లిమీద గాఢమైన అభిమానం ఉన్నా ఒకింత ఆగి, చెవికి ఇంపుగా వేరే పదం వాడియుంటే ఎంత బాగున్ను! అని తనలో చెప్పుకుంది.

ఐనాకూడా రఘుపతి మాటలు రాజంని శాంతపరిచాయి: మామగారికన్నా అత్తగారికి ఉదారగుణం ఎక్కువంటే ఆవిడ తప్పకుండా తన పొరపాట్లు క్షమిస్తారు, తెలివి, ప్రియంతో ఆదరిస్తారనే నమ్మకమూ కలిగింది.

'నా భర్తకి తన తల్లిపై అభిమానం ఉందంటే నాకది పెద్ద భాగ్యం!' అని రాజం గర్వపడింది. సాధారణంగా కుటుంబాలలో చిక్కు ప్రశ్నలకూ, మాటిమాటికీ కోడలు, అత్తగారి మధ్య జగడాలకూ భర్త తన తల్లీ భార్యలమధ్య నిష్పక్షపాతంగా ఉండకపోవడమే మూలకారణం అని రాజం విన్నది. దేవుడిదయవల్ల తన భర్త అలాంటివాడు కాదనే సంతృప్తి కలిగింది.

"మీరు రాజంకి ఏమైనా చెప్పాలంటే ఇది మంచిసమయం," అని రఘుపతికి నటరాజన్ గుర్తుచేసారు. కాని రఘుపతి "చెప్పడానికి ఇప్పుడేం లేదు; ఎలాగా మీరు ఊరుకి తిరిగివెళ్ళేముందు మా అమ్మా, నాన్నని కలుసుకుంటారుకదా? వాళ్ళు మీకు అన్నీ చెప్తారు," అన్నాడు. 'ఏంత వినయం! ఎంత మర్యాద!' అని రాజం భర్తను మెచ్చుకుంది. 'ఇతనేనా ఆనాడు ఊరేగింపులో సూటూ బూటు వేసుకొని అందరిముందూ ఆర్భాటం చేసిన మనిషి? స్టూడియోలో నన్ను అనురాగంతో చూసి చిరునవ్వు నవ్వారు! అవును, ఇతను నిజంగానే ఉత్తమ పురుషుడు!' అని గర్వపడింది.

ఇంటికి తిరిగిరావడానికిముందు అత్తమామలదగ్గర సెలవు పుచ్చుకున్నప్పుడు ఆమెలో మళ్ళీ ఆనందం, గర్వం చోటుచేసుకున్నాయి.

నటరాజన్ తన భార్య, పిల్లలతో దొరస్వామిని దర్శనం చేసుకున్నారు.

"మీ భవాని కానుపుకి రాజంని పంపమంటారా?" అని విశాలం శారదాంబాళ్ ని అడిగింది.

"వద్దు! వద్దు! మాకవన్నీ అలవాటులేదు," అని శారదాంబాళ్ చెప్పింది.

దొరస్వామి నటరాజన్ని "మీరెందుకు రాజంని కాలేజీలో చదివించకూడదు? ఎందుకు ఉత్తికే అమ్మాయి ఒక సంవత్సరం ఇంట్లో కూచోవాలి?" అని అడిగారు. నటరాజన్ రఘుపతి ముఖం చూసారు. అంతలో శారదాంబాళ్ "మగవాళ్ళందరూ అలాగే అంటారు! మీరు రాజంకి వంట, తక్కిన ఇంటిపనుల్లో శిక్షణ ఇవ్వండి. అంత చదువూ చదువుకొని ఆఖరికి మొగుడికి రుచిగా, శుచిగా భోజనం వడ్డించలేకపోతే ఏం లాభం? ఇంతకీ వీళ్ళు కాపురం ఎక్కడ పెడతారని మనకి తెలియదుకదా?" అని చెప్పింది. ఆమె విశాలంని చూస్తూ మాటాడినా అక్కడున్న అందరూ ఆమె మాటలు విన్నారు.

నటరాజన్ నవ్వుతూ తలవూపి ఆమ సలహా ఆమోదించారు. "అవును, మీరన్నది నిజం. రాజం కాలేజికి ఎందుకు వెళ్ళాలి? ఇంట్లోనే అన్నీ నేర్చుకోవచ్చుకదా? కుట్టుపని, టైపింగ్ - ఇవన్నీ ఆమెకు అందుబాటులో ఉన్నాయి; వాటితో మంచి ఇల్లాలుగా రాణించవచ్చు. ఈ పెళ్ళి ఒక సంవత్సరం దాటి జరిగివున్నా, నాకు రాజంని కాలేజీకి పంపించే ఉద్దేశం లేదు. ప్రస్తుతం మా కాలేజీలో చదువుతున్న ఆడపిల్లలగురించి నాకు బాగా తెలుసు; ఎదిచేసినా ఇతరులు ఎవరేమంటారో, ఏమనుకుంటున్నారో అనే భయం వాళ్ళని ఎప్పుడూ పీడిస్తూవుంటుంది. విశ్రాంతి సమయంలోకూడా ఎవరూ బయటికి రారు! పాఠాలు తప్పిస్తే మరేం ఆటాపాటల్లో జోక్యం చేసుకోరు! అందువలనే ఆడపిల్లలకి ప్రత్యేకంగా కాలేజీ ఉండాలంటాను. అప్పుడే వృధాగర్వానికి, ఆడంబరానికి చోటుండదు; వాళ్ళు స్వేచ్ఛగా అందరితోనూ కలుసుకుంటారు; టెన్నిస్, బేడ్ మింటన్ ఆటల్లో పాల్గొంటారు. మా ఊరులో మహిళా కాలేజీ రానివరకూ రాజంని మరెక్కడా చదివించే ఆలోచన నాకు లేదు. రాజం ఇంట్లోనే అన్నీ నేర్చుకోవాలని మా ఉద్దేశం!" అని ప్రొఫెసరు శైలిలో అతను వివరించారు.

దొరస్వామి చిరునవ్వు నవ్వి "మరి మా అబ్బాయేమంటాడో విందాం!" అన్నారు.

ఇప్పుడే రఘుపతి తన అభిప్రాయం తెలియజేసాడు. "అమ్మా, నాన్నా చెప్పేది సరే అని నా ఉద్దేశం. ఇంటర్మీడియట్ చదువు - తన పేరుకి తగినట్టుగా ఒక అసంపూర్ణ చదువే! B.A, B.Sc. చదవడానికి ఇష్టంలేనప్పుడు కాలేజీ చదువులో ఎటువంటి లాభమూ లేదు. రాజం ఇంట్లోనే ఇంగ్లీషు సాహిత్యం, అన్ని రకాల పుస్తకాలూ చదవనీ." రఘుపతి రాజంని నేరుగాచూసి పలకకపోయినా రాజం కళ్ళు అతన్నే రెప్పలార్పకుండా చూసాయి.

"ఇంగ్లీషులో కనిపించే గాంభీర్యం మరేభాషకైనా ఉందా?" అని నటరాజన్ రాజంని అడిగేవారు. "తమిళభాష గురించి మనం గొప్పగా చెప్పుకోవచ్చు. కాని సాహిత్యరచన అనే మాటకు వస్తే ఇంగ్లీషుకి ఏదీ సాటిరాదు!" అని అతను అనేవారు. ఇప్పుడు రఘుపతికికూడా ఆంగ్లభాషలో ఆసక్తి ఉందని రాజంకి తెలిసింది; 'మహాత్మా గాంధీ, అతని అనుచరులు ఆంగ్లేయుల పరిపాలననే విరోధించుకున్నారు, ఆంగ్లభాషని కాదు,' అని రాజం గుర్తు చేసుకుంది.

## 10

రాజం మనసులో తీయని కలలు కొనసాగుతూనేవున్నాయి.

భర్త రాసిన ప్రేమలేఖలు అందుకున్నవెంటనే - చదవకముందే - ఆమె మురిసిపోయింది. తక్కిన సమయాల్లో దినమూ చెయ్యవలసిన సాధారణ, చిల్లర పనులలో కలుసుకుంది. పెళ్ళి వివరాలు తెలుసుకోవాలని వచ్చిన స్నేహితులకూ, ఇతరులకూ, చీరలూ, ఫోటో ఆల్బం చూపించింది. ఎవరైనా "నీ పెళ్ళి ఈ ఊరులో ఎందుకు చెయ్యలేదు? మీ తమిళనాడులో ఎక్కడికో పారిపోవాలా?" అని అడిగితే రాజంకి "ఇక్కడ పెళ్ళైవుంటే నాకెటువంటి చెడ్డపేరూ వచ్చివుండదు!" అని కేకేయాలని అనిపించింది. పాటమాష్టరుగారుకూడా "తమిళనాడులో నీ గానంకి మంచి పేరు వస్తుందని నేను ఆశపడ్డానమ్మా. కాని అలాగ జరగలేదు; నువ్వే పాడుచేసుకున్నావు," అని అన్నారుగా?

"నేను శ్రుతి తగ్గించి పాడాలని చూసానండీ! కాని నా కంఠం గడ్డకట్టిపోయింది," అని రాజం ఏడుపుతో చెప్పింది.

"నీకు అలవాటైన శ్రుతిలోనే నువ్వు పాడితే సరిపోయున్ను. నువ్వెందుకు శ్రుతి తగ్గించావ్? ఇక్కడ చలి, జలుబులోకూడా నువ్వు కంఠం సవరించుకొని అందరిముందూ పాడేదానివి; అదెలా మరిచిపోయావ్? నువ్వు శ్రుతి తగ్గించి పాడతావని నేనెప్పుడూ అనుకోలేదు!" అన్నారు శర్మగారు.

రాజంకి అంతా అర్ధమైంది,

"అలాగా? ఐతే నేనే పొరపాటు చేసినన్నమాట! మా అత్తగారింట్లో నన్ను పాడమన్నారు; వెంటనే పాడకపోతే నన్ను మొండి, హఠం చేస్తున్నానని అంటారేమో అని నాకు భయం. స్వభావంగా నాకున్న సిగ్గు, పిరికితనం నన్ను అడ్డగొట్టాయి. నేను ఈ దిగులూ, గాభరా మానుకోవాలి! అప్పుడు నేను బాగా పాడగలను!" అనే ఆత్మవిశ్వాశం కూడా ఆ తరువాత రాజంకి కలిగింది.

తనకొక శ్రుతిపెట్టె కొనమని రాజం తల్లిని చికాకు పెట్టింది. దానితో మాష్టారుగారి సహాయం లేకుండా పాఠాలు అభ్యాసం చేసింది.

రాజం మనసులో రఘుపతి పలువిధాలుగా చోటుచేసుకున్నాడు: రాజం ఊహాప్రపంచంలో రఘుపతి తను నవ్వి ప్రియురాలిని నవ్వించాడు; లాలించాడు; బుజ్జగించాడు; కొంటెమాటలూ, హాస్యకథలతో వినోదపరిచాడు. ఇద్దరూ అనురాగాలూ, ముచ్చటలూ అతిశయంగా పంచుకున్నారు.

రాజం మనసులో ఎటువంటి నిరాశా చోటుచేసుకోలేదు. వినయంతో భర్తకి లోబడి అనుచరించే భార్యగా రాజం తన్ను కల్పన చేసుకుంది. తనకి చీరలూ, నగలూ వద్దు; డాంబీకం లేని ఆచారాలతో ఆదర్శపత్నిగా తను జీవించాలి. తను కథల్లో చదివిన భార్యలలాగకాదు. సాధారణ విషయాల్లో భర్తమనసు పాడుచెయ్యకూడదు. తనకీ, అత్తగారిమధ్య ఎటువంటి జగడమూ రాకూడదు. ఏమైనాసరే, తనొక ఘోరమైన కోడలుగా అవకూడదు!

తన ఇంట్లోనూ సరే, అత్తగారిల్లయినా సరే తను మంచి పేరు తెచ్చుకోవాలి. సహజంగా తనకున్న సిగ్గుచూసి కొందరు తన్ను తప్పుపెట్టవచ్చు. 'కాని నా భర్తకీ, అతని మనుషులకి మంచి మనసు ఉంది' అనే నమ్మకం రాజంకి కలిగింది.

అల్పవిషయాలేగా సరిదిద్దుకపోతే పెద్దవిగామారి అన్నిరకాల జగడాలికి దారి తీస్తాయి? రాజం ఒక చిన్న పొరపాటు చేసింది; అదే పెద్ద గొడవకి కారణమైంది. ఇక మనఃపూర్వకంగా తను ఏదైనా పూనుకుంటే విజయం ఖాయం. ఆ నమ్మకమే రాజంకి స్థిరమైన ఆదరణ ఇచ్చింది. సాధ్యమైనంతవరకూ తను అత్తగారికి సేవ చెయ్యాలి. ఏదైనాసరే, ఆవిడ అడగడానికిముందే తను అది ఆవిడకి అందించాలి.

భార్యాభర్తలమధ్య కలిగే అలుపు, నిరాశలకి మూలకారణం చీరలే అని రాజం ఉద్దేశం. అలాంటి ఎరలకు తను గురి అవకూడదు; అమ్మను చూసి తను నేర్చుకోవచ్చుగా? అమ్మ ఏది కొన్నా ఎందుకని నాన్నగారు ఎప్పుడైనా అడిగారా?

రాజేశ్వరి తనలో నవ్వుకుంది. మనసులో ఒక పాత జ్ఞాపకం . . .

ఆ సమయం యౌవనంలో రాజం చీరకట్టడం ఆరంభించింది. వోణీలకి బదులు చీరలే ఆమెకు నచ్చాయి. ఒకసారి విశాలం ఇరవైనాలుగు రూపాయలకి ఆరు చీరలు కొనింది. అవి బాగున్నాయి అని నటరాజన్ కూడా అన్నారు. ఒక నెల తరువాత విశాలం ఆరు రూపాయలకి మరో రెండు చీరలు కొనితెచ్చింది.

కొత్తచీరతో వికశించిన పువ్వులాగ రాజం నాన్నగారిని నమస్కరించింది. అప్పుడు నటరాజన్ మనస్థితి ఎలాగుందనో లేక అతనికి కూతురుకి చీరల్లో వ్యామోహం విపరీతంగా పెరిగిపోయిందనే భయమో అని ఎవరికీ తెలియదు.

"ఇంతవరకూ నువ్వెన్ని చీరలు వాడావు?" అని అతను అడిగారు.

"దీనితో ఎనిమిది," అని అంటూ రాజం వొంగింది.

"నీకు చీరలపిచ్చి పోవాలని నా శుభాకాంక్షలు!"

ఆ మాటలు వినగానే రాజం పరుగులు పెట్టింది. ఆడంబరంగా స్త్రీలు చీరలు కూడబెట్టుకోడం అతనికి ఇష్టం లేదని రాజంకి తెలుసు; ఏనిమిది చీరలు ఎక్కువే అని తనూ ఒప్పుకుంది.

"బాగుంది, దీవించడం అంటే ఇదే కాబోలు! రాజంకి చీరలంటే ఇష్టమని నేనే దానికి కొనితెచ్చాను. రాజం చేసిన పొరపాటు ఒక్కటే; నాన్నగారి ఆశీస్సులు కోరడమే! ఏమీ అడగకపోతే ఇలాంటి 'వరాలు' వచ్చివుండవు!" అని విశాలం తన అసంతృప్తి వ్యక్తం చేసింది. "'మంచిపని చేస్తే శిక్ష తప్పదు!' అని ఎవరో అన్నారు; ఎంత నిజం!" అని విశాలం భర్తని విమర్శించినప్పుడు రాజం 'నాన్నగారిపక్షమే సరి,' అని తనలో చెప్పుకుంది.

నటరాజన్ నవ్వుతూ అన్నారు: "చీరలపిచ్చి పోవాలని నేనన్నాను; అందులో తప్పేముంది? 'దేవుడు నువ్వు కోరే చీరలు అనుగ్రహించాలి; అవి కుంభవృష్టిగా కురియాలి; నీకప్పుడు మరేం చీరలు కావాలని అనిపించదు,' అనే అర్థంలో నేను దీవించాను."

అది విని విశాలం చిరునవ్వు నవ్వింది. "ఎదైనా సరే, అర్థం పర్థం లేకుండా, విపరీతంగా మాటాడినా మీ నాన్నగారు చమత్కారంగా సమాధానం చెప్పగలరు. ఆఖరికి అతనేదో శుభంగా పలికారని నాకు సంతోషంగా ఉంది. రాజం, విన్నావా అతని వాదం?" అని భర్తను మెచ్చుకుంది.

"నాన్నగారు అవ్వయ్యారులాగ మాటాడుతున్నారు!" అని రాజమూ ఆహ్లాదపడింది.

నటరాజన్ ఇద్దరు స్త్రీలనీ కృతజ్ఞనతో చూసారు.

అది జరిగి పద్దెనిమిది నెలలు దాటిపోయాయి. కాని రాజం మనసులో ఆ అనుభవం కొత్తగా, అద్వితీయంగా నిలిచిపోయింది. బట్టలు, ఆడంబర వస్తువులమీద ఆమెకున్న విరక్తి ఇంకా దృఢమైంది. 'అవశ్యంలేని చీరలమీద వ్యామోహం పోగొట్టుకోవాలి; అప్పుడే భర్తకి నామీద గౌరవం కలుగుతుంది.

నాకిప్పుడు తొమ్మిది పట్టు చీరలున్నాయి; అవి మరో పదిహేను సంవత్సరాలు వాడవచ్చు. కావాలన్నప్పుడు నూలుచీరలు కొనుక్కోవచ్చు. మరేం నగలు వద్దు. నాకు దేవుడిచ్చిన కానుకలు రెండు: సంగీతం, విద్య. వాటిని నేను మెరుగు చేసుకోవాలి. అదే నా జీవిత లక్ష్యం,' అని రాజం నిశ్చయించుకుంది.

నటరాజన్ రఘుపతిని సంప్రదాయంగా 'ఆడి' పండుగకి రమ్మని పిలవలేదు. "పిలిచినా ఇప్పుడు అతను రారు; దీపావళికి వస్తానన్నారుగా?" అని ఇంట్లో అందరికీ అతను గుర్తు చేసారు. రఘుపతికి ఉద్యోగనిమిత్తం ఇంటర్వ్యూలు రాలేదు; అందువల్ల అతను ఉత్తరదిశలో ప్రయాణం చెయ్యడానికి అవకాశమేమీ దొరకలేదు.

## 11

భవాని ఒక ఆడపిల్లని ప్రసవించింది. అది విని రాజం భవాన్ని అభినందింది: "నేను పాపని చూడాలని చాలా ఆతురతోవున్నాను," అని రాసింది. ఉత్తికే మర్యాదకోసం ఆమె రాయలేదు; పిల్లలంటే రాజంకి చాలా ఇష్టం.

ఇక రాబోయే దీపావళి నటరాజన్ కుటుంబం కొనియాడవలసిన అల్లుళ్ళ పండుగకదా? రాజం ఆ రోజుకోసం కాచుకొనివుంది.

భవాని మనసంతా భర్త సత్యమూర్తి మీదనే. ఇప్పుడామె ఒక కొత్త తల్లి; దీపావళి సమయంలో ఆయనకూడా ఉంటే ఎంత బాగున్ను! అతనెక్కడో చాలా దూరంలోపున్నారు. వచ్చిపోవాలంటే సెలవు దొరకదు; వచ్చినామాత్రం ఎన్నిరోజులు ఉండగలరని?

భవానికి ఒక ఆలోచన కలిగింది; రఘుపతికి చెప్పింది.

"నాకూ సత్యమూర్తిని చూడాలనివుంది. ఆ ఆంధ్రదేశంలో భాష తెలియని ఊరులో నేనేం చేస్తాను?" అన్నాడతను.

"ఏం, నీ పెళ్ళాం లేదా? . . . ఏందుకీ ఉత్తిమాటలు?"

"ఓ, అదా? నీకేం భయం వద్దు! మీ ఆయన్ని నేనెక్కడికీ ఈడ్చుకిపోనులే . . . నువ్వు నీ తిరుగు ప్రయాణంలో, కలకత్తాలో అతనితో కావలసిన కబుర్లు చెప్పుకోవచ్చు! కాని ఈ దీపావళి సమయంలో నీ కబుర్లన్నీ రాజంతోనే! మీ ఆయన్ని నాకు వొదిలేయ్!" అన్నాడు రఘుపతి.

దొరస్వామి కొడుకు, కూతురుమధ్య సంభాషణ విని నవ్వారు; భార్యతో "విన్నావా? ఈ సారి దీపావళికి మనం ఒంటరిగా ఉండాలి; ఐతేనేం, నువ్వేం కంగారు పడవద్దు. గభీమని అతిథులెవరైనా తప్పక వస్తారు. మనం ఎప్పుడైనా ఈ ఇంట్లో ఒంటరిగా ఉన్నామా?" అన్నారు. శారదాంబాళ్ అది విని వచ్చిన నవ్వుని అణచుకుంది.

త్వరలో దీపావళి పండుగని అచ్చటముచ్చటగా నటరాజన్ తన కుటుంబంతోనూ, రఘుపతి, భవాని, సత్యమూర్తితోనూ ఏలా జరుపుతారన్న వివరాలు రాస్తారని శారదాంబాళ్ కూడా కాచుకొనివుంది.

"ఇంకా కొన్నిరోజుల్లో భవాని వచ్చేస్తుంది!" అని రాజం ఉత్సాహంతో తనలో చెప్పుకుంది. "మా ఇద్దరికీ మంచి నేస్తం కాబోతుంది. మేం ఒకరితో ఒకరు అనురాగాలు పంచుకుంటాం. నేను భవానికి నా స్నేహితులని పరిచయం చేస్తాను. మేం ఇద్దరం కలిసి పాడతాం. నాకు భవానితో చనువు పెరిగితే మరి తక్కినవాళ్ళతో కలిసి మెలగడం సులభమవుతుంది" అని ఆహ్లాదపడింది.

కాని అమె మనసులో కొంచెం కలతకూడా చోటుచేసుకుంది.

రాజం పెళ్ళికి మరునాడు భవానికి సీమంతం జరిగింది. గర్భిణికి గాజులు తొడిగి పండంటిపాప కనాలని అందరూ దీవించారు. ఆ వైభవంలో రాజం భవాన్ని మామీ[1] అని పిలిచింది. భవాని కోపంతో "నిన్న నీకు చీరకట్టుకి సహాయం చేసినప్పుడు నన్ను అలా పిలవవద్దు అని చెప్పానుగా? అప్పుడే మరిచిపోయావా? నన్ను

[1] తమిళులు పెద్దలని, ఇతర స్త్రీలని మర్యాదగా అర్థించే పదం

'అక్కయ్య' అని పిలవాలి; నీకెన్నిసార్లు చెప్పాలి?" అని విసుగ్గుంది.  కాని వెంటనే సర్దుకొని ఒక చిరునవ్వు నవ్వింది.

'నేను ఉత్తరాల్లో భవానిని అక్కయ్య అనే పిలుస్తాను; కాని ఆమె నా ఎదుట కనిపించినప్పుడు నా నోట అక్కయ్య అనే మాట రావడం లేదు,' అని రాజం గొణుక్కుంది.

## 12

రాజేశ్వరికి దూరంలో రైలుకూత వినిపించింది.  వీధిలో వాహనాలు చురుకుగా వచ్చీపోతూ ఉన్నాయి.  అందులో రెండు జట్కాలు నటరాజన్ ఇంటిముందు వచ్చి ఆగాయి.  ఇవన్నీ ఇంటిలోనుంచే రాజం చూసింది.

ముందుబండి నుంచి రఘుపతి తోలుసంచెతో దిగాడు.  ఆ తరువాత భవాని తన బిడ్డతో అతని వెనుక కనిపించింది.  విశాలం వచ్చి వాళ్ళకి స్వాగతం పలికింది. రాజం గబగబమని  ముందుకువచ్చి "అక్కా,  నాకు పాపని ఇవ్వండి!" అని అడిగింది.  'అక్క' అనే పదం తను వాడినందుకు తృప్తి పడింది; కాని రాజంలో కనిపించిన ఆవేశం చూసి భవాని కొంచెం వెనకాడింది.

"నాకివ్వండి అక్కా," అన్నీ రాజం మళ్ళీ బతిమాలింది.  "పాప పేరు చిత్రా కదూ? నేను చిత్రు అని పిలవనా?" అని బిడ్డని తన చేతులతో అందుకుంది.

"జాగ్రత్త . . .   పాపతల వంగిపోతే . . . ? నాకు కొంచెం భయంగావుంది . . ."

.

"అక్కా,  మీకేం భయం వద్దు  . . .  నేను చూసుకుంటాను . . .”

విసాలం "రాజంకి చంటిపిల్లలతో మంచి అనుభవం ఉంది" అని భవానికి ధైర్యం చెప్పింది.

పిల్లలు మణి,  గణి,  రాధై బావగారితో ముచ్చటలాడాలని పరుగెత్తుకొనివచ్చి రఘుపతిని చుట్టుముట్టారు.

రఘుపతి ఎవరినో "ఒరేయ్! నా వాచీ విరగ్గొట్టకు!" అని గద్దించడం రాజం చెవిలో పడింది. వెంటనే తలుపుదగ్గర నిలబడి పిల్లల్ని హెచ్చరించింది. "వినండి! ఇక్కడ ఎవరూ అల్లరి చెయ్యకూడదు!" అని ఆమె బెదిరించడంతో పిల్లలందరూ బావగారికి జంకి,అతన్ని వదిలి వెళ్ళిపోయారు.

గభీమని రాజంని భయం ఆకట్టుకుంది. భవాని వస్తే ఆమెతో కలుసుకొని సరదాగా రోజులు గడపాలని తన ఊహ. కాని ఇప్పుడు భవాని ధోరణి చూస్తే ఎక్కడో, దూరంలో నిర్లక్ష్యంగా ఉన్న మనిషిలాగ ఉందే? 'భవానితో నేను ఆశించిన బంధం ఉత్తి భ్రమ కాబోలు!' అనే అనుమానం ఆమె మనసులో మెల్లగా చోటుచేసుకుంది. 'ఇదేదో నీరూ నూనె మిశ్రమైనరీతిగా కనిపిస్తోందే? నేను నలుగులో చేసిన పొరపాటు భవాని ఇంకా మన్నించలేదా! మరి ఎందుకు భవాని నాతో చనువుగా మెలగడంలేదు?" అని రాజం వాపోయింది.

ఎది ఏమైనా, రఘుపతి, భవాని మాత్రమేకాదు, భవిష్యత్తులో తన జీవితంలో కానవచ్చే అందరితోనూ తనకి కీర్తి, ఖ్యాతి కలుగతుందని రాజం నమ్మింది. క్రమంగా ఇంటిపనులన్నీ చేసింది; చెల్లెలు, తమ్ముళ్లకి నీళ్ళుపోసి, బట్టలు మార్చింది; ఉబ్బెత్తిన తన కాళ్ళకి నూనె రుద్దుకొని కొంచెం విశ్రాంతి తీసుకుంది. రఘుపతికి నిత్యమూ తనమీదే ధ్యానం ఉంటుందేమో అని సంకోచం కలగడంతో భవానికి కూడా తను అన్నివిధాలా సేవ చెయ్యాలని రాజం పూనుకుంది. భవానితోనే అంటుకొని ఆమె కోరిన చిన్నచిన్నపనులు గొణుక్కుండా చేసింది. "సరే, వెళ్ళి దువ్వెన, సబ్బూ అన్నీ తీసుకురా!" అని భవాని అన్నప్పుడు రాజం వెనుకంజ వేసింది. "రాజం, నువ్విలాగ సిగ్గుపడితే అన్నయ్యకి నచ్చదు!" అని భవాని నవ్వింది. రాజంకూడా ఒక చిలిపి నవ్వు నవ్వుతూ అతిథులు ఉంటున్న గదికి వెళ్ళింది. అక్కడ అలంకరణకి కావలసిన వస్తువులు - దువ్వెనలు, సబ్బుపెట్టెలు, తైలం సీసాలు, పౌడరు డబ్బాలు - జతలు జతలుగా - కనిపించడంతో రాజం

విస్తుపోయింది. ఇన్ని వస్తువులా? నటరాజన్ కుటుంబంతో పోల్చితే ఇది అతివృష్టి అనాలి!

భవాని తనకి కావలసినవన్నీ ఎన్నుకొని రాజం, "ఈ మిగితావన్నీ మా గదిలో పెట్టేయ్," అని చెప్పింది. "అక్కయ్యా, మీ తలకట్టు కానీయండి. నేను తరువాత వెళ్తాను," అని రాజం బదులు చెప్పింది. హాలులో రఘుపతి *హిందూ* వార్తపత్రిక చదువుతున్నాడని ఆమెకు తెలుసు; తను మాటిమాటికి హాలు దాటి వెళ్ళడంచూసి అతను అపార్థం చేసుకోవచ్చని రాజం జంకింది. పెళ్ళయి, నూతన దంపతులు ఒకరికొకరు ఉత్తరాలు పరివర్తన చేసుకున్నా రఘుపతితో చనువుగా మెలగడానికి రాజంకి ఇంకా ధైర్యం రాలేదు. 'నేను నిజంగా అతనికి అన్ని ఉత్తరాలు రాసానా?' అని రాజం ఆశ్చర్యంతో తన్ను ప్రశ్నించుకుంది. 'అవును, అతనూ అన్నిటికీ మారుమాట రాసారుగా?' అని గుర్తుచేసుకుంది. కాని భవానికి రాజం సంకోచం తెలియలేదు.

"ఏం, తరువాత ఎందుకు? దువ్వెన కనిపించకపోతే అన్నయ్యకి చెడ్డ కోపం వస్తుంది; వాడికి అన్నీ ఆఆ జాగాల్లో ఉండితీరాలి! . . . సరే, నేనే వెళ్తాను," అని అంటూ భవాని లేచింది. రాజం వెంటనే "వద్దు అక్కా, వద్దు! నేను వెళ్తాను," అని తొందరపడింది. తన జుట్టు సవరించుకోకుండా భవాని లేచి వెళ్ళడమా? అలాగేం జరగకూడదు; 'అత్యవసర పరిస్థితిలోకూడా కొప్పుపెట్టుకోకుండా నేనెక్కడికీ కదలను: ఎవరికి తెలుసు? కొన్ని వెండ్రుకలు భోజనంలో పడిపోతాయేమో అని నాకు భయం!' అని భవాని ఆ రోజు రాజంకి చెప్పలేదూ? భవాని భోజనంకి ఎటువంటి అడ్డూ రాకూడదు!

రఘుపతి పేపరు చదువుతూనే దూరంనుంచి తన్ను చూస్తున్నాడని రాజం గ్రహించింది; మరేం అనక అక్కడనుంచి మెల్లిగా జారుకుంది. అప్పుడు చెల్లెలు రాధై మాటలు "అక్కయ్యా, బావగారు నేను అతని టేబులు దగ్గరకి రాకూడదని అంటున్నారు. మరి అతనెందుకు మన ఇంటికి రావాలి?" ఆమెకు వినిపించాయి.

రాజంకూడా గడుసుగా "రాధై, నువ్వక్కడికి వెళ్ళావంటే నేనూ నిన్ను బాదుతాను, జాగ్రత్త!" అని బెదిరించింది. తలయెత్తి చూసింది; రఘుపతి రెప్పలార్పకుండా తన్నే చూస్తున్నాడు.

అతని ముఖంలో కనిపించేది కోపమా లేక అభిమానమా?

ఆ రాత్రి సత్యమూర్తి వచ్చారు. ఏం ఆర్భాటం లేకుండా తను ఆ ఇంటి దొడ్డఅల్లుడనే తలపే లేనట్లు అందరికీ కనిపించారు. అతనికి ఆరతితో స్వాగతం చెప్పాలేమో అని విశాలం కొంచెం తత్తరపాటు పడింది.

భవాని భర్తని అభిమానంతో చూసింది. భార్యాభర్తలు అతిథి గదికి వెళ్ళి ఏకాంతంగా పంచుకున్న మాటలు రాజం చెవిని అందుకున్నాయి. "చిత్రాకి కనుబొమ్మలకి కాటిక పెడదామా వద్దా అని నేను ఆలోచిస్తున్నాను," అని భవాని అడిగింది. సత్యమూర్తి పెద్దగా నవ్వుతూ "నీకు తెలుసా? నాకు ఎనిమిదేళ్ళవరకూ మా అమ్మ కాటిక పెట్టేది. నాకు పిలకజుట్టుకూడా ఉండేది!" అని నవ్వారు. "చాల్లేండి, ఎవరైనా వింటే నవ్విపోతారు!" అని దొంగకోపంతో భవాని అతన్ని మందలించింది. తనూ, రఘుపతీ ఒకరికొకరు అలాగ ముచ్చటగా మాటలాడుకుంటామా అనే ఆలోచన రాజంకి కలిగింది; రఘుపతి వచ్చి ఎంతసేపైంది! కాని తను అతన్ని ఒక సారైనా, ఒక క్షణంకూడా నేరుగాచూసి ఏమీ మాటాడలేదే!

కొత్తగా పెళ్ళైన దంపదులు ఇంట్లో ఎలాగ మెలగాలని పెద్దలు ఏ నిబంధనా విధించలేదు. సత్యమూర్తి రాజంని చూసి "మీ ఆయనకి వేడినీళ్ళు తెచ్చిపెట్టకూడదా?" అని ఉడికించారు; "తాంబూలం ఇచ్చేవా?" అని అల్లరి చేసారు. నటరాజన్ కి కూడా రాజం ధోరణి వింతగా కనిపించింది. 'అల్లుడుగారు రాజంతో ఏవో రెండు మూడు రోజులు సరదాగా మాటాడుకుందామని వచ్చారు; మరెందుకు ఈ విందూ, హడావిడీ అంతా?" అని తనలో గొణుక్కున్నారు.

భవాని విశాలంతో "మామీ, నేను మా ఆయనతో మాటాడానికి ఎటువంటి గడబిడ చేసుకోలేదు; ఇంతమంది సలహాకోసం కాచుకొనివుండలేదు. మేమిద్దరం కలుసుకున్నాం; అతను ఎదడిగనా నేను బదులు చెప్పాను, అంతే! మా ఆయన అందరిలాగ కాదు. 'నువ్వెందుకు అందరిమాటా వినాలి? అని ఎప్పుడూ అడిగేవారు. కోపం వస్తే అతను ఎలా మారుతారో మీకు తెలుసా?" అని చెప్పింది. అది విని రాజం 'నాకూ మొండితనం కూడదు!' అని నిశ్చయించుకుంది.

అవును. తనకీ అతనితో మాటాడాలని ఆశ వుంది. కాని ఈ సిగ్గు పోగొట్టుకోడం ఎలాగ?

ధైర్యం చేసుకొని కొంతసేపయిన తరువాత రాజం రఘుపతి ఉన్న గది ప్రవేశించింది; అతని ముఖం చూసింది. రఘుపతికూడా చిరునవ్వుతో స్వాగతం చెప్పాడు.

అడుగులు పెడుతూనే రాజం ఒక కుర్చీలో కూర్చుంది; కాని వెంటనే లేచి, తలుపు మూసి మళ్ళీవచ్చి కూర్చుంది.

రఘుపతి తలయెత్తి చూసాడు.

"నువ్వు టైపింగ్ నేర్చుకుంటున్నావని విన్నాను; మంచిది."

ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి.

రాజం చిరునవ్వు నవ్వింది; కాని ఒళ్ళంతా చెమటపట్టినట్టనిపించింది; చీర మొనతో ముఖం తుడుచుకుంది.

"నువ్వెందుకు నీ ఉత్తరాలు టైప్ చెయ్యలేదు?"

'ఏం, నా రాత మీకు నచ్చలేదా?' అని రాజంకి అడగాలనిపించింది. రఘుపతికి ఆమె మనసులో ఏముందని తెలిసినట్టుంది. అతనే మళ్ళీ "నీ రాత కూడా చాలా బాగుంది; మరి నా రాత నీకు బోధపడిందా?" అని అడిగాడు.

'మీ ఉత్తరం బాగా బోధపడింది; అందువలనే నేను మీకు రాసాను,' అని చెప్పడానికి భయపడుతూ రాజం జోరుగా తలూపింది. తనకతని ఉత్తరాల్లో కొన్ని

పదాలు అర్థం కాకపోవడంతో రాజం ఇంగ్లీషు నిఘంటువు వాడవలసి వచ్చింది. కొన్ని వాక్యాలు గజిబిజిగా కనిపించడంవలన తమ్ముడి భూతద్దంతో చదివి బోధపరుచుకుంది. ఇవన్నీ అతనికి చెప్పడం ఎలాగ?

"నువ్వు వస్తావని నిన్న ఎదురుచూసాను . . . ."

రాజం కళ్ళు పెద్దవైయ్యాయి.

ఆమె ఏమీ అనలేదు. తను రాకపోవడంతో అతనికి ఆశాభంగం కలిగిందా?

"నువ్వు మొటిమలకి సిగ్గుపడి రాలేదని మీ నాన్నగారు అన్నారు."

అవునని రాజం తలూపింది. కళ్ళు కిందకి చాచి, ఎడం బుగ్గని తన చేతివేళ్ళతో తడుముకుంది.

"అవన్నీ పోతాయిలే . . . . నాకూ అలాగే ఉండేవి . . . "

రాజం కంఠధ్వని లేచింది.

"కొందరు ముఖాలు మరకలు లేకుండా నిష్కళకంగా కనిపిస్తాయి; నాకూ అలాగుండేది . . . . ఒకరోజు గభీమని . . . "

"నీవేం బెంగపెట్టుకోవద్దు . . ."

"పేపర్లలో రకరకాల మందులు ప్రకటన చేస్తున్నారు. అవేమైనా కొందామా అనికూడా నేనాలోచించాను . . . ."

"ప్రకటనలు చదివి ఎవరూ మోసపోకూడదు; నాకూ నేను ఇంకా పొడుగ్గావుండాలని ఆశవుంది; దానికీ మందులున్నాయట! పచ్చి అబద్ధాలు!"

"అబద్ధాలా?"

కొంతసేపువరకు ఎవరూ మాటాడలేదు.

"మన పెళ్ళిఫోటో చూసాను; హాలులో గోడమీదుంది. బాగా మరకపడిపోయింది. మా ఇంట్లోవున్న ఫోటో స్టూడియోనుంచి వచ్చినట్టే సాపుగా, కొత్తగా కనిపిస్తోంది. ఇదేదో పిల్లలు బాగా చెడగొట్టారు!" అని అన్నాడు రఘుపతి.

రాజం ఏమీ అనలేదు.

బావగారంటే పిల్లలకి ఎంత ఆశ! వాళ్ళు ఫోటో కావాలని అడుగుతే ఎలా కాదనడం? ఆ ఫోటోకి ఏమైందో ఆమెకి తెలుసు; రాజం పెళ్ళైన తరువాత చాలామంది ఇంటికి వచ్చారు; పెళ్ళి ఫోటోలు చూడాలని అడిగారు. వాళ్ళందరూ చూసివెళ్ళినంతవరకూ నటరాజన్ ఏ ఫోటోలకీ ఫ్రేములు ఏర్పాటు చెయ్యలేదు. రఘుపతి చెప్పే ఫోటో ఎన్ని చేతులు మారిందో ఎవరికెరుక? అందువలనే అది పాడైనట్టుంది. ఒకరోజు రాజం ఒక పాత ఫ్రేముని ఏరుకొని, అందులోని ఫోటో ఊడదీసి దానికి బదులుగా తమ పెళ్ళి ఫోటో మార్చిపెట్టింది. కొత్త ఫ్రేము కొంచెం పెద్దదిగా ఉండడంవలన పెళ్ళి ఫోటోతోబాటు ఒక చిన్న మహాత్మా గాంధీ ఫోటో చేర్చిపెట్టింది. చూసేవాళ్ళకి మహాత్మా గాంధీ వధూవరులని అనురాగంతో గమనిస్తున్నట్టనుపిస్తుంది.

ఇప్పుడు రఘుపతి మాటలు విని రాజం బాధపడింది. ఆ ఫోటోలూ, ఫ్రేమూ చూసి తన అభిరుచిని అర్థం చేసుకొని అతను తన్ను మెచ్చుకుంటాడని ఆమె ఎదురుచూసింది. సంభాషణని కొంచెం హితంగా మార్చాలనే ఉద్దేశంతో "ఆ ఫోటోన్ని నేనే ఆ పెద్ద ఫ్రేములో పెట్టాను," అని చెప్పింది.

కాని రఘుపతికి ఆమె ఆశయం బోధపడలేదు.

"అది ఎవరైనా చెయ్యగలరు; అదేం కష్టం కాదు" అన్నాడు.

"గాంధీజీ మనల్ని చూసి చిరునవ్వు నవ్వుతున్నారనే భావం కలగాలనే నేను అలాగ చేసాను," అని రాజం చెప్పాలనుకుంది. 'ఇదేం వెర్రితనం!" అని అతను వేళాకోళం చేస్తారేమో, ఎవరికి తెలుసు?

రఘుపతి రంగురంగుల కాగితాలున్న ఒక పుస్తకం రాజం చేతికి అందించాడు. "దీనితో ఒక letter head కూడా చేర్చాలనుకున్నాను. కాని నాకు ఉద్యోగమెక్కడో తెలియదుగా?" అని అన్నాడు. పసుపు రంగు కాగితాలు తిరగేస్తూ రాజం "నేను ఏ ఉత్తరం రాసినా ముందు ఒక rough draft, తరువాత fair copy రాస్తాను. ఈ

కాగితాలు చాలా నొగుసుగా కనిపిస్తున్నాయే! మరి rough draft కి ఇవి వాడకూడదు!" అంది.

"ఇందులో నువ్వు రెండుపక్కలా రాయవచ్చు; పేపరు ఇంకిపోదు. మీ నాన్నగారు వాడిన పేపరయితే ఒక పక్కమాత్రమే రాయాలి," అన్నాడు రఘుపతి.

రాజం తనతో మాటాడుతున్నా ఆమె దృష్టి తలుపుమీద పడిందని రఘుపతి గమనించాడు. రాజం గభీమని లేచివెళ్ళి తలుపు తెరిచింది. ఆమె చిట్లించుకోడంచూసి రఘుపతి ఆమెను వింతగా చూసాడు. సైగ చేస్తూ రాజం బయట అమరికగా నిలబడియున్న తమ్ముడితో ఏమో మాటాడింది.

'పాటమాష్టారుగారు వచ్చారు,' అని అబ్బాయి చెప్పాడు.

'నేను వెళ్ళాలి,' అని సెలవు పుచ్చుకొని రాజం బయటికి నడిచింది. తిన్నగా హాలుకి వెళ్ళి నేలమీద చాప పరిచి వయలిన్ వాద్యాలు, శృతిపెట్టె నమకూర్చింది.

"అక్కయ్యా, మీరూ వస్తారా?" అని భవానిని పిలిచింది.

"నేను పక్కనవుంటే నువ్వు సంకోచపడతావని అతను రాగానే నేను నా గదికి వచ్చేసాను," అని భవాని చెప్పింది.

"పాటమాష్టారుంటే నాకెటువంటి సంకోచమూ ఉండదు," అని అంటూ రాజం ఒక చూపు కిందకి విసిరింది.

"అంటే నీ కోసం మీ పాటమాష్టారు నీ అత్తగారింటికీ రావాలని అంటున్నావా?" అని భవాని అడిగిన ప్రశ్న రాజంకి వింతగా తోచలేదు. ఊర్లో "రాజం, నువ్వు ఏ కచేరీకి వెళ్ళినా నీతో శ్రుతిపెట్టె తీసుకుపోవడం ఎలా సాధ్యం? నీ గురువుగారు ఎప్పుడూ నీతో రావాలంటే ఎలాగ?" అని ఎంతమందిఅడిగారు?

ఇప్పుడది మనసులో పెట్టుకొని రాజం శర్మగారి ఎదుట కూర్చుంది.

భవాని అడిగిన ప్రశ్న విశాలం చెవులకికూడా అందాయి. 'ఏం, నలుగులో ఆరోజు జరిగిన ఝుటన భవాని ఇంకా మరిచిపోనట్టుంది,' అనే అనుమానం ఆమె మనసులో లేచింది. "భవాని, రా, మనం రాజం గానం విందాం. ఇటీవల రాజం శ్రుతిపెట్టెతో

అభ్యాసం చేస్తోంది. ఇంతకుముందు నేను రాజంతో ఎవరింటికి వెళ్ళినా వాళ్ళు పాడమంటారేమో అని రాజం జంకేది. ఇప్పుడా భయం పోయింది," అని చెప్పింది.

సరే అని భవాని సంతోషంతో ముందుకు వచ్చింది. రఘుపతి, సత్యమూర్తి, నటరాజన్ దూరంనుండే వినాలని పూనుకున్నారు. భవాని చంటిపాపని తొడలో వేసుకొని సిద్ధమవగానే ధైర్యంగా రాజం ప్రదర్శన కొనసాగింది. త్వరలోనే గాత్రసంగీతం, వయలిన్ వాద్యం రెండూ అద్భుతంగా కళకట్టుకున్నాయి.

"సరస్వతీ రాగంలో ఈ కృతి చాలా వినసొంపుగా ఉంది. నేను ఇంతకుముందు ఎప్పుడూ వినలేదే?" అని అంటూ సత్యమూర్తి ఆ పాటలోని కొన్ని పదాలు తీసుకొని పాడడం ఆరంభించారు.

శర్మ వయలిన్ తో అతన్ని తోడుచేసుకున్నారు. సత్యమూర్తి సరస్వతీ రాగంతో ఆరంభించి చివరికి తన సొంత కల్పన ద్వారా ఒక రాగమాలికతో ముగించారు. అప్పుడు రాజం అతన్ని *కస్తూరి తిలకం* శ్లోకం పాడమని మనవి చేసుకుంది; భవాని *శ్యామలా దండకం* పాడమంది.

ఇద్దరు స్త్రీలనీ చూసి సత్యమూర్తి తలూపారు. ముందు తమిళంలో ఒక పాట పాడి, ఆ తరువాత బేగడా రాగంలో *కస్తూరి తిలకం* పాడారు. అ పాటలోని సూక్ష్మభావాలను గుర్తించి ఆనందిస్తున్న రాజం భవాని ముఖం చిట్లించుకోడం గమనించలేదు.

సత్యమూర్తి గానం శర్మగారిని ఆహ్లాదపరిచింది. "మీరు బ్రహ్మాండంగా పాడారు. మీకు ఎన్ని రాగాల్లో జ్ఞానం ఉంది! మీ *దన్యాసి* అద్భుతంగా ఉంది!" అన్నారు. ఇంతలో భవాని జోక్యం చేసుకుని భర్తని "మీరు *శ్యామలా దండకం* పాడతారా లేదా?" అని గీపెట్టడంతో అతను '*మాణిక్యవీణా . . .* 'అని బిలహరి రాగంలో పాట ఆరంభించారు; అది విని రాజం పరవశపడింది.

సత్యమూర్తికి సంగీతం ఒక హాబీ అని రాజంకి ఎవరో చెప్పారు. మాధుర్యం లేకపోయినా ఖంగుమనే మ్రోగే కంఠధ్వని అతనికి ప్రకృతి ప్రసాదించిన బహుమానం

అని అనవచ్చా? 'ముఖ్యంగా సత్యమూర్తి గానంలో విశేషమేమిటో అర్థం చేసుకోవాలి!' అని నటరాజన్ కి తోచింది. రఘుపతి పాట వింటూ, తలూపుతూ తన అభిరుచిని వెల్లడించాడు. రాజంకి సత్యమూర్తి గానపద్ధతిలోని సూక్ష్మబేధాలు సరపోల్చుకోవాలనే అభిలాష కలిగింది. అప్పుడే భవాని రాజంతో "నువ్వు మా ఆయన్ని మరేం పాడాలని అడగవద్దు. అతనికి గొంతు గడ్డకట్టిపోగలదు. మేం రేపు రైల్లో ప్రయాణం చెయ్యాలి" అని చెప్పింది.

సత్యమూర్తిగారిని *'సాయంకాలే వనాంతే'* పాడమని రాజం అడగాలనుకుంది. కాని మరేం అనకుండా ఊరుకుంది.

శర్మ సత్యమూర్తిని మళ్ళీ అభినందించారు. "మీరన్ని కృతులు మీ ఆవిడదగ్గరే నేర్చుకోవచ్చు!" అని అంటూ, నవ్వి, భవానిని చూసి "ఏవమ్మా, నువ్వు పాడతావా? రెండే రెండు కృతులు చాలు," అని అడిగారు. రాజంకూడా అడిగింది. కాని భవాని తనకి గొంతు గడ్డకట్టుకుందని పాడనన్నది; ఎవరు ఎప్పుడడిగినా వెంటనే పాడే మనిషి భవాని అని అందరికీ తెలుసు కాబట్టి ఇప్పుడామెను ఎవరూ బలవంతం చెయ్యలేదు.

## 13

సత్యమూర్తి, భవాని, రఘుపతి కలకత్తా ప్రయాణంకి సిద్ధమయ్యారు. రఘుపతి ఇంకా కొన్ని గంటలే ఇంట్లో ఉంటాడని ఊహించుకొని రాజం బాధపడింది.

రాజం తమ్ముడు సత్యమూర్తి భుజం అమాయకంగా తడుముతూ "మామా, నాకూ మీతో రావాలనివుంది!" అని ముద్దులాడాడు. రాజంకి పిల్లవాడి చేష్ట చూసి ఆశ్చర్యమో, కోపమో కలగలేదు.

"కలకత్తా మంచి ఊరని నేనూ విన్నాను; నేనూ అది చూడలేదు. అసలు వీడికి మీరు కలకత్తా వెళ్తున్నారని తెలీదు. లేకపోతే ఇంకా అల్లరి చేసేవాడు," అని రాజం గొణుక్కుంది. విశాలం రాజంని రెప్పలార్పకుండా చూసింది; రఘుపతి, సత్యమూర్తి

ఒకరినొకరు అర్థపుష్టితో చూసుకున్నారు; సత్యమూర్తి తటాలున లేచి భవానిని చూసి "నీ వదినగారు ఏమంటున్నారో విన్నావా?" అని అడిగారు.

అప్పుడే రాజంకి తను తప్పుచేసినట్లు భావం కలిగింది. 'ఎందుకురా నేను ఇలా తెలివితక్కువగా వాగేను?' అని సిగ్గు పడింది. ఇంతలోనే సత్యమూర్తి భవానితో "సరే, కానీ, నీ పదినగారిని తయారుచెయ్! మీ అన్నయ్య తిరుగుప్రయాణంలో వచ్చినప్పుడు రాజంని ఇక్కడ విడిచిపెడతాడు," అని అన్నారు.

"అలాగా? దేవుడా! నామనసులో అలాంటి ఆలోచనేదీ లేదే!" అని రాజం విస్తుపోయింది. కాని కలకత్తాకి వెళ్ళడం ఆమెకు ఇష్టమే; రఘుపతి ముఖంలో కనిపించిన కాంతి చూసి అతనికి అభ్యంతరం లేదని తెలుసుకుంది. కాని విశాలం "పెద్దల అనుమతి లేకుండా రాజంని మీతో పంపడానికి నాకు ఇష్టం లేదు," అని వెనకాడింది.

ఇంతసేపూ మౌనంగా ఉన్న భవాని విశాలంతో "మామీ, మీరేం బాధపడవద్దు. మా నాన్నగారు ఆరోజు నాతో 'నువ్వు రాజంని తోడుగా రమ్మని పిలవవచ్చుకదా?' అని ఏమరుపాటున అడిగారు. మీకోసంగతి చెప్పనా? మా నాన్నగారు సహజంగా - ముందాలోచన - లేకుండా చెప్పే మాటలుకూడా నిజమౌతాయి," అని చెప్పింది. అది విని రాజంకి తన మామగారిమీద మర్యాద ఇంకా బాగా పెరిగింది.

విశాలం మనసులో ఎన్నో ఆలోచనలు చోటుచేసుకున్నాయి: 'ఇంతకు ముందు నేను రాజంని పంపుతాననప్పుడు శారదాంబాళ్ సమ్మతించలేదు; ఇప్పుడు రాజం ఏదో పిల్లతనంగా మాటాడినందువలనే ఇలాగయింది!' అని తనలో చెప్పుకుంది. కాని రాజం ముఖంలో కనిపించిన ఉత్సాహమూ, నటరాజన్ వెంటనే రాజంకి ఒక కొత్త సూట్ కేసు అందించడమూ చూసినతరువాత విశాలం ఏ ఆక్షేపణా చెప్పలేదు. ఇంతకుముందు సత్యమూర్తి నటరాజన్ మధ్య జరిగిన సంభాషణ ఆమె గుర్తుచేసుకుంది: "కొత్తగా పెళ్ళైన దంపతులు స్నేహితులులాగ మెలగడం మంచిదనే నా అభిప్రాయం!" అని నటరాజన్ అన్నారు. సత్యమూర్తి వెంటనే

"అవును,  వేరే వేరేగావున్న స్నేహితులమాటకొస్తే దెబ్బలాడుకున్నతరువాత వాళ్ళ బంధం ఇంకా బిగువగా అదుముకుంటుంది," అని అన్నారు.

విశాలం మరేం అనక రాజం ప్రయాణంకి అన్ని ఏర్పాటులూ చెయ్యడానికి పూనుకుంది.  అతిథులు సెలవు తీసుకున్నప్పుడు భవానితో "నేను రాజంని నీకు ఒప్పగిస్తున్నాను.  దానికింకా పిల్లతనం పోలేదు.  అందుచేతనే మీ దయవలన ఈ ప్రయాణంలో కలుసుకుంది.  మీ అమ్మగారి ఇష్టం లేకుండా దాన్ని పంపడానికి నేను జంకాను.  కాని మీరందరూ ఇంత చెప్పినతరువాత ఎదురు చెప్పకూడదని సరే అన్నాను.  రాజంని బాగా చూసుకో.  దానికి నువ్వే అన్నీ నేర్పాలి," అని చెప్పింది.

తమ్ముడు కణ్ణన్ని ముద్దాడిన తరువాత రాజం రైలు ప్రయాణంకి జట్కాలో ఎక్కికూర్చుంది; ఆమె మనసంతా తను అనుభవింపబోయే యాత్రగురించే.  కాని రైలుస్టేషన్ చేరుకున్నతరువాత  రాజం తను తొందరగా చేసిన పని గుర్తించుకొని కలవరపడింది.  "నేనెందుకలా చేసాను? తటాలున అమ్మా నాన్నగారిని వొదిలేసి రెండు వారాలుండాలని నాకెలా తోచింది?" అని తన్నే అడుక్కుంది; రఘుపతిని పరిశీలనగా చూసింది.  అతని ముఖంలో చిరునవ్వు 'నువ్వు చేసినదంతా నాకోసం!' అని తనకి సమాధానం చెప్తున్నట్లు అనిపించింది.  'సరే,  ఈ ప్రయాణం నేను నేర్చుకోవలసిన పాఠాలకి అభ్యాసం కాబోతోంది; నా అత్తమామలతో నేను కలిసి మెలగడానికి ఇదొక మొదటి మెట్టు!' అనే భావంతోబాటు "అంతా మన మంచికే అయింది; పెళ్ళిలో జరిగిన గొడవలన్నీ నా మనసుని మెత్తగా రూపుదిద్దలేదూ? శ్రుతిపెట్టె లేకుండా పాడడం నాకు అలవాటైంది. ఉత్తికే చికాకుపడకుండా ఎవరితోనూ దెబ్బలాడకుండా,  అందరి అభిమానంకీ పాలవడం మంచిదేకదా?" అనే నమ్మకం రాజంకి కలిగింది.

చంటిపాప చిత్రాన్ని రాజం బాగా చూసుకుందని భవాని అభినందించినప్పుడు రాజం కొంచెం గర్వపడింది కూడా.  తన చెల్లెలు,  తమ్ముడ్లు తన సంరక్షణలో పెరిగినవారేకదా? వచ్చే రోజుల్లో తన అత్తమామలు తన సేవని శ్లాఘిస్తారని రాజం

నమ్మింది. సాధ్యమైనంతవరకూ తను భవాని దగ్గర అన్నీ నేర్చుకోవాలని నిశ్చయించుకుంది.

రఘుపతి చూపే ఆదరణ, సత్యమూర్తి హాస్యచలోక్తులు, భవాని అడిగిన ప్రశ్నలు: ఇవన్నీ రాజంలో కొత్త కొత్త ఆశయాలు పురిగొల్పాయి.

కలకత్తాలో, ఇంటికి చేరుకున్న కొన్నిరోజులవరకూ భవానిలో కొంచెం ఆరాటం కానవచ్చింది. భర్తని "ఏమండీ, gas valve మూసారా?" అనో "మీరు అద్దంకి తెర వేయడం మరచిపోలేదుకదా?" అని మళ్ళీ మళ్ళీ దిగులుపడింది. కాలక్రమంలో ఇంటిలోని చంటిపాప, కొత్త వాతావరణం వలన ఆ గాభరా తగ్గింది. ఇవన్నీ చూసి రాజంకి 'నిజంగానే నేను కాచుకొనియున్న దాంపత్య జీవితంకి కి ఇదొక మొదటి పాఠం!' అనే ఊహ కలిగింది.

ఇల్లంతా ముందులాగే సరిచెయ్యాలనే ఉద్దేశంతో భవాని చురుకుగా అన్ని పనులూ చెయ్యడంచూసి రాజంకి సంభ్రమం కలిగింది. తనూ భవాని తనకి ఒప్పగించిన చిల్లర పనులన్నీచేసింది. ఆ అనుభవంతో చేతిపనులతోబాటు కొత్త పద్ధతులు నేర్చుకుంది. చిత్రాను అపారప్రేమతో ముద్దాడింది. తన భర్తకి సేవ చేసినట్లే తన ఆడపడుచుకి అన్నీ సమకూర్చింది. ఆ ఇంట్లో రెండే రెండు గదులు; వాటి పునఃస్థాపన రెండురోజుల్లో పూర్తి ఐపోయాయి.

రాజం భవానిదగ్గర తమిళపాటలు నేర్చుకోవాలని ఆశపడింది. "అక్కా, మీరు నాకు *'కాణ కణ్ కోడి వేండుమ్'* నేర్పుతారా?" అని అడిగింది.

"సరే," అని భవాని అంది; కాని మరుక్షణమే ఆమె కోమల హృదయంలో కాఠిన్యం కానవచ్చింది.

"నేర్పుతాను, కాని నువ్వు సరిగ్గా పాడాలి. నువ్వు పల్లవి, అనుపల్లవి, చరణం పాడినప్పుడు చివరికి ఆపే విధంలో పొరపాటుంది. కృతులు పాడడంలో ఆంధ్రులకీ మనకీ చాలా తేడా ఉంది. నువ్వు సరిగ్గా పాడతావా?" అని అడిగింది.

"అలాగే అక్కా, మీరు చెప్పినట్టే పాడతాను," అని కుంటుతున్న స్వరంతో రాజం జవాబు చెప్పింది.

రాజం పల్లవి సులభంగా నేర్చుకుంది. "అనుపల్లవి నేర్పుతారా?" అని అడిగింది.

"అదెలా నేర్పడం? పల్లవి చివరన నువ్వు పలికే అకారం సరిగ్గా లేదు!"

పక్కనే వార్తాపత్రిక చదువుతున్న సత్యమూర్తి జోక్యంచేసుకొని భార్యతో "కాంభోజీ రాగంలో అలా ఆపవచ్చు!" అన్నారు.

"మీరు సరిగ్గా విన్నారోలేదో, రాజం అన్ని రాగాలకీ అలాగే ఆపుతోంది!" అని భవాని చెప్పింది.

తనవలన భార్యాభర్తలమధ్య జగడమెందుకని రాజం బాధపడింది.

"అక్కయ్యా, ఈ కృతి కష్టంగా ఉంది. మరేదైనా చెప్పండి," అని రాజం కోరుకుంది.

సత్యమూర్తి మళ్ళీ భవానికి చెప్పారు. "రాజం పల్లవి ఇంత సుళువుగా పాడేసింది; అనుపల్లవి నేర్చుకోడానికి ఆమెకు మరేం కష్టమూ ఉండదు," అని అంటూ రఘుపతిని చూసారు; తన భార్యను సత్యమూర్తి పొగడుతున్నారని అతనికి కృతజ్ఞత తెలుపుతున్నట్లు రఘుపతి చిరునవ్వు నవ్వాడు.

"మీరెప్పుడు మీ బావమరిదిని వెనకేసుకొని మాటాడడం నేర్చుకున్నారు? పెళ్ళాం పక్షం జోరుగా వాదిస్తున్నారే!" అని గొంతు చించుకొని భవాని తనవశం ఉన్న ఒకే ఆయుధం భర్తమీద విసిరింది.

"నా పెళ్ళాం గురించి మాటాడుతున్నావా?" అని నవ్వుతూ సత్యమూర్తి రఘుపతిని చూసారు.

"అవును మరి. లేకపోతే నేనెందుకు ఇలా ఉంటాను?"

"ఎలాగ . . . ఎర్రగా, లావుగా . . . . ."

"కాకపోతే నేనేం సన్నగా, తీగలాగ కనిపిస్తానా? . . . నాకు పెళ్ళయి రెండు సంవత్సరాలకి పైగా ఐపోయింది . . . తల్లయి నాలుగు మాసాలైంది . . . "

భవాని ముఖంలో చిరునవ్వు కనిపించింది. మామూలుగా భవాని తనంతటతానే వచ్చిన నవ్వుని ఆపుకోడానికి ప్రయత్నిస్తుంది; నిత్యమూ రెండు పెదిమలూ అదుముకునే ఉంటాయి. అందుకు కారణం నోరు విప్పితే ముందున్న సరితూగని రెండు దంతాలు కనిపిస్తాయనే భయం.

"దేవుడా! . . . నువ్వెప్పుడైనా తీగలాగ కనిపించావా? . . . తాచుపాములాగ అని అంటున్నావా?"

"చాల్లేండి; ఎగతాళి చెయ్యవద్దు!"

మంచి వేళ, భవానికి వచ్చిన కోపం త్వరలోనే పోయింది. అసలు ఈ జగడం ఎలా ఆరంభమైందో అని తెలియక రఘుపతి మళ్ళీ రాజంని సరసంగా చూసాడు.

ఇంతలో బిడ్డ ఏడ్పు విని రాజం భవానిని ముందుకొని చిత్రాకోసం పరుగేత్తింది.

భవాని రాజం వెనుకనే నడిచివచ్చి పాపను తన చేతుల్లో తీసుకుంది. "సరే, నువ్వు వెళ్ళి పొయ్యి తయారు చెయ్; టీ చెయ్యడానికి టైమయింది," అని చెప్పింది.

"సరే అక్కా . . . కందిబొగ్గు కదా వాడాలి?"

"నాకు తెలుసు . . . మరి నీకు రాతిబొగ్గంటే చేతకాదని . . . .

రాజం చిలిపి నవ్వుతో ఊరుకుంది; కాని కలవరపడింది.

కలకత్తాకి వచ్చినరోజునుంచి రాజం ముఖంలో కనిపించే ఆహ్లాదం తగ్గుతూనే వచ్చింది. భయం ఆమెను పూర్తిగా ఆక్రమించేసింది. అసలు ఎప్పుడైనా నోటినుంచి మాటలు - తను కొంచెం ధైర్యం తెచ్చుకొని పలికినప్పుడు - బయటికి వస్తే అవి హీన స్వరంలో ఎవరికీ వివిపించనట్టు కనిపించాయి. 'నిత్యగండం అంటే ఇదేనా?' అని మనసు అల్లాడింది. మరేం దిక్కులేదనే జ్ఞానంతో కళ్ళు తడిసిపోయాయి. ఆమె శోకానికి మూల కారణం తన ప్రేమకి ఆటంకం గాని, భర్త ఉపేక్ష గాని కాదు; తన ఆడపడుచు చూపే పగ, ద్వేషం అతిశయంగా రాజంని బాధపెట్టాయి.

భవాని రాజంపట్ల ఎటువంటి దయా, సానుభూతి చూపలేదు. రాజం చేసే సేవ అనుభవిస్తూనే ఎటువంటి కృతజ్ఞత ఆమెకు చెప్పలేదు. పైగా రాజం ఎది చేసినా

అందులో లోపముందని ఎత్తిపొడిచి బాధపెట్టింది. ఇవన్నీ రాజంకి కొత్త అనుభవాలే. ఈ నిరాధార స్థితిలో భవాని విసిరిన నిర్దయ మాటలూ, తాకులూ ఆమె మౌనంగా సహించుకుంది.

ఒకరోజు రాజం "అక్కయ్యా, ఈ కొబ్బరికాయ వట్టిపోయింది. ఇంకొకటి వాడనా?" అని అడిగింది. భవాని వెంటనే "నాకియ్యి, నేను అరగదీస్తాను!" అని చివాలున లేచింది.

"వద్దు అక్కా, నేనే చెస్తాను . . ."

"నువ్వు పని పూర్తిచేసేసరికి మగాళ్ళందరూ వంటగదిని నాలుగైదుసార్లు దండెత్తుతారు . . . వద్దు, నేనే చేస్తాను . . ."

"అక్కయ్యా, నేనెందుకన్నానంటే ఆరబెట్టిన కొబ్బరికి కొంచెం సమయం పడుతుందని . . . ."

"ఏం, నీ చెయి చురుకుగా పని చేస్తే అదేం పెద్దపని కాదు . . . సరే, ఆ పులుసుకూడా నేనే చేస్తాను . . . పులుసుకి పొయ్యిలో పెట్టిన నీళ్ళు ఆవిరైపోయాయి . . ."

కళ్ళు ఎర్రబెట్టుకొని భవాని రాజం చేతికి గిన్నం అప్పగించి "రాజం, నువ్వు తమిళదేశంకి వస్తే అన్నిటికీ సర్దుకోవాలి! ఎప్పుడూ 'నాకిది కావాలి, 'అది కావాలి,' అని మొరబెట్టుకుంటే పెద్ద చిక్కులో పడతావ్!" అని అదమాయించింది.

రాజంకి ఏడవాలనిపించింది. 'అమ్మా, నాకు కొబ్బరికాయ నూరడంకూడా తెలియదే!' అని గొణుక్కుంది. కళ్ళు బాగా తడిసిపోయాయి.

"నువ్వు మన ఊరులో నలుగురిమధ్య సహజంగా మెలగాలనే నేను నీకు బుద్ధి చెప్పాలనుకున్నాను; కాని నువ్వు నా మీద ఎగిరిపడుతున్నావ్ . . . సరే, ఇక నాకు నీతో ఏ సంబంధమూ వద్దు!"

ఆ రాత్రి అన్నం వడ్డించినప్పుడు భవాని క్షమాపణ కోరుతున్నట్టు "ఇవాళ పులుసు అంత రుచిగా లేదు; కొబ్బరిని సరిగ్గా అరగదీయలేదు" అని చెప్పింది.

"అయ్యో, అది వట్టిపోయిన కొబ్బరికాయ!" అని రాజం గీపెట్టాలనుకుంది. కాని నోట ఏ మాటా రాలేదు.

ఇలాంటి ఘటనలు వచ్చే రోజుల్లో మళ్ళీ మళ్ళీ చోటుచేసుకున్నాయి.

భవాని తనకి క్షేమంకోరే స్నేహితురాలని రాజం ఆశించింది. కాని భవాని తనకి ఆడపడుచు అనే స్థానం వుందనే అహంకారంతో ఎడతెగకుండా రాజంని ఏడిపించాలని నిశ్చయం చేసుకుంది.

ఒక సాయంకాలం సత్యమూర్తి భవాని, రాజంని వాద్యాలు వాయించమని పిలిచారు. భవాని వీణ, రాజం వయలిన్ తో అతని ముందు రాగానే "ఏదీ, మీ ఇద్దరికీ రాగం మోహనం బాగా తెలుసుకదా? ఓ రెండు కృతులు వాయించండి చూద్దాం, నేను వింటాను," అన్నారు.

రెండు వాద్యాలూ సుస్వరంతో పలికాయి. యుగళసంగీతం ఆరంభించిన కొంత సేపటిలో ఒక దంపతులు - భవాని, సత్యమూర్తికి పరిచితులు - ఇంట్లోకి ప్రవేశించారు. వస్తూనే 'మీరు ఆపవద్దు!" అని సత్యమూర్తికి సైగ చేసారు. అతను చిరునవ్వు నవ్వారు; రఘుపతి లేచి దంపతులకి స్వాగతం చెప్పాడు. భవానికూడా వారి రాకను ఆమోదిస్తూ తలూపింది; రాజంకి అంతా అర్థమైంది.

భవాని వీణ పక్కనపెట్టి "సుమతీ, నీ చీర చాలా బాగుంది; ఎక్కడ కొన్నావ్?" అని అడిగింది. రాజం తనుకూడా వయలిన్ వాయించడం ఆపబోతుంటే సత్యమూర్తి "రాజం, నువ్వు ఇంకో రెండు కృతులు వాయించు," అని చెప్పి, భవానిని చూసి "మిసెస్ సెన్ కి నీ స్పెషల్ కాఫీ ఇస్తావా? అని అడిగారు. "మిసస్ సెన్, కాఫీ వచ్చేవరకూ రాజం వయలిన్ వినండి," అని అడగడంతో సెన్ దంపతులు సరే అన్నారు.

రాజంకి తనుకూడా వంటగదికి వెళ్ళి భవానికి సాయం చెయ్యాలని తోచింది; వయలిన్ చేతిలో తీసుకోవడానికి వెనకాడింది. ఇంతలో సత్యమూర్తి "రాజం, కానీ, వాయించు!" అని తొందరపెట్టారు. మరేం లాభం లేదని రాజం వయలిన్ ఎత్తుకుంది.

ఆమె వాయింపు అద్భుతంగా రాణించింది. ఇంతకీ ఆమె సంగీతం అభ్యాసం చేసి నాలుగైదు రోజులైపోయాయి. సత్యమూర్తిగారి ప్రోత్సాహంతో, చేతనైనమట్టుకు తన ప్రతిభ చూపించాలనే ఆతురత రాజంలో చోటుచేసకుందేమో? ఏది ఏమైనా అది విని అందరూ పరవశమయ్యారు.

సెన్ దంపతులకి సంగీతంలో కానవచ్చిన అభిరుచి చూసి సత్యమూర్తి రాజంని ఇంకొక కృతి వాయించమన్నారు. రాజం 'ఇది మీకోసం!' అనే సందేశం తెలుపుతున్నట్లు రఘుపతిని చూస్తూ ఆరంభించింది. శర్మగారు రాజం స్కూలు ప్రదర్శనలో ఆమెకు ప్రత్యేకంగా నేర్పిన కృతి అది. దాని రాగంలో కలిసివచ్చిన లయ చెవులకి సొంపుగా కర్ణాటకసంగీతం పరిచయంలేనివారినికూడా ఆకర్షిస్తుంది. మరేం కావాలి? అందరూ రాజం సంగీతంలో మునిగి తేలుతున్నట్టు కనిపించారు.

వయలిన్ ప్రదర్శన పూర్తి అవగానే ఎవరూ చప్పట్లు కొట్టలేదు; కాని శ్రోతలు రాజంని మనసార మెచ్చుకున్నారని స్పష్టమైంది.

రాజం లేచి వంటగదికి వెళ్ళింది; సుమతి ఆమె వెనుకనే వచ్చింది.

భవాని సుమతితో మాటాడుతున్నప్పుడు సుమతి పదే పదే రాజంని చూసింది. రాజం భవానిని "అక్కయ్యా, ఇంకొక కూజాలో పాలు పొయ్యనా?" అని అతి వినయంగా అడిగినప్పుడు సుమతికి రాజం ఒక చిన్న పిల్లగా కనిపించింది.

సెన్ దంపతులు కాఫీ తాగి, చాలాసేపు ఏమేమో కబుర్లు చెప్పుకొని ఆఖరికి సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయారు. తను భవానితో ఏమైనా మాటాడాలని రాజంకి తోచింది; మౌనంగా నిల్చోడానికి భయం కలిగింది. భవాని ఎత్తివచ్చి ఏమంటుందో ఎవరికి తెలుసు?

రాజం అనుకున్నట్లే అయింది.

"మా ఆయన అడిగారని నువ్వు వయలిన్ వాయించుతూ ఉండిపోయావ్. నేను ఒంటరిగా వంటగదిలో కాఫీ చేస్తూంటే నాకు సాయం చెయ్యాలని నీకనిపించిందా? ఇవన్నీ నువ్వెప్పుడు నేర్చుకుంటావ్?"

"అక్కయ్యా, నేను కాఫీగింజలు పొడిచెయ్యడానికి రావాలనుకున్నాను . . ."

"మగాళ్ళు ఎదడిగినా మనం చెయ్యాలంటే ఎలాగ సాధ్యం? నువ్వు మా ఇంట్లో ఇలా చేస్తే బాగుంటుందా? మా అమ్మ వంటగదిలో ఒంటరిగా ఉందనుకో; అప్పుడుకూడా నువ్వు వయలిన్ వాయించుతూ కూర్చుంటావా . . . ?

సత్యమూర్తి వంటగదిలో ప్రవేశించడంతో భవామి మరేమనకుండా ఊరుకుంది.

"భవాని, మీ వదినగారి వాయింపు విన్నావా? చాలా అద్భుతం! సుమతి రాజం గురించి ఏమైనా చెప్పిందా?" అని అతను అడిగారు.

భవాని ఎగబెట్టుకొని అతనికి సమాధానం చెప్పలేదు.

"కాఫీ ఎలా ఉంది? కాఫీగింజలు సరిగ్గా పొడిచెయ్యలేదు. నేనిక్కడ ఒంటరిగా ఉండిపోయాను. నీళ్ళు బాగా మరిగినవెంటనే కాఫీపొడి ఉన్నదేదో పడేసాను . . . రుచీ, శుచీ ఎలా ఉందో నాకు తెలియదు . . . ."

"ఏం, నీ కాఫీ ఎప్పుడూ రుచిగానే ఉంటుంది . . . సెన్ దంపతులు నీ కాఫీకోసమే మన ఇంటికు వస్తారు," అని సత్యమూర్తి భార్యను ఓదార్చారు.

భవాని ఇంతకుముందు చాలాసార్లు తనే ఒంటరిగా కాఫీ చేసేదని సత్యమూర్తి భార్యకు గుర్తుచెయ్యలేదు.

భవాని ప్రవర్తనగురించి రాజం పదే పదే ఆలోచించింది; ఆఖరికి ఒక సంగతి బోధపడింది.

ఎది ఏమైనాసరే, తను ఎప్పుడూ అత్తగారినీ, భవానినీ, ఒంటరిగా ఓ పనికీ వదిలేయకూడదు; వాళ్ళకి అన్నివిధాలా సహకరించడమే తన లక్ష్యం అని భావించాలి. ఇదే భవాని రాజంకి తెలిపే సందేశం.

'భవాని చెప్పేదంతా నా మంచికే!' అనే భావం రాజం మనసులో నిలకడగా చోటుచేసుకుంది. 'భవానికి ఇంటి పనుల్లో సమర్ధత ఉంది; మగాళ్ళు చెప్పే పనులన్నీ స్త్రీలు సంశయించకుండా చెయ్యకూడదని భవాని మాత్రం చెప్పలేదే? అదేమాట విశాలం, శారదాంబాళ్ కూడా అనడం రాజంకి తెలుసుగా? అవును మరి!

ఏ పని చేసినా స్త్రీలు నిదానంగా, ఆలోచించే చెయ్యాలి. సంసారం అంటే అందులో చిన్న చిన్న విషయాలెన్నో ఉన్నాయి. చిక్కులూ ఉన్నాయి. ఒక క్లిష్టపరిస్థితి ఎలా పరిణమిస్తుందో ఉదహరించడానికి ఒక ముచ్చట చెప్పవచ్చు: సీస పాత్రలో చారు వండితే చాలా రుచిగా ఉంటుంది. మరి అలూమినమ్ పాత్రకూడా సీసంలాగ కనిపిస్తుందే? అందులో చారు చేస్తే? అధ్వాన్నంగా ఉంటుంది! అవును, సాధారణ విషయాల్లో మనం జాగ్రత్తగా ఉండాలి. భవాని నన్ను హింసించలేదు; నా మంచికే ఆమె అన్నీ చెప్తోంది,' అని రాజం తన్ను ఓదార్చుకుంది.

ఈ విధంగా భవాని మనసుని ఊహించుకున్నతరువాత రాజంలో మెల్లమెల్లగా మార్పులు కానవచ్చాయి.

భవాని ఎత్తిపొడిచి ఏ మాటలన్నా రాజం కన్నీరు కార్చడం ఆపుకుంది; తను కళ్ళు తడబెట్టుకుంటే భవాని బాధపడదూ? తన ముఖంలో ఎల్లప్పుడూ సంతోషం కనిపించాలి, అప్పుడే భవానికూడా తనతో ఉల్లాసంతో మెలుగుతుందని రాజం నమ్మింది.

ఒకరోజు భవాని రాజంతో "నువ్వు గిన్నెలన్నీ మూయకుండా అలాగలాగే వదిలేస్తున్నావ్; నేనెప్పుడూ అలాగ చెయ్యను. మీ అమ్మగారుకూడా అలా చేయడం నేను చూసాను," అని చెప్పింది. రాజం సాధుభావంతో "అవునక్కయ్యా, అలా చేస్తే ఆహారపదార్థాలన్నీచెడిపోతాయి," అని ఒప్పుకుంది. భవాని రాజంని మాత్రం కాదు, విశాలంని కూడా ఆక్షేపించిందంటే ఆమె మనసులో ఎటువంటి పక్షపాతమూ లేదని ఋజువైందికదా?

కొన్నిసార్లు భవాని రఘుపతితో రాజం తమ్ముడ్లగురించి "కుర్ర వెధవలు! ఎప్పుడూ అల్లరి, గొడవే! వాళ్ళని అదుపులో పెట్టాలి!" అని విసుగ్గునేది. కాని విశాలంగురించి వ్యతిరేకంగా ఆమె ఏమీ అనేదికాదు.

ఒకరోజు రఘుపతి నీళ్ళు తాగాలని వంటగదికి వచ్చాడు. అక్కడున్న బిందెను చూసి భవానిని "దీన్ని ఎందుకు మూయలేదు?" అని అడిగాడు.

"నేను చెప్పానుగా రాజం ఏ గిన్నా సరిగ్గా మూయడం లేదని?" అని భవాని అంది.

రాజం మాటాడానికి వెనకాడింది. కాని భర్తముందు తనేం తప్పుచెయ్యలేదని నిరూపించాలని ధైర్యంగా "అక్కయ్యా, ఆ బిందె నేను నింపలేదు. అప్పటికి నేనింకా స్నానం చెయ్యలేదు," అని చెప్పింది.

భవాని ఒక క్షణం నిర్ఘాంతపోయింది. వెంటనే సర్దుకొని "అవును, నేను కాఫీ చేస్తున్న తొందరలో మూయడం మరిచిపోయాను," అని ఒప్పుకుంది.

రఘుపతి మౌనంగా అక్కడనుంచి మెల్లగా జారుకున్నాడు. అతను వెళ్ళగానే అమె ముఖం పరిశీలన చేస్తూ భవాని , "రాజం, నన్ను నువ్వు కాచుకోవడమంటే ఇలాగేనా? నేనేదో చిన్న పొరబాటు చేసాను, బిందె మూయలేదు. నేను నీ ఆడపడుచని ఎలా మరిచిపోయావ్?" అని అడిగింది.

రాజం మాటాడలేదు. ఆఖరికి తను నిర్దోషి అని తన భర్తకి ఋజువైంది; అతని దృష్టిలో తనకి ఆదరణ పెరిగింది. అది చాలు అని తృప్తిపడింది.

కాని ఆ తరువాతకూడా భవాని దృక్పధంలో మార్పు కనిపించలేదు; పదే పదే ఆమె రాజంని అన్నివిధాలా హింసచెయ్యాలని పూనుకుంది. రాజం తనతో రాజీపడడంచూసి అపార్ధం చేసుకుంది; రాజంలో భవానికి కనిపించినదంతా అహంభావం, అలక్ష్యం, పొగరుబొతు. రాజం చిరునవ్వు నవ్వితే అది చిలిపినవ్వుగా తోచింది; రాజంకి ఆమె భర్త ఆదరణ ఉందనే తలపే భవాని కడుపుమంటకు ఊకపోసింది. రఘుపతి, రాజం ఒకరికొకరు తమ చూపుల్లో పరివర్తన చేసుకున్న అనురాగాలు భవానిని రెచ్చగొట్టాయి.

ఒకరోజు రేడియోలో రాజంకి ప్రియమైన ఒక రాగమాలిక ఎవరో పాడారు. అప్పుడు రాజం పెరడులో గిన్నెలు తోముతోంది. లేచి, మెల్లగా ముందుకు జరిగి ఆ పాట విందామనుకుంది; ఆమె చేతులు గిన్నెమీదనే అలుముకొనివున్నాయి.

భవాని పరుగెత్తుకొనివచ్చి రాజం చేతిలోనుంచి గిన్నె లాగ్గుంది. "రాజం, నువ్వు లోపలికి వెళ్ళి పాట విను. నేను తోముతాను," అని కసురుకుంది.

"ఒద్దక్కా, నేనే తోముతాను . . . . ఇది నాకు చాలా నచ్చిన పాట . . ."

"మరి నాకుమాత్రం పాట వినాలని లేదా? నువ్వు గిన్నెలు తోమడంచూసి నన్ను అందరూ తిట్టాలా? అదేకదా నీ ఉద్దేశం?"

"అయ్యో, అక్కయ్యా, అలాగేం కాదు!"

మరేం అనలేక రాజం కంఠం గడ్డకట్టుకుంది. ఏడుస్తూనే పెరడుకి తిరిగి వెళ్ళింది. గిన్నెలు తోమడం అలవాటు లేకపోయినా మనసుని నిర్మలంగా పోషించుకోడం రాజంకి తెలుసు. అందువలనే భవాని ప్రవర్తన జుగుప్స ఆమెకు కలిగించలేదు. 'అవును, అది నా పొరబాటే; భవాని నన్ను తప్పుపెడుతుందని తెలిసికూడా నేనెందుకలా చేసాను?' అని తన్నే నొచ్చుకుంది.

కలకత్తాకి రావడానికిముందు రాజం మనసులో తను భర్తతో కలిసి రోజులేం గడపలేకపోయినా అతని ముఖం చూస్తే అదే చాలని అనుకునేది; ఇప్పుడు అదికూడా అరుదైపోయింది.

భర్త ఎదుట తను పిరికితనంతో, అసమర్థంగా కనిపించకూడదని రాజం ఆశించింది. మృదువైన ముఖం. ప్రకాశించే కళ్ళతో దర్శనమివ్వాలని ప్రాధేయపడింది. కాని పెరడులో ఎక్కువగా పని చెయ్యడంవలన బొబ్బలెక్కిన కాళ్ళూ, గందరగోళంగా దుస్తులూ ఆమెలో చోటుచేసుకున్నాయి. రఘుపతి అప్పుడప్పుడు చేతిలో ఏదో ఒక పుస్తకంతో దగ్గరకువచ్చి అందులో ముచ్చటగా ఏదో - హాస్యమో, వ్యంగ్య చిత్రమో - చూపించి ఆమెను నవ్విస్తాడు; సెలవు తీసుకున్నప్పుడు ప్రేమానుభావంతో ఒక చిరునవ్వు విసిరి వెళ్తాడు. ఇవన్నీ చూసి భవాని అలక్ష్యంగా కొట్టిపారేస్తుంది: "అన్నయ్య ముందెప్పుడూ వంటగదికి రావడం నేనెరుగను; ఇప్పుడదే వాడికి గొప్పగా ఉంది!" అని హేళనగా మాటాడేది.

రాజం అనుభవించిన మనోవేదన ఇంతో అంతో కాదు; అన్ని తిట్లూ, దూషణలూ మౌనంగా భరించింది.

అన్నయ్యకి తనపైవుండే అభిమానంని రాజం ఆక్రమించుకుందని భవాని అసూయ పడుతోందా? సంసారంలో అలాంటి మనోభావాలు సహజమని రాజం ఎప్పుడో కథల్లో చదివివుంది. రఘుపతి ఇంటర్వ్యూకోసం పాట్నా ప్రయాణంకి ఏర్పాట్లు చేస్తున్నాడని తెలిసి రాజం గాభరా పడలేదు. 'సరే, అతను మూడు రోజుల్లో తిరిగివస్తారు; ఆ సమయంలో నేను భవానికి సేవ చేసి ఆమె నన్ను మెచ్చుకున్నట్టు వ్యవహరిస్తాను," అని రాజం నిశ్చయించుకుంది.

ఆ ప్రకారంగా పొయ్యి అంటించడానికి శ్రమతో రాతిబొగ్గు అణగగొట్టింది; చీరని నడుములో బిగించుకొని, ఎండలో బాదుతూ బట్టలుతికింది; 'నుదుటమీద బొట్టు గీచి పోయిందేమో? ముఖంలో మళ్ళీ పొటిమలు కనిపిస్తున్నాయేమో? గోర్లకి మురికి అంటుకుందేమో?' ఇవేమీ రాజం లక్ష్యం చెయ్యలేదు. ఆమె అభిలాష అంతా భవానికి తన అంతరంగశుద్ధి, అభిమానం బోధపడాలి. అదే ముఖ్యం.

కాని భవానికి రాజం మనసులోని నిర్మల ఉద్దేశం తెలియలేదు. రఘుపతి లేనప్పుడుకూడా రాజం కలుపుగోలుతో స్నేహితురాలుగా, వదినగా తనతో మెలగడం అసాధ్యం అని ఆమె నిశ్చయించుకుంది. తన భర్తకి కూడా రాజంపై సదభిప్రాయం ఉందని గ్రహించి భవాని బాధపడింది. తనలాగే అతని దృక్పథంలో రాజం కనిపించాలని ఆమె కోరుకుంది.

# రాజేశ్వరి

## రెండవ భాగం

## అడగడుగునా చిక్కులు

## 14

రఘుపతి పాట్నా ఇంటర్వ్యూ ముగించుకొని తిరిగివచ్చేసాడు. తన ఊరికి తిరిగి వెళ్ళడానికిముందు కతకత్తాలో ఇంకా కొన్ని రోజులాగి, తన తిరుగు ప్రయాణంలో రాజంని ఆమె ఊరులో వదిలేసి తనూ అక్కోడ కొన్నిరోజులు గడపాలని రఘుపతి నిశ్చయించాడు.

కలకత్తాలోని దుకాణాలూ, వేడుకలూ చూడకుండా వెళ్ళడమా? నలుగురూ కలిసి పేరుపొందిన స్థలాలు, అంగడులు దర్శించారు. వదిన ఇంకా కొన్నిరోజుల్లో వెళ్ళిపోతుందని భవానిలో కొంచెం ఉత్సాహం కానవచ్చింది.

ఒక బొమ్మల దుకాణంలో ఒక వస్తువు రాజంని ఆకర్షించింది. ఒక పెట్టెనిండా కార్మికుల బొమ్మలు; అందులో వేరే వేరే వృత్తులు పాటించేవారు - కూలివాడు, తోటమాలి, రైతు, వడ్రంగి, కమ్మరి, మొదలయినవారు ఉన్నారు. దసరా బొమ్మలకొలువులో వాటిని వివిధమైన నేపథ్యంలో ప్రదర్శించవచ్చుననే ఆలోచన రాజంకి తోచింది. తన చెల్లెలు, తమ్ముడ్లు కొత్తబొమ్మలు చూసి ఆనందిస్తారు. ఈ బొమ్మల అలంకరణ తన కల్పనలో కనిపించడంతో దాజం ఉద్రేకం ఎక్కువైంది.

"అక్కయ్యా, బొమ్మలకొలువుకి ఈ సెట్ చాలా బాగుంటుంది. మనం కొందాం అక్కయ్యా!" అని భవానిని బతిమాలింది.

రఘుపతి, సత్యమూర్తి రాజం మాటలు విన్నారు. కాని ఇద్దరూ దుకాణంలో మరేదో చూస్తూ ఉండిపోయారు. రాజం కొంచే సేపు ఆగి మళ్ళీ భవానిని అడిగింది. "సరేలే, కొందాం," అని భవాని మాట ఇచ్చింది.

"మనం తప్పకుండా కొనాలి, అక్కయ్యా . . . మా ఊరులో ఆవి దొరకవు."

"అదేం అంత ముఖ్యమా? నువ్వడిగేది నీకా, మీ ఇంటికా?"

ఎవరడుగుతున్నారు ఈ ప్రశ్న?

రాజం విస్తుపోయింది; చంటిపాప తటాలున నిద్రలేచినవెంటనే తల్లి వేగంగావచ్చి పాప నోటిలోనుంచి వేలు బయటకు పీకి "చూడు! ఇలాగే నీ పళ్ళన్నీ పాడుచేసుకుంటావ్!" అని చీవాట్లు పెట్టినట్టనిపించింది.

అవును మరి. ఆ ప్రశ్న అడిగినది రఘుపతికదా? తను ఇంకా చిన్న పిల్లలాగ వ్యవహరిస్తే మరేమౌతుంది? ఈ వయసులో రాజం తనకి అనుగుణమైన మనఃప్రవృత్తి వుందని నిరూపించేవిధంగా మెలగాలి. అలాకాకుండా "నాకీ బొమ్మ కావాలి!" అని ముక్కుతో ఏడవడమా? ఇటీవల రాజం 'ఇది కావాలి,' 'అది కావాలి,' అనే భావాలతో ఊహాలోకంలో సంచారం చేసింది; అవన్నీ ఇక విడిచిపెట్టాలి. ఆమె అంతరాత్మలో ఒక సందేశం వినిపించింది: 'రాజం, నువ్వింత అమాయకురాలుగావుంటే ఎలాగ? నువ్వు ఇప్పుడు ఇంకొక కుటుంబంతో కలిసిపోయావు. ఇక నీ అత్తమామల ఇల్లే నీ నివాసం! నువ్వింకా నీ పుట్టిల్లు గురించి పాడుతూకూర్చుంటే నీ భర్తకు ఎలా అనిపిస్తుంది? అతనికి ఎందుకు ఆశ్చర్యం కలిగిందని అర్థం చేసుకో . . . మరేం గాభరా పడకు . . .అతనికి నీ మనసు తెలుసు . . .'

పొంగివచ్చే వేదన అణచుకొని రాజం చిలిపినవ్వు నవ్వింది. రఘుపతికూడా ఆమెను ఓదార్చే భావంతో "ఈ బొమ్మల్లో ఏం గొప్ప ఉందో నాకర్థం కావటంలేదు!" అని అన్నాడు.

రాజం ఎవరిమాటలూ లక్ష్యం చెయ్యలేదు. "అవును, మా ఆయన అన్నట్టు ఇవన్నీకావాలనడం కుర్రతనం!" అని భవాని అనగానే సత్యమూర్తి "నాకూ ఈ బొమ్మలు చాలా నచ్చాయి. మన చిత్రాకి ఇవ్వాలనే నెపంలో నాకూ ఇవి కొనాలని ఉంది" అన్నారు.

రాజం ఎవరిమాటలూ లక్ష్యం చెయ్యలేదు. "అవును, మా ఆయన అన్నట్టు ఇవన్నీకావాలనడం కుర్రతనం!" అని భవాని అనగానే సత్యమూర్తి "నాకూ ఈ బొమ్మలు చాలా నచ్చాయి. మన చిత్రాకి ఇవ్వాలనే నెపంలో నాకూ ఇవి కొనాలని ఉంది" అన్నారు.

తన ప్రియమైన భర్తకూడా తన్ను తప్పుపెడుతున్నాడు; భవాని తనకి అన్ని విధాలా బుద్ధి చెప్తోంది; మరి కేవలం భవానికి తనమీద ద్వేషమంటే అందులో న్యాయముందా? రాజం మనసులో ఆ భావమే అనిపించింది.

"వదినా, ఈ గాజులు చూడండి. మీకీరంగు నచ్చిందా?" అని భవాని అడిగింది. రాజం చిరునవ్వుతో ఆమెకు జవాబు చెప్పింది.

వదిన ఇంకా కొన్ని రోజుల్లో వెళ్ళిపోతుందని భవాని హృదయం మెత్తబడిందా?

"అన్నయ్య ఉద్యోగం దొరికినవంటనే మమ్మల్ని వదిలి ఎక్కడికో వెళ్ళిపోతాడు. ఆ తరువాత మనం మరెప్పుడు కలిసివుంటామో మనకి తెలియదు. నేను నీమీద చెలాయించే అధికారం ఇంకా ఎన్ని రోజులకి?" అని భవాని అడిగింది.

"అక్కయ్యా, అలాగ అనకండి. మీ మనసులో ఏముందో మీరు నాకు బాహటంగా చెప్తే నాకు మంచిదేకదా?" అని రాజం బదులు చెప్పింది.

'నాకు మరేం కావాలి?' అని రాజం తృప్తి పడింది. తను భవాని సహవాసం మూలంగా ఎన్ని తెలుసుకుంది! ఈ శిక్షణ మంచిదే! కటువైన మందు శరీరంని బాగుచేస్తుంది. ఇప్పుడు భవాని స్నేహభావంతో మాటాడుతోంది. తను ఈ పదిరోజులూ భరించిన బాధలన్నీ వృధా కాదని అర్థం చేసుకోవాలి . . .

ఆ ఒక తలపే రాజంని ఆహ్లాదపరిచింది. ముఖం వాడిన పువ్వు వికసించినట్టు కనిపించింది. 'ఇదిగో, తల్లిదండ్రులనీ, చెల్లెలు, తమ్ముళ్లనీ వదిలి సంసారంలో మొదటి మెట్టులో అడుగుబెట్టి భర్తతో ప్రయాణం చెయ్యబోతుంది! తను ఎంత అదృష్టవంతురాలని గర్వపడింది. తనకేం తక్కువ? భవాని సహకారం, అత్తమామల విశేష ఆదరణ, రఘుపతి చూపే ప్రేమానురాగం - ఇవన్నీ నిండుగా అబ్బాయి.

ఒక రోజులోనే రాజం ముఖం వాడిన పువ్వు వికసించినట్టు కనిపించింది; భర్త లాలనగా విసిరిన చిరునవ్వులకి ప్రతిస్పందన చూపింది. భవాని ఆదేశించిన మరు క్షణమే ఆమెకు సేవ చేయాలని సిద్ధంగా నిలబడింది. చంటిపాపతో ముచ్చలాడింది.

ముద్దులిచ్చింది. రాజంలో సహజంగా కనిపించే వెనుకాడే గుణం, ముందు జాగ్రత్త బదులు అందరిలో సులభంగా కలిసిమెలగాలనే భావన ఆమెకు కలిగింది.

ఇవన్నీ రాజం వినయంకీ, సంస్కారానికీ మంచి ఉదాహరణగా పరిణమించాయి.

రాజం భవానిదగ్గర సెలవుపుచ్చుకొనే సమయం వచ్చింది.

"రాజం, నువ్వు దవుడికి నమస్కారం చేసేవా?" అని భవాని అడిగింది.

"ఓ, మరిచిపోయాను!" అని రాజం గొణుక్కుంది. పూజగదికి వెళ్ళి తిరిగిదాగానే "అక్కయ్యా, మీకూ నమస్కారం చెయ్యనా? మీ ఆశీర్వచనం లేకుండా వెళ్ళడానికి నాకు ఇష్టం లేదు" అని చెప్పింది.

"రాజం, నువ్వు నాకేం నమస్కారం చెయ్యనక్కరలేదు. నువ్వు నన్ను తిట్టకుండావుంటే అదే చాలు . . . ఇప్పుడు నీ మొగుడుతో ప్రయాణం చెయ్యబోయే ఆనందంలో నన్ను శపించకుండా ఉంటే అదే నాకు పెద్ద ఆశ్చర్యం!" అని భవాని ఎత్తిపొడిచింది.

"అయ్యయ్యో, అపేం మాటలు . . . ? మిమ్మల్ని నేనెందుకు శపించాలి . . . ? ఎందుకు నా మీద ఈ ఆరోపణ . . . ? అక్కయ్యా, నేనెప్పుడూ . . . " . రాజం మరేమో అనబోయింది. కాని మాటలు రాలేదు.

"సరేలే, నీ ఏడ్పు ఆరంభమైందా? మా ఇల్లు వదలి నువ్వు వెళ్ళినప్పుడు నువ్వు ఏడవడం అందరూ చూడాలా?"

రాజం మరేం అనలేదు; రెండు మూడు వెక్కుల తరువాత ఊరుకుంది. పెరడుకి వెళ్ళి ముఖం కడుక్కొని తిరిగివచ్చింది. ముఖం ఎర్రబడినా అందులో ఎటువంటి కలవరమూ కనిపించలేదు.

భవాని ఒక వెండి పళ్ళెంలో తాంబూలం అందిస్తూ రాజంకి వీడ్కోలు చెప్పింది. "రాజం, నువ్వు ఇక్కడున్న రోజులు నాకు తృప్తిగా లేవు. నేనెదడిగినా నువ్వు కళ్ళు తడిబెట్టుకుంటే నేను మరేం చెప్పను? నువ్వు మళ్ళీ మా ఇంటికి వచ్చినప్పుడు నీలో మార్పు కనిపిస్తుందంటావా?" అని అడిగింది.

రాజం రాతిలాగ నిలిచిపోయింది. 'నేనిక్కడున్న రోజులు తనకి నచ్చలేదని భవాని అనలేదే? నేనంటే అంత అహస్యమా ? నాలో మంచి గుణాలేవీ లేవనా? నా సేవలేవీ ఆమెకు తృప్తిగా లేవా? నేను మారడం ఎలా సాధ్యం?'

తాంబూలం తీసుకుంటున్న రాజంని ఈ ప్రశ్నలే ఆకట్టుకున్నాయి.

'నేను మారాలంటే నాకు వేరే ఒక ఆడబొడుచు దొరకాలి; అది సాధ్యమా?'

కాని అటువంటి ప్రశ్న రాజంని అదరగొట్టలేదు. ఆ నిర్మల హృదయంలో భ్రమకీ, తత్తరపాటుకీ చోటు లేదు. 'అవును, నేను తప్పక మారితీరాలి!' అని రాజం నిశ్చయం చేసుకుంది.

** ** **

సత్యమూర్తి దంపతులకి రైలుస్టేషన్ లో వీడ్కోలు చెప్పారు.

"ఇక నీ ప్రయాణం సాగనీ . . . . .!"

"అదేదో నేను పుట్టినప్పుడుండే సాగుతోంది!" అన్నాడు రఘుపతి.

"అది కాదోయ్ . . . నేనన్నది నువ్వు నీ భార్యతో చెయ్యబోయే ప్రయాణం . . ."

"అది ఒక సంవత్సరంగా సాగుతోంది . . . ."

"సరేలేవోయ్, నీ హాస్యం . . ." అని విసుగ్గుంటూ సత్యమూర్తి రాజంపక్క తిరిగి "చూసావామ్మా మీ ఆయన వాదం? అతనెప్పుడూ అలాగే! మరి భవాని నన్ను ఇలా గొడవ పెడ్తే నేనేం చెయ్యను? . . . దానికి అసలు అన్నయ్య పోలికే! . . . "అని అన్నారు.

"అక్కయ్య మీతో వాదించి నేనెప్పుడూ చూడలేదే?" అని రాజం చిరునవ్వు నవ్వింది.

"ఓ అలాగా? దానికీ మీ ఆయనే కారణం!" అని చెప్పి సత్యమూర్తి తుంటరిగా కన్నుగొట్టారు. రఘుపతి, రాజం ఒకరినొకరు అర్థపుష్టితో చూసుకున్నారు.

గార్డు పచ్చ జండా చూపించగానే రైలుబండి కదలింది. వెంటనే కొమ్మ నీడకోసం చెట్టుని ఆశ్రయించినట్టు రాజం రఘుపతిపక్క జరిగి ఇరుక్కుంది.

"ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా మనుషులే!" అని రఘుపతి విసుగ్గున్నాడు. "చూసావా, ఈ పక్క కంపార్టమెంటులో అందరూ మిలిటరీవాళ్ళే!" అని రాజంకి చూపించాడు.

"నాకు అందులో కాలుబెట్టగానే ఏదోలా అనిపించింది . . . ఎవరో ముందుకు వచ్చి నాకు జాగా ఇచ్చారు కూడా . . ."

"నువ్వు ఆడదానివని అలా అన్నారు . . . అందరికీ అలా ఇవ్వరు . . ."

"అమ్మయ్యో . . . నిజంగానా?"

"ఏం, అందులో తప్పేముంది? ఇంగ్లీషువాడికి ఆడవాళ్ళు ఇబ్బందిపడకూడదు. నీతో నేనుకూడా ఆ కంపార్టమంటులో ఎక్కుదామనుకున్నాను; కాని నువ్వు వెనకాడగానే ఊరుకున్నాను . . . . నీవలన నాకూ మంచి జాగా దొరికియుండేది!" అన్నాడు రఘుపతి.

"అది తెలిసివుంటే నేనూ భయంలేకుండా వెళ్ళేదాన్ని . . ."

భార్యాభర్తలు ఇలాగే ఏమేమో మాటాడుకున్నారు. రఘుపతి బోలెడు విషయాలు చెప్పాడు. రాజం అవి విని ఆనందించింది. అప్పుడప్పుడు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. రాజం ప్రశ్నలేవీ అడగలేదు. రఘుపతి మాటలు శ్రద్ధగా వింటూ అతని సందేశం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించింది. అతని మాటలు విని ఆమెకు ఆనందమూ గర్వమూ పొంగుకొనివచ్చాయి.

"నువ్వు ఆ బొమ్మలసెట్ చూడగానే చాలా సరదాపడ్డావు; నీ చెల్లెలు, తమ్ముడ్లకి అవి ముచ్చటగా కనిపిస్తాయన్నావు కదూ?" అని రఘుపతి రాజంకి గుర్తుచెసాడు. రాజం నవ్వకుండా "నాకూ అవి చాలా నచ్చాయి. బొమ్మలకొలువులో రైతు, తోటమాలి వంటి బొమ్మలతో రకరకాల ప్రకృతి దృశ్యాలు చూపించవచ్చు. పిల్లలేకాదు, పెద్దలుకూడా ఇష్టపడతారు!" అని చెప్పింది. కాని పిల్లలకి తనేవీ కొనితీసుకువెళ్ళలేదనే తలపు రాగానే ఆమెకు ఆరాటం కలిగింది.

రఘుపతి రాజం మనసులో ఏముందో అర్థం చేసుకోలేదు.

"ఆ బొమ్మలు పిల్లల చేతుళ్ళో ఎన్ని రోజులుంటాయ్? మీ ఇంట్లో ఎప్పుడూ అల్లరి, చడిచప్పుడే . . . పొరుగింటినించికూడా పిల్లలు మీ ఇంటికి దండెత్తడం నేను చూసానుగా?" అని అన్నాడు.

రాజం ఆ మాటలు విని బాధపడింది. హీన స్వరంలో "ఆ పిల్లలు 'కేరం' ఆడడానికి మా యింటికి వస్తారు," అని చెప్పింది. కాని మనసులో ఆ పిల్లల్ని తన కట్టులో ఎలా ఉంచుకోవాలని కల్పన చేసుకుంది: 'మణి, నీ 'కేరం' ఆటలూ, టార్జాను చేష్టలూ కట్టిపెట్టు! గణి, నీకు అస్తమానం బావగారిని ఇదీ అదీ అని ప్రశ్నలడగడం అలవాటైపోయింది;. అందుకు బావగారు చికాగుపడుతున్నారు. రాధై, భోజనం చేసినప్పుడు నువ్వు 'బావగారిపక్కనే కూర్చుంటాను!' అని హఠం చెయ్యకూడదు! నీకు తెలుసా, 'పిల్లలు పెద్దవాళ్ళతో కలిసి భోజనం చెయ్యకూడదు!' అని అతనంటున్నారు. అమ్మకుబదులు బావగారే నీకు వడ్డించాలంటే అతనికి కోపం రాదూ? అతనికి మనందరిమీదా ప్రేమ, అభిమానం ఉంది. మరి మనం అతని మనసు నొచ్చుకున్నట్టు చేస్తే బాగుంటుందా?'

రఘుపతి మనసులో వేరే వేరే ఆలోచనలు.

'నాకీ పిల్లల్ని చూస్తే వింతగా ఉంది. అబ్బబ్బా, ఎప్పుడూ అల్లరే! ఒక నిమిషం ఉత్తికే కూర్చోరు! ఐతనేం, ఈ గొడవలోకూడా మా మామగారు నిశ్చింతగా నిద్రపోతారు! అదెలా సాధ్యం? పొరుగింటి అబ్బాయిని భజంమీద ఎక్కించుకొని అతను గంభీరంగా నిలబడడం చూసి నేను విస్తుపోయాను!'

"కణ్ణన్ అసలు నీ పోలికే!" అని రఘుపతి అనగానే రాజంకి ‘ఓ, అలాగా? అందుకేనా మీకు వాడంటే ఇష్టం?" అని అడగబోయింది. కాని అంతలోనే రఘుపతి "మీ ఇంట్లో అందరూ ఒకటే పోలికతో కనిపిస్తున్నారు!" అన్నాడు. రాజం అభిమానంతో నవ్వింది.

ఇలాగే పరస్పర సమరసం, వైరుధ్యం ఆవిష్కరించే రీతిలో ప్రయాణం సాగింది.

రైలు ఊరు చేరుకుంది. నటరాజన్ దంపతులని కలుసుకున్నారు.స్వాగతం చెప్పారు. కంపార్టుమెంటు వదిలి బయటకి రాగానే రాజం "నాన్నగారూ, మనం పిల్లకేమైనా కొనాలి; అదిగో, ఆ నారింజపళ్ళు కొనండి!" అని చెయిచూపింది. రఘుపతి విస్తుపోయాడు: 'నాన్నగారితో రాజంకి ఎంత చనువుందో?' అని గుర్తు చేసుకున్నాడు. ఇంతసేపూ ప్రయాణంలో రాజం తనకేదీ కావాలని అడగలేదే అని కొంచెం బాధపడ్డాడు. 'సరే కొందాం,' అని ఆమోదించాడు.

కాని నటరాజన్ "వద్దు, అక్కడ ఇంట్లో నారింజపళ్ళు ఉన్నాయి," అని అన్నారు. "ఐతే మరేమైనా కొందాం!" అని రాజం నొప్పిచెప్పగానే అతను "సరే, నీ మాట ఎందుకు కాదనాలి?" అని నవ్వారు. తన జిబ్బానుంచి ఒక పేకెట్ తీసి ఆమెకు అందించి "దీన్ని నీ సంచిలో భద్రంగా ఉంచు," అన్నారు.

"ఇదేం పేకట్టు?"

"చాకలెట్లు; అమ్మ కొనమంది. నీకు జ్ఞాపకం ఉందా? నువ్వు ఇందకుముందు పూరీనించి వచ్చినప్పుడు బిస్కట్లు కొని తీసుకువచ్చావు. ఇప్పుడుకూడా నువ్వు ఏమైనా కొనితెస్తావని పిల్లలు ఎదురుచూస్తున్నారు; నీకేమైనా ఇబ్బందేమో, మరిచిపోతావేమో అని అమ్మ ఈ ఆలోచన చెప్పింది," నటరాజన్ అన్నారు.

"మేం పిల్లలకోసం బొమ్మలే ఆలోచించాం; స్వీట్సు కొనలేదు," అని రఘుపతి కారణం చెప్పాడు.

రాజం జోక్యం చేసుకొని మాటాడింది: "నేనా బొమ్మలు పిల్లలు చూడాలని తీసుకువచ్చాను. అవి నాతోనే ఉంటాయి. నాకొసమే కొన్నాను," అని వివరించింది.

రఘుపతి నవ్వుతూ "మనకెందుకు బొమ్మలు? పిల్లలకిచ్చేయ్!" అన్నాడు, 'మనకి' అని భర్త వాడిన పదం రాజం చెవులకి తీయగా వినిపించింది. సరేనని అభిమానంతో తలూపింది.

ఇల్లు చేరుకున్నవెంటనే రాజం భర్తను పూర్తిగా మరిచిపోయింది. కణ్ణన్ని ఎత్తుకొని నుదుటమీద ముద్దుపెట్టుకుంది. "అమ్మయ్యో, వీడెంత బాగా

పెరిగిపోయాడు!" అని ఆశ్చర్యపడింది. ఇంతకీ ఆమె ఊహలో పొరబాటుంది; కలకత్తా నివాసంలో ఇన్నిరోజులూ చంటిపాప చిత్రాన్ని ఎత్తుకున్న అలవాటు వలన రాజంకి ఆ భావన కలిగింది.

విశాలం రాజంని ప్రశ్నలేవీ అడగలేదు. కాని కూతురు ముఖం చూడగానే ఆ తల్లికి కలకత్తాలో రాజం కటువైన అనుభవాలు భరించిందని బోధపడింది. విశాలం చెప్పింది: "భవాని ఇప్పుడు కొత్త తల్లి కదా? సరిగా నిద్రలేకపోవడం, మాటికీ మాటికీ చికాకు పడడం - ఇవన్నీ ఎప్పుడూ జరిగేవే! పాపకి అన్నీ చేసి, ఓ ఐదు నిమిషాలు భోజనంకి కూర్చుంటే అదీ పెద్ద పరీక్షగా మారుతుంది! అన్నమా? లేక బిడ్డా? 'ఏది ముందు?' అని తల్లి ఎన్నుకోవాలి."

రాజం తల్లిమాటలు శ్రద్ధగా విని అవునని తలూపింది.

## 15

అది 1942 సంవత్సరం.

దేశమంతా స్వాతంత్రపోరాటంలో మునిగిపోయింది. స్వదేశాభిమానులు, విప్లవకారులు, దేశోద్ధారకులు అందరూ ఆ ఉద్యమంలో పాల్గొన్నారు.

అందులో నేరుగా కలుసుకోకపోయినా రఘుపతివంటి యువకులు నిత్యమూ సమకాలీన, రాజకీయ, సామాజిక ప్రశ్నలూ, వాటి పరిమాణాలూ విమర్శన చేస్తూ కాలం గడిపారు. మరి, అతను దొరస్వామిగారి అబ్బాయికదా? ఏ ప్రశ్న ఐనాసరే, దాన్ని అన్ని కోణాల్లోను పరశీలించి, మొహమాటం లేకుండా వాదించాలని అతనికి అభిలాష. ఆ ధోరణి అతను మామగారింటికి వచ్చినప్పుడు బాగా కనిపించింది. రఘుపతి ఆవేశంతోనూ, గట్టిగానూ, మామగారితో చర్చించాడు. ఐతే, నటరాజన్ మాత్రం ఊరుకుంటారా? అతనుకూడా ఎదురుమాట పలికారు; అతనికి గాంధీయత్వంలో మంచి పట్టుదల ఉందికదా?

ఈ చర్చలు కొన్ని సమయాల్లో మితిమీరిపోయినట్లు విశాలం, రాజం జంకారు. రఘుపతి ఎప్పుడైనా చురుకుగా ఒక కృత్రిమ తర్కం పలికితే నటరాజన్ అదేదో కుర్రతనమని తోసిపారేయలేదు. అతని చింత అంతా రఘుపతికి - దేశభక్తులు దొరస్వామిగారి అబ్బాయికి - గాంధీజీగారి ఆదర్శ మార్గంలో ఆసక్తి లేకపోవడమే. కాని రఘుపతి తన సొంత అభిప్రాయాలూ, అభిమానాలూ వక్కాణించి చెప్పడానికి వెనకాడలేదు. మరి, తనకని మనసుందికదా? తన అభిప్రాయాలు నాన్నగారితో ఏకీభవించాలని శాస్త్రమేమైనా ఉందా?

రాజం, విశాలం రఘుపతి నటరాజన్ మధ్య వాదాలు విని బెంగపెట్టుకొనేవారు. గణికూడా ఒక రోజు "ఎందుకమ్మా నాన్నగారూ, బావగారూ దెబ్బలాడుతున్నారు?" అని అడిగేసాడు! ఈ పిల్లలెవరైనా దీనిగురించి చుట్టుపక్కల వాగితే ఏంకాను?

నటరాజన్ కుటుంబంలో ఆంధ్రుల సంప్రదాయాలు చోటుచేసుకున్నాయనే సంగతే ఆ వాదాలకి ముఖ్య అంశంగా కనిపించింది. అందులోనూ అత్తగారి ఆరుగజాల చీరకట్టుని రఘుపతి ఆక్షేపించాడు; తమిళ బ్రాహ్మణ స్త్రీలకు అది నిషేధమని ఆతని తీవ్రమైన అభిప్రాయం.

అంతేకాదు. తన భర్తకి సహజంగా ఆంధ్రుల ఆచారాలూ, వారి జీవితశైలి నచ్చలేదని రాజం గ్రహించింది; బాధపడింది. చాలాసార్లు ఊరులో కొందరు రాజంని "మీరు ఆంధ్రులా లేక తమిళులా?" అని అడిగేవారు. రఘుపతికి అతను ఈ ఊరులో చూసినదీ, అనుభవించేదీ - ఏదీ నచ్చలేదేమో అనే అనుమానం రాజంకి కలిగింది. కాని నటరాజన్ తన అల్లుడికి విరుద్ధం. "ఎవరేమైనా అననీ; నా బ్రతుకంతా ఈ ఊరిలోనే . . . నేను ఆంధ్రులగురించి అనుచితంగా మాటాడాను. అసలు మీకు ఆంధ్రులగురించి ఏం తెలుసు?" అని అతను అల్లుణ్ని ఎదుర్కొనేవారు.

"ఏం, నాకు ఆంధ్రులగురించి ఏమీ తెలియదంటున్నారా?" అని రఘుపతి తనకు తెలిసిన కొన్ని వక్రోత్తులు చెప్పి ఎగతాళి చేసేవాడు.

"వాళ్లు తమ అళ్ళుళ్ళని సంక్రాంతి పండుగకి పిలుస్తారు. అది మన తమిళులలో నిమ్నజాతివారి ఆచారం. ఇక అప్పడాలమాటకొస్తే, మనలాగ అప్పడాలు వొత్తకుండా, నూనెలో వేయించక, ఒత్తి అప్పడాలపిండి అన్నంతో కలుపుకొని తింటారు. ఎవరింటికైనా వెళ్ళాలంటే తమ ఇంటినుంచి నీళ్ళు తీసుకువెళ్తారు. ఒబ్బట్లు చేసినప్పుడు పూరింపుకి కొబ్బరికాయ వాడరు; పప్పే వాడతారు. మనం పోళీ చెయ్యడానికి కొబ్బరికాయే వాడుతాం . . . "

"కొన్ని గ్రామాల్లో నీళ్ళకి కరువు. అందుకే ఆ సంప్రదాయం చోటుచేసుకుంది. భోజనదాతలు కష్టపడకూడదు, ఒకరికొకరు సహాయపడాలనే ఉద్దేశంతో ఆంధ్రులు ఇవన్నీ అలవాటు చేసుకున్నారు," అని నటరాజన్ వాదించేవారు. కాని విశాలం జోక్యం చేసుకొని రఘుపతిని ఆమోదిస్తూ "కొబ్బరాయ వాడడంవలనే మనం చేసే పోళీ రుచిగా, శుచిగా ఉంటుంది!" అనేది.

విశాలం "మగవాళ్ళ వాదాలు చూడడానికి ఇలాగే తీవ్రంగా కనిపిస్తాయి; వాళ్ళు ఎప్పుడూ రాజీపడరని అనుకుంటాం. కాని అలాగేంకాదు!" అని కూతురుని ఓదార్చుతూ చెప్పేది. రాజంకూడా "అవును, నిజమేకాబోలు! ఇలా జోరుగా, గట్టిగా వాదించుకున్నా, త్వరలోనే ఇద్దరూ సహజంగా మిత్రులులాగే కనిపిస్తున్నారు!" అని ఆశ్చర్యపడేది.

కాని రఘుపతి ఆంధ్రులమీద తనకున్న అభిప్రాయం మార్చుకున్నట్టు కనిపించలేదు. అవకాశం దొరికినప్పుడెల్లా తన ఏవడింపు వెల్లడించడం అతనికి అలవాటైపోయింది.

"వాళ్ళు మంచివారే, కాని కొంచెం తెలివితక్కువ . . . ఇంకా కృష్ణదేవరాయల సామ్రాంజ్యంలో ఉన్నట్టు కల్పించుకుంటున్నారు" అని అనేవాడు.

వీలైనంతవరకూ సంభాషణ ఆంధ్రులనుంచి తప్పుకోవాలని రాజం ప్రయత్నించేది; కాని అది ఆసాధ్యమనిపించింది. ఆంధ్రులగురించి కాకపోతే పిల్లల అల్లరి, కర్ణాటక సంగీతంలో తమిళ సాహిత్యంకున్న శ్రేష్టత గురించి రఘుపతి

ఎత్తిపొడిచి మాట్లాడాడు. ఆఖరికి, ఇవన్నీ విని, భ్రమతో రాజం కళ్ళు తడిపెట్టుకునేది.

ఒకరోజు రఘుపతి ఈ మూడు లోపాలని ఒకే సంభాషణలో కలిపాడు.

రాజం, రఘుపతి ఒక సాయంకాలం వాహ్యాళి వెళ్ళినప్పుడు వీధిలో కొందరు వాళ్ళని పదే పదే చూడసాగారు. "మనేం వింత దంపదులుగా కనిపిస్తున్నామా? ఈ ఊరులో భార్యాభర్తలు ఎప్పుడూ బయట కనిపించరా?" అని రఘుపతి పరిహాసం చేసాడు.

రాజం మాటాడానికి జంకింది. ఆ ప్రేక్షకులలో చాలామంది ఆమెకు పరిచితులే. ఇంతకుముందు కొంతమంది కోపంతో, చనువుతో ఆమెను అడిగారు: "ఎందుకు నీ పెళ్ళి ఎక్కడో దక్షిణదేశంలో జరిపారు? నువ్వు పెరిగినదీ, మాతో కలిసిమెలిసి తిరిగిందీ ఈ ఊర్లోనేకదా? నీ పెళ్ళికి రావాలని మేం ఎదురుఆశపడ్డాం, ఆఖరికి మా ఆశంతా నిరాశైపోయింది!" అని ఫిర్యాదు చేసారు. ఇంకా కొంతమంది విశాలంతో "రాజంని మా కోడలుగా చేసుకుందాం అని ఆశించాం. ఇన్నిరోజులూ మాకు రాజం తెలుగుపిల్లలాగే కనిపించింది; ఇప్పుడు మీరు మాకు అన్యులైపోయారు!" అని అన్నారు. రఘుపతిని చూసినవారు "ఓ, ఇతనే మీ అల్లుడుగారా? ఇద్దరికీ మంచి పొత్తుంది!" అని పొగడారు. రాజంకి ఇవన్నీ తెలుసు. తెలిసిన ముఖాలు కనిపిస్తాయనే భావనతో రాజం వాహ్యాళి వెళ్ళడానికి కూడా వెనకాడింది.

"చాలామందికి నన్ను తెలుసు . . . ."

"అతనెవడో నిన్ను చూసి నవ్వడం చూసావా? అతను ఎవరు?"

"మా మహిళా సమాజం సెక్రటరీ భర్త . . . ."

"అతని భార్యపేరు మహిషా?" అని నవ్వుతూ రఘుపతి కన్నుగొట్టాడు; అప్పుడే ఏదో గుర్తు చేసుకున్నాడు.

"నువ్వక్కడ - ఆ సభలో - పాడావుకదూ?"

"అది ఆరు సంవత్సరాలుగా సాగుతోంది . . . . నేనీ సంవత్సరం పాడాను."

"అవును, నువ్వు నాకు రాసావుగా? నలుగురుముందు పాడడానికి భయపడినా, నువ్వు సభలో ధైర్యంగా పాడావని మా ఇంట్లో అందరూ చెప్పుకున్నారు."

వెంటనే ఈ ప్రశ్న లేచింది.

"ఆంధ్రులకి కర్ణాటక సంగీతం ఏం తెలుసు?"

రాజం వెంటనే ఏమీ అనలేదు; కాని రఘుపతి మౌనం గమనించి మొదలుపెట్టింది: "ఈ ఊరులో ఎవరూ తమకి కర్ణాటక సంగీతంలో పాండిత్యముందని చెప్పుకోరు. మరెందుకు మనం దానిగురించి వాదాడాలి? ఈ ఊరులో చెప్పుకోతగ్గ కచేరీలు లేవు; మరి నాకు అభిరుచి ఎలా వస్తుంది? అందుకే పాటమాష్టారుగారు నన్ను రేడియోలో కచేరీలు వినడానికి అలవాటుచేసుకోమన్నారు."

"ఓ, అలాగా . . . మీ మేష్టారు కర్ణాటక సంగీతంలో అజేయులన్న మాట! నేను చూసానుగా అతని వాయింపు . . . "

ఇది ఆమె ఎదురుచూడని దెబ్బ.

"అతనైనా ఈ ఊరులో దొరికారుకదా అని మా అమ్మా, నాన్నా తృప్తి పడుతున్నారు . . . ." అని రాజం గొణుక్కుంది. అది రఘుపతి విన్నాడోలోదో?

'నా తల్లిదండ్రులు శర్మగారిని అభినందించడం రఘుపతికి నచ్చలేదా? అతనికున్నది అల్ప జ్ఞానమని రఘుపతి ఉద్దేశమా? శర్మగారిని ఎగతాళి చెయ్యడంవలన నా భర్త నన్నుకూడా ఎగతాళి చేస్తున్నారనవచ్చా?' . . . . అలా కాదు . . . నాకు సంగీతంలో నైపుణ్యం పెరగాలనే అతని ఆకాంక్ష . . . '

మద్రాసులో మంచి సంగీత విధ్వాంసులున్నారని ఎంతమంది రాజంకి చెప్పలేదు? ఈ ఊరులో తను అభ్యసించిన తరువాత మద్రాసులో మంచి ఆర్టిస్టుగా పేరు పొందవచ్చు. అదేనా రఘుపతి మనసులోని భావన? రాజం తల్లిదండ్రులు ఆమెకు తగిన సంగీత శిక్షణ ఇవ్వాలేదనా అతని ఉద్దేశం? ఆమాటకువస్తే తన

ఊరులో శర్మగారిని విమర్శించేవాళ్లు ఉన్నారు; కాని వాళ్ళందరూ రాజం సంగీతం పొగడినవారే!'

ఇంతలో రఘుపతి నోటిలోనుంచి మరొక ప్రశ్న . . .

"మీ శర్మగారి సంగీతం ఎలావుందో తెలుసా? మీ రాధై అర్ధరాత్రి గభీమని నిద్రలో లేచి 'మిఠాయి కావాలి!' అని కేకలు పెట్టినట్టుంది . . . . "

రాజంకి ఒక నిమిషం ఏమనాలో తెలియలేదు. కొంచెం ఆగి, మాటాడింది: "రాధైకి రాత్రి పగలు భేదం తెలియదు. లేచిన వెంటనే పిల్ల ఏమో గొణుక్కొని మళ్ళీ నిద్రపోతుంది"

చాలా రోజులుగా రాజం సంగీతంలో తనకున్న అభిరుచి గురించి ఆలోచిస్తోంది. దక్షిణదేశంనుంచి చాలాదూరంలో పెరగడంవలన తన సంగీతం అంత బాగా రాణించడంలేదని ఆమె ఉద్దేశం. తను నివసించే వాతావరణమే తనకి అధికంగా లభించిన పొగడ్తకి కారణమని  రాజం ఊహించింది.

తన తల్లికీ అదే అభిప్రాయంవుందని రాజంకి తెలుసు. "అవాళ సుందరమ్మగారు నాతో ఏమన్నారో తెలుసా?'మీ అమ్మాయి  గురువుని మించిన శిష్యురాలుగా కనిపిస్తోంది! రాజంకి స్వాభావికంగా సామర్థ్యం ఉంది' అని. అసలు శర్మగారి సహాయం లేకుంటే ఎలాగ? రాజంకి నేనేం శిక్షణ ఇవ్వగలను? దానికి ఆసక్తి రావడానికి నేనేం చెయ్యగలను? మన అదృష్టం రాజంకి ఒక ఆదర్శ గురువు దొరికారు. అవాళ భవానికూడా అతన్ని పొగడలేదూ?" అని విశాలం అనలేదూ?

"మన ఊరులో కర్ణాటక సంగీతంకి మోజు రావడం ఇప్పుడిప్పుడే ఆరంభించింది," అని శర్మగారు అనేవారు. "ఎంతమంది తల్లులు కూతుళ్ళలో అభిరుచిని ప్రోత్సాహించడానికి పాడుబడతారు! నేనిచ్చేదంతా శిక్షణ మాత్రమే;. ఇక దాన్ని పోషించడం ఆ శిష్యురాలవంతు!"

తన ఊరులో తనకెవరూ సాటీలేకపోవడంతో రాజం తన్నొక మహారాజుగా - లేక మహారాణిగా - భావించింది. తనవయసు కన్యలలో సంగీత జ్ఞానం లోపించడంవలనే తనకి మంచి పేరు వచ్చిందని ఆమెకు తెలుసు.

శర్మగారిని మంచి సంగీత విద్వాంసులని ఈ ఊరులో అందరూ పొగడడం రాజంకి తెలుసు; ఆ మాటలన్నప్పుడు తనూ పక్కనే ఉంది.

'ఇప్పుడెందుకు అందరూ అతన్నే తప్పుపట్టుతున్నారు?' అని రాజం వాపోయింది; తల్లిదండ్రులతో మొరబెట్టుకుంది.

"ఎవరికి తెలుసు? మనం తమిళదేశంలో ఉండివుంటే సంవత్సరానికి ఒక కొత్త పాటమాష్టారు శిక్షణతో నీ గతి ఏమైంటుందో? ఒకే గురువుదగ్గర పాఠం మంచిదేయైంది. మనకి అతనిమీద మంచి విశ్వాసం ఉంది. నువ్వొక తమిళకుటుంబంలో పుట్టినందువలన నీకు సహజంగా సంగీతంలో ఆసక్తి ఉందని అతను అనేవారు. అది వినడానికి మాకు చాలా గర్వంగా ఉంది!" అని నటరాజన్ అన్నారు.

ఆ రాత్రి నిద్రపోవడానికి ముందు రాజం ఆ మాటలు గుర్తుచేసుకుంది.

## 16

'ఒక స్త్రీ తన జీవితంలో నిలదొక్కుకున్నట్లు చెయ్యగల సేవ ఏమైనా ఉందా?'

ఈ ప్రశ్న రాజం మనసులో బాగా నాటుకుపోయింది. చదువు, సంగీత ప్రజ్ఞకంటే ప్రేమానురాగాలతో నిండిన దాంపత్యం, ఓర్పు, అందరికీ సేవచెయ్యాలనే అభిలాష - ఇవన్నీ ముఖ్యమని రాజం తీర్మానించింది. తన భర్తకి M.A. డిగ్రీ ఉందని రాజం గర్వపడలేదు; కాని రఘుపతి తను చదివి ఆనందించిన హాస్యం లేకపోతే వ్యాసం ఉత్సాహంతో భార్యతో విమర్శించినప్పుడు అతను తనమీద చూపే ఆసక్తి, ఆత్మీయత, మర్యాద, రాజం గుర్తుచేసుకుంది. ఇంతకీ - చదువు, సంగీతం - తమిళదేశంలో వీటికేం తక్కువ? తమిళనాడులో దినమూ పాటకచేరీలు సాగుతున్నాయి; B.A. చదవిన ఆడపిల్లలు బోలెడుమందివున్నారు; తను చదినిందేమో పదవక్లాసు, సంగీత జ్ఞానం ఇంకా పెంచుకోవాలి! ఇంటిపనులెన్నో నేర్చుకోవాలి!

రాజంకి అంతా బోధపడింది. తను ఒక ఆదర్శ స్త్రీగా మెలగాలి. అది తన ధర్మమేకాదు. గమ్యంకూడా అని నిశ్చయించుకుంది; విశాలంకి చెప్పింది: "అమ్మా,

నువ్వు మరేం బెంగపెట్టుకోవొద్దు. నాకు పేరూ, ఖ్యాతీ రావాలని ఆశపడుతున్నావా? నాకు కావలసినది సంగీత విద్వాంసురాలు అనే పొగడ్తకాదు! నన్ను మంచి ఇల్లాలని అందరూ అనాలి; నేను అదృష్టవంతురాలని అన్నావుగా? సరే, నాకు కావలసినదేమో తప్పక దొరుకుతుంది; నా కృషికి ఫలం లభిస్తుంది అని అర్థం!. . . . "

రాజం తమ్ముడు కణ్ణన్ తో ఉయ్యాలలూగడం ఆపుకుంది. రఘుపతితో కేఱం ఆడింది. రఘుపతి కారణం లేకుండా ఆమె చేతినుంచి striker లాగుకుంటాడు. కొన్ని సమయాలలో ఆమె పరధ్యానంగా కనిపిస్తే - రాజం గోడమీది ఫోటో సమరేఖలో ఉందా అని చూస్తూంటే - భజంమీద మెల్లగా తట్టి "ఏం ఆలోచన?" అని మందలించేవాడు. ఈ చేష్టలన్నీ రాజంకి బాగా నచ్చాయి.

రఘుపతి తన ఊరికి తిరిగివెళ్ళిన తరువాత అతని రూపం రాజం మనసులో ప్రతిష్టించుకుంది.

మానవ జీవితంలో యౌవనం ఒక శిఖరం; ఆ వయస్సులో అలవడే ఉద్రేకం అణ్ణామలై దీపం వెలిగ్రక్కుతున్న కాంతిలాక నిగనిగలాడుతుంది. దాని అమోఘ శక్తివలన హృదయంలో ధార్మిక గుణాలూ, ఆదర్శబావాలు చోటుచేసుకుంటాయి.

ఇంటికి తిరిగివెళ్ళినతరువాత రఘుపతి రాజంకి ప్రేమలేఖ రాసాడు; ఆమెను తన ఆదర్శపత్నిగా పొగడాడు: "నాకు తెలుసు; నాకు కొందరిమీద సానుభూతి ఉంది; అదేసమయం మరికొందరంటే ఏవ కూడా ఉంది. అది పొరబాటని నేను ఇప్పుడు తెలుసుకున్నాను. మీ నాన్నగారికి ఆంధ్రులంటే ఎంత ఆభిమానం అని చూసినతరువాత నేనుకూడా నాలో ఉన్న కొన్ని అభిప్రాయాలు మార్చుకోవాలనే అభిలాష నాకు కలుగుతోంది." ఆ ఉత్తరం చూసి భవాని మురిసిపోయింది. "నాలో కూడా లోపాలున్నాయి. మీ సహవాసంతో అవి సరిదిద్దుకోవాలని నా ఆశ" అని భర్తకి రాసింది.

దొరస్వామి ఒక మంచిరోజు గుర్తించి రాజం కోడలుగా తమ ఇంటికి రావాలని నటరాజన్ కి రాసారు. రఘుపతి వెళ్ళిన పాట్నా మౌఖిక పరీక్ష ఫలితమవలేదు. తన కొడుకు భార్యని విడిచి ఒంటరిగా నివసించడం అతనికి నచ్చలేదు. శారదంబాళ్ కూడా రాజం అత్తమామలతో కొన్నిరోజులు గడపాలని ఆశించింది. అందువలన త్వరలో నటరాజన్ కుటుంబం తమిళనాడు ప్రయాణం చెయ్యడానికి ఏర్పాట్లు ఆరంభించాయి.

ఆ ప్రయాణం నటరాజన్ వేసవికాల సెలవులో జరిగింది. ప్రయాణంకి ముందే నటరాజన్ రాజంకి చెప్పారు: "నువ్వు కావేరీలాగ వర్ధిల్లాలి. కావేరీ నది ప్రవహించే ప్రదేశంలో సంపద, శ్రేయస్సు కలుగుతాయి. నీవలన అందరికీ కీర్తి, సమృద్ధి లభించుగాక!" అని ఆశీర్వదించారు. చాలారోజుల రైలు ప్రయాణం తరువాత నటరాజన్ అలసిపోయారు. ఆ తరువాత ఒకరోజు నిండినవరకూ అతను కళ్ళకి రాజం కనిపించలేదు. అత్తమామల ఇల్లు చేరుకున్నరువాత ఒకరోజు పూర్తిగా రాజం ఇంటిముందు వసారాకి రాలేదని నటరాజన్ బాధపడ్డారు.

రాజం చాలా ఉత్సాహంతో కనిపించింది. కొత్త వాతావరణంలో తన తల్లితో ఎప్పటిలాగే కలిసి మెలగడానికి తికమకలాడింది; అత్తగారితో చనువు చూపించడానికి వెనకాడింది.

విశాలం-శారదాంబాళ్ పరస్పర చర్యలు అంత సుళువుగా సాగలేదు. అసాధారణంగా శారదాంబాళ్ తొలిగివున్నట్టు రాజంకి తోచింది. 'ఇదేం వింతగా ఉందే?' అని రాజం ఆశ్చర్యపడింది; తల్లితో "అమ్మా, నాకు నీ మనసు అర్ధమైంది. నాకు భవాని అక్కయ్య మంచిపెన్నో నేర్పింది; నాకు నా లోపాలు తెలుసు. నాకు నాభర్త ఆశ్రయం ఎల్లప్పుడూ ఉంది. నువ్వేం దిగులుపడకు. కావేరీనదిలాగ నేను ఆదర్శజీవితం గడుపుతాను. ఇప్పుడు నేను భాగ్యలక్ష్మిని!" అని ఓదార్చింది.

మొట్టమొదటిసారిగా రాజం రఘుపతితో ఆ రాత్రి గడిపింది.

ప్రొద్దవడానికి ముందే విశాలం శారదాంబాళ్ ని వంటగదిలో కలుసుకుంది; పొయ్యినుండి ఇంకా పొగ వస్తూనే ఉంది. కణ్ణన్ని చంకలో పెట్టుకొని విశాలం మాటాడింది: "మామీ, నేను మీకొక సంగతి చెప్పాలి. నేను నా దాంపత్యజీవితం ఆరంభించినప్పుడు మన సాంప్రదాయాలేవీ పాటించలేదు; మా ఆయన అదేవీ ఇష్టపడలేదు. నేను నిన్నటివరకూ కలవరపడుతూనే ఉన్నాను. మీ సలహా విన్నతరువాతే పడకగది పువ్వులతో అలంకరించాను." అది విని శారదాబాళ్ స్తంభించిపోయింది.

విశాలం దాంపత్యం పన్నీరుగంధాలు, పడకగది అలంకారాలు, ఊతుబత్తి పొగలు లేకుండా ఆరంభించిదని విని శారదాంబాళ్ స్తంభించిపోయింది. "అలాగా? . . . నాకు తెలీదు . . . ఐతే నేను నిన్న చెప్పినది మరిచిపోండి!" అని క్షమాపణ కోరుతునట్లు పలికింది. 'మరి ఇంత అమాయకురాలుగా కనిపించినా మీకింతపెద్ద సంసారం ఎలా కలిగింది?' అని పరిహాసం చేసినందుకు బాధపడింది; మరేం అనకుండా పొయ్యినుంచి వచ్చే పొగని చెదరగొట్టింది.

రాజం బొమ్మలకొలువుకి అలంకరించే రోజుల్లోనే ఆదర్శకొడలంటే ఎవరని బాగా అర్థంచేసుకుందని నటరాజన్ కి తెలుసు. ఇంటిలో రెండు బొమ్మలున్నాయి - లక్ష్మి, సరస్వతి. రాజం లక్ష్మి విగ్రహాన్ని ఒక మెట్టమీద అమర్చి, దానికి కింద పంక్తి మెట్టులో సరస్వతిని నిలిపింది. అది చూసి నటరాజన్ "ఈ రెండు బొమ్మలూ మార్చవచ్చుకదా? లక్ష్మివున్నచోట సరస్వతీని ఉంచు; అది పెద్దబొమ్మ, తెల్లగావుంది. కొలువులో అందరినీ ఆకర్షిస్తుంది" అన్నారు.

"అదెలాగ నాన్నగారూ? కోడలుకి అత్తగారికంటే ఎక్కువ మర్యాద ఇవ్వవచ్చునా? నాకూ సరస్వతిని ఒకమెట్టుపైన ఉంచాలని తోచింది" అని రాజం చెప్పింది.

"రాజం చేసినది సరే!" అని విశాలం ఆమోదించింది.

"నాకెప్పుడూ మనం ధనంకంటే విద్యకే ముఖ్యత ఇస్తామనిపిస్తోంది!" అని నటరాజన్ చిరునవ్వు నవ్వారు. రాజంకి నాన్నగారి మనసు బోధపడింది. విద్యకి

ధనంకూడా కావాలిగా? ఆ రెండుబొమ్మలూ అలాగే వదిలేసి రాజం రెండు ఏనుగుల మట్టిబొమ్మలని - అవి దంతాలు మీదకెత్తుకొని నిలబడ్డాయి - లక్ష్మికి రెండుపక్కలా నిలబెట్టింది. ఇప్పుడు లక్ష్మి గజలక్ష్మిగా మారింది; రెండు బత్తీలు ఆ ఏనుగుల దంతాల్లో దూర్చింది.

ఆ రాజేశ్వరి ఈనాడు కోడలుగా తన జీవితం ఆరంభిస్తోందని నటరాజన్ గుర్తుచేసుకున్నారు.

విశాలం చంటిపిల్లని ఎత్తుకొని, కళ్ళు తడిబెట్టుకుంటూ శారదాంబాళ్ దగ్గర సెలవు తీసుకుంది. నటరాజన్, మణి పక్కనే నిలబడ్డారు. ఎనిమిదేళ్ళ రాధై, నాలుగేళ్ళ గణి బయట జట్కా దగ్గర నిలబడ్డారు. విశాలం "సరే, మళ్ళీ కలుసుకుందాం, రాజం, . . ." అని చెప్పి జరిగింది. నటరాజన్ పొంగివస్తున్న తన భావాలు వెల్లడిచేయడానికి ఇష్టపడక గబగబమని బయటికి వెళ్ళి రాధై, గణితో "మీరూ అక్కయ్యని చూడవద్దా. రండి! . . ." అని అంటూ ఇంట్లోకి నడిచారు.

రాజం ఇంతవరకూ మౌనంగానే నిలబడింది. ఇప్పుడు భర్తని, అత్తగారిని చూడగానే ఆమె ముఖంలో అసహజంగా చిరునవ్వు కనిపించింది, కాని కన్నీటి చుక్కలు అలాగే ఉన్నాయి.

రాజంకి గభీమని కణ్ణన్ని పక్కకి లాగుకొని, ముద్దుపెట్టుకోవాలని ఆతురత కలిగింది; కాని కదలడానికి కూడా ఆమెకు చేతకాలేదు.

నటరాజన్ తలూపి సెలవు తీసుకున్నారు. మణి అతనివెంట నడిచాడు. విశాలం నోటినుంచి ఏమాటా రాలేదు. చేతులతో సైగచేస్తూ, కళ్ళు తుడుచుకుంటూ, చీరకొంగుని బిగువుగా భుజంపైపు లాగ్గొని వీధిలో నడిచింది.

దొరస్వామి జట్కా దగ్గరకివచ్చి నిలబడ్డారు. భార్యనిచూసి "మన వియ్యంకురాలు చాలా సాంప్రదాయాల మనిషిగా కనిపిస్తున్నారు. నీకంటే వయసులో చిన్నవారుకూడా, కాని కాళ్ళకి చెప్పులు లేవు!" అన్నారు. ఈ వీడ్కోలు

సమయంలో ఏమైనా చెప్పి నవ్వు పుట్టించాలని అతని ఆలోచన. అది విని విశాలం నవ్వింది కాని అందులో ఎటువంటి ఆనందమూ లేదు. నటరాజన్ భార్యతరువాత జట్కా ఎక్కారు; అతను చెయ్యూపగానే బండి కదిలింది.

రఘుపతి ఇంట్లోకి తిరిగి వచ్చినప్పుడు రాజం కళ్ళలో నీళ్ళు కనిపించాయి. శారదాంబాళ్ దగ్గరకి రాగానే రఘుపతి "అమ్మా, నాకు తాగడానికి మంచినీళ్ళు కావాలి. రాజం కళ్ళలోనుంచి కొంచెం అడగవచ్చా?" అని ఎగతాళి చేసాడు. రాజం అది విని నవ్వుకుంటూ వంటగదికి వెళ్ళిపోయింది.

"ఓ, రాజం ఇంకా ఏడుస్తుందా? . . . .ఇవన్నీ ఆమెకు కొత్తకదా? . . . వాళ్ళ నాన్నగారుకూడా చాలా ఆవేశపూరిత మనిషని తెలిసి నేను ఆశ్చర్యపడ్డాను. మన భవాని అత్తగారింటికి వెళ్ళినప్పుడు ఇలాగేం జరగలేదు. మరి అందరి అనుభవాలు ఒకేలాగుంటాయా?" అని శారదాంబాళ్ అన్నారు.

రాజం ముఖంలో ఇప్పుడు శోకం లేదు. ముఖం బాగా తుడుచుకొని, చిరునవ్వుతో అత్తగారిని చూసింది. శారదాంబాళ్ "రాజం, మనం ఇక హాలుకి వెళ్దాం. నేను భవానికి ఉత్తరం రాయాలి. నువ్వుకూడా కావాలంటే ఏమైనా చదువు" అని అన్నారు.

"ఈ గిన్నెలన్నీ తోమడానికి పెరడులో పెట్టనా?"

"రఘు ఇంకా కాఫీ తాగలేదుగా? . . . నువ్వు కావాలంటే కాఫీకి బదులు కోకో తాగు. పనిమనిషి మూడుగంటలకి వస్తుంది; గిన్నెలు అదే తోముతుంది. మరేం తొందర లేదు."

రాజం అత్తగారివెంట హాలుకి వెళ్ళింది; 'ఇంతకన్న మంచి అత్తగారు నాకెక్కడ దొరుకుతారు?' అని గర్వపడింది.

ఇంతలో దొరస్వామి "రాజలక్ష్మి!" అని కోడలిని పిలిచారు. అతను ఎవరితోనో ముందు వసారాలో మాటాడుతున్నారు. వచ్చిన ఆ పెద్దాయననిచూసి రాజం నమస్కరించింది.

"ఇది ఆంధ్రదేశంలో పెరిగిన పిల్ల సార్! త్యాగరాజు కృతులు అక్షరశుద్ధిగా వినాలంటే మీరు రాజం పాడి వినాలి!" అని దొరస్వామి తన స్నేహితుడికి రాజంని పరిచయం చేసారు; రాజంని బాగా పొగడారు.

"అతనిలో మామగారనే హోదా గొప్పగా కనిపిస్తోంది. మన వీధిలో పోయేవారందరికీ అతను నిన్ను పరిచయం చేస్తారు!" అని విశాలం రాజంని నేరుగా చూడకుండా నవ్వుతూ పలికిన మాటలు రాజంకి వినిపించాయి. 'అత్తగారి కంఠంలో తటాలున ఒక మార్పు కనిపిస్తుందే!' అని రాజం గుర్తుచేసుకుంది.

కాని త్వరలోనే ఆ ఆలోచన జారిపోయింది. "ఇవాళ ఉదయం కొత్త సంచిక వచ్చింది. కావాలంటే చదువు!" అని అంటూ శారదాంబాళ్ ఉత్తరం రాయడానికి ఒక పుస్తకం, కలం, చేతిలో తీసుకున్నారు.

"సంచిక ఎక్కడ?"

"రఘుని అడుగు. వాడికి తెలుసు."

రాజం జరగలేదు. చిలిపినవ్వు నవ్వుతూ అక్కడే నిలబడింది.

"ఏం, నీకు చదవాలనిలేదా?"

"నాకు కొంచెం రెస్టు తీసుకోవాలనివుంది . . . కళ్ళు మండుతున్నట్లు కనిపిస్తోంది."

"ఇంతసేపూ ఏడుస్తూవున్నావుగా? సరే, వెళ్ళి పడుక్కో . . . తలగడ కావాలా?"

"వొద్దు . . . . వొద్దు!"

ఇంతలో రఘుపతి రాజం సంచిక కోసం రాజం తనదగ్గరకి రాలేదని బాధపడ్డాడు. రాజం ఎక్కడ అని తొంగి చూసాడు. అతన్ని చూడగానే రాజం లేచి నిలబడింది.

"చూసావా అమ్మా, నీ కోడలు చూపే మర్యాద?"

"అవును, నేనూ చూస్తూనేవున్నాను. మరి కోడలంటే వచ్చిన రోజే వేరేవిధంగా నడుచుకోవాలా? . . . . ఐనా, స్త్రీలు నిత్యమూ మగవాళ్ళు చెప్పినవన్నీ వినాలా ఏమిటి?"

"అంటే భార్య భర్తమాటలు వినక్కరలేదంటున్నావా?"

"భర్తలు చెప్పినట్టు భార్యలు సొగసుగా వగలాడితే భర్తలు చికాగులో పడతారు; రాజంని కాస్తా నిద్రపోనీయ్ . . . " అని శారదాంబాళ్ కొడుకుని మందలించింది.

రఘుపతి భార్యని ఒకవంకచూస్తూనే తనగదికి వెళ్ళిపోయాడు. రాజం కూర్చుంది. శారదాంబాళ్ భవానికి ఉత్తరం రాయడం ఆరంభించారు. రాజం పక్కనే నిద్రపోయింది.

కాని నిద్రపట్టలేదు; తన ఆదర్శభావాలు అమలుచేయడానికి అది మొదటిరోజు. మరి నిద్ర ఎలా వస్తుంది? శరీరంలో బలం లేకపోయినా మెదడు చురుకుగా. పనిచేస్తూనేవుందికదా?

ఏమైనాసరే, రాజం మనసులో ఒక నమ్మకం తీవ్రంగా లేచింది.

తమ దాంపత్యంలో రఘుపతికి తన తల్లి భార్యల మధ్య ఒక ఆధ్యాత్మికమైన భావముందని తెలియాలి; దానితోబాటు అతను శ్లాఘించే భార్యగా తను పేరు పొందాలి: అదే తన లక్ష్యం అని రాజం నిశ్చయించుకుంది. ప్రేమ, సానుభూతి, సహకారం - వీటి ఆధారంతో తన స్థాయిని పెంచుకోవడమే ఒక స్త్రీ ధర్మం. దానికి తోడు భర్త; కాని అది సఫలమవడం భార్య చేతిలోవుంది. అది తన అందుబాటులో ఉందని రాజం మనసార నమ్మింది.

రాజం కన్నులు మూసి సగం నిద్రలో కునుకుతున్నప్పుడు ఆమెకు శారదాంబాళ్ తన భర్తతో "పాపం, రాజం చిన్నపిల్ల. ఇల్లువదిలి రావడం కష్టమేకదా? ఆమె ఇంతవరకూ ఒంటరిగా ఉండలేదేమో? అని చెప్పిన మాటలు వినిపించాయి. రాజం వెంటనే లేచి కూర్చుంది; పక్కనే దొరస్వామిని చూడగానే తొందరగా లేచి నిలబడింది.

"ఎందుకమ్మా? నీ నిద్ర ఐపోయిందా? పదిహేను నిమిషాలేగా అయ్యాయి?" అని దొరస్వామి అడిగారు.

"నేను పదిహేను నిమిషాలు నిద్రపోయానా?" అని రాజం సిగ్గుపడింది. చింపిరిగావున్న జుత్తుని సర్దుకుంది; రఘుపతి వస్తాడేమో అని దిగులుతో ఒక మూల నిలబడింది.

"నీ కోడలెక్కడ?" అని అడుగుతూ ఒక ముత్తైదువ ఇంట్లోకి వచ్చింది. "రండి, లోపలికి రండి!" అని దొరస్వామి ఆమెకు స్వాగతం పలికారు. "అదిగో, ఆ మూల మా కోడలు నిల్చునివుంది" అని పరిచయం చేసారు.

రాజం ముందుకువచ్చి నమస్కరించింది.

"సరే, కోడలు ఇంటికి వచ్చేసిందన్నమాట! . . . "అని మర్యాదకి మళ్ళీ అడిగి ఆ ముత్తైదువ రాజంని పాదాదికేశంవరకూ పరీక్ష చేసింది.

"చాలా బాగా పాడుతుంది . . ." అని అన్నారు దొరస్వామి.

"సరేలే, ఇంటిపనులు తెలుసునా?" . . . .అని ఆమె రాజంని నేరుగా చూసి "ఏమే, నా ముద్దుకోడలా . . . మీ అమ్మ నీకన్నీ నేర్పిందా?" అని అడిగింది.

రాజం చిరునవ్వు నవ్వింది; మరేం అనలేదు. అబద్ధం చెప్పకూడదనే కారణం వలన ఏం జవాబు చెప్పాలని తెలియలేదు.

ఇంతలో శారదాంబాళ్ జోక్యం చేసుకుంది: "వాళ్ళ అమ్మగారి శిక్షణ ఏమిటో నాకు తెలీదు కాని రాజంకి ఇంటిపనులన్నీ చెయ్యడానికి ఇష్టమే. నాకు ఎప్పుడు ఎది కావలసినా సాయం చేస్తోంది."

"అవును, ఇదేం పెద్ద పని? వంటకి కావలసినవన్నీ అందుబాటులో ఉంటే, నాలుగు పొయ్యిలలో నాలుగు పిండివంటలు చెయ్యడం కష్టమా? . . . నేనూ సులభంగా వండుతాను . . . వంట చేసానుకూడా . . ." అన్నారు దొరసావామి

అవునని శారదాంబాళ్ తలూపింది: "కూరగాయలు తునకలు చెయ్యడం, పిండి కలపడం - ఇవన్నీ నేనే చెయ్యగలను. వంట చెయ్యడానికి నాకు అర్ధగంట చాలు;

ఐతే వంటగది శుభ్రం చెయ్యడం, గిన్నెలన్నీ ఆ ఆ చోటల్లో కూర్చడం - వీటికి రోజంతా పడుతుంది. అందుకు సాయం కావాలి!"

'అమ్మయ్యా' అని రాజం తనలో సంతోషపడింది. వంట అత్తగారే చేస్తారు; తను ఆమెకు అన్నివిధాలా సాయం చేస్తే చాలు. తనగురించి అత్తగారు అందరికీ గొప్పగా చెప్తున్నారు; విశాలంకూడా కూతురుకి అదే చెప్పింది; ప్రయత్నంచేస్తే రాజం ఎదైనా సాధించగలదు అని ఆమె అంటూనేవుందికదా?

"ఈ కోడలికి తొమ్మిదిగజాల చీరకట్టు తెలియనట్టుంది!" అని ముత్తైదువ అనగానే రాజం ఏమీ అనక చిరునవ్వు విసిరింది. "ఏం మీ ఆయనకి ఇష్టంలేదా?" అని ఆవిడ అడగడంతో రాజం మళ్ళీ నవ్వింది. ఇంతలో శారదాంబాళ్ జోక్యం చేసుకొని "వాళ్ళాయనని అడగడం ఎందుకు? నేనే వద్దన్నాను. కిందటివారంవరకూ స్కూలుకి ఆరుగజాలచీరతో వెళ్ళిన పిల్లకదా? ఆరుగజాల చీరలు బోలేడువున్నాయి; అవి మాసిపోయినతరువాత తొమ్మిదిగజాలచీరలు కొనవచ్చు."

అత్తగారికి తనమీద ఎంత సానుభూతి! తొమ్మిదిగజాలచీర కట్టుకోవాలని ఆమె తన్ను బలవంతపెట్టలేదు. అంతేకాదు; తను ఆరుగజాలచీర కట్టుకుంటే ఎవరూ ఆక్షేపించకూడదని ఆమె భావన.

"నేను కూడా అలవాటు చేసుకుని కొన్నిరోజుల్లో తొమ్మిదిగజాలచీర కట్టుతాను."

"అలాగుండాలి . . . . మంచి చురుకైన పిల్ల . . ." అని ముత్తైదువ రాజంని పొగడింది.

"తోమడానికి గిన్నెలేమనా ఉన్నాయా అమ్మా?" అని పనిమనిషి అడిగింది.

"ఇవన్నీ పెరడులో తీసిపెట్టనా?" అని రాజం శారదాంబాళ్ ని అడిగింది.

"సరే . . . దానితోపాటు ఈ చింతపండు తునకలు పడేయ్ . . .''

రాజం వంటగదిలో ప్రవేశించినప్పుడు ఆ ముత్తైదువ మాటలు వినిపించాయి

"ఏమే శారదా, నువ్వు పులిహోర చేసావా?"

"అవును; వియ్యంకులవారికోసం చేసాను . . .''

ఆ ముత్తైదువకి తనమీద అభిమానం కలగాలని రాజం మనసార ఆశించింది; 'ఆవిడ నన్ను కోడలా అని - తన సొంతకోడలులాగ - పిలిచినప్పుడు నేను ఎంత భయపడ్డాను!" అని గుర్తుచేసుకొని సిగ్గుపడింది; తనలో నవ్వుకుంది. అదీ మంచిదే; తనకి వినయం ఉందని ఆవిడకి తెలిసిందికదా?

శారదంబాళ్ - ముత్తైదువ సంభాషణలు రాజం చెవులకి అందాయి. "మా ఆయన 'ఫర్నిచర్, ఇంటి సామానులకి డబ్బుగాని, కానుకగాని తీసుకోను!' అని ఘాటుగా చెప్పేసారు," అని శారదాంహాళ్ అనడంతో ఆవిడ "అవును, నాకు తెలుసుగా దొరస్వామి మనసు?" అని పలికింది. శారదాంబాళ్ "నేనేం అనలేదు; నోరు విప్పలేదు. నా బతుకంతా అలాగే ఐపోయింది" అని నొచ్చుకుంది. రాజం తల్లి మాటలు గుర్తుచేసుకుంది; "దేశంకోసమని భర్త ఉద్యోగం త్యాగం చేసినప్పుడు, పాపం, ఆవిడ మనసు ఎలా ఉండిఉంటుందో?" అని విశాలం అనలేదూ?

ఆ సాయంకాలం కొత్తగా కొందరు అమ్మలక్కలు రాజంని చూడడానికి వచ్చారు; కొత్తకోడల్ని తీవ్రంగా పరీక్షించారు. 'పెద్దవాళ్ళు - ఎవరైనా సరే - వస్తే వాళ్ళకి ఒక నమస్కారం చేస్తే చాలు, మరేం అడగరు; వాళ్ళకదే సంతృప్తి!' అనే రఘుపతి బోధన రాజం గుర్తుచేసుకొని అలాగే చేసింది.

ఆ రాత్రి శారదాంబాళ్ తనే వంట చేసింది. రాజం అత్తగారుతో కలిసిమెలిసి అన్నీ తెలుసుకుంది.

ఆ మరునాడు సాయంకాలం . . .

రఘుపతి వాహ్యాళికి వెళ్ళాడు. దొరస్వామి ఇంట్లో లేరు. శారదాంబాళ్ పూజగదిలో దీపం వెలిగించిన తరువాత "రాజం, నీకు పాడాలని ఉందా?" అని అడిగింది.

రాజం ఒక చిరునవ్వుతో తన కృతజ్ఞతని తెలియజేసింది.

"వయలిన్ వాయించు . . . ."

రాజంకి ఆ సలహా నచ్చింది; నాలుగు రోజులుగా వయలిన్ వాయించలేదు.

"మరేం పనులు లేవా . . . ?"

"రొట్టి చెయ్యాలి . . . అదేం పెద్దపని? . . . నేనే చేస్తాను . . . ."

"నేను పిండి కలపనా? . . . "

"ఎంతమంది కావాలి ఈ రొట్టి చెయ్యడానికి?" అని శారదాంబాళ్ నవ్వింది.

'అత్తగారు వంటగదిలో పనిచేస్తుంటే తను వయలిన్ వాయించడం బాగుంటుందా?' అని రాజం బాధపడింది. అంతేకాదు; తన వాయింపు వినడానికి ఎవరూ లేనప్పుడు అదేం అంత ముఖ్యమా?

## 17

ఆ ముందురాత్రి రాజంకి మొదటిరాత్రి. ఈ దినం మధ్యాహ్నం అత్తమామలతో సాగుతోంది.

రెండోరాత్రిలో కొత్త అనుభవాలీ, మార్పులూ, రానున్నాయని రాజం గుర్తుచేసుకుంది.

శారదాంబాళ్ వంటగది తలుపు మూసేసి, హాలులో ప్రవేశించారు. రాజం ఆవిడ వెనుక నిలబడింది.

శారదాంబాళ్ రెండు గ్లాసులలో పాలు పోసి, ఒకటి రాజంకి అందించారు. పంచదార కలుపుకుందామా అని రాజంకి తోచింది, కాని భవాని ఆ రోజు 'పంచదార పాలు రుచిని పాడు చేస్తుంది,' అన్న మాటలు గర్తుకి రావడంతో పంచదార అడగడానికి సిగ్గుపడి ఊరుకుంది.

''ఇదిగో, నవ్వూ తాగు, పంచదార కావాలా?'' అని శారదాంబాళ్ అడిగారు.

'అవును,' అని రాజం తలూపింది. తనకి అత్తగారంటే భయం లేదు; భవానికి తన అత్తగారంటే భయం కాబోలు. 'నాకు మంచి అత్తగారు దొరికారు,' అని సంతోషించింది.

శారదాంబాళ్ రఘుపతికోసం పాలు పోసి ఒక గ్లాసు రాజంకి అందించారు. కాని రాజం నేరుగా వెళ్ళి రఘుపతికి అది ఇవ్వలేదు. రఘుపతి తన గదిలో మంచంమీద కాళ్ళు చాచుకొని పడుకొనివున్నాడు. రాజం వెళ్ళి ద్వారంముందు నిలబడింది;

రఘుపతి లేచివచ్చి, నవ్వుతూ గ్లాసు అందుకున్నాడు. ఆమెతో కొంతదూరం హాలుకి నడిచివచ్చాడు; తరువాత తన గదికి తిరిగి వెళ్ళిపోయాడు.

"నువ్వూ వెళ్ళి పడుక్కో . . ."

"నా పడక ఎక్కడ?"

"అదిగో," అని చెయిచూపుతూ, ఆ నెపంతోనే తన పడక తీసుకున్న తరువాత, శారదాంబాళ్ రాజంని తన వెంట రమ్మన్నారు.

ఒక మూల కొత్త కంబళితో చుట్టబడిన ఒక మెత్త, పక్కనే కొన్ని తలగడలు, కంబళిలు చూడగానే రాజం, సిగ్గుపడి, వెనకాడింది.

శారదాంబాళ్ తనకి ఒక కంబళి ఎంచుకొని, "సరే, నాకు మరేం వద్దు, నేనన్నీ చూసుకుంటానులే" అని గబగబగా తిరిగి వెళ్ళారు; తనే పడక పరుచుకోడానికి సిద్ధమైయ్యారు.

"అమ్మా, మీకు కంబళి మాత్రం చాలా?" అని అడుగుతూ రాజం అత్తగారిని వెంబడించింది.

"నేను నేలమీదనే చాలా సంవత్సరాలు నిద్ర పోయాను. అమ్మాయీ, నువ్వు వెళ్ళి పడుక్కో."

"నూలెమంచెంకూడా లేకుండా మీరెలా నిద్రపోతారు?" అని రాజం ఆశ్చర్యపడింది. "ఇక్కడకూడా చల్లని గాలి వీస్తోంది, బాగుంది . . . నేనూ ఇక్కడే పడుక్కుంటాను."

శారదాంబాళ్ ఒక చిరు నవ్వు నవ్వారు. రాజం పడక పరచడానికి సిద్ధమౌతుంటే, "బాగుంది నీ చేష్ట! అమ్మాయీ, నా మాట విను. పడగ్గదికి వెళ్ళి పడుక్కో," అని ఆవిడ అన్నారు. రాజం కొంచెసేపాగి అత్తగారి మంచంమీద ఒక కంబళి సర్దింది. తరువాత తన పడక చేతిలో తీసుకుంది. తిరిగి చూసినప్పుడు శారదాంబాళ్ తన ముఖం అటు తిప్పుకొని, కళ్ళు మూసుకొని నిద్రపోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. రాజం ఆవిడకి మనసార కృతజ్ఞత చెప్పి వెళ్ళింది.

తను పడగగదికి వెళ్ళి తలుపు మూస్తూంటే దొరస్వామి భార్యకి చెప్పే మాటలు వినిపించాయి: "శారదా, నువ్వు నిజంగానే చాలా అదృష్టరాలువి! చూసావా, నీ

కోడలు నీకు పడక కూడా విరుస్తోంది! నువ్వెప్పుడూ చురుకుగా ఉండాలని నేను నీకు ఉపదేశం చేసేవాడిని. ఇప్పుడు కోడలు వచ్చినతరవాత నీకేమైనా బద్దకం వచ్చేస్తుందేమో?" అని చెప్పి నవ్వారు. వృద్ధాప్యంలో కూడా దంపతులమధ్య ఆత్మీయత, సౌకుమార్యం ఏమాత్రం తగ్గలేదనడానికి ఇది ఒక నిదర్శనం. రాజం, రఘుపతి ఒకరినొకరు అర్థపుష్టితో చూసుకొని నవ్వుకున్నారు.

ఆ రాత్రి రాజం హాయిగా నిద్రపోయింది. తన కలలు సఫలమవుతాయనే ఆశ, తనకి అన్నివిధాలా ఆదరణ చూపే ఒక కొత్త వాతావరణం లభించిందనే తృప్తి ఆమెను ఆకట్టుకున్నాయి.

*"నువ్వు కావేరీలాగ వర్ధిల్లుతావు!"*

నటరాజన్ అన్నమాటలు నిజమేనా?

వేసవికాలపు వాయువులు వర్షాకాలంలో జడవానగా మారి, కూలంకషగా కావేరీనది ప్రవాహాన్ని అధిగమించుతుందని అందరికి తెలిసిన సంగతేకదా?

ఇందకుముందు రాజం మనసులో పాత జ్ఞాపకాలు - నలుగులోని దుర్ఘటన, తన నడత - జొరబడినా, ఇప్పుడు అక్కడ ఉత్సాహం, కొత్త కళ చోటుచేసుకున్నాయి. ఆమెలో తేలుతున్న మనోహర భావాలు జలధారలో ఎగజిమ్ముకున్నాయి.

రాజం సహజంగా ఉద్వేగానికి లోబడిన వ్యక్తి. ఐతే ఇతరుల మనసును అర్థం చేసుకునే మేధావికూడా. అందువలనే తను ఆశించిన రీతికి పైగానే ఒక ఆదర్శ యువతిగా మెలగడానికి ఆమెకు సాధ్యమైంది; తను చూపే వినయం, నమ్రత వలనే తన్నందరూ మెచ్చుకుంటున్నారనే నమ్మకం కూడా పెరిగింది.

నిష్ఠురమైన మాటలు ఆమె నోటినుండి ఎప్పుడూ రావు. ఆమె పెదిమలమధ్య కనిపించేవి ధవళ దంతాలు. అంటే రాజం ఎప్పుడూ కళ్ళు తడబెట్టుకోలేదని అర్థమా? అలాంటి ఘటనలు లేకపోలేదు. కాని ఆ కన్నీళ్ళని కరువేపాకుని ఆశ్రయించే తడితో పోల్చాలి - కొత్తమల్లి ఆకులోని చెమ్మతోకాదు.

రాజంని ఉత్తికే ఏడిపించాలని రఘుపతి ఒకనాడు అన్నాడు: "మీ పెద్దనాన్నగారి అబ్బాయి నాతో మాటాడాలని వచ్చాడు, కాని అతన్ని లెక్కచెయ్యలేదు." ఇంకొకరోజు: "మీ నాన్నగారికి ఆంధ్రులంటే చాలా ఇష్టంకదా?

మరెందుకు అతనికి వాళ్లలో ఒక అల్లుడు కనిపించలేదు?" అని ఎత్తిపొడిచాడు. కాని రాజం కన్నీరు కార్చడంచూసి జాలి పడ్డాడు. రాజం నలుగులో ఏడవడం అతను చూసాడుగా? 'ఏం, ఎందుకు ఏడుపు? నన్ను పెళ్ళిచేసుకోడానికి ఇష్టం లేకనా?' అనే అనుమానంకూడా కలిగిందే? తనేం అడిగినా రాజం ఏడవకుండా బదులుచెప్పాలని రఘుపతి ఎదురుచూసాడు. కాని ఎంత ప్రియురాలుడైనా అప్పుడప్పుడు వాళ్ళ ఇద్దరి సంబాషణలో కఠినమైన పదాలు రువ్వడం అతనికి అలవాటైపోయింది.

కాని త్వరలోనే అతనికి రాజంకి తనమీదున్న అభిమానం, గౌరవం బాగా అర్ధమైయ్యాయి. తనతల్లిపట్ల ఆమె పైఖరి, ఇంటిపనులలో చురుకుతనం అతను గ్రహించాడు. రాజం కళ్ళలో, మాటల్లో, మంచితనంలో, అప్యాయతలో, గృహ నిర్వహణలో కనిపించే నిబద్ధత అతనిలో స్థిరంగా నిలిచిపోయాయి.

భర్త, అత్తమామలు, రాజంని అభినందించారు. శారదాంబాళ్ కి ఇంటిపనులన్నీ తనే చెయ్యాలని పట్టుదల. సాయంకి కోడలినికూడా పిలవడానికి ఆవిడ ఇష్టపడరు. కాని రాజంలోని చురుకుతనం, తనంతట తనే ఇంటిపనులు చెయ్యాలనే ఆతురత గమనించిన తరువాత ఆవిడ మనసు కరిగింది. సరే అని రాజంని తనతో చేర్చుకున్నారు. భవాని రాజంతో "మా అమ్మకి అహం ఎక్కువ; ఎవరినీ ఎన్నడూ సాయం అడగదు! అందుకే నువ్వు చొరవజేసుకొని అమ్మకి అన్నీ చెయ్యాలి," అని చెప్పలేదూ?

సాధ్యమైనవరకు రాజం అత్తగారినే చుట్టుకునివుండేది. ఆవిడ దినచర్యలూ, పద్ధతులూ శ్రద్ధగా గమనించి మనసులో నిలబెట్టుకునేది. ఆవిడ అడగడానికిముందే తను సాయం చెయ్యడానికి సిద్ధంగా కనిపించేది. ఆవిడ ఏదైనా బరువైన గిన్నెగాని, బిందెగాని ఎత్తడానికో లేక కదపడానికో ప్రయత్నంచేస్తే, తను పరుగెత్తుకొనివెళ్ళి చెయ్యూత ఇచ్చి "అమ్మా, నేనున్నానుగా, నన్ను పిలవరేం?" అని అడిగేది. శారదాంబాళ్ "నువ్వు పక్కలేకపోతే మరెవరిని పిలపడం?" అని అడిగేవారు. రాజం "అమ్మా, ఎందుకలా అంటున్నారు?" అని ఒక చిరునవ్వు నవ్వేది.

ఐతే కొన్ని సమయాల్లో రాజం సంకోచంతో ఏమీ అనక నోరు మూసుకొనేది. గభీమని సారదాంబాళ్ ఎక్కడో సదూరంలో ఉన్నట్లు భావం కలగడంతో రాజం తన

వైఖరి మార్చుకుంటుంది. 'ఏమైందని? అత్తగారు తన తల్లికి ఏమైనా సందేశం పంపిస్తున్నారా?' అనే అనుమానం ఆమె మనసులో లేస్తుంది. 'కానీ, అది నా మంచికే!' అని రాజం నచ్చజెప్పుకుంటుంది. తనేం పిరికిపంద కాదు; తనలో లోపాలేవీ లేవు అనే గర్వం రాజంకి లేదు. ఇతరులకి తనలో కనిపించే మంచీ, చెడూ గురించి వినడానికి ఆమె సిద్ధంగానే ఉంది. నిమ్మపండులో చేదు వుంది; చింతపండులోనూ చేదు ఉంది. కాని మనం వాటిని చూసే తీరు వేరే వేరే కదా? నిమ్మపండులోని మన ఆరోగ్యానికి అనుకూలమైన గుణాలు చింతపండులో లేవు. అలాగే రాజం హృదయంలో కనికరం, దయాళుగుణాలతోబాటు, సానుభూతీ, చనువూ కూడా ఆకట్టుకున్నాయి.

ఒక రోజు . . .

రఘుపతి తలనొప్పితో తన గదిలో పడుకొనివున్నాడు. భర్త దగ్గర వెళ్ళడానికి రాజం జంకింది. 'మరెవరైనా అతన్ని చూసుకోరా? అప్పుడప్పుడు అతనికి తలనొప్పి రావడం మామూలే అని శారదాంబాళ్ చెప్పారుగా?' అని రాజం తనలో తనే చెప్పుకుంది; అత్తగారి సలహాతో - రఘుపతికూడా ఆమోదించడంతో - వేడి నూనెలో మిరియాలు కలిపి, ఒక సీసాలో కషాయం తయారుచేసింది. కషాయంతో రాజం ప్రవేశించినప్పుడు రఘుపతి తలలో ఒక రుమాలు చుట్టుకొని, మంచంమీద పడుకొనివున్నాడు. రాజంని చూడగానే, లేచి, చిరునవ్వుతో సీసా అందుకొని పక్కకి రమ్మన్నాడు; సీసా మూత తెరిచి తన నుదుటమీద తైలం రుద్దమని, తల వంచాడు. హాలులో ఉన్న శారదాంబాళ్ కళ్ళు తనమీదే నాటుకున్నట్టు రాజంకి భ్రమ కలిగింది. 'ఇన్నిరోజులూ వాడికి నేనేకదా అన్నీ చేసాను?' అని ఆవిడ అనుకుంటున్నారేమో అనే భావన ఇప్పుడే రాజంకి కలిగింది.

"అమ్మని ఇది మీ నుదుటమీద రుద్దమనండి; నేను రుద్దుతే మీ కళ్ళలో కార్చుతానేమో అని భయంగా ఉంది," అని తడబాటుతో రాజం బతిమాలడం చూసి రఘుపతి లేచి హాలుకి నడిచివచ్చాడు. శారదాంబాళ్ "అవునా, నేను నమ్మలేకున్నాను. ఆఖరికి నువ్వు నిజంగా తల్లికొడుకే అన్నమాట!" అని నవ్వారు. తనేదో పెద్ద త్యాగం చేసినట్టు రాజం తృప్తిపడింది.

ఇంకొక రోజు . . .

రాజం ముఖమంతా ఎర్రబడిపోయి, తలనొప్పితో బాధపడింది. కాని ఎవరితోనూ ఏమీ అనలేదు. కోడళ్ళు అనారోగ్యమనే నెపంతో, మొండిగా పనిచెయ్యరనే కబుర్లు రాజం వినివుంది. కాని ఆ రోజు సాయంకాలం రాజం ధోరణి చూడగానే, శారదాంబాళ్ దిగులుపడ్డారు. "రాజం, ఏమైంది నీకు?" అని ఆవిడ అడగ్గానే, "మరేం లేదు, కొంచెం తలనొప్పిగా ఉంది," అని రాజం చెప్పింది. రఘుపతి thermometer తీసుకొనివచ్చాడు. ఒకరోజులోనే జ్వరం పోయింది, కాని తన అనారోగ్యానికి రాజం సిగ్గుపడింది. మరుసటిరోజునుంచి మళ్ళీ తన దినచర్యలకి సిద్ధమైంది.

ఇంటికి రాసిన ఉత్తరాల్లో రాజం తన భర్త, అత్తమామలగురించి నిష్పటంగా, ఏదీ దాచక రాసింది. తపాలులో చేర్చేముందు భర్తకి చూపి అతను అనుమతి కోరింది. కొన్ని పాతజ్ఞాపకాలలో, ఉద్రేకబడి, కళ్ళు తడబెట్టుకున్నా పక్కనేవున్న అత్తగారినిచూసి చిరునవ్వు విసిరేది. "నా చుట్టూ ఉంటున్న అందరికీ నామీద అభిమానం ఉంది. మిమ్మల్ని వదిలి ఉండడం నాకంత బాధగా లేదు. కాని నేను మీ జేష్టకొమార్తె. నేను దగ్గరవుండకపోవడంవలన మీకెలావుందో అనే నా మనోవ్యద. ఆదరణ చూపే అత్రగారూ, నవ్వు పుట్టించే ధోరణితో మాటాడే మామగారూ, ఆదర్శ భర్త - వీరందరూ నా జీవితంలో ప్రకాశించి నాకు దారి చూపడం నా భాగ్యం," అని రాజం రాసిన వాక్యాలని చదవగానే, మెచ్చుకొని, రఘుపతి తల్లికి గట్టిగా అది చదివి వినిపించాడు.

"ఒకరి మనోభావాలు నోటితో చెప్పడంలోనూ, ఉత్తరాల్లో రాయడంలోనూ ఒక అందం ఉంది," అని శారదాంబాళ్ కూడా రాజంని మెచ్చుకున్నారు.

ఇంకొక ఉత్తరంలో రాజం తన తల్లికి "ఒక స్త్రీ చదువూ, సంగీతంలో తప్పనిసరిగా ప్రావీణ్యం పొందాలని నేనను. తన జీవితం సఫలమయిదనే తృప్తి ఆమెకు కలిగితే అదే చాలు," అని వక్కాణించి చెప్పింది.

అది చదివి "నువ్వు నిజంగానే అలా అంటున్నావా?" అని రఘుపతి భార్యను అడిగాడు.

"అమ్మా, చూసారా, ఇతను నన్ను ఎలా ఎగతాళి చేస్తున్నారో? నేను రాసినది మీకెలా అనిపిస్తోంది?" అని రాజం ఉత్తరం అందించింది.

"వాడి మాటలు వినకు," అని శారదాంబాళ్ ఒదార్చారు, కాని ఆవిడ ఉత్తరం చదవలేదు.

తను ఇటీవల పుస్తకాలేవీ చదవలేదని, సంగీతంలో ఆసక్తి చూపడంలేదని రాజం రాయడానికి కారణముంది. ఒక పొరుగింటి ముత్తైదువ "ఎంత మంచి పిల్ల ఈ రాజం! నేను వాళ్ళ ఇంట్లోకి దూరడానికిముందే తను ముందుకువచ్చి నన్ను లోపలికి రమ్మంటుంది; అది ఒక్కటే చాలు!" అన్న మెచ్చుకోలు రాజం మనసులో నాటుకుపోయింది. మరి పుస్తకాలూ, సంగీత జ్ఞానం, వయలిన్ పాఠాలెందుకు? అంతేకాక, ఇక్కడ ఎవరికీ వాటిగురించి ఏ చింతా లేదే?"

ఇక్కడకి కొత్తగా వచ్చిన రోజుల్లో రాజం వయలిన్ అభ్యాసం చెయ్యాలని ఆశించింది; కాని భవాని మాటలు జ్ఞప్తి చేసుకొని వెనకాడింది. అత్తగారికి సాయం చేయకుండా తన అభ్యాసం ఏం అంత ముఖ్యమా?

శారదాంబాళ్ స్వేచ్ఛగా ఉన్నప్పుడు తను అభ్యాసం చేయవచ్చు; కాని అటువంటి అవకాశాలు రాజంకి దొరకనేలేదు. ఆవిడకి అప్పడాలు ఒక ఎడతెగని వృత్తిగా ఐపోయింది.

అత్తగారికి అప్పడాలమీదవున్న ఆసక్తి రాజంకి విడ్డూరంగా కనిపించింది. ఆవిడకి మనసులో ఎప్పుడైనా నిరుత్సాహమో, ఆశాభంగమో, చీకాకో తలయెత్తినా, 'అప్పడాలు' అన్నమాట వినగానే దేహంలో చైతన్యం కనిపిస్తుంది; ఆ క్షణమే, ముఖం విరసిల్లి, రాజంతో కులాసాగా పిచ్చాపాటీ మాటాడుకుంటూ ఆవిడ అప్పడాలు వత్తుతారు; మనఃపూర్వంగా కనిపించే ఆ కుతూహలం చూసి రాజంకి ఒకటే ఆశ్చర్యం!

శారదాంబాళ్ అందరికీ - కూతురు భవాని, వియ్యంకులవారు, ఇరుగుపొరుగులవారు మాత్రమే కాదు - అపరిచుతులకూ, అన్యులకుకూడా అప్పడాలు చేసి ఇవ్వడం అలవాటైపోయింది. అదేమో ఒక పెద్దపనిగా ఆవిడకి అనిపించలేదు. "మనకేం శ్రమ? పెళ్ళిళ్ళకీ, పబ్బాలకీ మాత్రమేకాదు, నాలుగైదు

రకాలు తినాలంటే అప్పడాలూ, వడియాలూ తప్పక కావాలి! వీటికంటే మంచి అల్పాహారం మరేదైనావుందా?" అని ఆవిడ ఉద్దేశం. ఆవిడ ఒకరోజు రాజంతో "నువ్వు నాకు సాయం చేయాలనడంవలనే నేను సరే అన్నాను. లేకపోతే నా అంతట నేనే అన్నీ చెయ్యగలను. భవాని పెళ్ళికి నాకెవరి తోడూ లేదే?" అని అన్నారు.

ఏది ఎలాగున్నా, వర్షం కురిసినా, ఎండ కాచినా, అప్పడాల మాటకివస్తే శారదాంబాళ్ కి సాటి ఎవరూ లేరని రాజంకి బోధపడింది.

"అమ్మా, నా పెళ్ళికీ మీరే అప్పడాలు చేసారా?" అని అడిగింది.

"లేదు. అప్పుడు అమావాశై ఉన్నాడు, నాకు సాయం చేసాడు. అందుకోసం నేను వాడికి ఒక గొడుగు కొని ఇచ్చాను."

అప్పడాలు తయారుచెయ్యడంలో సుళువైన అంశాలు రెండు: పప్పులు నానబెట్టడం, బియ్యంపిండి కలపడం. కాని దానికీ శారదాంబాళ్ కోడలిని సాయంకి పిలవలేదు. "మా అమ్మకి నూరు అప్పడాలు చెయ్యాలన్నాకూడా హడలే!" అని రాజం చెప్పింది.

తనింటి సంగతులేమైనా చెప్పాలంటే రాజం 'అక్కడ' అనే పదం వాడుతుంది. 'మాఇంట్లో' అని ఎప్పుడూ అనదు. తనింటిని గొప్పగా చెప్పకూడదు అని ఆమె దృఢ నమ్మకం. కాని తన చెల్లెలు, తమ్ముడ్లగురించి మాటవస్తే వాళ్ళని పొగడాలని ఇష్టపడుతుంది. రఘుపతికి ఇటువంటి విషయాల్లో ఆసక్తి లేదని రాజంకి తెలుసు.

భర్తకి తనలాగే తన చెల్లెలు, తమ్ముడ్లపై అభిమానం కలగాలని రాజం ఆశించింది. తన బంధువులేకాదు, బాలబాలికులెవరైనా సరే ఆమెకు చాలా ప్రీతీ, సానుభూతీ. ఒకసారి వారింటి పనిమనిషి కొడుకు - ఒక కుర్రవాడు - హాలుకి వచ్చి తక్కిన పిల్లలందరూ రేడియో ప్రోగ్రాం వింటుంటే నేలమీద కూర్చున్నాడు. రాజం ఎంతచెప్పినా అబ్బాయి బెంచెమీద కూర్చోలేదు. అదే విధంగానే, ఇప్పుడు ముందు వసారాలో రేడియోలో మ్రోగుతుంటే అది వినడానికి రాజం మనసు సంకోచపడుతోందిగా?

ఇంకొకరోజు, మరో అబ్బాయిగురించి రాజం తల్లికి చెప్పింది. ఆరేళ్ళ కుర్రవాడు - వాళ్ళ నాన్నగారు స్కూలులో ప్రవేశపెట్టడానికి వాడిని తీసికెళ్ళారు. అతన్ని ఏవరో అడిగారట: "Admission రెండో క్లాసులోనా లేక మూడో క్లాసులోనా?" అని. అది విన్న ఆ కుర్రవాడు "నాన్నగారూ, రెండో క్లాసే మంచిది. మూడో క్లాసు చాలా కిక్కిరిసి ఉంటుంది," అని అన్నాడట. వాళ్ళ కుటుంబం ఎప్పుడూ మూడో క్లాసులోనే రైలు ప్రయాణం చేస్తారు. అందుకే కుర్రవాడు అలాగ అడిగాడు. ఇటువంటి ముచ్చటలు రాజం మనసులో మరపురాని ఘటనలుగా నిలిచిపోయాయి; మరి అవి పదే పదే ఆమెకు జ్ఞప్తికి రావడంలో ఆశ్చర్యమేముంది?

## 18

*'సఫలమైన జీవితం - అదే ఒక స్త్రీకి లక్ష్యం . . . '*

ఇదే రాజం మనసులో నాటుకుపోయిన భావన. కాని నటరాజన్ తనకు తోచిన విధంగా "శర్మగారు నీ సంగీత సాధకం గురించి అడుగుతున్నారు. నువ్వు దానిగురించి ఉత్తరాల్లో ఏమీ రాయడంలేదు. 'రాజం తప్పక సాధకం చేస్తుండాలి, లేకపోతే దానిగురించి రాసివుండేది,' అని నేను అతనికి చెప్పాను. నువ్వు రాస్తేనే అతను నమ్ముతారు," అని రాసారు.

ఆ ఉత్తరం చూసి దొరస్వామికూడా ఆశ్చర్యపడ్డారు. "ఏం, రాజం, నువ్వు వయలిన్ అభ్యాసం మానేసావా?" అని అడిగారు.

రాజం నవ్వి ఏమీ అనక ఊరుకుంది. కాని శారదాంబాళ్ జోక్యం చేసుకొని "నేనూ రెండు మూడు సార్లు అడిగాను; ఏమీ చెప్పలేదు. అవాళ నలుగులో పాడమంటే రాజం ఏడవలేదూ?" అని అన్నారు.

రాజం ఉలికిపడింది; కేక పెట్టాలనుకుంది. 'నేను ఆ పాత రాజం కాదు: ఇప్పుడు బాగా మారిపోయాను. మీరు నాకు ఒకే ఒక అవకాశమిస్తారా?' అని అడగాలనుకుంది, కాని నోరు విప్పలేదు.

ఇరుగుపొరుగులనంచి చాలామంది శారదాంబాళ్ ని చూడవచ్చారు. అందరూ కోడలిని పొగడారు. కాని ఎవరూ ఆమెను పాడివినిపించమని అడగలేదు.

తను ఇంటికి ఉత్తరం రాయాలి. అందువలనే రాజం "నేనివాళ అభ్యాసం చెయ్యనా?" అని అత్తగారిని అడిగింది. ఆమె సరే అనగానే సాధకం ఆరంభించింది.

ఆ రోజు ఉత్సాహంతో రాజం వయలిన్ వాయించింది. ఇంటిపనులూ చేసింది. "నాకేం భయంలేదు!" అనే నమ్మకం దృడపరుచుకుంది. ఆత్తగారు ఎంచిన రెండు మూడు కీర్తనలు వాయించింది. తన మనసుకి నచ్చినంతగా అవి రాణించలేదు. ఒక వారం తరువాత మళ్ళీ సాధకం చేసింది. 'సరేలే, మరేం భయం వద్దు. నేను సంగీతంలో నాకున్న ప్రతిభను కోల్పోను!' అని మనసార నమ్మింది.

కాని, అప్పుడే చిక్కులు ఆరంభమయ్యాయి!

భవానిభర్తకి నాగ్ పూరుకి బదిలీ అయింది. ఆ ఉరులో కొత్తగా బాధ్యత వహించడానికిముందు తన భార్య ఆమె తల్లిదండ్రులతో కొన్నిరోజులు గడపాలని అతను నిశ్చయించారు.

భవానిరాక విని రాజం మనసు సంతోషంతో ఊగిసలాడింది.

'నేనుగాని మా ఇంటికి వస్తున్నానంటే నాకు ఎటువంటి ఆతిధ్యం, స్వాగతం దొరుకుతాయి!' అని రాజం కల్పన చేసుకుంది. 'మరి భవాని అక్క వస్తున్నాదంటే ఇక్కడ ఎటువంటి ఆతురత కనిపించదేం?' అని ఆశ్చర్యపడింది. అందువలనే భవానికి స్వాగతం చెప్పినప్పుడు రాజం గొంతులో త్రాణ బాగా చోటుచేసుకుంది. "అక్కా, రండి, చిత్రాని నాకు ఇవ్వండి," అని అడిగింది. పక్కగదిలో మౌనంగా నిలబడిన సత్యమూర్తిని రేడియోదగ్గరవున్న కూర్చీలో కూర్చోమంది. నిమ్మళంగా ఉన్న ఆ వాతావరణంని రాజం ప్రవర్తన కొంచెం మెరుగుబెట్టిందని చెప్పవచ్చు.

ఆ రోజు సాయంకాలం సత్యమూర్తి, భవాని, రాజం ఇద్దరిని తమ తమ వాద్యాలతో వాయించిచూపించమన్నారు. రాజం తను అనుకున్న విధంగా హాలులో వీణ, వయలిన్ అమర్చింది; శ్రోతలకోసం చాప విరిచింది; పక్కనే, ఒక కూజాలో మంచినీళ్ళు పెట్టింది. తను భవానిదగ్గర తమిళ కీర్తనలు నేర్చుకోవాని ఇన్నిరోజులూ ఆమె మనసు ఉవ్విళ్ళూరుకుంటోందికదా?

ఇద్దరూ ఆభోగి రాగంలో వర్ణం వాయించారు. భవానికి శిక్షణ, అభ్యాసం లేవు. రాజంకి రెండూ ఉన్నాయి. భవాని ప్రదర్శనలో లోపాలు స్పష్టంగా కనిపించాయి.

వాయింపు పూర్తవగానే భవాని తల్లిని చూసి "వదిన రోజూ సాధకం చేస్తోందా?" అని అడిగింది.

"అవును," అని శారదాంబాళ్ అన్నారు.

"అలాగా? అందువలనే వదినలో మంచి చురుకుతనం కనిపిస్తోంది!" అని భవాని అనిష్టంగా మూల్గింది. "నాకు వీణపక్కన వెళ్ళడానికికాడా టైము దొరికితేనా? ఎప్పుడూ ఏదో పని, తొందర. ఇంట్లో మేం ముగ్గురమేవున్నాం, కాని ఒక పులుసు, ఒక కూర చేస్తే సరిపోతుందా? . . . .లంచుకు, డిన్నర్ కి ఇంకా ఏవేవో వండాలి . . . రెండు కుంపట్లు ఉన్నా ఏం లాభం? ఒకటి మరీ చిన్నది, ఇంకొకటి మరీ పెద్దది. ఎంతసేపూ వంటగదిలోనే నా బతుకంతా ఐపోయింది," అని వాపోయింది.

ఆ మాటలు వినగానే, రాజం మనసులో తల్లి విశాలంపై సానుభూతితోపాటు పలురకాల చింతనలు లేచాయి. 'అమ్మా, నేను నీకు ఇంటిలో సాయం చెయ్యలేదనీ, పెద్ద పాపం చేసానని ఇప్పుడు బాధ పడుతున్నాను. నువ్వే ఒంటరిగా ఎన్ని పనులు చేసావ్! జ్యేష్టకొమార్తెగా నేనన్నీ నీ దగ్గర నేర్చుకున్నానని నా అత్తగారు నన్ను పొగడుతున్నారు. అక్కడకి మళ్ళీ వచ్చినప్పుడు నేను తప్పకుండా సాయం చేస్తాను,' అని రాజం తనలో చెప్పుకుంది.

సత్యమూర్తి భవాని చేతులతో ఎత్తుకున్న వీణని చూస్తూ శారదాంబాళ్ కి చెప్పారు: "చూసారా, మీ అమ్మాయి వీణ పట్టుకుంటూనే ఇంటి గొడవలు మాటాడుతోంది." రఘుపతిని చూసి అతను ఒక చిరునవ్వు నవ్వారు; రఘుపతి తల తిప్పి రాజంని చూసాడు.

భవాని వీణని పక్కకి పెట్టి లేచింది. "రేపు మీ రైలు ప్రయాణం, మరి నేను వీణతో కూర్చుంటే ఎలాగ? ఇవాళ శుక్రవారం, మనం కోవిలకి వెళ్దాం, రండి," అని పిలిచింది. సత్యమూర్తి భార్యతో కోవిలకి బయలుదేరారు.

రఘుపతి నవ్వాడు. "నేను మిమ్మల్ని వాహ్యాళికి పిలిచాను. మీరేమో రైలు ప్రయాణం తరువాత అలసటగా ఉందన్నారు," అని అతనికి గుర్తు చేసాడు.

"నా భార్య నన్ను కోవిలకి రమ్మంటోంది. నేను నీతో నీ స్నేహితుడ్ని చూడడానికి ఎలా వస్తాను?"

"నేనడిగింది అసలు మీ company కోసం. నేనేం స్నేహితుడ్ని చూడదలచుకోలేదు," అని అంటూ రఘుపతి నిష్క్రమించాడు.

భవాని అతని వీపు చూస్తూ మాటాడింది: "అన్నయ్య బయటికి వెళ్ళకుండా, ఇంటిలో మా అయన కంపెనీ కావాలని అడగడం నేను ఇంతకుముందు ఎప్పుడూ చూడనేలేదు. ఇప్పుడు వాడికి ఇల్లూ, వంటగది ఉంటే చాలనిపిస్తోంది!"

'ఇదేంటి, అక్కయ్య మాటల్లో ఏమైనా అర్థముందా?' అని రాజం విస్తుబోయింది. 'అదేలాగ? మాఆయన ఐదు గంటలకి బయటికి వెళ్తే ఏడు గంటలకి తిరిగివస్తున్నారు. అప్పుడే నేను ముఖం కడుక్కొని చూడదగ్గని విధంగా అతనిముందు దర్శనమిస్తున్నాను,' అని తనలో చెప్పుకుంది.

వచ్చిన రెండురోజులకే సత్యమూర్తి ఊరుకి తిరిగివెళ్ళడానికి సిద్ధమైయ్యారు. అందకుముందు అత్తగారితో "నాకు మీ అప్పడాలు కావాలి. మీ Egg Brand అప్పడాలు ఇస్తారా?" అని అడిగారు.

"నేనప్పుడే మీకు నాలుగు పేకెట్లు ఇవ్వదలచుకున్నాను. రెండు మీకు, రెండు మీ అమ్మగారికి," ఇని శారదాంబాళ్ చెప్తూంటే భవాని అక్కడకి వచ్చింది.

"మీరేమంటున్నారు? . . . . మా అమ్మ చేసే అప్పడాలు చూస్తే మీకు గుడ్డు జ్ఞాపకంకి వస్తోందా? . . . ఏం, అవి గుండ్రంగా లేవా?" అని అడిగింది.

సత్యమూర్తి నవ్వారు. "నేను Egg అన్నప్పుడు Zero అనే అర్థంలో అన్నాను. అంటే ఈ అప్పడాలకి విలువ చెప్పలేం అన్న మాట!" అని అన్నారు.

తల్లి చేసే అప్పడాలని తన భర్త ఎగతాళి చేస్తున్నారని భవాని చీదరపడింది; కాని శారదాంబాళ్ అల్లుడి పరిహాసం అర్థం చేసుకొని తనలో నవ్వుకుంది.

ఈ జగడం, వాగ్వివాదం చూసి రాజం ఆనందించింది. 'దాంపత్యంలో ఎన్ని విధాల ముచ్చటలు!' అని ఆహ్లాదపడింది. తనకూ భవిష్యత్తులో ఒక పొడుగాటి జీవితం కాచుకొనివుంది; తనూ ఆ ముచ్చటలు క్రమేపి అనుభవించే రోజులున్నాయి.

భవానిలాగే తనూ తన అనుభవాలు భర్తతో పంచుకోవాలి; రాజం కథల్లో చదివినవీ, ఊహించినవీ తప్పకుండా సఫలమవుతాయి.

భర్త నిష్క్రమణంతో భవాని మనసు బాధ పడుతోందని రాజం గుర్తు చేసుకొని ఆమెను ఉల్లాసపరచాలని "అక్కయ్యా, అలసటకి ఔషదం సంగీతం. రండి, మనం పాడదాం!" అని పిలిచింది. అత్తగారితో రాత్రి భోజనంకి చెయ్యవలసిన పనులేవీ లేవని ఖాయపరుచుకొని భవానికోసం చాప విరిచింది.

భవాని కులాసాగా సరే అని వచ్చి కూర్చుంది. శృతి పెట్టెని సర్దుకొని రాజం భవానిని తనకిష్టమైన కొన్ని కీర్తనలు పాడమంది. అవన్నీ పాడేసి భవాని "రాజం, ఇక చాలు; శృతి పెట్టెని మూసేయ్," అని చెప్పింది.

భవాని తన్ను పాడమని అడగలేదని రాజంకి నిరాశ పడింది. ఎక్కడ, తనకి కెవ్వుమని ఏడవాలనిపిస్తుందేమో అనికూడా భయపడింది. "అక్కయ్యా, ఇటీవల నేను కొత్త కీర్తనలు నేర్చుకున్నాను. ఇంతకుముందు నాకు ఒక కీర్తన తెలుసుకోడానికి ఒక, రెండు మాసాలు పట్టేవి, కాని ఈ మధ్య నేను ఇంకా శ్రద్ధగా అభ్యసిస్తున్నాను. నేను కలకత్తా వచ్చినప్పుడు మీరు '*మామ వసుధ*' పాడి విన్నాను. అప్పుడే దాని పల్లవి నేర్చుకున్నాను. ఇక వచ్చే నాలుగు రోజుల్లో అనుపల్లవి, చరణంకూడా తెలుసుకోవాలనివుంది. మీరు నేర్పుతారా?" అని అడిగింది.

భవాని నిర్లక్ష్యంగా ఒక చూపు విసిరింది. "అది ఇంకో రోజు చేద్దాం; నువ్విప్పుడు '*ఎంత నేర్చినా*' అనుపల్లవి పాడు. నాకు శావేరీ రాగమంటే చాలా ఇష్టం. ఈ ప్రాంతాల్లో చాలామందికి అది తెలియదు," అని అనడంతో రాజంకి కొంచెం ఉత్సాహం కలిగింది.

"త్యాగరాజు కృతులే బోలేడువున్నాయి," అని గొణుకుతూ రాజం శృతిపెట్టె అందుకుంది. భవాని "రాజం, శృతిపెట్టె అక్కరలేదు; నువ్వు అనుపల్లవి మాత్రం పాడు," అని అనడంతో రాజం ముఖం తెల్లబారింది. ఏ కీర్తన పాడినా నియమం ప్రకారం పాడాలని ఆమెకు శర్మగారు వక్కాణించి చెప్పివున్నారు. 'రూఢిగా కాకుండా, ముక్కలు ముక్కలుగా కీర్తన పాడితే అది వాగ్గేయకారకులను మనం అవమానం చేసినట్టు లెక్క!' అని అతని హెచ్చరిక రాజం గుర్తుచేసుకుంది.

"అక్కయ్యా, అనుపల్లవితో ఎందుకు పాట ఆరంభించాలి? అది సరేనా?"

"ఏం, ఎందుకు కూడదు? పేరు మోసిన గాయకులెంతమంది '*బాల కనకమయ*' తో ఆరంభిస్తున్నారు! అలాగే '*ఏల నీ దయరాదు?*' కూడా. అదీ చాలా పేరుపొందిన కీర్తన. త్యాగరాజు మొట్టమొదటి కృతి."

పల్లవి ముందు అనుపల్లవి గుర్తుచేసుకొని పాడడానికి రాజేశ్వరి కొంచెం ప్రయాసపడింది. మెల్లమెల్లగా పల్లవి, అనుపల్లవి వరుసలని జ్ఞాపకం చేసుకుంటూ, భవాని సూచనలని ఆమోదిస్తూ, అక్కడక్కట ఆపి, స్వరం, ఉచ్చారణ సర్దుకొని, పాడింది.

"సరే, ఇక చరణం పాడు," అని భవాని చెప్పగానే రాజం తృప్తితే అలాగే చేసింది. తన గానపద్ధతిలో చరణం తునకలు, తునకలుగా కాకుండా సమగ్రతతో కలిసివచ్చిందని ఆహ్లాదించింది కూడా.

చరణం ముగింపులో '*వరద వెంకటేశ*' అనే పదబంధం వచ్చింది. అది గ్రంధకర్తని గుర్తించే చిహ్నం. "నువ్వన్నట్టు ఇదేం త్యాగరాజు కృతి కాదు. నీకు స్వరకర్తపేరుకూడా తెలియదు! నీకు కర్ణాటక సంగీతంలో ఏ ఆసక్తీ లేదు! నీకు తెలిసినదంతా సినిమా పాటలతో సరి!" అని భవాని ఎత్తిపొడిచింది.

తన గానం రాజం గ్రామఫోను రికార్డులాగ వినాలని భవాని ఆడిన కుయుక్తి అర్ధమవగానే రాజం ముఖం తెల్లబారింది. మంచి వేళ, అమె కళ్ళు తడబెట్టుకోవడానికి ముందే భవాని "రా, మనం పొరుగింటికి వెళ్దాం. నువ్వు చిత్రాన్ని ఎత్తుకో," అని అనడంతో రాజం సంతోషంతో సిద్ధమైంది. ఆమె ఇల్లు వదలి బయటికి వెళ్ళి ఎన్ని రోజులయ్యాయో!

## 19

తమ ఇంటి చుట్టుపక్కలలోనే యౌవనదశలో ఒక పాట మేష్టారున్నారని భవానికి తెలిసింది. అతని దగ్గర సంగీతం నేర్చుకోవాలని తల్లికి చెప్పింది; త్వరలో ఆమె శిక్షణకి అన్ని ఏర్పాట్లూ జరిగాయి.

రాజంకూడా ఆతురతతో పాట మాష్టారు రాక ఎదురుచూసింది. 'నాకూ అతని శిష్యురాలవడానికి అవకాశం దొరకవచ్చునేమో?' అని ఆశించింది.

పాట మాష్టారు ఝుంకార ధ్వనితో రెండు కీర్తనలు తను పాడినతరువాత పాఠం మొదలుపెట్టారు. శ్రోతలందరూ - హాలుకి దూరంగా కూర్చున్న దొరస్వామి, రఘుపతి కూడా – విని పులకరించారు. నియమం ప్రకారం పాఠం ఆరంభంలో భవాని ఒక సంస్కృత శ్లోకం, వినాయకునిమీద ఒక ప్రార్థన పాడింది. ఆమె సంగీత ప్రజ్ఞ రాజం మనసుని కరిగించింది.

గిన్నెలు తోముతూనే రాజం ఆ పాటలు విన్నతరువాత వంటగదికి వచ్చింది. ఆమె ముఖంలో ఏమైనా సూచనలు శారదాంబాళ్ గుర్తించారా?

"నువ్వుకూడా ఈ పాటలు క్రమేపి నేర్చుకోవచ్చు. పాట మాష్టారుకి మనం విశేషంగా మరేం డబ్బు ఇవ్వనక్కరలేదు," అని ఆమె అనగానే రాజంకి కొన్ని క్షణాలు ఊపిరాడలేదు; కాని సర్దుకొని "అవునమ్మా, ఉత్తికే ఎందుకి ఖర్చు?" అనిమాత్రం చెప్పగలిగింది. కన్నుమూలనుంచి ఒక బొట్టు రాలింది కూడా; కాని ఆ వేడి బుగ్గలో అదెంతసేపు నిలబడుతుంది? క్షణంలో వట్టిపోయింది.

ఐనా శారదాంబాళ్ అన్నట్టుగానే రాజం సంగీత ప్రజ్ఞ మెరుగుపడుతోందని ఆ తరువాత వచ్చిన రోజులు నిరూపించాయి. తన గురువు ముందు భవాని ఏది పాడినా, అది రాజం తనలో లీనం చేసుకుంది. ఆ సాహిత్యంలో స్ఫురించే లాలిత్యం, సొగసు రాజం మనసూ, చెవులూ, నాలికా సహజంగా గ్రహించాయి. ఆ పాటలు ఆమెకు కంఠస్తమైపోయాయి. నోరు తెరవకుండానే ఆ పాటలు మనసులో ఆలపించుకుంచుకోవడంవలన తను పాఠం నేర్చుకున్నట్టు రాజంకి తోచింది. 'ఇదెలా సాధ్యమైంది?" అని ఆశ్చర్యపడింది కూడా. అలసట, చికాకుని ఎదిరించుకొని, ఏకలవ్యుని తీవ్రతతో తన అత్యాశ తీర్చుకోవాలని పూనుకుంది.

సంసారంలో ప్రవేశించగానే ఒక యువతి ప్రవర్తన ఎలాగ మారాలి? పెళ్ళగించి తన్ను ఒక నూతన వాతావరణంలో - భర్త, అత్మామామల మధ్య - నాటుతున్నట్లు గుర్తుచేసుకోవాలి. వివాహబంధంలో అంటుకొని, ఈ కొత్త ఆవరణలో తను మంచి పేరు పొందాలి.

తన భర్త పరిస్థితిని రాజం బాగా తెలుసుకుంది. అతనికి తన తల్లిదండ్రులు, చెల్లెలుమీద అభిమానముంది. కొత్తగా వచ్చిన భార్యకు అతను ప్రియుడు, చెలికాడు. ఈ ఇంటిలో అతనికి అందరితోనూ సంబంధముందని రాజం గ్రహించింది; తనొక గృహలక్ష్మిగా అత్తామామలకి భక్తితో సేవ చేస్తూ అందరిని మెప్పించుకొని మంచి పేరూ, ప్రతిష్ఠా సంపాదించుకోవాలి. తన జీవిత ఆదర్శం ఇదే: 'అందరూ నన్ను శ్లాఘించాలి, నాకు ఆదరణ చూపాలి. నిరంతర కృషితో ఈ ఇంటిలో ఉన్న అందరితోనూ నేను ఆత్మీయతతో మెలగాలి. వీరందరూ నా శ్రేయస్సు కోరేవారే.'

ఒకరోజు భవాని "రాజం, స్నానంకి వేడినీళ్లు రెడీయేనా? నా బట్టలు తీసిపెట్టు," అని చెప్పింది. రాజం సరే అని అలాగే చేసింది. స్నానం తరువాత భవాని అడగడానికిముందే "అక్కయ్యా, మీకేం చీర, జాకెట్టు కావాలి?" అని అడిగింది. ఇలాగే రెండుమూడు రోజులు గడిచాయి. అది చూసి మామగారు "రాజం,నువ్వెందుకు ఇవన్నీ చెయ్యాలి? భవాని తనే బట్టలు తీసుకురాదా?" అని అడిగారు. రాజం బదులుచెప్పక నవ్వేసి ఊరుకుంది. భవాని తండ్రికి "నేను వొద్దన్నాను. మరి రాజం నా మాట వింటేనా?" అని సమాధానం చెప్పింది. ఆ మాటలు విని రాజం తనకేదో పెద్దబిరుదు దొరికినట్టు ఆహ్లాదించింది.

అసలు భవాని ఇంటినుంచి ఎప్పుడూ కదలదు. పాప చిత్రా ఎప్పుడైనా ఇంట్లో అకస్మాత్తుగా దారిమళ్ళిపోతే "రాజం, వెళ్ళు, వెళ్ళు, దాన్ని తీసుకో . . . అదెక్కడైనా జారిపోతుంది!" అని కేకవేస్తుంది, కాని తన జాగానుంచి ఎన్నడూ జరగదు. ఆమె చేతులెప్పుడూ ఒక స్వెటరు లేక శాలువ అల్లుతూవుంటాయి.

కొన్నిసార్లు ఆమె ప్రవర్తన వింతగా కూడా కనిపించింది.

ఒకరాత్రి, ఇంటిపనులన్నీ ఐనతరువాత రాజం పెరడుకి వెళ్ళే తలుపు మూసి పడగ్గదికి వెళ్ళబోతుంటే భవాని రాజంని "ఇక్కడకి రా," అని పిలిచింది. రాజం వెళ్ళింది.

"పెరడు తలుపు తెరు; నేను వచ్చేవరకూ ఇక్కడే నిలబడు,"

రాజం అలాగే చేసింది. భవాని పెరటిలోకి వెళ్ళి పళ్ళు తోముకుంది. నీళ్ళతో పుక్కిలించుకొని తిరిగి వచ్చింది. “నేనివాళ రాత్రి స్వీట్స్ తిన్నాను. పళ్లు బాగా చూసుకోవాలి,” అని చెప్పి వెళ్ళిపోయింది.

‘దేవుడా, ఈ పెరడు తలుపు తెరవడానికీ, మూయడానికేనా నన్ను పిలిచింది?’ అని రాజం కలవరపడింది.

## 20

కొన్నిరోజులుగా నటరాజన్ మనసులో తన కూతురుని వెంటనే చూడాలని తాపత్రయపడ్డారు. ఇంతకీ అత్తవారింటికి ఆమె వెళ్ళి ఆరునెలలే అయ్యాయి. అతని భార్యకూడా అంత తొందరపడలేదు. రాజం గురించి సంభాషణ వచ్చినప్పుడల్లా ఆ తండ్రి కళ్ళు తడబెట్టుకున్నారు.

‘రాజం అక్కడ సంతోషంగావుంది; ఎందుకెందుకీ ఆరాటం?’ అని అతను తన్ను తనే ఊరడించుకొనేవారు. కాని ఆ మరుక్షణమే ఆ విశ్వాశం నీటిమీద రాసిన రేఖలాగ కరిగిపోయేది.

‘ఒకసారి వెళ్ళి రాజంని చూస్తే చాలు, మనసు కుదుటపడుతుంది,’ అని అంతరాత్మ వక్కాణించేది. చెప్పింది. కూతురిని కన్నికాదానం చేసినప్పుడో, వియ్యంకులవారి ఇంటిలో వీడ్కోలు ఇచ్చినప్పుడో, అతను అంత బాధపడలేదు. ఈ ఎడబాటు ఇంత కఠినంగా మారుతుందని అతను కల్పనకూడా చెయ్యలేదు. ఊహ

“రాజం మనల్ని మరిచిపోయింది. అక్కడ భర్తతో, అత్తమామలతో హాయిగావుంది. తను అందరి ప్రేమానురాగాలూ అనుభవిస్తున్నట్టు ఆమె రాయలేదూ? అలాగే కానీ, తనకి జీవితాంతం సర్వోత్తమ విషయాలు నేర్పించిన తల్లిదండ్రులగురించి ఎప్పుడూ మాటాడదేం? మనగురించి, ఈ ఇల్లూ వాకిలిగురించి ఎప్పుడైనా తలపోసుకుంటుందా? ఒక్క మాటలో సమాధానం చెప్పాలంటే ‘లేదు!’ అని అనాలి.”

అతను ఒక తమిళ పద్యం గుర్తుచేసుకున్నారు:

‘ముత్యం తన సొంతదారులకే సుఖం ఇస్తుంది; తన పుట్టిల్లైన సముద్రానికి అది ఎన్నడూ కృతజ్ఞత చూపదు.’

“రాజం నక్షత్రం స్వాతి కదా? దానికి ఇంకో అర్థం కూడా ఉంది - పరిశుద్ధ ముత్యం!”

నటరాజన్ చూపు తలవాకిటి వసారానుంచి తోటముందున్న నల్ల పూలతొట్టిమీద పడింది. ఆ రోజు నిండుగా వికసించిన పువ్వులు చూసి రాజం ఏమంది? “నేను ఈ పూల సహవాశం పూర్తిగా అనుభవించడమైంది. నాకు జీవితంలో ఇది చిరస్మరణీయంగా నాటుకుపోయింది.” భర్తను కలుసుకోడానికి ఆమె చేయబోతున్న ప్రయాణంకి రెండురోజులముందన్న మాటలవి.

నటరాజన్ కూడా ఈ రోజుల్లో పూర్తిగా విరిసిన పువ్వులు చూస్తున్నారు. కాని అతనికి ఇల్లంతా నిరాధారమైన, పువ్వులు వాలిపోయిన వృక్షంలాగ కనిపిస్తోంది. అతని హృదయం క్షీణించిపోయిన మొక్కలాగ వేదన పడుతోంది.

“మీరొకసారి వెళ్ళి రావచ్చుగా?” అని విశాలం కూడా ఒకరోజు అడిగింది, కాని నటరాజన్ భార్యమాట వినలేదు. విశాలం తనలాగే మనసులో వ్యాకులపడుతోందని అతనికి తెలియదా? రాజం పేరు వినగానే విశాలం ముఖం తెల్లబారడం అతనూ గ్రహించారు. పిల్లలుకూడా అక్కయ్యగురించి ఎప్పుడూ నోరు తెరవలేదు.

“రఘుపతికి ఉద్యోగం దొరికినతరువాత తీరిక లేకపోవచ్చు. ఇప్పుడతను రాజంతో ఇక్కడికి వస్తే బాగున్ను,” అని నటరాజన్ అన్నారు. కాని మనసులో ఇటీవల దాంపత్యం ఆరంభించిన జంటకు తన కోరిక అడ్డుగా ఉంటుందేమో అని అతను బాధపడ్డారు. అలవాటుగా అతను వార్తా పత్రికలు చదివివుంటే సరసమైన వృత్తాంతాలూ, సందేశాలూ - దేశంలో, అంతర్జాతీయ రంగంలో జరుగుతున్నవి - అతనికి కొంతవరకు సుఖానుభూతి ఇవ్వడానికి అవకాశం ఉండేది. కాని అతని మనసంతా రాజం గురించే; రాజకీయ వార్తల అనుసరణ అతను పూర్తిగా ఆపుకున్నారు.

‘నాన్నగారూ . . . నాన్నగారూ . . . ‘

‘ఎవరది? రాజం కంఠధ్వనిలాగుందే? అవును, రాజేశ్వరియే!’

‘అవును, రాజం జట్కానుండి తన్ను పిలుస్తోంది . . . ఎందుకు బండి మన ఇల్లు దాటి పెళ్తోంది? . . . ఆమె నోటినుండి వస్తున్న మధురధ్వని నీరసంగా వినిపిస్తుందే!’

నటరాజన్ తొందరతొందరగా, చేతిలో వార్తాపత్రికతోనే బయటకివచ్చి వీధిలో నడుస్తూ నాలుగిళ్ళు దాటారు. ఆ జట్కానుంచి ఇంకొక స్త్రీ ముఖం అతను గమనించారు; అది శాంబశివంగారి భార్య.

నటరాజన్ ఏమీ మాటాడక అలాగే నిల్చున్నారు. ఇంతలో ఇంకొక జట్కాకూడా వచ్చి ఆగింది. అందులో శాంబశివం మాత్రమే - పడక, సూట్ కేసులతో కనిపించారు.

“నటరాజన్, ఇదిగో, మీ అమ్మాయిని తీసుకొచ్చేనోయ్! . . . ” అని నవ్వుతూ శాంబశివం అన్నారు. “మరి నాకు *పరుప్పు తేంగాయ్*[1] ఇస్తావా?”

శాంబశివం హాస్యమాడుతున్నారని నటరాజన్ గ్రహించారు. తన ఇంటిముంచు నిలబడివున్న చిన్నమ్మాయి రాధైని దగ్గరకి పిలిచి, “పెళ్ళు, అమ్మతో నేను రాజంతో ఇంటికి వస్తున్నానని చెప్పు,” అని చెప్పారు. బండిలో జాగాలేదని తెలిసినతరువాత మళ్ళీ తనింటికి ఒంటరిగా నడవసాగారు.

“నేను నిన్ను అలాగే వదిలిపెట్టను. నీ భార్యకు చెప్పు. ‘*పరుప్పు తేంగాయ్*’ తెమ్మను,” అని శాంబశివం మళ్ళీ హెచ్చరిక చేసారు.

నటరాజన్ కి ఆతనేమంటున్నారో అర్థమైంది.

“సరేలేండి, మీ ఇంటికి పంపిస్తాను.”

“మంచిది. నేనంటున్నది లాంఛనం, మన సంప్రదాయం గురించే. మరేంకాదు.”

ఇంతలో ఇంటిని దాటుకుంటూ పోయిన జట్కాలో పెళ్తున్న రాజంని చూసి విశాలంకూడా అక్కడ వచ్చేసింది.

---

[1] ఇది తమిళుల పెళ్ళిలో ఒక ముఖ్యమైన పిండివంట.

“నువ్వు వెళ్ళి ‘*పరుప్పు తేంగాయ్*’ చెయ్యడం ఆరంభించు. మధ్యాహ్న భోజనంకి తొందరపడవద్దు. నేను వెళ్ళి రాజంతో వస్తాను.” అని నటరాజన్ ఆమెకు చెప్పారు.

“మీరు వెళ్ళనక్కరలేదు. నాకు మైసూర్ పాక్ చెయ్యడం ఏం పెద్దపని కాదు. మీరు వెళ్ళి స్నానం చెయ్యండి. నేను పనిమనిషిని పంపించి పళ్ళూ, పూలూ, తమలపాకూ, తాంబూలం అన్నీతెమ్మంటాను. అతను (ఆమె అంటున్నది శాంబశివం గురించి) అడుగుతన్నది న్యాయం. మనం అతనికి చెయ్యవలసిన మర్యాద మరిచిపోవద్దు. అమ్మాయిని మనింటికి తీసుకొచ్చారని మనం అతనికి కృతజ్ఞత చూపాలి.” విశాలంకూడా భర్తతో ఇంటికి నడుస్తూంటే వాళ్ళ ఆఖరి అబ్బాయి మణి పరుగెత్తుకొని వచ్చి “అమ్మా, నేను అక్కయ్యను చూసేసాను!” అని అరిచాడు. తల్లిదగ్గరకి రాగానే, ఆమె చెవిలో “అమ్మా, చూడడానికి అక్కయ్య ఎలాగో కనిపిస్తోంది. ఎందుకో ఏడుస్తున్నట్లుంది,” అని అన్నాడు. విశాలం ఏమీ అనకుండా కన్నీళ్ళు తుడుచుకుంది.

విశాలంను చూడగానే రాజంకి తల్లిని బిగ్గఱగా పిలవాలని ఆతురత కలిగింది; కాని, వెంటనే ఊరుకుంది. అవును మరి. పక్కనే శాంబశివంగారు - నాన్నగారడిగే ప్రశ్నలకి - బదులు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారుగా?

“రాజం ఎందుకు ఇంత నలుకువగా కనిపిస్తోంది?” అని నటరాజన్ అడిగారు. శాంబశివం వెంటనే “నీకేం తెలియదా? రాజం ఇప్పుడు తన అత్తమామలతో ఉంది.” ఒక చంటి పిల్ల సాంకేతిక బాషలో గుర్తుచేస్తున్నట్లు రాజం తండ్రిమీద ఒక కడగంటి చూపు విసిరి తల వంచుకుంది.

నటరాజన్ బక్కచిక్కిపోయిన రాజం దేహం చూసి తన్ను తానే నొచ్చుకున్నారు. చొరబడుతున్న కన్నీళ్ళూ, భావాలూ చెరబెట్టుకొని రాజంపై చూపు నిలుపుతూనే అతను ఆమె వెంట నడిచారు.

‘వీళ్ళెందుకిలా చేసారు?’ అని అతని మనసు కుంటుతూ ప్రశ్నించింది, చిరచిరలాడింది. “వాళ్ళుకాని నువ్వు వస్తున్నావని నాకు ఒక కార్డు రాసివుంటే నేను రైల్వే స్టేషన్ కి వచ్చివుండేవాడ్ని,” అని తన మానసిక బాధ రాజంకి తెలియజేసారు.

అతని మనసులో శాంబశివం '*పరుప్పు తేంగాయ్*' పరిగ్రహించుకొని రాజంని నియమం ప్రకారంగా తనకి ఒప్పగించడానికి వచ్చారనే నమ్మకం రాలేదు. శాంబశివం భోజనప్రియుడని అతనికి తెలుసు. అందువలనే అసలు కారణమేమిటో రాజం తెలియజేయగానే అతనికి ఆశ్చర్యం కలిగింది: "నాన్నగారూ, మీరు శాంబశివంగారు ఏమన్నారో విన్నారా? మరి నా అత్తమామలకి ఆత్మగౌరవం నిలుపుకోవాలని ఉండదా?" అని రాజం అడిగింది. కొద్దిసమయంముందు నటరాజన్ మనసులో వియ్యంకులవారు రాజం రాకను ఆమె తల్లిదండ్రులు ఆశతో ఎదురుచూస్తున్నారనే కారణంవలనే ఆమెను పంపారనే భావం కలిగింది.

ఇంటి వసారాలో చంటిపాప కణ్ణన్ తో నిలబడియున్న తల్లిని రాజం గమనించింది. ఇరుగుపొరుగుల్లో కొందరు తన్ను చూస్తున్నారు అని తెలుసుకొని మెల్లిగా నవ్వింది.

పాపని ఒకే లాగులో తన చేతుల్లోకి తీసుకోవాలని రాజం ప్రయత్నించింది. కాని విశాలం ముందుకొని మాటాడింది.

"అమ్మా. . . అమ్మా, అమ్మా . . . "

విశాలం కుడిచేత్తో కూతుర్ని గట్టిగా కప్పుకుంది. రాజం హాయిగా తల్లి కౌగిలిలో కలిసిపోయింది. ఒక ఆకస్మిక సంఘటనగా కనిపించినా ఆ దృశ్యం కొన్ని క్షణాలకే మిగిలింది.

"అమ్మా . . ."

"రాజం, ఏడవకమ్మా . . ."

తల్లీ, కూతురూ, సర్దుకొని కలవరపాటునుంచి మెల్ల మెల్లగా తమ్మల్ని విడిపించుకున్నారు.

రాజం మొట్టమొదట ఇల్లు వదిలి అత్తవారింటికి వెళ్ళినప్పుడు నటరాజన్ కుటుంబంలో అందరూ చాలా బాధపడ్డారు. ఇప్పుడు ఆమె రాకతో వాళ్ళ ఆనందం అత్యున్నతికి అందుకుంది.

రాజం శాంబశివం దంపతులతో తను అకస్మాత్తుగా వచ్చిన కారణం వివరించి చెప్పింది. రఘుపతికి బొంబాయిలో ఇంటర్వ్యూ రావడంతో అతను ప్రయాణానికి

సిద్ధమవుతుండగా సత్యమూర్తి భవాని నాగ్ పూర్ కి వస్తోందని రాసారు. శారదాంబాళ్ కూతురుతో నాగ్ పూర్ కి వెళ్ళాలని నిశ్చయించింది. అలాగయితే రాజంని ఒంటరిగా ఇంట్లో వదిలిపెట్టడమా అని పెద్దలు ఆలోచించారు. ఇంతలో శాంబశివం దొరస్వామిని కలుసుకున్నారు. అతని తోడుతో రాజంని ఆమె ఊరుకి పంపించాలని తీర్మానం అయింది.

విశాలం మళ్ళీ తన మనసు విప్పి మాటాడింది: "శాంబశివం మనల్ని బహుమానం అడగడంలో న్యాయముంది. అతనివలనే కదా రాజం ఇక్కడకి రావడమైంది?" అని వాదాడింది.

కాని నటరాజన్ భార్యను చూస్తూ "నా అభిప్రాయం వేరు. రఘుపతి కొన్ని రోజుల్లో ఇంటర్వ్యూ ముగించుకొని వచ్చేస్తాడు కదా? నన్నడిగితే కొత్త దంపతుల కొన్ని రోజుల ఏకాంతం అతను పాడు చేసారంటాను," అని అన్నారు.

ఇప్పుడు రాజం జోక్యం చేసుకొని మాటాడింది: "ఇంటర్వ్యూ ఐన తరువాత మా ఆయన బొంబాయిలో కొన్ని రోజులు ఉండాలేమో అన్న మాట వచ్చింది. మా అత్తగారు 'రాజంని మొట్టమొదట వాళ్ళింటికి పంపడానికి మనంమెందుకు ఖర్చు చెయ్యాలి? మనం వాళ్ళకి అన్నీ సులువుగా కుదర్చాలా?' అని అడిగారు. అప్పుడే శాంబశివంగారు 'నేను తప్పకుండా లాంఛనం ఇవ్వాలని వాళ్ళకి చెప్తాను,' అని అన్నారు. మా అత్తగారు వెంటనే సరేనన్నారు. నాన్నగారూ, వియ్యంకులవారు తమ హక్కులు చెలాయించడంలో తప్పేముంది? నాకు వాళ్ళ పెద్దమనసుకి కృతజ్ఞత చెప్పాలనిపుంది." నటరాజన్ ఓర్పుగా ఆమె మాటలు విన్నారు. ఏమీ అనకుండా ఇంటి ముందు వసారాకి వెళ్ళిపోయారు.

ఆ తరువాత అతను వంటగదికి వెళ్ళి రాజం పనిమనిషితో మాటాడడం గమనించి, విశాలంతో "ఇది మన అమ్మాయి రాజేశ్వరే అంటావా?" అని అడిగారు; వెంటనే వసారాకి తిరిగివచ్చేసారు.

రాజం కణ్ణన్ని, రాధైని ఉయ్యాలలో కూర్చోమంది. తనూ అలాగే కూర్చుంది. కాని ఉయ్యాల ఊగలేదు. నటరాజన్ అది చూసి సహించలేకపోయారు.

"ఏం, పాడవేం? . . . ఉయ్యాల ఆడాలని లేదా?"

రాజం నేలను కాళ్ళతో నూకింది. కాని అందులో చురుకుదనం మచ్చుకైనా లేదు. ఏం, ఎందుకు? కాళ్ళకి బలం పోయిందా?

"పాడవేం . . . నీ పాట వినాలని ఈ ఉయ్యాల బిగపెట్టుకొని ఉంది . . ."

రాజం బుగ్గలు తడిసిపోయాయి. మెల్లగా నవ్వింది.

"ఏం, ఏమైంది నీకు?"

"నాన్నగారూ, ఇక్కడకి వచ్చినతరువాత మళ్ళీ తిరిగివెళ్ళడానికి నాకు ఎలాగోవుంది . . ."

"ఏమంటున్నావ్?"

"ఎక్కడైనా భయమూ, చింతా లేకుండా ఉండగలనా అనే భ్రమ నాకు అనిపిస్తోంది . . ."

"భయమూ, చింతా ఎందుకు? అక్కడ నీకు హాయిగా లేదా? నువ్వెందుకు ఇలాగ బక్కచిక్కిపోయావని నేను అనుకుంటూనే ఉన్నాను."

"అదికాదు నేననేది. అక్కడ నాకు సంతోషమూ, సుఖమూ అన్నీ ఉన్నాయి; కాని ఎల్లప్పుడూ బాధ్యత, బిగివు. ఇక్కడ ఎంత మార్పు! నేనేం చేసినా అమ్మ ఏమీ అనదు. నేను ఇవాళ ఇంట్లోకి రాగానే అమ్మకి సాయం చెయ్యాలని, కుడిచెయిగా ఉండాలనుకున్నాను. కాని తిన్నగా ఉయ్యాలమీద ఎక్కి కూర్చున్నాను," అని అంటూ ఏదో నేరం చేసినట్లు ఉయ్యాలనుంచి రాజం గభీమని లేచి నిలబడింది.

నటరాజన్ నిటారుగా అయ్యారు. వంటగదిలో విశాలం రాజం ప్రవర్తన చూసి కళ్ళు తడబెట్టుకుంది.

"సరే, నువ్వు వెళ్ళి స్నానం చెయ్. నీకు ఆకలేస్తుంది," అన్నారు అతను. ఉయ్యాలమీద ఎక్కి కూర్చున్నారు. ఉయ్యాల సంకెళ్ళు అతని చెవుల్లో 'అత్తమామలంటే ఇలాగే ఉంటారా?' అని రహస్యంగా గుసగుసలాడాయి.

అందరూ అర్ధవర్తులాకారంగా కూర్చొని భోజనం చేసారు. విశాలం భోజనవగైరాలు పక్కనే పెట్టుకొని అందరికి వడ్డించింది. అతిథులు వస్తేనే ఆమె వంటగదికీ, అతిథులున్న చోటకీ నడిచివెళ్ళి వడ్డించేది.

చాలా రోజులతరువాత రాజం ఇంటిబోజనం అనుభవించింది. తొందరపడకుండా, దేనిగురించీ విక్షేపం లేకుండా వడ్డించినవన్నీ రుచి, శుచితో భోజనం చేసింది. తనకేం ఇష్టమో అడిగి తీసుకుంది. విశాలం చంటిపిల్లని బుజ్జగించినట్లు రాజంని లాలించింది.

"ఇలాగ తింటే నేను బాగా బలిసిపోతాను," అని అంటూ రాజం నవ్వింది.

"ఏం, అక్కడ నువ్వు సరిగ్గా భోంచెయ్యవా?"

"ఓ, తప్పకుండా . . . కాని ఎది ఇష్టం, ఎది నచ్చదు అనే భేదం నాకెప్పుడూ తోచదు. ఎప్పుడూ ఆకలే . . . ఎదైనా సరే, వొద్దనను. భవాని అక్క నన్ను ఎగతాళి చేసేది, 'అత్తగారిని మెప్పించాలని రాజం అన్నీ తింటోంది,' అని. కాని నాకు ఎదైనా రిచిగా శుచిగా కనిపించేది. త్వరలో అంతా ఖాళీ చేసేస్తాను," అని రాజం మళ్ళీ నవ్వింది.

'ఇన్నిరోజులూ ఆతురతతో 'ఒక్కసారి అమ్మాయిని చూస్తే చాలు,' అని తహతహలాడిన నటరాజన్ ఇప్పుడు నిస్పృహ పడ్డారు. 'ఇది చూడడానికేనా నేను ఇన్ని రోజులూ కాచుకొనివున్నాను?' అని వాపోయారు.

'కొత్త భార్యగా తల్లిదండ్రులని చూడవచ్చిన రాజమా ఇది?' అని అతను అదిరిపడ్డారు. ఆమెలో కానవచ్చిన కాంతీ, ప్రకాశమూ మాయమైపోయాయా? ఆ దేహంలో నొగసుగా, తేలికగా వంగే ఆ భంగిమ కనిపించదేం? అతనికి ఇప్పుడు జ్ఞప్తికి వచ్చింది: రాజం ఏదైనా పుస్తకం చదువుతున్నా, లేక వయలిన్ వాయించుతున్నా, నటరాజన్ ఆమె వీపుని బిరుసుచేసుకొని, నిక్కబొడుచుకొని కూర్చోమని అనేవారు. ఆ చక్కదనంపోయి అమ్మాయి ఇప్పుడు వాడిపోయిన మొక్కలాగ కనిపిస్తోంది; తలలో వెండ్రుకలూ బాగా రాలిపోయాయి. పనిమనిషికూడా "ఇదేంటి అమ్మగారూ, అమ్మాయిని చూసి మీరెలా ఓర్చుకోగలిగారు? నా కూతురుగాని ఐవుంటే నేను చచ్చిపోయేదాన్ని!" అని అనలేదూ? రాజం బుగ్గలు బంగినపల్లి మామిడిపళ్ళలాగ ఉండేవి. ఇప్పుడో . . . విత్తనాలే కనిపిస్తున్నాయి. నటరాజన్ అడిగినప్పుడు రాజం ఏమంది? "నాన్నగారూ, నాకు ఈ ఇంట్లో కొత్తగా ఉంది. నేను హాయిగానే వున్నాను. కాని అలసటగావుంది. వచ్చిన రెండురోజులూ చురుకుగానే ఉన్నాను. బద్దకం మళ్ళీ వచ్చేసింది." ఆమె మాటలు నటరాజన్ కి పూర్తిగా అర్థమవలేదు.

## 21

"చూసారా, రాజం ఎంత మారిపోయిందో?" అని ఒకరోజు విశాలం భర్తను అడిగింది.

"నీకింతవరకూ అది తెలియలేదా . . .?"

"అదికాదు నేనసేది; శరీరసంబంధంగా ఏమీ కాదు," అని విశాలం వివరించి, మాటాడింది: రాజం తన చీరని తనే ఉతుక్కొని పెరడులో ఆరబెట్టుకుంది; స్నానంకి వెళ్ళి పొయ్యిలో కట్టెలు రగిలించి, మండుతున్న బొగ్గుతునకలు వంటగదికి తీసుకువచ్చి తల్లికి ఇచ్చింది; తను స్నానం చేసినతరువాత బిందెలలో నీళ్ళు నిప్పింది; ఇవన్నీ అవగానే వంటగదికి వచ్చి తల్లికి మసాలాదినుసులు పొడిచెయ్యడానికి సాయపడింది.

ఇది విని నటరాజన్ మండిపడ్డారు. "అది మనింటికి వచ్చిన రెండు రోజుల్లోనే ఈ పనులన్నీ చెయ్యమని ఎవరు రాజంని తొందరపెట్టారు? అది ఇంటి వరాసా ముందున్న పూలు చూసిందా? అక్కడ సిమెంటు బెంచిలో కొంతసేపైనా కూర్చుందా? అత్తగారింట్లో మరేం చేసింది? అది ఇలా కృశించిపోయిందంటే ఆశ్చర్యం లేదు", అని బొబ్బలు పెట్టారు.

కాని విశాలం నిమ్మళంగానే మాటాడింది: "కొన్ని రోజుల్లో రాజం తేరుకుంటుంది. దాని మొహం కూడా ముందులాగే వెలుగుతుంది. ఇంతవరకూ రాజం తల్లిదండ్రులను వదిలి ఉండలేదు. మీకు జ్ఞాపకం ఉందా? ముందొకసారి ఒక వారం రోజులు స్కూలు excursion లో వెళ్ళినప్పుడు ఎంత బాధ పడిందని! ఇప్పుడేమో ఆరు నెలలయ్యాయి. రాజం నెమ్మదిగా, ఓర్పుతో అత్తమామలదగ్గర మంచిపేరు సంపాదించుకుంది; కాని బాగా అలిసిపోయింది. అక్కడ అందరూ అపరిచుతులే కదా? ప్రతీరోజూ అన్ని పనులూ చెయ్యడం రాజంకి అలవాటు లేదు. అందువలనే శరీరం ఇలాగైపోయింది. పెళ్ళయి అత్తగారింటికి వెళ్ళినతరువాత మార్పులు రావడం సహజమేకదా?" ఇవన్నీ చెప్పినప్పుడు విశాలం నవ్వకుండానే మాటాడింది. వంటగదికి తిరిగి వెళ్ళింది.

"అక్కడ వాళ్ళు రాజం జీవితాన్ని పీల్చిపారేశారు," అని భర్త అన్న మాటలు విశాలం పట్టించుకోలేదు.

కొంతసేపు ఆగి మళ్ళీ భర్తకి చెప్పింది: "నాకిప్పుడు అంతా అర్థమైంది. మనం రాధైకి చదువూ, సంగీతం నేర్పించడం అంత ముఖ్యం కాదు. రాజంని చూసినతరువాత మంచి మనసూ, పని చెయ్యడంలో శ్రద్ధ - ఇవే ఆడపిల్లలకి సంపదలు - అని నాకు తెలిసింది."

"నాకూ ఒక సంగతి అర్థమైంది," అన్నారు నటరాజన్. "శాంబశివం నాకు చెప్పారు: అత్తవారింట్లో అన్ని పనులూ తనే చెయ్యాలని రాజం పూనుకుందని అన్నారు. 'ఇంట్లో పనిమనిషి ఉంది, రాజం ఎందుకు అవన్నీ చెయ్యాలి అని అడిగారతను. అస్వస్థగా రాజంని పంపిస్తున్నామని దొరస్వామి బాధపడ్డారని అతను అన్నారు. అదంతా వాళ్ళ తప్పే. మరి, ఇక్కడ మన ఇంట్లో సంగతి వేరు; మనకి పనిమనిషి ఉంది. ఇంతకుముందు రాజం నీకు ఇంటిపనుల్లో సాయం చెయ్యని రోజులు నాకు తెలుసు. అత్తవారింట రాజం పనిమనిషికి ఎందుకు సాయం చెయ్యాలి అని నువ్వు అడిగావా?" అని ప్రశ్నించారు.

రాజం తల్లిదండ్రుల సంభాషణ విని అసలు కారణమేమిటో వివరించింది: "నేను నా అత్తమామలిద్దరినీ గమనించాను. మా అత్తగారు అనేవారు, 'మాటమాటికీ ఎందుకు పనిమనిషే అన్ని పనులూ చెయ్యాలి?' అని అడిగేవారు. ఒకరోజు ఆవిడ గిన్నెలు తోమడం చూసాను. అప్పుడే నాకు ఆ అలవాటు పట్టుకుంది. కొన్నిరోజులతరువాత మా మామగారు నన్ను చూసి దానిగురించి అడిగారు. 'ఇదంతా ఐదు నిమిషాల పని,' అని చెప్పాను. ఇంటిపనులన్నీ చెయ్యడంవలన నాకు ఇదేం పెద్దగా అనిపించలేదు. ఇలాంటి విషయాలు మగవారూ, ఆడవారూ, వేరేవేరేగా భావిస్తారు." రాజం తన అనుభవంగురించే మాటాడినా, అది విని విశాలం ఆనందించింది.

కొన్ని రోజులు గడిచాయి. విశాలం అన్నట్టే రాజంలో ముందు కనిపించిన అమరిక, చక్కదనం చోటుచేసుకున్నాయి. కాని రాజం ముందులాగ కుర్చీలో సరిచేసుకొని పుస్తకం చదవలేదు. తల్లికి అన్ని పనుల్లో సాయం చేసింది. విశాలం

అందరిదగ్గర "తను భోజనం చేసిన తరువాతనే నాకు వడ్డించడం గురించి రాజం బాధపడుతోంది," అని చెప్పింది. "అసలు నేనుకూడా మా అమ్మకి ఎప్పుడూ వడ్డించలేదు; అమ్మ తనే వడ్డించుకొనేది. ఇప్పుడు రాజంని చూసి నేను మా అమ్మగురించి చాలా గర్వపడుతున్నాను."

ఇంతలో తమ్ముడు మణి వచ్చి పాటమాష్టారు వచ్చారని రాజంకి చెప్పాడు. త్వరలో శర్మగారు దర్శనమిచ్చారు.

రాజం ఒక పాట వాడింది. శర్మగారు ఆమెను వయలిన్ తో అనుసరించారు. గభీమని రాజం మనసులో ఒక ఆలోచన, 'పాడాలనుకుంటే తత్ క్షణమే పాడేసాను. నాలో మోమాటం కనిపించలేదే? ధైర్యంగానే ఉన్నాను,' అనే నమ్మకం కలిగింది. శర్మగారుకూడా ఆమె ఆత్మ విశ్వాసం మెచ్చుకున్నారు.

కాని రాజం వయలిన్ వాయించినప్పుడు అతను బాధపడ్డారు. "నీ కరలాఘువం బాగుంది; ఐదు సంవత్సరాల అభ్యాసం ఉందికదా? కాని గత ఆరు మాసాల్లో నువ్వేమీ అభ్యాసం చేసినట్టు కనిపించదు. ఏం, ఏమైంది? నువ్వు రోజూ సాధకం చేస్తున్నావా, లేకపోతే నా తక్కిన శిష్యురాళ్ళులాగ, పెళ్ళైన తరువాత సంగీతం త్యాగం చేసేసావా?" అని అడిగారు.

"ఇక నేనెలాగ సాధకం చెయ్యగలనండీ?" అని రాజం ఎదురు ప్రశ్న వేసింది.

"ఏం, ఎందుకు, పిల్లలెవరైనా అడ్డు వస్తున్నారా?"

"అలాగేంకాదు. అత్తగారింట్లో స్వార్ధ్యం కూడదు. నాకేంకావాలో అది చెయ్యాలంటే సాధ్యమా?"

"ఒక గంట గాత్ర సంగీతం, ఒక గంట వయలిన్ వాద్యం . . . ఇందులో స్వార్ధ్యమేముంది? నీ అత్తమామలు ఆక్షేపిస్తారనుకోను."

"దేవుడా, వాళ్ళు అడ్డం అని నేను అనలేదు. ఇది నాకు నేనే బోధపరచుకున్న నిజం. మా అత్తగారు వంటగదిలో పని చేస్తుంటే నేను అభ్యాసం చెస్తే బాగుంటుందా? . . . మీరే చెప్పండి."

నటరాజన్ రాజం ఇచ్చిన కారణం ఏనాడూ మరిచిపోలేదు. అతనికి దొరస్వామిగారి అభ్యుదయ మనోభావం తెలుసు. అందువలనే రాజం మామగార్ని అపార్థం చేసుకుందేమో అని అతనికి అనుమానం కలిగింది.

రాజంతో నేరుగా మాటాడి ఆమెలోవున్న తప్పుడు భావాల్ని మార్చాలని అతనికి తోచింది. కాని దానికి అవకాశం దొరకలేదు.

"నువ్వు నీ అత్తమామల్ని సంతోషంతో, నమ్రతగా సేవించడం నాకూ సంతోషమే. కాని నీకెందుకు వాళ్ళగురించి భయం?" అని అడిగారు. రాజం ఒక్క వాక్యంలో జవాబు ఇచ్చింది.

"నాన్నగారూ, మీకవన్నీ బోధపడవు."

"అక్కడ మనింటిలోకన్న తక్కువమందే ఉన్నారు. అన్ని పనులూ నువ్వే ఎందుకు చెయ్యాలి? ఒక రెండు గంటలు సాధకం చెయ్యడానికి వీలుకాదా? మీ అత్తగారే మధ్యాహ్న భోజనం చేస్తారన్నావు. ఇందులో మరేం చిక్కుంది?"

"మీ ప్రశ్నకి ఎలా జవాబు చెప్పాలో నాకు తెలియదు. నాకూ ముందు అలాగే తోచింది. కాని సమయం ఎలాగో గడిచిపోయేది. కొన్నిరోజులు ఒక నిమిషం ఉత్తికే కూర్చోవాలన్నా వీలు కాదు. ఎలాగో భోజనం చెయ్యడానికి అవకాశం దొరికితే అదే చాలని అనిపించేది."

"రాజం, నువ్వు నిన్ను ఒక కోడలుగా భావిస్తున్నావు. అసలు ఒక యువతిగా జీవితం గడపాలని నీకు ఇష్టం లేదా? నీకు నేనంటున్నది అర్థమైందా?"

రాజం ఏమీ అనలేదు. కన్నీళ్ళు వార్చింది.

ఆ తరువాత నటరాజన్ రాజం మాటలు గుర్తుచేసుకున్నారు.

'అవును, విశాలం అనలేదూ ఆడవాళ్ళ దృక్పథం, తీరూ వేరని? నిజం, అదే రాజం మాటలు నిరూపించాయి . . . '

రాజం దాంపత్యం ఎలాగ సాగుతుందో అని నటరాజన్ తెలుసుకోవాలనుకున్నారు. దానికి అతనికి కొన్ని సందర్భాలు దొరికాయి.

భవాని గురించి ఒకరోజు విశాలం మాటాడింది. “ఇప్పుడు పాప పెరగడంతో భవాని చిరచిరలాడుతుందా? నీ మీద ఇంకా అధికారం చెలాయించుతోందా?” అని రాజంని అడిగింది.

రాజం నవ్వుతూ, “ముందు పాప బాగా నిద్రపోయేది; ఇప్పుడు దాని అల్లరి ఎక్కువైంది,” అని చెప్పింది. ఇంతలో నటరాజన్ జోక్యం చేసుకొని “అంటే, భవాని ఇంకా హఠం చేస్తుందన్న మాట!” అని అన్నారు.

“అదికాదు నాన్నగారూ, భవాని అక్క వస్తుందని తెలియగానే ఇంటిలో ఎటువంటి ఆతురతా కనిపించలేదు. నాకు అక్కయ్యని చూస్తే, పాపం, జాలేస్తుంది. తను ఏంచేసినా వాళ్ళ నాన్నగారు తప్పుపెడుతున్నారని అక్క భయపడుతోంది. అందుకే నా సాయం కావాలంటుంది. ఆ ఇక్కట్టునుంచి అక్కని కాపాడడానికి నేనొక మార్గం కనిపెట్టాను. అక్కయ్య అడగడానికి ముందే నేను చొరవ చేసుకుంటాను. ఆవిడ ఏది కావాలన్నా ఎప్పుడూ సిద్ధంగావుంటాను. నాకెలాగో అది అలవాటైపోయింది. కాని ఒకేఒకసారి నేను చాలా బాధపడ్డాను . . . ఏడవాలనిపించింది . . . ”

“ఏం, ఏమైంది?”

“అక్కా, నేనూ స్నానగదిలో ఉన్నాం. ‘పొగ వస్తుంది, ఇక పొయ్యి ఆర్పేయ్,’ అని అక్క అనడంతో నేను మంట ఆర్పేసాను. నేను స్నానం చేసిన తరువాత మళ్ళీ పొయ్యి అంటించుతుంటే మా అత్తగారు వచ్చారు. ‘పొయ్యెందుకు ఆర్పేసారు, ఇంకా ముగ్గురు స్నానం చెయ్యాలే?’ అని అడిగారు. భవాని తల ఆరబెట్టుకుంటూ ‘వదిన ఆర్పేసింది,’ అని చెప్పింది. నేను అందుకేమీ అనకుండా ఊరుకున్నాను. ‘సరేలే, మన చెయ్యేకదా ఆర్పింది,’ అని సమాధానం చెప్పుకున్నాను. కాని నాకు ఏడ్పు వచ్చింది. ఎలాగో తత్రరపాటునుంచి తప్పించుకున్నాను,’ అని చెప్పి రాజం నవ్వింది.

“నువ్వు చేసినపని గాంధీగారు మెచ్చుకుంటారు,” అని నటరాజన్ గర్వపడ్డారు.

“భవానికి నువ్వంటే గొప్ప గౌరవం కలిగివుంటుంది,” అంది విశాలం.

“అవునమ్మా, భవాని అక్కయ్య అదే చెప్పింది. ఊరుకి వెళ్ళేముందు, ‘వదినగారూ, మీరు బాగా - నేను ఆశించినట్టే - మారిపోయారు’ అని. అమ్మా, నాకు మరేం కావాలి - మెచ్చుకోలు తప్పిస్తే?”

“అవును, నిజం. నోరు విప్పి ఎవరైనా మంచిమాటలు చెప్తే చాలదా? చాలమంది ‘ఒ, అదేం పెద్దపని?” అని నెట్టిపేస్తారు. నువ్వు ఏం చిన్నపని చేసినా భవానికి అది గొప్పగా కనిపిస్తోంది. అందుకే నిన్ను శ్లాఘిస్తోంది.”

“అవును. నాకేం ఆ ఇంటిలో నేను పెద్దగా పనిచేస్తున్నాని అనిపించదు. వంటకూడా అత్తగారే చేస్తారు; నేను చిల్లరపనులు మాత్రం చేస్తాను. ఆవిడ అనేవారు, ‘ఒక మనిషి సాయంకి వస్తే అది ఎనిమిది చేతులి సమానం’ అని. నాకు ఆ మెప్పు చాలు.”

పెళ్ళైనతరువాత రాజంలోని విశిష్టగుణాలు మెరుగుపడతాయని నటరాజన్ ఎదురుచూసారు. కాని ఇప్పడో? ఆమె రూపం చూసి అతను ఉలికిపడ్డారు.

అతను మనసు విప్పి తన నిరాశ తెలియజేసారు; ఒక తమిళ పద్యం వల్లించారు.

*‘చందనం ఘనత దాని యజమానికే తెలుసు. అది పుట్టిపెరిగిన కొండలవరుసలో దాన్ని గురించి ఎవరికీ తెలియదు.’*

“రాజం, నీ జీవితమూ చందనంలాగేవుంది,” అన్నారతను. “నువ్వు నీ తల్లిదండ్రులకంటే అత్తమామలకే ఎక్కువ గౌరవం ఇస్తున్నావు. నిన్ను పెంచి, చదువూ, సంగీత జ్ఞానం ఎరిగించిన మమ్మల్ని మరిచిపోయావు. నీ కృషీ, సేవా చూసి నిన్ను అభినందించిన అత్తమామలు నీకు ముఖ్యమైపోయారు. మరి వాళ్ళు నిన్ను మెచ్చుకోవడంలో ఆశ్చర్యమేముంది? కాని, ఇది నిజం; నీవలన మాకెటువంటి ప్రతిష్టా లేదు. మా పట్ల నీ ప్రేమానురాగాలు సామాన్యంగానే కనిపిస్తున్నాయి.”

ఇంతలో విశాలం జోక్యం చేసుకుంది. “రాజం వలన మనకి కీర్తి రాలేదని ఎలాగంటున్నారు? మన అమ్మాయిని మనం సరిగ్గా పెంచలేదని ఎవరైనా అనగలరా? రాజం వివేకంతోనే అన్నిపనులూ చేస్తోంది; దాని శరీరం బలహీనంగా ఉందని మనం బాధపడవద్దు.”

"నాన్నగారూ, చందనం తను అరిసిపోవడంవలనే గంధం ఇస్తుంది కదా?" అని రాజం ఎదురు ప్రశ్న వేసింది.

కాని నటరాజన్ తన వాదం ఆపుకోలేదు.

"నేను నీ స్వస్తతగురించి మాటాడడంలేదు. నీ చదువూ, సంగీతం, ఎలాగున్నాయి? 'సంగీతాభ్యాసం చేస్తున్నాను' అని నెలకొకసారి మాకు రాస్తావు. మాకు మరేం తెలియనక్కరలేదా? నెలకొక ఉత్తరం వస్తే సరిపోతుందా?"

"మీకెలా తెలుసు?" అని రాజం ఆశ్చర్యంతో ఆడిగింది.

"నాకు తెలుసు. అలాంటి నమయాల్లోనే నువ్వు ఒక పెద్ద ఉత్తరం రాస్తావు. ముందు నెలకి రెండు మూడు ఉత్తరాలు వచ్చేవి. ఆ తరువాత నాలుగు వారాలకి ఒకటి. నీ చమత్కారమేమిటో మాకు అర్ధమైంది."

"నాన్నగారూ, నేను కావాలని మిమ్మల్ని వంచించలేదు . . ."

"సరే, దాన్ని చిత్రవధ చెయ్యవద్దు," అని విశాలం మందలించడంతో, రాజం తల్లిమాటలతో తృప్తి పడింది.

"నాన్నగారూ, నేనొక సామెత విన్నాను: ఎక్కడో ఒక పర్వతంలో పుట్టిపెరిగిన మూలిక ఫలసిద్ధి పొందాలంటే దాన్ని ఎవరైనా పొడి చేసి వాడాలికదా? మన ఇంట్లోకంటే నా అత్తమామలదగ్గర నాకు పేరూ, ప్రతిష్ట వస్తే అది మంచిదేకదా?"

"మరేం చెప్పను? . . . నీకన్నీ తెలుసు . . . . నేనేమీ ఎఱుగని తండ్రిని," అని నటరాజన్ విసుక్కున్నారు.

అది విని రాజం బాధపడింది. అయినా, తనిప్పుడుండేది తన ఇంట్లోనేకదా? తల్లికి చెప్పింది.

ఇన్ని రోజులూ రాజం తన్ను తండ్రికూతురుగా భావించేది; ఇప్పుడు తను తల్లికూతురిగా మారిపోయిందా?

విశాలం కూతురుతో చాలాసార్లు తను జీవితంలో తెలుసుకునవన్నీ తన భర్తమూలంగానే అని, ఇక తమిళుల సంస్కృతి, ఆచారాలన్నీ తమిళ పత్రికలు, పుస్తకాలే ఆమెకు బోధించాయని అనేది; ఆ మాటలు ఇప్పుడు రాజం

గుర్తుచేసుకుంది. "ఏ ఎద్దు ఎక్కువ మోటుతనం చూపిస్తుందో అదే ఎక్కువ బరువు మోస్తుంది," అని తల్లి కసురుకోవడం రాజంకి తెలుసు.

"అమ్మా, 'కూతురెప్పుడూ తల్లినే పోల్చుతుంది,' అనే సామెత నాకు తెలుసు. ఇటీవల నాకు మరికొన్ని తెలిసాయి: చందనం అరిసిపోవడంవలనే గంధం ఇస్తుంది; ఒక మూలికని మందుగా వాడితేనే దాని విలువ వెల్లడి అవుతుంది. నా సంగీతం మన ఊరులో ఉన్నవారే పొగడుతారు. నేనింతవరకూ పెద్దలెవరితోనూ మెలగలేదు. దానికి ఇప్పుడే నాకు అవకాశాలు దొరికాయి. అందుకే నేనొక కొత్త రాజంగా మారిపోయాను!" అని చెప్పి రాజం నవ్వింది. "నాకు నాన్నగారిని చూస్తే జాలేస్తుంది."

"మీ నాన్నగారి సంగతే వేరు; అందరూ అతనిలాగ ఉంటారా?" అని విశాలం ఎత్తిచూపడంలో కొంచెం కటువే - గర్వం కాదు - కనిపిస్తోందని రాజంకి తోచింది.

గత రెడు సంవత్సరాలుగానే విశాలం తల్లరపాటు పడుతోంది. ఏది చూసినా ఆమెకు అసాధ్యంగా కనిపిస్తోంది. ఆ వ్యాకూలం రాజం పెళ్ళిగురించి మాత్రం కాదు; పొరుగింటి సీతమ్మ కూడా దానికి కారణం!

సీతమ్మ తన కుటుంబంతోనూ, అత్తమామలతోనూ ఉంటోంది. వయసులో ఆవిడ విశాలంకంటే చిన్నది, కాని లోకజ్ఞానం ఎక్కువ. స్వాభావికంగా విశాలంకి ప్రజల్లో నిత్యమూ నాణ్యం, విశ్వాసం కనిపించేవి. అందువలనే అప్పుడప్పుడు సీతమ్మ "మీకు బోళాతనం ఎక్కువ," అని విమర్శించినప్పుడు విశాలం బాధపడేది; భుజాలు యెగబెట్టుకొని "మీ నాన్నగారు నన్ను పూర్తిగా మార్చేసారు!" ఆని రాజం దగ్గర అంగలార్చుకునేది.

'ఆ రీతిగా విరక్తిలో తల్లి ఇప్పుడు మాటాడుతుందేమో?' అనే అనుమానం రాజంకి కలిగింది. అటువంటి చింతనకే ఆధారం లేదని రాజంకి తెలుసు.

భార్య నిత్యమూ తన మాటే వినాలని నటరాజన్ నిర్బంధించలేదు. తొమ్మిదిగజాల చీరకట్టు తప్పిస్తే అతను మరేదీ ఆమెను బలవంతబెట్టలేదు. "ఈ ఊరులో నువ్వు అందరి స్త్రీలలాగ మెలగాలి; అది ముఖ్యం. నిన్ను ఎవరూ తమిళ స్త్రీగా వర్గీకరించకూడదు," అని ఇక్కడ వలసవచ్చిన ముందురోజుల్లో అతను

అనేవారు. "నీకు అందరిలాగ ఆరుగజాల చీరకట్టు; నాకు తమిళులలాగ పంచె. ఆంధ్రస్త్రీలలాగ నువ్వు, నగలూ, ముక్కుపుడక ధరించడంలో నాకెటువంటి అభ్యంతరమూ లేదు," అని చెప్పేసారు. కాని పెద్దలు ఎవరైనా అతిథిగా వచ్చినా, లేక నటరాజన్ దంపతులు తమిళదేశంలో ఎక్కడైనా ప్రయాణం చేసినా, విశాలం పాటించేది తొమ్మిదిగజాల చీరకట్టే. మరి పెద్దలెవరైనా ఆక్షేపిస్తే? 'ఈ తమిళలు ఎంత సుళువుగా తొమ్మిదగజాల చీర కట్టుకుంటున్నారు!' అని సీతమ్మ విడ్డూరపడవచ్చు; అందుకు విశాలం ఎందుకు లెక్క చేయాలి?" అని రాజం తనలో అడుక్కుంది.

'ఆరుగజాల చీరగురించి నాన్నగారు చెప్పినది సరే,' అని రాజంకి తోచింది.

"అమ్మా, ఆరుగజాల చీరకట్టుతో వంటచెయ్యడం, వడ్డించడం సులభంకదూ?" అని తల్లిని అడిగింది.

"అవును. మీ నాన్నగారికి తెలుసు. అందుకే నాకది అలవాటుచేసుకోమన్నారు. వీలైనంతవరకూ నేను ఇంటిపనులు తగ్గించుకోవాలని అతని ఆశ. నాకు బాగా జ్ఞాపకముంది; పద్దెనిమిది సంవత్సరాలుముందు నేనీవూరికి వచ్చాను. ఆ రోజుల్లో అతను ఎది చెప్పినా చేసేస్తాను. మరి, అతను ప్రొఫెసరు కదా?"

'భర్త ఎదిచెప్పినా వినాలి' అదే ఒక స్త్రీ లక్ష్యం,' అని అందరూ అంటారు. అదే విశాలం జీవితంలో జరిగిందనే నిజం రాజంకి బోధపడింది.

తన బిడియంవలనే భర్త ప్రొఫెసరు కాదని తనకి సిగ్గుగావుందని రాజం ఒప్పుకోలేదు. మరి అతని మాట తను ఎలా ఆమోదించడం?

"అవును, నాన్నగారు ఎది చెప్పినా స్పష్టంగా, విపులంగా చెప్తారు," అని మాత్రం చెప్పి ఊరుకుంది.

కాని రాజం పడుతున్న మానసిక బాధ విశాలం గ్రహించలేదు. తన వ్యధకూడా లెక్కచేయక భర్తను పొగడింది. "నాన్నగారు నేనింటి పనులు తగ్గించుకొని అన్నిరకాల పుస్తకాలూ చదవమనేవారు. నేను అస్తమానం వంటగదిలో పని చెయ్యడం అతనికి నచ్చదు. 'పిల్లలకి తల్లే మొదటి గురువు!' అని అతని నమ్మకం. కుట్టుపని, చదవడం, పిల్లలకి తమిళం నేర్పడం - ఇవన్నీ నాకు అప్పగించేసారు.

‘పిల్లలు ఏమైనా ప్రశ్నలడిగితే, విదానంగా, చికాకు పడకుండా విను. ఎందుకురా ఈ గొడవ అని తోసిపారేయకు,’ అని హెచ్చరిక చేసేవారు; అతని సలహా పాటించే నేను నీ సంగీత సాధకంలో కలుసుకున్నాను. తెలుగు నేర్చుకున్నాను.” విశాలం ఉద్వేగం అంతులేనట్టుగా మాటాడింది.

అది విని రాజం నిర్ఘాంతపోయింది. నాన్నగారు తల్లిని వంటగదిలో నిత్యమూ చిక్కకోవద్దని అంటున్నారు; పిల్లలకన్నీ నేర్పాలని వక్కాణించి చెప్తున్నారు. మరి, అలాంటప్పుడు తను నాన్నగారితో వాదించడంలో ఏమైనా న్యాయం ఉందా?

“నేను నీకు తెలుగులో రాయాలనికూడా అనుకున్నాను; నీ మనసులో ఏముందో తెలుసుకోవాలని తాపత్రయం పడ్డాను. కాని రాయలేదు!” అని అంటూ విశాలం నవ్వింది.

“సరేలే, మంచి పనే చేసావ్ . . . నేను రాసిన ఉత్తరాలన్నీ కల్పనలనుకున్నావా?” అని రాజం ఎదురు ప్రశ్న వేసింది.

‘నేను నాన్నగారికి తగిన కూతురుగా ప్రవర్తించలేదు; అదే నా పొరబాటు. ఇప్పుడు నేను తిరిగి నా అత్తమామలయింటికి వెళ్ళినప్పుడు నాన్నగారిని సంతోషపెట్టాలి,’ అని మనసులో రాజం తీర్మానించుకుంది.

మరికొన్నిరోజుల్లో రాజంకి రఘుపతినుంచి ఉత్తరం వచ్చింది.

“నిన్ను మా ఇంటికి తీసుకుపోవడానికి వస్తున్నాను,” అని రఘుపతి రాసాడు.

## 22

హఠాత్తుగా రాజంలో కనిపించిన మార్పు చూసి నటరాజన్ ఆశ్చర్యపడ్డారు.

తన భర్తకి ఈ సారి అన్నీ తృప్తిగా జరగాలని రాజం గుర్తుచేసుకుంది. అతనికి ఇష్టమైన భోజన పదార్థాలు వండాలని ఒక జాబితా టూకిగా రాసుకుంది. బావగారిముందు తమ్ముళ్ళు, చెల్లెలు ఎలాగ మెలగాలని వివరించింది. “ఇదిగో, ఈ సారి అతను మీ గురించి ఏమైనా సణుగుతే నేను ఊరుకోను!” అని ఖచ్చితంగా చెప్పేసింది.

రాజం ముఖంలో ఒక కొత్త కాంతి కనిపించింది. 'ప్రేమ అంటే ఇదే!' అని నటరాజన్ కూతురుని మనసులో మెచ్చుకున్నారు.

"నువ్వు త్వరలో నీ అత్తమామలని కలుసుకుంటావ్; నీకో చిన్న సలహా," అని అతను మొదలుపెట్టారు. "యెప్పటికిన్నీ, తొందరపడి, నువ్వు నీ అత్తమామలకి సేవ చెయ్యడం కొంచెం తగ్గించుకో. వాళ్ళు ఎదురుచూడకుండానే నీవన్నీ చేసావంటే నీ మీద అధికారం చెలాయించినట్లు వాళ్ళకి అనిపిస్తుంది. నువ్వు అసలైన కోడలుగా మెలగాలి!" అని అన్నారు.

కొన్నిరోజుల్లో రఘుపతి వచ్చేసాడు. రాజంని చూసి "నువ్వు బాగా బలిసిపోయావ్!" అని నవ్వాడు.

"గాలిబుడగలాగ వుంటే సరే. Let's hope it won't burst," అని నటరాజన్ జోక్యం చేసుకొని అన్నారు.

ఆ రాత్రి విశాలం కొత్తగా అగరుబత్తులు కావాలని అడగ్గానే రాజం "ఎందుకమ్మా?" అని అడిగింది. విశాలం ఒక దీపంతో అగరుబత్తులు వెలిగించి పడగ్గదికి వెళ్ళింది.

"మనయింటిలో శుభకార్యంకి ఇది మొదటిరాత్రి కదా?" అని సమాధానం వినడంతో రాజం నోటినుంచి ఏ మాటా రాలేదు.

రాజంని - ఆ ముఖంలో వికసించిన కాంతిని - రఘుపతి వింతగా చూసాడు. "అరే, నువ్వు బాగా మారిపోయావ్!" అన్నాడు.

"నేనా? నాకేమైంది?"

"మరి, పుట్టిల్లంటే కొన్ని హక్కులు ఉంటాయి కదా?"

"ఓ, అలాగంటున్నారా? నాకీయిల్లుగురించి తెలియదుగాని, ఈ ఊరు నాకు ప్రత్యేకంగా కనిపిస్తోంది. అక్కడున్నప్పుడు నాకు ఇల్లు వదలి వీధిలో కాలుపెట్టాలంటేనే భయం; వీధిలో ఒంటరిగా నడుస్తున్నప్పుడు పదే పదే భుజాలు తిప్పుకుంటూ ఇలాగా అలాగా చూడాలనిపించేది. ఇక్కడ అలాంటి సంకోచం లేదు. ఇక్కడ స్నేహితులు, మాటాడానికి మనుషులని చూడాలనివుంది. అక్కడ పరిచయమున్నవాళ్ళతోకూడా మాటాడానికి నాకు భయం." రాజం ఒక నిమిషం

ఆగింది. తను భవానిలాగ పుట్టిల్లులో వేషం వేస్తున్నట్టు రఘుపతి అపార్ధం చేసుకోడానికి అవకాశం ఇవ్వకూడదు. "ఎలాగా ఇంకా రెండుమూడు రోజుల్లో నేను ఈ ఇల్లు వదలి వెళ్ళాలి కదా? ఆ తరువాత నేను లేకుండా అమ్మ తనే అన్ని పనులూ చేసుకోవాలి . . . అందుకే ఇప్పుడు మీ దగ్గరకి వచ్చాను."

** ** **

***"నాన్న గారూ, ఇక్కడకి వచ్చినతరువాత మళ్ళీ తిరిగివెళ్ళడానికి నాకెలా ఎలాగోవుంది."***

తను ఇక్కడకి వచ్చిన మొదటిరోజు రాజం చెప్పిన మాటలు నటరాజన్ గుర్తుచేసుకున్నారు. మరి, ఇప్పుడో? రాజం ఆ ప్రయాణమే ఆతురతో ఎదురుచూస్తోంది! 'రోజులు గడవడంతో మనసూ తేరుకుంటుందని పెద్దలన్నారుకదా?' అని నవ్వుకున్నారు.

దూదినుంచి వత్తులు పేనేటప్పుడు వేళ్ళు దూదిబంతికి దూరంగా కదులుతాయి; అప్పుడే ఆ తంతువులు బాగా బిగించుకుంటాయి. అందువలనే వత్తులోని జ్వాల పూజాపీఠంలో నిగనిగలాడుతుంది. 'స్త్రీల మనోభావంకి ఇది ఒక ఉపమానం అనవచ్చా?" అని అతను తనలో గొణుక్కున్నారు.

ఈ మారు - రెండోసారి - రాజం అత్తమామల సేవకి తన్ను పూర్తిగా అర్పణ చేసుకోవాలి. తను వెళ్ళబోయేది ఒక పవిత్రస్థలం. తన భర్తకు తన తల్లిదండ్రులు, భార్య మధ్య సరిపోల్చడం ఎంత ముఖ్యమో, అలాగే తనూ తన బాధ్యతలు భర్త లాగ పంచుకోవాలి.

"అవును, నాన్నగారు సరిగ్గానే చెప్పారు: 'విపరీత ప్రవర్తన కూడదు. తక్కినవారికి సేవ చెయ్యాలి, కాని నా మేలునికూడా చూసుకోవాలి; అది స్వార్ధం కాదు!' అని రాజం నిశ్చయించుకుంది.

అవకాశం దొరికినప్పుడల్లా తను ఒక అర్ధగంట వయలిన్ సాధకం చెయడానికి శారదాంబాళ్ దగ్గర అనుమతి కోరడం రాజం అలవాటు చేసుకుంది. అప్పుడప్పుడు అత్తగారితో "అమ్మా, నేను చదవాలనుకున్న సంచిక ఇంట్లో లేదు, ఎవరో తీసుకెళ్ళారు," అని మొర పెట్టేది; నియమం తప్పకుండా - మామగారు

గుర్తుచేయకుండానే - తల్లిదండ్రులకి ఉత్తరాలు రాసింది. అయినప్పటికీ భర్తకి, అత్తమామలకి సముచితంగా పరిచర్యం, అన్నిసేవలూ, చేసింది. అత్తగారికి ఏంకావాలో ఆవిడ అడగడానికి ముందే తెచ్చిబెట్టింది. ఇప్పుడు రాజంకి మనశ్శాంతి; ఏ బాధా పడకుండా సంగీతం అభ్యసించింది. సంకోచం లేకుండా "సరే, ఇవాళ వంటగదిలోనే కూరగాయలు కోయవద్దు; రేడియోలో పాట వింటూనే అది చేస్తాను," అని సహజంగా తనలో చెప్పుకుంది.

ఆ మాటకువస్తే, రాజం ఇప్పుడు చేసేవన్నీ 'కూడదు' అని ఎవరైనా ఆమెను అడ్డగించారా? లేదు; ఎదిరించేవారెవరూ లేరు. కాని రాజం తన ప్రవర్తనని చూసి "సరేలే, కొత్తగా ఇంటికివచ్చిన కోడలుకదా, మరి భయం, అణకువ ఉండవా?" అని ఎవరూ ఊహించకూడదని నమ్మింది. ఇంటికి వచ్చినవారందరూ రాజంలో కనిపించే అన్యోన్యత, ఉత్సాహం మెచ్చుకున్నారు. క్రమంగా రాజం అంతరాత్మలో పొంచివున్న సంశయాలు మాయమవడంతో ఆమె మనసు శమనమైంది.

ఈ మార్పు చూసి రఘుపతి కూడా ఆమెను అభినందించాడు. 'నేను చూస్తున్నది ఎత్తిపొడుపు, ఎగతాళి మాటలకి క్షణాల్లో కళ్ళు తడిబెట్టుకున్న రాజం కాదు; హాయిగా, ఉత్సాహంతోనే కనిపిస్తోంది!' అని అతనికి తృప్తి కలిగింది. అప్పుడప్పుడు తమాషాకి "నేను మిలిటరీ ఉద్యోగంలో చేరాలనుకుంటున్నాను," అని భార్యను బెదిరించేవాడు. "దేవుడా, వొద్దు!" అని రాజం ఉలికిపడితే అది చూసి ఆహ్లాదపడేవాడు.

ఒక రోజు భోజనం విషయంలో రఘుపతికున్న పట్టుదల, మొండితనం గురించి శారదాంబాళ్ రాజంకి చెప్పింది: "వాదం అని వస్తే తనే గెలవాలని వాడికి మొండితనం. నేను నెయ్యి ఆరోగ్యానికి మంచిదని, మన దేహంలోని ఉష్ణంని అది సరిదిద్దుతుందని చెప్పాను. 'అలాగా? నెయ్యికి ఆ శక్తివుందని నీకెలా తెలుసు?' అని వాడు ఎదురుప్రశ్న వేస్తే నేనేం చెయ్యను?' మొట్టమొదట ఈ మాటలు విన్నప్పుడు రాజం 'ఇది చాలా అల్పవిషయంగా కనిపిస్తుందే, అత్తగారెందుకు నాకిది చెప్తున్నారు? అని ఆశ్చర్యపడింది. కొంచెం ఆలోచించిన తరువాతనే ఆవిడ సూక్ష్మంగా తనకొక సందేశం అందిస్తున్నారని రాజం తెలుసుకుంది: రాజం

కొన్నిసమయాల్లో భర్తకి  ఎదురుగా మాటాడడం చూసి ఆవిడ తన అసమ్మతిని కోడలికి కి తెలియజేస్తున్నారు. ఒక ఉదాహరణ జ్ఞప్తికి వచ్చింది: ఒక సమయం తెలుగు కవులని ఎగతాళిచేసే ధోరణిలో రఘుపతి "ఈ పేర్లు - తిక్కన్న, సోమన్న, వేమన - వింటే నాకు నవ్వు వస్తోంది. ఇంకా చాలా అన్నలున్నారా?" అని వెక్కిరించాడు. రాజం వెంటనే "మరి తమిళ కవుల పేర్లు - అప్పర్, ఒట్టక్కూత్తర్, కంబర్, అని ఉన్నాయే - వాటిగురించి మీరెప్పుడైనా ఆలోచించారా?" అని తిరిగి అడిగింది.

"మీ నాన్నగారికి గోంగూరంటే ఇష్టం లేదని విన్నాను. ఏం, ఎందుకు?" అని ఒకరోజు రఘుపతి రాజంని అడిగాడు. భర్త అడిగిన వైఖరిలో అతని ఈసడింపు రాజం తెలుసుకుంది. అత్తగారిని చూస్తూ "ఇలాంటి ప్రశ్నలే ఇతనెప్పుడూ నన్ను అడుగుతున్నారు. మా నాన్నగారు తన జీవితకాలంలో ఆంధ్రుల సంస్కృతిని ఒక ముఖ్య అంశంగా ఎంచుకున్నారని మా ఆయన మరచిపోతున్నారు." ఇవన్నీ విని రఘుపతి రాజం అభిప్రాయాలు మనసార ఆమోదించాడు. తను పిలిచి రాజం రాలేకపోతే తనే వంటగదికివెళ్ళి ఆమెతో మాటాడాడు.

తన నిరుద్యోగం గురించి రఘుపతి అంతగా పట్టించుకోలేదు. రాజమూ అలాగే. అతని తల్లిదండ్రులుకూడా అదేదో అనివార్య పరిస్థితి అని భావించలేదు. ఇటీవల రాజం జీవితంలో తనకేర్పడిన నిరాశలని భరించడానికి అలవాటు చేసుకుంది. ఆ కారణంవలనే రఘుపతిని ఒక ఆదర్శ పుత్రుడుగా, ప్రేమికుడుగా కొనియాడింది. అతనూ ఎటువంటి వినాయింపు లేకుండా తన ప్రేమను పరస్పరంగా ఇచ్చిపుచ్చుకున్నాడు.

ఆ దంపతుల సాన్నిహిత్యం చూసి శారదాంబాళ్ ఆనందించింది. ఈ సంబంధంకి ముఖ్యకారకులైన భర్త దొరస్వామిని కృతజ్ఞతతో అభినందించింది. 'అవును, అతను ఏది చేసినా మున్నెరుకతోనే చేస్తారు; ఎప్పుడూ పొరబాటు చెయ్యరు!' అని మనసులో మళ్ళీ దృఢం చేసుకుంది.

కూతురుకి ఆవిడ అదే చెప్పింది; పుట్టిల్లుకి రమ్మని పిలిచింది."నీ ప్రసవం నేను చూసుకుంటాను. సహాయంకి ఇక్కడ నీ వదిన, అమ్మా, నాన్నా, ఉన్నాం; నీకు అన్నీ

అనుకూలంగా చెయ్యాలని మా వాంఛ. ఒకవేళ నీ రాకవలన మీ ఆయనకి స్వస్థమైన భోజనం దొరకదు అనే భయమైతే నేనూ, రాజం అక్కడకి వస్తాం. ఏమంటావ్?" అని వివరంగా రాసింది.

## 23

"ఎన్నిసార్లు ఉత్తరం చదువుతావ్? నీకు మీ ఇంటికి వెళ్ళడమంటే ఎప్పుడూ ఇష్టమేకదా?" అని సత్యమూర్తి ఎగతాళి చేసారు. "అవును మరి, ఎటువంటి కోడలైనా సరే మా అమ్మకి సేవచేయడానికి వెనకాడదు!" అని భవాని వక్కాణించి చెప్పింది. *అవాళ మధ్యాహ్నం తల్లికి భవాని ఉత్తరం రాసింది:*

*"మనింటికి రావడానికి నాకేం తడబాటు? మా ఆయన్ని ఒంటరిగా వదిలిపెట్టి రావడానికి నాకు ఇష్టం లేదు. మరి అన్నయ్యనీ, వదిననీ విడదీయడమంటే బాగుంటుందా? ఆ ఎడబాటు భగవంతుడికీ నచ్చలేదు; అందుకే అన్నయ్యకి ఉద్యోగం దొరకలేదు."*

*"ఐతే మీ అన్నయ్య అమ్మ, వదినతో ఇక్కడికి రావొచ్చుగా?" అని సత్యమూర్తి అడిగారు. భవాని అతనికి చెప్పింది: "కొన్ని రోజులైనా* మీరు నా పీకులాట లేకుండా ఉండాలనే నేను మా ఇంటికి వెళ్తున్నాను. ఇదిగో, గుర్తుంచుకోండి. ఈ సంవత్సరంలోగా మనం పళని వెళ్ళి, మన చిత్రుకి మొక్కు చెల్లించుకోవాలి. దానికి అప్పుడే పద్దెనిమిది మాసాలు నిండాయి."

"పుట్టిల్లంటే స్త్రీలకి ఎంత అభిమానం, పట్టుదల!" అని సత్యమూర్తి అనడంతో "మరి మగాళ్ళ సంగతో?" అని భవాని ఎదురు ప్రశ్న వేసింది. సత్యమూర్తి "నాకు చిత్రు అంటే ప్రాణం; దాన్ని వదిలి ఎప్పుడూ ఉండలేను!" అని గట్టిగా కౌగిలించుకున్నారు. దంపతులిద్దరూ ఆ దృశ్యం మనసారా అనుభవించారు.

** ** **

భవాని అన్నయ్య - వదినకి బహుమతిగా ఒక table lamp కొని తన పుట్టిల్లు చేరుకుంది. ఆ మరునాడు దాన్ని రాజంకి అందించి "వదినా, దీన్ని మీ గదిలో పెట్టు," అని చెప్పింది. రాజం చిరునవ్వు నవ్వి సరేనంది.

"వదినా, నీకెందుకీ సిగ్గు? నేనెప్పుడూ ఇలాగ మొహమాటం పడలేదు."

శారదాంబాళ్ జోక్యం చేసుకొని రాజం తరపున మాటాడింది: "రఘుపతి ఇవాళా రేపూ డాబామీద నిద్రపోతున్నాడు. మేం మిద్దెకింద పడుకుంటున్నాం."

"ఏం, ఎందుకు?"

"నీ కానుపు కోసం నేను మిద్దెకింద గదిని శుభ్రం చేసాను. రఘు గది చాలా ఉష్ణంగా, చిరచిరలాడుతోందని అన్నాడు. అందుకే డాబాకి వెళ్ళాడు. నేను రాజంని వాడ్ని కలుసుకోమని చెప్పాను, కాని వొద్దనేశింది."

"ఎన్నిరోజులుగా ఈ ఆట జరుగుతోంది?"

"ఒక వారంగా . . . ఎవరూ ఆటలాడటంలేదు . . ."

భవాని రాజంని ఏదో ఒకలాగ, వింతగాచూసింది. ఆ సాయంత్రం రఘుపతి ఇంటికి రాగానే "అన్నయ్యా, నేనిచ్చిన table lamp నీకు నచ్చిందా?" అని అడిగింది. "ఓ, చాలా బాగుంది, నాకు నచ్చింది," అని రఘుపతి అన్నాడు. ముందు వసారాలో, తను వాడుతున్న నాన్నగారి ఆఫీసులో దాన్ని ఉంచాడు.

భవాని అన్నయ్య - వదిన మధ్య పరస్పరానుబంధం, చతులోక్తులు గమనించింది. వారిద్దరి మనసులో, పరివర్తనలో కనిపించే ఆత్మీయతతోబాటు, ఎటువంటి పరిస్థితిలోనూ దొరికిన అవకాశాలు నిండుగా అనుభవించాలనే ఆవేశం ఆ దంపతులలో చోటుచేసుకుందని ఆమెకు అర్థమైంది.

'ఎటువంటి కోడలైనాసరే మా అమ్మకి సేవ చెయ్యడానికి వెనకాడదు . . . '

ఇంతకుముందు భవాని మనసులో ఆ అభిప్రాయమే చోటుచేసుకుంది. కాని ఇప్పుడు ఆమె వేరే కోణంలో దాన్ని పరిశీలన చేసింది. "ఇటువంటి కోడల్ని ఎవరైనాసరే మెచ్చుకోవల్సిందే!" అని తనలో తనే చెప్పుకుంది.

ఐతే, దురదృష్టవశంగా, ఆ పొగడ్త రాజంకి భవాని అత్తగారుమూలంగా వచ్చింది!

ఆ ముత్తైదువ, జానమ్మ, గర్భవతియైన కోడలుని చూడడానికి వచ్చింది. మరి ఆవిడ ఒక వయసుమళ్ళిన, పూజ్యమైన స్త్రీ - భవాని అత్తగారుకదా? రాజం ఆవిడకి అన్నివిధాల అతిథి మర్యాదలు అర్పించింది; అవన్నీ తన అత్తగారికి సేవ చేస్తూనే నెఱవేర్చింది. జానమ్మ ఆవశ్యకంకి తగినట్టుగా, మనఃపూర్వకంగా అన్నీ సమకూర్చిపెట్టింది. ముఖంలో ఎప్పుడూ తృప్తి, ఆనందం కనిపించాయి.

రాజం చొరవచేసుకొని చేసేవన్నీ చూసి జానమ్మ ఆహ్లాదించింది. రాజంలో కనిపించే యౌవనంతోబాటు జీవకళ, చతురత, లాఘవం, వైఖరి, ఆమెను ఆకర్షించాయి. "నవతరాల యువతులంటే ఇలాగేవుండాలి. అంతేకాదు. రాజంలో కనిపించే అమాయకత్వం ఆమె ప్రతిష్టకి ఒక చిహ్నం అనాలి. ఈ అమ్మాయేనా ఆరోజు నలుగులో ఏడ్చింది? ఇంత పెద్దమార్పు ఎలా వచ్చిందో?" అని ఆవిడ నిర్ఘాంతపోయింది.

"నేను చాలా అమ్మాయిల్ని చూసాను. పెళ్ళికిముందు ఉల్లాసంగా, సంతోషంగా కనిపిస్తారు; పెళ్ళవగానే మాటమాటికీ చంటి పిల్లలలాగ ఏడుస్తారు," అని చెప్పి జానమ్మ తనలో నవ్వుకుంది; "ఇదొక కొత్తరకం యువతి. చేతులూపుకుంటూ రాజం నాతో మాటాడుతుంటే నాకు చాలా ముచ్చటగావుంది," అని పొగడింది.

"ఇందులో ఆశ్చర్యమేముంది? రాజంకి అన్నిపనులూ తెలుసు. ఆమె జేష్టకుమారి కదా? ఆ బాధ్యతవలనే అన్నీ బాగా అలవాటుచేసుకుంది. భవాని మాకున్న ఒంటి కూతురు; దాన్ని ముద్దుగా పెంచాం. పెళ్ళవగానే ఇల్లు వదిలి వేరే ఊరులో భవాని కాపురం పెట్టవలసివచ్చింది; మెచ్చదగినట్లుగా ఇప్పుడన్నీ చేస్తోంది. రాజం సంగతి వేరు. రేపు రఘుపతికి ఉద్యోగం దొరికి, కొత్త కాపురం కోసం రాజం ఈ ఇల్లు వదలి వెళ్ళాలంటే దాని అమ్మగారికి ఎటువంటి విచారమూ ఉండదు. భవాని కాపురంకి అన్ని వసతులూ - కొబ్బరికి తరుముపీటకూడా - మేమే కొనిపెట్టాం. రాజంని వాళ్ళ అమ్మగారు ఈ ఇంటికి తీసుకువచ్చారు; ఆ తరువాత ఆమెని మా ఖర్చుతోనే వాళ్ళింటికి పంపాం. రాజంకి మంచి సామర్థ్యంవుంది. అందరితోనూ బాగా మెలుగుతోంది. నాకు మరేం వద్దు," అని శారదాంబాళ్ జానమ్మకి వివరించి చెప్పింది. 'సరేలే, అత్తగారు అమ్మనీ, జానమ్మనీ జాడగా

విమర్శించినా నాగురించి విరుద్ధంగా ఏమీ అనలేదు!' అనే అల్పసంతోషం రాజంకి కలిగింది.

భవాని తనుండేది పుట్టిల్లు అనే భావనతో తన అర్హతకి తగినట్టుగా అన్ని విధాల మర్యాద, సేవ అధికారంతో అడిగి పుచ్చుకుంది. జానమ్మ వచ్చిన కొన్ని రోజుల్లోనే, ఆవిడ ఎదుట తనకున్న అంతస్తు, ప్రత్యేక హక్కులు ప్రదర్శించింది. ఆవిడ తన్ను అత్తమామలతో కొన్నిరోజులు గడపాలని అడుగుతారేమో అన్న భయం కలగడంతో తనకున్న వ్యాధులన్నీ కల్పనచేసుకుంది. ఎంత చిన్నపనియైనాసరే, నియతంగా తనకి ఇతరుల సాయం కావాలని కోరింది. "నాకు నా ఆరోగ్యం గురించి ఎటువంటి చింతా లేదు; నా ఆలోచనంతా కడుపులోవున్న శిశువుగురించే," అని అందరికి చెప్పింది.

జానమ్మ దృష్టిలో తను ఒక ఆదర్శకోడలుగా కనిపించాలని భవాని ఆశించింది; ఐతే ఆ స్థాయి ఇప్పుడు రాజం బలాత్కారంగా స్వాధీంచుకుంటోంది అని భవాని బాధపడింది. అందువలనే భవాని-జానమ్మ మధ్య ఉల్లంఘన మరింత ఎక్కువగా పెరిగింది.

"నేను నా మనవరాల్ని చూడాలని వచ్చాను. నాకు చాలా సంతోషం. రఘుపతి భార్య తన భర్తకంటే ఒక మెట్టు ఎక్కువే! ఇద్దరూ క్షేమంగా వర్ధిల్లాలి," అని ముత్తైదువ పొగడింది.

అత్తగారిని సాగనంపుతూ భవాని తనలో "ఈ అత్తగారిలో ఎంత చురుకుతనం!" అని గొణుక్కుంది.

"ఇందులో చురుకుతనమేముంది?" అని రాజంకి తోచింది. కాని జానమ్మ, శారదాంబాళ్ మధ్య ఏదో చిన్న జగడముందని ఆమెకు బోధపడింది. అప్పుడప్పుడు శారదాంబాళ్ జాడగా జానమ్మగురించి విసిరిన సూచనలు రాజంకి నిజమేమిటో స్పష్టపరిచాయి.

భవాని-జానమ్మ మధ్య ఏమైనా అతృప్తి ఉందేమో? జానమ్మ తన్నడిగిన ప్రశ్న రాజం గుర్తుచేసుకుంది: ఆమె ఎంత మెల్లగా - రహస్యంగా మాటాడింది! "నీ ఆడబొడుచులాగ మీ ఆయన త్వరలో ఉద్యోగంలో చేరాలని నువ్వు పట్టుపట్టలేదా?

మరి నువ్వుకూడా భవానిలాగ కాపురం చేసేదెప్పుడు?'' అని ఆవిడ ఎందుకడిగింది? భవాని తన భర్తని ఉద్యోగంకోసం గదమాయించిందని జానమ్మ రాజంకి ఎత్తిచూపించడంకి కారణం?

రాజం తల, తోకా తెలియక కలవరపడింది. దైవాధీనంగా పెళ్ళైనవెంటనే సత్యమూర్తికి ఉద్యోగం దొరికిందని రాజంకి ఎవరో చెప్పారు. మరి, భవాని అతన్ని ఎందుకు ఉద్యోగంకోసం తొందరపెట్టాలి?

త్వరగా ఒక ఉద్యోగంలో చేరడానికి రఘుపతిలో ఆసక్తి కనిపించలేదని జానమ్మ జాడగా రాజంకి చెప్తోందా? ఆ ఆలోచన రాగానే రాజం బాధపడింది. నటరాజన్ రాసిన ఒక ఉత్తరం చదివిన తరువాత తన భర్త అన్న మాటలు గుర్తుకి వచ్చాయి: ''నాకు ఉద్యోగం లేదని ఇతనికెందుకు విచారం? నేనేం నా మామగారింట్లో ఉత్తికే కూర్చున్నానా?'' అని చెయిలో ఆ ఉత్తరంతోనే వంటగదికి వచ్చి రఘుపతి రాజంకి చెప్పలేదూ?

జానమ్మ, నటరాజన్ - వీరిద్దరి వైఖరీ రాజంకి నచ్చలేదు. 'ఇదేం గడబిడ? ఉద్యోగం లేదన్నమాత్రాన మా ఆయనకి ఏం తక్కువ?'' అనే భావన లేచింది. అందుకు రాజం కొంచెం గర్వపడింది కూడా.

కాని, అదీ కొన్నురోజులకే . . .

భవాని తన తల్లికి చెప్పింది: ''నా అత్తగారు మా ఆయన్ని ఉద్యోగం వదిలేసి సొంతవూరుకి వచ్చేయమని అంటున్నారు. 'ఎందుకు ఉద్యోగం చెయ్యాలి, ఇలా కష్టపడాలి?' అని అంటున్నారు. ఎంత డబ్బూ, ఆస్తీ, భూములూ ఉండనీ; అవన్నీ నిరంతరంగా ఒక ఉద్యోగంకి ఈడవుతాయా? నన్నడిగితే, మనిషికి పేరూ, అంతస్తు కావాలంటే ఉద్యోగంతోపాటు సొంత ఐశ్వర్యంకూడా ఉండాలంటాను. అదృష్టవశంగా మా ఆయన పెళ్ళికిముందే పది చోట్ల ఉద్యోగంకి ప్రయత్నం చేసారు. నాన్నగారుకూడా రాబోయే పరుడికి వృత్తినిబద్ధత ఉందని తెలిసినతరువాతే ముహూర్తదినం నిశ్చయించడం జరుగుతుందని వక్కాణించి చెప్పారు. కాకపోతే మేం ఉన్న ఆస్తిని ఉత్తికే చెదరగొట్టి, వొళ్ళువంచక అలాగే కాలం గడిపివుంటాం.''

భవాని కొంచెం ఆగింది. "అబ్బబ్బ, నేను నా అత్తమామలతోవున్నది స్వల్పకాలమే, కాని చాలారోజులున్నట్లు నాకు అలసటగా ఉంది," అని ముగించింది.

భవాని మాటల్లో రాజం గ్రహించిన సారాంశం ఇదే: 'ఒక దంపతుల అంతస్తు ఉద్యోగం, ఐశ్వర్యంబట్టి ఉంటుంది.'

అలాగైతే, తన భర్త మిలిటరీ ఉద్యోగంలో చేరవద్దని రాజం అనడం పొరపాటా? అతను ఎలాగైనా ఏదో వృత్తిలో పాల్గొనాలని, అతన్ని ప్రోత్సాహించడం తన ధర్మం అని రాజంకి తోచలేదా? తమిద్దరపై భవానిలో కనిపించే ఉదాశీనత, ఉపేక్ష రాజంకి బోధపడింది. 'ఐతేనేం, మాకు డబ్బంటే అత్యాశ లేదు. మా ఆయన తగిన ఉద్యోగం వెదుకుతున్నారు. నాకు కావలసినదంతా కొంచెం ప్రేమ, అవగాహన, అంతే. మేముండేది ఒక చిన్న ఇల్లు. వసతులు స్వల్పమే. నేను ఏకాంతమో, ప్రత్యేక సౌకర్యమో ఆశించలేదు. ఏమైనా పుస్తకం చదువుదాం, సంగీతం అభ్యాసం చేద్దామంటే దానికీ అవకాశం లేదు. ఇతరుల జోలికి పోకుండా అదెలా సాధ్యం?' అని రాజం తన్ను ఓదార్చుకుంది.

స్వభావంగా రాజంలో పిరికితనం, సిగ్గు చోటుచేసుకున్నాయి. అందువలనే ఆమె రఘుపతిని డాబామీదకి వెంటబడలేదు. దాన్ని తలుచుకొని రాజం ఇప్పుడు బాధపడింది. ఇతరులెవరినీ నిందించక ఆత్మశోధనలో మునిగిపోయింది.

నటరాజన్ రాజంని "నువ్వు కావేరీ నదిలాగ!" అని పొగడారుకదా? 'ఐతే, మరి భవాని తన్ను ఒక ఉపనదిగా కల్పనచేసుకుందేమో?' అని రాజం తనలో అడుక్కుంది.

## 24

ఉత్తరదేశంనుంచి వచ్చిన ఒక సితారు వైణికుడు ఆ చుట్టుపక్కల ఉన్నాడని భవానికి ఎవరో చెప్పారు. అతని దగ్గర సితారు వాద్యం నేర్చుకోవాలని భవాని ఆశించింది. అది విని దొరస్వామి "మరి కలకత్తాలో నీలో ఈ ఆతురత కనిపించలేదే?" అని నవ్వుతూ అడిగారు.

"రఘు అన్నయ్య వద్దంటాడేమో అని నాకు అనుమానం వేసింది. ఇప్పుడు నాన్నగారూ అదే అంటున్నారు," అని భవాని తల్లితో మొరబెట్టుకుంది.

'నాకూ సంగీతంలో ఆసక్తివుంది; ఇంకా వృద్ధిచేసుకోవాలనే ఆశకూడా వుంది,' అని రాజం చెప్పదలచుకుంది, కాని జంకింది. ఏది ఎలాగైనా రఘుపతి జోక్యంచేసుకొని "నేనెందుకు వద్దంటాను? ఇక్కడ ప్రమేయం లేదనే రాజం వాళ్ళ ఇంట్లో సాధకం చేస్తుందని విన్నాను. అదేం తప్పా?" అని భవానికి చెప్తాడని ఎదురుచూసింది. కాని రఘుపతి ఏమీ అనలేదు.

శారదాంబాళ్ కూతురి కోరిక ప్రకారం సితారు శిక్షణకి ఏర్పాటుచేసింది. రాజం ఇంతకుముందు సితార్ని చూసివుండలేదు; పాఠం ఆరంభించిన మొదటిరోజు వైణికుడు వాద్యంని నిలువుగా పట్టుకొని, తీగలని నాజూకుగా మీటుతుంటే, ఆ సున్నితమైన సంగతులు స్పష్టంగా విని ఆనందించింది; భవాని తన రెండుకాళ్ళూ - ఒకటిమీద ఇంకొకటి ముడుచుకొని - కుడిపక్క వొంగి, సితారు బుఱ్ఱ నొరకాయమీదానుకున్న భంగిమని ఆతురతో చూసింది. రాజంకి మరేం పగటికలలు లేవు. "వయలిన్ అభ్యాసం దక్కితే అదే చాలు," అని ఓదార్చుకుంది.

ఒకరోజు భవాని తను సీతారు అభ్యాసం చేసేముందు రాజంని పక్కకి పిలిచింది. "నేను ఇవాళ ఊ గత్ ఇరవైసార్లు సాధకం చెయ్యాలి; ఇక్కడ కూచో, నువ్వు లెక్కబెట్టాలి," అని చెప్పింది. అలాగైతే, తను ఇంట్లో చెయ్యవలసిన పనులకి ఆటంకం కలుగుతుందని రాజం వెనకాడింది. కాని 'ఇవాళ మాత్రమేకదా?' అని సరేనంది. ఐతే, ఆ తరువాత నియతంగా తను సీతారు అభ్యాసం చేసినప్పుడల్లా రాజం తనపక్కనే వచ్చి కూర్చోవాలని భవాని పట్టుబట్టింది.

రాజంకి ఇంట్లో అస్తమానమూ ఏదో పని. 'సరే, సమయం దొరికినా, కొంచెం విశ్రాంతి తీసుకుందాం, ఏదైనా పుస్తకం చదువుదాం,' అంటే అదీ వీలుకాదు. భవాని ప్రతి దినం తన్ను తన సితారు అభ్యాసంకి పిలవడం రాజంకి నచ్చలేదు. ఎటొచ్చీ, భవానికి అది బోధపడలేదు. అంతేగాక "వదినగారూ, మీరు సరిగ్గా లెక్కబెట్టడంలేదు!" అనికూడా ఆరోపించింది.

భవాని సితారు అభ్యాసం ముగించగానే రాజంకి తనూ వయలిన్ అభ్యాసం చెయ్యాలనే ఆశ కలిగేది. కాని భవాని అభ్యాసం సాయంకాలవేళల్లో జరగడంవలన అప్పుడే చీకటి సూచనలు కనిపిస్తాయి. ఒకరోజు రాజం అత్తగారిని వయలిన్

సాధకంకి అనుమతి కోరింది. కాని కోంచెసేపట్లో దొరస్వామి సాయంకాల జపం చెయ్యబోతున్నారని, అందుకు రాజం సాయం కావాలని  శారదాంబాళ్ అనుమతివ్వలేదు.

అనేకసార్లు భవాని సితారు అభ్యాసం ముగించిన వెంటనే గభీమని లేచి రాజంని తనవెంట వాహ్యాళికి రమ్మని పిలిచేది. మరి చంటిపాప చిత్రాన్ని మోయడానికి రాజం కావాలిగా?

రఘుపతికి ఇవన్నీ తెలుసు. తెలిసీతెలిసినట్టు ఊరుకున్నా, విచక్షణతో, చూపులతోనే రాజంకి తన ఆదరణ, ప్రేమ తెలియజేసేవాడు. అదే తమ ఇద్దరి బాంధ్వంలో ఒక ఊరడింపు అని రాజం సంతోషపడింది. అది భార్యాభర్తలమధ్య కాదు - ఇద్దరు మిత్రులమధ్య పరిస్థితి అని ఆమె గుర్తుచేసుకుంది.

ఐతే భవాని అనుకున్నట్టు ఏమీ జరగలేదు. రఘుపతి భార్యకు అనుకూలంగా మాటాడకపోయినా చెల్లెల్ని రాజంకంటే ఒక ఎత్తుపీఠంమీద అమర్చలేదు. భవానికి తన అన్నయ్యా, వదినా, ఒక సమస్యగా కనిపించారు. వాళ్ళిద్దరిమధ్య అంత గాఢప్రేమవుందని భవాని కల్పనకూడా చెయ్యలేదు. నిరాశగా ఆ దివ్యప్రేమని పరీక్షించాలని పట్టుబట్టింది.

ఆ కారణంవలనే ద్వేషం, కడుపుమంట ఇంకా తీవ్రంగా ఆమెలో చోటుచేసుకున్నాయి.

ఒకరోజు చంటిపాప చిత్ర తల్లి తనకి ఎంచిన చొక్కా వద్దని అల్లరిపెట్టింది.

"అక్కయ్యా, పాపకెది ఇష్టమో అదే తొడగవచ్చుగా?" అని రాజం సలహా ఇచ్చింది.

"దాని జుత్తులోని రిబ్బన్ రంగు చూసావా? అది చూసి మాటాడు!"

"ఓ, అలాగంటున్నారా? Match అవకపోయినా, contrastగా కనిపించడం మంచిదేకదా?"

"ఏం, ఎందుకు మనం అలా చెయ్యాలంటాను? చంటిపాప ఎదడిగినా సరే అనాలా? అసలు పాప పెద్దవారి ప్రవర్తన చూసే 'ఇది కావాలి,' 'అది కావాలి', అని హఠం చేస్తుంది."

భవాని తన్ను ఎత్తిపొడిచి మాటాడబోతుందని రాజం గ్రహించలేదు.

"అవునక్కా, మీరన్నది నిజం. మనంకూడా 'ఇవాళ ఏ చీర కట్టుకుందాం?' అని కొంత సేపు ఆలోచించిన తరువాతే అలాగే చేస్తాం."

భవాని ముఖం చిరచిరలాడింది:

"ఆ మాటలు నేనే నీకు చెప్పాను. మరి 'మనం' అని ఎందుకు నువ్వు అంటున్నావ్? నువ్వు ఉత్తికే ఆలోచన లేకుండా match కాని ఏదో చీరా, blouseతో బయటికి వెళ్ళడం నాకేం తెలియదనుకున్నావా?"

"అయ్యో దేవుడా, నాకూ ఇది ఒక పెద్ద ప్రశ్నే! నా బుగ్గలమీద మొటిమలు చూసి నేను కలవరపడేదాన్ని. చెప్పులుకూడా సరైనా అని బాధపడేదాన్ని." కొంచెమాగి, ఒక చిరునవ్వు విసిరి రాజం మళ్ళీ మాటాడింది: "మనం అని నేన్నప్పుడు నేను సామాన్యంగా స్త్రీలగురించి చెప్పాను."

ఇరుగుపొరుగులనుంచి ఎవరో శారదాంబాళ్ ని ఒక పేడుకకి పిలిచారు. తనకి బదులుగా భవాని, రాజం వెళ్ళమని ఆవిడ అన్నారు. రాజం పెరడులో తన కాళ్ళు మురికిగా ఉన్నాయని, రాతిమీద రుద్దుకొని వాటిని శుభ్రం చేసుకుంది. అది చూసి భవాని "ఇదేం చోద్యం? ఎవరైనా తన కాళ్ళకే పూజ చేస్తారా?" అని ఎగతాళి చేసింది.

ఇంకొకరోజు భవాని " రాజం, నువ్వు వెళ్ళి ముఖం కడుక్కో, మనం బయటికి వెళ్ళాలి," అని చెప్పింది; తన దుస్తులు పోగుచేసుకొని ముఖం శుభ్రంచేసుకొని సిద్ధమైంది. "నువ్వెప్పుడూ ఆఖరికి ముఖం కడుక్కొని రెడీ అవుతావ్, అప్పుడే నీ రూపు తళతళలాడుతుంది. నీ ఆలస్యంవలన మనం బయటకి వెళ్ళేముందే నా మొహం మాసిపోతుంది," అని రాజంని ఎత్తిపొడిచింది. వచ్చే రోజుల్లో ఆ తప్పులు, ఒప్పులనుంచి తప్పించుకోవాలని రాజం తనే ముందుగా ముఖం కడుక్కుంది. వెంటనే భవాని "చూసావా, నువ్వు అప్పుడే నీ మేకప్, కొత్తచీరతో రెడి ఐపోయావ్, నేనింకా రాలేదని బొబ్బలు పెడతావ్," అని హేళన చేసింది.

మరి ఏంచేయాలో తెలియక రాజం చిక్కులో పడింది. తను ఎది చేసినా తప్పేనా?

భవానితో బయటకి వెళ్లడమంటే రాజంకి ఒకటే దిగులు. మరి తనేకదా ఎల్లప్పుడూ చంటిపాప చిత్రాన్ని ఎత్తుకోవాలి? "నేను ఎవరితోనైనా కబుర్లు

చెప్పుకుందామంటే నా బిడ్డ అల్లరి చేస్తోంది. అందుకే నువ్వు నాతో రావాలని అంటున్నాను. నీకది బోధపడదేం? నేను నీ ఆడపడచుని; నా స్నేహితులని కలుసుకోవాలని నాకు ఆశ. చిత్రాన్ని ఎత్తుకోడానికి ఇష్టంలేక నువ్వు రానంటున్నావా?" అని భవాని నిందించింది.

"అక్కయ్యా, చిత్రాన్ని ఎత్తుకోడం నాకేం పెద్ద భారం కాదు. ఇంట్లో నేనేకదా దాన్ని చూసుకుంటున్నాను? ఇక వాహ్యాళికి  మీరు మాత్రం వెళ్ళవచ్చుకదా?"

"మరి పాప సంగతో? దానికి షికారు వొద్దంటున్నావా?"

"సరే అక్కయ్యా, నేనూ వస్తాను."

"మీరెందుకు చిత్రాన్ని ఎత్తుకోకూడదు?" అని రాజం ఎన్నడూ భవాన్ని అడగలేదు.

ఇవన్నీ - ఈ సామాన్య, రోజువారి రచ్చలూ, వ్యవహారాలూ - దొరస్వామికి తెలుసా? అతని దినచర్య క్షేమంగా, తీవ్రంగా తన ప్రపంచంలో లీనమైపోయి, స్వాతంత్రోద్యమం గురించి అన్ని సంగతులూ తన మిత్రులతో పంచుకోవడంలో సాగింది. భవాని రాజంపై విధించిన దౌర్జన్యమో, రాజం అనుభవించే దిక్కుమాలిన పరాజయమో అతనికి ఏ మాత్రం తెలియదు. 'మన కోడలికి అందరిమీదా అభిమానం ఉంది; ఈ ఇంట్లో మరేం గొడవలు ఉండవు," అని అతని దృఢనమ్మకం.

కాని రఘుపతి  మెల్లమెల్లగా - రహస్యంగా - ఈ సంఘటనలు గ్రహించుకున్నాడు. ఐనా, అతను వెంటనే రాజంపై సహానుభూతి చూపలేదు. ఎటువంటి పరిస్థితిలోనూ రాజంకి తన తల్లిదండ్రులమీదున్న మర్యాద, గౌరవం దృఢమని అతనికి తెలుసు. తన ప్రభావం చూపి భార్యమనసు మార్చాలని అతను పూనుకోలేదు. తను మధ్యస్థుడుగా మెలగాలి, అదే ముఖ్యం. రఘుపతి రాజంమీద తన ప్రేమ ధారధారగా పోసాడు - కాని అందులో ఉత్సాహం, ఆత్మీయత చోటుచేసుకోలేదన్నది నిజం. అది తన పొరబాటే అని రఘుపతి ఒప్పుకున్నాడు. తన స్వభావంలోనున్న లోపంగురించి తను రాజంకి రాసిన ఉత్తరంలోని వాక్యాలు అతను గుర్తుచేసుకున్నాడు: "స్వబావంగా నాకెప్పుడూ కొందరిమీద అపేక్ష,

మరకొందరంటే ఉపేక్ష; ఈ గుణాలు  నాలో దృఢంగా కనిపిస్తాయి. ఇక నీ సహవాసంతో నేను ఈ తీవ్రభావాలు విడిపించుకుంటానని నా నమ్మకం."

"ఇవాళా రేపూ మంచి తెలుగు సినిమాలు వస్తున్నాయి. మనం వెళ్దామా?" అని ఒకరోజు రఘుపతి భవాన్ని అడిగాడు. "కాని నీకు మంచి పాటలు వినాలంటే తమిళ సినిమాలే చూడాలి!" అని సలహా ఇచ్చాడు.

ఇంకొకరోజు నటరాజన్ గురించి మాటాడుతూ అతన్ని పొగడాడు: "మా మామగారిని చూస్తే ఆంధ్రుల్లా కనిపిస్తారు. కాని అతనితో సంభాషణ అని ఆరంభించిన వెంటనే అతనికి తమిళబాషలోనున్న అభిమానం మనకి బోధపడుతుంది. అతను చదివే తమిళ పుస్తకాలు ఎన్ని రకాలని ఎలాగ వర్ణించడం?"

ఇంకొకరోజు రఘుపతి తల్లికి చెప్పాడు: "అమ్మా, అవాళ మన పర్వతం[2] అవ్వ ఏమందో తెలుసా? 'రఘుపతి, వచ్చిన రోజుల్లో రాజం నాకు వింతగా కనిపించేది. కాని, ఇప్పుడో . . . . తలెత్తి ఇంట్లో నడుస్తోంది!' అని."

రఘుపతి రాజం ముఖం చూసినప్పుడల్లా 'రాజం, నువ్వొక ఆదర్శ యువతి!' అని మనసార అభినందించాడు.

'ఇది నాకు చాలు' అని రాజం తృప్తి పడింది. తన భర్త తన తల్లీ, భార్యల విషయంలో మధ్యస్థుడుగా ఉంటున్నాడు. దాని మూలంగా తన మనసులో నిమ్మళం, ప్రశాంతత చోటుచేసుకున్నాయి. ఇక తన దాంపత్యం మాటకి వస్తే, అందులో చెప్పుకోడానికి ఏమీ లేకపోయినా, భవిష్యత్తులో తప్పకుండా మార్పులు రావొచ్చు, తనకి విమోచనం లభిస్తుందని రాజం ఆశించింది.

ఒకరోజు సాయంకాలం రఘుపతి వాహ్యాళికి వెళ్ళాడు. ఆ సమయంలో భవాని వచ్చి ఆతని సూట్ కేసు ఒకటి తీసుకుంది. "రాజం, ఇది నా సూట్ కేసు. ఇంతకుముందు నేనిది అన్నయ్యకి ఇచ్చి వేరొక చిన్న సూట్ కేసు తీసుకున్నాను.

---

[2] తమిళంలో పార్వతికి వాడే పేరు

ఇప్పుడది వాపసు చేస్తున్నాను," అని వివరించింది. రాజంని తన చీరలు మడతబెట్టి తన సూట్ కేసులో నింపమని చెప్పి, ఆ తరువాత వెళ్ళిపోయింది.

ఈ పరివర్తన ఇంటికి తిరిగివచ్చిన తరువాత ఆ రోజు రఘుపతి గుర్తించలేదు. కాని ఆ మరునాడు తన సూట్ కేసు చూడగానే "ఎవరు నా బట్టలు గందరగోళం చేసారు?" అని కూత పెట్టాడు. తన దుస్తులంటే అతనికి అసాధరణ వాంఛ.

రాజంకి స్నానగదిలోనుంచి అతని గొంతు వినిపించింది. కాని భవానికి అతని కలవరం అర్థం కాలేదు.

"అన్నయ్యా, ఏం జరగింది?"

"ఎవరు నా బట్టలు మార్చారు?"

"నేనే . . . ."

"కొంచెం జాగ్రత్తగా బట్టలు నింపకూడదా . . . చూడు, మడతలన్నీ ఎలా కలిసిపోయాయో?"

"అన్నయ్యా, నేను వదినని బట్టలు సర్దమని చెప్పాను . . . నాకు ఒకటే తొందర . . . నా చీరలు సర్దుకొని వెళ్ళిపోయాను . . ."

'అబద్ధం, అబద్ధం! భవాని అక్కయ్య చీరలు నేనే మడిచి సూట్ కేసులో నింపాను. అక్కయ్యే మీ బట్టలు అలాగే అశ్రద్ధగా సూట్ కేసులో పడేసింది,' అని బొబ్బలు పెట్టాలని రాజంకి తోచింది. కాని ఆమె పెదవులు కదల్లేదు.

రఘుపతి ముఖం ఎర్రబడడంచూసి భవాని దిగులుపడింది. అతను స్నానగదికి నడిచి వెళ్ళగానే వంటగదిలోకి వెళ్ళి తల్లికి చెప్పింది: "వదిన బట్టలు సర్దిందని చెప్తే అన్నయ్యకి కోపం రాదనుకున్నాను."

రఘుపతి సబ్బు మరిచిపోవడంవలన స్నానంగదినుంచి బయటకి రావడంతో భవాని మాటలు విన్నాడు; తన తల్లి మాటలుకూడా విన్నాడు:

"వాడికటువంటి పక్షపాతం ఎప్పుడూ లేదే!"

ఆ తరువాత రఘుపతి స్నానగది దూరగానే రాజం ఒక మూల కళ్ళు తుడుచుకొని నిలబడడం గమనించాడు; తువాలుతో ఆమె భుజం మృదువుగా తాకాడు.

రాజం గభాలున తిరిగి భర్తని చూసింది; అక్కడనుంచి మౌనంగా జారుకుంది. కాని కళ్ళు భర్తకి అందించిన సందేశం ఇదే: 'మీరు నన్ను ఇప్పుడు దంచినా, వాయించినా నేనేమీ అనను."

రఘుపతికి గుండెలో ఎవరో పొడిచినట్టు అనిపించింది. మరు క్షణమే అతని మనసులో ఇంకొక శూన్యమైన ఆలోచన, 'నాకుగాని ఉద్యోగం దొరికితే . . . . రాజం ఎంత ఉచితమైన స్త్రీ!' లేచింది.

రాజం తన కళ్ళతో తనకి చూపించే జాడలు, ఆ ఎండిపోయిన నవ్వు, ఇప్పుడే అతనికి సూటిగా అర్థమైయ్యాయి. "ఈ ప్రశ్నకి కారణం నేనే. నేను నా భార్యకి చూపే ఆదరణ నీరసంగా కనిపిస్తోంది. నిష్పాక్షికత మంచి లక్ష్యం కావచ్చు, కాని దానికి ఒక పరిమితి ఉండాలి. ఇక నేనేంచెయ్యాలి?" అని అతను కలవరపడ్డాడు.

కొన్నిరోజుల్లో అతనికి పరిహారం దొరికింది. రాజం ప్రవర్తనలో ఒక మార్పు. ఆమె అన్నీ సర్దుకొని పోవడంలో మరేం చిక్కు కనిపించలేదు.

రాజం హృదయంలో గాఢమైన తృప్తి చోటు చేసుకుంది. తనకి మంచి ఇల్లాలనే మెచ్చుకోలు, తనంటే అందరికి అభిమానం. ఇంతకుముందు ఆమె మనసులో "నేను ఒక ఆదర్శపత్ని కాదేమో?" అనే అనుమానం లేచేది; ఇప్పుడు అటువంటి సంశయం లేదు.

తను ఒక గయ్యాళి భార్యగా, భర్తని ఎత్తిపొడిచి మాటాడకూడదు. రఘుపతి ఒక అదర్శ భర్త కాకపోవచ్చు; అతను చూపే ప్రేమ, ఆదరణలో లోపాలుంటవచ్చు. 'ఐతేనేం, ఇంతకన్న మరీ చెడ్డుగా మారకపోతో అదే చాలు. నన్నూ, మా ఆయన్ని ఎవరూ నిందించకూడదు! అదే ముఖ్యం!'" అని రాజం మనసార నమ్మింది.

అంతరాత్మలో ఒక పూర్ణత ఏలుకోడంతో, ఆమె ముఖంలో ఒక ప్రకాశం కనిపించింది.

అప్పుడప్పుడు రఘుపతికూడా తను చూస్తున్న రాజం ఒక దైవస్వరూపమా అని ఆశ్చర్యపడ్డాడు. కపటంగా, ఏదో ఒక నెపంతో భవాని రాజంతో తారుమారుగా మాటాడినా, 'ఇది చెయ్', 'అది చెయ్' అని ఉత్తికే ఆమెను బలవంతం చేసినా, రాజం

రాజం చిరునవ్వుతో సరేనని అన్నీ చేసింది. రాజంలో కనిపించే నెమ్మది, ప్రశాంతి చూసి ఆమె తన తల్లినికూడా మించిపోయిందని రఘుపతికి భావన కలిగింది.

ఒక రోజు పెరడులో ఆరబెట్టిన బట్టలు వర్షంలో తడిసి పోతాయెమో అని తోచినప్పుడు 'నేను నా పుట్టిల్లుకి వచ్చాను; నాకెందుకు ఇవన్నీ?' అని ముణుగుతూ, కదలకుండా భవాని అలాగే రాతిలాగ కూర్చున్నప్పుడు, రాజం - తన భోజనం ఆపి - లేచింది. కాని శారదాంబాళ్ "వొద్దు. నువ్వు లేవనక్కరలేదు. రఘుపతి చూసుకుంటాడులే," అని కోడలిని ఓదార్చింది.

'రాజం పడుతున్న కష్టాలకీ, అవమానంకి నేనే కారణం,' అని రఘుపతి మనసులో గిలగిలలాడాడు.

## 25

రఘుపతి మానసిక బాధవలనో, లేక భవాని చేసిన సూట్ కేసుల వినిమయమో - ఎది కారణం అని బోధపడలేదు. కాని రఘుపతికి ఉద్యోగం గురించి మంచి వార్త అందింది.

తాత్కాలిక ఉద్యోగమే; యుద్ధం ఇంకా కొన్నిరోజుల్లో సమాప్తి కావడంతో యుద్ధరంగంలో చెయ్యవలసిన పనేమీ కాదు.

"ఎది దొరికితే అదే మంచిది. మళ్ళీ ఇటువంటి చాన్సు ఎప్పుడు వస్తుందో?" అని రఘుపతి ఉద్యోగంకి ఒప్పుకున్నాడు.

ఈ శుభవార్త రాజంకి తెలియజేయాలని రఘుపతి దగ్గరికి వచ్చాడు. భవాని ఎటువంటి ఆసక్తి చూపకుండా తన సితారు వాద్యంనుంచి చెయి తీయలేదు. 'ఎక్కడ పోస్టింగు?' అని రాజంకి ఆతురత. రఘుపతి ఆమె పక్కన వంగి "ఇది చదువు," అని తన చేతిలోని కాగితంలో ఒక వాక్యం చూపించాడు. ఆ తరువాత అక్కడే కూర్చుండి రాజంకి ఆది చదివి చూపించాడు.

"ఓహో . . . ఈ ఇల్లు వదిలి వెళ్ళడమంటే ఎంత సంతోషం!" అని భవాని తనలో గొణుక్కుంది.

'నా భర్త తనకి ఉద్యోగం దొరికిన శుభవార్త నాతో పంచుకుంటే తప్పా? నాకు ఈ ఇంటిలో మచ్చుకైనా వదిన అనే పేరులో ఏ హోదా లేదే, మరి నేను సంతోషంగా

ఉన్నానని భవాని ఎందుకు చెప్తోంది?' అని తలపు రాగానే రాజం కళ్ళు తడిసిపోయాయి. మంచివేళ, భార్యాభర్తల ఎడబాటువలన తనకీ దుఃఖమా అని భవాని ఎగతాళి చెయ్యలేదు.

'నేనూ, నా భర్త ఒకరికొకరు దూరంగావుంటేనే మంచిది. అప్పుడే మేమిద్దరం పడుతున్న బాధా, క్షోభా నేరుగా చూడకుండా ఉండగలం. తీయని ఊహలతోనే మా రోజులన్నీ అనుభవిస్తాం!'' అని రాజం తృప్తిపడింది.

జానమ్మ రావడానికి ముందు భవాని తన తల్లితో ''అత్తవారిల్లో మా ఆయన లేకపోతే నాకేం పని? నేను వెళ్ళనేవెళ్ళను!'' అని చెప్పింది. ఇప్పుడు రాజం మనసులోకూడా అలాంటి ఉద్దేశముందేమో అని శారదాంబాళ్ కలవరపడింది. కాని రఘుపతి వెళ్ళినతరువాత రాజం వాడుకగా ఇంటిపనులన్నీ చెయ్యడంచూసి ఆవిడకి ఆరాటం కొంచెం తగ్గింది.

''మీ ఊరు రఘుపతి ప్రయాణం చేసే దారిలోవుంటే నిన్నుకూడా రఘుపతితో పంపించివుంటాను: అదే నేనూ ఆలోచించాను. కాని వాడికెక్కడ బస స్థిరమవుతుందని, నిన్నెప్పుడు పిలిపించి కాపురం పెడతాడని మనకింకా తెలియదు; నీకూ మీ అమ్మా, నాన్నగారిని చూడాలని ఆతురతగా ఉంటుంది,'' అని ఆవిడ రాజంకి చెప్పారు.

రాజం ముఖం ఎర్రబడింది. ''అతనిక్కడ ఉంటేనే నేనూ ఉండాలా?'' అని అత్తగారి ముఖం చూడకుండానే జవాబు చెప్పింది.

''నువ్వలా అనడం నాకు చాలా సంతోషంగావుంది. ఎవరికి తెలుసు? నువ్వు మళ్ళీ ఈ ఇంటికి వచ్చినప్పుడు మీ కాపురం ఏ ఉత్తరదేశంలోనో ఉండవచ్చు. నువ్వు కడుపుతోవుంటే, ప్రసవంకి మీ పుట్టిల్లుకి వెళ్ళాలికదా?''

రాజం చిరునవ్వు నవ్వింది.

''చిత్రాకి నువ్వంటే ఎంత మక్కువ! నీకూ అదంటే ఎంత అభిమానం!అలాగేకానీ, చాలా తృప్తి, మరేంకావాలి నాకు?''

తన జీవితంలో ఆశయం నెరవేరిందని రాజం ముప్పొంగిపోయింది.

"భవాని ఎక్కడ? దాని పాటమాష్టారు వచ్చారు!" అని దొరస్వామి భార్యని అడిగారు.

"అది ఇప్పుడే బయటికి వెళ్ళింది. త్వరలో వస్తానని చెప్పింది. ఇవాళ పాటమాష్టారు ముందుగా వచ్చేసారు!" అని ఆవిడ భర్తకి చెప్పారు. దొరస్వామి పాటమాష్టారుతో కాలక్షేపంకి ఏమైనా మాటాడుకుంటారని శారదాంబాళ్ ఎదురుచూసారు. కాని అతను వెంటనే నిష్క్రమించడం చూసి రాజంని "నువ్వెందుకు వయలిన్ లో కొన్ని కీర్తనలు వాయించకూడదు? అతనెందుకు ఉత్తికే భవానికోసం కాచుకొనివుండాలి?" అని అన్నారు.

రాజం చాప పరచింది. దానిమీద సితారు వాద్యం అమర్చింది.

"అమ్మా, మీరతనికి చెప్పండి," అని రాజం అత్తగారిని వేడుకుంది. మనసులో 'ఇంటిపనులు తప్పిస్తే నాకు మరేం తెలియదని ఈ మాష్టారు ఉద్దేశం కాబోలు!' అని బాధపడింది.

గోడపక్కనే నిలబడి, హీనస్వరంతో "అమ్మా, ఏం పాడమంటారు?" అని రాజం అత్తగార్ని అడిగింది.

"హంసానంది పాడమ్మా," అన్నారు మాష్ట్రారుగారు.

"నాకు హంసధ్వని తెలుసు; అది వింటారా?"

రాజం *వాతాపి గణపతిం* వాయించి ముగించిన తరువాత అతను "అమ్మా, నీకింతమంచి ప్రావీణ్యం ఉంది. ఇన్నిరోజులూ నీ ప్రదర్శన వినలేదని నాకు చాలా బాధగావుంది," అని అన్నారు. ఆ తరువాత అతను ఇద్దరితోనూ ఆ రాగంలోని లక్షణాలు వివరించిచెప్పారు. ఇంతలో భవాని తిరిగివచ్చేసింది.

'నా అత్తగారు నాగురించి అభిమానంతో మాటాడారు; పాటమాష్టారు నా సంగీత ప్రజ్ఞ పొగడారు; నా భర్రకి ఉద్యోగం దొరికింది. ఇక నా చెడ్డరోజులకి మూట కట్టినట్టే. భవానికూడ నన్నిక తృణంగా తోసిపారేయదు,' అని రాజంని తృప్తి, గర్వం, ఆకట్టుకున్నాయి. ఆ రాత్రి భర్తగురించి తీయనికలలుకంటూ రాజం నిద్రపోయింది.

ఆమె ఊహించినట్టే ఆ మరుదినం భవాని రాజంతో "వదినా, నా ప్రసవంకి నువ్వు సాయం చెయ్యబోతున్నావని అమ్మ చెప్పింది. నా చింత అంతా చిత్రా గురించే. వచ్చే

ఎనిమిది, పది రోజుల్లో నేను దాని కళ్ళకి కనిపించను; పాపని నేను ముద్దాడడం చూసి అది అసూయ పడుతుంది. నువ్వే దాన్ని చూసుకోవాలి," అని చెప్పింది. అది విని రాజం మళ్ళీ తన ప్రతిష్ట పెరిగిందని చాలా ఆనందించింది.

ఇప్పుడు భవాని తన్ను బానిసగాకాదు, గౌరవంగా భావించుతోందని రాజంకి తోచింది. మనఃపూర్వకంగా భవానికి అన్ని వసతులూ సమకూర్చింది: చిత్రాకి దాదిగా మారిపోయింది; వంట, చిల్లరి పనులలో అత్తగారికి సాయం చేసింది; భవానికి సహకారిగా చెయ్యూత ఇచ్చింది. ఇవన్నీ చేస్తూనే ఆ ఇంటిలో తను వహించే పాత్ర ఎంత ముఖ్యమని రాజం గ్రహించింది. "నా తల్లిదండ్రులూ, అత్తమామలూ మధ్య నేను ఎటువంటి నిష్పాక్షికత చూపనక్కరలేదు; నాకు పుట్టిల్లుగురించి వ్యామోహం కూడదు!" అని తనలో చెప్పుకుంది.

కాని రోజురోజుకీ భవానిలో దురాశా, హఠమూ ఇంకా బాగా పెరిగాయి. కావాలనే స్నానం చెయ్యడానికి వెళ్ళే దారిలో గడపలోనున్న సబ్బుపెట్టె భవాని ఏరుకొనడం మరిచిపోయి తరువాత దాన్ని తీసుకురమ్మని రాజంని తొందరపెట్టేది. స్నానగదికి రాజం వెళ్తే చాలు – భవాని ఆశువుగా అన్నిరకాల ఆజ్ఞలు - 'ఆ నూనెగిన్నె నా చేతికి అందించు!', 'ఆ పసుపురేకు ఇక్కడ నా దగ్గర పెట్టు!' - రువ్వడం అలవాటుచేసుకుంది. గర్భిణియైన తన ఆడుపడుచుకి తను సాయం చేస్తున్నట్టు రాజం తన్ను ఓదార్చుకునేది. కావాలనే భవాని తన్ను అస్తమానం పీడించుతోంది అని రాజంకి బోధపడింది, కాని మౌనంగా అది తన ధర్మమని సహించుకుంది.

ఆరోజు తన మామగారి మాటలు రాజం గుర్తుచేసుకుంది. "రాజం, ఎందుకు నీకీ తొందర? ముందు ఇప్పుడేం పని చేస్తున్నావో అది పూర్తి చెయ్. ఎందుకు మధ్యలో దాన్ని ఆపాలి?" అని అతను అడిగారు. కాని అతని భార్య అతనికి జవాబు చెప్పింది. "ఎల్లప్పుడూ అది సాధ్యంకాదు. నిర్బంధం అని ఏదైనా వస్తే చేతిలోనున్న పని వదులుకొని దాన్ని మనం చూసుకోవాలి. మీకు తెలుసా, ఆరోజు అప్పడాలన్నీ ఎండిపోయాయ్. నేను వెంటనే వాటిని చేర్చికట్టాను. దానికి చాలా సమయం పట్టింది," అని ఆవిడ అన్నారు.

ఆ రోజే రాజం తను ఇంటిలో బహువిధాలుగా పనులు నిరవేర్చాలని నిశ్చయించింది. కాని శారదాంబాళ్ "నువ్వెందుకు ఇక్కడా అక్కడా పరుగెడుతున్నావ్? నువ్వు భవానికి ఏంకావాలో చూసుకో? ఈ కొబ్బరికాయ రుబ్బడానికి ఎంతమంది కావాలి?" అని అన్నారు.

తను భవానికి చేదోడు ఇవ్వాలి, అదే తన మొదటి కర్తవ్యమని రాజం గ్రహించింది. ఐనాకూడా, భవాని, శారదాంబాళ్ – ఇద్దరికీ - సమంగా అన్ని సేవలూ రాజం చేసింది. ప్రతీదినం, పొద్దున్న భవానికన్నీ సరికూర్చి, స్నానం చేసి, ఆ తరువాత వంటగదిలో అత్తగారికి సాయం చేసింది.

కొన్ని సమయాల్లో చిన్న చిన్న అక్కఱలేని పనులకికూడా భవాని తన్ను తొందరపెట్టడంవలన అత్తగారికి తను సాయం చెయ్యడం వీలుకావడంలేదని రాజం బాధపడింది.

"అక్కయ్యా, ఒక పది నిమిషాలు ఆగండి; మనం ఈ అల్మారా శుభ్రం చేద్దాం. ముందు నేనీ కూరగాయలు తునకలు చేసివస్తాను," అని రాజం బతిమాలేది. కాని భవాని అహంకారంతో "నేను నా పుట్టిల్లుకి వచ్చాను. నువ్వూ, అమ్మా నన్ను బాగా చూసుకోవాలి. మా అమ్మని చూసుకోడానికి నువ్వెవరు?" అని గద్దించేది. భవాని మనసు రాజంకి బాగా బోధపడింది.

భవాని ఆజ్ఞ విన్నవెంటనే రాజం వంటగది వదిలి తొందరగా బయటకి వస్తుంది. అంతలోనే ఆమె చెవుల్లో "వదినా, నువ్వెప్పుడూ వంటగదిలోకి మాయమైపోతావ్!" అని భవాని ఆరోపణ వినిపిస్తుంది. ఆ తరువాత భవాని నోటినుంచి వరుస పరుసుగా ఫిర్యాదులు: "చూసావా, ఈ అల్మారాలో, పుస్తకాలలో ఎంత ధూళి! ఎందుకు ఈ బట్టలన్నీ చిందరవందరగా ఉన్నాయి? వాటిని వెంటనే మడిచిపెట్టు! వంట చెయ్యడం మాత్రం తెలుసునంటే సరిపోతుందా? ఏదీ, నువ్వెలా బట్టలు మడుస్తావని నేను చూస్తాను. నీకు తెలుసా, ఒక్కొక్క వస్త్రం ఒక్కొక్కవిధంగా మడతపెట్టాలి!" అని భవాని గద్దించుతుంది. రాజం ఏమీ అనక, రెప్పవాల్చకుండా భవానిని చూసి "అవునక్కయ్యా, మీరంటున్నది నిజం. ఏ పని చేసినా అది ఒక కళ అని మనం

గుర్తించాలి," అని ఒప్పుకొని భవాని చెప్పిన పనులన్నీ చేసింది. అందువలనే ఉతికిన బట్టలు ఆరబెట్టాలని మంచి ఎండలోనే బట్టలుతకడం రాజం అలవాటుచేసుకుంది.

"ఈ మండుతున్న ఎండలో రాజం బట్టలుతుకుదుందా?" అని దొరస్వామికూడా ఒకరోజు అడిగారు. "నాకది తెలిసివుంటే నా పంచె ఇచ్చివుండను."

"ఎండ తీవ్రమవడానికిముందే రాజం బట్టలుతకవచ్చు. కాని ఉదయం రాజం అన్నిపనులూ చేస్తోందికదా? స్నానం చేసినతరువాత నాకు సాయం చేస్తోంది. కొన్నిరోజులు నాకు వడ్డించుతుందికూడా. ఆ తరువాతే, మంచి ఎండలో బట్టలుతుకడం దానికి అలవాటైపోయింది," అని శారదాంబాళ్ అతనికి చెప్పారు.

"ఏ పనీ వాడుకగా చెయ్యాలని నియమం ఉందా ఏమిటి? అలాగేం లేదు. ఇలాంటి సమయాల్లో మనం సవరించుకొనిపోవాలి," అన్నారు దొరస్వామి.

ఆ మాటలు విని భవాని చిరచిరలాడింది: "వదినే బలవంతంగా నా బట్టలు నాదగ్గరనుంచి లాగ్గుంది; అందుకే నేను మరేం అనక ఊరుకున్నాను. బట్టలుతకడం నాకేం పెద్దపనికాదు," అని చెప్పింది. కాని ఆమె అలాగేం చెయ్యలేదు. రాజం ఆచారరీత్యా, మూడురోజులు స్నానం చెయ్యక, ఆతరువాత ఇంటిపనులు చెయ్యడానికి సిద్ధమైనప్పుడు భవాని తను వాడిన బట్టలన్నీ అలాగే మూటకట్టి, కుప్పగా పెరడులో రాజం బాధ్యతకి వదిలేసింది.

"నేను నీ రెండు చీరలుతికాను. ఇప్పుడు మళ్ళీ నాలుగు చీరలు ఉతకడానికున్నాయి. అదెలాగ?" అని శారదాంబాళ్ కూతుర్ని అడిగారు.

"నేనేం వదినలాగ ఒకపూటే స్నానం చేస్తాననుకున్నావా? ఈ మండుటెండలో నాకు రెండుసార్లు స్నానం చెయ్యాలి," అని భవాని తల్లికి చెప్పింది.

సాయంకాలవేళ భవానికి వేడినీళ్ళు సిద్ధం చేసినప్పుడు తనూ స్నానం చెయ్యాలని రాజం ఆశించేది, కాని అదెప్పుడూ సాధ్యంకాలేదు. ఇంటిలో ఏపనీ చెయ్యకుండా మెలుగుతున్న ఆడపడుచు మురికి బట్టలు రాతిమీద కొట్టి గుంజుకున్న తరువాత తన అలసిన దేహాన్ని నానబెట్టుకోవడానికిగాని, తన సొంత బట్టలు ఉతకడానికిగాని రాజంకి వ్యవధిలేదు.

రాజం ఓర్పుతో అన్నీ భరించింది. కాని భవాని ద్వేషం రోజురోజుకీ ఎక్కువైంది.

తనకి అందరి మెచ్చుకోలు కావాలి, తను తన పేరు, ప్రతిష్ట నిలబెట్టుకోవాలి – ఇదే రాజం లక్ష్యం. తనకి లోకజ్ఞానముంది. అది తన వివేకం, ప్రవర్తనలు తీర్చిదిద్దుకోవడానికి తోడ్పడుతుంది. ఎప్పుడు, ఎటువంటి సందర్భంలో తనెలాగ నడచుకోవాలని తనకి హెచ్చరిక చేస్తుంది. ప్రతీ క్షణమూ తన పాత్ర ఏమిటో, దానికి అనుగుణంగా తన ధోరణి ఎలాగుండాలో ఆ విధంగానే రాజం అందరితోనూ మెలిగింది.

కాని ఆమెలో గాబరా పూర్తిగా పోలేదు. ఎడతెగకుండా భవాని తన్ను రెచ్చగొట్టుతుంటే, తనలోనే మూలుగుతూ రోజులు తను గడుపుతుంటే, మరి విమోచనం ఎప్పుడు? ప్రతీదినం రాత్రి నిద్రపోవడానికిముందు ఆ తరువాతవచ్చే రోజు గురించి రాజంకి ఒకటే దిగులు. ఐనా రాత్రులు జడమైన దుక్కలాగ నిద్రపోయింది. ఇటీవల భవాని తల్లికి చెప్పింది: "నాకూ వదినలాగ నిద్ర వస్తే ఎంత బాగున్ను! నాకు నిద్రన్నది మచ్చుకికూడా లేదు!" అని విసుగ్గుంది. "రాజం, నేను చిత్రాన్ని రాత్రివేళ నీకు అప్పగిస్తే, అది అర్ధరాత్రి ఏడుస్తే నువ్వు తప్పకుండా లేస్తావా?" అని అడిగింది. ఆ తరువాత రాజంకి తనమీదున్న నమ్రత పరీక్ష చెయ్యాలని పూనుకుంది. గాఢంగా నిద్రపోతున్న రాజంని గభీమని అర్ధరాత్రివేళ లేపి "ఆ లైటు వెయ్యి!", "ఈ దుప్పటి సరిగ్గా దోపు!" అని ఆజ్ఞలు విసిరింది. తటాలున నిద్రనుంచి మేలుకొని, కళ్ళు మిటకరించుతూ, అసలేం జరుగుతుందని తెలియక రాజం గాబరా పడేది. ఆ తరువాత పరిస్థితి అర్ధం చేసుకొని, మనలులో చిరచిరలాడుతూనే భవాని మాట విని, అణగి నడచుకుంది. కూతురులోని దౌర్జన్యం శారదాంబాళ్ చూసారు. కాని ఆవిడ ఆమోదించలేదు, ఖండించలేదు.

రాజం పాటించిన నమ్రత, ఒదుగుపాటుకి ఆమె మనసులో నిత్యమూ చోటుచేసుకున్న రఘుపతియే కారణం. "ఎంతమంది నర్సులు, ఎన్ని ఆసుపత్రులలో అపరిచితులకి సేవ చేస్తున్నారు! నా భర్త బంధువులకి సేవ చెయ్యడంలో నేనెందుకు సిగ్గుపడాలి?" అని రాజం తన్ను ఓదార్చుకుంది.

ఆమె మనసు ఏకీభవించింది, కాని దేహం ఎదురుచెప్పింది; అలసట తీవ్రమైంది; కళ్ళు మండాయి; అనాలోచితంగా రాజం గోడలని, తలుపులని ఢీకొట్టుకుంది. కారణంలేకుండా గిన్నెలు ఆమె చేతినుంచి నేలమీద రాలడం దొరస్వామి చూసారు.

“రాజం, ఎందుకీ తొందర? కొంచెం జాగ్రతగా ఉండు!” అని హెచ్చరించారు. “నేను జపం చెయ్యడానికి ఒక గంటముందే నువ్వెందుకు దానికన్ని వస్తువులూ సమకూర్చాలి? అది నీ బాధ్యత కాదు!” అని ఆతను అన్నారు. సమయం దొరికినప్పుడెల్లా రాజం ఏవో చిల్లరపనులు చెయ్యడం అలవాటు చేసుకుంది. కాని దానికే దొరస్వామి ఆక్షేపణ తెలిపారు.

రాజం ఆరోగ్యం రోజురోజుకి క్షీణించడం అతను గ్రహించారా?

అతనొకరోజు భార్యతో “మనింటికి కోడలు వచ్చేసింది; ఇక మనం ఒక వంటమనిషిని పిలుచుకుందాం, ఏమంటావ్?” అని అడిగారు.

అతని భార్య అతనితో ఏకీభవించలేదు. “మనకెందుకు వంటమనిషి? మామూలుగా కోడలు రాగానే వంటమనిషిని బైటకి పంపేయడమేకదా మనం చూస్తున్నాం?” అని అన్నారు.

ఇవన్నీచూసి రాజం కలవరపడింది. ‘దేవుడా, ఈ నా పేరూ, ప్రతిష్ఠా ఇంకా ఎన్నిరోజులకి?’ అని తన్నే అడుక్కుంది. మోక్షం ఆఖరికి లభించే సమయంలో ఒక చిన్న పొరపాటు చేసినా అది ముక్తికి ఎదురుగా పనిచేస్తుందని ఎవరో అనడం రాజం విన్నది. అంటే శాశ్వత నరకమన్నమాట! ఎవరికి తెలుసు? తన గతికూడా అలాగేనా?

ఆఖరికి, ఒకరోజు, దొరస్వామి అన్నట్టే ఐంది; శారదాంబాళ్ మాటలూ నిజమయ్యాయి!

రాజం అనారోగ్యంతో మంచమెక్కింది. ‘కోడలుంటే ఎందుకు వంటమనిషి?’ అని లోకోక్తి. కాని ఆ కోడలు అందుబాటులో లేకపోవడంతో ఇప్పుడు వంటమనిషి అగత్యమైపోయాడు!

# రాజేశ్వరి

## మూడవ భాగం

## శ్రుతి తప్పిన గానం

## 26

భవాని ఒక మగ పిల్లవాడిని ప్రసవించింది.

"రాజం, అదుగో చూడు, చిత్రు ఆ మెట్లదగ్గర నిలబడివుంది. నువ్వే దాన్ని చూసుకోవాలి! అని భవాని మందలించింది. శారదాంబాళ్ ప్రసూతి గదిలో అన్ని బాధ్యతలూ చూసుకున్నారు. ఇంటిలో తక్కిన పనులన్నీ రాజం నిర్వహించ వలసివచ్చింది. అనివార్యంగా, ఇదీ అదీ అని భవాని రాజంకి అన్ని పనులూ ఒప్పగించడమైంది. "రాజం, చిత్రు సురక్షతకి నీకే పూర్తి బాధ్యత వదిలేసాను. అది ఉత్తికే ఇక్కడా అక్కడా తిరుగుతూ – వంటగదిలో కుంపటి ముందుగాని, పెరడులో నుయ్యిదగ్గరగాని - వెళ్ళకుండా చూసుకో!" అని భవాని పురమాయించింది. రాజంకి భవాని మాతృక స్వభావం పూర్తిగా అర్థమైంది, అందువలన ఆమె ఆజ్ఞలన్నీ మనసార నిరవేర్చింది. చంటిపాపకి మామయ్య పోలికలున్నాయని ఎవరో అనడం విని రాజంఆహ్లాదించింది. తన భర్తే ఇంటికి వస్తున్నట్టు కల్పన చేసుకుంది; తనే ఆ బిడ్డను కన్నట్టు రాజంకి తోచింది.

"పిల్లలంటే రాజంకి ఎంత ఇష్టం!" అని అందరూ ఆమెను అభినందించారు; మరికొందరు "ఎంత మంచి ఆదర్శకోడలు!" అని పొగడారు. పసిపాప జన్మదినం కొనియాడే సమయం రాజం జబ్బుతో బాధపడింది. అందరి పొగడ్తలకూ సరిగ్గా రాజంమీద ద్రిష్టి పడిందని వాళ్ళందరూ చెప్పుకున్నారు.

ఎడం చెయిలో గాయపడిన వేలు బాగా బలిసిపోయింది; ఎడతెగకుండా ముళ్ళు గుచ్చుతున్నట్టు రాజం చిత్రవధ అనుభవించింది. దానికి కారణమేమిటని రాజం మెల్లగా గ్రహించింది. కాఫీగింజలు మెషినులో పొడిచేసినప్పుడు తను కుడిచెయ్యితో చేయూతని తిప్పుతూ, కాల్చిన గింజలని ముందుకి నెట్టినప్పుడు తన అశ్రద్ధ వలన ఎడంచెయివేలుకి గాయం కలిగియుండాలి; తను దాన్ని నిర్లక్ష్యం చేసినది ఒక పెద్ద పొరబాటు. ఆ తరువాత బట్టలుతికినప్పుడు తడికి గురై ఆ వేలుకు చీము పట్టుకుంది.

ఎడం చెయిలో గాయపడిన వేలు బాగా బలిసిపోయింది; ఎడతెగకుండా ముళ్ళు గుచ్చుతున్నట్టు రాజం చిత్రవధ అనుభవించింది. దానికి కారణమేమిటని రాజం మెల్లగా గ్రహించింది. కాఫీగింజలు మెషినులో పొడిచేసినప్పుడు తను కుడిచెయ్యితో చేయూతని తిప్పుతూ, కాల్చిన గింజలని ముందుకి నెట్టినప్పుడు తన అశ్రద్ధ వలన ఎడంచెయివేలుకి గాయం కలిగియుండాలి; తను దాన్ని నిర్లక్ష్యం చేసినది ఒక పెద్ద పొరబాటు. ఆ తరువాత బట్టలుతికినప్పుడు తడికి గురై ఆ వేలుకు చీము పట్టుకుంది.

డాక్టరు చీముని కత్తితో తెగించి గాయకట్టు వేసారు. ఏ కారణంవలనా ఎడంచెయితో రాజం ఏపనీ చెయ్యకూడదని హెచ్చరించారు. కాని రాజం ముందులాగే ఇల్లంతా తిరుగుతూ అన్నిపనులూ చెయ్యడం ఆరంభించింది; అలసట రాగానే మంచమెక్కి నిద్రపోయింది. ఒడిసలలో ఎడంచెయి వేలాడుతుంటే, దానికి హాని రాకుండా, కుడిచెయితో దాజంకొన్నిపనులు చేసింది.

దొరస్వామి నటరాజన్, రఘుపతికి ఉత్తరాలు రాసినప్పుడు రాజం అశక్తిగురించి ఏమీ రాయలేదు. వాళ్ళ మనసు నొప్పించకూడదని అతని ఉద్దేశం. ఈ విపత్తు తనింట్లో జరిగింది, తనే కోడలికి తగిన చికిత్సకి ఏర్పాట్లు చెయ్యాలి, ఆ తరువాత ఆమెను వాళ్ళింటికి పంపాలి అని అతను నిర్ణయించుకున్నారు.

రాజం నిరుత్సాహంతో తహతహలాడింది. వెంటనే భర్తని చూడాలని ఆశించింది; ఇంటివైపు ధ్యానం మళ్ళింది; తల్లిదండ్రులని ఆశ్రయం కోరింది. రాజం ప్రార్థించినప్పుడల్లా నియతంగా రఘుపతి ఆమె కళ్ళకి కనిపించాడు. 'నా మనసులో ఏముందో అతనికి తెలుసు, అతను తప్పకుండా వస్తారు!' అని రాజం తనలో చెప్పుకుంది. ఇటీవల భార్యాభర్తలమధ్య ఉత్తరాల పరివర్తన లేకపోవడంతో తను మానసికంకా అతనికి పంపిన ఆహ్వానపత్రికే భర్తని తన సముఖంలో తీసుకొనివస్తుందని రాజం నమ్మింది. అప్పుడప్పుడు, ఏ కారణంలేకుండానే, వీధిలో జట్కా వెళ్లినా, లేక దూరంలో రైలుకూత వినిపించినా రాజం 'ఈ రైలు ఎక్కడనుంచి

వస్తుందో?' అని ఆలోచించేది. పురాణ తమిళ కావ్యాలలో తన ప్రియుడికోసం తపించే కథానాయికలాగ పడకమీద వాలి మౌనంగా రోజులు పోనిచ్చింది.

రఘుపతి రాలేదు, కాని తన ప్రేమంతా ధారపోసి భార్యకి ఉత్తరం రాసాడు. అదే రాజం మనసుని బలపరిచింది. ఎప్పుడూలాగే, ఇంటిపనులన్నీ - ఒక చెయితోనే - చేసింది.

గాయం తగ్గినట్టు ఏ సూచసలూ కనిపించలేదు. రాజం ముందులాగే చిత్రాకి దాదిగా అన్నీ చూసుకుంది; భవాని బట్టలుదికింది; శారదాంబాళ్ కి వంటగదిలో సాయంచేసింది; భోజనం చేసినతరువాత అంటాకులని తీసి వంటగది శుభ్రం చేసింది.

డాక్టరు వచ్చి వేలుని చూసి "ఇదేం మానుకున్నట్టు కనిపించలేదే!" అని అంటూనే రాజంని హెచ్చరించారు. "అమ్మాయీ, నీ వేలుని అంగచ్ఛేదం చేసే అవకాశం రాకూడదని నేను ఆశించాను. కాని ఇప్పుడు నీ ఎడంచెయికే ఆ ఆపద రావచ్చునని నాకనిపిస్తోంది," అని అన్నారు.

అప్పుడే రాజంకి తన సమస్యలోవున్న తీవ్రత బోధపడింది.

డాక్టరు మాటలు విని భవాని, శారదాంబాళ్ కూడా ఆశ్చర్యపడ్డారు.

రాజం మరేం అనక కన్నీరు కార్చింది.

"డాక్టర్, రాజం మళ్ళీ వయలిన్ వాయించగలదా?" అని దొరస్వామి రాజంని చూస్తూనే అడిగారు.

మామగారు తన వయలిన్ ప్రదర్శన ఇంతకుముందు చూసి, తన కరలాఘవం గురించి పలికిన మాటలు రాజం గుర్తుచేసుకుంది: "అమ్మాయీ, నువ్వేం వయలిన్ గురించి బాధపడవద్దు. నీ గాత్రసంగీతమే నీ విజయంకి దారి చూపుతుంది," అని అతను అనలేదూ? అది జ్ఞాపకం రాగానే రాజం 'దేవుడా, అతను పలికిన మాట నిజమౌతుందేమో, ఎవరికి తెలుసు?' అని దిగులు పడింది.

గాయకట్టు కట్టుతూనే డాక్టరు “రాజం, నా మాట విను. నీకు మళ్ళీ వయలిన్ వాయించడం సాధ్యమౌతుంది. కాని అది నీమీదనే ఆధారపడివుంది. నేను చెప్పేది వింటావా?” అని అడిగారు.

“Thanks, doctor. నాకు అది చాలు.”

“వదినా, విను. డాక్టరు సలహా నువ్వు తప్పక పాటించాలి. నువ్విలా బాధపడడంచూసి నాకు విచారంగా ఉంది. నువ్వు నాకెంతో సాయం చేసావ్,” అని భవాని సానుభూతి తెలిపింది. ఆ తరువాతి రెండురోజులూ రాజం చీర కట్టుకోవడానికి సాయం చేసింది.

దానితో తన భారం తీరిందని భవాని ఊరుకుంది.

“అమ్మకూడా నాకు సాయం చేస్తున్నారు,” అని రాజం నొచ్చుకోడం చూసి (ఇక్కడ రాజం శారదాంబాళ్ గురించి మాటాడింది) భవాని అలా చేసిందా?

ఒకరోజు భవాని “వదినా, చూడండి, మీ తమ్ముడు!” అని అనగానే రాజం ముందు వసారాకి గబగబమని పరుగెత్తుకొని వచ్చి “ఎక్కడ, అక్కయ్యా?” అని ఆతురతో అడిగింది. అప్పుడే ఒక యువకుడు, తనలాగే ఎడంచెయి ఒడిసెలలో వేలాడుతూ, వీధిలో నడిచివెళ్ళడం రాజం చూసింది.

“అమ్మా, చూడు, వదిన కళ్ళు ఎలా చిమ్మగిల్లాయో? తమ్ముడని వినగానే ఏం పరుగు!” అని భవాని రాజంని ఎగతాళి చేసింది. కాని రాజం దాన్ని హానిలేని ఒక వేడుకగా భావించి మరేం అనక ఊరుకుంది.

కాని ఆ తరువాత భవాని ఆదరణ చెప్పుకోతగినట్టు సాగనేలేదు. రాజం అతిశ్రమ లేకుండా, తొందర పడకుండా ఇంటిపనులు చెయ్యవచ్చునని డాక్టరు అన్నారుగా? అందువలన రాజం మెల్లమెల్లగా అన్ని పనులూ చెయ్యడానికి పూనుకుంది. ఇటీవల భవాని మాటమాటకీ విసిరిన ఎత్తిపొడుపుమాటలు భరించలేక వంట మనిషి కాళ్ళకి బుద్ధి చెప్పాడు. ఆరోజు అత్తగారు “ఎవరైనా సరే, ఈ నిందలు ఎన్నాళ్ళు సహించగలరు? నేనైతే ఏమీ అనక ఊరుకున్నాను. నా కోడలు పిలిచినవెంటనే వచ్చి

నాకు సాయం చేసేది. ఇప్పుడు అది మంచమెక్కింది. నాకెవరూలేరు!" అని ఒప్పుకున్నారుగా?

అత్తగారికి ఏ కష్టమూ రాకూడదని రాజం గుర్తుచేసుకుంది. ఆవిడకి వంటగదిలో అన్నివిధాలా నిత్యమూ సాయం చెయ్యాలని నిశ్చయించింది.

కాని భవాని "వదినా, వంటగదినుంచి బయటికి రా. నాకు సాయం చెయ్!," అని ఆజ్ఞ ఇచ్చింది. "నీకు అంటురోగం పట్టుకుంటుందని భయం వద్దు! అమ్మకి ఏది కావాలన్నా అవన్నీ నేను చెయ్యగలను. నువ్వు నాకు మాత్రం సహాయం చెయ్యాలి, ఏమంటావ్?"

సరేనని రాజం భవానికి తోడుగా వెళ్ళి, ఆమెతో రోజంతా గడిపింది.

భవాని రాజంని పేకాటకి రమ్మని పిలిచేది. ఆటలో తను ఓడిపోయే సూచనలు కనిపించిన వెంటనే భవాని ముఖం చిరచిరలాడుతుంది. అది గుర్తుచేసుకొని రాజం కొంచెం అశ్రద్ధంగా ఆటాడితే భవాని కోపంతో "రాజం, కావాలనే నేను జయించాలని నువ్వు ఆడుతున్నావా?" అని కేకలు పెట్టేది.

భవాని మనసులో ఏముందో రాజంకి బోధపడలేదు.

ఒకరోజు రాజం తనకి కీర్తనలు పాడాలనివుందని చెప్పింది. అది విని భవాని "నా వీణా, సితారు ఎక్కడ ఉన్నాయనికూడా నాకు తెలియదు; ఇక వాటితో నాకేం పనిలేదు. రాబోయే రోజుల్లో చిత్రావే నా సితారు, ప్రవీణే నా వీణ," అని గర్వంగా చెప్పుకుంది. రాజంకీ గాత్రసంగీతంలోనూ, వయలిన్ వాద్యంలోనూ నైపుణ్యంవుందన్న తలపే భవానికి తోచలేదు.

భవాని సమక్షంలో రాజంని అమితమైన భయం ఆవరించికుంది. 'సాధ్యమైనంతవరకూ అత్తగారికి సేవచేస్తే అదే నాకు చాలు. నాకూ ఈ పేకాటలూ ఏవీ వద్దు!' అని రాజం తనలో చెప్పుకుంది.

"సరే, ఇవాళ మనం వాహ్యాళి వెళ్దాం. మరి ఎప్పుడూ ఇంట్లోనే చిక్కుకోవాలా?" అని ఒకరోజు భవాని రాజంని అడిగింది. ఇద్దరూ బయటకి వెళ్లారు. తోవలో చిత్రా

అలిసిపోయినప్పుడు చంటిపిల్లని ఎత్తుకొనే బాధ్యత భవాని రాజంకే అప్పగించింది. అంటే చంటిపిల్లని కుడి, ఎడం భుజాల్లో మార్చి మార్చి ఎత్తుకొని రాజం దారంతా నడిచింది. తిరిగివచ్చినప్పుడు, సగం దూరంలో, భవాని పిల్లని కిందకి దించమని చెప్పింది. కొన్ని రోజులవరకూ రాజం తన భుజాలలోని వాపు, నొప్పి గురించి సణుగలేదు. కాని చెయి సంగతి? 'ఏ పరిస్థితిలోనూ, సరస్వతీదేవి అవిశ్వాసులైన తన భక్తులనికూడా నిరాకరించదు! వాళ్ళు నేర్చుకున్నదంతా అలాగే వాళ్ళ అందుబాటులోవుంటుంది," అని అని ఎవరో అనడం రాజం గుర్తుచేసుకుంది. 'దేవుడా, మరి నాగతి ఏంకాను?' అనే భయం రాజంని పీడించింది. రోజురోజుకీ ఆమె ఆరాటం తగ్గలేదు. ఒకటితరువాత ఒకటి – ఎన్ని ఎక్కట్లు! ఆరుమాసాలుగా భర్తనుంచి దుఃఖకరమైన ఎడబాటు; తల్లిదండ్రులని చూడాలనే ఆతురత; భవాని చీవాట్లు; అత్తగారి ఉపేక్ష; గోరుపెచ్చని ఆమె ఆదరణ. ఆఖరికి మిగిలినది ఏమైనావుందంటే అది అంతరాత్మ రాజంకి చెప్పిన సందేశమే: 'ఇది చాలదా?'

'నెమ్మదైన. నిష్పక్షపాతమైన నా భర్త పక్కన వుంటే ఎంత బాగున్ను?' అని రాజం వాపోయింది. 'అతనే నాకు బలమూ, ఓదార్పు ఇవ్వగలరు.'

తన పరిస్థితి గురించి రహస్యంగా తన తల్లిదండ్రులకి ఉత్తరాలు రాయాలని రాజంకి తోచలేదు. తనేం గొణుక్కునే ఇల్లాలుకాదు. అత్తగారితో "అమ్మా, నేనిప్పుడు మీకు ఏవిధంగానూ సాయం చెయ్యలేకుండా ఉన్నాను; నేను మా ఇంటికి వెళ్ళనా?" అని అడగడానికి ఆమెకు మనసు రాలేదు. చూపుడువేలు మొన ముడుచుకొనే సూచన కనిపించలేదు. రాజం వయలిన్ వాయించాలని ప్రయత్నించినప్పుడు ఆ భరించలేని నొప్పి అలాగేవుంది.

కన్నీళ్ళు కార్చుతూ "డాక్టరుని మళ్ళీ కలుసుకుందామా?" అని రాజం అడిగింది. అతనూ వచ్చి పరీక్ష చేసారు, మృదువగా వేలుని తోమారు. "మరేం భయం వద్దు. నీ వేలు తప్పకుండా వంగుతుంది. చీలిక లోతుగావుండడంవలనే నొప్పికూడా ఎక్కువగా ఉంది," అని అన్నారు.

తల్లిదండ్రులని చూడాలనే కోరిక రాజంలో ఇంకా విపరీతంగా పెరిగింది. దానితోబాటు అదుపులేని ఆమె మనసులో అన్నివిధాల ఆలోచనలూ కూడుకున్నాయి.

శర్మగారు ఒకసారి "నువ్వెందుకు నీ వయలిన్ వాద్యం మీ అత్తగారింట్లో వదలిపెట్టావ్?" అని రాజంని అడిగారు. "ఇక్కడ ఇంకో వాద్యం ఉందనా? నీ శ్రుతిపెట్టికూడా తీసుకొనివచ్చుంటే బాగున్ను. రాజం, ఇది జ్ఞాపకంలో ఉంచుకో. నువ్వు సాధకం చేసినా, చెయ్యకపోయినా, నీ వాద్యాలు tiptop కండిషన్ లో ఉండాలి. అది చాలా ముఖ్యం. రెండురోజులకొకసారి వయలిన్ని బాగా తుడిచిపెట్టాలి. అప్పుడప్పుడు శ్రుతిపెట్టిని వాయించి దుమ్ము దులపాలి. జ్ఞాపకం ఉంచుకో!"

భవాని వచ్చినతరువాత రాజం ఏ పాటా పాడలేదు, వయలిన్ వాయించనూలేదు. అప్పుడప్పుడు సాధకం చెయ్యాలని అనిపిస్తే, "ఏం, ఎందుకు? నాకే పాటా రాదు! వయలిన్ వాయించడమూ తెలియదు!" అని విరక్తితో తనలో తనే చెప్పుకునేది. ఆమాటకొస్తే, ఇటీవల రాజం సంగీతం, శర్మగారి బోధన – ఈ రెండూ పూర్తిగా మరిచిపోయిందని అనవచ్చు. ఇవన్నీ మరిచిపోయి ఇంటిలో ఏ మూలనో కూర్చున్నప్పుడు రేడియోలో మాధుర్యమైన వయలిన్ లేక ఇంపైన పాట వింటే రాజం కండ్ల నీళ్ళు పెట్టుకునేది. "ఇవన్నీ వినవద్దు!" అని చెవులు గట్టిగా మూసుకునేది. ఈ మానసికావస్థలో తన వాద్యాలు తిరిగితెచ్చుకోవాలని రాజంకి ఎలా అనిపిస్తుంది?

పాటమేష్టారు ఆ వాద్యాలని దుమ్మూ, ధూళీ తాకకుండా ఉంచమన్నారు; కాని అవన్నీ తన మనసుని మలినపరచుతున్నట్టు రాజంకి తోచింది.

గురువుగారి మాటలు పాటించకపోతే అతని శిష్యులు తమ శక్తులు పోగొట్టుకుంటారని ఎవరో అనడం రాజం విన్నది. 'ఇక నా కంఠధ్వని ఏమౌతుంది? దేవుడు నాకెందుకు ఆనందం, ఆదరణ నిరాకరిస్తున్నాడు?' అని అని రాజం దిగులుపడింది.

ఆఖరికి దేవుడు తన మొర విన్నాడని రాజంకి నమ్మకం కలిగింది.

నటరాజన్ సన్నిహిత బంధువుల్లో ఒకతను రాజంనీ, ఆమె అత్తమామలనీ, ఒక పెళ్ళికి తనింటికి రమ్మని పిలిచారు. పెళ్ళికి నాలుగు రోజులముందే రాజం పెళ్ళి జరిగే స్థలంకి రాజం రావాలని, తనే వచ్చి దారితోడుగా రాజంతో ప్రయాణం చెయ్యబోతున్నాని అతను దొరస్వామికి రాసారు. దీనిగురించి అతను ఇంటి ముందు వసారాలో దొరస్వామితో మాటాడుతున్నప్పుడు భవాని ఆ సంభాషణ విన్నది.

“నేను చిత్రాకి మొక్కు చెల్లించడానికి పళణి వెళ్ళాలనుకుంటున్నాను. ఇంకా ఆలస్యం చెయ్యకూడదు. నువ్వూ నాతో పళణికి రావాలి!” అని భవాని రాజంకి చెప్పింది.

“అక్కయ్యా, మీరెందుకు నన్ను పళణికి రమ్మంటున్నారు?” అని రాజం అడిగింది; తన బంధువులుని కలుసుకోవడంకి ఆటంకం రావచ్చునని భయం కప్పుకుంది.

“చూసావా, నీ బంధువులు పెళ్ళికి పిలవగానే నీ మనసు మార్చుకున్నావ్! రెండురోజులముందు నేను పళణి ప్రయాణం గురించి అడిగినప్పుడు సరే అని నువ్వు అనలేదూ?”

రాజం సావధానంగా బదులు చెప్పింది. అసలు భవాని ఆరోజు పలికిన మాటలు రాజం గుర్తుచేసుకుంది: “నేనీ పళణి ప్రయాణం ఎంత త్వరగా వీలవుతుందో అంత త్వరగా ముగించాలనుకుంటున్నాను. పళణి వెళ్ళాలంటే తప్పకుండా మనం మదురైలో మా అత్తగారింటికి వెళ్ళకతప్పదు; మనం ఆవిడని చూసి వెంటనే ఊరుకి తిరిగిరాగలం. అలా కాకుండా చిత్రా కొంచెం పెద్దదైనతరువాత పళణి వెళ్తే మా అత్తగారు కొన్నిరోజులు మనం ఆవిడతో మదురైలో గడపాలని, ఆ తరువాత నేరుగా నాగ్ పూర్ వెళ్ళవచ్చునని చెప్తారు. రాజం, విను. నాకు నీ సాయం కావాలి. నువ్వుంటే మా అత్తగారింట్లో నేను నా రెండు పిల్లలతో తికమకలు పడను.” అది విని

తన స్వభావంకి తగినట్టుగా రాజం పళణి కోవిల దర్శనం అంగీకరించి సరే అని భవాని ఆలోచనతో ఏకీభవించింది.

కాని ఇప్పుడు తనకు రాబోయే స్వల్పకాల స్వతంత్రతకూడా చిక్కులో పడే అవకాశముందని తెలిసిన తరువాత రాజం మాటాడింది:

“అవును, నేను మాట ఇచ్చాను. కాని అప్పుడు నాకీపెళ్ళిగురించి ఏమీ తెలియదు.”

“అంటే, నీకు ఈ పెళ్ళే ముఖ్యమన్నమాట! మరి నా మాటలకేం మర్యాదలేదా? చిత్రాన్ని చూసుకొనే బాధ్యత నువ్వు నిరవేర్చేదెప్పుడు?”

రాజం ఆలోచించింది: ఇప్పుడు తాత్కాలిక స్వతంత్రతకోరి తను భవాని ఆజ్ఞ మీరితే – ఆ తరువాత - ఏమౌతుందో ఎవరికి తెలుసు?

“సరే అక్కా, నేను పెళ్ళికి వెళ్ళను.”

ఇంతలో దొరస్వామి ఇంట్లోకి వచ్చి, శారదాంబాళ్ కి సంగతేమిటో వివరించారు.

“ఆ వచ్చినతను నటరాజన్ బంధువు; రాజంకి పెళ్ళికి తోడుగా వెళ్ళాలని అంటున్నారు. శారదా, నువ్వొక పళ్ళెం తీసుకురా!” అన్నారు.

“ఏం, ఎందుకు? అతనేం కొబ్బరికాయ, తమలపాకులు తెచ్చారా?”

“అవును. వియ్యంకుల మర్యాదకి తగినట్టుగా అతనన్నీ తెచ్చారు.”

“సరేలేండి, నేను అతనికి కాఫీ ఇస్తాను.”

రాజం పళ్ళెంతో సిద్ధంగావుంది, కాని ముందు వసారాకి వెళ్ళడానికి జంకింది.

“రాజం, నువ్వూ రా, అతనికి నువ్వంటే చాలా అభిమానం, నిన్ను చూడాలని అంటున్నారు,” అని దొరస్వామి ఆమెను పిలిచారు. రాజం ముందుకి నడిచింది. వచ్చిన ఆ పెద్దమనిషి రాజంకి స్వాగతం చెప్పారు; రాజంని పరిచయం చేసినందుకు

దొరస్వామికి కృతజ్ఞత చెప్పారు. ఆ తరువాత రాజంపై తనకున్న వాత్సల్యంగురించి మాటాడారు.

"నాకు విశాలం చిన్నపిల్లగా తెలుసు. మా అందరికీ విశాలంతో చనువుంది. విశాలంకి రాజంని చూడాలనివుంది. మీరు ఆవిడ కోరిక నిరాకరించకూడదు. నా భార్యకూడా రాజంని బాగా అడిగానని చెప్పమంది," అన్నారతను.

తల్లిపేరు విన్నగానే రాజం హృదయం ఒక ఎత్తు పైకి లేచింది.

"రాజం, నీకు వెళ్ళాలని ఉందా?" అని దొరస్వామి రాజంని అడిగారు.

రాజం ఉత్తికే తలూపింది. తన మనసులోని ఆందోళన అతనికి తెలియకూడదని భయపడింది.

రాజం మనసులో ఏముందో దొరస్వామికి బోధపడలేదు. అతను వెంటనే ఇంటిలోకి ప్రవేశించారు. భార్య ఉద్దేశమేమిటో తెలుసుకోవాలనా?

"అమ్మాయీ, నీవేం ఆలోచిస్తున్నావ్?" అని ఆ పెద్దాయన రాజంని అడిగారు. "నేనెవరో నీకు తెలుసుకదా? నీకు నా ఉద్యోగంతో పరిచయముంది. అవునా?"

"అవును అంకుల్. నాకు మిమ్మల్ని బాగా తెలుసు."

"మీ మామగారు నీకు అనుమతి ఇచ్చేసారు. నువ్వింకా ఎందుకు ఆలోచిస్తున్నావో నాకు అర్థం కావటంలేదు!"

"అక్కయ్య నన్ను తనతో పళణికి రమ్మని పిలుస్తున్నారు. నేనూ ఇంతకుముందు పళణి చూడలేదు."

"సరే, మనం తిరిగివచ్చినతరువాత మీరు వెళ్ళకూడదా?"

"అందుకు సమయం సరిగ్గా లేకపోవడమే కారణం . . ."

"అమ్మాయీ, నీకు పళణి ఎప్పుడూవుంటుంది. ఈ పెళ్ళి మా ఇంటిలో. చెప్పు, ఈ అవకాశం తప్పిపోవడం నీకిష్టమేనా ? నీ ప్రయాణంకి ఇదే మంచి సమయం. నీ

పళణి ప్రయాణంలో నువ్వెమో మీ అక్కయ్యకి దారికితోడుగా  - ఒక మగవాడి ఆదరవులాగ – వెళ్ళడంలేదు, అవునా? ఆ తరువాత నువ్వు పళణికి కావాలంటే ఎప్పుడైనా వెళ్ళవచ్చు. మీ ఆయనతోకూడా వెళ్ళవచ్చు. ఏమంటావ్?"

"అక్కయ్యకి రెండు చిన్నపిల్లలున్నారు. వాళ్ళని చూసుకోవాలని నాకూ వెళ్ళాలనివుంది."

"అక్కయ్యా? . . . "

"అవును . . . . మా ఆడపడచు . . . "

"ఆవిడకి నీ సాయం తప్పనిసరిగా కావాలా? . . .  సరే, నేనిక నిన్ను నిర్బంధించను. చెప్పమ్మా, నీకీ పెళ్ళికి రావాలని ఉందా, లేదా? నువ్వెవరోకాదు. నటరాజన్ గారి కూతురు. అందుకే నేను ఇంత ఆశతో వచ్చాను . . . "

తను అహంకారంతో అతనికి విరుద్ధంగా ఏవో సాకులు కల్పించుతన్నట్టు అతను తన్ను నిందించుతారేమో అని రాజం కలవరపడింది. మరేం చెప్పాలో తెలియక ఊరుకుంది.

"సరే, నీకు రావడానికి ఇష్టంలేదని తెలిసింది. నీకు చెయిలో నొప్పి అనికూడా విన్నాను. మన ప్రయాణంలో నీకొక మంచి మందు కొనాలనికూడా అనుకున్నాను." అన్నారు అతను.

ఆ తరువాత రెండు నిమిషాలలో దొరస్వామి అక్కడకి వచ్చారు. ఇంతకుమునుపే భవాని అతనికి వార్త అందించడమైంది: "రాజం నాతో 'నేను పెళ్ళికి వెళ్ళను!'అని చెప్పింది."

'ఇక నేను వెళ్ళనా?' అని హీనస్వరంతో అడగుతూ రాజం వంటగదికి దారి తీసింది. మనసులో తను భవానికోసం ఏదో పెద్ద త్యాగం చేసినట్టు సంతోషించింది. కాని భవాని అప్పుడే తన దూషణ మొదలుబెట్టింది; రాజంని వంటగదికి వెళ్ళేముందు ఆపి తిట్లు విసిరింది.

“వదినా, పాప స్నానం చేసి చాలాసేపైంది. దాని జుత్తు ఆరబెట్టాలి. సాంబ్రాణి ధూపం వెయ్యాలి. నువ్వింకా ఎందుకిలా ఆలస్యం చేస్తున్నావ్? దానికి జలుబు పట్టుకుంటే తల్లి నేనేకదా బాధపడాలి?” అని అరిచింది.

ఈ నిందారోపణవిని రాజం నిర్ఘాంతపోయింది. భవాని పిల్లల్ని చూసుకోవడంలో పగ, ద్వేషం, లేకుండా తను స్వచ్ఛందగా చేసినవన్నీ ఇందుకేనా? గుండె తపించితూ, చెయిలో గెరిటలో గనగనలాడుతున్న సాంబ్రాణి తునకలతో, అలాగే స్తంభించిపోయింది. బుగ్గల్లోనుంచి అశ్రువులు కారాయి.

“ఇంకా నిలబడతావేం? నువ్వు ఏడవడం అందరూ చూడాలనా?”

“అక్కయ్యా, మరేం అనకండి!”, అని మూలుగుతూ రాజం ఒక నిట్టూర్పు వదిలింది; తలతిప్పి అత్తగారిని చూసింది.

ఈ అనర్థమైన దాడి చూసి శారదాంబాళ్ సహించలేకపోయారు. “భవాని, మరేం అనకు! నిజంగా నీ మనసులో ఏమనుకుంటున్నావ్? వదినతో ఇలా మాటాడానికి నీకెంత సాహసం! ఈ ఇంట్లో నువ్వు ఏపనీ చెయ్యవు, కాని మాటిమాటికి రాజంని తప్పుపెట్టడం నీకు అలవాటైపోయింది. జ్ఞాపకం ఉంచుకో, రాజంలాంటి వదిన దొరకడం నువ్వు చేసిన భాగ్యం!” అని ఆవిడ మందలించారు.

రాజం తను గాలిలో తేలుతునట్టు ఆహ్లాదపడింది. ‘అమ్మా, మీరేనా ఈ మాటలంటున్నారు? నాకది చాలు. ఇది నేను చేసిన పుణ్యం!’ అని తనలో చెప్పుకుంది.

“అమ్మా, నువ్వెవరి పక్షం?” అని భవాని గొణుక్కుంది, ఏడవడం ఆరంభించింది. “నువ్వే ఇలాగుంటే మరెవరు నాకు చేదోడు ఇస్తారు?”

“నేను న్యాయం గురించి మాటాడతున్నాను. తను ఏంచేసినా నీకు తృప్తిలేదని వదిన బాధపడుతోంది. అది నీకంటే వయసులో చిన్నది.” మరేం అనక, శారదాంబాళ్ వంటగదిలోకి జారుకున్నారు.

ఈ ఝుటనతరువాత రాజం మనసు మారిపోయింది; ఒక విధమైన వైరాగ్యభావం చోటుచేసుకుంది.

"నేనూ నా భర్తలాగేవుంటాను. మాకు పిల్లలు వద్దు! ఇతరులని బాధించే మాతృత్వం. చంటిపిల్లంటే వాత్సల్యం నాకు వద్దేవద్దు! నా చెయి బాగయితే అది నాకు చాలు. నాకు కావలసినదంతా - ఇంపైన కంఠధ్వని, సంగీత ప్రజ్ఞ, కరలాఘువం, నా భర్తకి నాపైవున్న ప్రేమానురాగాలు. నాకు మరేం ఆశలేదు." చెయికి కష్టం వచ్చినతరువాత రాజంకి సంగీతంలో పట్టుదల ఇంకా తీవ్రంగా పెరిగింది.

కింద రాలిన సంబ్రాణి తునకలు గెరిటలో పోగుచేసుకొని, భవానికి అందించి, ముఖం తుడుచుకోవాలని రాజం పెరడుకి వెళ్ళింది. సంబ్రాణి ధూమం వాసన ఆమె మనసుని శాంతపరిచింది. భవాని చంటిపిల్లని ఊయలలో పడుకోబెట్టి తల్లిని చూడాలని వంటగదికి వెళ్ళింది.

"అమ్మా, నా మనసులో ఏ ఉత్సాహమూలేదు!" అని భవాని మొదలిబెట్టింది. "నాకు ఇక ఈ ఇంట్లో ఏ పొత్తూ లేదు, నువ్వూ నాకెదురుగా మారిపోయావ్! నాకు తెలుసు, వదినకి నామీద అభిమానం ఉంది. కాని వదిన ఆ పెద్దాయనతో నిజంగా ఏంచెప్పిందో నీకు తెలుసా? 'నా ఆడపడుచు పిల్లల్ని నేను చూసుకోవాలి, అందుకే పెళ్ళికి రాలేను,' అని చెప్పింది. అంటే పిల్లల్ని తల్లిదండ్రులు అశ్రద్ధగా వదినకి వదిలేసారని అతను అపార్థం చేసుకోరా?"

"రాజం ఆ ధోరణిలో తప్పక చెప్పి వుండదు; నీకెందుకీ ఈ గాబరా? ఎది చెప్పాలన్నా కొంచెం నిదానించి మాటాడడం నేర్చుకో!" అని శారదాంబాళ్ కూతురుని మందలించారు.

'ఇదే నామీద నా అత్తగారుకున్న అభిమానంకి నిదర్శనం. ఆవిడకి నా మనసు బాగా తెలుసు. నేనెందుకు ఆ పెళ్ళికి రానని అతనికి కారణం చెప్పాను. అవే మాటలు భవానికీ చెప్పాను. నేనేం తప్పు చెయ్యలేదని నా అత్తగారు నా మనసుని అర్థం చేసుకున్నారు!' అని రాజంకి గర్వమూ, సంతోషమూ సహితంగా కలిగాయి.

భవాని తల్లికి ఏం జవాబు చెప్పిందని రాజం లక్ష్యం చెయ్యలేదు. ఏం, ఎందుకు వినాలి? సముద్రతీరంలో నిలబడి ఆకాశంలో మిణుకుమిణుకుతూ ప్రకాశించే తారల ప్రకృతి వైభవాన్ని అనుభవించకుండా 'సరే, ఇవాళ ఈ చేపలవేటలో ఏ చాపలు దొరికాయో చూడాలి!' అని ఎవరైనా ఆలోచిస్తారా? కళ్ళెదుట కనిపించే సముద్రాన్ని చూసి ఆనందించక తన కాళ్ళని అతిశీతలనీళ్ళమీదకి లాగే కెరటాలతో ఏం పని? రాజం ఇంతకుముందే కొండలన్నీ దాటేసి ఇప్పుడు ఇసుకతెరనేల మీద, సముద్రతీరంలో నిలబడియుంది. 'నేను అప్పుడే కావేరీనదిగా మారిపోయాను. ఇప్పుడు ఈ సముద్రం నాకు ఆశ్రయం ఇవ్వబోతుంది,' అని తనలో చెప్పుకుంది.

విధి ఆమెను ఎగతాళి చేస్తోందా? "పెర్రిదానా, నువ్వేం నదికాదు, నువ్వొక స్త్రీ! నువ్వింకా సంసారసాగరం - ఆ మహా సముద్రంని దాటలేదు! ఆ సముద్రంలో దిగావ్, ఒక బొట్టు మాత్రం రుచి చూసావ్, అంతే!" అని రాజంని హెచ్చరించింది.

## 27

భవాని కానుపు మొదలుకొని ఇప్పడికి నలభైరోజులయ్యాయి. ముప్పైమాసాల చిత్రాని చూసుకునే బాధ్యత రాజంకి దక్కింది. రాజం ముందు హాలులో ఒక గోడకి ఎదురుగా, ఒక పిల్ల భుజంమీద, ఇంకొక పాప ఒడిలో పెట్టుకొని కూర్చొనివుంది. ఎవరో ఒక యువతి తనమీద ఒక వింతచూపు విసురతూ దాటివెళ్ళడం రాజం గమనించింది. ఆమె మొహంలో మంచి గాంభీర్యం, ఒత్తుగా పవుడరు కనిపించాయి; జుత్తుముడి ఒక బంతిలాగ రూపుదిద్దుకొనివుంది. నిదానంగా నడచివచ్చి ఆ యువతి ఉయ్యాలమీద కూర్చొని "వదిన ఇక్కడ ఉందని విన్నాను," అని తనలో గొణుక్కుంది.

"ఎవరది? ఓ, గౌరావా? రా, రా," అని సరస్వతి యువతికి స్వాగతం చెప్పడం రాజం విన్నది. "అమ్మా, రా, ఎవరు వచ్చారో చూడు!"

"వదిన కనిపించలేదే? వదిన ఎక్కడ?"

“వదినా? నిన్న సాయంకాలం వచ్చింది, ఇంతసేపూ ఇక్కడేవుంది. అర్ధగంటముందు ఎవరో ఫ్రెండుని చూడాలని వెళ్ళింది.”

“దేవుడా, అర్ధగంట ముందా? ‘మా వదినగారికి ఒక చందనపెట్టె ఇస్తే తీసుకువెళ్తారా?’ అని ఆవిడని అడగడానికి వచ్చాను.”

“మీ వదినగారా? ఆవిడ కలకత్తాలో . . . లేదు, నాగ్ పూర్ లో ఉన్నారుకదూ?”

“అవును, నాగ్ పూర్ లోనే ఉన్నారు.”

“వదిన వచ్చేవరకూ మీరు ఇక్కడ ఉండండి . . . ”

“వదిన ఎప్పుడు వస్తుంది?”

“ఒక గంటలో తప్పక వచ్చేస్తుంది. గౌరా, హాలులోకి రా . . . రఘుపతి భార్యతో మాటాడు . . . ”

“రఘుపతి భార్యా? . . . అంటే వదినకి వదినగారన్న మాట?” అలా అంటూనే గౌరా తన నోరుని గప్పున కప్పుకుందని రాజంకి తెలియదు; తను కూర్చున్న జాగానుంచి రాజం కదలనేలేదు.

“నీకేమైంది, గభీమని ఎందుకెలాగో కనిపిస్తున్నావ్? నువ్వు ఇందకుముందు రాజేశ్వరిని చూడలేదా?”

“నేను ఆవిడగురించి విన్నాను. నాకు రఘుపతి తెలుసు. నేను ఆవిడని గుర్తుపట్టలేదు. ఇద్దరు పిల్లల్ని చూసాను . . . ”

“అవును, వాళ్ళు భవాని పిల్లలు.”

“Thank heavens! ఆవిడ ఎవరో babysitter అనుకున్నాను! మంచి వేళ, మా రమాకి అడుగుదాం అనికూడా అనుకున్నాను!” గౌరా నమ్రతతోనే మాటాడింది, కాని రాజం చెవులకి ఆమె మాటలు స్పష్టంగా వినిపించాయి, రాజంకి ఆమె ఏమంటుందో బోధపడింది. ‘పోనీలే, నన్ను babysitter అనేకదా అనుకుంది? నేనెవరో ఒక ముసలి దాది అని అనుమానం రాలేదు!” అని తనలో గొణుక్కుంది.

వాళ్ళిద్దరూ హాలుకి వస్తున్నారని తెలిసి రాజం పాపని ఒడిలో అలాగే పెట్టుకొని చిత్రాని భుజంనుంచి నేలమీద దించింది.

"కొంచెం ఆగండి, నేను వస్తున్నాను!" అని అంటూ సరస్వతి రాజంని చేరుకొని పాపని తన చెయితో అందుకొని రాజంని పక్కనేవున్న సోఫాలో కూర్చోమని చెప్పింది. గౌరా సరస్వతితో ఏవో పిచ్చాపాటి కబుర్లూ చెప్పుకుంటూ అప్పుడప్పుడు తిరిగి తిరిగి రాజంని చూసింది.

జానమ్మ - సరస్వతి తల్లి - ఇప్పుడు హాలులో ప్రవేశించారు; మొహాన్ని చీరకొనతో తుడుచుకుంటూ సోఫాలో కూర్చున్నారు. రాజం ఆవిడని "మామీ, చెప్పండి! మీకు వంటగదిలో ఏమైనా సాయం కావాలా?" అని ఆడిగింది.

జానమ్మ ఆత్మీయతతో రాజంని చూసి "నువ్విక్కడికి వచ్చి అర్ధగంటకూడా అవలేదు, అంతలోనే మా కోడలుకి విరుద్ధంగా కనిపిస్తున్నావ్!" అని నవ్వుతూ మందలించారు. తరువాత గౌరాని తిరిగిచూసి మాటాడారు: "చూడమ్మా గౌరా, ఇక్కడ ఏం జరుగుతోందో నీకు తెలుసా? మేం వచ్చి రెండురోజులయ్యాయి, కాని మీ వదినకి మాతో కలుసుకోడానికి ఓపిక లేదు; రెండురోజులు ఇంట్లో వుండి కులాసాగా ఓ రెండు మాటలు మాటాడమంటే అంత కష్టమా? మధ్యాహ్నమంతా కొండెక్కివచ్చిన భారమంటూ నిద్రపోయింది. సరే, అలాగే కానీ; సాయంకాలం ఇంట్లో ఉండకూడదా? ఎవరో ఫ్రెండుని చూడాలని వెళ్ళిపోయింది. ఇవాళ ప్రొద్దున స్నానం చేసినతరువాత తడిసిన తువాలుని అలాగే నేలకింద పడేసింది; వదిన దాన్ని తీసిపెట్టాలట! రాజమూ అలాగే తువాలుని తీసిపెట్టింది. ఆ తరువాత భవాని నాకు చెప్తోంది: 'అమ్మా, వదిన వంకాయలు నరికిన అదే చేతులతో మన చిత్రాన్ని ముద్దాడడం నేను చూసాను. ఆ ముల్లు కాండగాని ఆ పిల్ల దేహాన్ని తాకివుంటే? మనకి తెలుసుగా ముల్లు తగిలి వదిన ఎంత కష్టపడిందని'? భవానికి రాజంగురించి అంత మమకారం అన్నమాట! చాలు, గౌరా, ఇవన్నీచూసి నాకు మతిపోతోంది. నీకు నేనేమంటున్నానో తెలిసిందా? నేనూ, సరస్వతీ భవాని అత్తగారు, ఆడపడుచుగా భవాని రాజంని అన్నివిధాలా విమర్శించడం చూసాం. అవే మాటలు భవాని తన

వదిన నోటిలో వినివుంటే తప్పక ఆత్మహత్య చేసుకొనివుంటుంది! నేనొక మాట చెప్తాను, విను! రాజం వేయిమందిలో వొకతె! కాదు, కాదు, భవాని లక్షమందిలో వొకతె! భవానిలాంటి మనిషిని నేనెక్కడా చూడలేదు."

సరస్వతి తల్లిని శాంతపరచాలని మాటాడింది: "అమ్మా, మరేం అనకు. వదిన రెండురోజులకి అతిథిగా వచ్చిందని నువ్వే చెప్పావ్. మరి మనం ఎందుకు ఉత్తికే చీదరపడాలి?"

"అవును," అని గౌరా సరస్వతితో ఏకీభవించింది.

కాని ఆ తరువాత రెండు నిమిషాలవరకూ జానమ్మ నోరు మూయలేదు: "భవాని కనీసం తన భర్తతో సద్దుకొనిపోతే నాకు అదే చాలు. ఇంతకుముందు సత్యం ఇంటికి వచ్చినప్పుడు నన్ను పెసరపప్పు సాంబారు చెయ్యమని అడిగాడు. కాని భవాని అది వాడ్ని మందకొడిగా చేస్తుందని, ఆరోగ్యం చెడిపోతుందని ఆక్షేపించింది. 'మేం త్వరలో రైలుప్రయాణం చెయ్యబోతున్నాం, మా ఆయనకి మరీ అధికంగా సెలవు దొరకదు,' అని నాకు చెప్పింది. సత్యమూ సరే అని ఊరుకున్నాడు. 'అమ్మా, నువ్వు చెయ్యి, నేను ఆ సాంబారేదో కొంచెం రుచిచూస్తాను!' అని వాడనలేదు."

"అమ్మా, ఊరుకో! ఇవన్నీ చెప్తే మనకే అగౌరవం," అని సరస్వతి తల్లిని హెచ్చరించింది.

గౌరా మనసులో ఏముందో తెలుసుకోవాలని రాజం ఆతురపడింది: జానమ్మ భవానిగురింటి చెప్తున్న నిందారోపణాలతో గౌరా ఏకీభవిస్తోందా? లేక సరస్వతి అన్నట్టు అతిథి సత్కారం నిందించకూడదని నమ్ముతోందా?

గౌరా ఓ రెండు నిమిషాలు మౌనం వహించి ఆ తరువాత తన అభిప్రాయం తెలియజేసింది. "మామీ, ఇలాగుంటే భవానికి మంచిదికాదు. మీరు భవానికి అత్తగారు మాత్రం కాదు, వయసులో పెద్దవారుకూడా. ఉద్యోగంలో ఉన్న స్త్రీ తన ఆఫీసరుకి మర్యాద చూపాలి; అలాగే, ఒక లెక్చరరు తన ప్రిన్సిపాలుని గౌరవించాలి. ఎవరైనా సరే, మర్యాద చూపడానికి మనం ఎందుకు సిగ్గుపడాలి?"

అప్పుడే భవాని వచ్చి చేరింది. "ఓ, గౌరావా, ఎప్పుడు రావడం? ఎలాగున్నావ్?" అని అడుగుతూ సోఫాలో కూర్చుంది.

రాజం రెప్పవాల్చకుండా భవానిని చూసింది. రాజం అత్తవారింటిలో పదకొండు మాసాలకిపైగా ఉన్నా, తను ఒక్కసారికూడా ముందుహాలుకివచ్చి కూర్చోలేదని గుర్తుచేసుకుంది. రేడియోలో ఏం ప్రోగ్రాంవుందని చూడాలనికూడా తను ఏనాడూ ఆకాశవాణి సంచికని తిప్పిచూడలేదు!

"అమ్మా, చిత్రా సమయంకి పాలు తాగిందా? తాగడానికి నీళ్ళు ఇచ్చారా? . . . గౌరా, నాకెప్పుడూ ఈ చిన్న చిన్న సంగతులగురించే దిగులు! . . . రాజం, నువ్వు లోపలికి వెళ్ళి చూడు. చిత్రా నోరువిప్పి నిద్రపోతుందేమో? దోమ చొచ్చుకుంటుందేమో? గౌరా, మనం ప్రయాణం చేసినప్పుడు అన్నిచోటలకీ దోమతెర తీసుకువెళ్ళడం ఎలా సాధ్యం చెప్పు! అబ్బబ్బా, నిన్న పళనిలో, ఎక్కడచూసినా దోమలే! నాన్నగారుకూడా 'ఇక ఈ పళని ప్రయాణంకి ఒక దండం!' అని అన్నారు. నాకు నిద్రపట్టనేలేదు. కాని వదిన మాత్రం దుక్కముక్కలాగ నిద్రపోయింది. రాజం, నాకు ఒక గ్లాసు నీళ్ళు తీసుకురా."

భవాని నోరుమూసుకుందని రూఢిచేసుకున్నతరువాతే గౌరా నవ్వుతూ "భవాని, జాగ్రత్త, నువ్విలా ఎడతెగక మాటాడితే నీ నోరు ఎండిపోతుంది!" అని హెచ్చరించింది.

"అవును, నిజం," అని భవాని కులుకుతూ నవ్వింది. "అదే నాలోవున్న దోషం. నా మనసులో ఏముందో చెప్పేస్తాను; అందుకే అందరి దూషణలూ నాకే!"

అది విని ఎవరూ నవ్వలేదు. గౌరా లేచి "సరే, ఇక నేను వస్తాను; సరస్వతి, భవాని పిల్లలు, Mrs. Rajam - అందరిని కలుసుకోడం నాకు సంతోషంగా ఉంది," అని సెలవు పుచ్చుకుంది.

గౌరా తన్ను సాగనంపడానికి సిద్ధంగావున్న రాజంని చూసింది. రాజం ఒక నిరాడంబరమైన చీరతో కనపించింది. ఆమె మొహం రక్తహీనంగా కనిపించినా కన్నులు లోతుగా, తీక్ష్ణంగా గౌరాని ఆకర్షించాయి.

“చిత్రాను చూడండి. పళనిలో మొక్కు తీసాం. పిల్లకి మంచి ఉంగరాల జుత్తు ఉండేది,” అని రాజం చెప్పింది.

ఇంతలో భవాని జోక్యం చేసుకొని “మా పళని ప్రయాణంకి ముందే నేను చిత్రా ఫోటో నా పుట్టిల్లుకి పంపాను; నా అమ్మా, నాన్నా చూసారు,” అని గౌరాకి చెప్పింది.

“ఈ కబుర్లన్నీ ఎందుకిప్పుడు?” అని జానమ్మ విసుగ్గుంటూ వంటగదికి నడిచివెళ్ళడం రాజం గమనించింది. భవాని మాటల్లో ఆవిడకి అనౌచిత్యం కనిపించిందా? భవాని తన తల్లిదండ్రుల గురించి జాడచూపడంతో ఆవిడ ఏకీభవించలేదని రాజం గుర్తుచేసుకుంది.

ఆ రాత్రి రాజం చాలాసేపు నిద్రపోలేదు. తను పళనిలో దోమల బాధ తెలియకుండా ‘దుక్కముక్కలాగ’ నిద్రపోవడంగురించి భవాని చెప్పింది. ‘ఈ జాగరం దానికి ప్రాయశ్చిత్తంకాబోలు!’ అని రాజం తనలో చెప్పుకుంది.

భవానికి సరస్వతిమీద - తన ఆడపడుచని - ప్రత్యేకంగా గౌరవం ఉందా? లేదు! రాత్రి తన పడకని రాజం విప్పి పరచాలని భవాని నిర్బందించి అడగలేదూ? ఆమె మాటలు రాజం మరిచిపోలేదు: “రాజం, మామూలుగా నా పడకని నువ్వే నాకోసం పరచాలి. నేను మా ఆయనకి ఏంచెప్పేనో తెలుసా? ‘పనిమనిషి ఎనిమిదిగంటలకి వస్తాడుకదా, నేనీపడకని ఇలాగే వదిలేయకూడదా?’ అని అతను నన్నడిగారు. ‘ఎవరిసాయమూ లేదంటే మన పని మనమే చేసుకోవాలి!’ అని నేను చెప్పేసాను. రాజం, ఇవాళా మామూలుగా నువ్వే నా పడక పరచాలి!” అని ఆజ్ఞేపించలేదూ? మరి భవాని తన ఆడపడుచుకి చేసే సేవ ఎలాగుంది?’ అని రాజం ఆలోచించింది.

కోడలుగా తనకి బాధ్యతలు, నియమాలు ఉన్నాయనే ఉద్దేశంతో రాజం అన్నిపనులూ చేసింది; ఆ జ్ఞానమే ఇప్పుడు ఆమెను నిరుత్సాహపరచింది. ‘ఎంతమంది రాజులు హద్దుగల దేశాలే ఏలుతున్నా తమ్మల్ని గొప్పగా త్రిలోక ప్రభువులని - ఈ భూమికంతా నాయకులని - గర్వపడలేదు! ఈ ప్రపంచం ఎంత

విపులంగావుందని నేను ఆలోచించనేలేదు! అదే నా పెద్ద పొరబాటు!' అని రాజం వాపోయింది.

జానమ్మగారు రాజంతో ఏమన్నారు? 'నాకు నీలాంటి కోడలుంటే ఎంత బాగున్ను!'

రాజంకాని సత్యమూర్తిగారి భార్యయైవుంటే? తన బతుకూ అత్తమామలపై తాపం లేకుండా, ఎవరిమీదా సహానుభూతి లేకుండా సాగివుంటుందేమో, ఎవరికి తెలుసు?

మహాత్మాగాంధీ ఏమన్నారు? "ఈ ప్రపంచంలో, ప్రజల్లో, మంచి, చెడూ అని ఎవరూలేదు. ఇతరుల స్వభావం మన మనసుపైనే ఆధారపడివుంటుంది. అందుకే మనం మానవత్వం వర్ధిల్లాలని ఆశించుదాం! మానవకోటిని పోషించుదాం." గాంధీజీమీద నటరాజన్ చూపిన భక్తివలనే రాజంకి మంచి సంబంధం కుదిరింది. ఆంగ్లేయులు అన్యులుగా మన దేశంకి వచ్చారు, ఆఖరికి స్వదేశీయులమీద అధికారం చెలాయించారు. అలాగే రాజం కోడలుగా అత్తగారింటికి వెళ్ళిందంటే ఆ కొత్త పరిసరాల్లో ఆమె కొత్త ఆజ్ఞలూ, నిబంధనలూ విధించాలని అర్ధమా? అలాగైతే ఆ ప్రవర్తన ఆంగ్లేయుల దౌర్జన్యంతో సమానం. ఈ భావనలన్నీ రాజం మనసులో బాగా హత్తుకున్నాయి. అందువలనే రాజంలో పరిపక్వత, ఓర్పు, సౌజన్యం చోటుచేసుకున్నాయి. మరి భవానిలో ఈ అంశాలేవీ కనిపించడం లేదే? అంటే నటరాజన్ గారి గాంధీభక్తి దొరస్వామిగారి గాంధీభక్తికంటే ఒక నరుకు ఎక్కువన్నమాట! అవునా? ఎవరికి తెలుసు? 'దొరస్వామి స్వాతంత్రపోరాటఘుట్టాల్లో చురుకుగా పాల్గొన్న మనిషి; అందువలనే అతని ఉద్వేగస్థాయి మరీ అంత గాఢంగా లేదేమో?' అని రాజం ఆలోచించింది. అలాగే కానీ. మరి అతని భార్యలో - గాంధీగారిగురించి ఏ ఆసక్తి కనిపించడంలేదే, ఎందుకు? ఆంగ్లేయులగురించి ఆవిడ ఏదీ పట్టించుకున్నట్టు రాజంకి గుర్తురాలేదు.

ఈ ఊహలు, ఆలోచనలు రాజం విచక్షణకి దారి తీసాయి.

"నేనిప్పుడు ఒక ఆదర్శ భార్యగా, కోడలుగా నా భర్త, అత్తమామల ప్రశంస అందుకున్నాను," అని రాజం సంతోషించింది. "ఇది నాకు దక్కిన వరం, ఇతరులకి

ఈర్ష్య కలిగించే దేవానుగ్రహం!" ఆమె మనసు వెంటనే పళని ప్రయాణంలో ఆ సుబ్రమణ్యస్వామి దర్శనం గురించి ఆలోచించింది. "స్వామీ, నేను నిన్న నీ సన్నిధికి వచ్చి దీవెనలు కోరాను. నీ అనుగ్రహమేమిటో నాకు తెలియదు. నేను కోరేది ఇదే: నాలో పిరికితనం, నికృష్టమైన బావనలు పోవాలి. నా కళాత్మక అభిలాష వర్ధిల్లడానికి దారి తెలియాలి.'

ఈ ఆలోచనలతో రాజం నిద్రపోయింది.

## 28

భవాని, రాజం మదురైనుంచి బయలుదేరి వెళ్లడానికి సిద్ధమవుతుంటే దొరస్వామి జానమ్మతో పరిహాసం చేసే ధోరణిలో మాటాడారు.

"చూసారా, మీరు జానకి, అంటే లక్ష్మి అన్న మాట! మీ కూతురు సరస్వతి; భవాని అంటే ఉమాదేవి. రాజంలో మీ ముగ్గురి గుణాలూ కనిపించాలి? అవునా?" అని అతను అడిగారు.

మరేం ఆలోచించక జానమ్మ వెంటనే "అవును, తప్పకుండా. రాజం మొహం లక్ష్మీకరంగావుంది; వాక్శుద్ధిలో సరస్వతి, సానుభూతిలో మీనాక్షి లక్షణాలు కనిపిస్తున్నాయి. నిజంగా ఆమె రాజరాజేశ్వరి!" అన్నారు.

కృతజ్ఞతో రాజం అందరిదగ్గరా సెలవు తీసుకుంది.

మదురైలో ఆ రెండు పేర్లు - రాజరాజేశ్వరి, రఘుపతి భార్య - మాటిమాటికి వినిపించాయి. పుట్టిల్లులో రాజంని వేరే పేర్లతో - కొన్ని హాస్యంగాను, మరికొన్ని నిందాపూర్వకంగా - పిలవడమూ జరిగింది. కాని రాజంకి నచ్చినవి ఈ రెండే: రాజరాజేశ్వరి, రఘుపతి భార్య. ఆ పేర్ల ఉచ్చారణే తన చెవులకి ఎంత ఇంపుగావుంది!

అయినప్పటికీ తమ సంసారం ఎలా సాగుతుందని తెలియక రాజం కలవరపడింది. ఉద్యోగంలో చేరినప్పుడు రాసిన ఉత్తరంలో రఘుపతి "ఇక మనం కాపురం

పెట్టేముందు కొత్త కొత్త ఉద్యోగాలున్నాయా అని నేను చురుకుగా కనుక్కుంటాను," అని రాజంకి వాగ్దానమిచ్చాడు. ఆ తరువాత దాని గురించి మరేం ఉత్తరం లేదు! ఏం, ఏమైందని?

తన ఉద్యోగంకి, మిలిటరీకీ ఏ సంబంధమూ లేదని రఘుపతి రాజంకి రూఢీపరచాడు. అది నిజమేనా? 'దేవుడా, అతనికి ఈ ఉద్యోగం వద్దు! అతను క్షేమంగా ఇంటికి తిరిగివస్తే చాలు! నేనీ ఏకాంతం భరించలేను!" అని రాజం వాపోయింది.

రఘుపతి రాజంని ఒక అపూర్వమైన కానుకగా మెచ్చుకున్నాడు. అలాగే అతను తన తల్లిదండ్రులని అధిక భక్తితో గౌరవించాడు. అతని దృష్టిలో వాళ్ళిద్దరూ శివపార్వతులు. తన భక్తి, విదేయతతో గణపతి తన తమ్ముడికీ తనకీ మధ్య జరిగిన పోటీలో గెలిచి ఒక మామిడిపండు బహుమానంగా అందుకున్నాడు; రాజం విషయంలోనూ అలాగే అయింది. భవానితో పోటీపడి రాజం అతని తల్లిదండ్రుల ఆభిమానం అందుకుంది. ఈ సత్యం తనకి తెలియడానికిముందే రఘుపతికి రాజమంటే మర్యాద, గౌరవం ఉన్నాయి. సుబ్రమణ్యస్వామి పోటీలో ఓడిపోయి, ఆయాసపడుతూ, ఇల్లు వదిలి కొండలకి దారి పట్టినప్పుడు అతని తల్లి పార్వతి అతన్ని "అబ్బాయీ, నీకెందుకు ఆ ఫలం? నువ్వే ఒక ఫలం - జ్ఞానం నిండిన ఫలం!" అని ఊరడించలేదూ? ఆ దృష్టికోణంలో శారదాంబాళ్ భవానిని వెనకేసుకొని మాటాడంలో ఆశ్చర్యమేముంది? 'ఈ పరిస్థితిలో నేనేవరు?' అని రఘుపతి ఆలోచించాడు: 'నేనొక నంది, లేకపోతే నారదుడు, అది నాకు చాలు!' అని అతనికి తృప్తి కలిగింది.

సొంత కాపురం గురించి రాజం తన మనసులో అంటిపెట్టుకున్న కలలన్నీ నిజమవ్వాలనే ఆకాంక్ష రఘుపతికీవుంది. అది సాధ్యమైన తరువాత తన తల్లిదండ్రులు తనతోవచ్చివుంటారు. అతనూ, రాజం అన్నివిధాల ముచ్చటలూ పంచుకుంటారు. రాజంతో అన్యోన్యంగా మెలగాలనే వంకలో తను ఒక సినిమాకైనా

ఆమెతో వెళ్ళలేదన్న సత్యం రఘుపతికి ఇప్పుడే కలిగింది; 'అది ఎంత పెద్ద పొరబాటు!' అని నొచ్చుకున్నాడు.

ఆఖరికి, ఒకరోజు, రాజంకి రఘుపతినుంచి పిలుపు వచ్చింది.

సహజంగా రాజంకి తనకి వచ్చిన ఆనందం దాచుకొనే అలవాటు లేదు. సాధ్యమైనంతవరకూ వచ్చిన ఉత్సాహాన్ని నిదానంగా కొంచెం అణకువలో ఉంచుకోవాలని రాజంకి తోచనేలేదు.

శారదాంబాళ్ రాజంతో "సరే, మంచిది. నువ్వు నీ కాపురంకి కావలసిన గిన్నెలూ, తక్కిన చిల్లర ఆస్తులూ పోగుచెయ్. నేనిక నీకు అప్పడాలు చేసి ఇస్తాను," అని అన్నారు.

"అమ్మా, నాకు కారాపూస, జంతికలు చేసే పద్ధతి చెప్తారా? వాటికి కలిపే దినుసులు, మోతాదులు కొంచెం వివరంగా చెప్తారా? నేనివన్నీ మరిచిపోతానేమో అని నాకు భయం. అందుకే రాసుకుంటే మంచిది," అని అత్తగార్ని వేడుకుంటూ రాజం ఒక పేపరు, కలంతో సిద్ధమైంది.

ఇదిచూసి భవాని పకపక నవ్వింది. "బాగుంది. పుస్తకాలు చదివి వంట చేస్తున్నారని ఇక పేపర్లలో రాస్తారుకాబోలు!" అని ఎగతాళి చేసింది. కాని రాజం వెనకాడలేదు. "అదికాదు అక్కయ్యగారూ, పాకంలో పిండి ఎంత కొలతలో కలపాలో తెలియాలి; అది చాలా ముఖ్యం! మరి నేను మరిచిపోతే ఎలాగ?" అని బదులు చెప్పింది.

"ఏమో, ఈ కొలతలూ, తూకలూ సరిగ్గా చెప్పడం నాకు తెలియదు. పిడికిళ్ళ లెక్కే నాకు తెలుసు!" అన్నారు శారదాంబాళ్.

"సరే, ఆ పిడికళ్ళు ఎన్నో చెప్పండి," అని పట్టినపట్టువిడకుండా రాజం అన్నీ అడిగి రాసుకుంది.

అనేకసార్లు అత్తగారు వంటలో చిక్కులున్నాయని, వాటిని ఎలా సాధించాలని తనకి నేర్పారని రాజం గుర్తుచేసుకుంది. "రఘుపతికెప్పుడూ ఆహారం విషయంలో

స్థిరమైన అభిరుచివుంది. కొంచెం ఇలాగా అలాగా మార్పు కనిపించినా వాడు భరించడు! ఎవరేమైనా సరే, ఈ ఇంటిలోని కాఫీ, భోజనం, టిఫిను, అప్పడాలకి సాటిలేదు!" అని శారదాంబాళ్ మాటిమాటికి చెప్పడంవలన రాజం ఆ ఇంటిలో పాకసంబంధమైన అన్ని విషయాలూ శ్రద్ధతో అలవరించుకుంది.

తన్ను తన భర్తతో చేర్చడానికి అత్తమామలు చేస్తున్న ఏర్పాట్లని రాజం గమనించింది - అంటే ఏదో ఒక మూల నక్కి వాళ్ళ సంభాషణ వినిందనికాదు. అందరికీ కనబడే దోరణిలో వాళ్ళ పక్కనే నిలబడి అన్ని కబుర్లూ తెలుసుకుంది.

"మీరు రాజంకి తోడుగా వెళ్ళవచ్చుగా?" అని శారదాంబాళ్ భర్తని అడిగింది. "నేనిక్కడేవుంటాను. భవాని ఇంకా పూర్తిగా తేరుకోలేదు; పాపకి రెండుమాసాలే ఐయ్యాయి. వచ్చేనెల భవానిని దాని అత్తవారిల్లో దింపేసి నేను అబ్బాయిని, కోడలిని చూడడానికి రావాలని నా ఉద్దేశం. రాజం-రఘుపతి కాపురం చూడాలని నాకు చాలా ఆతురతగావుంది."

ఆది వినగానే తను కొత్త సంసారం ఆరంభించిన తరువాత అత్తగారు మొట్టమొదట దర్శనం చెయ్యడం, ఆవిడ రాకని ఉత్సాహంతో కొనియాడడం - ఆ అనుభవాలగురించి రాజం మనసులో అన్ని రకాల కల్పనలు చోటుచేసుకున్నాయి. కాని ఆ రోజు మామగారు భార్యకు చెప్పిన మాటలు గుర్తుచేసుకొని రాజం ఒక నిమిషం ఆగింది. అతనేమన్నారు?

"'భవాని పిల్లల్ని నేను చూసుకోవాలి . . . అందువలన నేను పెళ్ళికి వెళ్లను!' అని నాకు చెప్పింది . . . అది చాలదా?"

'నా నిజాయితికి మరేం రుజువు కావాలి?' అని రాజం ఆశ్చర్యపడింది. అత్తగారికి తన మనసులో ఏముందో తెలుసునని రాజం నమ్మింది; అది నిజంకాదేమో అని ఇప్పుడు జంకింది.

ఈ ఆలోచనలలో పడి రాజం మనసులో ఇంకా తీవ్రంగా నిరాశ, నిరుత్సాహం చోటుచేసుకున్నాయి. సుఖాన్ని ఊహిస్తున్న మనసులో తెలియని ఏవో

సంశయాలు; తను ఇక ఎన్ని దుఃఖాలు, అవమానాలు సహించాలో ఎవరికి తెలుసు? తనతోబాటు తన భర్తకూడా బాధపడాలా?

ఐతేనేం, తన్ను తన భర్తదగ్గర చేర్చడానికి అత్తమామలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిసి రాజం తృప్తిపడింది.

ఇన్నిరోజులూ తన ఆశాపూర్ణ భావనలన్నీ ఊహాలోకంలో కొనసాగాయి; భర్తను ఇంకా కొన్నిరోజుల్లో కలుసుకునే భావనలో రాజంకి ఇప్పుడు నమ్మకం కలిగింది.

నటరాజన్ రాజంని “నువ్వు కావేరిలాగ వర్ధిల్లాలి!” అని దీవించారుగా? అతని ఆశ తను నిరవేర్చడమైందని రాజంకి తోచింది.

రాజం తల్లికి ఉత్తరంలో రాసింది: “నాన్నగారు నన్ను ఒక చిన్న సెలయేరునుంచి కావేరీగా మార్చేసారు. నేను ఇప్పుడు కొంచెం గర్వంతోనే మాటాడుతున్నాను. ఇప్పుడు నేను అఖండ కావేరిగా - రెండు తీరాలమధ్య గంభీరంగా ప్రవహించే కూలంకషగా - మారిపోయాను! ఆ రెండు తీరాలు - నా పుట్టినిల్లు, అత్తగారిల్లు!”

నటరాజన్ ఆ ఉత్తరం చదివారు. రాజం అన్నిసంగతులు విపులంగా వర్ణించింది: అత్తగారు తన ప్రయాణంకి సిద్ధంచేసిన సామగ్రి; మామగారు కొన్న వస్తువులు; ఇక దంపతులు కొత్త కాపురం సరికూర్చడానికి చేస్తున్న ఏర్పాట్లు.

చదివి, “ఇవన్నీ ఉత్తరంలో రాయవలసిన ముఖ్యమైన విషయాలే!” అని నటరాజన్ భార్యకి చెప్పారు. “‘వేలు బాగైంది అని రాసింది, కాని నొప్పి పూర్తిగా పోయిందా, మళ్ళీ వయలిన్ సాధన మొదలుబెట్టిందా?’ అని రాయలేదు. నేను ఎన్ని పుస్తకాలు చదవమని ఇచ్చాను! ఏదీ చదవలేదేమో?” అని విసుగ్గున్నారు.

“వాళ్ళింకా కాపురం పెట్టలేదే?” అని విశాలం అతనికి గుర్తుచేసింది. “ప్రస్తుతం మామగారు మాత్రం సహాయంకి వెళ్తున్నారు. ఇక రాబోయే ఉత్తరాల్లో అన్నీ తెలుస్తాయి.”

రాజం మనసులో ఏముందో నటరాజన్ కి అర్థం కాలేదు.

"మూడేమూడు గదులున్న ఇల్లు శుభ్రం చెయ్యడానికి పదిరోజులు కావాలా? రాజం మనసంతా ఇంటి చాకిరీమీదే ఉంది!" అని అతను చికాకు పడ్డారు. కాని ఆమెకు ప్రత్యుత్తరం రాసినప్పుడు అతని మనసు మెత్తపడింది.

"నువ్వు కావేరిలాగ ప్రకాశించడం విని నాకు చాలా సంతోషంగా ఉంది. నీగురించి నేనెప్పుడూ  ఆశించేది - నీ బాల్యంలో, యౌవనంలో, ఆ తరువాత - నువ్వొక విశ్వవిద్యాలయంగా రాణించాలని. ఇక వచ్చే రోజుల్లో నువ్వు నా కలలు నిరవేర్చే మార్గంలో ఏం చేస్తావో నేను ఆతురతో చూస్తుంటాను. సంగీతం, వయలిన్ సాధన మళ్ళీ ఆరంభించు; పుస్తకాలు చదువు; అందరితో కలిసి మెలుగు. ఆ రోజు శర్మగారు నీ వేలుకి గాయమని తెలిసి చాలా బాధపడ్డారు, కళ్ళు తడబెట్టుకున్నారు. ఇప్పుడు పూర్తిగా కోలుకున్నతరువాత నువ్వు మళ్ళీ సంగీతం, వయలిన్ శ్రద్ధ చూపాలి."

## 29

ఒక చిన్న ఇంటిలో దంపతులు కాపురం ఆరంభించారు.

ఐతేనేం, ఆ గృహంలో రాజం రాణీ, రఘుపతి రాజు. దొరస్వామి ఊరుకి తిరిగివెళ్ళి ఒక వారమైంది, కాని  రాజం మనసులో రోజులు దాటుతున్న ప్రజ్ఞ లేవనేలేదు. ఎల్లప్పుడూ ఆసక్తి, ఉత్సాహం; 'ఇది మా ఇల్లు!' అనే భావన ఆమెను అన్నివిధాలా ప్రేరేపించింది.

ఇప్పుడు రాజం మాటల్లో స్పష్టత చోటుచేసుకుంది. ఎది చెప్పినా సూటిగా, నిష్కళంకమైన ధ్వనితో మాటాడింది. ఇటీవల ఆమెకు దొరికిన స్వేచ్ఛ అందుకు కారణం. ఆమె దృష్టిలో మబ్బు లేదు; వాక్కు అనర్గళంగా వెలుబడింది. ఇంతకుముందు ఎంత చిన్నపని చెయ్యాలని పూనుకున్నా రాజంని సంశయం, భయం పీడించాయి. ఇప్పుడు రాజం ఆశతో తన బాధ్యతలు అంగీకరించి సంసారం అనుభవించింది.

ఇవన్నీ రఘుపతి వెంటనే గ్రహించలేదనే చెప్పాలి. రాజం పడుతున్న యిక్కట్లు అతను మెల్లమెల్లగా కొన్నిమాసాలతరువాతే అర్థం చేసుకున్నాడు. కాని

కాలక్రమంలో భవాని మనసు మెత్తపడుతుందని అతను ఆశించాడు. కాని తను ఊరులో లేనప్పుడు భవాని ఇంకా విపరీతంగా రాజంని హింసించడం, రాజం దౌర్బల్యంతో అవన్నీ భరించడం అతనికెలాగ తెలుసు? భార్య అనుభవించిన ఆ నరక వేదన అతనికి తెలియనేలేదు; రాజమూ తనుపడిన అగచాట్లు భర్తకి చెప్పలేదు.

కాని త్వరలోనే రాజం ధోరణిలో శక్తి, ఉద్వేగం కనిపిస్తున్నాయని రఘుపతికి అర్థమైంది.

రోజులు దాటిపోతున్నాయి. రాజంకి దాంపత్యంలో ఒక కొత్త వెలుగు కనిపించినట్టనిపించింది. తనొక కొత్తగాకోసిన పంటలాగ, తన భావనలన్నీ అందులో పాకుకుపోయిన ఎండుగడ్డల్లాగ ఆమెకు తోచింది.

భర్త ఆఫీసుకి వెళ్ళగానే ఇంటికి తాళంవేసి ఊరంతా తిరుగుతూ కబుర్లు వినే భార్య కాదు రాజం. ఇంటిలోనే ఉంటూ పుస్తకాలు చదివింది. గాయపడిన వేలులో ఇప్పుడు కొత్త చర్మం కనిపించింది. వయలిన్ తీగలని అది తాకినప్పుడు రాజం తాళలేని నొప్పి అనుభవించింది. వయలిన్ సాధనకి రాజం మూడే వేళ్ళు ఉపయోగించింది. గాయం ఏర్పడి రెండుమాసాలయ్యాయి; గాయం మానుకుందని డాక్టరు చెప్పి ఒక మాసమైంది. కాని రాజం ఎడంచెయి జట్టనవేలు పనికిరాకుండా అలాగేవుండిపోయింది. ఆ వేలు లేకుండా తను వయలిన్ లో రెండుమూడు కృతులు వాయించడం సాధ్యమని రాజంకి తెలుసు. రోజూ ఆ ఎంచిన కృతులే వాయించింది. ఇరుగుపొరుగున తన వాద్యం విన్నవారు రోజంతా అదే పోలికలోవున్న కృతులగురించి ఏమనుకుంటున్నారో అని రాజం ఆలోచించింది. తరచుగా రఘుపతి ఆఫీసునుంచి వచ్చినతరువాత ఇద్దరూ వాహ్యాళికి వెళ్ళేవారు. రాజం చాటుగా చుట్టుపక్కలు చూస్తూ బిడియంతో భర్తవెనుక నడిచేది. క్రమక్రమంగా ఇరుగుపొరుగుల స్నేహం, అభిమానం, ఆ దంపతులు అనుభవించారు.

ఒకరోజు ఒక అమ్మాయి వాళ్ల ఇంటిముందు కనిపించింది. రాజం ఆమెను లోపలికి రమ్మని పిలిచింది, మాటాడింది. అది చూసి ఆ అమ్మాయి తల్లికి రాజంమీద అపరితమైన ప్రేమ కలిగింది. ఇంకొకసారి రాజం ఒక చంటిపాప నేలమీద పాకుతూ

మెట్టుని తగులుకుంటుందని ఊహించి, గభీమని పరుగెత్తుకొనివచ్చి, పాపను పైకెత్తి, తన తమ్ముడు కణ్ణన్ని లాలించుతున్నట్లు ముద్దులు కురిసింది. దూరంలో నిలబడి అది చూసిన ఆ శిశువు తండ్రి తన భార్యతో “అబ్బబ్బా, చూసావా, ఈ అమ్మాయికి పిల్లలంటే ఎంత ఇష్టం!” అని పొగడారు.

రాజం సహజంగా నిష్కపటంతో అందరితోనూ మెలిగింది. అందువలనే ఆరాటం, అధైర్యం ఆమెను బాధించలేదు.

ఒకరోజు రాజం పొరుగింటి ముత్తైదువతో “నేను రోజు వయలిన్ వాయించడం మీకేం ఇబ్బందిగా లేదుకదా?” అని అడిగింది.

“నాకెందుకు ఇబ్బంది? నాకు నీ సంగీతం నచ్చింది. సాధకం చెయ్. నువ్వేం భయపడకు!” అని ఆవిడ రాజంకి నమ్మకం ఇచ్చారు.

“నేను వాయించలేను. నా వేలు చూడండి.”

“ఏం, ఏమైంది?”

“కాఫీగింజలు నూరినప్పుడు ఈ వేలునికూడా నేను పిండిచెయ్యడం జరిగింది!” అని రాజం నవ్వుతూ చెప్పింది. “ఈ వేలు లేకుండా నేను రెండే వేళ్ళతో వాయించగలను. రిషభంతో కలిసిన కృతులు వాయించాలంటే ఇంకా బాగా సాధన చెయ్యాలి.”

తన మనసులో ఏముందో బాహాటంగా రాజం అందరికీ చెప్పింది. అభిప్రాయాలు తెలియపరచడంలో అసూయ, కపటం లేకుండా మాటాడింది. భర్త సమక్షంలో తన మనసులో ఏముందో అది దాచకుండా అతనికి చెప్పింది; అదేవిధంగా ఇతరులతో తన ఆలోచనలు పంచుకుంది.

రాజంతో పరిచయమైన ఇంకొక స్త్రీ రాజంగురించి తన స్నేహితులకి చెప్పింది. “రాజంకి ఇల్లాలుగా అన్నీ తెలుసు; అన్ని పనులూ చెయ్యగలదు. ఇందులో వాళ్ళ పుట్టినిల్లు ప్రభావం బాగావుందనిపిస్తోంది. అత్తమామలతో కొంతకాలం గడిపితే ఘనత, సమత్వం వస్తాయనడానికి రాజం ఒక నిదర్శనం!” అని ఆవిడ అన్నారు.

ఆ పొగడ్తలు విని రాజం గర్వపడింది. “అవును, నిజం, కాని నాలాగే చాలామంది ఉన్నారు!” అని తనలో చెప్పుకుంది.

పొరుగునున్న స్త్రీలలో పంకజం అనే యువతితో రాజం స్నేహం కలిగింది. వయసులో ఆమె రాజంకంటే కొన్ని మాసాలే పెద్ద. రెండు పిల్లలకి తల్లి. పంకజం ఒకరోజు రాజంకి చెప్పింది. “మీ ఇంటిజనం మీ ఆయన కుటుంబంకి అవతల పెరిగారు. కాని మీ అత్తమామలకి మీరంటే ఎంత అభిమానం! ఇక నా సంగతో? మా అత్తగారు నా సొంత అత్తే! కాని మామధ్య ఎప్పుడూ బెడిసిన సంబంధమే కనిపిస్తోంది!” అని నొచ్చుకుంది.

మరేం ఆలోచించకుండా రాజం వెంటనే చెప్పింది. “మీ అత్త మనసులో ఆవిడని చూసి భయపడే కోడలు కావాలనివుందేమో? కొంతమంది స్త్రీలకి అత్తగారనే అంతస్తు రాగానే అధికారం చెలాయించాలని అనిపించవచ్చు!”

“అలాగే కాబోలు. మొట్టమొదట కొంచెం నిశ్చింతగానే నేను అత్తతో మెలిగాను, కాని కొన్నిరోజులతరువాత ఆవిడ ధోరణిచూసి కలవరపడ్డాను. మా ఆయన - అతను నా బావ - మనసు నొప్పించకూడదని నిశ్చయించుకున్నాను. కాని అత్తగారితో అది సాధ్యం కాలేదు. ఆడపడచుగా మా అత్త మా అమ్మని అన్నివిధాలా హింసించిందని నాకు తెలుసు. అలాగే ఇప్పుడు నన్ను ఏలుకోవాలని ఆవిడ ఉద్దేశమా? అది ఎన్నడూ జరుగదు!”

పంకజం ఉత్సాహంతో మాటాడింది. ‘నేను చెప్పినది సరియైన జవాబే!’ అని రాజంకి నమ్మకం కలిగింది.

రాజం ఈ ముచ్చటని భర్తకి వివరిస్తూ తన అభిప్రాయం అతనికి మళ్ళీ చెప్పింది. “ఏమైనా సరే, ఒక స్త్రీ తన అత్తగారుతో - అత్తగారని మర్యాద చూపాలనే నెపంతో - వొదిగివుండకూడదు; అదే సమయం ‘ఆవిడ నా సొంత అత్తకదా?’ అని ఉదాసీనత చూపకూడదు.  ఆవిడ తన భర్త తల్లి అని గ్రహించి తగిన మర్యాద చూపాలి”

అది విని రఘుపతి ఆమోదించాడు; బలంగా తలవూపాడు.

ఒకరోజు రాజం, రఘుపతి ఒక స్నేహితుడిని చూడడానికి వెళ్ళారు. అక్కడ రాజం ఒక ముసలావిడకి ఇంటిపనుల్లో సాయం చేసింది. అదిచూసి, సంతోషించి, ఆవిడ "నా కోడలికి ఇంటిపనులేం చేసే అలవాటు లేదు. నిజం చెప్పాలంటే అది వచ్చినతరువాత నాకు ఈ చాకిరీ, బాధ్యతలు బాగా ఎక్కువైపోయాయి! అది పడకకూడా మడతబెట్టదు. 'మా ఇంట్లో ఇవన్నీ పనిమనుషులకే వదిలేస్తాం!' అని కళ్ళు తడిపెట్టుకుంటుంది. అది పుట్టింటికివెళ్ళి నాలుగుమాసాలయ్యాయి, ఇంకా తిరిగిరావాలని దానికి మనసు రాలేదు!" అని అన్నారు.

'నిజంగానా? ఇలాగ కూడా జరుగుతాయా?' అని రాజం విస్తుపోయింది. దానితోబాటు ఒక ప్రశ్నకూడా లేచింది: 'ఈ ప్రపంచంలో నాకంటే భయస్తులెవరైనా ఉన్నారా'?

"వాళ్ళ అమ్మ రాజంకి మంచి శిక్షణ ఇచ్చింది," అని ఆవిడ రఘుపతికి చెప్పింది. ఇంతలో రాజం జోక్యం చేసుకొని "అలా కాదండి. ఈ శిక్షణ మా అమ్మగారిచ్చారు, మా అమ్మ కాదు!" అని నవ్వుతూ భర్తవైపు ఒక చూపు విసిరింది.

"నాకిది అర్థం కావటంలేదు. అమ్మ, అమ్మ అని అంటున్నప్పుడు రాజం తన తల్లిగురించి మాటాడుతుందని నేననుకున్నాను. కాని రాజం తన అత్తగారిగురించి మాటాడుతోంది! ఏం, మా అత్తగారు అని సూటిగా చెప్పవచ్చుగా?" అని ఆవిడ అడిగారు.

రాజం వెంటనే జవాబిచ్చింది.

"'అమ్మ' అనే పదం వాడినప్పుడు అది నా తల్లిగురించి - ఏకవచనం వాడుతాను. అమ్మగారు అన్నప్పుడు అది మా అత్తగారు. నా అత్తమామలగురించి మాటాడినప్పుడు 'మా అమ్మ', 'మా నాన్న', అనే పదాలు నేను వాడను!"

"మీ అత్తగారు అప్పడాలుచేసి నీకు పోస్టులో పంపించారా? చాలా శ్లాఘ్యమైన విషయం. ముసలావిడకి ఎంత ఓర్పు!" అని ఆవిడ అన్నప్పుడు రాజం

ఆగ్రహపడింది. శారదాంబాళ్ని ముసలావిడ అని నోరు పారేసుకోడం భరించలేక రాజం వెంటనే "మీకు తెలుసునోలేదో? ఆవిడ మా అమ్మకికూడా కట్టలు కట్టలుగా అప్పడాలు చేసి పంపుతారు. ఆవిడ ఏదిచేసినా కచ్చితంగా చేస్తారు. ఆవిడ పనిచేస్తుంటే అది గమనిస్తూనే మనం అన్నీ నేర్చుకోవచ్చు. ఇంతకీ నేను ఇంటి పనుల్లో ఆవిడకి ఏదో కొంచెం సహాయం చేసాను, అంతే! నిజం చెప్పాలంటే పుట్టిల్లులో నాకేం గొప్ప శిక్షణ లేదు. అత్తగారింట్లోనే భయం, ఆరాటం లేకుండా అన్నీ నేర్చుకొనే భాగ్యం నాకు కలిగింది," అని చెప్పింది.

రాజంకి తన మనసు తెలుసు, ఇతరులకి తనగురించి ఎటువంటి అభిప్రాయాలున్నయని తెలుసు, మరెందుకు తను ఇన్నాళ్ళు పోషించిన విలువలు విడజిమ్ముకోవాలి? మనసులో ఏముందో ఎందుకు నిష్కపటంగా చెప్పకూడదు? అందువలనే రాజం శారదాంబాళ్ గురించి తన మెచ్చుకోలు ఆ ముత్తైదువకి చెప్పింది.

రాజంకి తనమనసులో ఏముందో చెప్పడానికి హక్కువుందని రఘుపతి ఆమోదించాడు. రాజం ఎప్పుడూ హద్దుమీరదని అతనికి తెలుసు. ఐతే ఈ ప్రజ్ఞ రాజంకి ఎలా వచ్చిందని అతను ఆలోచించాడు: 'రాజం ఎటువంటి పరిస్థితిలోనూ సముచితంగా మాటాటడం ఎక్కడ నేర్చుకుంది?' ఇప్పుడే అతనికి జవాబు దొరికింది.

"నేను మనుషుల్లో అంతర్దృష్టి పొందడానికి మీరూ, భవాని అక్కయ్య ముఖ్యకారణం; అది ఒక చెట్టులో సుత్తి కొట్టిన మేకులాగ నా మనసులో గూఢంగా పాతుకొనివుంది," అని ఆ రోజు రాజం అనలేదూ? రాజం వాడిన ఉపమానం విని రఘుపతి నవ్వాడు. చాలాసార్లు రాజం తనకీ, భవానికీ కృతజ్ఞ తెలిపే పైఖరిలో అన్న మాటలు అతను గుర్తుచేసుకున్నాడు: "మీరు నన్నడిగిన కొన్ని ప్రశ్నలు, భవాని అక్కయ్య చెప్పిన బోధనలు నేనెప్పుడూ మరువలేను. ప్రతీదీ ఒక తెల్లబట్టమీద జల్లిన రంగులాగ నాకు కనబడుతోంది." అది విని రఘుపతి "అవును, నిజం,"అని ఒప్పుకున్నాడు. 'రాజంలో ఎంతమార్పు! మూడుసంవత్సరాలముందు సున్నిత హృదయంతో చంటిపాపలాగ ఏడవడం అలవాటు చేసుకుంది. ఇప్పుడో? మంచి

నెమ్మదైన మనిషిగా కనిపిస్తోంది. భవానిదగ్గర పడిన యిక్కట్లు ఎలా భరించింది! అవును, ఇది నిజంగా ఒక పెద్ద పరివర్తన!" అని తనలో చెప్పుకున్నాడు.

"నాకు పదిహేను నిండగానే పెళ్ళికావడం మంచిదైంది," అని రాజం ఒకరోజు భర్తకి చెప్పింది. "వయసుతోపాటు ఆడపిల్లలకి మొండితనం పెరుగుతుందని, ఇతరుల పైఖరికి రాజీపడలేరని నేను విన్నాను. ఇరవై ఏళ్ళు నిండిన యువతికి ఆ సర్దుబాటు రావడం చాలా కష్టం అని నాకనిపిస్తోంది. పదిహేడు సంవత్సరాల్లో ఒక యువతిలో కనిపించే లక్షణాలు ఆ తరువాత స్థిరంగా ఆమెలో నిలిచిపోతాయని ఎవరో అన్నారు. చెప్పండి, నా పదిహేడో వయసులో నేను మీకెలా కనిపించాను? అది నా డైరీలో రాసుకుంటాను."

రఘుపతి నవ్వుతూ జవాబు చెప్పాడు. "నాకు నువ్వు నిరంతరంగా ఒక పదిహేడేళ్ళ యువతిగా కనిపించడం ఇష్టంలేదు; ఇప్పుడే నా పెండ్రుకలు రాలిపోతున్నాయి; బట్టతల కనిపిస్తోంది. నా ఆకారం చూసి నువ్వు అసహ్యించుకుంటావేమో?"

రాజం పదిహేడేళ్ళ యువతిగా ఇక్కట్లు, ఉపద్రవాలు భరించింది. కాని కోడలుగా ఆ రోజులన్నీ మంచి అనుభవాలే అని గుర్తుచేసుకుంది. ఇప్పుడు తన భర్త తనకి మంచి భవిష్యత్తువుందని ధైర్యం చెప్తున్నాడు. ఐనా, ఏ గండముందో, ఏ ప్రమాదముందో ఎవరికి తెలుసు? ఆ సంశయం రాగానే రాజం సణుగ్గుంది: "మంచి వేళ, మీరు మొట్టమొదట నన్ను చూడడానికి వచ్చినప్పుడు నా వేలు వంకరగా లేకపోవడం నా అదృష్టం. లేకపోతే మీరు పెళ్ళికి సమ్మతించివుంటారా?"

ఇలాంటి విరుద్ధభావాలే మళ్ళీమళ్ళీ రాజం మనసులో చోటుచేసుకున్నాయి. దంపతులమధ్య సంతోషంగా ఆరంభించిన సంభాషణలు ఇలాగా అలాగా ఎక్కెక్కడో సాగి, తప్పుతోవ పట్టి, చివరికి ఘర్షణ, మౌనంతో అంతమయ్యేవి. కొన్నిసమయాల్లో రఘుపతి వాడిన ఒక మాట - ఒకే మాట - రాజం హృదయంని తాకినప్పుడు - దాని తాత్పర్యం ఏమిటని రాజం గ్రహించడానికి ముందే - అతని సహృదయత ఆమెకు అర్థమైయ్యేది. క్రమంగా రాజంకి అతని సందేశాలు బాగా నచ్చాయి; తను స్కూల్లో

చూసిన వాదోపవాదాలు గుర్తుచేసుకుంది. దంపతులమధ్య జరిగే అన్యోన్యచర్యలలలో నవరసాల అంశాలు - సంగీత అన్వేషణలో తనకి పరిచయమైనవి - ఉన్నాయని రాజం తెలుసుకుంది. తనకి మరేం కావాలి?

రఘుపతి విషయంలో రాజంకి ఏర్పడిన భావం ఎలా వర్ణించడం? ఆ అనురాగం ఒక శిశువుకి చూపే సానుభూతిలాగ పరిణమించింది. రఘుపతికూడా రాజంపట్ల అనురతి చూపించాడు. కాని అతనికి భార్యపట్ల తన ప్రేమానురాగాలు నిరూపించడానికి కొన్ని సందర్భాలే దొరికాయి, అవన్నీ రాజంని ప్రసన్నం చేసాయి. రఘుపతికి 'నేను నా తల్లిదండ్రులకి ఆవశ్యకమైన అన్ని వసతులూ సమకూర్చిపెట్టాను!' అనే తృప్తివుంది. అలాగే రాజంని బాగా చూసుకోవాలని అతను ఆశించాడు. ఇలాంటి పరిస్థితిలో రాజం మనసు పిల్లవాడిని దండించినతరువాత 'నేనెందుకిలా చేసాను?' అని నొచ్చుకొనే తల్లిలాగ బాధపడింది. “నేనొక పెద్ద వాగుడుకాయగా మారిపోయాను!” అని భర్త సమక్షంలో రాజం క్షమాపణ కోరినప్పుడు రఘుపతి కలవరపడ్డాడు.

ఇరుగుపొరుగు స్నేహితులు, శ్రేయోభిలాషులు రాజం తన సంగీత ప్రావీణ్యం పునరుద్ధరించాలని ప్రోత్సాహించారు. “నువ్వెందుకు AIR ప్రోగ్రాంలో పాడకూడదు? నువ్వు రాగాలు, స్వరాల్లో కొంచెం సాధన చేస్తే చాలు!” అని కొందరన్నారు. “ఎవరైనా ఒక మంచి గురువుగారు దొరుకుతారా అని చూడు?” అని మరికొందరు సలహా ఇచ్చారు. రాజం ఆలోచించింది: 'నా వేలుకి గాయం తగిలినతరువాతే నాకు వయలిన్ సాధన చెయ్యాలనే వాంఛ ఇంకా తీవ్రంగా పెరిగింది. అత్తగారిల్లు వాతావరణంలో, పెద్దల మనసు తెలుసుకొని సాధన చెయ్యడమే ఒక మంచి శిక్షణ అని నాకు తెలిసింది.' ఆ పాతరోజుల్లో రాజంకి కొన్ని కటునైన అనుభవాలు గుర్తుకి వచ్చాయి కాని వాటిని ఆమె అలాగే తోసిపారేసింది. 'అవన్నీ మంచిరోజులే!' అని తనలో చెప్పుకుంది.

కొత్త కాపురంలో తన అనుభవాలు, తక్కిన వివరాలు రాజం విపులంగా ఉత్తరాల్లో రాసింది. అత్తగారికి రాసినప్పుడు తను కొనియాడిన పండుగలు, స్నేహితులని

దర్శించిన వివరాలన్నీ వర్ణించింది. “ఇల్లాలు జీవితం నాకు సంతోషంగా ఉంది. ఆ ప్రావీణ్యంకూడా ఒక అమూల్యకళ అని నేను ఇప్పుడు తెలుసుకున్నాను!” అని ముగించింది.

అత్తగారిల్లులో తన లక్ష్యం ఏమిటి? తను ఎది చేసినా తనూ, తన భర్త కీర్తి పొందాలి. దానికి ప్రధానం ప్రసన్నత, ఓర్పు అని మరవకూడదు. అత్తగారికి ప్రత్యేకమైన గణ్యత చూపాలి. ఇది రాజం పూనుకున్న శపథం. కొన్నిసమయాల్లో రాజం మనసులో ఏవో ఆవేశపూరిత ఊహలు చోటుచేసుకొని ఆమెను పీడించాయి. కాని దానికి మూలాధారం భవాని ఎప్పుడో తన గురించి ఎత్తిపొడిచిన మాటలని రాజం వెంటనే గ్రహించింది. ఆ రోజు శారదాంబాళ్ భవానికి విరుద్ధంగా నిలబడి దృఢంగా, నిమ్మళంగా తన్ను వెనకేసుకొని మాటాడిన దృశ్యం! తన సొంతకూతురుని విరోధించుకొని ఆవిడ రాజం పక్షం వాదించలేదూ? రాజం దృష్టిలో ఆవిడ ఒక శక్తివంతమైన గోపురంలాగ కనిపించారు.

‘భవాని, ఆమె తల్లి ఒకరికొకరు దూరంగా ఉంటున్నారు. ఐనా వాళ్ళమధ్య పొత్తు లేదు. నేనూ, అత్తగారూ పక్కపక్కనే వున్నాం, మా లోపాలు లెక్కచెయ్యకుండా కలిసి మెలుగుతున్నాం,’ అనే ఆలోచనలలో పడి, ఉప్పొంగి, రాజం గర్వపడింది.

## 30

చాలారోజులతరువాత, రాజం భర్తతో ఒక కచేరీకి వెళ్ళింది.

“నాకు గాయకుడు పాడేదేమో వయలిన్ విద్వాంసుడు అలాగే వల్లించుతున్నట్లనిపిస్తోంది. ఒకవేళ ఇద్దరూ ముందే కలిసి మాటాడుకున్నారేమో?” అని రాజం అడగ్గా వెంటనే రఘుపతి జవాబు ఇచ్చాడు. “వయలిన్ విద్వాంసుడంటే ఆ పనే చెయ్యాలి; గాయకుని అతను యధార్థంగా అనుసరించాలి. నీకు తెలియదా? దానికే ప్రతిరూప కల్పన అను పేరు.”

‘ఓ, అలాగా?” అని రాజం ఆశ్చర్యపడింది.

“అంటే . . . ఒక ధర్మపత్నిలాగ అన్నమాట? . . . ” అని అడిగింది.

"అవును, మీ శర్మగారు తను వాయించే స్వరాలు నువ్వూ అలాగే వల్లించాలని ఎదురుచూస్తారుకదా? . . . అందుకే నువ్వుకూడా ఒక ధర్మపత్ని."

ఆ ఎత్తిపొడుపు మాటలు విని రాజం అసహ్యించుకుంది. శర్మగారెప్పుడూ తన సంగీత ప్రజ్ఞగురించి గొప్పగా చెప్పుకోలేదు; తనూ అతన్నిగురించి శ్లాఘించలేదు; ఊరులో మరెవరూ దొరకకపోవడంతో అతను రాజంకి గురువయ్యారు. ఇప్పుడు మద్రాసులో ఎంతమంది సంగీత కళాకారులున్నారు! మరి  వాళ్ళెవరితోనూ తన సంగీత శిక్షణ గురించి తన భర్త మాటాడరేం? ఆ రోజు శర్మగారు ఏమన్నారు? "రాజం, నువ్వు సంగీతం నేర్చుకున్నది ఎందుకు? 'తమిళదేశంలో ఒక మంచి భర్త దొరుకుతాడు,' అనే ఒకే కారణమా? మరి, పెళ్ళైన తరువాత సంగితం మరిచిపోతావా?' అని అడిగారుగా?

ఇప్పుడు తనకి సంగీత శిక్షణకి కావలసినంత అవకాసం వుంది. ఆర్థిక పరిస్థితికూడా అనుకూలంగానే వుంది. అభిలాష పెరుగుతుంటే ఆక్షేపణలు నీరసమవడం సహజమేకదా? 'నేనిక సభలో ధైర్యంగా కచేరీ చెయ్యగలను,' అనే నమ్మకంకూడా రాజంకి కలిగింది. కాని భర్తను అడగడానికి రాజం జంకింది. ఇవన్నీ ప్రత్యేక హక్కుల్లో లెక్క; మళ్ళీమళ్ళీ అధికారంతో అడగవచ్చా?

తన భర్తకి భార్య సంగీతంలో ఏ మాత్రం అనురాగం లేదేమో? మరేం కొత్త పాటమేష్టారుగురించి అతను ఆలోచించనేలేదేమో? 'ఇవేం వొద్దు, శర్మగారిని అతను నిందించకుండావుంటే అదే నాకు చాలు!' అని రాజం మనసులో ఆశించింది.

'మరేం లాభం లేదు; ఈ ఉపేక్ష నేను భరించే తీరాలి,' అని రాజం నిశ్చయించుకుంది. అందుకే ఆమె నోరు తెరిచి ఏమాటా అనలేదు. ప్రమాదవశాత్తూ

నిప్పుకణంవలన పచ్చికబయట్లో మెరుపుయుద్ధం చోటు చేసుకోలేదు. జరగనున్న ఆపద తప్పుకుంది.

భర్త చాలా విషయాలలో తన అభిప్రాయాలను పునర్విచారణ చేసుకున్నాడని రాజం గ్రహించింది. కాని శర్మగారి విషయంలో అతని హేళన, ఎత్తిపొడుపుమాటలు. కటోక్తి ఏమాత్రం తగ్గలేదు.

త్వరలో రాజంకి కొత్త స్నేహితులు, సహృదయులు దొరికారు. సంగీతంలోనున్న ఆసక్తివలన వాళ్ళతో కలుపుగోలుతనంకూడా ఎక్కువైంది.

"చంటిపాపలంటే రాజంకి ఎంత మమకారం! ఎంత చమత్కారంగా ఆమె పిల్లల్ని చూసుకుంటోంది!" రాజం భర్తతో కలుసకున్న విందులు, సమూహంలో పదే పదే ఈ మాటలు అందరూ విన్నారు.

అటువంటి ఒక ఘటనలో ఎవరో ఒకతను విందుకు వచ్చిన ఒక దంపతులగుంచి - అందులో భర్త తమిళుడు, భార్య గుజరాతి - విమర్శింటడం రాజం చెవిలో పడింది.

"వంశపరంపరగా ఒక కుటుంబం తండ్రి మూలంగా సాగడమే మనం చూస్తాం," అని అతను వాదించడం మొదలుబెట్టారు. "కాని ఈ కుటుంబంలో తల్లి బిడ్డల్ని గుజరాతీ పిల్లలుగా పెంచుతోంది; ఇంతకన్న పెద్ద అవమానం ఏమైనా ఉందా?"

రాజంకి ఆ గుజరాతి స్త్రీగురించి ఏమీ తెలియదు. కాని ఆవిడ పక్షంకి ఊతమిచ్చింది:

"ఒక తల్లి మొట్టమొదట తన చంటిపాపని సాకి ముద్దాడినప్పుడు తన మాతృబాషనే వాడుతుంది. మనంకూడా విశ్రాంతిలో, కలలో, చంటిపాపలని లాలించినప్పుడు మాటాడేది మాతృబాషేకదా?"

కొన్నిరోజులతరువాత, రాజం, రఘుపతి ఒక మరాఠీ దంపతులని చూడడానికి వెళ్ళారు. రాజం అక్కడ ఒక పాపను ఎత్తుకొని "రంజు, కుంజు!" అని ముద్దులాడింది; తన తమిళబాషలో పాపని 'నా ముద్దు బిడ్డ!" అని లాలించడం మొదలుబెట్టింది. "జాగ్రత్త, నువ్వేమో తెలియకుండా వాళ్ళ బాషలో ఏమైనా చెడ్డ మాటలు చెప్తున్నావేమో?" అని ఆమెను రఘుపతి హెచ్చరించాడు.

రాజం ప్రవర్తనలన్నీ సహజంగా ఆమెలో పుట్టుకతో వచ్చినవి. రాజంకి మంచి పేరు, ప్రతిష్ట వచ్చాయి, రోజులు సాగాయి.

'ఇదే నా వాంఛ, నాకు మరేంకావాలి?' అని ఆమె అంతరాత్మ ఘోషించింది.

"అలాగా? మరేం వద్దా నీకు?" అని దైవం కొంటెగా అడిగింది.

రాజం జీవితం నిర్జన ఎడారిగా ఆరంభించి ఇప్పుడు ఒక పచ్చినపొలంగా - బంకమట్టి, మన్నుతో - రంజించుతోంది. పంట పండనీ, అంతవరకు రాజం కాచుకొని ఉండవలసిందే!

చిరునవ్వుతో రాజం భర్తకి స్వాగతం చెప్పింది. ఒక శుభవార్త అతనికి చెప్పడానికి పూనుకుంది.

రఘుపతి మూతిముడుచుకొని ఇంట్లో కాలుబెట్టాడు. అతను ఒక అశుభ వార్తతో వచ్చాడు.

"మా పిన్నికూతురుకి పెళ్ళి నిశ్చయమైంది. మనం తప్పకుండా వెళ్ళాలి!" అని చెప్పి రాజం అతని జవాబుకోసం ఆగింది.

"వచ్చే వారంలోనా? మనం తప్పకుండా వెళ్ళాలి. మీ అమ్మా, నాన్నగారుకూడా వస్తారుకదా? మనం వెళ్దాం."

"మా అమ్మా, నాన్నా వస్తారేమో నాకు తెలియదు. వాళ్ళు రాకపోతే మనం వెళ్ళకూడదా?"

"వాళ్ళు వస్తే నువ్వు వాళ్ళతో మీ ఇంటికి వెళ్ళవచ్చు . . . నా ఉద్యోగం ఇక్కడ ఇంకా రెండు నెలలకే . . . "

". . . మీరేమంటున్నారు? . . . "

"అవును, ఆ తరువాత ఏమవుతుందో నాకు తెలియదు. నువ్వూ మీ ఇంటికి వెళ్ళి చాలా రోజులయ్యాయి . . . "

"అలాగయితే నేను వెళ్తాను. ప్రయాణంకి pack చెయ్యనా?"

"అలాగే చెయ్. నాకెక్కడ ఉద్యోగం బదిలీ అవుతందని తెలివినతరువాత, నావన్నీ transfer చేసుకోవచ్చు."

ఈ మధ్యనే ఆరంభించిన కొత్త కాపురం ఇంత త్వరగా సమాప్తమవడం చూసి రాజం బాధపడింది. కాని అ కారణంవలన తన కుటుంబంలో జరుగపోయే పెళ్ళికి వెళ్ళకుండా ఉండడమా? ఆమె తల్లిదండ్రులు రావచ్చు. మరి వాళ్ళతో తనింటికి వెళ్ళకపోతే మరెవరితో తను ఎక్కడకి వెళ్ళడం?

తడిసిన కళ్ళతో తన స్నేహితులు, సహృదయులదగ్గర రాజం సెలవు తీసుకుంది. "మీ సహవాసం, మీతో పంచుకున్న అనుభవాలు నేనెలాగ మరవగలను? నాకు పెళ్ళైనతరువాత ఇక్కడేకదా నా కాపురం మొదలుబెట్టాను? అని మనసార తన అనుభూతి వెల్లడించింది.

రాబోయే తమ ప్రయాణంగురించి రఘుపతికి ఎటువంటి ఉత్సాహమూ లేదని రాజంకి బోధపడింది.

"నువ్వెందుకు అందరితోనూ ఇది 'నా మొదటి కాపురం,' అని వక్కాణించి చెప్పాలి? నీకు పెళ్ళై మూడు సంవత్సాలయ్యాయి!" అని రఘుపతి అడిగాడు.

ఆహ్లాదకరపూర్ణమైన తన కాపురంలో ఏర్పడిన భంగం గురించి నిరాశతో రాజం ఇంకా బాధపడుతూనేవుంది; భర్త మాటలు విని ఆమె మనసులో మండిపడింది. 'పెళ్ళైన తరువాత మా దాంపత్యం ఎలాగ సాగిందని ఇతనికి తెలియదా?' అని తన్నే అడుక్కుంది. తరువాత అతన్ని నేరుగా అడగాలని అనుకుంది: కాపురం అనే మాటకు వస్తే అందులో కానవచ్చే వ్యవహారాలూ, ఫలితాలూ - వీటికి ఎవరు బాధ్యత - భార్యా భర్తలేకదా? కొంచెం నిదానించి భర్త ఏమంటాడని ఆలోచించింది. అతను ఆడగవచ్చు: 'కాపురమంటే పనిమనిషిని చెలాయించడం లేకపోతే ఇతరులమీద అధికారం చూపడం అని అంటున్నావా? ఏం, సౌజన్యమైన ఒక ఇల్లాలుగా, బాధ్యతగల భార్యగా మెలగడం నీకు ఇష్టం లేదా?' అలాగ అతను అడగడానికి న్యాయముంది. సంసారం నడపడానికి పట్టుదల, సహానుభూతి, అదికారంతోబాటు కొంచెం మమతకూడా కావాలి.

రఘుపతి ఏం అడక్కపోయినా, దానిగురించి అతను చింతుస్తున్నాడేమో? అందువలన తన్నే నిందించుకున్నట్లు రాజం మాటాడింది: "కాపురం చెయ్యడమంటే నేను అంతా మితమీరి చేస్తున్నానేమో?" అని అంటూ భర్తను చూసింది. అతని చిరునవ్వు చూసి తనూ నవ్వింది.

కాని రఘుపతిలో ఎటువంటి ఉత్సాహమూ కానరాలేదు; ఏం, ఎందుకు అని రాజం ఆలోచించింది. ఇక కొన్నిరోజుల్లో రాబోయే ఎడబాటు కారణమా? భర్తలకి అది సహజమా? 'ఇక రాజం తన బంధువులతోకలిసి హాయిగా రోజులు గడుపుతుంది,

తన బాధలన్నీ మరిచిపోతుంది,' అనే ద్వేషమా? ఆ రెండవదే కారణమని రాజం గ్రహించింది. సంభాషణలో అటువంటి ధోరణి ఆమెకు తోచింది. "నీ తల్లిదండ్రులని చూడబోతున్నావని నీకు ఎంత ఉత్సాహమని నాకు తెలుసు; ఒక వేళ మా అమ్మా, నాన్నగారిని చూడడానికి వెళ్ళాం అనుకో, అప్పుడూ నీకు ఇలాగేవుంటుందా? నాకలా అనిపించడంలేదు," అని రఘుపతి ఆమెతో అన్నాడు.

"అదెలాగ? అసలు నేను మా తల్లిదండ్రులని చూడబోతున్నానని మీలో ఎటువంటి సంతోషం కనబడదే?" అని రాజం వెనుకాడకుండా అడిగింది.

"మా అమ్మ, నాన్నగారి సంగతి వదలెయ్. దీనికి జవాబు చెప్పు: మీ అత్తకొడుకు చంద్రుతో నాకున్న చనువు మా చెల్లెలదగ్గర నీకుందా?"

రాజం శాంతంగా జవాబు చెప్పింది.

"అదా? . . . మీకు చంద్రు గురించి ఆరుమాసాలుగా తెలుసు. వాడు మీరొక పెద్ద ఆఫీసరు అనుకొని మిమ్మల్ని స్తోత్రం చేస్తున్నాడు. మీరూ వాడి ముఖస్తుతికి లొంగిపోయి వాడి తెలివితేటలు గురించి గొప్పగా అందరికీ చెప్తున్నారు. నేనెదిచేసినా ఇతరులేమంటారో అనే భయంతోనే మెలుగుతాను, కాని భవాని అక్కయ్య నన్ను నిత్యమూ తప్పుబెడుతూనేవుంటుంది. మరి నాకెలాగ ఆమెతో చనువు, ప్రేమ ఏర్పడతాయి? మీరు నన్ను ఎన్ని ప్రశ్నలడిగినా సరే అడగండి, నేను నిమ్మళంగా, ద్వేషం లేకుండా జవాబు చెప్తాను, కాని అవి సరైన ప్రశ్నలుగా ఉండాలి." ఆవేశంవలన మాటల్లో ఆటంకం, రాజం గొంతు పట్టుకుంది; భర్తదగ్గర క్షమాపణకి సిద్ధమైంది.

రఘుపతి మరేం ప్రశ్న అడగలేదు. కాని ప్రయాణం చివర అటువంటిది - ఒక వేరే ప్రశ్న - వేసాడు.

"మా చిన్నాన్న స్టేషన్ కి వస్తారు!" అని అంటూ రాజం ఆహ్లాదపడింది. రఘుపతి "నేను ఈ గ్రామంలో మూడురోజులు ఎలాగో భరించాలి, నాకిక్కడ ఎవరూ తెలియదు," అని నవ్వాడు.

రాజంకి రఘుపతి యిక్కట్టు అర్థమైంది. ఇప్పుడెందుకు ఏదో చెప్పి భర్తని రెచ్చగొట్టాలి అని ఆమె కొంచెం వెనకాడింది. కాని ఎవరికి తెలుసు? ఇంకొక అవకాశం

రాకపోవచ్చు. నిలకడగా మనసులో నాటించినట్టు అతనికి ఇప్పుడు బుద్ధి చెప్తే చాలు. భవిష్యత్తులో మళ్ళీ మళ్ళీ ఎందుకు తను గద్దించాలి?

"ఏమంటున్నారు? . . . మీరు మూడురోజులు భరించాలా? అబ్బో, ఎంత కష్టం? అది మీకు ఒక పెద్ద సవాలుకదూ? మీరు మీ ఇంటికి ఒకడే అల్లుడని మా చిన్నాన్న అన్ని లాంఛనాలతో మిమ్మల్ని ఈ పెళ్ళికి పిలిచారు. మీరూ అతని ఆహ్వానం స్వీకరించారు. ఇక ఈ మూడురోజులూ మా బంధువులందరూ మీకన్నివిధాల మర్యాద, గౌరవం అర్పిస్తారు. నేనుకూడా మీ పక్కనే ఉండి మీకేంకావాలని చూసుకుంటాను. ఈ వచ్చే మూడు రోజులకి మీకు లభించేది royal treatment! మరి మీరే ఇలా గొణుకుతుంటే మేమందరం ఎక్కడికివెళ్ళి మొరబెట్టుకుంటాం చెప్పండి . . ?"

"సంవత్సరంకి ఆరు మాసాలు కోడలుగా నన్ను అందరూ నిత్యమూ గమనిస్తూనే ఉన్నారు; విమర్శించుతున్నారు; అంచనా వేస్తున్నారు: 'నేనెలా మాటాడుతుతాను? నేనెలా నవ్వుతాను? నేనెలా నడుస్తాను? ఇతరులముందు నా ప్రవర్తన ఎలాగుంది? నాకు వంట, ఇంటిపనులు బాగా తెలుసా? మన సంప్రదాయంకి తగినట్టు నేను నా పుట్టిల్లు, తల్లదండ్రులగరించి మాటాడకుండా ఉండగలనా?' అటువంటి వాతావరణంలో ఒక పదిహేనేళ్ళ యువతి అనుభవం గురించి కొంచెం ఆలోచించండి. అందరి దృష్టి ఎప్పుడూ ఆమె పైనే. అంతేకాదు, ఏ కారణంవలనా ఆమె తన భర్తని ఏమీ అడక్కూడదు! అడిగితే, ఒక పెద్ద తుపాను లేస్తుంది."

మనఃపూర్వకమైన కనికరంతో రఘుపతి ఆమెను చూసాడు.

'ఇవాళకి ఇది చాలు; నా మనసులోవున్నదంతా కొట్టిపారేసాను. నేను పదే పదే ఎందుకు విసుగ్గుంటున్నాని అతనికి బోధపడుతుంది,' ఆ ఆలోచనతో రాజం తృప్తి పడింది.

రాజం చెప్పినట్టే ఆ పెళ్ళిలో రఘుపతికి వైభవంగా అన్ని మర్యాదలు దొరికాయి. రాజం స్వయంగా భర్తకి అన్ని వసతులు సమకూర్చింది. ఒకరోజు రఘుపతి రాజంతో "నావలనే నీకీ బాధలన్నీ," అని గొణుక్కున్నాడు. అది విని రాజం మండిపడింది. 'బాగుంది, మా ఆయన దీన్ని పెద్ద శ్రమ అంటున్నారు. నేనేం గొప్పగా చేసాను?

అతను స్నానానికి వెళ్ళినప్పుడు చేతిలో సబ్బు అందించాను, అంతే, మరేం లేదు!' అని వాపోయింది. అవును మరి, ఏనుగుతో పోరాడి జయించిన సింహాని చూసి "నువ్వు ఆ దోమను ఎంత చలాకీగా పట్టుకున్నావ్!" అని అడిగితే ఎలావుంటుంది?

విశాలంకూడా ఆ పెళ్ళిలో కలుసుకుంది. రఘుపతి అనుకున్నట్లే అన్ని ముచ్చటలు జరిగాయి. పెళ్లి తరువాత రఘుపతి సెలవు తీసుకున్నాడు. రాజం, రఘుపతి మధ్య ఎడబాటు మౌనంగానే జరిగింది. ఆ సమయంలో రఘుపతి అనుభవించిన క్షోభ చూసి రాజం నిర్ఘాంతపోయింది. తనెప్పుడూ ఇంత తీవ్రంగా బాధ పడలేదనే ఆలోచనతో కలవరపడింది.

అసలు రఘుపతికి ఆ సమయంలో కలిగిన మనోవేదనకి ఒక మంచి కారణముంది.

ఆ సీతాదేవిని అడవిలో ఒంటరిగా వదిలిపెట్టివెళ్ళినప్పుడు ఆమె బావమరది - ఆ దురదృష్టవంతుడు లక్ష్మణుడు - మనసుకూడా అలాగే ఆరాటపడింది.

ఇందకు ముందే ఇక రెండు మాసాల తరువాత అతనికి ఉద్యోగం లేదని రఘుపతికి అతని అధికారులు చెప్పేసారు.

రఘుపతి భార్యకి ఈ సంగతి చెప్పాలనుకున్నాడు కాని అంతకుముందే రాజం తన పిన్నికూతురు పెళ్ళిగురించి అతనితో ప్రస్తావించింది. ఆ శుభవార్తతో తన పరిస్థితిని ఎలా తెలియజేయడం అని రఘుపతి తికమకలాడాడు. ఆ తరువాతకూడా రైలు ప్రయాణంలో రాజం మనసులో ఏముందో అనే వ్యాకులత అతన్ని బాగా పట్టుకుంది.

రఘుపతికి నిత్యమూ కొన్ని నియమాలు పాటించే అలవాటుంది. తను ఒక ఆదర్శ పుత్రుడు, తన భార్య రాజం ఒక ఆదర్శ పత్ని; ఆమె ఎల్లప్పుడు సంతోషంగావుండాలి. తనకదే ముఖ్యం.

ఆ తరువాత కటువైన వార్తను రఘుపతి ఒక ఉత్తరంలో అందించినప్పుడు ఆమెలోని నిరుత్సాహం కొంచెం అణచే ప్రయత్నంలో రాజంని పొగడ్తూ ఈ మాటలు రాసాడు:

"నీకు జ్ఞాపకం ఉందా? నేను ఉద్యోగంకి వెళ్ళినప్పుడు మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొనడానికి ఎంపికచేసిన సభ్యుల ఆఖరి దళంలో చేరి పని చేసాను. ఆ కారణంవలనే నా వృత్తికి ముందుగా ముగింపు వచ్చేసింది. నేను త్వరలో వేరే ఉద్యోగాలకు apply చేస్తాను. ఇటీవల Wanted Columns చూడడం ఆరంభించాను. ఇదిగో: ఇది నీకు నేను పంపుతున్న ప్రకటన: *'కావలెను: త్వరలో నిరుద్యోగి కాబోయే పట్టధారికి ఇరవైయేళ్ళ యువతి; అందం, తెలివితేటలతోపాటు ఒక మంచి ఇల్లాలుగా రాణించగల సమర్థత ప్రధానం.'* నువ్వుకూడ apply చెయ్యవచ్చు." ఉత్తరంచూసి రాజం నిరుత్సాపడలేదు.

"ఉద్యోగం పోతుందంటే ఎందుకీ పెద్ద గొడవ?" అని రాజం తండ్రిని అడిగింది. "ఇతను రోజు ప్రొద్దుటే ఆఫీసుకి వెళ్ళి, సాయంకాలం బాగా అలసిపోయి ఇంటికి వస్తున్నారు. ఆయువంతా ఇలాగ ఉద్యోగం చెయ్యాలా?"

"అవును, నువ్వన్నది నిజం. మరెన్నో ఉద్యోగాలున్నాయి, మీ ఆయన ఎంచుకోడానికి. అతనూ నాలాగ ప్రొఫెసరు పని చెయ్యవచ్చుగా?" అని నటరాజన్ అడిగారు. రాజంకి ఉపాధ్యాయుడంటే మాన్యత, గౌరవం ఉందని అతనికి తెలుసు. ఆ వృత్తిలో ప్రతిభ ఉంది; ఇతరులకి జ్ఞానం అనుగ్రహించే ప్రతిష్ట కూడా ఉంది.

కాని విశాలం వెంటనే చర్చలో కలుసుకొని తన వ్యక్తిగత అభిప్రాయం చెప్పింది.

"ప్రొఫసరు ఉద్యోగం అంటే చులకనగా మాటాడవద్దు. ప్రొఫసరంటే ఎన్నో సంవత్సరాల బోధన తరువాత దొరికే గౌరవం అని గుర్తించాలి. అదేమో అంత సులభంగా దొరుకుతుందా? ఎవరికి తెలుసు, ఎంతమంది అల్లుళ్ళు అందుకోసం కాచుకొనివున్నారో? మరి, పోటీ కూడా కఠినంగానే ఉంటుంది."

"విశాలం, దానికి మన అల్లుడుగారికి అందరికంటే మంచి అర్హత ఉంది," అని నటరాజన్ భార్యకి గుర్తు చేసారు.

రాజం తన ఆత్మ విశ్వాసం వదులుకోలేదు. పెళ్ళైన రోజులనుండి ఆమె తీయని ఊహాలలో, కమ్మని కలల్లో మునిగి తేలుతోంది. ఆమెకు తెలుసు: ఆలస్యం కానీ, తన భర్తకి కొత్త ఉద్యోగం దొరికినవెంటనే అన్ని ఆశలూ  సఫలమవుతాయి.

ఆ రోజు తన పిన్నికూతురు పెళ్ళితరువాత రఘుపతి సెలవు తీసకున్నప్పుడు అతని ముఖం రాజం ఇప్పుడు గుర్తుచేసుకుంది. 'ఓ, అందుకేనా అతను ఎలాగో కనిపించారు?" అని తనలో నవ్వుకుంది. రఘుపతి ఏమన్నాడు? " . . . నాకెక్కడ ఉద్యోగం బదిలీ అవుతందని తెలిసినతరువాత, నావన్నీ transfer చేసుకోవచ్చు." ఆ మాటల్లోని చమత్కారం ఇప్పుడే రాజంకి బోధపడింది. అతనికి తనమీదున్న ప్రేమ, అనురాగం మారనేలేదు.

అతనికి ఆమె రాసిన ప్రత్యుత్తరంలో ఏ కటువూ, నిరాశా చోటుచేసుకోలేదు.

రఘుపతి మళ్ళీ ఆమెకు రాసాడు.

"అవును; నేనూ గమనించాను. నువ్వక్కడ ఆ రోజు చాలా సంతోషంగా కనిపించావు. నేను నీదగ్గర సెలవు తీసుకున్నప్పుడు నీ చుట్టు అందరు బంధువులు, స్నేహితులు కనిపించారు. ఇప్పుడు నువ్వు నీ తల్లిదండ్రుల ఆదరణతో రోజులు గడుపుతున్నావ్. నేనేమో అవివేకంగా నువ్వు ఇంకా నా ఉద్యోగం గురించే అల్లాడుతున్నావేమో అని బెంగ బెట్టుకున్నాను. ఇప్పుడు నీ ఉత్తరం చూసినతరువాత నాకు మనశ్శాంతి కలిగింది."

రఘుపతి ఏమంటున్నాడు?

రాజం బాగా ఆలోచించింది:

*నీ చుట్టు అందరు బంధువులు, స్నేహితులు . . .*

*నీ తల్లిదండ్రుల ఆదరణతో . . .*

ఈ రెండు వాక్యాలు ఆమె మనసులో మళ్ళీ మళ్ళీ మోదాయి.

*". . . ఒక వేళ మా అమ్మా, నాన్నగారిని చూడడానికి వెళ్ళాం అనుకో, అప్పుడూ నీకు ఇలాగేవుంటుందా? నాకలా అనిపించడంలేదు."*

*నాయనా, నాకు మతిపోయినట్లుంది . . .*

*అతనికి ఉద్యోగం లేదు. అందువలన . . .*

*నాకు నా అత్తమామలతో ఉండడానికి ఇష్టం లేదని అతను లోలోపల బాధపడుతున్నారా?*

తన ఆత్మతృప్తికి తగిన జీవితం లభిస్తుందని రాజం పూర్తిగా నమ్మింది. తన అత్తమామల సహవాసం గురించి ఆమె ఎన్నడూ అతృప్తి చూపలేదు. ఆ సంగతే భర్తకి విపులంగా ఉత్తరంలో తెలియజేసింది.

## 31

రఘుతి తన ఉద్యోగంకి సంభందించిన వ్యవహారాలు ముగించుకున్నతరువాత తన అత్తమామలని చూడానికి వచ్చాడు. అతని రాక సముచిత భావంతో, తగిన వేళలో, చక్కాగా ప్రదర్శింపబడిన ఒక కృతిలాగ అందరికీ తోచింది. అతిధి మర్యాదలందుకున్నతరువాత ఉత్సాహంతో అతను, రాజం మద్రాసుకి బయలుదేరారు.

పుట్టిల్లులో చురుకుగా కావేరీ నదిలాగ పాల్గొన్న రాజం ఇప్పుడు ఉత్సాహంతో నిశ్చలం, శాంతం, గాంభీర్యం ప్రకటించే కావేరీ నదిలాగ అత్తవారిల్లు చేరుకుంది.

ఆ వచ్చే శ్రీరామ నవమి ఉత్సవాల్లో రాజం పాడాలని శర్మగారు ఆమెను ప్రేరేపించారు. ఇన్ని రోజులూ తను సభలో పాడినప్పుడు శర్మగారుకూడా తన పక్కనే ఉంటారనే నమ్మకం రాజంలో చోటుచేసుకుంది. కాని ఇటీవల 'నేనే సౌజన్యంతో, ధైర్యంగా సభలో పాడగలను,' అనే ఆత్మవిశ్వాశం రాజంకి ఏర్పడింది. రాజం ఎన్నుకున్న కృతులు విని శర్మగారు ఆమెను అభినంధించారు. తను రెండు మాసాలముందు మద్రాసు వెళ్ళినప్పుడు, అక్కడ తను విన్న, చూసిన కచేరీల గురించి అతను గొప్పగా చెప్పారు.. ''అబ్బా, అక్కడ శ్రోతలకు సంగీతమంటే ఎంత ఆసక్తి, ఎంత మోహం! గానం వింటూంటే వాళ్ళు భోజనంకూడా మరిచిపోతారు! చాలామంది భోజనంకి ఇంటికి వెళ్ళక, సభలోనే రోజంతా గడిపారు!'' అని వివరించారు. అది విని రాజం నిర్ఘాంతపోయింది.

''నువ్వు మద్రాసుకి వెళ్తున్నావని విన్నాను. అమ్మాయి, నీకు ఆరుమాసాల అభ్యాసం చాలు, మంచి ప్రావీణ్యం రావడానికి.''

అతని మాటలు వింటూంటే రాజంకి తన సంగీత ప్రజ్ఞలో భ్రాంతి ఇంకా పెరిగింది.

"సార్, ఇప్పుడు నేను పాడదలచుకోలేదు. మద్రాసునుంచి తిరిగివచ్చిన ఆరు నెలల తరువాత నవరాత్రుల పండుగల్లో పాడతాను. అప్పుడు నాకు మంచి పేరు, ప్రతిష్ట రానున్నాయని నాకు నమ్మకం ఉంది."

"భేష్, అలాగుండాలి," అన్నారు శర్మగారు. "నీ ఆశలు తప్పక సఫలమవుతాయి."

రఘుపతికి రాజంగురించి ఎటువంటి సంశయమూ లేదు. ఇంపైన ధోరణితోబాటు ఇప్పుడు ఆమె కళ్ళలో కాంతి, నడకలో నిదానం, గమనంలో లావణ్యం చోటుచేసుకున్నాయి. అతనికి తన పరిస్థితిగురించి విచారం కొంచెం తగ్గిందికూడా. ఎప్పటిలాగే అతని దృష్టిలో రాజం త్రాణతో, ఉత్సాహంతో కనిపించింది.

"మద్రాసు సెంట్రల్ స్టేషన్ లో కాలుబెట్టగానే నా గుండె ఎలా ఝల్లుమంటుందో అని కల్పన చేసుకునేదాన్ని; ఇప్పుడు మద్రాసే మన ఇల్లైపోయింది," అని రాజం ఉత్సాహంతో అన్నమాటలు విని రఘుపతి ఒక చిరునవ్వు నవ్వాడు.

"నీకు మద్రాసంటే చాలా ఇష్టంకదూ?" అని అతను అడగ్గానే, రాజం మళ్ళీ అడిగింది: "అక్కడ B.A. చదివిన రోజుల్లో మీకు పాటకచేరీలకు వెళ్ళడం అలవాటని విన్నాను." తటాలున ఆమె తన ఆలోచన వేరే దిశలో దిక్కు మార్చుకుంది.

రాజంకాని తన సొంత ఊరులోకాక చెన్నపట్టంలో ఉండివుంటే ఆమెకు సంగితంలో మంచి నైపుణ్యం కలిసివచ్చేది అని అందరూ చెప్పుకునేవారు. తన ఉరులో తన సంగీత ప్రజ్ఞ పెంచుకోవడానికి ప్రమేయం లేదు. అంతేకాక అక్కడున్న ఆంధ్రులకి కర్ణాటక సంగీతంలో చెప్పుకోతగిన ఆసక్తి లేదు. ఇది గుర్తుచేసుకొని రాజం మౌనం వహించింది; రఘుపతికూడా మరేం అడగలేదు.

కాని రాజంకి తన మౌనం సముచితమని అనిపించలేదు. అకస్మాత్తుగా ఆమెలో విసుగు, విరక్తి చోటుచేసుకున్నాయి. తను ఇప్పుడు అనుభవించేది సహజమేనా? లేకపోతే భవిష్యత్తులో తనకు రాబోయో దుర్దశకి ఇది ఒక సూచన అని అర్థం చేసుకోవాలా? ఏది ఏమైనా తన నిరుత్సాహాన్ని ఎలా వెల్లడించడం అని రాజంకి తెలియలేదు. ఆమె మసనులో ఒక కృతి గురించి మాటాడినప్పుడు గాయకుని ప్రదర్శనతోబాటు ఆ కవితారచన లక్షణాలన్నీ సమేతంగా, బిగువుగా పని

చెయ్యాలనే భావన ఉంది. అటువంటి సంబంధం కృతి, ఆంధ్రులు, తన భర్త మధ్య కూడా ఉందని రాజం గ్రహించింది. ఈ కట్టుబాటులు మీరి మెలగడానికి రాజం చాలా శ్రమపడింది. ఇంతకీ ఆమె పుట్టిపెరిగిన వాతావరణంలో ఆంధ్రుల సంప్రదాయాలూ, వాడుకలు గూఢంగా ఆమెలో నాటుకున్నాయి. స్వాభావికంగా ఆమెకు సంగీతంలో ఉన్న ప్రేమ కూడా ఒక కారణమని చెప్పాలి.

మౌనం మానుకొని రాజం మెల్లగా మాటాడింది: "కలకత్తాలో భవాని అక్కయ్య తరచుగా పాటకచేరీలకి వెళ్ళేవారని విన్నాను. మరి నాగపూరు గురించి నాకు తెలియదు. నేను ఉత్తరాల్లో సంగీతంగురించి ఆవిడని ఏమీ అడగను. కాని అక్కడకూడా పాటకచేరీలు అందుబాటులో ఉండివుండవచ్చు. తమిళులు తమ దేశం విడిచి వెళ్ళినా సంగీతంలో తమ ఆసక్తిని వదులుకోరు. వాళ్ళు మరెక్కడ నివశించినా, ఉత్తరదేశంలోకానీ, పశ్చిమ, తూర్పు ప్రాంతాల్లో కానీ - ప్రశిద్ధ గాయకులన్ని పిలిచి కచేరీలు ఏర్పాటు చేస్తూవుంటారు". అప్పుడు రఘుపతికూడా "అంతేకాదు. విదేశాల్లో ఉండే తమిళులకీ ఆ ఆసక్తి వుంది!" అన్నాడు. గభీమని రాజంని భయం కప్పుకుంది: 'దేవుడా, ఈ వంకలో తన భర్త ఈ సంభాషణని ఆంధ్రుల, తమిళుల సంగీత గుణవిశేషణలు, వాటి తారతమ్యాలగురించి విమర్శలో మళ్ళించుతారేమో?' అనే కలత. వేదనతోబాటు కళ్లలో భారమూ చోటుచేసుకుంది. రైలు గమనం ఆమెని మెల్లగా నిద్రలో లాగింది.

"ఇలాగే కొంచెం రెస్టుతీసుకోనా?" అని రాజం అడగ్గానే రఘుపతి సరే అని కనుబొమ్మలతో ఆమోదించి ఆమె అనువుకొసం తన కాళ్లు కదిపాడు. రాజం తన అదనపు హక్కులు అమలుజేయబోతోందని గ్రహించి అతను తనలో నవ్వుకున్నాడు.

రాజం నిద్రపోవాలని ప్రయత్నించింది, కాని ఒళ్ళంతా గిలిగింతలు పెడుతుంటే నిద్రెలా వస్తుంది? "పగటిపూట నాకు నిద్ర రాదేమో?" అని విసుగ్గుంటూ లేచి కూర్చుంది. కాని మరుక్షణమే 'నాకెందుకీ బిడియం?' అని మనసు మార్చుకొని మళ్ళీ నిద్రలో వాలింది.

“బాగుంది ఇక్కడ, అసలు ఉయ్యాలలాగుంది!” అని రాజం నవ్వింది. “మీరు నాకేమైనా కథ చెప్పండి, అలాగే నిద్రపోతాను!” అని భర్తని అడిగింది.

రఘుపతి ఆమె చేతికి ఒక పుస్తకం అందించాడు.

రాజం నవ్వుతూ “అదేంటి?” అని అడిగింది.

“చిన్నకథల పుస్తకం. నా స్నేహితుడొకడు నాకు బహుమతిగా ఇచ్చాడు. వాడికి పుస్తకాలంటే పిచ్చి,” అని రఘుపతి నవ్వాడు.

“అబ్బా, ఆఖరికి మీరేదో రెండు వాక్యాలు మాటాడారు . . . ఇంతవరకూ నేనే మాటాడాను. ఇక నేను గప్ చిప్ . . .” అని అంటూ రాజం పేజీలు తిరగవేసింది.

ఎప్పుడో ఒకసారి ఏదో పత్రికలో తను చదివినది రాజం ఇప్పుడు గుర్తు చేసుకుంది: కొత్తగా పెళ్ళైన భార్యాభర్తలు గడిపే రాత్రులలో సంభాషణ అంతా ఒక పక్షమే ఉంటుందని: భర్తే అన్ని సంగతులు మాటాడతాడు; భార్య అవన్నీ మౌనంగా, భయభక్తితో వింటూంది. కాని ఆ తరువాత దాంపత్యంలో దానికి వ్యతిరేకం. భార్య ఎది చెప్పినా భర్త వినాలి, భరించాలి. ఈ చతురోక్తిని రఘుపతితో పంచుకోవాలని రాజంకి ఆకాంక్ష కలిగింది. కాని ప్రయాసతో ఆమె ఏమీ అనలేదు; పేజీలు తిప్పుతూ కొన్ని నిమిషాలలో నిద్రపోయింది.

నిద్రలో సగం మూసుకున్న ఆ కళ్ళు, వాటిమధ్య ఒలుకుతున్న మందహాసం రఘుపతి భ్రమతో చూసాడు: ‘ఎంతమంది కవులు ఈ మల్లెపువ్వులు, తామర పుష్పాల గురించి పాడారు! ఆ కాళిదాసుతోబాటు తక్కిన కవులు చూసి ఆనందించి, వర్ణించిన అదే దృశ్యం మనమూ చూస్తున్నాం. ఏంత వినోదం, మాటిమాటికి అదే అద్భుతం ప్రకృతిలో సాగుతోంది!’ అని రఘుపతి మనసార రాజంని అభినందించాడు. ‘రాజం ఒక అపురూపమైన యువతి. ఆమె ముందులాగే నాకెప్పుడూ కనిపిస్తోంది,” అని విస్తుపోయాడు.

అసలు రాజంలో ఎటువంటి మార్పు రాలేదన్నది నిజం. రాజం మనసులో నిరుత్సాహం చోటుచేసుకోలేదని రఘుపతి ఊహించినది సరే. కాని అతను గురితప్పిన ఒక కారణమే ఇప్పుడు రాజంకి ఆసరా ఇచ్చిందని చెప్పాలి. ప్రస్తుతం తన భర్త నిరుద్యోగి అని రాజం బాధపడలేదు. తను ఇక జీవించబోయే మద్రాసు

రోజులగురించే ఆమెకు కలలు, ఊహలుతో కలిసివచ్చిన ఆనందం. ఇప్పుడు రాజంకి భర్తముందు ఎటువంటి బిడియమూ, మూకీభావమూ లేదు. తన అత్తమామల ఇల్లు తన ఇల్లే; ఇక త్వరలో చెన్నపట్ణంలో సభల్లో కచేరీల్లో తను పాల్గొనడానికి అవకాశాలు ఏర్పడతాయి; అదృష్టవశంగా తన మామగారు అక్కడ పెద్ద ఉద్యోగంలో ఉన్నారు; ఈ చిన్న చిన్న సంగతులే ఆమె ఆహ్లాదంకి కారణం, కాని రాజం తన ఉల్లాసం తనలోనే అణచుకుంది. ముఖంలో కనిపించేది ఎప్పటిలాగే కాంతి, మందహాసం. కాని ఈ కలలూ, ఆశలూ, రఘుపతి ఎరుగడు. అతని భావన అంతా " సరే, రాజం సంతోషంగా ఉంది, అదే నాకు కావాలి," అనే సంతృప్తి.

"నీకున్న ఉద్యోగం పీకేసి, నాకెందుకు భగవంతుడు ఈ పదోన్నతి ఇచ్చాడో నాకు అర్థం కావడంలేదు! ఇది నేను ఎన్నడూ ఎదురుచూడనిది. నీ జాతకంలో నీకిప్పుడు మంచి దశకాదని నాకు తెలుసు, కాని ఈ ముసలివాడికెందుకు హఠాత్తుగా ఈ భాగ్యం? భగవంతుని లీలలు ఎవరికీ బోధపడవు!" అని విచారంతో దొరస్వామి రఘుపతికి ఒక ఉత్తరంలో రాసారు. రఘుపతి తన అత్తమామలని చూడడానికి వచ్చినప్పుడు ఆ ఉత్తరం రాజంకి చూపాడు. అది చదివిన వెంటనే, ఆవేశంతో రాజం తను విన్న ఒక తమిళ సినిమా పాటలో - చెన్నపట్ణంకి ఉత్సాహంగా పయనించే రీతిలో రాసిన పాట అది - కొన్ని పదాలు వచనరూపంలో ఉచ్చరించడం ఆరంభించి, వెంటనే ఆపుకుంది. ఐనాకూడా రఘుపతికి రాజంకి చెన్నపట్ణం జీవితంలో ఉన్న ఆసక్తి, మోహం తెలియదు.

సెంట్రల్ స్టేషన్ లో రాజం, రఘుపతి దంపతులని కలుసుకోడానికి దొరస్వామి ఒక నౌకరుని పంపారు. టాక్సీలో ఎక్కి కూర్చున్నవెంటనే నవ్వుతోబాటు రాజంనోటినుంచి వచ్చిన మాటలు ఇవే: "మనం ఇప్పుడు ఇంటికి వెళ్తున్నాం!" "ఇదిగో ఇల్లు, మనం చేరుకున్నాం!" అని నౌకరు మాటలు వినగానే రాజం కళ్ళకి ఆ రోడ్డులో రెండు పక్కలా వరుసగా బంగళాలు కనిపించాయి.

ఒక పెద్ద బంగళా గేటు ముందు టాక్సీ ఆగింది.

"టాక్సీ లోపలికి వెళ్ళదేం?" అని రఘుపతి అధికార ధ్వనిలో అడిగాడు.

"టాక్సీ రోడ్డులోనే ఉండాలి సార్," అని నౌకరు చెప్పాడు.

“రండి, మనం దిగుదాం,” అని రాజం భర్తకి చెప్తూంటే దొరస్వామి వాళ్ళముందు కనిపించి, “ఇంకా దిగరేం?” అని అడిగారు.

‘ఇతనెలా గభీమని వచ్చారు చెప్మా?’ అని రాజం ఆశ్చర్యంతో చుట్టుపక్కలు తిరిగి చూసింది.

మామగారు నిలబడియున్న జాగాకి కొంచెం దూరంలో ఒక కాలిబాట కనిపించింది; అది ఒక బంగళాకి దారిచూపింది, కాని దాని తోవ ఒక మలుపు తరువాత మళ్ళీ వేరే మార్గంలో సాగుతోంది . . . అక్కడ నిలబడియున్న స్త్రీ ఎవరు? ఎందుకు అత్తగారు అక్కడ నిలబడివున్నారని రాజం ఆలోచించింది. అదే సమయం ఆ బంగళామంటపంలో ఉన్న కారుని చూసింది.

“ఇదే మా జాగా,” అని దొరస్వామి వాళ్ళకి చెప్పారు. “ఈ బంగళాకి యజమాని రామశేషన్; అతను తను వాడుతున్న జాగా మా వసతికి పూర్తిగా ఇచ్చేసారు. మా ఇద్దరికి ఇది చాలు,” అని అంటూ నవ్వారు. రాజం చేతిలో బుట్టనందుకొని ముందుకు నడిచింది. అప్పుడు ఆ బంగళానుండి ఒక యువతి త్వరగా బయటకివచ్చి, కారెక్కి ఇంకొక గేటుద్వారా నిష్క్రమించడం గమనించింది.

“రా . . . రా!” అని శారదాంబాళ్ రాజంని ఇంట్లోకి పిలిచింది. రాజం గుమ్మం దాటగానే, వొంగి అత్తగారిని నమస్కరించింది. “మీరు ఆ బంగళాలో ఉన్నారని నేను పొరబాటు పడ్డాను!” అని అంటూ భర్తని తిరిగి చూసింది. “మీకూ అలాగే తోచిందికదూ?” అని అడిగింది.

రఘుపతి నవ్వుతూ ఆమెను ఆమోదించాడు. శారదాంబాళ్ అతనితోబాటు నవ్వుతూ “సరే, అబ్బాయి ఇక్కడకి వచ్చేసాడు; మరి నాన్నగారికి మంచి జాగా కనిపెట్టనీ, అతనేం కాదంటారా?” అని అడిగింది.

రాజంకి ఆ చిన్న ఇల్లు తన మామగారి నిరాడంబర ధోరణికి - అతనికి వచ్చిన కడపటి పదోన్నతి తరువాతకూడా - ఒక నిదర్శనంగా కనిపించింది. అత్తగారికి అప్పడాలమీద ఆసక్తి ఏమాత్రం తగ్గినట్టు కనిపించలేదు. ముందొకసారి ఎప్పుడో ఒక ముత్తైదువ శారదాంబాళ్ గురించి మాటాడుతూ ఆమెను ‘ఒక ముసలావిడ,’ అని సూచించినప్పుడు రాజం గట్టిగా అలా కాదని వక్కాణించింది; అది ఇప్పుడు రాజం

గుర్తుచేసుకుంది. 'అవాళ నేను నా అత్తగారి గురించి ఆ ముత్తైదువకి సరిగ్గా ఒక మంచి పాఠం చెప్పాను. ఒక అసాధ్యమైన, చురుకైన స్త్రీకి కోడలు అనే స్థానంలో నాకు మంచి పేరు, ప్రశంస వచ్చాయి. ఐనాకూడా, నా స్నేహితులెవ్వరికీ నేనొక కోడలుగా కనిపించను,' అని రాజం గర్వపడింది. శారదాంబాళ్ సముఖంలో రాజంకి సహజంగా భయము, భక్తి ఉన్నాయి. కాని వాటితోబాటు, ఆవిడ సమక్షంలో తన స్త్రీజాతి లక్షణాలు మరీ అధికమైన శోభ, తళుకుతో ధగధగలాడుతున్నట్లు రాజంకి తోచింది. రాజం, రఘుపతి కొత్తగా కాపురం ఆరంభించిన రోజుల్లో ఎదురుచూడని కొన్ని సమస్యలు తలకెక్కడంతో రాజం తత్తరపడిందన్న మాట నిజం; అందువలన తను ఇతరులమీద ఉత్తికే చికాకుపడడం, అలసటతో పూర్తిగా అరిగిపోవడం ఆమెకు తెలుసు. కాని అటువంటి ఇక్కట్లనుంచి తప్పించుకోవాలంటే తనకీ అత్తగారికి మధ్యవున్న బంధం ఇంకా దృఢంగా పెరగాలి; అప్పుడే తన ఆదర్శం, ఘనత సఫలమవుతాయి. శాస్వతంగా ఒక స్త్రీకి ఏం కావాలి? ప్రియమైన భర్త, ప్రసన్నమైన అత్తగారు. కోడలుగా తను ఇంతకుముందు అనుభవించని అధికారం, స్వభావం ఇప్పుడు తనలో చోటుచేసుకున్నాయని రాజం నమ్మింది; దానికితోడుగా ఆమెకు మనశ్శాంతి కూడా లభించింది.

రాజంకి ఇప్పుడు కొత్త స్నేహితులు, సన్నిహితులతోబాటు, వాళ్ళ మెచ్చుకోలు కూడా అపరిమితంగా దొరికింది. 'నాకూ నా అత్తగారికి మధ్యవున్న ఆత్మీయతచూసి ఎంతమంది దిగ్భ్రమ పడుతున్నారో?' అని రాజం పదే పదే తనంతటతనే విస్తుపోయింది.

ఒకరోజు ఏమఱుపాటున ఆమె శారదాంబాళ్ కి ఇలా చెప్పింది.

"మేం ఆరంభించిన కాపురం ఎనిమిది మాసాలలో మూసేసాం, ఆ ఎనిమిది మాసాలూ అలాగే లటుక్కున గడిచిపోయాయి! నాకుగాని అలా అవుతుందని ముందే తెలిసివుంటే మిమ్మల్ని తప్పకుండా రమ్మని పిలిచివుంటాను." తనంతటతనే ఎటువంటి సంకోచం, అసభ్యత లేకుండా రాజం మాటాడింది. కాని దానికి అనుక్రియగా ఏదీ ఆమె చెవుల్లో వినబడలేదు; శారదాంబాళ్ ప్రత్యుత్తరం

పలుకలేదు. ఇద్దరూ తిరగలి త్రిప్పుతున్నారు. మీదున్న బండ తిరుగుతోంది. కిందది కదలనేలేదు.

"మంచివేళ నాన్నగారు (రాజం దొరస్వామి గురించి మాటాడుతోంది) వచ్చి మేం అక్కడ స్థిరపడడానికి సాయం చేసారు. అతను మా ఇల్లూ, ఊరూ చూసారు. మీకది వీలుపడలేదు." ఎందుకోగాని, ఈ మాటలు రాజం తడబడుతూనే పలికింది.

శారదాంబాళ్ తిరగలి త్రిప్పడం ఆపి మాటాడింది.

"రఘుపతికి స్థిరంగా ఉద్యోగం లేదని మాకు తెలియదా? తొందరపడి ఎందుకు ఇప్పుడే కాపురం పెట్టాలని నాకు తోచింది. కాని మీయిద్దరూ తొందరపడి కాపురం పెట్టాలని తీర్మానించారు, ప్లాను వేసారు, నేను మరేం అనక నోరు మూసుకున్నాను. ఈ వ్యవహారం అబ్బాయి, మామగారు, కోడలు - మీ ముగ్గురుకే వదిలేసాను."

ఇన్ని రోజులూ స్థిరమైన మెట్లమీద తను నడుస్తున్నట్టు కలలు కంటున్న రాజంకి ఇప్పుడు తను ఒక నిలకడలేని నిచ్చెనమీద ఊగిసలాడుతున్నట్టు తోచింది. నోరు వట్టికట్టిపోయింది. మాటలేవీ రాలేదు. కన్నులు మకమకలాడాయి. చెయి మాత్రం అలవాటుగా తిరగలిని త్రిప్పుతూనేవుంది. సువాసనకి అగరుబత్తికి ఒక అగ్నికణం చాలు, కాని ఆ అగ్ని అతిగా మారకూడదు, లేకపోతే పెద్ద ప్రమాదంకి దారితీయవచ్చు; సుగంధం మాయమవడంతోబాటు అగ్ని అన్నిపక్కలా వ్యాపించుతుంది. శారదాంబాళ్ మాటల్లో ఇప్పుడు రాజం అనుభవించినది అగ్ని మాత్రమేకాదు; రాజంని ఉత్తేజపరిచే దయ, మమకారం అందులో పూర్తిగా నశించిపోయాయి. ఎవరో ఒక కొరవిని తీసి తన గుండెలో ఎగరవేసినట్టు రాజంకి తోచింది.

'అసలు మేం ఏ ప్లాను వేసాం? ఏవో రెండు మూడు ఉత్తరాలు పరివర్తన చేసుకున్నాం, అంతే. వేరే వేరేగా నిరుత్సాహంతో మునుగుతున్న రెండు ప్రాణాలకి మరెలాగ విముక్తి వస్తుంది? మా సంభాషణ, రాకపోకలు, వేదన, క్షోభ - అన్నీ మాయిద్దరి మనసులలోనే అట్టిపెట్టుకున్నాం; అనుభవించాం . . . '

రాజం మౌనం వహించింది, కాని లోలోపున చిరచిరలాడింది; వచ్చిన ఏడ్పుని ఎలాగో అణచుకుంది. మనసు అంధకారంలో తేలుతున్నట్టు కనిపించినా పరిసరాలు

తను అనుభవించేది భ్రమకాదని ఆమెకు గుర్తు చేసాయి. శారదాంబాళ్ దృక్పధంలో హఠాత్తుగా కనిపించిన ఈ మార్పు రాజంని అదరగొట్టింది. ఇంతకుముందు తన్ను ఇంత తీవ్రంగా ఏ సత్యమూ హడలగొట్టలేదని రాజం నమ్మింది.

'ఇప్పుడు నన్ను నిందలకి గురి చేస్తున్నది ఎవరు?'

ఈ ప్రశ్నే రాజంని కలవరపరిచింది. దయ, సౌజన్యంతో తన్ను ఆదరించిన స్త్రీయేనా ఇప్పుడు తనమీద ఈ దూషణలు విసురుతున్నారు? మరి సహానుభూతితో ఆవిడ తనకి రాసిన ఉత్తరాలు, ఆ ప్రకాశవంతమైన ఆ స్వరూపంలో తను చూసి అనుభవించిన ఉత్కంఠ భావన - అవన్నీ తన కల్పన అని అర్ధమా?

ఆశ్చర్యమూ, దిగ్భ్రమ రాజంని ఆగట్టుకున్నాయి.

కాని స్వభావసిద్ధంగా ఆమెలో కనిపించిన ఔదార్యం రాజంకి తోడిచ్చింది. తనంతటతనే ఇతరుల సహవాసం కోరుతూ ఆమె రోజులు గడిపింది.

కాని ఆమె మానసిక వేదన ఏమాత్రం తగ్గలేదు. 'నేనేం తప్పు చెయ్యలేదే, ఎందుకీ చిన్న చిన్న ఘటనలు మళ్ళీ మళ్ళీ ఎదురుపడుతున్నాయి?' అని రాజం కించపడింది.

తను వేరే కాపురం ఆశించడం, తన కలలు సఫలమవాలని కోరడం తప్పా?

తన సన్నిహితులు, రాజం శ్రేయస్సు కోరేవారు తన అభిలాషకి ఎందుకు అడ్డంగా ఉన్నారు?

రాజం విరుద్ధమైన ఈ భావనలతో పోరాడింది. తన ఆశలు, వాంఛలు, వాటికి కారణాలు, హేతువులు ఆమె బాగా అర్ధం చేసుకోవాలని ప్రయత్నించింది. ఎటువంటి సమయంలోనూ తన ప్రాధమిక లక్షణాలు - నీతి, యోగ్యత - తను నిలుపుకోవాలి. మరి తను ఇప్పుడు ఏం చెయ్యాలి?

చెవుల్లో ఒక మారుమ్రోత వినబడింది: "జాగ్రత్త! నువ్వు అందరి అనురాగం, అభిమానం కూడబెట్టుకున్నావని గర్వపడవద్దు. 'సామాన్యంగా ప్రజలందరూ మంచివాళ్ళే; వాళ్ళలో పక్షపాతం లేదు,' అనే భ్రమని వదిలిపెట్టు! అత్తగారు, కోడలు మధ్య చుట్టరికం ఒక అనిశ్చితమైన నియమం అని తెలుసుకో! అది

గులాభీపువ్వురేకలాగ. అంటే చాలా సున్నితమైనది; ఉత్తికే ముట్టుకుంటేనే సుళువుగా రాలిపోవడానిరి అవకాశముంది.”

కృత్రిమ పువ్వులతో తన జుత్తు అలంకరించుకోవాలని రాజం ఎప్పుడూ ఆశించలేదు. ఎవరికీ కనిపించకపోయినా తను తలలో దోపుకున్న గులాభీ ప్రసరించే సైజమైన సుగంధమే ఆమెకు ఇష్టం; ఆ పరిమళం, సరళత తను రూఢిగా భద్రపరచుకోవాలి.

## 32

మద్రాసుకి వచ్చి రెండువారాలయ్యాయి, కాని రాజం బంగళా గేటు దాటనేలేదు, మరెక్కడికీ వెళ్ళలేదు.

అత్తగారితో రాజం రామశేషన్ దంపతులని కలుసుకుంది - వాళ్ళు బంగళాలోనే ఉంటున్నారు. రఘుపతి ఒంటరిగా వాహ్యాళి వెళ్ళినప్పుడు నిరాధారంగా చూస్తూ నిట్టూర్పు విడిచింది; గత కాలంలో భర్తతో బయటకు వెళ్ళడం రాజంకి అలవాటే; తనకి ఆ హక్కు ఉందని ఆమెకు తెలుసు, కాని ఇప్పుడు ఆ కోరిక ఆశగానే నిలిచిపోయింది. సరసమైన పిలుపులేవీ రాలేదు. తన ఎనిమిది నెలల కాపురంలో రాజం అల్పసంతోషిగా రోజులు గడిపింది. ఆ కారణంవలనే ఇప్పుడు ఆమె ఓర్పులో నీరసం చోటుచేసుకుంది. ఇచ్చలను త్రోసిపుచ్చింది. ‘నాకెందుకీ వాహ్యాళి నా భర్తతో, ఇదేం ముఖ్యమా?’ అనే భావన రాజం మనసులో నాటుకుంది.

రఘుపతికీ అలాగే తోచింది. కాని రాజంకి కచేరీలంటే అపేక్ష అని అతనికి తెలుసు. రెండుమూడు సార్లు రాజంని తృప్తిపరచాలని అతను ప్రయత్నించాడు.

“ఇక్కడ పక్కనే ఒక సంగీత సభ ఉంది; అందులో మెంబరవుదాం,” అని తల్లికి చెప్పాడు.

“ఎందుకురా డబ్బు అలా తగలబెట్టాలి?” అని వెంటనే శారదాంబాళ్ అడిగేసింది. “మీ నాన్నగారికి అటువంటి ఆటాపాటలు నచ్చవు!”

కొన్నిరోజులతరువాత జరగబోయే ఒక పాట కచేరీ గురించి రఘుపతి తల్లితో ప్రస్తావించాడు.

“కచేరీలకెందుకు డబ్బు ఖర్చుపెట్టాలి? ఆ సొమ్ముకి నేను వంద అప్పడాలు వొత్తగలను. ఐనా మనకెందుకీ కచేరీ గొడవ అంతా? నువ్వు వెయ్యి రూపాయలు లంచమిచ్చినా ఎవరైనా నాలాగ అప్పడాలు వోత్తగలరా చెప్పు ? . . . ”

రఘుపతికూడా తల్లితో కలిసి నవ్వేసాడు; రాజంగురించి పూర్తిగా మరిచిపోయాడు.

రెండుమూడురోజుల తరువాత ఒక కచేరీ గురించి పత్రికలో చదివాడు. ‘ఇదెవరూ మిస్ చెయ్యకూడదు!” అని అందరూ అన్నారు. మరేం ఆలోచించక ఆ సంచికతో వంటగదిలో ప్రవేశించాడు.

“ఇదెవరి కచేరీ అని నీకు తెలుసా?” అని రాజంని ప్రకటన చూపుతూ అడిగాడు. తనకున్న ఆసక్తి వలన రాజమూ భర్తని ఆమోదిస్తూ ఆ నిమిషం తన అమరిక కోల్పోయింది. “చూడండి, ఇతనికెంత ఉత్సాహమో? ఐనా టికెట్లు అంత సులభంగా దొరుకుతాయో లేదో?” అని మాటవరుసకి చెప్పింది.

“నేను వెంటనే కొంటాను,” అని రఘుపతి దుడుకుతనంతో అన్నాడు. “అమ్మా, చెప్పు, నాలుగు టికెట్లు బుక్ చెయ్యమంటావా?” అని అడిగాడు.

శారదాంబాళ్ పుత్రుని వినయం బాగా మెచ్చుకుంది కాని కోడలు కోరికని అనుమతించడానికి ఆవిడకి ఇష్టం లేదు.

“ఎందుకు నాలుగైదు టికెట్లు? కావాలంటే నువ్వు వెళ్ళు, లేదు, నీ పెళ్ళాంతో వెళ్ళు.”

‘నీ పెళ్ళాంతో’ అన్న రెండు పదాలు అబ్బాయికి ఆమె ఇచ్చిన ఒప్పుకోలు. రఘుపతికి ఎది ఇష్టమని ఆవిడకి తెలుసు.

ఆ తల్లికి కచేరీకి వెళ్ళడానికి ఇష్టం లేదు. తల్లిదండ్రులతో ఉంటున్న పుత్రుడు ఒంటరిగా పెళ్ళాంతో కచేరీలకి వెళ్ళడు. అది ప్రకృతిలో సహజంగా కనిపించే ధోరణి. రఘుపతిలో కనబడే భయమూ, మూకీభావమూ అతను తనంతట తనే ఎదీ చెయ్యడు అని ఋజువైంది.

ఉత్తికే ఏదో చెప్పి ఆక్షేపణ చూపే మనిషికాదు శారదాంబాళ్. దంపతులు తమకేది ఇష్టమో అదే చెయ్యనీ. అందుకు ఆవిడకి అభ్యంతరం లేదు; ఆఖరికి వాళ్ళ నిర్ణయమే చెల్లుతుంది.

ఇటువంటి వ్యవహారాల్లో ఆవిడ వైఖరి ఆ తరువాత వచ్చిన రోజుల్లో కూడా కనిపించింది.

ఆ చిన్న ఘటన తరువాత రాజం, రఘుపతి కొంచెం జాగ్రత్తతో మెలిగారు. తను ఆశించినట్టే రాజంకి బంగారపు తీగవంటి సుతిమెత్తని గుణముందని రఘుపతి సంతోషించాడు. సమయానికి తగినట్టుగా ఆమెలో కనిపించే అనుసరణ అతనికి తోడ్పడింది. తల్లికి ఎదురుగా రఘుపతి ఏదైనా పూనుకుంటే, రాజం అంతర్బుద్ధి తను అత్తగారికి విరుద్ధంగా అది చెయ్యకూడదని బోధించింది. అత్తగారికి వ్యతిరేకంగా ఏ పనీ చెయ్యడానికి రాజంకి వాంఛ లేదు, శక్తి లేదు. 'సరే, అలాగే కానీ; నా స్వభావం వలనే మా ఆయన పొగరుపోతుతనంతో ఎదీ చెయ్యరు,' అని రాజం తనంతట తనే తృప్తి పడింది.

ఇప్పుడు తనమీద అధికారం చెలాయించడానికి భవాని లేదు; తను అత్తగారిని మెప్పించుతే అది మంచిదే కదా? 'అసలు అదే ముఖ్యం, ఆదే ప్రధానం!' అని రాజం తీర్మానించింది. ఇంటిలోపల - బంధువులమధ్య సమ్మతి, అన్యోన్యం పెంచడం ఎంత గొప్ప! ఇంటి బయట జరిగే వ్యవహారాలు ఎవరికి కావాలి?అత్తమామల ప్రశంసకంటే వేరే గొప్ప బహుమానం ఏమైనావుందా?

ఈ విధంగా రాజం కలలు పతనమైయ్యాయి. 'నా లక్ష్యం,' అనే భావన ఆమెకు తోచనేలేదు.

అది 1947 సంవత్సరం. ఆఖరికి భారతదేశంకి ఆంగ్లేయుల పరిపాలన నుంచి స్వాతంత్ర్యం రాబోతుంది.

స్వాతంత్ర్యం. అందరి పెదిమల్లో అదే శ్రుతి. ఇంకా కొన్ని రోజుల్లో డెల్లీ ఎట్టకోట మీద త్రివర్ణ పతాకం ఎగరబోతుంది. ఆ శుభదినం అందరూ ఆతురతో ఎదురుచూస్తున్నారు.

ఆ తీయని సందేశం దేశమంతా - నగరాలు, పల్లెలు, వీధులు, మురికి పేటల్లోకూడా - జనులని పురిగొల్పింది. కాని ఆ వార్తలో పొదిగియున్న తాత్పర్యం అందరూ గ్రహించారా, అర్థం చేసుకున్నారా అని తెలియదు.

'స్వతంత్రత అంటే ఏమిటి?' అనే ప్రశ్న త్వరలోనే ఒక ప్రకటనగా మారింది. 'మనకి మన దేశంపై సర్వాధికారం వచ్చేసింది; మన కలలు నిజమవుతాయి, మనల్ని బంధించిన సంకెళ్ళు తోసిపారేసాం.' కేవలం ఆ భావనే చాలు, వింటే మనసుకి ఎంత ఇంపుగా, ఆహ్లాదకరంగా ఉంది!

ఆ నాదం రాజం చెవిలోనూ పడింది; ఆమెకు కూడా పరవశం కలిగింది; పెదవులు అల్లాడాయి.

కాని అది తన భవిష్యత్తులో ఒక మంచి సూచనగా ఆమెకు కనిపించలేదు. ప్రస్తుతం తన జీవితంలో మచ్చుకైనా సంతోషం లేదు; మరి వచ్చే రోజుల గతి ఏమవుతందని ఎవరికి తెలుసు? రాజం తన అత్తమామలతో గడిపిన జీవిత శైలికి స్వాతంత్ర్యం అనే భావన  విరుద్ధంగా - ఇంకా చెప్పాలంటే - ఒక దూషణగా కనిపిస్తోంది అని రాజం వాపోయింది. తనకు సంగీతంలో ఉన్న ఆపేక్ష, నెరవేరని అభిలాష - ఇవే తన మానసిక బాధకి కారణమని ఆమె గ్రహించింది. ధార్మిక, కళాత్మక లక్షణాలు తీర్చిదిద్దిన రాజం హృదయంలో అటువంటి ప్రతిస్పందన లేవడం సహజమేకదా?

ఇంటిలో ఒక తగిన వాతావరణంలో తన సంగీత ప్రజ్ఞ చక్కదిద్దుకోవచ్చు అని రాజం ఆశించింది. వయలిన్ అభ్యాసంకి తగిన వేళ, సమయం ఎప్పుడు వస్తాయా అని ఆతురతో ఎదురుచూసింది. అవేం జరగలేదు. "ఏవమ్మా, నీ వేలు ఇప్పుడెలాగవుంది? ఇక మళ్ళీ నీ వయలిన్ అభ్యాసం ఎప్పుడు?" అని అత్తమామల్లో ఎవరూ రాజంని అడగలేదు. ఆఖరికి ఒకరోజు రాజం తనే చొరవచేసుకొని అత్తగారితో "నేనిక నా వంకర వేలుతోనే వయలిన్ వాయించగలను," అని అన్నప్పుడు ఆవిడ ఆ క్షణమే రాజం అభిలాషని ఎగరగొట్టింది.

ఆవిడ రాజం వేలుని బాగా పరిశీలించింది. "ఇదంతా నువ్వు చేసుకున్నదే. నీవేమో ఎవరికీ చెప్పకుండా ఊరుకున్నావ్, అందువలనే డాక్టరుని పిలవడమైంది,

ఖర్చులు బాగా పెరిగాయ్," అని ఆవిడ అన్నప్పుడు రాజం మెల్లగా నవ్వి ఊరుకుంది. అసలు ఆరోజు గాయంతో బాధపడినప్పుడు రాజం నోటినుంచి ఏమాటా రాలేదు; నొప్పంటే అంత తీవ్రమైన నొప్పి; ఆ బాధ భరించ కలిగిన త్రాణ రావడానికి కొంత సమయం పట్టింది. అది అత్తగారికి తెలియదా?

పెద్దలని ఉత్తికే పొగడుతూ వారి దయ, అభిమానం సాధించడమో లేక మాటవరుసకి కృతజ్ఞత వ్యక్తపరచడమో రాజంకి ఇష్టం లేదు. ఆ అలవాటుతోనే ఆమె తన్ను చాలా ఆపదలనుంచి కాపాడుకుంది.

సంగీతం విషయంలో రాజంకి తన సాధకం గురించి అత్తగారి ప్రోత్సాహం కనిపించలేదు. రెండురోజుల తరువాత 'వయలిన్ వాయించడావికి నాకేం భయంలేదని వాళ్ళకి తెలియాలి; ఇంకా చెప్పాలంటే నాకు సంగీతంలో ఆసక్తి ఇంకా బాగా పెరిగింది,' అనే ఆలోచనతో రాజం వయలిన్ అందుకొని రెండు కృతులు వాయించింది. ఆ మరునాడు మళ్ళీ సాధకంకి పూనుకున్నప్పుడు దొరస్వామి ఇంటిలోకి ప్రవేశించడం చూసి, వయలిన్ వాద్యం మళ్ళించడానికి ప్రయత్నించింది. అతనినుంచి నోటిమాటగాగాని, సైగగాగాని, అనుమతి రాలేదన్న కారణంతో సాధకం సాగించక ఊరుకుంది. ఆ ఇంటిలో నివాసస్తలం అన్నమాటకి వస్తే మూడే మూడు భాగాలున్నాయి. మధ్య ఒక భాగం: దాన్ని ప్రధాన భాగమనవచ్చు - వంటగది తరువాత ముఖ్యమైన జాగా అది. అక్కడే దొరస్వామి భోంచేయడం, విశ్రాంతి తీసుకోడం అంతా. మూడవ భాగం వరండా. అటువంటి గృహంలో సాధకంకి కాలం, స్థలం సముచితంగా కుదరడం కష్టం. రఘుపతి ఆ మధ్యభాగంలో ఒక మూల కూర్చొని రేడియో వింటుంటాడు. "ఆ రేడియో కొంతసేపు మూసిపెట్టి నా పాట, వయలిన్ వినకూడదా?" అని అతన్ని బతిమాలాడాలని రాజం అనుకుంటుంది, కాని అడగదు. ఆమె ఆ ఇంట్లో ఎక్కడ సాధకం చేసినా అది పక్క గదుల్లో తప్పక వినబడుతుంది.

రాజంకి తన సమస్య బోధపడింది: తను చిన్న చిన్న విషయాలు తీర్చుకున్నా అవి గొలుసుకట్టులాగ మళ్ళీ మళ్ళీ ఆమెను ఎదురుతిరుగాయి.

ఆ ఇల్లే ఆమె నివాసం, అక్కడ నియమాలు ఆమె పాటించాలి; అదే తన బాధ్యత, ధర్మం అని రాజం నమ్మింది.  మామగారి అనువుకి తగినట్టుగా తను వయలిన్ అభ్యాసం మానుకోవాలి; ఏమైనా సరే, అత్తగారి అనురాగం, ప్రీతి భద్రపరచుకోవాలి. అసలు ఇతరులమనసు నొప్పించడంవలన తనకేం లాభం? 'నాకు అత్యాశ కూడదు!' అని రాజం నిశ్చయించింది. అత్తగారి నీడలోనే తన జీవితం సాగనీ; ఆవిడ మెప్పుదల, తృప్తి తనకి నిత్యమూ కావాలి.

కాని అదీ తన చేతిలోనుంచి జారిపోతున్నట్టు రాజంకి తోచింది!

ఇప్పుడు శారదాంబాళ్ మాటల్లో ఆత్మీయత కనిపించలేదు. ఆవిడ చూపులో లేతదనం చోడుచేసుకోలేదు. అత్తగారి ఆదరణతోపాటు రాజంకి  ఆవిడ సలహా, బోధనలకి అర్హతవుందికదా? మరి తను ఆవిడలో చూస్తున్న ఉపేక్ష, ఉదాసీనతకి ఏమైనా అర్థముందా?

స్వభావంగా రాజంలో ఉన్నత భావాలే ఏలుకున్నాయి. ఇతరుల ఉత్కృష్ట గుణాలు గ్రహించడమే ఆమెకు అలవాటు. ఏ విషయమైనా దాన్ని వ్యామోహంతో శ్రద్ధగా పరశీలించి దాని సారాంశం అర్థం చేసుకోవడం ఆమె లక్ష్యం. తనకి పెళ్ళయి అత్తగారింటికి వచ్చేసరికి రాజం తను పుస్తకాల్లో చదివి సాధించిన ప్రజ్ఞని లౌకికజ్ఞానంగా మార్చుకుంది. కొన్ని సమయాల్లో ఆమెలో బోళాతనం కనిపించినా అది ఎప్పుడూ బుద్ధిపూర్వకంగా జరగలేదు. ఆ సామర్థ్యంతోనే రాజం అత్తగారిలో తటాలున ఏర్పడిన మార్పు ఎందుకని గ్రహించింది.

రాజంకి పురాణంలో ఒక కథ తెలుసు. సరస్వతీ దేవి వాహనం హంస ముందు పాలు, నీరు కలిపి పెడితే హంస నీటిని వేరుచేసి పాలను మాత్రమే తాగుతుందట. రాజం తన్ను హంసగా భావించింది. ఇంతవరకూ రాజం మంచిదే కోరింది. కాని ఇటీవల తన సహజ భావంలో యోగ్యత, వంచన, వీటి మధ్య బేధమేమిటో తెలుసుకొనే శక్తి కొంచెం తగ్గినట్టు రాజం గుర్తుచేసుకుంది. అది ఎంత నిజమని ఇప్పుడే ఆమెకు  బోధపడింది.

రోజులు గడిచాయి. భవానిగురించి ప్రస్తావించినప్పుడు శారదాంబాళ్ అభిప్రాయంలో పెద్ద మార్పు రాజం గమనించింది. "దానికి నీలాగ అన్నీ తెలియవు.

అత్తమామలతో మెలిగితేనే ఒక అమ్మాయికి లోచూపు, లోకపరిచయం వస్తాయన్నడం ఎంత నిజం!," అని ఆవిడ మాటలువిని రాజం మురిసిపోయింది.

కాని మరుక్షణమే . . .

"భవాని ఉత్తి అమాయకురాలు. దానికి అమ్మా, అత్తగారూ ఒకటే అని భావన! తోడికోడలూ, ఆడపొడుచూ ఒకటే అని అనుకుంటుంది. భర్తకి ఉద్యోగం లేదంటే అలాగే కానీ అని ఏమీ అనదు! అందరినీ వెనకేసుకుని రావడం దానికి అలవాటు కాదు," అని శారదాంబాళ్ చెప్పి ముగించినతరువాతే ఆవిడ తన్ను పొగడడంలేదని రాజంకి బోధపడింది.

'నా భర్తకి ఉద్యోగం లేదంటే నా అర్హత అణిగిపోవాలా? అంటే నాకు సామర్థ్యం లేదని అర్థమా?' అని రాజం వాపోయింది.

ఒక రోజు రాజం రాసిన ఒక ఉత్తరంలో ఆమె వాడిన కొన్ని పదాలు చదివి దొరస్వామి తన అభిప్రాయం తెలియజేసారు. "మాటిమాటికి భవాని 'నిస్సందేహంగా', 'అవును, తప్పకుండా,' అనే పదాలు వాడుతోంది," అని బలవంతంగా వచ్చే నవ్వుని ఆపుకొని అతను అన్నారు. వెంటనే శారదాంబాళ్ రోషంతో "అవును, మీరన్నది నిజం. భవానికి కపటమంటే ఏమీ తెలియదు!" అని వాదించింది.

మరికొన్నిరోజుల తరువాత మళ్ళీ అదే పాట: "భవాని అమాయకురాలు, సాధువు. దానికి తేటమనసు. తన మనసులో ఏముందో అది అలాగే చెప్పేస్తుంది! అది మంచిదికాదు. ఒకరి స్వభావం మనకి తెలిసినతరువాత మనం కొంచెం జాగ్రత్తగా మెలగడం నేర్చుకోవాలి. ఎవరనీ సూటిగా పురిగొల్పకూడదు. లేకపోతే మనకే చెడ్డపేరు."

అప్పుడే రాజం మనసులో ఒక చిన్న అనుమానం లేచింది: శారదాంబాళ్ తనకు చూపిన నాజూకు, అనురాగం - వీటికి అసలు కారణం ఏమైయ్యుంటుంది? తను ఒక క్రూరమైన అత్తగారు కాదు అని ఋజువు చెయ్యడానికా? ఆవిడ చూపిన అనురాగంలో ఇప్పుడు మార్పు కూడా కానవచ్చింది. రాజంపై ప్రేమ తగ్గడమేకాక భవానిపై అది అధిగమించింది; భవానిలోవున్న లోపాలు శారాదాంబాళ్

గుర్తుపట్టలేదు; ఒక తల్లికి అది సహజమే అని తెలిసినా రాజం అపనమ్మకంతో పోరాడింది.

'భవానికి అమ్మా, అత్తగారూ ఒకటే!' అనే భావన గురించి అత్తగారు పదే పదే వక్కాణిస్తున్నారు. వారిద్దరూ సమానమవవచ్చు, కాని భవాని ఇద్దరినీ తుల్యంగా భావించుతోందా? మరి రాజం సంగతో? తను చూపే ప్రేమ, అనురాగం కపటమా? ఆ బావన రాగానే రాజంని జుగుప్స ఆవరించుకుంది; భర్తకు బదులు వేరొకరు తన్ను ముద్దాడుతున్నట్టు ఆమె చీదరపడింది. 'భవాని తన భర్త సత్యమూర్తిపై చూపే ప్రేమకీ, నేను మా ఆయనపై చూపే ప్రేమకీ ఏమైనా భేదం ఉందా? భర్తతో నేను మా కాపురం ఆశించడం తప్పా? ఈ ప్రశ్నలకి ఎవరు జవాబు ఇవ్వగలరు?' రాజం అంతరాత్మతో పోరాడింది, పరిహారంకోసం బతిమాలింది. కాని ఏం లాభం? నిరుత్సాహమూ అలసట మరింత తీవ్రంగా పెరిగాయి.

## 33

రాజం మానసిక వేదన తగ్గలేదు. మనసు రోజురోజుకి తనకేర్పడిన చిరాకు, అవమానం మరచిపోవాలని తాపత్రయపడుతోంది. కాని అవి క్రూరంగా మెదడుని కొరికి పిప్పిచేసాయి.

దానితోబాటు భయమూ, వ్యాకులత ఆమెను పీడించాయి; ఏదో నేరం చేసినట్టు భావన. 'నేనూ, నా భర్తా స్వార్థం కోరి, రహస్యంగా ప్రేమికులలాగ కాపురం పెట్టాలని కుట్ర చేసామా? ఆ కొద్దిరోజుల్లో నేను అనుభవించిన కాపురం, అనేక మిత్రుల ప్రశంసలు - అవన్నీ వొత్తి పగటికలలా?' అని రాజంకి అనుమానం కలిగింది. ఇక తను అత్తగారి ఆదరణ, సానుభూతి కోల్పోవడం తప్పనిసరియా? రాజంకి తన మంచి స్వభావం, సమర్థతలోనే సంశయం కలిగింది. అందరిలోను ప్రేమ పుట్టించాలని తన వాంఛ, అది సపలమవదా?

ఐనా ఇందులో ఉన్న చిక్కేమిటో రాజం వివేకంతో నిదానంగా పరిశీలించినప్పుడు ఆమె ఆలోచన వేరే దిశలో సాగింది: 'ఒక నిమిషం ఆగు! బాగా ఆలోచించు! ఇప్పుడేం కొంప మునిగిందని? నీకు మరెక్కడ ఇంతమంచి అత్తమామలు దొరుకుతారు? నువ్వంటే వాళ్ళకి ఎంత దయ, వాత్సల్యం!' అనే మాటలు వెంటనే చెవిలో మ్రోగాయి.

అంతే, గతించిన కాలంలో తను అనుభవించిన ఇంపైన ఘటనలు గుర్తుచేసుకొనేసరికి రాజం హృదయంలో మళ్ళీ శాంతి, సుఖం చోటుచేసుకున్నాయి; భవిష్యత్తులో దృఢవిశ్వాసం పెరిగింది. దానితో రాజం భావనలో పూర్తి మార్పు: పట్టుదల, ఉత్సాహంతో తన పరిస్థితికి సమ్మతించి రాజం ఇక రోజువారీ తనకి దొరికే దయ, కృపలతో తృప్తిపడి కాలం గడపాలని పూనుకుంటుంది.

ఆ చిన్న ఇంటిలో మళ్ళీ మళ్ళీ జరిగే ఘటనలు శారదాంబాళ్ గమనించారు.

'రాజం మంచి గడసరి; భర్తకి ఉద్యోగం లేదనే కారణంవలన అణకువతో మెలగడం నేర్చుకుంది. కాని క్షణంలో ఊసరవల్లిలాగ రంగులు మార్చే ప్రమాదంకూడా ఉంది." ఆరంభంలో ఆవిడలో ఆ అభిప్రాయం లేచి క్రమంగా అదే దృఢవిశ్వాసంగా మారింది. ఈ వయసులో మానసిక సంఘర్షణలో  చిక్కుకొని తన అభిప్రాయాలు మార్చుకోడానికి ఆవిడ సిద్ధంగా లేదు: తన మనసులో ఎదివుందో అదే న్యాయం, అదే తను పాటించాలి. భవాని విషయంలో అది తన భారం అని ఆవిడ నిశ్చయించుకుంది. ఆ రోజు భవాని తన్ను "అమ్మా, నువ్వెవరి పక్షం? నువ్వే ఇలాగుంటే నాకు మరెవరి మర్యాద దక్కుతుంది?" అని అడుగుతూ ఏడవలేదూ? శారదాంబాళా అదెన్నటికీ మరచిపోలేదు.

కూతురు నిరసన శారదాంబాళ్ ని పూర్తిగా మార్చేసింది. భవాని తన ఒకటే కూతురు, ఆమెలో ఏ లోపాలున్నా, తను స్థిరమైన ఆదరణ ఇవ్వాలి. తల్లి కూతురుని ఏలుకోపోతే ఊరులో అందరూ అలాగే ఉంటారు. ఇంతకీ భవాని చేసిన నేరం ఏమిటి? తన ఇంటిలో తనకని కొన్ని హక్కులు ఉన్నాయని ఆమె అంటోంది; తన తల్లి కన్ను మూయడానికి ముందే ఆమె అవి పోగొట్టుకోవాలా?

రేపు తను పోయినతరువాత రాజం, రఘుపతి భవానికి నమ్రతగా అన్ని వసతులు చేస్తారా?

ఆ తలపే ఇప్పుడు శారదాంబాళ్ మనసులో అధిగమించింది.

ఆవిడ ధోఽణిలో మార్పు రాజం, రఘుపతి వచ్చిన కొన్ని రోజుల్లో కానవచ్చింది. ఒకసారి రాజం మాటవరుసలో అత్తగారితో "మిమ్మల్ని చాలా రోజులతరువాత నేను చూస్తున్నాను, నాకిప్పుడు చాలా సంతోషంగా ఉంది," అని చెప్పింది. అదే నిజం;

"భవాని అక్కయ్యని, మిమ్మల్ని చూడడానికి నేను ఆతురతో ఉన్నాను," అని రాజం అనలేదు. మరి భవానిపట్ల ఆమె మనసులో చెదరగొట్టే భావనలున్నాయికదా? చర్యలోగాని, మాటలోగాని, తన మనసుకి విరుద్ధంగా వ్యవహరించడం రాజంకి ఇష్టం లేదు. కాని ఆ కారణం వలనే శారదాంబాళ్ దృక్పధంలో రాజం ఇప్పుడు సమగ్రంగా కొత్త పైఖరిలో కనిపించింది. 'ఏమైనా సరే, రాజం భవానిపై అయిష్టత చూపకూడదు. ఈ ఇంటిలో భవానికే ప్రధాన గౌరవం, ఆ తరువాతే రాజంకి. అంతేకాదు. రాజం తను ఒక కోడలని గుర్తుచేసుకొని తన హోదా, అంతస్తుకి తగినట్టుగా మెలగడం నేర్చుకోవాలి.' అదే శారదాంబాళ్ విధించిన నియమం. ఆ ప్రకారంగా శారదాంబాళ్ తన మాటల్లో, నడతలో భవానిని పొడగడం, రాజంని తప్పులెన్నడం అలవాటు చేసుకుంది. సమయం దొరికినప్పుడెల్లా గుణవిశేషణాలలో రాజం భవానికంటే ఒక శ్రేణి తక్కువ అని జాడగా చెప్పింది. ఎక్కువగా మాటాడకపోయినా, ఆమె మాటల్లో గూఢార్థం అదే అని రాజంకి బోధపడింది.

కావాలంటే అత్తగారిని ప్రత్యక్షంగా పొగడుతూ ఆవిడని రాజం సులభంగా ఊరడించవచ్చు - కాని అందుకోసం తనొక నంగనాచిగా మారడానికి రాజం ఇష్టపడలేదు. భవాని తనపై చూపిన దౌర్జన్యం, ఆమె విసిరిన ఎత్తిపొడుపులు రాజం మనసులో బాగా నాటుకొనిపున్నాయి. ఇప్పుడెందుకు రాజం తన అంతరాత్మకి విరుద్ధంగా మెలగాలి? 'తల్లి అనే ధోరణిలో శారదాంబాళ్ భవానిని వెనకేసుకురావడం సహజం; ఇందులో మరేం రహస్యం లేదు,' అని రాజం గుర్తుచేసుకుంది.

కాని రాజం చూపిన నిలకడ, సమభావం - వీటివలనే శారదాంబాళ్ కి రాజంమీదున్న కటువు ఇంకా మరింత తీవ్రంగా పెరిగింది.

తను కన్నుమూసినతరువాత తన కూతురు జీవితం సురక్షితంగా ఉంటుందని ఆవిడ సమ్మతించలేదు. 'ఇప్పుడు రాజంకి భవానిపట్ల పక్షపాతముంది; మరి భవిష్యత్తులో ఆమె భవానిని ఎలా పగ తీర్చకుంటుందో?' అనే దిగిలు ఆవిడని పట్టుకుంది.

ఆఖరికి తల్లిప్రేమ పరాయివ్యక్తి - కోడలిని- గెలవడమేగాక - ముంచేసింది.

ప్రేమ పెరగడానికి దయ, కరుణ, అత్యవసరం. మొక్క పెరగడానికి, వర్ధిల్లడానికి నీరు ప్రధానం. కాని ఆ నీరు వేడిగామారి, ఉడకడం జరుగుతే అది మొక్కని క్షణంలో నాశనం చేస్తుంది.

ప్రేమానురాగాలు తన్ను రెండు పక్కలా తాకుతున్నట్లు రాజంకి బోధపడింది. ఒక పక్క సరసమైన, కాని తన మనోభావం బయటదెలుపని భర్త; మరొకవైపు బహిరంగంగా వాత్సల్యం చూపే అత్తగారు; ఇద్దరూ ఆమెకు బాధకలిగించారు. రాజం మనసు పాలసముద్రంలాగయింది. అంటే ఆమె భావనలలో మంచి, చెడూ రెండూ కలిసి ఉన్నాయన్నమాట. మరి రాజం దృక్పథంలో ఏది చెడ్డది? అత్తగారికి తనమీద అభిమానం తగ్గింది; ఆ కారణంవలన రాజంకి అత్తమామగారిపట్ల ఆశాభంగం కలిగింది. ఈ రెండు భావనలు కలిసి ఒక పాములాగ పాలులో విషం కక్కుతున్నాయి. రాజం కోరేది అమృతం - నిశ్చలమైన ప్రేమ, శాస్వతమైన భక్తి, కాని విషమే చివరికి మిగిలింది. ఆ పరమేశ్వరుడులాగ ఎవరైనా వచ్చి ఆ విషం మింగాలి, అప్పుడే తనకి విముక్తి . . .

త్వరలోనే దేవుడు ఆమె ప్రార్ధనకి జవాబు ఇచ్చాడు.

“అమ్మా, నేను వెళ్ళి మా అమ్మ కానుపుకి సహాయం చెయ్యనా? అమ్మమ్మకి జబ్బుగా ఉందట. నాకూ రాబోయేది తమ్ముడా, చెల్లెలా అని ఆతురతగావుంది. నేను వెళ్ళి అన్ని విధాలా అమ్మకి సాయం చెయ్యగలను,” అని రాజం అత్తగారిని అడిగింది.

రఘుపతికూడా రాజం ఆలోచన ఆమోదించాడు. “కానుపు తరువాత రాజం తప్పకుండా వెళ్ళాలి; ఇప్పుడు వెళ్ళి సహాయం చేస్తే మంచిదేకదా?”అని అన్నాడు.

“మీ అమ్మమ్మ సహాయం మీ అమ్మగారికి తప్పకుండా కావాలి. అదిప్పుడు లేకపోవడం ఎంత కష్టం!” అని శారదాంబాళ్ అన్నారు. ఈ పరిసరాలు వదిలి పుట్టినిల్లు వెళ్ళడానికి రాజం తహతహలాడడం ఆవిడకి తెలియదా?

“ఇప్పుడు వచ్చినాకూడా అమ్మమ్మకి ఈ వయసులో చాలా ఇబ్బందిగా ఉంటుంది. నేనన్ని పనులూ చేయగలను. తమ్ముడు కణ్ణన్ పుట్టినప్పుడు అమ్మమ్మ వచ్చింది, అప్పుడు నేను ఏ పనీ చెయ్యలేదు; భోజనం చేసిన తరువాత

విస్తరాకులుకూడా ఎత్తిబెట్టలేదు! తలచుకుంటే ఇప్పుడకూడా నాకు సిగ్గేస్కుంది. ఇప్పుడన్నీ చేస్తాను, అమ్మమ్మకి సంతోషంగా ఉంటుంది."

రాజం మనసులో కొంచెం గర్వపడిందికూడా. 'నేను భవానిలాగ కాదు. నాకు నా తల్లిదండ్రుల ఇంటిలో అధికారం చెలాయించాలనిగాని, గొడవ చెయ్యాలనిగాని ఏ మాత్రం ఆశ లేదు!' అని గుర్తు చేసుకుంది.

'నాకూ హక్కులున్నాయి, కాని నేను ముఖ్యంగా కోరేది అమ్మకి సేవ చెయ్యడమే. ఒక మహరాణీలాగ ఇంటిలో తిరుగుతాను, అన్నీ ఎలాగున్నాయని సరిచూస్తాను,' అని ఆమె మనసు చెప్పింది. రాజం ధోరణి చూసి రఘుపతికూడా విస్తుపోయాడు. 'ఏ అమ్మాయికైనా పుట్టినిల్లంటే ఒక అమూల్యమైన సంపద అని మనకి తెలుసుగా, మరి రాజం అందుకు వ్యతిరేకంగా ఉంటుందా?' అన్న తలపే రైల్వేస్టేషన్ లో రాజందగ్గర సెలవు పుచ్చుకొని ఇంటికి తిరిగివస్తుంటే అతనికి తోచింది.

రాజం ఇల్లు చేరుకుంది. ఇరుగుపొరుగునున్నవాళ్ళందరు ఆమెను చుట్టుముట్టేసారు. తల్లికి సహాయంకి వచ్చిందని తెలిసి ఆమెను పొగడారు. కొందరు దీవెనలు అందించినతరువాత "ఇప్పుడు నువ్వు మీ అమ్మగారి కానుపుకి వచ్చావ్. ఇక రాబోయే సంవత్సరం నీ ప్రసవంకి వస్తావని మా అభిలాష. అప్పుడు మీ అమ్మగారు నీకన్నీ చేయనీ!" అని పలకడం విని రాజం ఒక చిరునవ్వు నవ్వింది. బాగా అలవాటు పడిన ఈ వాతావరణంలో రాజంకి ఏ చింతా లేదు. మనశ్శాంతికి ఇది తగిన చోటు. ఎవరూ తన్ను తప్పుబెట్టరు; వెన్నుపోటు పొడవరు; హాయిగా ఉండవచ్చు . . .

రాజం రాకవలన విశాలంకీ చాలా సంతోషమే. ఒక తల్లి చెయ్యవలసిన సేవ ఇప్పుడు తన కూతురు తనకి చెయ్యబోతుంది. ఆరంభంలో ఆ తలపు ఒక హెచ్చరికగా కనిపించినా ఇప్పుడు ఆవిడ మనసు కుదుటబడింది.

"నిన్ను ఇక్కడకి పంపించడంలో నీ అత్తమామలకి ఇష్టమేనా?" అని విశాలం అడిగింది.

"వాళ్ళకీ ఇది గొప్పగాకూడా ఉంటుంది," అన్నారు నటరాజన్. రాజంని ఇరుగుపొరుగునున్నవాళ్ళందరు ఎలా పొగడుతున్నారని అతనికి తెలుసుకదా?

"వాళ్ల మనసులో ఏముందో నాకు తెలియదు. కాని ఆ ఇల్లు వదిలిరావడం నాకు సంతోషంగావుంది. దానిగురించి నాలో గర్వంలేదు, అణకువే చోటుచేసుకుంది."

ఈ మాటలు చెప్తూ రాజం నాలిక కఱచుకుంది. 'ఇన్ని రోజులూ నేను పుట్టినిల్లుకి రాలేకపోనందుకు బాధ పడుతున్నట్టు కనిపిస్తున్నానా?' అనే ఆలోచన ఆమెకు కలిగింది. మనసులో ఏముందో చెప్పకూడదనే ఆరాటం . . .

తన మాటలు విన్న తల్లిదండ్రుల మొహాల్లో దిగ్భ్రాంతిని రాజం గమనించింది. ఇద్దరూ రెప్పవేయకుండా ఆమెనే చూస్తున్నారు. "మద్రాసులో ప్రతీదినం ఒక ఉత్సవం, వేడుక జరుగుతునేవుంటుంది. ఎన్ని సభలు, కచేరీలు! నేనొక్కటీ చూడలేదు! ఇంతకీ అక్కడ మూడుమాసాలున్నాను! . . . " అని మొరపెట్టుకుంది.

"నువ్వు మాకు మూడు ఉత్తరాలు - మూడు కార్డులు - మూడు నెలల్లో రాసావ్!" కులుకుతూ నవ్వారు నటరాజన్.

"రాయడానికి ఏముందని? ఒక కార్డు చాలదా అన్ని సంగతులకి! 'ఇవాళ ఎన్ని అప్పడాలు వొత్తాను; కోవిలలో ఎన్నిసార్లు దేవుడి దర్శనం చేసాను' అని చెప్తే చాలు." రాజం గొంతు కూనిరాగంగా మారింది.

"నువ్వు వయలిన్ అభ్యాసం చేస్తున్నావుకదూ?"

ఆ ప్రశ్న వింటేనే రాజంకి ఒళ్ళు మండింది.

"నాన్నగారూ, నేనెలా వయలిన్ వాయించగలను? . . . ఆ ఇల్లు చాలా చిన్నది . . . గుడిశెలాగ . . . "

"ఏం, నిన్ను తప్పిస్తే ఇంటిలో ముగ్గురేకదా?"

"అవును, ముగ్గురే . . . . కాని ఎవరూ నా వేలుగురించిగాని, వయలిన్ అభ్యాసం గురించిగాని పట్టించుకుంటేనా . . . ?"

రాజం కళ్ళు తడిసిపోయాయి.

"ఏం, ఎందుకు ఏడ్పు . . . ?"

రాజం ఏడవడం ఆపి గాయపడిన తన వేలుని చూసింది.

విశాలం కూతురిని చూసి నిశ్చేష్టతో నిలబడింది.

"రాజం, నీకు సంగీతంలో, వయలిన్ వాద్యంలోని ఆసక్తి ఉందని నువ్వు నీ అత్తమామలకి తెలియజేయాలి," అని మళ్ళీ అన్నారు నటరాజన్.

"సరే, నీ గాత్రసంగీతం గురించి చెప్పు. అది సాధకం చేస్తున్నావా?"

రాజం ఏ జవాబూ ఇవ్వలేదు.

ఆ రోజు పాటమేష్టారు వచ్చినప్పుడుకూడా రాజం కన్నీళ్ళు కార్చుతూనే కనబడింది. అతన్ని చూడగానే ఆమె రూపం చంటిపాప తల్లినిచూసి మనసు కరిగినట్టు మారిపోయింది.

"రాజం, ఏమిటిది? ఎందుకులాగున్నావ్1" శర్మగారు ఉలిక్కిపడ్డారు.

"దానికేమైందో నాకూ తెలియదు!" అని విశాలం అతనికి చెప్పింది. రాజం భుజం ఎగబెట్టుకొని "నా మనసులో ఏముందో నాకే అర్థం కావడంలేదు," అని కళ్ళు తుడుచుకుంది.

శర్మగారి ముఖంలో అంధకారం చోటుచేసుకుంది; విశాలం ముఖంలో విభ్రాంతి; రాజంకి తన భంగిమ బోధపడింది: తల్లి, గురువుగారు తను తన అత్తమామలమీద నింద మోపుతున్నట్టు అనుమానిసితున్నారేమో? అలాగ కాదని తను ఆ క్షణమే వాళ్ళకి తెలియజేయాలి:

"నేను వయలిన్ అభ్యాసం చెయ్యకూడదని ఎవరైనా ఆక్షేపించినా నేను నోరుమూసుకొని ఉండగలను. కాని నాకెప్పుడు అవకాశం దొరికినా, నేనెప్పుడు సాధకం చెయ్యాలని కూర్చున్నా ఏదో ఒకటి అడ్డంగా వచ్చి నిలబడుతుంది. నేనేం చెయ్యను?"

శర్మగారు నవ్వారు. అతనికి తన శిష్యుల మొఱలన్నీ విన్నఅనుభవముంది.

"రాజం, నా మాట విను. అక్కడ ఏం జరిగిందో మరచిపో. ఇక ఇక్కడ నీ సాధకం ఆరంభించు. నీ ప్రవీణత సవరించుకోడానికి ఇది ఒక మంచి అవకాశం. స్వరాలు, రాగాలు బాగా మెరుగుపరచుకో. నేనూ అప్పుడప్పుడువచ్చి నీకు సహాయం చేస్తాను. మన ఆంధ్రబాషాభివర్ధని సమాజంలో నీకు ఒక చాన్సువుంది. జ్ఞాపకం ఉంచుకో," అని అతను ప్రోత్సాహించారు.

రాజంకి గభీమని పోయిన బలమంతా తిరిగి వచ్చేసినట్టు భావన కలిగింది. నాలుగు సంవత్సరాలముందు సభలో ప్రేక్షకుల సమూహంలో తను పాడిన ఘటన గుర్తు చేసుకుంది. ఆ తరువాత కొన్నిసార్లు రంగస్థలంమీద పాడడం జరిగినా, ఎందుకో తెలియరాని భయంవలన రాజం ఇంటిలో పాడడంకూడా ఆపేసింది. ఇక అలాగేం జరగదు. రాజంకి సంగీతంలో ఆసక్తి ఏమాత్రం అణగలేదని తెలిసినతరువాత శారదాంబాళ్ తప్పకుండా ఆమెను సత్తువగా ప్రోత్సాహిస్తారు. భవాని అక్కయ్య ఇంటిలోనే సంగీతం నేర్చుకుంది; రాజమూ అలాగే తన ప్రజ్ఞ మెరుగుచేసుకొని భవిష్యత్తులో సభల్లో ఎందుకు రాణించదు? అత్తగారికి ఇదొక వింతగా కనిపించదా?

సంగీతంలో వాంఛపున్నా తను వచ్చిన కారణం రాజం మరచిపోలేదు. తల్లికి కావలసిన వసతులు అన్నివిధాలా సమకూర్చింది. ఆ సేవతోబాటు భవిష్యత్తులో తన సంగీత ప్రజ్ఞకి రాబోయే కీర్తి కూడా సఫలమవుతందని రాజం నమ్మింది. తన ఆదర్శ మార్గంలో తోవ తప్పే అవకాశముందా? ఇంతకుముందు దానిగురించి కొంచెం దిగిలు, వ్యాకులత ఆమెలో చోటుచేసుకున్నాయన్న మాట నిజం. కాని ఇప్పుడు ఆ అభిలాషలు పదిలం చేసుకునే ధైర్యమూ, పేరూ, ప్రతిష్టా తన అందుబాటులో ఉన్నాయనే భావన రాజంకి కలిగింది. 'ఇక నా ఆదర్శ భావనలు కొత్త సృజనాత్మక మార్గంలో సాగించాలి,' అని రాజం నిశ్చయించింది.

"రాజం అమ్మకి సాయం చెయ్యాలని వచ్చింది, కాని సంగీతం నేర్చుకోవాలని అంటోంది. ఆమెలో ఎంత ఉత్సాహం! చురుకుతనం!" ఆని పొరుగింటి సీతమ్మ పొగడింది.

"మీరేమంటున్నారు? నా వయసులో ఒక ఆడదానిలో చురుకుతనం, ఉత్సాహం ఏం పెద్ద సంగతా ఏమిటి? మరి మా అత్తగారిని చూస్తే మీరేమంటారో?" అని రాజం ఆవిడకి చెప్పింది. ఆ ఆలోచన రాగానే ఆమె మనసు ఇంకా ఉల్లాసభరితమైంది.

రాజంలోని అంతరంగ భావనలని ఎలా వర్ణించడం? అసలు రాజం ఆశించేది ఏమిటి? అప్పుడప్పుడు ఆమెలో శోకమూ ప్రత్యక్షంగా కనిపిస్తుందే? మెల్లమెల్లగా తన ఊహలని నిరుత్సాహపరిచే భావనలని అధిగమించి రాజం ముందుకు సాగినా,

గభీమని ఆమెలో ఒక అనుమానం లేచింది: 'సంగీతంలో నాకున్న ఆసక్తివలన నాకు కష్టమా, నష్టమా?'

ఈ వైరుధ్యంకి ఆధారం ఏమిటి?

నిలకడలేని మనసే అన్నిటికీ కారణం. చిందరవందరగా ఒక కోతిలాగ అది సంబంధాసంబంధం లేకుండా గెంతుతూవుంటుంది. దానికి నిత్యమూ తుంటైన బుద్ధి. ఇక మనుషలమాటకొస్తే, సదా సంఘర్షణలో చిక్కుకున్నవాళ్ళ ధోరణిలో ఎన్నెన్ని విచిత్రాలు!

ఒకప్పుడు రాజంకి తన అత్తమామలమీద ఉన్నత అభిప్రాయాలే చోటుచేసుకున్నాయి. కాని ఇటీవల అది ఒక భ్రమ ఏమో అనే అనుమానం ఆమెకు కలిగింది. ఏ కారణంవలనా అది భ్రాంతి అని అంగీకరించడానికి గాని, అది నిజమనిగాని రాజం మనసు వెనకాడింది. 'నేనేం ఒక చెడ్డకోడలుగా మారుతున్నానా?' అని అహస్యపడింది. అప్పుడే తనకి వక్రబుద్ధి అని తన్ను తనే నొచ్చుకుంది. 'ఇదంతా నా పొరబాటే. నన్ను అమర్యాద కప్పిపుచ్చేసింది. నాకు సంగీతంలోవున్న మూర్ఖతవలనే ఇలా అయింది. వయలిన్ అభ్యాసంకి అవకాశం లేదని నేను బాధపడ్డాను. ఏం, ఎందుకు? దానికి బదులుగా హాయిగా అత్తగారితోకలిసి అప్పడాలు వొత్తుకొని రోజులు గడపడం ఎంత భాగ్యం!' అని వాపోయింది.

ఆఖరికి తన తీరని ప్రశ్నకి రాజం సమాధానం కనిబెట్టింది: తను కోరేది స్వాతంత్ర్యం. దాన్ని తన సంగీత అభ్యుదయంకి మార్గదర్శిగా గుటిబెట్టాలి.

రాబోయే దశరా ఉత్సవాల్లో రాజం కచేరీ చెయ్యబోతుందని పెద్దలు ప్రకటనలు చేసేసారు. రాజం రఘుపతికి రాసింది. అతనూ తనకి సంతోషమని చెప్పాడు; కాని దానిగురించి ఎటువంటి ఆశ్చర్యమో,అభిమానమో తెలియపరచలేదు.

దశరా పండుగలలో రాజం ఒక అద్భుతమైన సంగీత ప్రదర్శన ఇచ్చింది.

విమర్శకులు కూడా అభినందించారు.

"ఇది ఒక మంచి ప్రియమైన మార్పు. ఈ సంవత్సరం మద్రాసునుంచి ఒక విద్వాంసురాలు వచ్చి చాలా కొత్త కృతులు పాడారు. శర్మగారి సంప్రదాయం

గుర్తించినవారికి ఇది ఒక కొత్త అనుభవంగా కనిపిస్తుంది. కొన్ని చోట్ల గాయకురాలుని అనుసరించడానికి శర్మగారే ప్రయాసపడ్డారనిపించింది . . . ”

“ఎంత ఘనమైన ప్రదర్శన! మనం రాజం కరలాఘువం ఐదు సంవత్సరాల తరువాత చూస్తున్నాం. పెళ్ళైనా ఒకరి ప్రవీణత నాశనమవదు అని అనడానికి ఇది ఒక మంచి నిదర్శనం. ఈ తలపే మనసుకి హాయిగా ఉంది . . .”

“గాయకురాలి భర్త, మామగారు – వాళ్ళకీ సంగీత జ్ఞానంలో మంచి ఆసక్తి ఉందట. ఆ కారణంవలనే ఈ ప్రదర్శన ఇంతబాగా రాణించింది,” అని ఇంకొక విమర్శకుడు రాసాడు. అతని సహకారి విమర్శకుడు ఇలా రాసాడు: “మద్రాసు మన ఊరులా కాదయ్యా! తమిళిలు ఏం అపరిచితులు కారు. వాళ్ళలో సరాసరి అందరికీ సంగీతజ్ఞానంవుంది. వాళ్ళు నిత్యమూ కర్ణాటక సంగీతంకి సేవ చేస్తూనేవున్నారు . . .”

రాజేశ్వరి ఈ పొగడ్తలు విని తనలో గొప్పగా నవ్వుకుంది.

తనకి సంగీతంలో శాశ్వతంగా ఉన్న ఆసక్తితోబాటు కచేరీలలో పాల్గొనడానికి అర్హత కూడా ఉందని రాజంకి ఇప్పుడు అర్థమైంది. కచేరీలో తను భవానిదగ్గర నేర్చుకున్న కృతులు పాడడం మంచిదైంది; అవి కొత్తగా ఉన్నాయి అని విమర్శకులు అభినందించారు.

రాజం నటరాజన్ తో ఇది చెప్పినప్పుడు అతనేమన్నారు?

“దీనికంతా కారణం నీకున్న పట్టుదల, నువ్వు చూపిన నిరంతర శ్రమ. ఇంతకుముందు నీలో అటువండి దృఢ సంకల్పం కనిపించలేదే? సాధకం చెయ్యమని చెప్తే రెండుగంటలవరకు నువ్వేమీ చెయ్యవని అమ్మ బాధపడేది.”

అది నిజమే అని రాజం ఒప్పుకుంది. అత్తమామలతో ఉన్నప్పుడు సంగీతంలో తనలో ఉద్రేకం తగ్గింది, కాని ఆ కారణంవలనే ఇప్పుడు తన్ను అదిగమించడానికి ఆమెకి వీలయిందా? పరిసరాలబట్టి ఒకరికి సంగీత ప్రజ్ఞలో మార్పు రావచ్చని ఎవరో అనడం రాజంకి తెలుసు. ‘తన దృఢసంకల్పంకి కారణం సరిపడని వాతావరణమేనా?’ అనే ఆలోచన రాగానే రాజం కలవరపడింది.

కొన్నిరోజులతరువాత శాంబశివం రాజంని చూడడానికి వచ్చినప్పుడు ఆమె సంగీత అభ్యాసం గురించి అడిగారు. "అమ్మాయీ, నువ్వు గాత్రంలో లయ గురించి శ్రద్ధ చూపాలి. రాగం. స్వరాల కంటే లయకే ప్రధానం ఇవ్వాలి," అని అతని బోధన విని రాజం బాధపడింది.

'శ్రుతి మాతా, లయ పితా,' అనే వచనం రాజంకి తెలుసు. శర్మగారుకూడా రాజం గాత్ర శిక్షణలో దాన్నిగురించి ప్రస్తావించివున్నారు. సాధారణంగా రాజం లయ తప్పదు. కాని అభ్యాసం లేకపోవడంవల్ల ఒక కచేరీలో సహ వాయిద్యం మృదంగంతో రాజం ఒక చిన్న తప్పు చేసింది. కొత్త కీర్తనలు పాడినప్పుడుకూడా రాజం లయ తప్పదు. ఇక స్వరకల్పన గురించి చెప్పాలంటే రాజం కొన్ని పొరబాటులు చేసింది, అది ఆమెలో కానవచ్చిన లోపం. అసలు విషయమేమిటంటే కొన్ని సంవత్సరాలు రాజం చెదురుమదురుగా సాధకం చెయ్యడంవలన సగం కృతులు అలాగే అసమగ్రంగా ఆమె మనసులో నిలిచిపోయాయి. కాని రాజం వాటిని పునరుద్ధరణ చేసిన ఘనకార్యం శాంబశివం ఎందుకో గుర్తించలేకపోయారు. అతని మాటలు విని రాజం బాదపడినా అతను తను పాడిన రాగమాలిక గురించి ఎందుకు విమర్శించలేదని రాజం ఆశ్చర్యపడింది. తక్కిన కృతుల గురించికూడా – అర్ధభావం, స్ఫురణతో తను పాడినవి – అతను ఏం అనలేదు. కేవలం రెండురోజులు అభ్యాసంతో రాజం పాడిన ఆ రాగమాలిక విని అందరూ ఆమెను శ్లాఘించారు, కాని ఎందుకో శాంబశివం దాన్ని ఉపేక్షించారు.

'నేనిక్కడ స్వేచ్ఛగా, ఇష్టం వచ్చినప్పుడు పాడుతున్నాను. *అక్కడ* నేను జీవించిన తీరు శాంబశివం ఎరుగుదురా?' అని రాజం ఆలోచించింది. 'అక్కడ' అనే మాట తోచగానే శోకం రాజం మనసును కప్పుకుంది. దానితోబాటు తన పరిస్థితికి రఘుపతికి కూడా బాధ్యతవుంది అని రాజం గుర్తుచేసుకుంది.

ఆ వచ్చే రోజుల్లో రాజంకి తన సంగీత ప్రజ్ఞలో విశ్వాశం పెరిగింది: భవిష్యత్తులో ఎది జరిగినా – తను అత్తమామలతో మద్రాసులో రోజులు గడిపినా లేక రఘుపతి ఉద్యోగం కారణంవలన మరో ఊరుకి బదిలీయైనా, తన సంగీత ప్రజ్ఞ వ్యర్ధమవకూడదు. ఒకానొకప్పుడు రాజం తను నేర్చిన కృతిలో స్వభావమూ,

అందమూ  చూసి ఆనందించేది. దాని రాగంలోని సొగసు, అది శ్రోతల మనసుని భావరూపంగా ఎలా కరగించుతుంది అని రాజం ఎక్కువగా లక్ష్యం చెయ్యలేదు. ఇటీవల రాజం తన గానం  అధిగోన్నత స్థాయిలో అనుభవించాలని ఆశించింది. కృతితోబాటు, రాగ ఆలాపన, స్వర కల్పన – వీటిలో కొత్త మార్పులు పరిశీలించడం ఆమె అలవాటు చేసుకుంది. ఒకరోజు శర్మగారు ఎవరో ఒక గాయకుడు ఒకే ఒక రాగంలో గంటలవారిగా చేసిన ఉపన్యాసం గురించి రాజంకి చెప్పారు. అది వినగానే రాజం ఒళ్ళు పులకరించింది; కళ్ళు మూసుకొని రాజం ఆ పేరుతెలియని గాయకుని మానసికంగా పూజించింది. ఆ క్షణమే 'పునర్జన్మలో నేనొక పేరుపొందిన గాయకురాలుగా పుట్టాలి,' అని ప్రార్థించింది. కాని కళ్ళు తెరచినవెంటనే వేరే ఆలోచన: 'ఏం, ఎందుకు? ఈ జన్మలోనే నాకది సాధ్యం కాదా? నాకింకా ఇరవైకూడా నిండలేదే? ఈ ఐదు వారాల్లో నేనెన్ని సాధించాను! నాకు సంగీతంలో మంచి పునాదివుంది; నియమంగా సాధకం చేస్తే నాకు అన్నీ సాధ్యమే! నాకు కావలసినది తగిన వాతావరణం!' తన పాత ఎనిమిది మాసాల కాపురంలో తను అన్నివిధాలా రాణించాలని ఆశించడం రాజం గుర్తుచేసుకుంది. కాని ఇప్పుడు తను కోరేది సంగీతంలో ఖ్యాతి; అదే తన లక్ష్యం. అది తన అందుబాటులో ఉందని గ్రహించి రాజం తృప్తిపడింది.

ఆఖరికి ఆశ వ్యాకులతని జయించింది.

## 34

రోజులు గడిచాయి.

రఘుపతి ఒంటరిగా రాజం సహవాసం లేకపోవడంవలన రేడియో వింటూ కాలం గడిపాడు. ఎది మంచి ప్రోగ్రాం, ఎది చెడ్డది అనే భేదం లేకుండా నిశ్చింతగా ఒక స్టేషన్ తరువాత ఇంకొక స్టేషన్ వినాలని డయలు తిప్పుతూ రోజులు గడిపాడు. మనసు అదుపులో లేకపోవడంవలన అస్తమానం రేడియోలో ఏదో ప్రోగ్రాం -వార్త లేక పాట - వినడం అతనికి అలవాటైపోయింది. ఇంతకీ రఘుపతి ఎటువంటి మొండి ఆలోచనలలోనూ చిక్కుకొనే మనిషి కాదు. రాజం ఉత్తరాలు చదివిన తరువాత అతనికి మనశ్శాంతి కలిగింది: 'రాజం హాయిగా సంగీత సాధకం, ఇంటిపనులతో

రోజులు గడుపుతోంది; భర్తకి ఉద్యోగం లేదని ఆమె దిగిలుపడలేదు' – ఇదీ అతని భావన. తనకేర్పడిన ఆటంకం తాత్కాలికమని రఘుపతి గుర్తుచేసుకున్నాడు. ఐనా, అప్పుడప్పుడు రాజం తన మనసులో భర్తగురించి ఏమనుకుంటుందో అని రఘుపతి ఆలోచింపక తప్పలేదు. ఇంతవరకూ రఘుపతి మనసులో రాజం గురించి ఇంపైన జ్ఞాపకాలే చోటుచేసుకున్నాయి. కాని ఇప్పుడు అతని అవగాహనలో – ఊహలో - చిన్న భయం లేచింది. రాజం చూపులో జిల్లుమనే ఉదాసీనత, నిష్టూర భావన కలిసివున్నట్లు రఘుపతి కల్పించుకున్నాడు.

'ప్రస్తుతం రాజంకి రోజులు బాగాలేవు; ఇది ఆమెకు మంచి దశ కాదు. ఆ పాత కాపురం – ఎనిమిది నెలల జ్ఞాపకాలు – మరచిపోవడం రాజంకి ఎలా సాధ్యం? దానికి మెత్తనిమనసు, కాని ఇంకా ఎన్నిరోజులు భరించగలదు?'

ఇంతలో రాజం భర్తకి ఆహ్వాన పత్రిక అందించింది.

"నా చిన్న చెల్లెలుకి నా పోలిక అని అందరూ అంటున్నారు; త్వరగా రండి. నేను చంటిపాపగా ఎలా కనిపించానో మీరు చూడవచ్చు," అని రాజం రాసింది.

భర్తను రమ్మని రాజం కోరిందికాని తిరుగు ప్రయాణంలో తన్ను తీసుకువెళ్ళమని ఆమె భర్తని అడగలేదు. ఐతే దానిగురించి రఘుపతి బాధపడలేదు. రాజం తన ప్రేమని అతనికి తెలియజేసింది, తనకదే కావాలి. రఘుపతి తనలో నవ్వుకున్నాడు. ఉత్తరం రాసాడు.

"నేను వస్తున్నాను. నీలాగే నీ చిన్న చెల్లెలుకూడా కీర్తితో ప్రకాశించాలని నా ఆశ." అని రాసాడు. దానితోబాటు రాజంకి సానుభూతి తెలిపే ధోరణిలో కొన్ని వాక్యాలు చేర్చాడు. ఆ సమయంలో రాజంకి అవే కావాలి. భర్త రాకని ఆమె ఆతురతో ఎదురుచూసింది.

రఘుపతి ప్రయాణంకి సిద్ధమైయ్యాడు.

"నీ భార్య తిరుగుప్రయాణంలో నీతో రావడంగురించి మీ మామగారేమైనా రాసారా?" అని శారదాంబాళ్ అతన్ని అడిగింది.

అప్పుడే రఘుపతి మనసులో తన భార్య తనతో తిరిగిరావచ్చు అనే ఆలోచన కలిగింది. నటరాజన్ దీపావళి పండుగకి అతన్నిరమ్మని రాసారు కాని మరేం అనలేదు.

తల్లి అడిగిన ప్రశ్నవిని రఘుపతి ఆలోచనలో పడ్డాడు. తన ప్రయాణంకీ రాజం తనతో తిరిగిరావడంకీ ఏ సంబంధమూ లేదని అతని ఉద్దేశం. కాని ఒకవేళ రాజం వెంట వస్తే ఆమెకి మనసులో ఎలా ఉంటుంది? సంతోషంగా ఉంటుందా? ఎది ఏమైనా రఘుపతికి రాజమంటే ప్రియం, అందువలన తను తప్పక వెళ్ళాలని నిశ్చయించాడు.

"ఇదిగో, మీ అత్తగారికి," అని శారదాంబాళ్ అప్పడాలు, జంతికలు రఘుపతికి అందించారు. ఊహాలోకంలో సంచరించుతున్న రఘుపతికి చెన్నపట్టంలో ఒక బహుమతి కొనాలని కూడా తోచలేదు; వట్టిచేతులతోనే అత్తగారిల్లు చేరుకున్నాడు.

విశాలం అల్లుడికి స్వాగతం చెప్పింది. శారదాంబాళ్ పంపిన అప్పడాలు, జంతికలు చూసి మురిసిపోయింది. "రాజం చాలా అదృష్టవంతురాలు; దానికి తల్లివంటి అత్తగారుకూడా దొరికారు," అని పొగడింది.

ఇంతలో రాజం జోక్యం చేసుకుంది: "అమ్మా, నీకప్పుడూ అప్పడాలు చెయ్యడమంటే భయం. మా అత్తగారు గొప్ప మనసుతో అందరికీ కట్టుకట్టుగా అప్పడాలు చేసి పంపుతారు. ఇప్పుడు నీకు ఒక టిన్ను నిండుగా అప్పడాలు పంపించారు, అందులో ఆశ్చర్యం ఏముంది?" ఆమె మాటల్లో గర్వమూ, ఉపేక్ష రెండూ చేరుకున్నాయి. తన మానసిక వ్యధని నివృత్తి చెయ్యడానికి ఇది మంచి తరుణం అని రాజంకి తోచిందేమో? కాని ఇతరులెవరూ గుర్తుపట్టలేదు.

"మీ అత్తగారు కొత్తగా బియ్యం అప్పడాలు ప్రత్యేకంగా నాకోసం చేసి పంపించారు. అందుకు నా కృతజ్ఞులు," అని విశాలం మళ్ళీ వక్కాణించి చెప్పింది. 'అది ఒక కొత్త తల్లికి ప్రసావనంతరం దేహంలోబలం రావాలని శారదాంబాళ్ బుద్ధిపూర్వకంగా అందించిన బహుమానం,' అని ఆవిడ భావన.

కాని రాజం ఉద్దేశం వేరు.

రఘుపతికూడా గర్వపడుతూ కనిపించాడు.

"ముందటివారం నాన్నగారు నలుగురిని భోజనంకి పిలిచారు. అమ్మ అప్పడాలు చెయ్యాలని నిశ్చయించింది. ఆ రోజు ఉదయం బియ్యం నానబెట్టి, ఆ తరువాత ఎండబెట్టి, సాయంకాలం రుబ్బి, రాత్రికి అప్పడాలు వడ్డించేసింది," అని వివరించాడు.

"ఓ అలాగా?" అని విశాలం ఆశ్చర్యపడింది. రాజంకి విభ్రాంతి.

"అదెలాగ? అమ్మా (రాజం మాటాడుతున్నది శారదాంబాళ్ గురించి), నేనూ చాలా అప్పడాలు చేసాం. అవన్నీఏమయ్యాయి? నేను ఇక్కడకి వచ్చి మూడు నెలలేగా అయ్యాయి?" అని భర్తని అడిగింది.

"అమ్మ భవానికి ఏడువందలు అప్పడాలు పంపించింది. అందరూ అమ్మ స్పెషల్ అప్పడాలు కావాలంటున్నారు. నా స్నేహితుడొకడు ఉత్తరదేశంకి వెళ్తున్నాడు. వాడికి అమ్మ రెండువందలు అప్పడాలు ఇచ్చింది . . ."

రాజంకి అంతా బోధపడింది. మరీ ఎక్కువ అతిథులు – అందులో కొందరు బంధువులు – వచ్చినట్టున్నారు. అందరికీ బహుమానాలు ఇవ్వాలి. అత్తగారికి శ్రమ ఎక్కువే . . .

రాజం మళ్ళీ ఆలోచనలో పడింది: అప్పడాల మాటకొస్తే శారదాంబాళ్ ఒక అసాధారణ వ్యక్తి. ఎంత ఉదారగుణం! పెద్దమనిషితనం! తన శత్రువులకుకూడా అప్పడాలు దానం చెయ్యాలని ఆవిడ వాంఛ . . . ఆవిడ దృక్పథంలో అప్పడాలు చెయ్యడం ఒక కళ, ఆమె జీవితంలో అది ఒక మూలరాయి . . .

మరి రాజం సంగతో? రాజం అలవరచుకున్నది లలితకళ. సంసారంతో అది ఏకీభవించగలదా? ఆ పోటాపోటీలో అది జయించగలదా?

తన భర్త, శర్మగారు కలుసుకునే అవకాశం ఎప్పుడు రాబోతుందని రాజం ఆతురతో కాచుకొని ఉంది. ఇంతకుముందు అటువంటి ఉత్సాహం ఆమెలో చోటుచేసుకోలేదు. అందుకు కారణం రఘుపతి కావాలనే మోటుగా, కటుకైన మాటలేవీ శర్మగారిమీద రువ్వుతాడేమో అనే దడుపు.

కాని ఇప్పుడో? ఇవాళో రేపో ఇద్దరూ ఇటీవల దశరా వేడుకలలో రాజం పాల్గొన్న గాత్రప్రదర్శన గురించి మాటాడతారు; తగీన శిక్షణ, ప్రోత్సాహంతో రాజం ఒక విశిష్ట

గాయకురాలుగా రాణించగలదని శర్మగారు రఘుపతికి వక్కాణించి చెప్తారు; రఘుపతి అది విని ఆనందిస్తాడు, రాజం అభిలాషకి అన్నివిధాలా తోడ్పడతాడు. ఇక రాబోయే రోజులన్నీ మంచి రోజులే . . .

శర్మగారు వచ్చారు, రఘుపతి, ఆతను చాలా ఏవేవో విషయాలు – ఒకటి తరువాత ఒకటి – మాటాడుకున్నారు. మాటవాసికి శర్మగారు రాజం, ఆమె సంగీతం, ప్రవీణత, ప్రదర్శన గురించి చెప్పారు. రఘుపతి ఓర్పుగా విన్నాడు. శర్మగారు ఎవరో తన శిష్యురాలుగురించి ప్రస్తావించుతున్నట్టు అతనికి తోచినట్టుంది. అసలు అతను తన భార్యగురించి – ఇంతకీ రాజం వాళ్ళతోబాటు పక్కనే కూర్చొనివుంది - ఆమె ఇటీవల అందుకున్న పేరు, ప్రతిష్ట గురించి మాటాడుతున్నట్టు రఘుపతి గుర్తించనేలేదు; అసలు శర్మగారి మాటలేవీ అతను పట్టించుకోలేదు.

ఏదో ఒక పెద్ద బండరాయి తనమీద పడినట్టు రాజంకి తోచింది. శర్మగారు శెలవు పుచ్చుకున్నప్పుడు అతను "రాజం, నేనింకా రెండురోజుల్లో తిరిగివస్తాను. అప్పుడు నువ్వు కాంబోధీ కృతి ఆరంభించవచ్చు. ఇవాళ మేం ఏమేమో మాటాడుకున్నాం, టైమెలాగో ఐపోయింది," అని అన్నారు.

రాజం చూపు భర్తపై పడింది. అతను రెప్పవేయకుండా శర్మగారినే చూస్తున్నాడు. అతనేం ఆలోచిస్తున్నాడని రాజంకి బోధపడింది: 'భలే పాటమేష్టారయ్యా నువ్వు! సరే, కాంబోధీని ధ్వంసం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నావన్న మాట!'

రాజం చిన్న ఎగతాళి నవ్వు నవ్వింది: "సార్, ఇక నేను పాడను!"

"ఏమంటున్నావ్?"

"మీకింకా అర్థం కాలేదా? నేనితని భార్యగా ఉన్నంతవరకూ పాడను!" అలా అంటూనే రాజం మళ్లీ నవ్వడానికి ప్రయత్నించింది; భర్తమీద దృష్టి నిలిపింది. అతని చూపు రాజంమీద లేదు. మేజా మీదున్న సంచికలో రేడియో ప్రోగ్రాములు వెదుకుదూ పేజీలు తిరగవేస్తున్నాడు.

కాని ఆ చిన్న ఘటన రాబోయే రోజుల్లో పెద్ద సమస్యగా మారలేదు. సాధ్యమైనంతవరకూ రాజం భర్త రాకలో, అతని సహవాసం దొరికిన అన్ని సమయాల్లో, కలిసి, మెలిసి అన్ని పసులూ చేసింది.

అప్పుడప్పుడు తనకి పూర్తిగా స్వతంత్రత వచ్చినట్టు భావన రాజంకి కలిగింది. ఇక బిడియంకి చోటు లేదనే నమ్మకమూ ఆమెను కప్పుకుంది. కాని అదీ కొన్ని రోజులకే. చంచల బుద్ధి జారుకోలేదు; మనసు మళ్ళీ కోతిలాగ కిందకీ మీదకీ దూకడం అలవాటైపోయింది.

శర్మగారు వచ్చారు, సంగీత అభ్యాసం మొదలుబెట్టాలని అతని లక్ష్యం. అతను ఏ సన్మానమూ ఎదురుచూడలేదు. ఏదో బహుమతి, జ్ఞాపకార్థంగా ఒక వస్తువు – ఎదైనా తనకి దొరుకుతుందని అతనికి తెలుసు. “నేనిక పాడను!” అని రాజం నొక్కి చెప్పినా అతను వచ్చారు. దానితోబాటు, రఘుపతితో కలుసుకొని విస్తారంగా సంభాషించడం అతనికి చాలా ఇష్టం.

కాని రాజం తన మనసు మార్చుకోలేదు.

“నన్ను మరేం అడక్కండి, వదలండి!” అని చిరాకుపడింది.

“నువ్వు సాధకం చేస్తున్నావుకదూ?” అని అతను మళ్ళీ అడిగారు.

“అవును, చేస్తున్నాను . . . మా ఆయన. తమ్ముడు మణి వాకింగ్ వెళ్ళినప్పుడు - ” అని రాజం రోషంతో జవాబిచ్చింది.

‘రఘుపతి భార్యగా నేను పాడను!’ అని తను ఆ రోజు పలుకిన వాక్యం రాజం గుర్తుచేసుకుంది.

అసలు ఆ వాక్యంలో గూఢార్థం ఇది . . .

“నేనిక్కడ – ఈ ఇంటిలో మాత్రం- నా తల్లిదండ్రుల కూతురుగా – సాధకం చేస్తాను.”

ఐతే, ఆ ఘోషణలో ఇంకొక సంకేతముంది. ఎలాగో తన మానసిక వ్యథని భర్తకి తను విప్పిచెప్పినట్టు రాజంకి కొంచెం తృప్తి కలిగింది.

నేరుగా రఘుపతి ముందు నిలబడి "మీ భార్యగా నేను పాడను!" అని నొక్కిచెప్పడానికి రాజంకి మనసురాలేదు. అందుకే పరభారిగా అతనికి ఇలాగ చెప్పింది.

ఇంతకీ రఘుపతి మనసుమారి తన్ను ఉరడించుతాడని రాజం ఎదురుచూడలేదు. ఏమో, కొంచెం మనసు మెత్తబడి "రాజం, ఎందుకీ శపధం? నన్ను నమ్ము, నీ మనసులో ఏముందో నాకు చెప్పు!" అని అడుగుతాడేమో అని ఒక ఆశ . . .

కాని రఘుపతి దానికి విరుద్ధంగా కనిపించాడు.

రాజం మాటల్లోని నిగూఢత అతను గ్రహించలేదు. 'రాజం సాధువు; కొంచెం మొండి శిఖండి మనిషి, నాకేదో చెప్పాలని ఆమె తాపత్రయపడుతోంది,' అని అతను గుర్తించలేదు. 'ఇక్కడ, ఈ ఇంటిలో మంచి మూడ్ లో ఉంది; సంగీతం అభ్యాసం చేస్తోంది, హాయిగా ఉంది,' అని అతని భావన. ఆతను ఆ భంగిమలోనే స్థిరపడిపోయాడు.

'నేనేం చెప్పదలచుకున్నానో చెప్పేసాను. ఆతనికి అంతా బోధపడుతుంది. నా ఆశ సఫలమవుతుంది,' అని రాజం మనసార నమ్మింది. కాని అలాగేం జరగలేదు.

'ఆడదాని మనసు ఒక మర్మం; అది మగవాడికి బోధపడదు,' అని ఎవరో అన్నారు. అది నిజమేనా?

అవును, నిజమే. కాని ఆ కారణంవలన ఆమెలో కానవచ్చే ప్రత్యేక లక్షణాలకి అది హాని చేస్తుందా?

ఎవరో అన్నారు ఒక స్త్రీ జీవితంని ప్రేమ పూర్తిగా ఆవరించుకుంటుంది. కాని పురుషుని సంగతి వేరు. ప్రేమ అతని జీవితంలో ఒక భాగం మాత్రమే. ఈ కూటప్రశ్నకి సమాధానం అందులోనే ఉంది.

ఒక స్త్రీ తన భర్త పట్ల చూపే ప్రేమలో ఆమె ఆదర్శబావాలు కలిసివుంటాయి. వివేకం, తెలివితేటలతో భర్త మనసు - అతనికి ఎది ఇష్టం, ఎది అయిష్టం - అని అర్థం

చేసుకొని, ఆమె దాంపత్యలో అతని ప్రియురాలుగా. సహకారిగా మెలుగుతుంది. ఆ కారణంవలన భర్తజీవితంలో స్త్రీకి ఏ మర్మమూ లేదు.

కాని భర్త ప్రదర్శించే ప్రేమ సంగతి వేరు. అందులో శ్రద్ధ, మమత తక్కువగానే కనిపిస్తాయి. భార్య తన ప్రేమకి ప్రతిఫలంగా సానుభూతి, ఏకీభావం ఎదురుచూస్తుంది; అవి లేకపోవడంవలన బాధపడుతుంది, కాని భర్త అది గ్రహించడు! ప్రేమ, వ్యాకులత మధ్య భార్య తికమకలాడుతుంది: కాని భర్తకి ఆమెలో పగ, ముక్కోపం మాత్రమే కనబడతాయి. 'దాని మనసులో ఏముందో ఎవరికీ అర్థంకాదు! స్త్రీ ఒక మర్మం అని ఉత్తికే అన్నారా?' అని అల్లాడుతాడు.

ఇప్పుడు రాజం అటువంటి మర్మ వ్యక్తిగా మారిపోయింది!

ఈ చిక్కులోనుంచి తనకెలా విముక్తి అని రాజం ఆలోచించింది; నిరుత్సాహమే చివరికి మిలిగింది.

"ఇవాళ రెండు పాటలు పాడు, మీ ఆయన వచ్చినతరువాత నువ్వేం సాధకం చెయ్యలేదు!" అని శర్మగారు ఒకరోజు రాజంకి గుర్తుచేసారు. రాజం చూపు భర్తమీద పడింది.

రఘుపతి ఏదీ పట్టించుకున్నట్టు కనిపించలేదు. "సరే, అది పాడనీ; రాజం సంస్కృత శ్లోకాలు బాగా పాడుతుందని విన్నాను. నాకూ వినాలనివుంది," అని అనడానికి అతనికి మనసు రాలేదు.

భర్త మనసులో ఏముందని రాజంకి అర్థం కాలేదు: శర్మగారి పట్ల ఉపేక్ష, లేక తన గానవిద్య గురించి హేళన?

ఈ రెండు ప్రశ్నలూ రాజంని వేధించాయి.

ఇటీవల భర్త, శర్మగారిమధ్య జరిగే సంభాషణలు రాజం శ్రద్ధగా ఆలకించింది. రఘుపతితో మాటాడానికి శర్మగారికి ఎంత ఆతురత! వార్తాపత్రికల్లో చదవినవన్నీ చర్చించడానికి ఒకరికొకరు పోటీపడుతున్నట్టు ఇద్దరూ కనిపించారు. ఒకరోజు సంగీతం గురించి తర్కం; ఇంకొకరోజు గవర్ణమెంటు నడిపే నియంత్రిత వస్తువుల విధానం గురించి ఉగ్రమైన వాదం. ఏ విషయమైనా రుజువుచెయ్యడానికి రఘుపతి వెనకాడడని రాజంకి తెలుసు; శర్మగారికికూడా ఉత్సాహంతో ఒక ప్రశ్నని గూఢంగా

అన్ని కోణాలలోనూ వివరించడమంటే ఇష్టం. రెండవ ప్రపంచ యుద్ధంలో ఆర్థికంగా అతను దెబ్బతిన్న మనిషి కనుక రోజూవారీ ప్రశ్నలు, వాటిలో ఇమిడియున్నరాజకీయ, ఆర్థిక అంతర్భావాలు తెలుసుకోవాలని అతనికి ఆకాంక్ష. "సరే, మనకి స్వాతంత్రం వచ్చింది, అందువలన ఇక మంచిరోజులెప్పుడు వస్తాయి? గవర్ణమెంటు అమలుపరుచుతున్న చట్టాలవలన సామాన్యజనులకేం లాభం? సరకుల్లో కొరతవుందని, దానికి పరిహారంగా గవర్ణమెంటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు విన్నాం. కాని బ్లాక్ మార్కెట్ లో అన్ని వస్తువులూ అమితంగా దొరుకుతున్నాయే? ఏం, గభీమని ఎక్కడనుంచి అవి ప్రత్యక్షమయ్యాయి? అంటే మనం వింటున్న ఈ కొరత అబద్ధం కాదా? గవర్ణమెంటులో ఇటువంటి అజ్ఞానం న్యాయమని ఎవరైనా ఒప్పుకుంటారా?" శర్మగారు నిత్యమూ ఇటువంటి ప్రశ్నలు అడుగుతూ. సమాధానాలు వెదకడం అలవాటు చేసుకున్నారు. రఘుపతి బాగా చదువుకున్నవాడని, తన ప్రశ్నలన్నీ తీర్చగలడని అతనికి నమ్మకం. రఘుపతికూడా సమయం దొరికినప్పుడు తన అభిప్రాయాలు శర్మగారితో పంచుకోవడం అలవాటు చేసుకున్నాడు.

కాని కొన్ని సమయాల్లో రఘుపతి ఉత్సాహంలో ఒక మలుపు కనిపించింది. తను తమిళుడు అని అహంకారంతో కూడిన మనోభావంతోబాటు శర్మగారు ఆంధ్రులు అని ఎగతాళి చేస్తున్నట్టు ఒక సూచన చోటుచేసుకుంటుంది. "మీకసలు సంగీతంగురించి రవంతైనా తెలుసా?" అని అతన్ని నియతంగా అణగద్రొక్కినట్టు ఒక ధోరణి రఘుపతి ధ్వనిలో మ్రోగుతుంది. సంగీతంలో శర్మగారికి విద్య, ప్రత్యేకజ్ఞానం ఉన్నా ఒకసారి అతనికేం తెలియదన్నట్టు రఘుపతి వ్యవహరించాడు. తక్కిన విషయాల్లోనూ అతన్ని చులకనచేసే విధంగానే మాటాడడం రఘుపతికి అలవాటైపోయింది.

శర్మగారు సమన్వయం, నిగ్రహంతో అతని మాటలు వింటారు. కాని కొంచెం సమయంలోనే అతను రఘుపతిని పీఠంమీద నిలబెట్టి మళ్లీ అతని అభిప్రాయాలు వేడుకుంటారు.

గురువుగారి దురవస్థచూసి రాజం క్లేశపడింది. 'శర్మగారు వయసులో పెద్దవారు, కేవలం ఆ కారణంవలనైనా నా భర్త అతనికి మర్యాద చూపకూడదా?' అని రాజం బాధపడింది.

రాజం అలాగ భావించడానికి అర్ధముంది. వయసు మళ్ళిన వారిలో లోపాలుంటాయి. అవి వారి మానసిక విలాసంపై ఆధారపడివుంటాయి. ఇదిగో, ఒక నిదర్శనం: ప్రారంభంలో శారదాంబాళ్ తన్ను కూతురు భవానిలాగ ఆదరించుతారని రాజం ఎదురుచూసింది; తనూ భర్తతో బయటికి వెళ్ళడం, మిత్రులని కలుసుకోవడం సాధ్యమనుకుంది. కాని ఆ తరువాత శారదాంబాళ్ ఇంటిలో ఒక విధమైన పద్ధతి, క్రమశిక్షణ విధించాలని పూనుకున్నారని - 'అందులో ఆశ్చర్యమేముంది? అది ఆవిడ సహజబుద్ధి,' అని - రాజం గ్రహించింది. ఆ కారణంవలన ఇప్పుడు రఘుపతి నిత్యమూ శర్మగారిని అదే పనిగా బాదడం తనెలా సహించగలదు?

'ఎవరేమైనా సరే. నా స్వభావంలో సంగీత అభిరుచి నాటించినది శర్మగారే,' అని రాజం జ్ఞాపకం చేసుకుంది. 'కాని నా భర్త అతని ప్రాధాన్యం, ఘనత గుర్తించలేదు. ఎంత శోచనీయం!' అని వాపోయింది.

రాజం దృక్పథంలో శర్మగారు సరస్వతిగా స్థిరపడిపోయారు - అవును, అసలు ఆ సంగీత దేవతామూర్తి సరస్వతిలాగ. తనకి వచ్చిన *రాజ్యం* అనే ప్రశంసకి అతనే మూలకారణం. తన బొందెలో ప్రాణం ఉన్నంతవరకూ రాజం అది మరిచిపోదు.

శర్మగారిమీద ఆమెకున్న గౌరవం అసామాన్యంగా అవతరించింది.

ఒకరోజు శర్మగారు ఏవో రెండుపాటలు పాడమని అడిగినప్పుడు రాజం తన్నెవరో బలాత్కారం చేసినట్టు గర్జించింది: 'ఎంత మంద బుద్ధి ఇతనికి! నా భర్త ఉదాసీనతగురించి ఎంత అజ్ఞానం!' అని చిరాకుపడింది.

"ఇప్పుడు నేనతని భార్య, అందుకే నేను పాడను!"

"నాకేం అర్థం కావడంలేదు," అని శర్మగారు నవ్వారు.

రాజం కొంచెం ఆగింది, కాని తనేం చెప్పాలో గుర్తుచేసుకుంది. తన ఆత్మగౌరవం అభినందించింది.

"సార్, మాకిద్దరికీ పెళ్ళైనదినంనుంచి ఇది ఒక పెద్ద ప్రశ్నగా ఐపోయింది; దానిగురించి మరేం మనం మాటాడవద్దు!" ఒక క్షణం ఆగి రాజం ముగించింది: "నేను అతని సమక్షంలో ఎన్నడూ పాడను!"

ఇప్పుడే రఘుపతి ముఖమెత్తి రాజంని తీవ్రంగా చూసాడు.

"ఇదేం శపధమా?" శర్మగారు అడిగి మళ్ళీ నవ్వారు. అతని బేలతనం, వినమ్రత చూని రాజం ఇంకా తీవ్రంగా ధుమధుమలాడింది.

"అవును!" అని బొబ్బలు పెడుతూ రాజం అక్కడనుంచి నిష్క్రమించింది.

ఆ తరువాతి రోజులలో రాజం లోలోపున దాచుకున్న తన భావనలు వెల్లడిచేసే అవకాశాలేవీ రాలేదు. ఎప్పటిలాగే భార్యాభర్తలు బయటకి వెళ్ళే రోజుల్లో చెన్నపట్ణంలో దూరంలోవున్న మిత్రులని కలుసుకున్నారు; ఇంటిలో ఉన్నప్పుడు ఇద్దరూ అన్యోన్య చర్యలలో కాలం గడిపారు; తమ వ్యక్తిగత భావాలని ముసుగేసుకోవాలని వాళ్ళకు తోచలేదు.

రఘుపతి తన అత్తమామలతో గడిపిన కాలం కొంచెం ఎక్కువేమో అని ఎవరో అడిగినట్టు అతనికి బెంగళూరులో ఉద్యోగంకి ఇంటర్వ్యూకి రమ్మని ఉత్తరం వచ్చింది. రఘుపతి ప్రయాణంకి తేదీ నిశ్చయించాడు.

"మీరు శుక్రవారం వెళ్ళబోతున్నారా? స్వగృహంనుంచి శుక్రవారం ప్రయాణం నిషేధం . . ." అని రాజం భర్తకి తెలియజేసింది.

"నేను మా ఇంటికి వెళ్తున్నాను," అన్నాడు రఘుపతి.

"నేను నాగురించి మాటాడుతున్నాను," అని చెప్పి రాజం నవ్వింది.

"నీకు నాతో రావాలనివుందా?" ఆ మాటల్లో ప్రశాంతి, ఆత్మీయత కలిసివచ్చాయి.

"అవును. తప్పకుండా . . . "

రఘుపతి రాజం ముఖం చూసాడు. అందులో ఆవేశం కనిపిస్తుందా?

లేదు. కాని రాజం నిజంగా, సంతోషంగా కనబడుతోంది.

## 35

ఇంకా కొంచెం సమయంలో రాజం, రఘుపతి మద్రాసు చేరుకుంటారు; రాజంకి తన దేహం అపేక్షతో వొణుకుతున్నట్టు అనిపించింది.

అటువంటి స్పందన తను ఇందకుముందు తల్లిదండ్రులతో అత్తగారింటికి వెళ్ళినప్పుడు రాజం అనుభవించలేదు. ఇప్పుడు ఆమె మానసిక అవస్థ ఇందకుముందు భర్తతో మద్రాసుకి వెళ్ళిన సమయంకి విరుద్ధంగా ఉంది. ఆ రెండు సందర్భాలకి పొత్తుగా ఏమైనా ఉందా అంటే ఇదే: తను మళ్ళీ కర్ణాటక సంగీతంకి పేరు పొందిన మద్రాసులో తన భర్తతో కాపురం జేయబోతుంది; రాజంకి మరేం కలలు, ఆశలు లేవు. భర్తతో తను మద్రాసు రావడం తన విధి, ధర్మం; తను భవిష్యత్తుకలో మరేం ఉత్సాహమూ ఎదురుచూడడం లేదు.

ఇల్లు చేరినవెంటనే రాజం అత్తగారిని నియమం ప్రకారం వొంగి నమస్కారం చేసింది. శారదాంబాళ్ దంపతులని లోపలికి రమ్మని పిలిచారు. అకస్మాత్తుగా, ఎందుకో రాజం అత్తగారితో మాటాడానికి వెనకాడింది. నోరుతెరిచి పలకడానికి కొంచెం సమయం పట్టింది. మాటాడినా ఆనకట్టులాగ ఏదో ఒక అడ్డం; మాటలు - కొలిచిబెట్టినట్టు - నిదాన ధ్వనితో - పైకి వినిపించాయి.

“అమ్మా, చూడు, నీ కోడలు నీకిది బహుమానంగా తెచ్చింది!” అని రఘుపతి ఒక కొత్త మడుపు సంచిని తల్లికి అందించాడు. కావాలంటే దాన్ని, సంచిగానో, బుట్టగానో, లేక పెట్టిగానో వాడవచ్చు. అందమైన రంగులు పూయడంతో మామూలుగా యువతులు వాడే vanity bag లాగ అది కనిపించింది. అత్తగారికి అది కొనాలని రాజం భర్తకి నొక్కిచెప్పింది. అత్తగారి దగ్గర తగిన సంచి - చీరలు సర్దుకోడానికి - లేదని రాజంకి తెలుసు. ఈ బహుమానం పనికివచ్చే వస్తువని రాజం నమ్మింది.

“ఇతను (రాజం భర్తని సూచించి మాటాడుతోంది) వొద్దన్నారు, కాని నేను పంతంపట్టాను,” అని రాజం నవ్వుతూ చెప్పింది.

“ఇదెందుకిప్పుడు? దీని వెల ఎంత?” అని శారదాంబాళ్ నవ్వుతూ అడిగారు.

"రెండు రూపాయలు, పన్నెండణాలు అనుకుంటా . . . అవునా?" అని భర్తను చూసి రాజం అడిగింది.

"రెండు రూపాయలు, నాలుగణాలు . . ." అని రఘుపతి అన్నాడు.

"కాదండీ, రెండు రూపాయలు, పన్నండణాలు," అని రాజం అతన్ని దిద్దింది. "మీరు టార్చ్ లైటుకోసం బాటరీలు, చాకలెట్లు కూడా కొనడం నాకు గుర్తుంది."

"వీడేనా (రఘుపతిని సూచించి) డబ్బిచ్చాడు?" అని శారదాంబాళ్ అడిగారు.

"అవును . . . మేమిద్దరం కలిసి షాప్పింగ్ వెళ్ళాం. అక్కడ ఎన్నెన్ని రకాల సంచులు చూసాం. అన్నిటికీ మంచి గిరాకి . . ."

"నువ్విది కొన్నావా?" అని శారదాంబాళ్ మళ్ళీ రఘుపతిని అడిగారు. కాని రఘుపతి దృష్టి అలమారిలో దేనిమీదో ఉంది; తల్లిమాటలు అతను వినలేదు.

"ఎందుకిలా ఉత్తికే డబ్బు ఖర్చు చెయ్యాలి?" అని ఆవిడ గొణుక్కున్నారు.

గభీమని రాజంకి అనుమానం కలిగింది: సంచి కొనాలని చెప్పినది తను; డబ్బిచ్చినది రఘుపతి. సంచి 'రాజం కొన్న బహుమతి,' అని రఘుపతి అనడం పొరబాటేమో? అత్తగారి ముఖంలో చిరునవ్వు లటుక్కున మాయమవడం రాజం గమనించింది.

ఆ మధ్యాహ్నం రామశేషన్ భార్య దర్శనమిచ్చారు. ఆవిడకి రాజంపై చాలా అభిమానం. రాజంకి అది తెలుసు.

రాజం ఆవిడని చూసి చిరునవ్వు నవ్వింది. కాని అందులో ఉత్సాహం లేకపోవడం ఆ ముత్తైదువ గమనించింది.

"రాజంలో అలసట కనిపించడం లేదు; కాని ముఖం వాడిపోయినట్టు కనిపిస్తోంది," అని అన్నారు ఆవిడ.

"మరి అది ఇప్పుడేగా పుట్టిల్లునుంచి వచ్చింది?" అని శారదాంబాళ్ అన్నారు.

"శారదా, బాగా చెప్పావ్ . . . ఐతే రాజం ముఖ్యంగా వాళ్ళ అమ్మకి చేయూత ఇవ్వడానికి వెళ్ళింది; అందుకు మనం గర్వపడాలి," అని ఆవిడ పొగడారు.

"కాదని ఎవరన్నారు? ఇక్కడ కోడలుగా అనుభవించే నిమ్మళం, విశ్రాంతి వాళ్ళ ఇంటిలో రాజంకి ఏ మాత్రమూ దొరకదు. వాళ్ళది చాలా పెద్ద కుటుంబం; రాజం

అందరికన్నా పెద్దది. పుట్టిల్లునుంచి తిరిగివచ్చినప్పుడెల్లా రాజం దృఢంగానే కనిపిస్తుంది," అన్నారు శారదాంబాళ్.

"అవును, నీవన్నది నిజం; అత్తగారిల్లే రాజంకి ఎంచిన వాతాపరణంగా కనిపిస్తోంది, అని ఆవిడ ఆమోదించారు.

# రాజేశ్వరి

## నాలుగవ భాగం

## చెదిరిన ఆదర్శం

## 36

రాజం మణితో పుట్టిల్లుకి రాబోతుందని విని విశాలం కలవరపడింది.

ఇన్ని రోజులుగా మణి ఇంటిలో లేకపోవడం వలన ఆవిడ మణి రాక బెంగతో ఎదురుచూస్తూనేవుంది. "రాజం నాతో మన ఊరుకి వస్తోంది; ఇది మీరు ఎదురుచూడని శుభవార్త!" అని ఉత్తరంలో చదవగానే సంతోషపడింది. కాని ఆ సందేశంలోని తాత్పర్యం ఏమిటని విశాలం మళ్ళీ మళ్ళీ ఆలోచించింది: అల్లుడికి ఉద్యోగం దొరికిందా? రాజం ఆరోగ్యంలో ఏమైనా మార్పులా? ఇప్పుడెందుకు హఠాత్తుగా ఈ ప్రయాణం?

"భవాని ప్రసవంకి పుట్టినిల్లు రావడంగురించి రాజం నాకు చెప్పింది; వాళ్ళ ప్లాను మారినట్టుంది. ఒకవేళ శారదాంబాళ్ తను మాత్రం నాగ్ పూరు వెళ్ళాలని నిశ్చయించారేమో?" అని విశాలం భర్తకి చెప్పింది.

"నాకలా తోచలేదు. అలాగైతే భర్తకి, మామగారికి అన్ని వసతులూ సమకూర్చడం రాజంకి చేతకాదంటున్నావా?" అని అతను ఎదురుప్రశ్న వేసారు.

విశాలం గడపదగ్గర నిలబడి ఆతురతతో కొడుకూ, కూతురూ రావడం గమనించింది. ప్రయాణంలో ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ రాజం తన మనోవేదన మెత్తపరచుకున్నా, ఇప్పుడు తల్లిని చూడగానే ఆమె కళ్ళు తడిసిపోయాయి.

"ఎందుకీ తొందర ప్రయాణం? మంచిది, మణి నీకు దారితోడుగా దొరికాడు. ఇక వచ్చే రోజుల్లో వాడే నీకు తోడుగా ఉంటాడు. మీ నాన్నగారు ఇల్లు కదలనక్కరలేదు," అని నవ్వుతూ విశాలం స్వాగతం చెప్పింది.

"మణి, బావగారెందుకు మీతో రాలేదు?" అని నటరాజన్ అడిగారు. "మద్రాసు దర్శనం ఎలాగుంది?"

"Great!" అని మణి అన్నాడు; వాడి దృష్టి మూటాముల్లెలమీదనే ఉంది.

"Great? ఎవరికి Great? నాకూ మద్రాసులో అన్నీ చూడాలని ఆశ. మచ్చుకి ఒకటైనా చూడలేదు!" అణచరాని ఆగ్రహంతో రాజం పలికిన మాటలవి.

"ఏం, నీకు మణితో అవన్నీ చూడాలనిపించలేదా?" అని నటరాజన్ అడిగారు.

"ఓ, అందుకే కాబోలు రాజం అలా మండిపడింది?" అన్నాడు మణి. "వెంటనే నాతో ఊరుకి రావాలని నిశ్చయించింది."

అబలకి కన్నీరు బలం; రాజం కన్నీరు కార్చడం మొదలుబెట్టింది. "అమ్మా, వాళ్ళు నాకు Hysteria వ్యాధి అని అంటున్నారు. నావలన వాళ్ళకెందుకు కష్టమని నేనే వచ్చేసాను," అని మొరబెట్టుకుంది. ఆమె జలజలమని కన్నీరు కార్చుతుంటే పిల్లలు మూటాముల్లెలు తిరగవేసి వెదకడం ఆపేసి అక్కయ్యని వింతగా చూస్తూ నిలబడ్డారు.

"Hysteria?" విశాలం దిగ్భ్రాంతితో అడిగింది.

"పాప నిద్రపోతుందా?" అని అడుగుతూ మణి ఉయ్యాలదగ్గరికి నడిచాడు; రాజం తమ్ముడి వెనక నడిచింది. పాపని ఎత్తుకొని, గుండెలో ఒత్తుకొని ముద్దాడాలని ఆమె వాంఛ. రాజం చెయి తాకినవెంటనే చంటిపాప కదిలింది. ఇంతలో మణి తన రెండు చేతులూ చాచి పాపని తనకిమ్మన్నాడు. ముందు రాజం నిరాకరించినా, ఒక నిమిషం ఆగి సరే అంది. పాప తన చిన్ని చేతులు కళ్ళమీద కప్పుకొని ఇంకా నిద్రలోనే వుంది. అక్కయ్యా, తమ్ముడూ ఇద్దరూ పాపకోసం పోటీలోవున్నారు.

"తమ్ముడు, చెల్లెలతో ఆడవేం?" అని నటరాజన్ నవ్వుతూ అడిగారు.

"వాళ్ళు నేను కొనితెచ్చిన పండ్లకోసం పోటీ పడుతున్నారు; నాకూ, మణికీ పాపని ఎత్తుకోవాలని పోటీ!"

రాజం స్నానంకి వెళ్ళింది. విశాలం భర్తతో గుసగుసలాడింది: "Hysteria అంటే ఏమిటి?"

" Hysteria . . . Hysterical . . . అంటే హఠాత్తుగా ఆవేశపడడం, భావనలని వెళ్ళగక్కడం అన్నమాట. మనసులో పాతుకున్న సాధకబాధకాలు అప్పుడప్పుడు బట్టబయిలుగా - మనకి అర్థం పర్థం లేకుండా - కనిపిస్తాయి. Hysteria లో చాలారకాలున్నాయి. ఎందుకు, నువ్వు రాజంగురించి అడుగుతున్నావా?"

"నాకా మాట వింటేనే అసహ్యంగా ఉంది. 'Hysteria అంటే భర్తమీద ద్వేషం,' అని ఎవరో అనడం నేను విన్నాను . . . "

నటరాజన్ కి విశాలం కలత అర్థమైంది.

"నేనన్నది అదే.  Hysteria ని మనం అనేక విధాలుగా వివరించగలం. ఒక్కొక్క స్త్రీ అంతరాత్మలో ఒక్కొక్క విధంగా సణుగుతూవుంటుంది; ఒకామె భర్తని అసంహ్యించుకొని ఏడుస్తుంది; ఇంకొక స్త్రీ చనిపోయిన తన భర్త జ్ఞాపకంలో కుంగిపోతుంది; ఇంకొక యువతి తన మొగుడు ఇతర స్త్రీలవెంట పరుగెడుతున్నాడని బాధపడుతుంది . . ."  నటరాజన్ ఇలా ఇంకా చెప్తూపోతుంటే విశాలం ఓపిక పట్టలేక "మీరందుకు ఆడవాళ్ళగురించే మాటాడుతున్నారు? మగవారికి Hysteria రానేరాదా?" అని అడిగింది.

"మనసుని అన్నివిధాలా పీడించుకోడం ఆడజాతికి వచ్చిన ప్రత్యేక కళ, అందుకే Hysteria వాళ్ళని బాధిస్తుంది," అని నటరాజన్ తమ వాదంకి సమాప్తి చెప్పారు.

"నేనేమంటున్నానో మీకు బోధపడిందోలేదో . . . మన అమ్మాయిగురించి నాకు బెంగగావుంది. మనం కొంచెం హెచ్చరికగావుంటే మంచిదేకదా?"

"మరేం భయం వద్దు. నీకు నీ మనసులో ఏముందో అందరికీ చెప్పే అలవాటుంది కనుక నీకా భయం లేదు. ఇక మగవాడు లోలోపనే కుంగిపోతూ  తన బాధలన్నీ మరెవరితోనూ  పరివర్తన చేసుకోపోతే అతనికీ Hysteria రోగం పట్టుకుంటుంది. స్త్రీలు సాధారణంగా మనసులో ఏముందో ప్రలాపించుతారు, మొగుడుతో దెబ్బలాడుతారు. మగవాళ్ళు ఎవరితోనూ తమ రహస్యాలు పంచుకోరు. ఇక మన అమ్మాయికిగాని, అల్లుడిగారికిగాని అటువంటి అవస్థ లేదు. తన నిరుద్యోగం వలన మన అల్లుడుగారు కృంగిపోలేదు. నేను అతన్ని గమనిస్తున్నాను. అతనలాంటి మనిషి కాదు. అతను సంతోషంగానే కనిపిస్తున్నారు, అలాగే ఉన్నారు. రాజం సంగతి నాకు తెలుసు, అది బాధ పడుతోంది. దాని అత్తమామల ఇల్లు మన ఇంటిలో మూడోవంతుకూడా లేదని మణి నాకు చెప్పాడు. మరి రాజం ఆ ఇంటిలో స్వేచ్ఛగా మెలగడం ఎలాగ? ఎవరి జోక్యం లేకుండా ఒక చోట కూర్చొని పది నిమిషాలు ఒక పుస్తకం చదవడంకూడా అసాధ్యమంటే  ఎలాగ చెప్పు? నీకు తెలుసా? ఆంగ్లేయుల ఇళ్ళలో అతిధికోసం ఒక ప్రత్యేక గది ఉంటుందట, ఎంత మంచి ఐడియా! విశాలం, మన ఇంటికి ఒక గెస్టు వచ్చారనుకో! మన సొంత కుటుంబ విషయాలు అతని ఉనికిలో మనం మాటాడలేం, అతనికీ అది సంకోచంగా ఉంటుంది. 'ఇతనెందుకురా మనమధ్య?' అని

మనసుకనిపిస్తుంది. అతనికీ రెస్ట్ కావాలి. ఎవరైనా సరే, అస్తమానమూ మనతో మాటాడడమంటే ఇష్టపడరు, రెస్ట్ కావాలంటారు. అతనికని ప్రత్యేకంగా ఒక గది ఇస్తే ఆ గౌరవం ఆనందించి అతను వొదిగి నిలబడతారు. అందరికీ హాయిగా ఉంటుంది. ఇక నా గురించి చెప్తాను విను. మనింటికి అతిథి ఎవరైనా వస్తే, నేనతనికి గది చూపించి, కొంచెం మాటాడి, వెంటనే సెలవు తీసుకుంటాను! నాగురించి ఎవరైనా complaint చేస్తున్నారా? ఇప్పుడే నాకు బాగా బోధపడింది. ఆ చిన్న ఇల్లూ, మితమైన జాగా - ఇవే రాజం జబ్బుకి ముఖ్య కారణం!"

'దేవుడా, రాజం తన భర్తని అసంహ్యించుకోకూడదు,' అని విశాలం తనలో గొణుక్కుంది, అలాంటి పరిస్థితి ఎన్నటికీ రాకూడదని మనసార ప్రార్థించింది. రాజం మాటలు ఆమె భయం చెదరగొట్టాయి: "అమ్మా, నాకిక్కడ పూర్ణ స్వతంత్రతవుంది; ఎక్కడ కావాలంటే అక్కడ నేను కూర్చుంటాను, లేక నిలబడతాను. నా ఇష్టం వచ్చినట్లు అన్నీ చెయ్యగలను. ఆ ఇంటిలో అందుకు అవకాశమేలేదు. అదొక నరకం! దేవుడా, నేను అనుభవించినది చాలు!"

రాజం కణ్ణన్ తో ముచ్చటలాడింది. రెండుచేతులు చాచి తమ్ముడ్ని గిరగిర తిప్పింది. ఆఖరికి ఇద్దరూ అలిసిపోయి నేలమీద కూలిపోయారు.

పొరుగింటి సీతమ్మ రాజంని చూడడానికి వచ్చినప్పుడు విశాలం కొంచెం గాబరా పడింది. "రాజం రావడంగురించి నాకే తెలియదు. వాళ్ళ అత్తగారే రాజం మనసు అర్థం చేసుకొని మనింటికి పంపించారు," అని ఆవిడకి చెప్పింది.

"రాజం ఆడపొడుచు ప్రసవంకోసం వాళ్ళింటికి వచ్చిందా?" అని సీతమ్మ అడిగింది.

"వాళ్ళకి ఇంటితోనే వంటమనిషి ఉన్నాడు; రాజం ఏమీ చెయ్యనక్కరలేదు. జరిగిందేమంటే మా మణి అక్కడకి వెళ్ళాడు. రాజంకి పాపని - తన చెల్లెల్ని- చూడాలని ఆశ. నాకూ సాయం చెయ్యాలని మణితో ఇక్కడకి వచ్చింది," అని విశాలం ఆవిడకి వివరించి చెప్పింది.

సీతమ్మ మనసులో వేరే ఉద్దేశం. "మామీ, రాజంకి అన్నీ తెలుసు. భర్తకి ఉద్యోగం లేనప్పుడు తను అక్కడ భారంగా ఉండడం రాజంకి ఇష్టం లేదు. రాజంకి

ఆత్మగౌరవం ఉంది. అందుకే ఇక్కడ వచ్చేసింది. రాజం మంచి చలాకీ పిల్ల, త్వరలో ఆమె భర్తకి ఉద్యోగం దొరుకుతుంది," అని రాజంని అమితంగా పొగడింది. అది విని రాజం చిరునవ్వు నవ్వింది. సీతమ్మతో పిచ్చాపాటి చేసే మనసు లేకపోవడంవలన మౌనంగా తన కృతజ్ఞత ఆవిడకి తెలియబరచింది.

ఇప్పుడు రాజంకి సంగీతంలో గొప్పగా ఆసక్తి లేదు. ఆమె మనసంతా తనకి దొరికిన ఈ కొత్త స్వాతంత్ర్యం తను అనుభవించాలనే వాంఛలో కలిసిపోయింది. భార్య ఆరాధించే కళాత్మక ఆదర్శాలు రఘుపతి నిర్లక్ష్యం చేసేసాడు; ఆఖరికి, అతని ధోరణి రాజం అభిలాషని ధ్వంసం చేసింది.

భర్త నిరుద్యోగి అనే కారణంవలన రాజం దుఃఖపడుతుందని సీతమ్మతోబాటు మరికొందరు తీర్మానించారు. 'అందువలన నీకేం కొరత లేదు,' అని ఆమెను ధైర్యపరిచారు. 'నాకేం విచారం లేదు,' అని రాజం వాళ్ళకి చెప్పలేదు, తనూ ఏదో కారణాలు కల్పించుకొని తృప్తి పడలేదు. 'అలాగే కానీ, నా భర్తకి ఉద్యోగం దొరికిన తరువాత - ఎక్కడైనా సరే, ఎప్పుడైనా సరే - మేం స్వేచ్ఛగా కాపురం చేస్తాం. అప్పుడు అతను దారాళంగా తన ప్రేమానురాగాలు నామీద వర్షించుతారు. నేనిప్పుడు అతనికి ఉద్యోగం లేదని బాధపడుతున్నానని ఇతరుల ఉద్దేశంలో తప్పు లేదు," అని రాజం తనలో చెప్పుకుంది.

రాజం వచ్చిన ఒక వారంలో పొంగల్ పండుగ వచ్చింది. ఆంధ్రులు దాన్ని సంక్రాంతి అని కొనియాడతారు. ఇంటింటికి వెళ్ళి పసుపూ, కుంకం అందిస్తారు.

రాజం పండుగకోసం ప్రత్యేకంగా పుట్టినిల్లు వచ్చిందేమో అని కొందరు ఆమెను అడిగారు. "లేదు, తమిళులకి దీపావళియే అల్లుళ్ళ పండుగ, సంక్రాంతి కాదు!" అని రాజం నిజం చెప్పింది.

రాజం కొన్ని సంగతులు వివరించి చెప్పింది. ఆమె భర్తకి ఉద్యోగం లేదని విని కొందరికి ఆశ్చర్యం కలిగింది. తన అత్తమామలు మద్రాసులో ఉన్నారని రాజం చెప్పింది.

తన మామగారికి ఒక పెద్ద ఉద్యోగం అని రాజం చెప్పినవెంటనే ఒక ముత్తైదువ "సరే, అలాగయితే అతనే నీ భర్తకి మంచి పని ఏర్పాటు చెయ్యవచ్చుగా?" అని అడిగింది.

మామగారు ఒకప్పుడు భార్యకి చెప్పినమాటలు రాజం ఇప్పుడు గుర్తుచేసుకుంది: 'ఎవరైనా సరే, కేవలం సొంత పిల్లలకోసం తమ నియమాలు మానుకుంటారా?' అని అతను అడగలేదూ?

ఇప్పుడే అతని ఘోషణలో వున్న తాత్పర్యం రాజంకి పూర్తిగా బోధపడింది:

"మా మామగారు అలాగెప్పుడూ చెయ్యరు!" అని గర్వంతో ఆవిడకి బదులు చెప్పింది.

ఈ సంబాషణ గురించి రాజం వివరించినప్పుడు నటరాజన్ ఏమన్నారు?

"రాజం, ఒక తండ్రి ప్రతిష్ట స్థానంలో ఉన్నారనుకో, అతని మూలం అతని అబ్బాయికి ఉద్యోగం దొరికిందంటే, అందులో సిగ్గుపడడానికి ఎటువంటి కారణమూ లేదు. ఆ ఆబ్బాయిలో సహజంగా తండ్రిలోని ప్రజ్ఞ, స్వభావం, యోగ్యత చోటుచేసుకోవచ్చు. ఒక రాజకీయ వేత్త అబ్బాయి పెద్ద ఉద్యోగంలో ఉంటే మనం వెంటనే దానికి కారణం తండ్రి ప్రభావం లేక బంధుప్రీతి అని వాదించకూడదు. నెహ్రూ కుటుంబంలో అందరూ పెద్ద పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. అందుకు కారణం ఆ ప్రాచీన వంశంలో కనిపించే గణ్యం, ప్రత్యేకత. తరతరాలుగా ఆ వంశంలో ఒక సంస్కృతిని శ్రద్ధగా పోషించడం అందరూ అలవాటు చేసుకున్నారు. ఆ నేపధ్యంలో కుటుంబ సభ్యులందరూ శ్లాఘ్యత, కీర్తికోసం పాడుబడ్డారు, నెగ్గారు. ఆ కారణం వలనే మనం ఇవాళ వాళ్ళందరినీ గౌరవమైన అంతస్తులో చూస్తున్నాం. అందుకు బదులు 'ఇదంతా మామూలే - దోపిడీ, స్వాభిమానం, పక్షపాతం!' అని మనం వాదిస్తే అది మనం చేసే పెద్ద పొరబాటు," అని అన్నారు నటరాజన్.

రాజం అతనితో ఏకీభవించింది. త్వరలో భర్తకి ఉద్యోగం దొరుకుతుందని ఆశించడంతో ఆమె మనసుకి శాంతి కలిగింది.

# 37

"అమ్మా, మేం పర్లాకిమిడినుంచి కొనితెచ్చిన ప్లాస్టిక్ సంచె నీకు జ్ఞాపకం ఉందా?" అని రాజం తల్లిని అడిగింది.

"'అత్తగారికి అది మంచి బహుమానం,' అని నేనే ఐడియా ఇచ్చాను. సరేయని మా ఆయన కొన్నారు. కాని అదేమో తన అబ్బాయి బహుమానం అని ఆవిడ అందరికీ చెప్తున్నారు."

విశాలం చిరునవ్వు నవ్వింది: "అవును మరి. మీ ఆయన నాన్నగారి ఆస్తి అనుభవిస్తున్నారు. అది మీ మామగారి బహుమానం అని అనవచ్చుగా?" అనగానే రాజం తల్లిని రెక్కవాల్చకుండా చూసింది.

"అంటే డబ్బు ఎవరిచ్చారో అదే లెక్కన్న మాట!"

"ఆ రోజుల్లో మా ఆయన తన ఇంటిలో అందరికీ చీరలూ, బిస్కట్టులు, చాకలెట్టులూ కొని తెచ్చేవారట! నాకూ అలాగ కొంటే ఎంత బాగున్ను!" అని చెప్పి రాజం నిట్టూర్పు వదలింది.

ఒక క్షణం ఆగి విశాలం జవాబు చెప్పింది. "ఆ రోజుల్లో మీ ఆయన మీ మామగారి కొడుకు అనే స్థానంలో మెలిగారు. నాన్నగారి డబ్బు ఖర్చుపెట్టడమంటే అతనంత బాధపడలేదు. కాని క్రమంగా, ఇన్ని సంవత్సరాల తరువాత అతని ఉద్దేశంలో మార్పు రావడం సహజమేకదా? ఇప్పుడు అతను నీ భర్త; నీకు తన ఆదాయంతో బహుమానం కొనాలని అతనికి వాంఛ. తన సొంత వ్యవహారాలకి నాన్నగారి డబ్బు ఖర్చు చెయ్యడం అతనికి ఇష్టం లేకపోవచ్చు."

తల్లి మాటల్లో మంచి న్యాయంవుందని రాజంకి తోచింది; మనసు కుదుటబడింది.

ఆ మనశ్శాంతిని చెదరగొట్టాలని విధి బందుకట్టుకున్నట్లు ఒక విషాద సంఘటన జరిగింది. తోబుట్టువులమధ్య పరస్పర ప్రేమకీ, సంతోషభరిత భావాలని ఆదరించే ఆ బంధం గభీమని కూలిపోయింది. మంచుముద్దలాంటి శరీరం, అత్యాశతో తన ఛాతిమీదా, భుజంమీదా రాజం ఎత్తుకొని ముద్దాడిన ఆ శిశువు, తన రక్తబంధువు:

దేవుడు రాజం చేతులనుంచి ఆ అమూల్య కానుకని తటాలున లాక్కున్నాడు; రాజం చెల్లెలు - ఆ పసిపాప పరమపదించింది.

మన అభిమానంకి అర్హులు ఎవరైనా కన్నుమూస్తే ఆ దెబ్బ తాళలేక మనకీ వాళ్ళతో పోవాలని అనిపిస్తుంది. రాజంకి అలాగే తోచింది. అంతేకాదు, ఆమె మనసులో "ఇంతవరకూ నాకు జీవితం బాగానే - హాయిగా - సాగింది. ఇక వచ్చేరోజుల్లో నాకు కష్టాలే మిగిలాయి. నా చిన్ని చెల్లెలు సుఖమనేది మచ్చుకైనా తెలియకుండా పోయింది. దేవుడెందుకు దానికి బదులు నన్ను వశం చేసుకోలేదు?" అని వాపోయింది.

తల్లి, కూతురు ఇద్దరూ అగాధ దుఃఖంలో పడిపోయారు; పసిపాప దేహంని నిమురుతూ నీళ్ళు కార్చారు. పొరుగింటి సీతమ్మ ఈ దుర్గతిలో వాళ్ళని ఓదార్చింది. కళ్ళు తుడుచుకుంటూ రాజంకి బుద్ధి చెప్పింది: "అలా మాటాడకు! పెరిగిన పిల్లలు పోతే తల్లిదండ్రులు భరించలేరు. నువ్వుగాని పోతే వాళ్ళు సర్వనాశనమవుతారు; అది తక్కిన పిల్లలనీ బాధించుతుంది. ఇప్పుడు జరిగిన దుర్ఘటన అలాంటిది కాదు. మన తల్లిదండ్రులు మనతో ఉన్నప్పుడే మన జీవితం కఠినంగా ఉంది. ఇక వాళ్ళకి గుండె పగిలినట్టు ఏమైనా జరిగితే తక్కిన పిల్లల గతి ఏమౌతుందని ఆలోచించావా? నీకు బతుకంటే అసహ్యమనిపించవచ్చు, కాని ఆ విచారం మీ ఇంట్లో అందరినీ తాకుతుంది. మనం చావుని రమ్మని పిలవసేకూడదు. యముడేం ఉత్తికే వచ్చిపోతాడనుకున్నావా!" ఆవిడమాటలు విని రాజం వేరే కోణంలో 'నాకు చావు రావాలని నేను కోరాను; నాకు బతుకంటే విరక్తి వచ్చేసింది. యముడు నా మొర విన్నాడా? నా కష్టాలకి దేవుడు నా చెల్లెల్ని దండించాడా?' అని ఇంకా తీవ్రంగా కలతపడింది. 'హాయిగా ఉన్నరోజుల్లో నేను కన్నీరు కార్చాను, అది పెద్ద అపరాధం కాదా? అందువలనేనా నాకీగతి? నా బతుకంతా ఇలాగే సాగాలని దేవుడు నిశ్చయించాడా? అసలు నేనిక్కడికి రావడమే పెద్ద పొరబాటు; అక్కడ నేను కోరినది నా విముక్తి మాత్రమే. ఇక్కడ నా చెల్లెలు కూడా బతికివుండేదేమో?' అనే తలపులో రాజం పదే పదే మనసుని హింసించుకుంది.

ఇలాగ ఘర్షణ పడుతున్న కారణాలవలన రాజం వ్యాకులత ఇంకా పెరిగింది. "నాకు చాలా బాధగా ఉంది. మిమ్మల్ని వెంటనే చూడాలనివుంది," అని భర్తకి రాసింది. "నేను మంచి కుటుంబంలో పుట్టాను. జేష్టకుమారిగా అన్నివిధాల హక్కులూ అనుభవించాను. నేను సాధించినవన్నీ గుర్తుచేసుకుంటే నాకు గర్వంగానేవుంది. కాని నా మనసు శోకమయంగా ఉంది. ఎందుకు? నాకింకా ఇరవైకూడా దాటలేదు, అప్పుడే నాకు జీవితంలో విరక్తి వచ్చేసింది. నా చెల్లెలు జీవితం స్వల్పమేయైనా అది స్వర్గం చేరుకుంది," అని రాజం విపులంగా వర్ణించింది; తన కటువంతా వెళ్ళగక్కి ఆ ఉత్తరం రాసింది.

దుర్ఘటనలు తాత్కాలికంగా ప్రజలు అనుభవించే పరిస్థితులు. రాజం తనకేర్పడిన దెబ్బగురించి వ్యసనపడుతున్న అదే సమయంలో భారత దేశమంతా మరొక విపత్తులో త్రుళ్ళిపడింది.

తఠాలున ఒక ఒక ఘోరహత్యలో మహాత్మా గాంధీజీ కన్ను మూసారు.

అతనూ స్వర్గం చేరుకున్నారు. కాని రాజం మనసుకి దానివలన శాంతి ఏర్పడలేదు. ఎక్కడచూసినా అంధకారం; పురజనులు విషాదభరిత అవస్థలో కూలిపోయారు.

చివాలున, ఇప్పుడు తనకేర్పడిన నష్టం రాజంకి తేలికగా కనిపించింది.

'అతనెంత గొప్పనాయకులు! స్వాతంత్ర్యదేశానికి అతనొక హృదయస్పందన! అతని మరణంకన్న దుఃఖాంతమైనదేమైనా ఉందా?'

గాంధీజీగారంటే రాజంకి అంత గాఢమైన భక్తి.

రఘుపతి రాజంతో ఏకీభవించాడు. ఉత్తరంలో "నేనిక్కడ ఉత్తికే, ఏమీ చేయక రోజులు గడుపుతున్నాను. గాంధీజీ మన దేశంకి ఒక నాడిగా మెలిగారు. ఇప్పుడతను పోయారు, మనం ఒక పెద్ద దేశరక్షకుల్ని పోగొట్టుకున్నాం," అని రాసాడు.

అప్పుడే రాజం తన భర్తకూడా గాంధీజీ అభిమాని అనే సత్యం గ్రహించింది.

అసలు మహాత్మా జీవితంలో ముఖ్య సందేశం ఏమిటి? జనులు తమ లోపాలు, ఆక్షేపణలు అధిగమించాడానికి పరస్పర ప్రేమ ప్రధానమని అతను వక్కాణించి

చెప్పారు. ఆ నియమం మూలంగానే తనూ, రఘుపతి తమమధ్య ఓర్పు, సహనం పాటించుతున్నట్టు రాజం గర్వపడింది.

"నాకు చాలా బాధగా ఉంది. మిమ్మల్ని వెంటనే చూడాలనివుంది," అని రాజం రాసిన వాక్యాలు రఘుపతి మళ్ళీ మళ్ళీ చదివాడు.

ఇటీవల అతని దృక్పథంలో ఒక వేదాంతిలాంటి ఛాయలు చోటుచేసుకున్నాయి. రాజం తనకి ఎక్కడ ఇష్టమో అక్కడ హాయిగా ఉండనీ అని అతని ఉద్దేశం. కాని రాజం ఇప్పుడు పడుతున్న వ్యాకులత విని అతను దిగిలుపడ్డాడు. ఎందుకు? తమిద్దరి ఎడబాటుతో చెల్లెలి మరణం రాజం మనోవ్యదకి కారణమని అతను అర్థం చేసుకున్నాడు. ఆమె ఇక్కట్టు తీర్చాలని నిశ్చయించాడు.

ఈసారి మామగారింటికి రఘుపతి వచ్చినప్పుడు అతని ధోరణిలో మార్పుతోబాటు సహానుభూతికూడా చోటుచేసుకుంది. ఇప్పుడు అతను రాజంని దైవస్వరూపిణిగా చూడలేదు. ఆమెలోవున్న మానవీయ గుణాలు అతనికి తేటగా కనిపించాయి.

ఈ అవగాహన అతన్ని నిరుత్సాహపరచలేదు. యౌవనదశలో తీయని ఊహలు, కలలు రాజం మనసుని ఆవరించుకున్నాయని రఘుపతి గుర్తుచేసుకున్నాడు. భవాని దగ్గర ఆమె అనుభవించిన దురాదరణ, పెద్దమనసుతో రాజం ఆవిడని క్షమించిన పైఖరి – అతనెలా మరిచిపోవడం? రాజంలో అతను ప్రధానంగా చూసినవి నిష్కపటం, సభ్యత. ఇక పాత జ్ఞాపకాలు దొర్లుతూ రావటంతో – నవ్వులూ, ఏడ్పులూ; అలుక, అన్యోన్యంతో కలిసిన ఘటనలు; తర్కం, రాజీతో గడిపిన రోజులు; ఇవన్నీ ఆతన్ని ఉల్లాసపరిచాయి.

'మేమిద్దరం ఆదర్శ దంపతులం, మా కష్టసుఖాలు పంచుకునే జత!' అని రఘుపతికి ఆత్మతృప్తి కలిగింది. రాజం భర్తకి ఇంపుగా స్వాగతం చెప్పింది. ఈసారి అతనితో ఎక్కువగా మాటాడింది, కలిసి నవ్విందికూడా. ఇంతకుముందు ఇలా నవ్వలేదు, కాని ఆ నవ్వులోను కొంచెం శోకరసం కనిపించకపోలేదు. కన్నీరు కార్చుతూ తన చెల్లెలుగురించి మాటాడింది. కాని వెంటనే 'ఆడదాని బతుకులో ఏముంది? అందుకే అది ఆ హింసనుంచి తప్పించుకొని వెళ్ళిపోయింది,' అని

సణుక్కుంది. ఆ మాటలతో రాజం మన మనసులోని విరుద్ధబావాలు మళ్ళీ బయటకి వెళ్ళగక్కింది.

"మరి మగవాడి సంగతో? ఉద్యోగం లేదంటే పెళ్ళాం దృష్టిలో భర్తకి ఏం గౌరవం ఉంటుంది?" అని రఘుపతి చిరచిరలాడాడు.

నాలుకాడక రాజం అలాగే స్థంబించిపోయింది.

'నేనెందుకు బాధపడుతున్నాను – అది అతని నిరుద్యోగంవలన కాదని – అతనికి నేను తెలియజేయాలి!' అని రాజం నిశ్చయించింది.

కొన్నిరోజులముందు ఒక ముత్తైదువ – రాజం శ్రేయోభిలాషి – రాజంని ఓదార్చే రీతిలో పలికిన మాటలు రాజం గుర్తుచేసుకుంది: "నువ్వెందుకు విచారంగా కనుపిస్తున్నావ్? మీ ఆయనకి ఇప్పుడు ఉద్యోగం లేదని విన్నాను. కాని అందువలన మీ కుటుంబంలో ఎవరికీ నష్టం లేదే? నువ్వు బాగానే ఉన్నావు. నీకు తల్లిదండ్రులూ, అత్తమామలూ ఉన్నారు. పిల్లలున్న దంపతులే తమ జీవితం ఇతరుల దయమీద ఆధారపడియుంటుందని బాధపడతారు, అందులో న్యాయమూ ఉంది. నీకటువంటి ప్రశ్న లేదే?" అని ఆవిడ అడిగారు.

రాజం చిరునవ్వుతో ఆవిడ మాటలు తోసిపారేసింది. కాని ముఖంద్వారా ఒక సందేశం అందజేసింది: 'మీరన్నది నిజమే కావచ్చు. కాని నా శోకం నేననుభవించక తప్పదు. నా సంగతి వేరే, మరెవరితోనూ నన్ను పోల్చవద్దు!'

ఆ ముత్తైదువకి రాజం మనసులో ఏముందో అర్థమైందేమో?

"మా ఆయనకి ఉద్యోగం లేదని నాకు బాధగా లేదు!" అని రాజం వెంటనే చెప్పదలచుకుంది. కాని కొంచెం వెనకాడింది.

కాని ఆ ముత్తైదువ తన ఉద్దేశం ఏమిటో చెప్పేసింది: "అలా కాకపోతే మనకీ, సామాన్య వేశ్యకీ ఏమైనా తేడావుందా?"

ఆవిడ సూచన ఇది: డబ్బుతో వచ్చిన మగాడినే వేశ్య ఆదరిస్తుంది. డబ్బులేకపోతే పొమ్మంటుంది. ఉద్యోగం లేదని భార్య భర్తని నిరాకరించవచ్చా?

అదే ఆవిడ ప్రశ్న!

తన భర్త నిరుద్యోగ విషయంలో ఇతరుల అభిప్రాయాలు నివారించడం అసాధ్యమని రాజంకి బోధపడింది; కాని వాళ్ళ వైఖరి సరే అని ఒప్పుకుంది.

ఇంతవరకు తన దృక్పథం తప్పని రాజంకి అనుమానించలేదు. తన భర్త నిరుద్యోగం కళంకమని అందరూ అన్నప్పుడు తనూ ఆ నింద మోస్తున్నట్టు రాజంకి తోచింది. అంతేకాదు, ఆ కారణంవలనే భార్య అనే తన హోదా ఇంకా అధిగమించినట్టు రాజం కొంచెం గర్వపడిందికూడా.

ఐతే, ఇప్పుడు ఆ ముత్తైదువ మాటలు తన్ను నలగగొట్టినట్టు రాజం బాధపడింది.

"మా ఆయనకి ఉద్యోగం లేదని నాకు ఆరాటం లేదు!" అని కూతపెట్టాలని రాజం తొందరపడింది.

తన భర్తకీ అతని నిరుద్యోగం ఒక ప్రశ్నగా కనిపించలేదు. మరి అతనెందుకు తనకున్న భర్త అనే హక్కుల చెలాయింపుకి వెనకాడుతున్నారు?

అతనికి ఉద్యోగం లేదని రాజంకి బిడియం లేదు. అతనిలో కనిపించే ఉపేక్ష, తొలిగివుండే గుణం - ఇవే తన దురవస్థకి కారణం. తనకి కావలసినది ప్రేమ . . . అదెవరూ గుర్తించినట్టు కనబడదే?

ఈ ప్రపంచంలో మరెవరికీ తన దుర్గతి తెలియకపోవచ్చు, కాని తన భర్తా, సహృదయులూ తన బతుకులోని శూన్యం గ్రహించడం అంత కష్టమా? రాజం డబ్బా, అధికారం కావాలని అడుగుతోందా? లేదు. తను మనసార ఆనుకొని పోషించగల . . . దానికేం పేరు? అదేదో అంత సులభంగా వర్ణించడం అసాధ్యం, తన దుర్గతివలన దాన్ని విపులంగా వర్ణించడం చేతకాదు. మరి ఒక ఆడది బాహాటంగా మనసు విప్పి కటుపైన మొఱలు వెల్లడించడం అమర్యాద అని అందరికీ తెలుసుగా?

రాజంకి ఒక ఆలోచన కలిగింది. తనెందుకు - అప్పుడప్పుడు - జాడగా, ఒక సూచన మూలంగా తన వ్యాకూలత తెలియపరచకూడదు? తన మనసులో ఏముందో రఘుపతికి అర్థమవుతుందేమో? తన సంకేతం అతను అవగతం చేసుకుంటే? అతను తన మనోవ్యథ తప్పకుండా గ్రహించగలరు . . .

రాజం తన దిగ్భ్రమని మెల్లమెల్లగా చిక్కు విడదీయాలని పూనుకుంది.

చమత్కారంగా ఆమె అల్లిన సాంకేతిక సందేశాలు - చాటుగానూ, బాహాటంగానూ - రాజంలో అణగియున్న వెటకారం, కటూక్తిని వెళ్ళగక్కాయి.

ఎలాగ?

శర్మగారు ఒకరోజు వచ్చారు. ఎప్పటిలాగే అతను దర్శనమిచ్చారు. కాని రాజం తన వ్యూహం మార్చింది.

"పెళ్ళికి ముందు ఒక అమ్మాయిని చూసి 'నీకు సంగీతం తెలుసా?' అని అడగడం వ్యర్థం. మన మణికి చూసే అమ్మాయిని అలాంటి ప్రశ్న అడగనేకూడదు అని నా ఉద్దేశం," అని రాజం శర్మగారికి చెప్పింది. నేరుగా, పెళ్ళైన తరువాత అత్తమామలు ఆమెకి సంగీతలోవున్న అభిరుచిని ప్రోత్సాహించరనే అవకాశం గురించి రాజం అనలేదు. రఘుపతికి ఆ సందేశం అర్థం కాలేదు; రాజం మండిపడింది.

కాని నటరాజన్ నవ్వుతూ "మన మణికి సంగీతంలో మంచి అభిలాష ఉంది - మీ ఆయనలాగ," అని నవ్వారు.

"అవును, మంచి అభిరుచి! పెరడులో పెరిగిన మొక్క మూలికైనట్టు!" అని రాజం నవ్వింది.

"అదేంటి? . . . ఏదో సామెత చెప్తున్నావా? అని శర్మగారు అడిగారు.

"ఏమీ లేదు . . ." రాజం మరేం అనకుండా అక్కడనుంచి నిష్క్రమించింది.

తన కృషికి, సంగీత ప్రజ్ఞకి విలువ ఉందని రాజం నమ్మింది; కాని అది వ్యర్థమని ఇప్పుడు తెలిసింది.

ఇంకొకరోజు రాజంకి ఒక అవకాశం దొరికింది.

"పదే పదే ఈ అప్పడాల గొడవ విని నాకు పిచ్చెక్కినట్టుంది. చంద్రున్ని చూస్తే అప్పడాలు చూస్తునట్టుంది!" అని అంటూ రాజం రెండు చేతులతో చెవులు మూసుకుంది.

"మా అమ్మ అప్పడం చూసినప్పుడెల్లా నీకు చంద్రుడే జ్ఞాపకం వస్తాడు," అని రఘుపతి అన్నాడు.

"బాగుంది, ఎప్పుడూ తిండిగొడవేనా?" అని రాజం ముఖం చిట్లించడం రఘుపతి గమనించాడు, కాని ఏమీ అనలేదు.

ఇప్పుడు వంటగదినుంచి విశాలం మాటాడింది: “లోకమంతా కడుపుకోసమే పోరాడుతోంది!”

“ఈ పోరాటం నాలికకి, కడుపుకి కాదు!” అని రాజం చిరచిరలాడుతూ భర్తను చూసింది.

“నీకు తెలుసా ఎంతమంది జీవనోపాయం ఈ అప్పడాలమీద ఆధారపడివుందని? మన నాలికే అప్పడాలు కావాలంటోంది,” అన్నాడు రఘుపతి.

ఎడతెగకుండా భర్తతో వాదించడానికి రాజం వెనకాడింది: ‘మీ అమ్మగారివల్ల ఎంతమంది మహిళలు తమ అప్పడాల వృత్తిని కోల్పోయారో ఎవరికి తెలుసు? ఈ అప్పడాల భ్రాంతివల్ల, నేనూ నా సంగీత సాధన వదులుకున్నాను; నా చెవులు పులిసిపోయాయి, నా గుండె పగిలినట్టుంది,’ అని రాజం చెప్పాలనుకుంది; కాని మనసులో అణచుకుంది.

‘అతను వాదించడం మానుకోరు; ఈ అప్పడాల పిచ్చి నన్నేం చేసిందని అతనికి తెలియదా?’ పట్టరాని కోపంతో రాజం ముఖం తిప్పుకుంది. ‘మనదేశంలో మద్యపానం నిషేధం చేసేసారు. ఇంకా కొన్నిరోజుల్లో అప్పడాలు కూడా బహిష్కారం చేస్తారని నా ఆశ. Down with అప్పడాలు!’ అని రాజం మనసులో కొనియాడింది.

అలాగే - మరొకనాడు - భర్తతో విసుక్కుంది.

“ఆడవాళ్ళకి అస్తమానం అప్పడాలమీద పిచ్చి ఆవేశం అంటే నేను అర్థం చేసుకోగలను - వాళ్ళు నిత్యమూ అప్పడాలు వొత్తుతున్నారు - కాని మగవాళ్ళకి కూడానా? వాళ్ళకెందుకీ భ్రమ?” అని అడిగింది.

ఇప్పుడే, ఆఖరికి రఘుపతికి రాజం ఆతురత అర్థమైంది.

“నీకు మా అమ్మ అప్పడాలు ఏం గొప్పగా కనిపించకపోవచ్చు, నాకు మాత్రం చాలా గర్వంగా ఉంది. ఈ అప్పడాలు special!”

“ఏం, ఎందుకు special?”

“మరెవరైనా అలాగ చెయ్యగలరా చెప్పు? No, they are special!”

“అలాగేంకాదు, నేనూ చెయ్యగలను. అలవాటు పడితే అందరికీ సాధ్యమే!”

రాజం నవ్వుతో సర్దుకొని స్వాభావికంగా మాటాడింది: "ఎవరికి తెలుసు, రానూరానూ ఈ వయసులోనే నా సంగీతం, చదువులు వదిలేసి నేనుకూడా అప్పడాల మోహంలో చిక్కుకుంటానేమో?" అది ఒక కల్పితమైన నవ్వే. కాని దానిమూలంగా తన ఆత్మని బాహాటంగా భర్తకి తెలియజేసినట్టు రాజం నమ్మింది.

తన మనసులోని కలవరమంతా ఏకబిగువుగా కుమ్మరించడానికి రాజం జంకింది. దానికిబదులు, అప్పుడప్పుడు, సమయం దొరికినప్పుడెల్లా, ప్రశ్నలు, ఎగతాళి మాటలతో భర్తని హింసించడం అలవాటు చేసుకుంది; తనకిష్టం వచ్చినట్టు, ధైర్యంగా భర్త మనసు నొప్పించింది. మరి ఇన్నిరోజులూ తను సంకోచంతో అతని దోషాలు లెక్కచెయ్యలేదుగా? ఇంతకుముందు అతనితో నిత్యమూ జగడమాడినప్పుడు తనేదే నేరం చేసినట్టు రాజం భావించేది. కాని ఇప్పుడు పరిస్థితి వేరు. వొద్దని నాలిక ఆటంకం చెప్పినా రాజం వినలేదు. భర్త సముఖంలో ఒక క్షణం వెనకాడినా వెంటనే సర్దుకొని అతన్ని పురిగొల్పింది. అతనూ ఏదో కటువైన మాటతో - తేలు కొట్టిన పోటులాగ - బదులు చెప్పాడు.

వానపాము మానవులకెంతో ఉపయోగకరమైనది. నేలని సారవంతంచేసి వ్యవసాయానికి సహాయపడుతుంది. అదిగాని ప్రకృతిలో లేదంటే మనకి పండ్లు, కూరగాయలూ దొరకవట! వానపాముని తునకచేస్తే, ఒక్కొక్క తునక ఒక కొత్త వానపాముగా మారుతుందట! రాజంలోని కళాత్మకవాంఛకి ఇప్పుడు ఆ గతే ఏర్పడింది. ఆమె తన సంగీత మోహం తెంచుకోవాలని ప్రయత్నించినప్పుడెల్లా దానికి మరింత బలం, ప్రాణంతో పునర్జన్మ కలిగింది.

ఇంపైన వాతావరణం లేకనే తన సంగీత ప్రగతి దెబ్బతిందని రాజం ఇంతవరకూ బాధపడింది. మరి ఇప్పుడో?

ఆఖరికి ఈ అప్పడాల గొడవకి ఏదైనా అర్థముందా అంటే ఇదే! ఉద్యోగం లేకపోవడంవలన తన భర్తకి తిండిమీదే దృష్టి అంతా!

'నాకంటే ఎవరూ భవానిని మేలుగా చెప్పుకోరు; నేను ఆమెలాగుంటే నా పేరూ, ప్రతిష్ట ఎలాగ కనిపిస్తాయి?" అని రాజం ఆలోచించింది.

భార్యగా తనకి దొరికిన గౌరవం ఏముంది? రాజం ఆగ్రహమంతా భర్తపైపే మళ్ళింది.

రెండురోజుల తరువాత - రఘుపతి మనసులో కనికరం చోటుచేసుకుందేమో? - అతను కణ్ణన్ని "రా, మనిద్దరం పందెం ఆడదాం!", అని ఏదో ఆటకి పిలిచాడు. కణ్ణన్ ఏదో బదులు చెప్పగానే రఘుపతి " Yes, you are right, రా, నన్ను కొట్టు!" అన్నాడు; కణ్ణన్ దెబ్బలు వాయించుతుంటే మౌనంగా భరించాడు. ఈ దృశ్యం చూసి రాజం నివ్వెరపోయింది.

మరొకరోజు, మరొక ఘటన.

"నేను నా జీవితం ధ్వంసం చేసుకున్నాను. దానికి నాచుట్టూ ఉంటున్న మనుషులే కారణం!" అని రాజం మొరబెట్టుకుంది. రఘుపతి పట్టరాని కోపంతో తల తిప్పి రాజం ముఖం చూసాడు. ఇద్దరి ముఖాలు కలుసుకున్నవేళ అతని కోపం కొంచం తగ్గింది. కంఠధ్వని లేవనెత్తి రఘుపతి అడిగాడు: "నువ్వెలా నీ జీవితం పాడుచేసుకున్నావో చెప్తావా?"

రాజం ఒక నిమిషం మాటాడక నిలబడిపోయింది. సవరించుకొని "నేను మీకు ముందే చెప్పాను. అది నాకు సహవాసంతో వచ్చిన దోషం. చాలారోజులముందు భవాని అక్కయ్య పలికిన మాటలే ఇప్పుడు నా నాలిక తిరిగి తిరిగి చెప్తోంది . . . ఈ నాలుగు సంవత్సరాల్లో నేను చాలా మంచి గుణాలు మరిచిపోయాను, చెడ్డవన్నీ నేర్చుకున్నాను," అని ముగించింది.

నాలుగు సంవత్సరాలు. అవి పెళ్ళైన తరువాత నాలుగు సంవత్సరాలని రఘుపతి గుర్తుచేసుకున్నాడు. రఘుపతి కోపంతో తనమీద ఎగిరిపడతాడని, తన మనసులోని క్లేశమంతా అప్పుడే వెళ్ళగక్కాలని రాజం తొందరపడింది. కాని రఘుపతి తెలివిగా ఆ అవకాశం ఇవ్వలేదు; రాజంకి ఆశాభంగం కలిగింది.

కాని ఆమె మనసులోని ఆరాటం తగ్గలేదు, రాజం తన ధోరణి మార్చుకోలేదు.

"నేను అస్తమానం కూనరాగాలు పెడ్తున్నానని భవాని నన్ను ఎగతాళి చేసేది, అన్నివిధాలా నాకు విరక్తి పుట్టించేది. ఇదేం న్యాయం? తనింటిగురించి భవాని

ఏమైనా చెప్పవచ్చు, కాని నేనంటే తప్పా? నాకేం ఆ హక్కు లేదా? నేనూ ఆ కుటుంబంలో ఒక ముఖ్యమైన పాత్ర; కాదని మీరనగలరా?”

“బాగుంది . . . నీ వాదం . . .” అని రఘుపతి తనలో గొణుక్కున్నాడు.

ఇప్పుడు నటరాజన్ జోక్యంచేసుకొని మాటాడారు.

“ఒక స్త్రీ తన పుట్టిల్లుగురించి గొప్పగా చెప్పుకోకూడదు. అలాగే భర్తని దూషించకూడదు. రాజం, ఇందులో నీకు ఏకీభావం ఉందని నా ఉద్దేశం . . . అవునా?”

“మీరన్నది నిజం. కాని అది చాలారోజులముందు. నా బోళాతనంతో నేను తోవ తప్పిపోయాను.” రాజం తనలోతనే విసుగ్గుంది: “చటచటమని ఏదో చప్పుడువిని అదేదో సంబరమని నేను మోసపోయాను . . .”

రఘుపతి ముఖం ఎర్రబడింది. నటరాజన్ పక్క తిరిగి చూసాడు:

“Nonsense! ఇవేం మాటలు? రాజం ఇలా మారుతుందని నేనెప్పుడూ ఎదురుచూడలేదు!”

“రాజం మనసుని ఏదో తీవ్రంగా చెడగొట్టడంవలనే ఆమె ఇలా మాటాడుతోంది,” అన్నారు నటరాజన్. రాజంని అతను వెనకేసుకురావడం చూసి రఘుపతి చికాకుపడ్డాడు. అందువలన తన పరువుకి కూడా హాని అతనికి తోచింది. ఒక వేళ నటరాజన్ దృఢంగా రాజం ధోరణి తిరస్కరించినాకూడా అతను ఉత్తికే అల్లుడుకి ఆదరణ ఇస్తున్నటు నటిస్తున్నారనే ఆలోచన రఘుపతికి కలిగింది.

నిజం చెప్పాలంటే రఘుపతి మనసులోనూ గందరగోళం చోటుచేసుకుంది.

## 38

సమాజ వాతావరణంలో ప్రజల అనుభవాలు శరీరక, మానసిక, భావపూరితమైన నేపధ్యంలో ఈడేరుతాయి.

ఇక రాజం గురించి చెప్పాలంటే ఆ మొదటి రెండు కోణాల్లో ఆమె అతిశయంగా సాధించిందని చెప్పవచ్చు. శారీరకంగా ఎటువంటి సేవ చెయ్యాలన్నా అది సహజంగా ఆమెలో కనిపించిన గుణంగా చోటుచేసుకుంది; సంభాషణ, సభ్యత దానికి దోహదం చేసాయి. ఆ కారణం వలనే కొందరు ఆమెను ఇంతకు ముందు శ్లాఘించారు,

ఇప్పుడు తప్పుబెట్టారు. కాని రాజం ఎప్పుడూ అబద్ధం చెప్పలేదు; ఆత్మార్థంగా తనకెది సత్యమో అదే మాటాడింది.

కాని ఎంత ప్రయత్నించినా ఆమె లక్ష్యం సఫలం కాలేదు. ఆమెలో ఆత్మవిశ్వాసం పూర్తిగా పోయింది; ఆలోచనలన్నీ చెల్లాచెదరిపోయాయి.

ఉల్లంఘున, వాదం, తిప్పికొట్టడం - ఇవన్నీ ఆమె స్వభావంని దండెత్తాయి, మనసుని పదిలం చేసుకున్నాయి.

ఒకరోజు నటరాజన్ రాజంని "ఎందుకు అస్తమానం మీ ఆయనతో పోట్లాట? కొంచెం అణకువతో మాటాడు," అని అడిగారు. రఘుపతి, నటరాజన్ మధ్య నిత్యమూ అన్యోన్యమైన మర్యాద, గౌరవం ఉన్నాయి. రఘుపతికి మామగారికి తనమీదున్న వాత్సల్యం, అభిమానం తెలుసు. అప్పుడప్పుడు నటరాజన్ లో కనిపించే బోళాతనం చూసి అతను విసుగ్గునేనాడు, కాని దాన్ని ముఖ్యంగా లక్ష్యం చెసేవాడుకాదు. అలాగే రఘుపతిలో కనిపించే శాంతం, ప్రసన్నత నటరాజన్ మనసార మెచ్చుకున్నారు. రాజంకూడా అతని గుణాలని పాటించాలని, కఠోరమైన మాటలు మాటవాసికి విసరకూడదని అతని ఉద్దేశం. అతను ఒక గురువు, చింతనావాది కూడా. అందువలనే రాజం ప్రదర్శించే మానసిక గడబిడకి ఏదో ఆధారముందని అతను గ్రహించారు. అతనికీ రాజం తన కళాత్మక విధేయతని పనికిరాని అప్పడాల ప్రోజెక్ట్ కోసం త్యాగం చెయ్యడం కటువుగా కనిపించింది. రాజం తన సంగీత ప్రజ్ఞ మెరుగుపరచుకోవాలని, చిన్న చిన్న దీవెనలు అనుభవించాలని ఆశించితే అందులో తప్పేముంది? అతని అభిలాష కూడా తన కూతురు ఆదర్శజీవితం సఫలమవాలనేకదా? భార్యాభర్తలమధ్య కనిపించే భిన్నాభిప్రాయాలగురించి అతను అంతగా వ్యాకులపడలేదు. 'పోనీలే, రాజం తనకేం కావాలో చెప్పనీ, అది ఎన్నడూ మితిమీరి ఏ పనీ చెయ్యదు!" అని అతను నమ్మారు.

కాని విశాలం భర్తతో ఏకీభవించలేదు, అతనితో తగువులాడింది. ఒక సాయంకాలం రాజం, రఘుపతి వాహ్యాళి వెళ్ళారు. ఇల్లు వదిలి వెళ్ళినప్పుడు రాజం కటువుగా ఏవో మాటలు పలకడం విశాలం విని విశాలం బాధపడింది; వెంటనే భర్తకి చెప్పింది:

“అతన్ని ఏమోమో ప్రశ్నలడిగి రచ్చబెట్టుతోంది! తన్నెవరేమైనా అంటే మాత్రం భరించదు! మీరూ, అల్లుడుగారూ వాదించడం చూసి నేను భయపడేదాన్ని. మరిప్పుడు వీళ్ళిద్దరి ధోరణి చూస్తే ఏదో విపత్తు రాబోతుందని నాకనిపిస్తుంది. అబ్బబ్బా, రాజం ఎలా మాటాడుతోంది!”

“ఆలోచన అనేది ఒకరి మనసులో స్థిరంగా పాతుకుపోయిందనుకో, వాళ్లు ఎది అడిగినా, చెప్పినా, మోటుగానే కనిపిస్తుంది,” అన్నారు నటరాజన్.

విశాలం కలవరపడుతూనే మాటాడింది:

“మీరు ప్రొఫెసరు, మీరు విద్యార్థులకి బుద్ధి చెప్తారు, అది న్యాయం. కాని రాజం తన భర్తకి బుద్ధి చెప్పడం తెలివితక్కువ పని కాదా? ఎది చెప్పాలన్నా, నోరు పారేసుకోడం మంచిదికాదు, అదే నేనంటున్నది. నిన్న అల్లుడుగారు ఏదో మంచి పాట రేడియోలో వింటున్నారు. రాజం అతన్ని చూసి “ఈ పాట వింటే చెవులు పాడైపోవాలనిపిస్తుంది!” అని గోల పెట్టింది. “ఎవరి చెవులు?” అతనడిగారు. “నేనన్నది అందరి చెవులూనూ!” అని రాజం కేకలు పెట్టింది. నేను ఉలికిపడ్డాను. రాజంలో ఇటువంటి ద్వేషం ఎలా వచ్చిందని నాకు అర్థంకావడం లేదు. భర్తముందు తను పాడనని శపథం చేసుకున్నట్టు నాకు చెప్పింది. దాని చేష్టలు చూస్తే నాకు భయంగావుంది.”

“అల్లుడుగారు ఇంకా నాలుగైదురోజుల్లో తిరిగి వెళ్ళాలన్నారుకదూ? రాజం ఏమంటోంది?”

“అతను ఒంటరిగానే వెళ్తున్నారు.ఆ తరువాత అతని అమ్మగారితో నాగ్ పూర్ వెళ్ళబోతున్నారు. రాజం నాకు సాయం చెయ్యాలని ఇక్కడకి వచ్చింది. అలాగే భవానికి సాయం చేస్తే ఎంతబాగుంటుంది!”

“అదేం వద్దు. రాజం ఇక్కడే ఉండనీ. అక్కడకి వెళ్తే దానికి మళ్ళీ కష్టాలే. రాజం ఎందుకు మళ్ళీ భవానితో ఢీకొట్టుకోవాలి? భవాని దౌర్జన్యంవలనే రాజం నాలిక ఇంత నీచంగా మారిపోయింది,” అన్నారు నటరాజన్.

విశాలంకి రాజం భవాని చేతుల్లో అనుభవించిన దురాదరణ బాగా తెలుసుకాబట్టి భర్తతో ఏకీభవించింది.

భర్తకి వీడ్కోలు చెప్పినప్పుడు రాజం నిర్లక్ష్యభావంతోనే విశాలంకి కనిపించింది. ఆ సమయంలో రాజం మొండిపట్టు ఏమాత్రం తగ్గినట్టు కనిపించలేదు. కాని అదీ కొన్నిరోజులకే. ఆ తరువాత భర్తమీద తను విసిరిన దూషణలు రాజం గుర్తుచేసుకుంది; తను అహంకారంతో అడిగిన ప్రశ్నలు అతన్ని ఎంత క్రూరంగా బాధించాయో అని నొచ్చుకుంది.

ఇప్పుడా పోట్లాటలు తలుచుకుంటూనే రాజం వణికింది.

“మన పెళ్ళి మనం చేసిన పెద్ద పొరబాటు!” అని రఘుపతి ఒకనాడు అన్నాడు.

“దానికి నిజంగా పెళ్ళి అని పేరా?” అని రాజం ఎత్తిపొడిచి మాటాడింది; చూపుడువేలుని తన కంఠంచుట్టూ ఒకసారి - తాళిబొట్టులాగ కాదు -శిరశ్ఛేదంలాగ - పోనిచ్చింది.

తనకి పిల్లలంటే అసహ్యం అని రఘుపతి ఆరోపించలేదూ? అది గుర్తుచేసుకొని రాజం బాధపడింది: ‘ఇక నా మనసులో ఉన్నత భావాలేవీ లేవా?’ ఆ ఆలోచన రాగానే ఇంకా తీవ్రంగా చిత్రవధ అనుభవించింది.

అంతరాత్మలో లేచిన సందేశం  రాజం తిరస్కరించింది: ‘నువ్వు అందరి ప్రేమకి దూరమైపోయావు! నీ అత్తమామల ఆదరణ పోగొట్టుకున్నావ్!’ అసలు తన పోరాటమంతా తన కళాత్మక ఆదర్శాలు రక్షించుకోవాలనేకదా? తన తీవ్రతకి కారణం సంగీతంలోని తనకున్న అభిరుచి. ఇక ఈ ఇంటిలో సంగీతమంటే ముఖం ముడుచుకొనే ధోరణి, భర్త ఉపేక్ష తన్ను వేరే మనిషిగా మార్చేసాయి.  ఈ పరిసరాలు చూస్తేనే తనకి ఏవగింపు కలుగుతోంది. మరి సంగీతం తన నరాల్లో ప్రవహిస్తోందికదా? . . .

ఈ భావనలే రాజం మనసుని మళ్ళీ మళ్ళీ తరుముతూ వచ్చాయి.

ఒకరోజు రఘుపతి రాజంకి కలలో కనిపించాడు: అనారోగ్యంతో అతను మంచమెక్కాడు.  టైఫాయిడు వ్యాధి అని  డాక్టరు చెప్పారు. అందరూ కలవరపడ్డారు. ఐతేనేం,  త్వరలో కోలుకున్నాడు. కాని వినడం అతనికి బొత్తిగా పోయింది.

కలలో రాజం భర్తని ఎగతాళి చేస్తోంది: "బాగా కావాలి! ఇది మీకు తగిన శిక్ష! మీరు నిత్యమూ నన్ను మరిచిపోయి తక్కిన స్త్రీల సంగీతం వింటూ రోజులు గడిపారుకదా, అందుకనే మీరు అసలు ఏ సంగీతమూ వినే అవకాశం పోగొట్టుకున్నారు!"

మెలకువ రాగానే ఆ కలలోని అర్థం చేసుకొని రాజం పెరగుపడింది.

అంతరాత్మలో పొంచుకున్న వ్యతిరేక భావాలే కలలకి మూలాధారమని ఎవరో అనడం రాజం విన్నది. ఐతే తన కలకి ఆధారమేమిటి?

భర్త గంటలు తెగకుండా రేడియోలో పాటకచేరీలు వినడం చూసి రాజం మండిపడేది. ఒక గెంతు గెత్తి, ఆ రేడియోని మూసేసి, "చాలు మీ సంగీత ప్రజ్ఞ! మీరు నా సంగీత అభిరుచిని ధ్వంసం చేసేసారు!" అని కూతపెట్టాలని తొందరపడేది. కాని తన విరక్తిని అణచుకొని ఏమీ చేసేదికాదు.

ఇక ఆ తీరని పోరాటాలే ఇప్పుడు తన్ను కలల్లో వెంటాడుతున్నాయామో?

తన శత్రుభావం, రోషం వలనే భర్త ఆత్మాభిమానం చెదరిగొట్టడం జరిగిందని రాజం వ్యసనపడింది. తన దురదృష్టమే అతని కార్యసిద్ధికి ఆటంకమేమో? తన ధోరణి ఇంకా బాగా దెబ్బ తీయడానికి ముందు తన్నెవరైనా రక్షించగలరా? 'దేవుడా, నన్ను కాపాడు!' అని రాజం మొరబెట్టుకుంది; తన గతకాల చేష్టలకి బాధపడింది.

మానసిక బాధని - దాన్ని అలాగే వదలివేస్తే - అది శారీరక సమస్యగా మారుతుంది. భావోద్వేగ స్పందనలు దేహంలోని ఇతర అవయవాల ఆచరణపై ఆధారపడివుంటాయి. హృదయంతోబాటు మనసులో చెలరేగే ఆలోచనలు అవయవాల పరస్పర చర్యలని ప్రోత్సాహించుతాయి. మనసులో తీరని పోరాటమంటే ఇంద్రియాలు సముచితంగా పని చెయ్యవు.

రాజం టైఫాయిడు వ్యాధితో చాలా వారాలు మంచమెక్కింది. జ్వరంతోబాటు చిత్తభ్రమ, దిగ్భ్రమ ఆమెను పీడించాయి. 'ఇంకా ఎందుకీ బతుకు?" అనే ప్రశ్న కూడా లేచింది. కాని అంత త్వరలో తనకి చావు రాదని రాజం తనలో చెప్పుకుంది. 'నేనింకా ఎన్ని కష్టాలో పడవలసివుంది. ఎవరికి తెలుసు - ఇంకా కొన్ని రోజుల్లో నాకు వినడం, మాటాడం కూడా చేతకాదేమో?' అనే భయమూ కప్పుకుంది. నటరాజన్, మణి

ఒకరోజు రాజంని "నువ్వు ఇంత మొండిగా మీ ఆయన ముందు పాడనని అంటున్నావ్. మరి ఎందుకు నీకు సంగీతంలో ఇంత మోహం?అదేం అంత ముఖ్యమా?" అని అడగలేదూ? అవును, దేవుడు రాజం నోటిని శాశ్వతంగా మూసివేస్తే? నాలికా, చెవులూ, రాజంని సంగీత రంగంలోకి లాగ్గొని వచ్చాయి, కాని ఇప్పుడు దేవుడు రాజంకి కొత్త ఆజ్ఞ విధించాడా? ఇక సద్భక్తితో, అత్తగారితో కలిసి రాజం అప్పడాలు వొత్తాలి . . . అదేనా ఆమె గతి?

అదిమాత్రం కాదు . . .

రాజం తన నాలికతో పాటలు మాత్రం పాడిందా ఏమిటి? ఇతరులపై ఎన్ని దూషణలు విసిరింది, ఎంత విషం కక్కింది!

ఆఖరికి, తనకేదో పెద్ద విపత్తు రాబోతుందని రాజం దిగిలుపడింది. గాయపడిన తన వేలు దానికొక సూచన అనవచ్చా? తను భర్తకీ, ఇతరులకీ ఆత్మశుద్ధితో సేవ చేసిన రోజుల్లోనే ఆ ప్రమాదం జరిగింది. ఇప్పుడు తను వాళ్ళకెదురుగా తిరిగిబడింది; వాళ్ళ సానుభూతి పోగొట్టుకుంది. అందుకు తనకి తగిన శిక్ష రాబోతుందని తను భయపడడం న్యాయమేకదా?

ఇలా తన మనసుని రాజం మెలకువగా వున్నప్పుడూ, పీడకలలు వచ్చినప్పుడూ చిత్రవధ చేసుకుంది.

భవాని మద్రాసులో ఒగ మగ శిశువు ప్రసవించింది.

శారదాంబాళ్ ఇంటినుంచి ఆసుపత్రికి నడిచి వెళ్లారు, తనే అన్ని పనులూ చేసారు; రాజం సాయంకి రాలేదని సణుక్కున్నారు. రఘుపతి తల్లికి వీలైనంతవరకూ సహాయం చేసాడు.

నటరాజన్ అతన్ని రమ్మని పిలిచారు; రాజం టైఫాయిడుతో బాధపడుతోందని రఘుపతి వచ్చి చూస్తే బాగుంటుందని రాసారు.

శారదాంబాళ్ భర్తకి హెచ్చరికగా చెప్పింది: "భవాని ఎప్పుడూ తన అత్తమామలతో ఉండలేదు; మన అల్లుడుగారూ మనతో ఉండలేదు. మనం ఇప్పుడు

చూసేదంతా రఘుపతి మన వియ్యాలవారితో - మన కోడలు మనతో ఉన్న రోజులకంటే ఎక్కువగా - కాలం గడుపుతున్నాడు."

దొరస్వామి భార్యకి చెప్పారు: 'అలాగే కానీ, మనేం చెయ్యవద్దు! రఘుపతికి ఇవి మంచి రోజులు కావు. రాజ్యలక్ష్మికి భర్త అనే అదృష్టం వాడికి తప్పకుండా వుంది. అందుకే వాడికి రావలసిన టైఫాయిడు రాజంని పట్టుకుంది."

అది విని శారదాంబాళ్ ఏమీ అనలేదు; కాని రఘుపతికి ఆశ్చర్యం కలిగింది. రాజంని చూడాలని తోచింది; వెంటనే ప్రయాణంకి సిద్ధమైయ్యాడు.

రాజం నిశ్చలమైన మనసుతో భర్తకి స్వాగతం చెప్పింది. రఘుపతి మృదువుగా, అనురక్తితో "రాజం, పాపం, నాకు రావలసిన వ్యాధితో నువ్వు మంచమెక్కావ్!" అని సహానుభూతితో చెప్పాడు. సాధ్యమైనంతవరకూ రాజం సహవాసంలోనే రోజంతా గడిపి ఆమెకు ఊరట, ఓదార్పు అందించాడు.

రాజం మనసు కరిగింది. తన దురవస్థకి ఎంత భయపడింది! పోయిన శక్తి, బలమంతా ఆమెకు మెల్లగా తిరిగివచ్చాయి. రాజం తన లోపాలని క్షమించడం నేర్చుకుంది. దేవుడి దయవల్ల తన భర్త, తనూ ఆదర్శదంపతులుగా పుట్టామనే నమ్మకం ఈ జన్మలో మాత్రమే కాదని, అది అన్ని జన్మాలకి వర్తించే స్థితి అని రాజం గుర్తుచేసుకుంది. అందుకు ఇంకొక కారణం: నటరాజన్ కాలేజీలో ఒక లెక్చరర్ ఉద్యోగంకి విజ్ఞప్తి రాబోతుందని తెలిసింది; నటరాజన్ రఘుపతిని దానికి ప్రేరేపించారు. అతనూ వెంటనే సరే అన్నాడు.

రాజం ఆలోచనలన్నీ భవిష్యత్తు గురించే. 'ఇక మేమిద్దరం దంపతులుగా, విచ్చలవిడిగా ఈ ఊరులోనే, మా ఇంటిలో ఉంటాం! ఇదీ నా ఇల్లే, కాని నాకిక్కడ ఉండడానికి ఇష్టం లేదు. వేరే చోట మేం మా కాపురం ఆరంభిస్తాం!" అని రాజం తనలో చెప్పుకుంది; బాహాటంగా అది భర్తకి ఎలా చెప్పడం?

కాని తాళలేకుండా రాజం తండ్రికి మాత్రం చెప్పింది: "నాన్నగారూ, వచ్చేనెల డాక్టర్ ప్రకాశరావుగారు అతని dispensary ని తన ఇంటికి మార్చబోతున్నారని విన్నాను. ఆ dispensary చిన్నదే, కాని మా ఇద్దరికీ సరిపోతుంది."

"సరే, నేను అతన్ని కలుసుకొని అన్ని వివరాలు కనుక్కుంటాను," అని నటరాజన్ మాట ఇచ్చారు. రఘుపతికూడా ఆ జాగా కాలేజీకి పక్కనే ఉందని చెప్పాడు. "రాజంలో స్వస్థత ఇంకా పూర్తిగా కనిపించడంలేదు. అంతవరకూ నేనే ఆహారపదార్థాలు వండి వాళ్ళింటికి పంపుతాను," అని విశాలం భర్తకి చెప్పింది.

రాజం ఆశ దృఢమయే ధోరణిలో డాక్టర్ ప్రకాశరావుగారు కూడా "మీకు తప్పకుండా ఆ జాగా దొరుకుతుంది. ఇంటి యజమానికి ఒక మాట చెప్పండి, అది చాలు!" అని అన్నారు.

అల్లుడి ఉద్యోగంకోసం నటరాజన్ ఎవరినీ అర్థించలేదు. 'రఘుపతికి యోగ్యత వుంది, దానికి అతను అర్హుడు,' అని అతనికి తెలుసు.

కాని దురదృష్టవశంగా ఆ లెక్చరర్ ఉద్యోగం మరెవరికో వెళ్ళింది. "అతనుగాని అది అంగీకరించలేదంటే మన అల్లుడికే అది దక్కివుంటుంది. అతనెవరో? మరి ఈ ఉద్యోగంకి అతను ఎంత ప్రయత్నం చేసారో?" అని నటరాజన్ భార్యకి చెప్పారు.

"నేనేమో చాలా ఆతురతో ఈ ఉద్యోగం ఎదురుచూస్తున్నట్లు మీరు మాటాడుతున్నారు. నాకలా లేదు. ఎది ఎలాగైనా దానితో రాజీపడడం నా స్వభావం," అని రఘుపతి అతనికి చెప్పాడు.

అతని వాలకం - అందులో నిశ్చలత, అమరిక చోటుచేసుకున్నాయి - చూసి రాజం ఆశ్చర్యపడింది. ఆమె మనసులో మిశ్రితభావాలు లేచాయి. 'ఇన్ని రోజులూ మీ కలతలు, ఆందోళనలు, ఇక రాబోయే రోజుల్లో ఊహించిన కలలు అన్నీ నేనే మౌనంగా భరించాను. మీరు బెణకనే లేదు," అని గొణుక్కుంది; అతని నిబ్బరం చూసి నివ్వెరపోయింది.

తన నిరాశని దాచుకొని రాజం నవ్వుతూ మాటాడింది: "ఈ ఉరులోనే చాలా సంవత్సరాలు గడిపిన తరువాత వేరే చోట కాపురం పెట్టాలని నా ఆశ. 'ఇక్కడే ఇరుక్కుంటే, మరి కొత్త ఉరులూ, నగరాలూ, చూడడం ఎలాగ?' అని నాకు అనిపించేది." ఇవన్నీ అవివేకంగా రాజం కల్పించుకొని పలికిన మాటలు కావు: అవును. ఇంతకాలమూ ఈ ఊరు సంరక్షణలో - మితమైన అవగాహనలో- తనకి

తెలియని విషయాలు ఎన్ని ఉన్నాయి! మరి అవన్నీ తెలుసుకోవాలంటే దూరపు ప్రాంతాలకి వెళ్ళాలి, కొత్త దృశ్యాలు తప్పక చూడాలి, అనుభవించాలి!

భవిష్యత్తులో రానున్న ఆ అనుభవాలు రాజం ఆశించుకొనివుంది.

“నా జాతకంబట్టి నాకు ఇరవై ఏడు సంవత్సరాలు నిండినవరకూ ఎది అనుకూలంగా లేదని ఎవరో అన్నారు,” అని రఘుపతి రాజంకి చెప్పాడు. అతని ఇరవై-ఎనిమిద పుట్టినరోజు త్వరలో రాబోతుందని తెలిసి, రాజం ఆతురతో కాచుకొనివుంది.

జాతకం సరిగ్గానే చెప్పింది; రఘుపతికి ఉద్యోగం దొరికింది! ఎక్కడ?

మద్రాసులో . . . అవును, మద్రాసులోనే . . .

ఆ వార్త తనకందిన సమయం రాజం ఏదో పత్రిక చదువుతోంది. వినగానే పత్రికని పారేసి కాళ్ళకి బుద్ధి చెప్పింది; కళ్ళు బాగా తడిసిపోయాయి.

ఆ తరువాత ఒక అర్ధగంటవరకూ రాజంకి తన దిక్కు, దశ బోధపడలేదు. ఇంతకన్న పెద్ద ఆశాభంగం తను అనుభవించినట్టు ఆమెకు గుర్తులోలేదు. సంగీతం తన స్వతంత్రతకి దారి చూపుతుందనే అల్ప ఆశ ఆమె మనసులో ఇంతవరకూ వేలాడుతోంది. తన భర్త నిరుద్యోగి అనే నింద మోయడానికికూడా రాజం సిద్ధంగావుంది. తన ఆకంక్ష స్వాధీనత. ఇతరులకి - ముఖ్యంగా పెద్దలకి -అది కటువుగా - కనిపించవచ్చు. తన వ్యాకులతని రాజం ఇంతకాలమూ ఒక తెరవెనుక దాచుకొనివుంది; అది ఇలా గభిమని చిరుగుతుందని, తన బలహీతనలు బహిరంగమవుతాయని ఆమె ఎదురుచూడలేదు.

‘నా అత్తమామల ఇంటి వాతావరణం భరించలేకనే నేను పుట్టిల్లులో ఆశ్రయం కోరి వచ్చాను,’ అనే భావన రాజంలో చాలారోజులుగావుంది. అదిప్పుడు అందరికీ తెలిసినట్టే . . . తన వైఖరి దానికి ఒక నిదర్శనం . . . ’

‘ఇదొక కఠినపరీక్ష, ఇప్పుడే ఆరంభమైంది. నా స్వాతంత్రోద్యమంకి దారి చూపిన కాంతిలో ఇప్పుడు ఏ తళుకూ లేదు! నా మారువేషం బయటపడింది! ఇక నా అంతర్గత భావాలని అణచుకొని, అబద్ధాలు చెప్పి ఇతరులని మోసగించడం జరగదు!’

'నిజంగా ఈ విశాలమైన దేశంలో మద్రాసు తప్పితే మరెక్కడా మా ఆయనకి ఉద్యోగం లేదా? అవును. దేవుడు మమ్మల్ని పరీక్షిస్తున్నాడు. నాకు మచ్చుకన్నా అదృష్టం లేదు!'

ఒక హిందూ స్త్రీ బతుకంతా ఆమె భర్త, అతని కుటుంబంమీద ఆధారపడివుంటుంది. ఆమె లక్ష్యమంతా భర్త సహానుభూతి, అతని బంధువుల ఆదర్శప్రాయురాలుగా తను పేరు పొందాలి. భర్త ఆదరణ తనకి దొరక్కపోతే అతన్ని తప్పుపెట్టవచ్చు, కాని దానికీ ఒక హద్దువుంది: ఎందుకంటే కాస్తా ఆ వున్న ప్రేమకూడా పోగొట్టుకోనే ప్రమాదంవుంది. అందుకే అంతర్బుద్ధిని అనుసరించి ఆమె వెనకాడుతుంది. భర్తకి సాంకేతిక బాషలో "నేనందరికంటే మేలైన స్త్రీ!" అని చెప్పాలని పూనుకుంటుంది. ఆ కలవరపాటులలో ఆమె పొరబాటు చెయ్యవచ్చు. ఇతరులని - ముఖ్యంగా స్త్రీలని - దూషించడం, వాళ్ళని బుద్ధిసూక్ష్మతతో చూడడం, గుసగుసలాడడం ఆమె సహజంగా అలవాటు చేసుకునే అవకాశముంది.

పొరుగింటి సీతమ్మకి రాజం, విశాలంతో మంచి స్నేహముంది. ఇంకా ముప్పైయేళ్ళుకూడా నిండలేదు, కాని ఆవిడకి మంచి లోకజ్ఞానముంది.

ఆమె ఒకనాడు భర్తకి చెప్పింది: "రాజం తన అత్తమామలని భలే జోరుగా శ్లాఘించడం చూసి నేను చాలా ఆశ్చర్యపడేదాన్ని. కొన్నిమాసాలకి ముందుకూడా "ఆహా, రాజంకి మెట్టినిల్లుమీద ఎంత గౌరవం, మర్యాద!" అని నాకు అనిపించేది. కాని ఇప్పుడు నాకంతా అర్థమైంది. రాజం కూడా అందరు కోడళ్ళలాగే! నా మాటకొస్తే నేనెప్పుడూ మా ఆయనతోనే ఉంటాను - అతనితో దెబ్బలాడినా, మా అత్తగారు ఏమన్నా సరే. నాకూ జ్వరం వచ్చింది, మంచమెక్కాను, నా మనసులో ఏముందో ముక్కుసూటిగా చెప్తాను . . . రాజం ఇలా భర్తని వదిలివస్తుందని నేనెప్పుడూ ఊహించనేలేదు . . . రాజం తప్పకుండా హద్దుమీరిందని అంటాను."

సీతమ్మ భర్త ఆవిడ చెప్పిన మాటలు విని "ఇదేం పెద్ద పరిశోధన అంటున్నావా?" అని తోసిపారేసాడు. కాని సీతమ్మ ఉరుకుంటుందా? "మీరెప్పుడూ నేను మీతో జగడమాడుతున్నానని అంటున్నారు. ఇప్పుడు రాజంని చూడండి: అది నోరు బిగించుకునే భర్త మనసుని ఎలా నొప్పించుతోందో!" అని ఆరోపించింది. అతను

మరేం అనక ఊరుకున్నాడు; సీతమ్మ వెంటనే చుట్టుపక్కలవున్నవారితో తన పిచ్చాపాటీ పంచుకుంది.

రాజం టైఫాయిడు జ్వరంతో బాధపడిందన సంగతి కూడా కొందరు మరిచిపోయారు. "రాజంకీ ఏమీలేదు. బాగానే కనిపిస్తోంది. కాని లోలోపల ఏదో బాధపడుతోంది!" అని వాళ్ళు చెప్పుకున్నారు.

"రాజం టైఫాయిడునుంచి కోలుకొని రెండుమాసాలయ్యాయి. ఆమె ఇక్కడకివచ్చి ఆరుమాసాలయ్యాయి. ఇక్కడింకా ఏంచేస్తోంది?" అని మరికొందరు అడిగారు.

ఈ గుసగుసలన్నీ విశాలంకి ఎలాగ తెలుసు? 'రాజం ఇంకా ఇక్కడేవుందా?' అని ఆమెను కొందరడిగారు. "మీ ఆయన నీకింకా ఆర్డరు ఇవ్వలేదా?", అతనిక్కడ రాలేదని నువ్వూ వెళ్ళవా?" అని మరికొందరు రాజంని జాడగా అడిగారు. అందరి మాటల్లోనూ స్నేహభావం, హాస్యం, అధికారం చోటుచేసుకున్నా, అవన్నీ గాలికబుర్లుగా వ్యాపించవచ్చని విశాలం దిగిలుపడింది. రాజంకి ఇతరులమాటలువిని ఏ అనుమానమూ రాలేదు; వాటి తాత్పర్యంకూడా ఆమె గ్రహించలేదు. ఆమె అలసిన ముఖంలో, విరక్తితో ఒక ఎండిన నవ్వు - 'మీకు నా బాధ తెలియదు!' అనే సందేశం చోటుచేసుకుంది.

విశాలం కూతుర్ని వెనకేసుకొని మాటాడింది: "అల్లుడుగారు మళ్ళీ వచ్చినప్పుడు రాజం అతనితో వెళ్తుంది. టైఫాయిడుతో రాజం ఎంత ప్రయాసపడిందని అతనికి తెలుసుగా? అతన్ని కలుసుకున్న తరువాత రాజం మళ్ళీ చురుకుగా పనీపాటాల్లో తగులుకోడం జరుగుతుంది. ఐతే అతనికిగాని ఇంటిలో భోజనం సరిగ్గాలేదనిపిస్తే రాజం తప్పకుండా వెళ్ళాలి. రాజం అక్కడ లేకపోవడం వాళ్ళకేం పెద్ద బాధగా లేదే?" తల్లిమాటల్లో తాత్పర్యం పూర్తిగా గ్రహించకపోయినా రాజం మరేం ఎదురుచెప్పలేదు.

"నేను వాళ్ళకి కావలసినది వంటమనిషిగానా? అక్కడ 'నేనుకాని లేకపోతే మా ఆయనకి మంచి భోజనం దొరకనే దొరకదు!' అని గర్వంగా చెప్పుకోగలనా?" అని రాజం ఆలోచించింది.

తరచుగా రాజం తన జీవితంకి అర్థం లేదని అంగలార్చుకునేది; ఆత్మహత్యకి సూచనగా విరక్తి కూడా ఆమె మనసులో చోటుచేసుకుంది. తన తల్లిదండ్రులు, తోబుట్టువులపట్ల తనకున్న ప్రేమ కూడా తరుగుతున్నట్టు రాజంకి తోచింది. ఇంతకీ వాళ్ళ పక్షంలో ఏ మార్పూ లేదు; ఎప్పటిలాగే నిబంధనలేని ప్రేమ రాజంపై వాళ్ళు ధారపోసారు. కాని రాజం ఏవో ఆలోచనలలో, అసంతృప్తులతో నలిగిపోతున్నట్టు కనిపించింది. అస్తమానం వాళ్ళతో దెబ్బలాడింది, వాదించింది, తిట్లు విసిరింది.

మణి - అతనే ఆమె తోబుట్టువులలో పెద్దవాడు - తక్కిన పిల్లల్ని బెదిరించినా, అల్లరిచిల్లరి చేసినా - రాజం ఎదురు పక్షంలో చేరుకొని వాడితో దెబ్బలాడింది. మణి బావగారిని సహకరించి, అతని సభ్యత, సంగీతంలోని పాండిత్యంగురించి పొగడితే రాజం చటుక్కున ఒక చతురోక్తి విసిరేది; "అవును, నీకు తెలిసినదంతే!" అని గొంతుచించుకొని అరిచేది. తను అనుభవించినది ఒక పెద్ద దెబ్బ, ఆ ఉద్దేశంతో ఇతరులకి హాని చెయ్యడానికి రాజం వెనకాడనేలేదు; బాహాటంగానే ఆ పని చేసింది.

ఒకరోజు విశాలం గాబరాతో కూతుర్ని చూసి "రాజం, ఎందుకిలా అస్తమానం తక్కినవాళ్ళ మనసు నొప్పించడం నీకు అలవాటైపోయింది?" అని అడిగింది.

"నేను పడుతున్న బాధ ఇంతా అంతా కాదు. తక్కినవాళ్ళ బాధగురించి నాకేంపోయింది?" అని రాజం విసుగ్గుంది.

ఒక రోజు ఏదో కారణంవలన విశాలం చిరచిరలాడుతూ కూతుర్ని చూసి "నీకు శని దోషం బాగా పట్టుకున్నట్టుంది; అందుకే ఇంత వదరుగా మాటాడుతున్నావ్!" అని ఘాటుగా ఎత్తిపొడిచింది.[1] ఆవిడ అన్నది సామాన్య కుటుంబ సభ్యులు వాడుకగా ఉపయోగించే పదబంధమేఐనా, ఆ దినం, ఆ సమయంలో ఆ నింద విని రాజంకి పట్టరాని కోపం కలిగింది.

"అవును, నేను శనిగ్రహంగానే మారిపోయాను! నీకు తెలుసా? శని బలవంతులకి మంచిది చేస్తాడు, పిరికివాళ్ళని శిక్షిస్తాడు!" అని అరుస్తూ రాజం

---

[1] తమిళులు తిట్టినప్పుడు సాధారణంగా వాడే పదం 'శనియన్'. శని భగవంతుడు ఆ వ్యక్తిని ఆవహించి బాధ పెడుతున్నట్టు, అతనందరికీ అసహ్యంగా కనిపిస్తున్నాడని అర్థం.

నిష్క్రమించింది. ప్రజలంగరికీ భవిష్యత్తుగురించి తెలుసుకోవాలని జోస్యంలో ఆశ; రాజంకి అదే ఆతురత.

దానితోబాటు రాజం తరచుగా వారసంచికలలో నిపుణులు పాఠకులకి మానసిక బాధలు, వాటిని మితపరచుకొనే మార్గం గురించి రాసిన వ్యాసాలు చదివింది. అందులో చాలా ప్రశ్నలు తన పరిస్థితికి పోలికగా కనిపించాయి. రాజం ఆ జవాబులు చురుకుగా చదవింది. "నాలాగే చాలామంది అవస్థపడుతున్నారు. కాని, ఆశ్చర్యం!, నేనుమాత్రం నెమ్మదిగా ఉన్నాను!" అని తన్ను ఓదార్చుకుంది. 'నాలోనూ అందరిలాగ మానవత్వం ఉంది, నా మనోవేదన అందరికీ కలిగే అనుభవమే కాబోలు!' అని గుర్తుచేసుకుంటే మనసుకి ఎంత హాయిగా ఉంది!" అని ఒక నిట్టూర్పు విడిచింది.

"రాజం, మనమూ ఈ ప్రపంచంలో అందరిలాగ బతకడం నేర్చుకోవాలి. ప్రత్యేకంగా మనకేదో మార్గం వుందని నమ్ముకుంటే ఏమైనా లాభం ఉందా?" అని ఒకసారి రఘుపతి రాజంకి ఒక ఉత్తరంలో రాసాడు.

రాజం వెంటనే అతనికి "నాకూ అందరిలాగ జీవించాలనే ఆశ. కాని అదీ నాకు చేతకావటంలేదు. అందువలనే నాకీ నిరుత్సాహమంతా!" అని రాసింది.

సౌఖ్యమూ, సానుకూల ఆలోచనలూ కలిసికట్టుగా ఏర్పడే అవస్థలు. సౌఖ్యమనేది స్థిరంగా ఉండదు; కొంతకాలం తరువాత దుఃఖం వచ్చిచేరుకుంటుంది. ఇది ప్రకృతిలో మనం చూసే నియమం. శోకం తాకినప్పుడు మనసులో గతకాల అనుభవాల్లో వ్యతిరేకభావాలే మళ్ళీ మళ్ళీ లేవడంతో వ్యాకులత ఇంకా తీవ్రంగా పెరుగుతుంది. దానితోబాటు ఎన్నో ప్రశ్నలు: 'నేనందుకు అలా చేసాను? అదే నా పెద్ద పొరబాటు!' అనే ఆరాటం. మనసు తను చేసిన తప్పుని గుర్తించినా దాన్ని ఒప్పుకోదు. అదే మనఃప్రవృత్తి - మొండితనం, కొంటె బుద్ధి అంటే అదే. 'నేనన్నీ సరిగ్గానే చేసాను!' అనే ఒక మూఢభక్తి; ఇది లోకంలో సహజం.

రాజంకి భవాని విషయంలో అలాగే తోచింది: "నాకు భవాన్ని మించిన మంచి గుణాలున్నాయి. నాలో ద్వేషం లేదు. నేనందరినీ సమానంగా చూస్తాను. కాని నా

బోళాతనంవలన అందరినీ సులభంగా నమ్మేస్తాను!" రాజం విరక్తితో తన్ను తనే నోచుకుంది.

తనలో నీతీ, అమాయకత్వం చోటుచేసుకున్నాయిని రాజంకి తెలుసు. మరి ఈ బోళాతనం తనకెలా వచ్చింది?

పెళ్ళైన కొత్తలో తనకీ, రఘుపతికి మధ్య నియమం తప్పకుండా జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు రాజం గుర్తుచేసుకుంది. ఒకే ఒకసారి రాజం సకాలంలో భర్తకి ఉత్తరం రాయలేదు. అది ఇల్లంతా సున్నంకొట్టే సమయం. తట్టుముట్టు వస్తువులన్నీ ఈ మూల, ఆ మూల అని చెల్లాచెదరిపోయున్నాయి. వాట్ని జమచేసి, పొందిక పరచాలి. రాజం అంతకన్నా ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించింది. రద్దీగావున్న సమయాల్లోనూ రాజం సావధానంగా ఉత్తరాలు రాసేది, కాని ఆ రోజు ఆమెకు అది సాధ్యం కాలేదు. దాన్నిగురించి రాజం చికాకుపడింది, ధుమధుమలాడింది కూడా. అందుకే ఆ మరునాడు భర్తకి రాసినప్పుడు "ఇటీవల ఇంటిపనులు నన్ను బాగా ముంచేసాయి. ఉత్తరాలు రాసేందుకుకూడా నాకు సమయం దొరకదు! నాకు చాలా బాధగా ఉంది," అని రాసింది.

"మీ ఇంట్లో నువ్వు నిండా పనిగావున్నావని తెలిసి అమ్మకి చాలా ఆశ్చర్యంగా ఉంది. ఇంకా కొన్నిరోజులు భరించు! త్వరలో మనం కలుసుకుంటాం!" అని రఘుపతి రాసాడు.

తను పుట్టిల్లుచాకిరీలో మునిగిపోయినట్టు అత్తగారికి చెప్పడం బొళాతనం కాకపోతే మరేమిటి? ఏనాడో పడిన బాధని రాజం చెప్పింది, దానికి ఫలితం ఇక బతుకంతా అనుభవించాలి! మరి భవాని సంగతో? తను తన తల్లిదండ్రుల అభిమాన పుత్రి అనే వంకతో - తల్లి సమక్షంలోనే - ఆమె ఎంత గర్వంగా కులుకుతూ కనిపించింది! ఇక రాజం మాటకొస్తే తల్లిని శాంతపరచాలనే ఉద్దేశంతో రఘుపతి, అతని బంధువులు వచ్చినప్పుడు రాజం విశాలంకి సాయం చేసింది. అది చూసి శారదాంబాళ్ "వాళ్ళింటి జేష్ఠకూతురుకదా? రాజం కాకపోతే మరెవరు వాళ్ళమ్మకి సాయం చెస్తారు?" అని అన్నారు.

## 39

"మందమతి అంటే నేనే!" అని రాజం గొణుక్కుంది.

'నా సంగీత ప్రజ్ఞ వర్ధిల్లుతుంది, అత్తమామల మధ్య నేను ఆదర్శప్రాయంగా కులుకుతాను!' అని రాజం కన్న కలలన్నీ తరాలున కూలిపోయాయి.

ఇటీవల నటరాజన్ రాజం తరచుగా వాడుతున్న లోలోక్తులు వింటూనేవున్నారు. నిజంగా ఆమె మనసులో ఏముందో అతనికి అర్థంకాకపోయినా, 'ఆఖరికి నాకు నా జీవితంలో మిలిగినది నిరాశ మాత్రమే!' అని రాజం బాధపడుతోందని అతను ఊహించారు.

"రాజం, జీవితమంటే మనం ఆశించినట్టు అన్నీ సాగుతాయి అని అర్థం చేసుకోకూడదు. మరి దుఃఖమూ, నిరుత్సాహం కూడా మనం అనుభవించడం మామూలేకదా?" అని అతను ఒకరోజు అడిగారు.

"నేనన్నది అదికాదు, నాన్నగారూ! నాకు భవాని సూక్ష్మబుద్ధి లేదు. నాకు ఆవిడ పిల్లలన్నా భయం! అత్తమామలతో నా జీవితం ఒక భ్రమగా సాగిందని నాకిప్పుడే తెలిసింది. ఇప్పుడిప్పుడే మనుషుల్లో నానావిధ రకాలున్నాయని, వాళ్ళ ప్రకృతి స్వభావాలు వేరేవేరేయని నేను తెలుసుకున్నాను. నా తెలివితక్కువ వలనే అందరినీ నమ్మి మోసపోయాను!"

"ఇతరులని మోసగించడం క్రూరం; వాళ్ళని నమ్ముతే అందులో సిగ్గుపడాల్సిన కారణమేముంది? అదొక గౌరవ చిహ్నమనికూడా అనవచ్చు."

"ఓ, అలాగా? అంటే నాకిది పెద్ద గౌరవమన్నమాట!"

"కాదామరి? నువ్వు నిన్నే చులకనచేసుకొని మాటాడుతున్నావ్. నీలో నువ్వు గర్వపడాల్సిన గుణాలు చాలా వున్నాయి; ఇంకొకసారి నీగురించి ఆలోచించి చూడు," అన్నారు నటరాజన్.

"నాకేం తోచటం లేదు. నా గుండెకి పెద్ద దెబ్బ - అందుకే నాకీ గతి. ఇక ఎవరూ ఏమీ చెయ్యలేరు . . ." రాజం ఇంకా ఏదో చెప్పాలని ప్రయత్నించింది, కాని అందుకు బలం రాలేదు; కళ్ళు బాగా తడిసిపోయాయి.

“రాజం, నీకు మంచి హృదయముందని బాధపడుతున్నావా? ఇతరులకి మనసార సేవ చెయ్యాలనే తృష్ణ నీకెప్పుడూవుందని సంతోషించు. ‘స్వార్థంగా, ఇతరులకి నేను హాని చేసాను,’ అని వ్యసనపడితే అందుకు అర్థముంది. నీలో నిష్కపటమూ, ముక్కుసూటిగా మాటాడే అలవాటూ ఉన్నాయని నువ్వు బాధపడడంచూసి నాకు చాలా వింతగావుంది,” అని నటరాజన్ రాజంని ఓదార్చారు.

“అదికాదు నాన్నగారూ, నన్ను మోసగించడం సులభం అని అందరూ అనుకుంటున్నారు. వాళ్ళు నామీద అధికారం చెలాయించినప్పుడు నేను గుడ్డిగా నోరెత్తకుండా, నా విరక్తిని అదుపులో పెట్టుకొని, అన్ని పనులూ చేసాను. కాని వాళ్ళకి నాలో కనిపించేదంతా కపటమూ, దురాలోచన. నాలో మంచితనం మచ్చుకైనా గుర్తుపట్టినట్టు కనిపించదు!”

“వాళ్ళకి తెలుసు - అంతరాత్మలో - నీలో కపటం, స్వార్థం లేదని, నువ్వందరినీ సమానంగా చూస్తావని. నీకేం ఆరాటం వద్దు. రాజం, ఆత్మనిందన మంచిదికాదు. ఇతరులు మనకి దయ చూపవచ్చు, కాని మనకి మనమీదే జాలి రాకూడదు!”

రాజం మరేం అనక ఊరుకుంది.

ఆ తరువాత రాజం తరచుగా “దేవుడా! దయచేసి నాకు నిర్మలమైన హృదయం కటాక్షించు!” అని ప్రార్థించింది. “ఈ పాపిష్టి ఆలోచనలనుంచి నాకు విముక్తి ఎప్పుడు?” అనే యాతనకూడా పెరిగింది.

ప్రేమ అనేది భార్యాభర్తలమధ్య నిరంతరంగా - సూర్యుడిచుట్టూ తిరుగుతున్న చంద్రుడిలాగ - చోటుచేసుకుంటుంది. ఎవరు చూసినా, చూడకపోయినా ఖగోళ వస్తువుల గమనం రూఢిగా, పరిపూర్ణంగానే సాగుతుంది. ప్రకృతి విధించిన నియమాలు ఎన్నడూ మనతో ఉండేవే. దంపతులమధ్య బంధం ఆ వ్యవస్థలోనే సాగుతుంది.

రాజంలో కనిపించిన మార్పులుచూసి రఘుపతి గాభరా పడలేదు. ఇంతకుముందు అతను రాజంని ఆమెలో కానవచ్చే చురుకుతనం, వివేకం శ్లాఘించాడు. ఇప్పుడు భార్యని సానుభూతి, దయతో చూసాడు. లేకపోతే ఎందుకు గభీమని రాజంని చూడాలని ఈ ప్రయాణం?

అతనికి ఒరిస్సాలో ఒక ఉద్యోగంకి భేటి వచ్చింది. మద్రాసులో ఉద్యోగం ఇష్టం లేకపోవడంవలన, ఆ భేటికి సిద్ధమైయ్యాడు. పోయే దారిలో ప్రయాణం నిలుపుకొని రాజంని చూడాలని నిశ్చయించాడు.

భర్తరాక విని రాజం ఆహ్లాదపడింది; కాని ఆ మరుదినమే ఆ ఆనందం పోయింది.

నటరాజన్ అల్లుడ్ని అడిగారు: "మీరు తిరిగి ఊరికి వెళ్తున్నప్పుడు రాజం మీవెంట  వెళ్తుంది, అవునా?" రఘుపతికూడా, రాజంలాగే, విస్మితంతో అతన్ని తిరిగిచూసాడు. ఆ ప్రశ్నలో ధ్వని అతన్ని కలవరపరచింది.

"రాజం ఇక్కడ మీకోసం కాచుకొనివుంటుంది. ఒక వేళ మీకిక్కడ రావడానికి వీలుకాదంటే నేను దాన్ని స్టేషన్ కి తీసుకొస్తాను."

రాజం రెప్పవాల్చకుండా తండ్రిని చూసింది. రఘుపతి పరధ్యానంగా దూరంలో ఏదో చూస్తున్నట్టు తల తిప్పాడు. రాజం ముక్కుసూటిగా వంటగదికి వెళ్ళింది. 'నాన్నగారు నన్ను మనింటినించి తరుముతున్నారు!' అని తల్లికి చెప్పాలనుకుంది. కాని విశాలం కళ్ళు చెమ్మగిల్లడం చూసింది. ఏం, అమ్మ ఎందుకు ఏడుస్తోంది?

అవును, ఆ తల్లికి కూతురు పడుతున్న అవస్థ తెలుసు.

రాజం గభీమని వెక్కిళ్ళతో ఏడ్చింది.

విశాలం మాటాడింది.

"నేనూ నాన్నగారి మాటలు విన్నాను. అతను సరిగ్గానే చెప్పారు. నువ్విప్పుడు మీ ఆయనతో వెళ్ళకపోతే నీ అత్తమామలు నీ నిమ్మళం చూసి బాధపడతారు. ఇన్నిరోజులూ నీ అనారోగ్యమే కారణం, అందుకే నువ్వు రాలేదని వాళ్ళ ఉద్దేశం. ఇప్పుడు నీ సంకోచం చూసి . . ."

అసలు మద్రాసుకి వెళ్ళాలనే తలపే రాజంని దుఃఖంలో ముంచేసింది. తతాలున తనకిందవున్న భూమి పగిలి తన్ను సజీవంగా అలాగే పాతెయ్యాలని రాజం ఆశించింది. ఇంకా ఎంతకాలం ఇలాగ బతకడం? చావాలనుకుంటే - కొన్ని నిమిషాలే చాలు - ఎన్ని మార్గాలున్నాయి! ఇప్పుడు తనేంచెయ్యాలి?

రాజం రోజంతా అలాగే ఏకాంతంగా, ఎడతెగక ఏడుస్తూ  కూర్చొనివుంది. పక్కనే గోడమీద ఏదో పాకుతున్నట్టు కనిపించింది.

"అమ్మో . . . .అమ్మో . . . తేలు, తేలు!" రాజం అరుస్తూ లేచింది.

విశాలం చీపురుతో పరుగెత్తుకొని వచ్చింది. నటరాజన్ కాలిబూటుతో తేలుని నిమిషంలో చితకకొట్టి చంపేసారు.

"మంచివేళ . . . దేవుడే నిన్ను కాపాడాడు . . . నువ్వు ఇంత దగ్గరగా కూర్చొనివున్నావ్! . . . " అని విశాలం నిట్టూర్పు వదిలింది.

'అది నన్ను కొట్టివుంటే బాగున్ను - నా బతుకు అంతమైయుంటుంది!' అని రాజం చెప్పాలవుకుంది. కాని ఎలాగ?

తను తేలుని చూసి బెదరుపడినందుకు రాజం సిగ్గుపడింది.

"నేనుగాని దాన్ని ముట్టుకొనివుంటే, క్షణంలో నన్ను చంపివుంటుంది. నిజంగా నాకిలా కాలం గడపాలనిలేదు." శాంతంగా రాజం, ఒక మూల నిలుచున్న రఘుపతిపై చూపు విసురుతూ, మాటాడింది.

"అసలు నువ్వు నాతో మద్రాసుకి రావాలను నేను బలవంతపెట్టలేదు!" అని రఘుపతి అన్నాడు. అతని ముఖం కోపంతో ఎర్రబడింది, కాని అణచుకున్నాడు. "ఆది మీ నాన్నగారి సలహా. నీకక్కడ కష్టమంటే నువ్వు నావెంట రావొద్దు!"

నటరాజన్ కూతుర్ని చూసి మాటాడారు: "రాజం, ఇప్పుడు మరేం అనకు. ముందు నీ నాలికలో విషం తీసి పారేయ్. ఎది మాట్లాడాలన్నా దానికి ఒక హద్దువుంది. నువ్వులేకుండా ఇంటికివెళ్తే మీ ఆయన మనసెలాగుంటుందని ఒక నిమిషం ఆలోచించు!"

రఘుపతి తడిసిన రాజం కళ్ళు చూసాడు; కన్నీరు కార్చకపోయినా ఆమె మొహంలో కనిపించే బాధ గ్రహించాడు.

నటరాజన్ నిదానించుకొని అడిగారు: "రాజం, ఏమంటావ్?"

"సరే . . . వెళ్తాను . . . చస్తాను . . . "

రాజం మాటలు విని నటరాజన్ నిర్ఘాంతపోయారు.

ఆ సాయంకాలం రఘుపతి రైలెక్కాడు.

నటరాజన్ రాజంకి ధైర్యం చెప్పారు: "మీ ఆయనకి ఈ ఉద్యోగం దొరికితే అతనందులో చేరడానికి రెండుమాసాలు గడువు ఇస్తారు. ఇప్పుడు నువ్వతనితో

వెళ్ళలేదంటే ఆ తరువాత నీలో గాభరా, ఆరాటం మరీ చెడ్డగా మారవచ్చు. నీ అత్తమామల్ని కలుసుకోడానికికూడా నువ్వు జంకుతావేమో, ఎవరికి తెలుసు? ఇప్పుడు రాజీపడితే ఆ తరువాత నీకన్నీ సుళువుగా కనిపిస్తాయి."

చిరచిరలాడతూనే రాజం ప్రయాణంకి సిద్ధమైంది; రఘుపతి ఇంకా మూడురోజుల్లో తిరిగివస్తాడు.

కాని అతను రాలేదు. దానికిబదులు అతను రానున్నదినం ఒక ఉత్తరం వచ్చింది.

"నా ప్లాను మారింది. నేను బావగారిని కలుసుకోవాలని తిన్నగా నాగ్ పూర్ చేరుకొని, ఆ తరువాత మద్రాసు వెళ్తున్నాను."

రాజం మళ్ళీ దుఃఖసముద్రంలో కూలిపోయింది. రఘుపతి మనసులో ఏముందో ఆమెకు అర్థం కాలేదు. అతనికి తనపై నిజంగా ప్రేమ ఉందా? మరెందుకు ఇలా తప్పించుకొనే ప్రయత్నం?

*"రా, మనిద్దరం హాయిగా ఉందాం . . . నీ సుఖం, సంతుష్టి నా బాధ్యత! చూడు, ఎలా నా చలాకీతనం చూపిస్తానో!"*

అతనెందుకు అలా రాయలేదని రాజం నివ్వెరపోయింది. ఇప్పుడతను వేరే మార్గంలో తనింటికి వెళ్ళిపోయారు!

రాజంని అత్తమామలతో చేర్పడం తన బాధ్యతని నటరాజన్ నిశ్చయించారు. రాజం తనకిష్టమైనంతవరకూ తన తల్లిదండ్రులతో ఉండనీ అని రఘుపతి చెప్పిన మాటలు అతను గుర్తుచేసుకున్నారు, కాని తన భారం రాజం కోరికని తప్పక మీఱాలని అతనికి తెలిసింది. అతన్ని ప్రేరేపించినది విశాలం.

## 40

త్వరలో ఒక టెలెగ్రాం వచ్చింది: "రఘుపతికి ఒరిస్సా ఉద్యోగం దొరకలేదు!"

"రాజాభాయ్, నువ్వు మద్రాసు ప్రయాణంకి రెడి అవు!" అని నటరాజన్ కూతురికి చెప్పారు.

రాజంకి గుండెపగిలినట్టనిపించింది. తన కలలూ, ఆశలూ, చిట్టచివరికి ఏమయ్యాయి? తను పడుతున్న దెబ్బలు - వరుసగా ఒకటి తరువాత ఒకటి -

ఎన్ని! తన సంగీత ప్రజ్ఞ అభివృద్ధికి పెద్ద ఆటంకం; తను వంచనలేకుండా ఇతరులకి సేవ చేసినందుకు ఫలం? తన పేరూ, ప్రతిష్టకి మంచి దెబ్బ; దానితోబాటు తల్లిదండ్రుల నిష్ఠుర మాటలు వినే దుర్భాగ్యం. ఇంకా ఎందుకీ బతుకు? తను ఇక ఇంకా ఎన్ని తిట్లూ, నిందలూ మోయాలో ఎవరికి తెలుసు?ఒకానొకప్పుడు రాజమంటే అందరిలోనూ స్నేహభావం చోటుచేసుకుంది, అందరూ ఆమెను పొగడారు. రాజంలో కనిపించిన ప్రతీ గుణవిశేషం ఇతరులని ఆకర్షించింది. "ఎంత అద్భుతమైన యువతి!" అని అభినందించారు. ఇప్పుడో? రాజం ఒక సామాన్య యువతి; ఆదర్శ జీవి కాదు - ఆమెలో ఎన్నో లోపాలున్నాయి. ఆఖరికి . . .

రాజం తన ఇక్కట్టుగురించి ప్రలాపించింది. అందరి ప్రేమ పోగొట్టుకున్నతరువాత తనకెందుకిక ఖ్యాతి, గౌరవం?

రాజం ఇక్కట్టు నటరాజన్ కి బోధపడింది. తండ్రిగా, సాధ్యమైనంతవరకూ ఆమె వ్యసనం తగ్గించాలనే ఆలోచనతో, ఆయన కూతురుకి సలహా ఇచ్చారు:

"నీకేం భయం వద్దు. న్యాయంగా నీకున్న హక్కులు నొక్కి అడగడానికి నువ్వు వెనకాడకూడదు. ఇతరులకి నువ్వు స్నేహితురాలుగా మెలగవచ్చు, కాని బానిసగా కాదు! ఇతరులమీద నువ్వు అధికారం చెలాయించాలని కాదు నేను చెప్పేది. నీ ప్రేమ, సానుభూతి వాళ్ళకి తెలియజేయాలని అంటున్నాను. ఇక నీకు సంగీతం సంబంధించిన విషయాల్లో ఇష్టంలేదంటే దాన్ని మరచిపో. ఎది నీకు ఇష్టమో, ఎది నీ సంతోషంకి దారి చూపుతుందే అదే నువ్వు పాటించాలి. నీ సంతోషం నీ చేతుల్లోనేవుందని గుర్తుంచుకో. జాగ్రత్త! తోవ తప్పితే మళ్ళీ దుఃఖం పట్టుకుంటుంది."

అతను తన భార్యని, పిల్లల్ని తమిళదేశంకి పంపించాలని నిశ్చయించారు. విశాలం రాజంని ముందు మద్రాసులో దిగబెట్టి ఆ తరువాత తిరుచ్చికి వెళ్ళి, అక్కడ ఒక నెలరోజులుండి తిరిగిరావాలని అతని ఉద్దేశం.

తల్లి తనవెంట రాబోతుందని తెలిసి రాజం సంతోషించింది. నాన్నగారి మాటలు కొంతవరకు ఆమెను ఊరడించాయి. కార్తిక మాసంలో శాంతంగా, గంభీరంగా ప్రవహించే కావేరీనదిలాగ రాజం శోభించింది.

అత్తమామలు రాజంకి, తల్లికి స్వాగతం చెప్పారు. ఇంట్లో ప్రవేశించగానే రాజంలోని బిడియం పూర్తిగా పోయింది. భవానికూడా మనసువిప్పి మాటాడింది; ఆమె పిల్లలు స్వేచ్ఛగా అందరితోకలిసి ఆటలాడుతున్నారు. శారదాంబాళ్ గతకాల ఘటనలన్నీ మరిచిపోయినట్టు కనిపించారు. రఘుపతికూడా ఆతురతతో వాళ్ల సంభాషణలో కలుసుకున్నాడు. రాజంలో కనిపించిన ఆహ్లాదం, లేత చూపులు అతన్ని పరవశపరచాయి. ఇటీవల దొరస్వామి ఇంటిని పునరుద్ధరణ చేసే ప్రయత్నంలో ఒక కొత్త వసారా చేర్చారు. అది విశాలంగా, గాలికి తెరపగా ఉండడంతో పిల్లలు దాన్ని ఒక మంచి ఆటపాట స్థలంగా వాడుకుంటున్నారు.

వచ్చిన మూడురోజుల తరువాత విశాలం మణి, తక్కిన పిల్లలతో తిరుచ్చికి వెళ్ళిపోయింది. గభీమని ఇల్లంతా శూన్యమైనట్టు రాజంకి తోచింది. కాని భవాని పిల్లలు - చిత్రు, ప్రవీణ్, కొత్త పసిపాప - ఉన్నారుగా? రాజం వాళ్ళ ఆటలు, ముచ్చటలు చూసి ఆనందించింది. రాజం వంటమనిషిని పిలిచి దీపంలో కిరసెను పొయ్యమని చెప్పాడు. ఇంతలో - అతనొక కొత్తదీపంని పెట్టెనుంచి తీస్తుంటే - చిత్రా అది చూసి 'ఇదేదో వింతగా ఉందే?' అని ఆశ్చర్యంతో గబగబమని అక్కడకి పరుగెత్తుకొని వచ్చింది; 'మామా, మామా,'[2] అని వదరుతూ రఘుపతిని ఆవరించుకుంది.

"జాగ్రత్త, ఇది కొత్త దీపం . . . ఇవాళే కొన్నాను!" అని దిగులుపాటుతో రఘుపతి పాపని మందలించాడు. ఆ తరువాత దీపంని గోడమీద వ్రేడాలని ఒక మేకు. సుత్తి చేతిలో తీసుకున్నాడు.

"చిత్రు, ఇక్కడికి రా, మనం నిద్రపోదాం," అని భవాని పిల్లల్ని ముందు వసారాకి తీసుకొని వెళ్ళింది.

ఇవన్నీ రాజం చూస్తూనేవుంది. "సరే, ఇక్కడ మన కాపురంకి ఇది ఒక ఆనవాలు కాబోలు!" అని తనలోతనే చెప్పుకుంది.

[2] తమిళంలో మామయ్య అని అర్థం

'నా జీవితంలో ఇదొక మలుపు. ఇక భవిష్యత్తులో మావారు పక్షపాతం చూపక, భర్త, పుత్రుడు - అనే తన ద్వితీయ బాధ్యతలని నిరవేర్చుతారు. ఇక నా కష్టాలు తీఱినట్టే,' అని రాజంకి నమ్మకం కలిగింది.

తండ్రి చెప్పిన సలహా అనుసరించి రాజం స్నేహభావంతో మెలిగింది. ఆశ్చర్యం! ఆమె భయపడినట్టు ఏమీ జరగలేదు. 'ఇందులో ఏదో మోసం ఉంది!' అని రాజం సందేహించింది. తను ఇందకుముందు అనుభవించిన పరిసర ప్రభావం కనిపించడంలేదే? ఏం, ఎందుకు?

భవాని రాజంని చెలాయించడం మానుకుంది. ఆమె వాలకం చూస్తే ఆమె రాజంని చూసి 'నాకన్నీ తెలుసులే! నీ సేవ నాకిక పద్దు తల్లీ!' అని బతిమాలుతున్నట్టు తోచింది. తనకి కావలసిన వసతులన్నీ భవాని తనే చేసుకుంది.

శారదాంబాళ్ మనసులో ఏముంది? అదీ విచిత్రంగానే తోచింది. ఆవిడ మౌనంగా, అంటకుండా ఉన్నట్టు కనిపించారు. రాజంని చూసి 'ఇక నిన్ను నేను నమ్మడం ఎలా సాధ్యం?' అని అడుగుతున్నట్టుంది ఆవిడ భావన. ఇక రఘుపతి విషయంలో అతను రాజంని చూసి 'నేను నిన్ను ప్రేమించకుండా ఉండగలనా? నువ్వు నా ధర్మపత్నికదా? నీలో లోపాలుండవచ్చు, కాని నాకు నీపై ద్వేషం లేదు,' అని బుజ్జగించినట్టు ఒక కల్పన. అతనుకూడా "రాజం, నువ్వొక అమూల్యమైన బహుమానం, ఒక అతిశయమైన యువతి!" అని పొగడడం ఆపుకున్నాడు.

'అవును మరి, వాళ్ళందరు నా గురించి ఏమనుకుంటున్నారో? నేనూ బాగా మారిపోయాను. నాలోనూ ఉన్నతమైన గుణాలేవీ లేవు,' అని రాజం బాధపడింది. తన మనసులో అటువంటి భావన ఎందుకు లేచింది? ప్రధానంగా తనకున్న ఔదార్యమే కారణం. మరి తన జీవితాంత అనురాగాలు ఏమైనట్టు? తన కళాత్మక అభిలాషలు నిష్ఫలమైపోయాయి; స్త్రీగా తన ఇచ్ఛలు సిద్ధించలేదు; పసిపాపలాక తను ఏడుస్తోంది; గండె పగిలినట్టు చిత్రవధ అనుభవిస్తోంది.

రఘుపతికూడా బాగా మారిపోయాడు. ఇప్పుడతని ధోరణి మరీ తీవ్రంగా కనిపించింది: "ఉద్యోగం లేదని నాకు విచారం లేదు; అది దొరికినా నేను

నిశ్చలంగానేవుంటాను!" అని అతని వైఖరి. ఇంతకుముందు రాజంతో కచేరీకిగాని, వాహ్యాళికిగాని బయటకి వెళ్ళడమంటే అతను సంకోచపడేవాడు. ఇప్పుడూ అతనిలో అదే ఉద్దేశం చోటుచేసుకుంది. తనకిప్పుడు సొంత ఆదాయంలేదు; తన జీవితశైలిలో ఏమైనా మార్పు కనిపించితే తల్లిదండ్రులకి తనొక కొత్తమనిషిగా కనిపించవచ్చనే భయం. అతనికి భార్యమీద ప్రేమవుంది. ఆమెకి ఎదికావాలో అతనికి తెలియదా? వాడిన భార్య ముఖం చూసినప్పుడల్లా అతను అనేవాడు: "రాజం, నువ్వేం బాధపడకు. నీ సంతోషమే నాకు ముఖ్యం. సాధ్యమైనంతవరకూ అదే నా లక్ష్యం. ఆ తరువాత మనకి కావలసినదంతా దేవుడి దయ!" అతని మాటల్లో వాగ్దానం ఉన్నదన్న మాట నిజం, కాని ఆ సందేశం రాజంని ఉత్తేజపరించే ఉపన్యాసంగా - ఉపన్యాసంగానే - నిలిచిపోయింది. అది విని రాజంకి తన బాధ మరికొంత తీవ్రంగా కనిపించింది.

భవాని భర్త వేరే నగరంకి ఆరు మాసాలకి ఉద్యోగరీతిగా వెళ్ళారు. ఆ సమయంలో భవాని పిల్లలతో పుట్టినిల్లుకి రావడం జరిగింది. పాత రోజుల్లాగ రాజం తనకి సేవ చెయ్యాలని భవాని గుడ్డిబెదిరింపులేవీ చెయ్యలేదు. రాజంని ఆమె ఉపేక్షతో 'నువ్వు నాకు చేసిన సేవ చాలు!' అనే భావనతో చూసింది. రాజంలోనూ అదే నిర్లక్ష్యత; తనూ ఒక చూపులో భవానికి చెప్పింది: 'తెలుసుకోండి! మనిద్దరం ఇప్పుడు వేరేవేరే స్త్రీలుగా మారిపోయాం! మీరు నన్ను ఇంతకాలమూ శత్రుభావంతో చిత్రవధ చేసారు! నేనిక మీ తికమకలు భరించను! మీ జడిపింపులకి మూటగట్టండి!" రాజం ఇప్పుడు ఒక నూతన అవతారం, అది అందరికీ తెలియవద్దూ? ఇక భవాని సమక్షంలో తనకెటువంటి తడబాటు, కలవరం కలగదు! తన కళ్లలో శరణకోరే జాడలేవీ కనిపించవు!

ఆఖరికి రాజం, తన ప్రయత్నంలో గెలిచిందా లేదా? అదే తనకి బోధపడలేదు.

ఒకరోజు భవాని పిల్లవాడు ప్రవీణ్ బెంచిపీద ఎక్కుతూ కింద పడిపోయాడు. భవాని అతనిపక్కనే నిలబడివుంది, కాని వొంగి బాలుడ్ని ఎత్తుకోలేదు. ఆవిడ ముఖంలో దిగ్భ్రమ చోటుచేసుకుంది. కొంచెం దూరంలోనే రాజం నిలబడివుంది.

వెంటనే పరుగెత్తుకొనివెళ్ళి పిల్లవాడిని ఎత్తుకోవాలని ఆమె తొందరపడింది, కాని భవాని అతన్ని ఎత్తుకోలేదని గమనించి తనూ వెనకాడింది.

జరిగినదేమంటే సహజంగా తనలో తోచిన ఆతురతని రాజం అణచుకోడానికి కొంత సమయం పట్టింది. 'నేనేం పనిమనిషా - అందరూ నన్ను చెలాయించడానికి! కాదు! ఇప్పుడు నేనొక నూతన  రాజం!' అని తనలో చెప్పుకుంది.

ఇంతలో శారదాంబాళ్ పరుగెత్తుకొని వచ్చి "ఏం జరిగిందే, పిల్లవాడు జారి పడిపోయాడా?" అని అడిగినప్పుడే భవాని వొంగి నేలమీది కొడుకుని ఎత్తుకుంది. మరేం మాటాడకుండా, పిల్లవాడి దేహాన్ని మెల్లిగా చేతితో దువ్వుతూ, తల్లిని, వదినని విచిత్రంగా చూసింది. ఆవిడ మొహం రాజంకి జాడగా చెప్పింది: 'వదినా, నాకు తెలుసు నువ్వేమనునుకుంటున్నావో?' భవాని మొహంలో అలసట రాజం గమనించింది.

గభీమని రాజం తన నిశ్చేష్టకి సిగ్గుపడింది. తనకెలా ఈ నీచ బుద్ధి వచ్చింది - పిల్లంటేకూడా తనకి అసహ్యమా?

కొంత సమయం తరువాత భవాని తల్లికి చెప్పింది: "అమ్మా, నాకెందుకోగాని పిల్లలు గభీమని ఏడ్చినా, దొర్లిపడినా ఒకటే భయం! నా మనసులో  ఎల్లప్పుడూ ఏదో దుర్ఘటన రాబోతుందని ఆరాటం! మా వంశంలో రెండో శిశువు దక్కదనే శాపముందని ఎవరో అనడం నేను విన్నాను. నేనది లెక్కచెయ్యకపోయినా అప్పుడప్పుడు అది గుర్తుకు వస్తే నేను గడ్డకట్టుకున్నట్టు ఐపోతాను. నా బిడ్డ జారి నెలమీద పడిపోయాడు, వాడ్ని ఎత్తుకోవాలని నాకు తెలుసు, కాని ఒక అడుగెత్తడంకూడా నాకు చేతకాదు!" ఒక తల్లిగా, తన బాధని రెండు చేతులు ఛాతీమీద పెట్టుకొని, భవాని తెలియపరచింది.

అది విని తనేదో నేరం చేసినట్టు గాభరా పడుతున్న రాజం ఇంకా తీవ్రంగా తన్ను నొచ్చుకుంది. కాని . . .

నిజంగా భవానికి అంత భయమా? ఆవిడ మొహం మళ్ళీ రాజం చూసింది. దానితోబాటు ఒక భావన: 'ఇది భవాని  నాకిచ్చే పరీక్ష! ఎందుకీ పరీక్ష? నేను

మారానని ఆవిడకి తెలుసు. ఇక నాతో ఆమె జాగ్రత్తగా  మెలగాలి. అందుకే తన మాతృత్వం నాకు తెలియపరచాలి . . . నేను ఆవిడని తప్పుబెట్టనేకూడదు!'

ఆ తర్వాతి రెండురోజుల్లోనే రాజం తన కనికరంకి సాకులేదని తెలుసుకుంది.

ఒకరోజు భవాని తన కూతురు అల్లరి చేస్తోందని తిట్టినప్పుడు - కుటిల మనసుతో - రాజంని సంతానలేమి గురించి నిందించింది.

రాజం అడిగినదోమో ఒక చిన్న, సాధారణ ప్రశ్న: "అమ్మాయి మరీ మొండిగా oil bath వద్దంటోంది. అదివాళే తప్పకుండా ఇవ్వాలా, అంత ముఖ్యమా?"

"పిల్లలు కన్న స్త్రీలకే పిల్లల విషయంలో చాలా ఓర్పుతో మెలగాలని తెలుసు!" అని భవాని ఎత్తిపొడిచింది. కూతుర్ని దడదడమని స్నానంకి ఈడ్చుకొని వెళ్ళింది. ఒక క్షణం నోరులో మరేం మాట రాకుండా రాజం అలాగే స్తంభించిపోయింది.

'అవును, నాకు పిల్లలంటే ప్రేమ లేదు. ప్రేమ, ఆసక్తి ఉంటేనే ఓర్పు మనసులో చోటుచేసుకుంటుంది. నాకు పుత్రభాగ్యం లేదు, అందుకు నేను క్షమాపణ అడగనక్కరలేదు. మీ దూషణలు నేను భరించగలను. ఇది తప్పితే మీరు నాలో మరేమైనా లోపాలు కనిపెట్టగలరా? నేను గొడ్రాలుని. అది దేవుడి ఇచ్ఛ. నేను అతనిదగ్గరే మొరపెట్టుకోవాలి,' అని రాజం తనలో గొణుక్కుంది.

రాజం తన హృదయంలో ఉదాత్తభావనలే ఆశించింది. అది సాధ్యంకానప్పుడు తన శ్రమని దాచుకొనే సెపంతో నకిలీనవ్వు నవ్వేది. అది ఆమె అంతరాత్మకి విరుద్ధం. అందువలనే తన మనసులో కోపం, దానితోబాటు అవమానం చెలరేగుతున్నాయని రాజంకి బోధపడింది.

ఒకరోజు రాజం రఘుపతి తన పంట్లాంకి బొత్తానులు కుట్టడం చూసింది. ''అది నేను చేస్తాను, నాకివ్వండి!'' అని అడగ్గానే రఘుపతి సరేయని ఇచ్చేసాడు. ఆ పనేదో పూర్తిచేసినతరువాత రాజం  గర్వపడిందికూడా.

కాని అదీ కొంతసమయంకే.'నన్నడగడానికి నా భర్తకి హక్కువుందికదా, మరెందుకతనికి ఈ సంకోచం? నేనంటే అతనికెందుకు ఇంత ఉపేక్ష?' అని రాజం కలవరపడింది.

కాని భవాని రాజంని ఓదార్చింది. ఎంత ఆశ్చర్యం!

'నేనూ అన్నయ్య ప్యాంటుకి బొత్తాను కుట్టడం చూసాను, కాని కొంచెం ఆగి అతనికి సాయం చెయ్యలేదు," అని భవాని విచారంతో చెప్పింది. "వదిన అదిచూసి అతన్ని వెంటనే అడిగింది. పాపం అన్నయ్య! సమయానికి అతనికి తోడుచెయ్యలేదని నాకు చాలా బాధగా ఉంది."

'అదే మా ఇద్దరిమధ్యవున్న అసాధారణ బంధం!' రాజం మనసులో గర్వమూ, సంతోషమూ కొట్టుకొనివచ్చాయి. 'మా బంధం బాగా వర్ధిల్లుతోందని అనడానికి ఇదొక సూచన!'

తన భార్య, చెల్లెల మధ్య రఘుపతి పెట్టిన పోటీలో రాజం గెలిచింది. ఇంకొక సమయం భార్య, తల్లి మధ్య ఒక పోటీ వచ్చింది. రాజంకి భర్తమీదున్న ప్రేమ శారదాంబాళ్ వాత్సల్యంకి ఏమాత్రం తీసిపోదని అప్పుడు అందరికీ రుజువైంది.

కుటుంబ సభ్యులందరూ ఒక వనవిహారంకి వెళ్ళాలని నిశ్చయించారు. రెండు కారులలో - వేరేవేరేగా - ఆడ, మగవారు ప్రయాణం చేసారు. స్త్రీలున్న కారు ముందు, దాని వెంట రెండో కారు  వెళ్ళింది. అందరూ త్రోవలోని రమ్యమైన దృశ్యాలు చూసి ఆనందిస్తూ, ఏవేవో కబుర్లు, సంగతులు చెప్పుకూంటూ కాలం గడిపారు. రాజంకీ ఈ పర్యటన నచ్చింది. తన ఉత్సాహంలో తరచుగా తలతిప్పుతూ తన భర్తని - అతను ఆ రెండో కారులో ఉన్నాడు - చూస్తూనేవుంది. ప్రయాణం మంచి సిమెంటు రోడులో సాగడంవలన దుమ్ము, దుమారమనే మాటే లేదు; రాజం దృష్టిలో రఘుపతి స్పష్టంగా కనిపిస్తూనేవున్నాడు.

ఇదిచూసి భవాని రాజంని ఎగతాళి చేసింది: "చూసారా, వదిన చూపంతా తన భర్త మీదనే - ఆ రెండో కారుమీదనే!" ఆ పరిహాసం  విని రాజం బాధపడలేదు. 'మా ఆయనకూడా ఈ కారులో ప్రయాణం చేస్తే ఎంత బాగున్ను!; అని రాజం తనలో చెప్పుకుంది. భవాని హాస్యం వింటే తన చెవులకి ఇంపుగానే ఉంది.

అందరూ ఒకచోట చేరుకున్నారు. స్త్రీలున్న కారు ముందు చేరుకుంది. రెండోకారు ఎక్కడా కనిపించలేదు.

స్త్రీలు పది నిమిషాలు సరదాగా పిచ్చాపాటితో కాలం గడిపారు. ఆ తరువాత మగవాళ్ళకోసం కాచుకొనివున్నారు. కాని ఏ కారూ కనిపించలేదు.

"ఏమైందో మనకి తెలీదు. మనం తిరిగివెళ్ళి కనుక్కుందాం!" అని శారదాంబాళ్ అన్నారు.

"అదేం వద్దండి . . . ఇంకా కొంచెం సేపులో వాళ్ళు వచ్చేస్తారు . . . " అని ఆవిడకి కొందరు ధైర్యం చెప్పారు; ఇంకా కాచుకొనేవున్నారు.

కాలం గడిచిపోతోంది, ఆ రెండోకారు రానేలేదు. ఇక తాళలేక శారదాంబాళ్ కారుని వచ్చిన త్రోవలో వెనక్కిపొమ్మని డ్రైవరుకి చెప్పారు. పదిహేను నిమిషాల ప్రయాణం తరువాత వాళ్ళకి ఆ కారు కనిపించింది.

స్త్రీలు ఆ కారుని చేరుకున్న వేళ రామశేషన్ గబగబమని పరుగెత్తుకొని వచ్చారు. "మంచి వేళ, మేమింకా బతికేవున్నాం!" అని నిట్టూర్పు విడిచారు. "మా కారు దేవుడిదయవల్ల ప్రమాదంనుంచి తప్పించుకుంది!" అని అన్నారు; ఏం జరిగిందో చెప్పారు.

ఏదో కారణంవలన ఇంజెను పనిచేయక వాళ్ళ కారు గభీమని ఆగిపోయిందట. అందరూ కారులోనుంచి దిగారు. రామశేషన్, డ్రైవరు మాత్రం కారుపక్కన నిలబడివున్నారు. ఇతరులు చుట్టుపక్కల్లో తీరిగగా తిరిగారు.

ఎవడో ఒక బాటసారి ఆ కారుదగ్గరకి వచ్చి నిలబడి, దాన్ని చూసి "ఇదేం పొగ బాబూ?" అని అడిగాడట. అప్పుడే కారువెనుకనున్న పడకనుంచి మెల్లగా పొగ రావడం వాళ్ళకి తెలిసింది.

పడకని లాగిచూస్తే దానిలోవున్న దూదికి నిప్పు పట్టుకుందని తెలిసింది.

రామశేషన్ బాటసారికి కృతజ్ఞత చెప్పిన తరవాత ఏంజరిగిందో అందరికీ వివరించారు. రామశేషన్ అబ్బాయి సిగరెట్ కారులో కాల్చాడని, అశ్రద్ధగా సిగరెట్ కొన బయటికి విసిరాడని తెలిసింది.

"ఇంకా ఒక పది నిమిషాలు మేం కారులో కూర్చొనివుంటే ఆ నిప్పు పెట్రోలు అటని కప్పేసి కారంతా వ్యాపించివుంటుంది. మేమందరం కారులో చిక్కుకొనివుంటాం. దేవుడిదయవల్ల కారు హఠాత్తుగా ఆగింది. ఆ బాటసారి రావడం మా అదృష్టం. లేకపోతే మంటలోమాడిపోయుంటాం!" అన్నారు రామశేషన్.

అది విని స్త్రీలు నిర్ఘాంతపోయారు. శారదాంబాళ్ అతనికి చెప్పారు: నాకసలు మనశ్శాంతి లేనే లేదు. ఎందుకోగాని మన అబ్బాయి ఏదో అపాయంలో చిక్కుకున్నాడని నాకనిపించింది. 'మీరేం ఉత్తికే బాధపడకండి,'' అని అందరూ నాకు మళ్ళీ మళ్ళీ చెప్పారు. కాని నాకు వచ్చిన త్రోవ మళ్ళీ  చూడాలనిపించింది,'' అని అన్నారు.

రాజం రెప్పవాల్చకుండా అత్తగారిని చూసింది: 'పుత్రవాత్సల్యమంటే ఇదే - మరేంకాదు!'' అని ఆశ్చర్యపడింది.

రామశేషన్ మళ్ళీ మాటాడారు: ''మీలో ఎవరికీ మా కారుని వెనక్కితిరిగి చూడాలని అనిపించలేదేం? అందుకేకదా మీ కారుని ముందుకు పంపించాం? మీ కారుకేమైనా ఐతే మాకు తెలియాలి. కాని మీరెవరూ మాగురించి లెక్కచెయ్యలేదు!'' అని నవ్వారు.

రాజం మనసు భవానిమీద దూకింది.

భవాని చెప్పింది: ''వదిన మీ కారుని చూస్తూనేవుంది. కాని ఎప్పుడు ముఖ్యమో అప్పుడు మానేసింది!''

'అందుకు కారణం మీరే - మీరే నన్ను పరిహాసం చేసారు!' అని రాజం బాహాటంగా చెప్పాలనుకుంది. కాని అంతలో రామశేషన్ తల్లి అక్కడ ఏం జరిగిందో అందరుకి స్పష్టంగా తెలియజేసారు. ''బాగుంది కథ! ఇంతకుముందు రాజం తిరిగి తిరిగి ఆ రెండో కారు చూసిందని వెక్కిరించాం, ఇప్పుడేమో 'నువ్వెందుకు తిరిగిచూడలేదు?' అని అడుగుతన్నాం!'' అని ఆవిడ అన్నారు.

## 41

ఈ కొత్త పరిసరాల్లో రాజం తక్కిన స్త్రీలతో సులభంగా పరిచయం చేసుకుంది. ఆ స్త్రీలు స్నేహభావంతో, రాయబారుల్లాగ - వాళ్ళకి రాజకీయ వ్యవహారాల్లో  వేరేవేరే అభిప్రాయాలు ఉన్నాకూడా - అందరితోనూ చేతులు కలుపుకున్నారు. తరచుగా రాజకీయవాదులు ప్రయోగించే పథకం అనుసరించి, దెబ్బలాడడం, వాదించడం చమత్కారంగా మానుకున్నారు. ఐతే రాజం అవన్నీ లెక్కచెయ్యలేదు. భర్తతో సాన్నిహిత్యం లేకపోవడమే ఆమెను పెద్ద ప్రశ్నగా వెంటాడింది.

'రాయబారులూ, రాజకీయవేత్తలూ, తమకేదిష్టమో అది చెయ్యనీ; ఐతే ప్రజలూ, దేశనాయకులమధ్య ఏకీభావం చాలా ముఖ్యం. మరి నాయకులు ఉపేక్షిస్తే ప్రజల గతి ఏమౌతుంది?'

'ఇప్పుడు దేశంలో ఆహార పరిస్థితి ఒక పెద్ద ప్రశ్నగా, తీవ్రంగా కనిపిస్తోంది. ఐతే ఎంతమంది తమ కళాత్మక వాంఛలు తీరక బాధపడుతున్నారు! ఒక దేశం తన కళాత్మక ఆదర్శాలు పోషించే ఉద్యమాన్ని అనుసరించడం వలనే - చాలామందికి ఆ క్షుధ లేకపోవచ్చు అన్నది నిజం! - దాని కీర్తి వర్ధిల్లుతుంది.'

రాజం మనసులో ఇటువంటి భావనలే మ్రోగాయి.

దొరస్వామి తనకున్నహోదా, పదవి కారణాలవల్ల సమాజంలో అందరితోనూ కలిసిమెలిగారు. రఘుపతి, రాజం అతనితోబాటు సామాజిక ఉత్సవాల్లో, వేడుకల్లో పాల్గొనడమేకాకుండా అతను తనింటిలో ఇచ్చిన పార్టీలకీ సాయం చేసారు. ఇల్లు చిన్నదనే కారణంవలన ఆ విందులు చిన్న చిన్న గుంపులుగా ఇవ్వడమైంది. దొరస్వామి భోజనం ఏర్పాట్లు రఘుపతికి ఒప్పగించారు - అబ్బా, అందుకు అతనికి ఎంత ఉత్సాహం! తరచుగా వంటగదికి వెళ్ళడం, పిండివంటలతో 'మెనూ' నిర్ణయించడం, విందుకు కావలసిన కంచాలు, గిన్నెలు, అటికలు, పోగుచెయ్యడం - ఇవన్నీ రఘుపతి ఆతురతగా చేసాడు. అలాంటి ఏర్పాట్లు విదేశాల్లో, హోటల్లో మామూలని రాజంకి తెలుసు. 'మరీ అంత విపులంగా ఒక ఇంటి విందులో ఇవన్నీ చెయ్యాలా?' అని రాజంకి తోచింది. రఘుపతి శ్రద్ధగా, అక్షరక్రమంగా పిండివంటలపేర్లు - బాదాంఖీరు, బజ్జి, పొటాటో చిప్స్ - మెనూకార్డులో రాయడం చూసి రాజం విసుగ్గుంది.

" 'సాంబారు, చారు, పచ్చడి, 'సాంబారు, చారు, పచ్చడి,'" అని రాజం మళ్ళీ మళ్ళీ వల్లించింది. "దానికిబదులు మీరుగాని 'శ్రీరామజయం' రాస్తే పుణ్యం రావచ్చు!" అని గొణుక్కుంది. చేతిలోనున్న అగరుబత్తులు పూజకి అర్పణచేసి వంటగదికి వెళ్ళింది.

"ఏమన్నావ్? నువ్వేమంటున్నావ్? ఇంకోసారి చెప్పు!" అని రఘుపతి ఆమెను దగ్గరకి పిలిచాడు. ఇంతలో భవాని చేతిలో ఒక గిన్నెతో కనిపించింది.

రాజం వెనకాడక అతనికి చెప్పింది: "నేనడిగేది ఈ మెనూ మనింటి విందుకి తప్పకుండా కావాలా అనే!"

రఘుపతి రాజంతో వాదాడలేదు. మేజాలో ఒక్కొక్క మెనూకార్డు పక్కన ఒక గిన్నె పెట్టి నిష్క్రమించాడు.

ఇంకోరోజు రఘుపతి తన అసంతృప్తిని బాహాటంగా తల్లికి చెప్పాడు:" నేనే ఆ పళ్లు కొనితీసుకొని వచ్చాను, కాని ఒకటికూడా తినలేదు!" అతనలా  పదే పదే అనడం రాజం విన్నది. అతనెప్పుడో రెండుడజన్ల అంటిపళ్ళు కొని తీసుకొచ్చాడట. ఇంట్లో అందరూ తిన్నారు; ఆ సాయంకాలం వచ్చిన అథితులకి మిగతా పళ్ళు ఇవ్వడమైంది. ఆ రాత్రి రఘుపతి కావాలని అడిగితే శారదాంబాళ్ లేదన్నారట.

"నువ్వు ఒకపండే తిన్నావా? ఏం? ఎందుకు మరో రెండు పళ్ళు అడిగి తీసుకోలేదు? నేనందరికి ఇచ్చేసాను," అని ఆవిడ హీనస్వరంలో అడిగారు.

"అవి special mango variety; నేను తరువాత తిందామనుకున్నాను. నేనే కొన్నాను, కాని తినలేదు!" అని రఘుపతి మళ్ళీ మొరపెట్టుకున్నాడు.

అతనిమాటలు విని రాజం చీదరపడింది. "ఇదేం పెద్ద సంగతా? నాకు బాగా జ్ఞాపకముంది. ఒకసారి మా అమ్మ రోజంతా పనిచేసి ఇడ్లీలకి పిండి కలిపింది. ఆ మరునాడు అమ్మ ఇడ్లీలు చేస్తూంటే తరాలున చాలామంది ఊరోడ్ నుంచి ఇంటికి వచ్చారు. వాళ్ళందరికీ ఇడ్లీలు వడ్డించినతరువాత అమ్మకి ఏదీ మిలగలేదు. ఇలాగ ఎన్నిసార్లో జరిగిందో ఎవరికి తెలుసు? దీనిగురించి అమ్మ ఎప్పుడైనా మాటాడిందా? లేదు! ఇక మీరు కొన్న అంటిపళ్లగురించి చెప్పాలంటే . . . అవి ఏదో ఒక రైతు పండించాడు, ఒక వర్తకుడికి అమ్మాడు, మీరు కొన్నారు! జరిగినది అంతేకదా? మరెందుకు మీరు పదేపదే దానిగురించి మాటాడుతున్నారు?" అని రాజం బాహాటంగా అడిగేసింది.

"చూసారా వదిన వాళ్ళ అమ్మని ఎలా పొగడుతుందో?" అని భవాని నవ్వుతూ జోక్యం చేసుకుంది. రాజం మాటలువిని శారదాంబాళ్ కి  ఆశ్చర్యం కలిగింది; అదే సమయం రఘుపతి మొహంలో కనిపించిన మార్పు ఆవిడ గుర్తచేసుకున్నారు.

“నేను వాడ్ని అడిగింది తమాషాకే . . . నాకు వాడిమీద కోపం లేదు,” అని ఆవిడ అన్నారు.

“నేనూ తమాషాకే అన్నాను!” అని రాజం నవ్వుతూ తన కంగారుని కాపాడుకుంది. పోనీ, తన భర్త ఏదో హాస్యంగా అన్నాడనుకుందాం, అదేం ఏదో పెద్ద సంగతా? ‘నేను పళ్ళు కొన్నాను, కాని తినలేదు!’ అని బాధపడితే అందులో ఏమైనా అర్థముందా? లేదు?

‘నేనతన్ని సరిగ్గానే అడిగాను. అతని మొహంలో కనిపించిన మార్పుకూడా చూసాను. అతనికి ఆహారంలో అభిరుచి కొంచెం తగ్గుతే బాగున్ను!’ అని రాజంకి తోచింది.

ఒకరోజు రఘుపతి వంటవాడితో తనకి కోకో బదులు కాఫీ - ఒక మార్పుగా - తెమ్మన్నాడు. మరెందుకు అతను మారుపాటుగా ఏనాడూ “రాజం, ఇవాళ మనం కచేరీకి బయటకి వెళ్దామా?” అని అడగడు? మార్పంటే అది నాలికకే కాబోలు!

రఘుపతికి మద్రాసులో చాలామంది స్నేహితులున్నారు. కాని భార్యతో అతనెవరింటికీ వెళ్ళడు.

ఒకరోజు తల్లిని అడిగాడు: “అమ్మా, నా ఫ్రెండు జాన్ వాళ్ళింటికి రమ్మని నన్ను చాలారోజులుగా పిలుస్తున్నాడు. మనం వెళ్దామా?”

“నేనెప్పుడూ ఆ జాగాలకి రాను!” అని కొంచెం ఉద్రేకంతో శారదాంబాళ్ అతనికి జవాబు ఇచ్చింది. “కావాలంటే నువ్వు రాజంతో వెళ్ళు!”

రఘుపతి ఒక కొంటె నవ్వు నవ్వి, ఊరుకున్నాడు.

భర్తలో ఈ పిరికితనం చూసి రాజం ఆశ్చర్యపడింది. పెద్దలముందు నిశ్చలతగా కనిపించాలని అతని స్వభావం, అది తనకి తెలుసు. దంపతులుగా తమిద్దరం ఆ ఇంటిలో మెలగడం కష్టం, అది సొంత కాపురంలోనే సాధ్యం. ఆదీ మంచిదే! జీవితమంటే కొన్ని కట్టుబాట్లుండాలి. ఐతే రాజం తన భార్యకదా? ఆమెకని కొన్ని వాంఛలూ, అభిలాషలూ ఉంటాయని రఘుపతి ఎందుకు గ్రహించడు? దాంపత్యంలో భర్త తన ప్రేమని అదుపులో పెట్టుకొని అధికారంతో ఏలుతాడు. భార్య దాన్ని నమ్రతతో, అణకువతో వరించుతుంది; ఇది దేవుడు విధించిన నియమం. రాజం తన

బాధ్యత నిర్వహించడానికి సిద్ధంగావుంది. రఘుపతి తన్నేలుకోవాలని ఆతురతతో కాచుకొనివుంది.

రఘుపతి రాజంని తప్పక ఏలుకున్నాడు. అతనికి రాజంపై అపార ప్రేమవుంది. కాని ఆ ప్రేమని నిరూపించే పైఖరిలో మిశ్రిత భావాలు చోటుచేసుకున్నాయి. ఆతను రాజంని తన జీవితంలో ఒక చెలికత్తెగా భావించాడు, భార్యగా కాదు. అతని మనసులో రాజం ఒక ప్రియురాలి శృంగార భావనలు రేకెత్తలేదు. అతని ఆపేక్షకి రాజం ఒక వసతిగా కనిపించింది, అంతే!

ప్రజలు నిత్యమూ అనుభవించే దుర్దశ, ఇక్కట్లు సరితూగడానికి హాస్యం తోడ్పడుతుందా? తమిళదేశంలో అనేక ప్రశ్నలు: దినబత్తెం, ధరల పెరిగుదల, జనుల పొడుగాటి పంక్తులు, జన సమ్మర్ధం - ఇలాగ ఎన్నో యిబ్బందులు. ఇవన్నీ తమిళులు హాస్యభావం, కల్పనతో ఎదిరించారు. పరిహాసం, నవ్వులాట, ఎగతాళి, వ్యంగ్యరూపకాలు, కధలు, వ్యాసాలు - ఈ ఆయుధాలతో తమ సుబుద్ధిని కాపాడుకున్నారు.

ఇంటిలో సాంస్కృతిక నేపధ్యం గురించి రఘుపతికి ఏ విచారమూ లేదు. ఆహారం గురించి అతను మరిచిపోలేదు, కాని రాజం ఆరాధించే కళాత్మక విలువలు అలాగే తోసిపారేసాడు. రాజంకి సంగీతంలో మంచి ప్రవేశంవుందని, శృతిప్రియంగా నేర్చుకుందని, నాదానుభావంతో ఆమె తన ప్రజ్ఞ వ్యక్తపరచాలని ప్రయాస పడుతోందన్న తలపే అతనికి లేదు. ఎంతసేపూ తన తల్లి వంటలో నైపుణ్యం, వివిధ భక్ష్యపదార్థాల్లో - అవన్నీ అతను సరళంగా వల్లించగలడు - గుణవిశేషాలని వర్ణించుతూ అతను రోజులు గడిపాడు. ఈ ప్రలాపం చూసి రాజం అసహ్యించుకుంది.

కళాత్మక తృష్ణగురించి భారతియార్[3] రాసిన గేయం రాజం గుర్తుచేసుకుంది.

*నేనొక గొప్ప వీణ చేసాను, దాన్ని ఉత్తికే చెత్తలో పారేయడమా?*

---

[3] సుబ్రమణ్య భారతి (1982-1921) ఒక సుప్రసిద్ధమైన తమిళ కవి, త్యాగి. పాత్రికేయుడు, భారత స్వాతంత్రోద్యమంలో పేరు పొందిన మహనీయుడు.

*తల్లీ, నాకు చెప్పు! నన్నెందుకు ఉజ్జ్వలమైన వివేకంతో సృష్టించావ్?*
*ఇక ఈ సమాజం వర్ధిల్లడానికి నా జ్ఞానమూ, తెలివి పనికిరావా?*

"సంగీతం, చదువు, అందం, స్వభావం, అనురాగం, అనుకంప - వీటన్నిటిలోనూ నేనందరినీ మీరాను. కాని దేవుడిచ్చిన వరాలు పెంచుకోడానికి నాకు అవకాశం లేదు. నా ఆదర్శానికి విరుద్ధమైన ఈ బతుకు నేను మనసార తిరస్కరిస్తున్నాను," అని రాజం నొచ్చుకుంది. తన సమర్థత నిరూపించడానికి రాజం ప్రయాసపడింది. ప్రతిభకి తోడుగా సమర్థత చోటుచేసుకోవాలి. అప్పుడే, ఆ శక్తి వలనే, అభిరుచి పెరగడానికి వీలవుతుంది; ఆత్మగౌరవమూ కలుగుతుంది. ఈ ప్రపంచంలో ప్రతీజీవిలో మనం చూసే సృజనాత్మక ఆతురతకి ఆ శక్తే ఆధారం. ఆవేశం, సమర్థత లేకపోతే ఈ ప్రపంచంలో ఏదీ పని చెయ్యదు. మనకి సముద్రం బ్రహ్మాండంగానే కనిపిస్తుంది కాని మన దాహం తీర్చుకోవాలంటే అదేం ఒక నీటిధారకి సాటి అవుతుందా?

సమాజంలో ఉన్నత వర్గాలమధ్య మెలగడంవలన తన కళాత్మక అభిలాషలకి, స్వాతంత్ర్య పోరాటానికి ఏ లాభమూ లేదని రాజం త్వరలో గ్రహించింది. తన పరిసరాలు దానికి అనుగుణంగా లేవు. రఘుపతిగాని, భవానిగాని తన సంగీతంగురించి పట్టించుకోలేదు. వంట చేయడం ఒక కళ అని రాజంకి తెలుసు, కాని అందులోనూ తనకి అదృష్టం లేదు. ఇంటిలో వంటవాడున్నాడు. ముఖ్యమైన భోజన పదార్థాలు తనే చేస్తానని శారదాంబాళ్ చెప్పేసారు. "ఇవన్నీ నా బాధ్యత, నీకేం పనిలేదు!" అని ఖరారుగా ఆవిడ ఆజ్ఞ ఇచ్చేసారు. రాత్రిభోజనం మామూలే. సాయంకాల వేళల్లో చుట్టుపక్కలనున్న స్నేహితులని చూడడం ఒక అలవాటైపోయింది. అప్పుడప్పుడు రామశేష్ భార్య రాజం, భవానికి తోడుగా వెళ్ళారు. రఘుపతికీ, రామశేషన్ గారి అబ్బాయికీ చెప్పుకోతగ్గిన ఒద్దిక లేదు. ముందునుంచి వాళ్ళ చుట్టరికం అలాగే సాగింది. రామశేషన్ కోడలు రాజం, భవానిని కలుసుకోడానికి వచ్చేది, కాని అదీ చెదురుమదురుగా జరిగేదే. ఆమెకి కాలేజీలో సాంస్కృతిక వ్యవహారాల్లో ఉద్యోగం. ఏదైనా సినిమా, కచేరీ చూడాలనిపిస్తే ఆవిడ

భర్తతోనే వెళ్తుంది. అతను ఉద్యోగనిమిత్తం ప్రయాణంచేస్తే ఆతనితో అన్ని ఊర్లూ తిరిగిచూసేది. సాధ్యమైనవరకూ ఆ దంపతులు తమ కార్యకలాపాలన్నీ ఉమ్మడిగానే చేసారు. వాళ్ళని ఆదర్శదంపతులని అందరూ పొగడారు. వాళ్ళకి ఇద్దరు పిల్లలు, ఆ పిల్లల్ని చూసి అందరూ పొగడారు. రామశేషన్ భార్య పేరుకుమాత్రం ఇంటికి పెద్ద; ఆవిడతరవాత ఆవిడ కోడలే అధికారం చెలాయించింది.

రాజం ఇవన్నీ క్రమంగా తెలుసుకుంది. ఆ కోడల్ని చూసి అసూయపడింది. తనకా భాగ్యం కావాలని మనసార ఆశించింది. అదేం అమితమైన ఆశ కాదు, కాని ఆ అదృష్టం తనకి లేదని ఊహించుకుంది. ఇతరుల వైఖరి, ముఖ్యంగా రఘుపతిలో కనిపించే నిష్పక్షపాతమే, దానికి కారణం.

"మా అన్నయ్య ఇప్పుడు బాగా మారిపోయాడు!" అని భవాని ఒకరోజు రామశేషన్ భార్యతో చెప్పింది. "నాకు పెళ్ళైన నాలుగుమాసాలవరకూ అన్నయ్య నన్నెలా హడలుగొట్టేవాడో మీకు తెలుసా?"

ఆ గతకాల రఘుపతిని రాజం కల్పన చేసుకుంది. ఇప్పుడతను అలాగే ఉంటే?

"అమ్మా, మేం ఇవాళ ఒక Exhibition కి వెళ్తున్నాం!" అని తల్లికి చెప్పేసి, మరేం అనకుండా రాజంని చూసి "రా, రా, ఆలశ్యం చెయ్యకు!" అని భార్యను ఈడ్చుకొని వెళ్ళివుంటాడు.

కోపం వస్తే రాజంనిచూసి కేకలుపెట్టినా, ఆ తరువాత "I am sorry!" అని మందలించేవాడు.

'ఇవన్నీ కల్పనలే,' . . . అని రాజం విసుగ్గుంది.

రఘుపతిలో నిర్లక్ష్యం చూసి ఆమె బాధపడింది. భార్యమీద కోపంవచ్చినా అతను దాన్ని మింగేసి "ఓ అలాగా? నువ్వు బాగా మారిపోయావ్! సరే, అలాగేకానీ!" అని చెప్పి ఊరుకున్నాడు.

భర్త అన్న తరువాత తన మర్యాద కాపాడుకోవాలంటే అతను తనొక మగవాడని సమర్థించుకొని భార్యని ఏలుకోవాలి; తనకేంకావాలో అడిగి పుచ్చుకోవాలి. "నేనతని బానిసనికాను! నా భర్త నామీద ఎదువంటి ఆధికారమూ చెలాయించడానికి నేనిష్టపడను!" అని వక్కాణించి చెప్పే యువతులెవరైనా ఉండవచ్చు, కాని రాజం మనసులో ఆ బావన లేదు. రఘుపతి తన్ను దయాదృష్టితో చూడాలనికాదు ఆమె కోరిక; తనపై ఆతనకి అభిమానం, అధికారం రెండూ ఉండాలి. తనకేం కావాలో అతను తెలుసుకొని పూర్తిచేస్తే అదీ మంచిదే. అల్లరి చేసే పిల్లవాడంటే – ఊరికే, సాధువుగా కూర్చున్నవాడికంటే - తల్లిదండ్రులకి చాలా ఇష్టం అని అందరికీ తెలిసిన విషయమేకదా? మరి చిన్ని కృష్ణుడు బాల్యమంతా తుంటరిగానే ఆటలన్నీ ఆడలేదూ? ప్రభువు ఏలుతేనే ఫౌరుడుకి తృప్తి కలుగుతుంది.

స్వభావంగా ప్రతీ జీవికి కావలసినవి మూడు: ఆహారం, వస్త్రాలు, ఆశ్రయం. అలాగే ఆ జీవి మనసు నిలకడకి కావలసినవి మూడు: ఇందులో మొట్టమొదటిగా, ఇతరులు ఆతన్ని ప్రేమించాలి; తనలోవున్న గుణవిశేషాలు అతను గుర్తుచేసుకొని గర్వపడాలి. ఆ తరువాత ఇతరులు అతని ఏకైతతకి గౌరవం, మర్యాద చూపాలి; ఆఖరికి, ఇతరులతో అతని బంధం బలంగా, ఎడతెగకుండా పెరగాలి.

వీటిలో ఎదిలేకపోయినా బతుకు విసిగిపోతుంది. ఇక రాజేశ్వరి విషయంలో ఈ మూడూ కావాలి, ఎదీ ఆమె అందుబాటులో లేకపోవడం ఆమె దురదృష్టం.

నెమలికి విశాలమైన రెక్కల్లో వెయ్యి కన్నులున్నా రెండేరెండు కళ్ళే దాని దృష్టికి సాయం చేస్తాయి. తక్కినవాటిలో కాంతి లేదు. రాజం జీవితంలో అందమూ, రంగులూ ఉన్నాయి, కాని ఏం లాభం?

రాజం తన అత్తమామలతో గతకాల జీవితం గుర్తుచేసుకుంటే ఇలాంటి ఆలోచనలే ఆమె మనసుని స్వాధీనం చేసుకున్నాయి. వాళ్ళ ధోరణిలో ఇంతకుముందూ, ఇప్పుడూ - ఎంత భేదం కనిపిస్తోంది!

తన జీవితంలో సాగుతున్న వివిద ఘట్టాలు రాజం గుర్తుచేసుకుంది.

ఆ పెద్ద శివభక్తుడు చిరుతొండర్ శివునిని శాంతపరచాలని తన కొడుకు శీరాళన్ని బలిగా త్యాగం చేసాడని పురాణంలో కథ. దానికి కారణం అతని అత్యంత భక్తి. అలాగే రాజంకూడా తన అత్తమామల సంతృప్తికోసం తన సంగీతం త్యాగం చేసింది. పురాణంలో శీరాళన్ మళ్ళీ జన్మమెత్తాడు. రాజం సంగీతమూ బతికింది.

ఆ తరువాత . . .

మనునీదిచోళ చక్రవర్తి న్యాయం నిలబెట్టాలని – ఒక ఆవుకి జరిగిన ఘోరానికి శిక్షగా - తన కుమారుడు రథం అడుగున నలిగి చావాలని ఆజ్ఞ ఇచ్చాడు. రాజమూ తన ధర్మం కాపాడాలనే వంకతో తనకి రావలసిన కీర్తి త్యాగం చేసింది. ఐతే ఏం జరిగింది? తనకి చెడ్డపేరు; ఆ ఉన్న పేరూ, ప్రతిష్టకూడా పోయాయి!

ఆ ఘట్టమూ ఇప్పుడు సమాప్తియైంది. ఇప్పుడు ఆమె గురి అంతా స్వాతంత్రం! అవును, స్వేచ్ఛగా తన అభిలాషలని తీర్చుకొనే నెపంతో ఒక ఉద్యమం ఆరంభించాలి! ఆ విముక్తి యధార్థంగా తన కళ్ళకి కనిపించేవరకూ తన పోరాటం ఆగదు!

ఈ భావన – స్వాతంత్ర ఆవేశం - తన రక్తనాళంలో ప్రవహిస్తోందని రాజంకి, మొట్టమొదట – ఎలాగ తెలుసు?

ఒకరోజు శారదాంబాళ్ సద్భక్తి కారుతున్నధోరణిలో మాటాడారు: ‘‘ఈ ఇంటికి కోడలుగా రావడమంటే అది ఎంత గొప్ప పెద్ద భాగ్యం! ఇంత మంచి భర్త, అత్తగారు,

ఆడపొడుచు మరెక్కడ దొరుకుతారు?" ఆవిడ దృష్టిలో ఆ ఇంటికి కోడలుగా అవతరించడానికి ఒక స్త్రీ పూర్వజన్మల్లో ఏన్నో తపస్సులు చేసియుండాలని అర్థం! అవును మరి - ఇంటిలో వంటవాడున్నాడు; ఎదీ కావాలని అడగని భర్త; కోడలు ఏంచేసినా అత్తమామలు ఆమెను తప్పుబెట్టరు! ఐతే రాజం ఆ సిద్ధాంతం గాఢంగా నిరాకరించింది: "అన్నిటికన్నా నాకు ముఖ్యంగా కావలసినది స్వేచ్ఛ. నా ఆకాంక్షలు సఫలమవాలి. దాంపత్యంలో నేనొక ఆదర్శ భార్యగా పేరుపొందాలి. నా మనసులో ఎందుకీ ఆరాటం? నేనెందుకు చెడ్డకోడలుగా మారాను? నేను స్వతంత్రత కోరడం తప్పా? ఇలాంటి ఆలోచనలుండి నాకు విముక్తి కావాలి!"

రామాయణంలో, సీత తన ఎందుకు భర్తతో అడవికి వెళ్ళింది? అది అడవే కావచ్చు కాని అక్కడ తమ అన్యోన్నత, ప్రేమానురాగాలు పోషించడానికి ఒక మంచి అవకాశం దొరుకుతుందని సీత నమ్మింది. అక్కడ ప్రకృతి వినోదాలు, అందాలు ఆనందించడమేగాక ఆ తరువాత తను పట్టమహిషిగా రాజధాని భవనంలో ఏలినప్పుడుకూడా ఆమె ఆ పాతజ్ఞాపకాలు గుర్తుచేసుకుంది. అలాగే రాజం తనూ, రఘుపతి ఇంతకుముందు సరికూర్చిన కాపురంగురించి ఆలోచించింది. ఆ ఇల్లు మళ్ళీ చూడాలని, ఆ పాత స్నేహితులని కలుసుకోవాలని ఆశించింది. గతకాలంలో ఎప్పుడో, ఎక్కడో, ఏ మూలనో తను అనుభవించిన రోజులవి: కాని ఇప్పుడుకూడా ఆ తీయని జ్ఞాపకాలు ఆమెను రంజిల్లజేసాయి. అటువంటి స్మరణ తన పుట్టిల్లు, తన అత్తమామల పరిసరాల్లోకూడా తనకెప్పుడూ రాలేదని రాజం నమ్మింది.

మరి రఘుపతి మనసులో 'ఇప్పుడు మనం ఇక్కడ ఉన్నాం, ఇలాగే ఉందాం. అసలు మనకి వేరే దారి లేదుకదా?' అనే భావన స్థిరంగా పాతుకుపోయిందంటే, రాజం మరేం చెయ్యగలదు? ఆ తలపే రాజంకి అసహ్యంగా తోచింది. గొంతుచించుకొని 'నాకు కావలసినది స్వేచ్ఛ, విమోచనం!' అని గీపెట్టాలని తొందరపడింది.

ఒక స్త్రీ మనోభావం ఆమె భర్తపై ఆధారపడివుంటుంది. ఆమె జీవితంకి అర్థమూ, భావమూ అతనే ఇవ్వగలడు. పుట్టుక, పోషణ – ఇవి బాల్యం, యౌవనదశలో ఆమె

వైఖరిని నిలగొల్పుతాయి. కాని ఆ తరువాత సంఘంలో బాహాటంగా ఆమెపై ప్రజల అవగాహనకి భర్తే కారకుడవుతాడు. ఇక ఈ ప్రపంచంలో తమ భర్తల ప్రభావంవలన పూర్తిగా మారిన స్త్రీలెందరోవున్నారు; ఆ భర్తలు సమాజంలో విజయవంతులుగానో లేక విఫలులుగానో కనిపించవచ్చు. ఒక భర్త తన భార్య యౌవనంలో నేర్చుకున్న ముగ్గుని చెరిపేసి కొత్తముగ్గుని సృష్టించుతాడు. కొందరు భర్తలు సృజనాత్మక కృషితో కొత్త కొత్త ముగ్గులు కనిపెడతారు. ఆఖరికి కొందరు "చూడు, ఇది నా కొత్త కల్పన!" అని చెప్పుకుంటూ ఏవేవో పిచ్చి పిచ్చి ఆకారాలు ప్రదర్శిస్తారు.

"మగవాడెప్పుడూ తల్లిని పోగొట్టుకోడు; ఆవిడ పోతే అతని బార్యకి ఆ స్థానం దొరుకుతుంది." ఇదొక సామెత. ఇక్కడ భార్యని ఎత్తైన సింహాసనంలో కూర్చోబెట్టారన్నమాట.

"ఎలాగైనా భార్యంటే తల్లితరవాతే!" అని మరికొందరన్నారు.

"ఏ తల్లీ భార్యతో సమానమవదు!" ఇక్కడ భార్యకి తల్లికంటే అధమస్థానం.

"తల్లి అనే స్థానం ఒకరికే దక్కుతుంది. మరేవరూ ఆ గౌరవంకి అర్హులుకారు. కావాలంటే భార్యలెందరైనా దొరకవచ్చు!" ఇందులోనూ బార్యకి తక్కువ స్థానమే!

ఈ లోలోక్తులన్నీ మగవారు స్వానుభవంతో చెప్పారు. ఈ నాలుగూ నిజమే కాబోలు!

రఘుపతి ఉద్దేశంలో తల్లి తరువాతే భార్య. 'బార్య ఎన్నడూ తల్లికి సమానమవదు!' అని తన భర్త దృఢ నమ్మకమని రాజం గుర్తుచేసుకుంది.

ఎంతసేపూ భర్త తల్లిగురించేనా ప్రస్తావన?

'భార్యకూ ఒక తల్లి ఉందికదా!' అని రాజం తనలో చెప్పుకుంది.

భర్తని అత్యంత ప్రేమతో ఆదరించే భార్యని అతని తల్లికి పోటీగా భావించకూడదా?

అంతేకాదు. తన అత్తగారి ప్రేమ తన తల్లి ప్రేమతో సమానమని ఏ భార్యకైనా విశ్వాసం కలుగుతుందా? భార్య అత్తగారిని ఆసక్తితో ప్రేమించదనుకుందాం, ఆవిడకూడా అదే విధంగా కోడలిని ఆదరించారనుకుందాం. ఐతే ఆ అత్తగారికి కోడలుమీద మాతృక బావాలున్నాయని అర్ధమా?

భర్తని ఎది భాదించినా అది భార్యని తాకుతుంది. భర్త ఎది చేసినా దాని ఫలితాలు – మంచివో, చెడ్డవో – భార్య భరించాలి; అందువలనే మనసులో నిత్యమూ ఆరాటం. ఆమె చంచల ప్రేమ, భద్రములేమితో ప్రయాసపడాలి. కాని భర్తకి అతని తల్లి ప్రేమ నిరంతరంగా, నిశ్చలతగా కనిపిస్తుంది. కుటుంబాల్లో మనం చూసే ఈ ధోరణిని ఎలా వివరించడం?

భార్యాభర్తలమధ్య బంధం ఆదర్శవంతంగా లేదనుకుందాం. అలాగైతే కోడలు-అత్తగారు మధ్య ఆత్మీయత ఎలా ఉంటుంది? భర్త భార్యపై చూపే ప్రేమలో కొరత కనిపిస్తోందంటే మరి అత్తగారకి తన కోడలిమీదున్న ప్రేమగురించి ఏమని చెప్పడం?

భర్తకి తల్లి ఉన్నట్టే భార్యకీ తల్లివుంది; మరి ఆ ప్రేమకోసం భార్యకీ ఆతురత ఉండదా?

రాజం జీవితంలో మరీ ఎక్కువగానే ఎదురుచూసింది. తనకొక పునర్జన్మ లభిస్తుందని కూడా ఆమె నమ్మింది. కాని దొరికినదానితో తృప్తిపడాలనే నిర్బంధమూ, ఈ పరిస్థితిని మార్చటానికి ఇక వీలుకాదనే మెలకువ ఇప్పుడు ఆమె మనసులో బాగా పాతుకుపోయాయి. సంగీతంలో తనకున్న అభిరుచి తన శారీరక పరిస్థితికి ఆత్యాధ్మిక పరిహారంగా వెలగాలని రాజం ఆశించింది. ఆ విశ్వాసం ఇప్పుడు అల్లాడుతోంది. ఆ ఆలోచన రాగానే రాజంకి భ్రాంతి కలిగింది, మనసుని చిత్రవధ చేసింది.

ఆమె ఆశించిన ధార్మిక జీవితంలో శూన్యమే కనిపిస్తోంది; తన మానవత్వంకీ దెబ్బ తగిలింది; తను నిలుకడలేని త్రోవలో చిక్కుకున్నట్టూ, ఏ నిమిషమూ తను జారిపోయే అపాయంలోవున్నట్టు రాజంకి తోచింది.

దురదృష్టవశాత్తూ ఆమె మనసులో ఇప్పుడు తీరని పగ చోటుచేసుకుంది.

"నాకు చావాలని ఉంది. కొంచెం విషమిస్తారా?" అని రాజం ఒకరోజు భర్తను చూసి బొబ్బలు పెట్టింది; కళ్ళు బాగా తడిసిపోయాయి. ఏం, ఎందుకని కారణం ఇవ్వలేదు. తనదిక భరించలేని బతుకని భర్తకి తెలియాలి, అదే ఆమె ఉద్దేశం.

"నువ్వేం పాకిస్తాను కావాలంటున్నావా?" అని రఘుపతి అడిగాడు. "ఎందుకలా నా మీద విషం కక్కుతున్నావ్?"

'అయ్యో, ఒకానొకప్పుడు నా భర్త నన్ను దేవతతో పోల్చేవారు: ఇప్పుడు నేను హత్యకి సిద్ధమవుతున్నట్టు మాటాడుతున్నారు! ఎంత శోచనీయం! నేనేం అంత క్రూరంగా మారిపోయానా?' అని రాజం భాదపడింది. తన చుట్టుపక్కల ఎవరైనా ఉన్నారా, తన్ను చూస్తున్నారా అనే తలపే లేకుండా పెక్కి పెక్కి ఏడ్చింది; తన మనసులోని భావాలని బాహాటంగా తెలియజేయడానికి జంకింది: "నేనేం తప్పు చేసేసానని మీరు నన్ను నిందిస్తున్నారు? నాకెందుకీ కట్టులూ, నియమాలూ? మీరు నా స్వల్ప ఆశలు పూర్తిచేసారంటే నాకు మరేం కావాలి? దయచేసి నా భర్తగా మెలగండి; అందుకు అడ్డం మీ తల్లిదండ్రులని వాళ్ళపై నేరం మోపకండి! నేనేం తప్పూ చెయ్యలేదు, వాళ్ళూ నిరపరాధులు. మీరే నేరస్థులు!" కాని రాజం నోరుతెరచి ఏమాటా అనలేదు.

కొంతసేపు తేరుకొని రాజం మళ్ళీ మాటాడింది:

“నేనేం పాకిస్తాను అడగటం లేదు. ఈ ప్రపంచంలో మనకి మరెక్కడా జాగా లేదా? ముందు ఇక్కడనుంచి మనం లేవాలి. స్వేచ్ఛగా ఎక్కడైనా సరే – ఎంత చిన్నదైనా, మనం కాపురం పెట్టుకొని బతుకుదాం. నేనడుగుతున్నది స్వతంత్రత – మహాత్మా గాంధీగారు అడిగినట్టు.”

“నాకూ చావాలని ఉంది; అప్పుడు నీకు స్వతంత్రత లభిస్తుంది!”

రాజం ఇప్పుడు ఏడవలేదు. “నేను చావడానికి మీరు నాకెప్పుడో అనుమతి ఇచ్చేసారు. చెప్పండి, మీరు నిజంగానే నన్ను ప్రేమిస్తున్నారా? నేను మీ భార్యను కానా? నిజం చెప్పాలంటే నేనొక వేశ్యలాగ – కావలసినప్పుడు వశపడే భోగినిగా – బతుకుతున్నాను.” మళ్ళీ ఇంకొక వెక్కు వెక్కింది.

“సరే, ఇప్పుడు నేనేం చెయ్యాలో చెప్పు!” అని రఘుపతి ఆవేశంతో అడిగాడు. “నావలన నీకు వేశ్య అని పేరు వద్దు! నేను నిన్ను నా భార్యగా గౌరవిస్తున్నాను, కాని అది నీకు నచ్చినట్లు కనిపించటం లేదు. భర్తగా నామీద నీకు ఇష్టం లేకపోతే మనం ఒకరికొకరు దూరంగా ఉండడమే మంచిది. ముందు మనం అలాగేకదా ఉన్నాం?”

ఆ రోజు ప్రేమని ధారపోసే భర్తగా రఘుపతి రాజం మనసుకి ఎది శ్రేష్టమో అవన్నీ సమకూర్చిపెడతానవని వాగ్దానం చేసాడు. ఇప్పుడో? తనవల్ల ఎది సాధ్యమో దానితో తృప్తి పొందమని రూఢీ చేసేసాడు; అంటే “నాదగ్గర మరేం ఎదురుచూడవద్దు!” అని స్పష్టంగా చెప్తున్నాడనేకదా రాజం ఊహించుకోవాలి?

రాజం కన్నీరు కార్చలేదు. గుండె మెత్తబడలేదు; “నన్ను మా ఇంటికి పంపించేయండి!” అని భర్తతో బతిమాలింది. “ఇక ఇక్కడవుంటే నా వెఱ్ఱితనం ఏమవుతందని నాకు భయంగా ఉంది.”

“సరే, నీ ఇష్టం!” అని రఘుపతి సమాధానమిచ్చాడు.

అతను కనికరంతో పలికిన మాటలు రాజంని ఇంకా తీవ్రంగా పీడిస్తాయని అతను ఉహించలేకపోయాడు.

## 42

ఆ తరువాత మూడు మాసాలలో రాజం - ఏవో అర్ధంపర్ధంలేని కారణాలతో - పుట్టిల్లుకి తిరిగి వచ్చేసింది.

రాజం రాకగురించి తాత్కాలిక వార్తలు విని విశాలం కలవరపడింది: ‘రాజంకి రావాలనివుంది,’ ‘రాజం ప్రయాణం నిశ్చయమైంది’, ‘రాజం నిజంగానే వస్తోంది!’ అనే కబుర్లు క్రమక్రమంగా ఆవిడ విన్నారు. రాబోయే అపనిందనుంచి రాజంని రక్షించడానికి మార్గం గురించి ఆవిడ ఆలోచించారు.

“రాజం, రా! నువ్వు వస్తున్నావని తెలిసి నాకు చాలా సంతోషంగావుంది,” అని కూతురుకి రాసారు.. “కొన్నిరోజులుగానే నిన్ను ఒక మంచి లేడీడాక్టరుదగ్గర చూపించాలని నా ఉద్దేశం. ఆవిడ ఏదైనా చికిత్స, ఆపరేషన్ మూలంగా నీ గర్భధారణకి సాయం చెయ్యవచ్చు. నువ్విప్పుడు పూర్తిగా తేరుకున్నావు; ఇదే మంచి తరుణం.”

‘పాప అనే నిరీక్షణతో ఇక జీవితం వాళ్ళకి ఇంపుగా కనిపిస్తుంది; దంపతులమధ్య అనురాగం పెరుగుతుంది; అమ్మమ్మా, తాతగారూ మనవడూ, మనమరాలు చూసి ఆనందభరితులవుతారు.’ ఇవన్నీ తన ఊహలని విశాలం గుర్తుచేసుకుంది, కాని ఆ ఆలోచనలో ఎంత నిజముందని తెలిసే ఆ ఉత్తరం రాసింది.

“రాజం ఎందుకిలా గభీమని వస్తోంది?”అని ఎవరైనా అడిగితే అందరికీ అదే కారణం చెప్పాలని విశాలం నిశ్చయించింది.

ఆఖరికి, రాజం ఒకరోజు వచ్చింది.

రాజంలో కనిపించే మొండితనం చూసి విశాలం అదిరిపడింది.

"నీకు అక్కడుండడం బొత్తిగా ఇష్టం లేదని మాకు తెలుసు," అని విశాలం మొదలుబెట్టింది. "చెప్పు, మీ ఆయన మరేం చెయ్యగలరు? అతనికి ఉద్యోగం మద్రాసులోనే దొరికింది. మీ మామగారుకి అక్కడే ఉద్యోగం, ఆ తరువాత మీరు వెళ్ళారు. మనం ఎవరినీ తప్పుపెట్టలేం. నీ అదృష్టం అంతే అని ఒప్పుకోవలసిందే!" అని ఏదీ దాచకుండా మనసు విప్పి చెప్పేసింది.

రాజం ఉగ్రంతో తల్లిని తాకింది.

"నువ్వు ముందునించే విచ్చలవిడిగా పెరిగావ్. నేను నా అత్తమామలదగ్గర పడిన హింసలు నీకేం తెలుసు?" తన కంఠధ్వనిలో కటువుందని రాజం లెక్కచెయ్యలేదు. ఆమె దురాక్షేపణ ఇంకా తీవ్రంగా సాగింది.

"నాకు పదిహేను నిండకుండానే పెళ్ళెందుకు చేసారు? ఏం, ఎందుకా తొందర? నన్ను ఇంటినుంచి వెళ్ళగొట్టాలి, అదేనా మీ ఉద్దేశం? సరే, దాని ఫలం ఇప్పుడు బాగా అనుభవించండి! నేనిక్కడేవుంటాను. ఇక్కడే చస్తాను!"

"మేంకాని నీకు పెళ్ళి చెయ్యకపోతే ఇప్పుడు నువ్వేమంటావో ఎవరికి తెలుసు? నీకిప్పుడు ఇరవై నిండాయి."

"ఈ పెళ్లి చాలదని నాకిప్పుడు ఆపరేషన్ చేసి నాలాగే ఇంకొక కూతురు పుట్టాలా? నా ఈ దుర్దశ మీకు చాలదా? నా కూతురుతో నేనూ కష్టపడాలన్నమాట! నాకెప్పుడు విముక్తి?" అని రాజం కటోక్తి విసిరింది.

“రాజం, నీ దుఃఖమే మాకు సంతోషం అని నువ్వంటున్నావ్. ఆ మాటలు వినడం మేం చేసిన పాపం. నీకు తల్లిగా ఉండడం నేను చేసిన పాపం.”

రాజం వెనకాడలేదు.

“కాదని ఎవరన్నారు? నేను నీ ముద్దుబిడ్డగా పుట్టాను, అదే నీ దురదృష్టం! నాలాంటి కూతురుకావాలని నువ్వు ఆపరేషన్ చేసుకున్నావా? మరెలా నేను వచ్చాను?” తన ప్రశ్నలోని తెలివిమాలినతనం తెలిసే రాజం ఆ ప్రశ్న అడిగింది.

“రాజం, నువ్విలాంటి ప్రశ్నలడుగుతావని నేనెప్పుడూ ఎదురుచూడలేదు!” అని విశాలం నవ్వింది.

“అంటే నువ్వు కావాలనే నన్ను కన్నావన్నమాట! ఇప్పుడు నా అపరేషన్ గురించి మాటాడుతున్నావ్. నేను నిన్ను ఎన్నటికీ క్షమించలేను!” అని రాజం బొబ్బరించింది.

విశాలం అడ్డపాటు లేకుండా కన్నీరు కార్చింది: “నువ్వు దేవుడు మాకిచ్చిన వరం. నీ పుట్టుకలోగాని, మేం నిన్ను పెంచిన పద్ధతిలోగాని ఏ తప్పూ లేదు. ఇప్పుడు మాత్రం ఏం జరిగిందని? నీమీద ఏ దోషమూ లేదు. నువ్వు దేనికీ క్షమాపణ అడగక్కరలేదు. నువ్వు ఏమోమో కలిపించుకొని మనసుని చిత్రవధ చేసుకుంటున్నావ్. అసలు నువ్వెందుకు బాధపడతున్నావని మాకు అర్థం కావటం లేదు!” ఆఖరికి, విశాలం తన తడబాటు కూతురికి చెప్పింది.

“నీకు నాగురించి మరేం తెలియాలి?” అని రాజం తిప్పికొట్టింది. “నా సంగతి ఇప్పుడు అందరికీ తెలిసినట్టే! నేనెందుకు సంతోషంగా ఉండాలని ఒక కారణం చెప్తావా?”

“ఏం, ఎందుకు లేదు? నీకు కష్టం వస్తే చేదోడు ఇవ్వడానికి చాలామంది ఉన్నారు. మీ ఆయనికి మంచి మనసుంది. అతనికి నీమీద కోపం లేదు. నన్నడిగితే పిల్లలు లేకపోవడమే నీకు ఒక కొరత అనాలి.” రాజంని రెచ్చగొట్టకూడదని విశాలం చాలా జాగ్రత్తగా మాటాడింది. ఆ తరువాత రాజం మరేం ఆక్షేపణ తెలియజేయలేదు.

“రాజంకి ఇక్కడ ఏం తక్కువ? అని అత్తవారింట్లో అందరూ అడుగుతున్నారు.

“ఇక్కడ నీకు మరేం కావాలి?” అని తల్లిదండ్రులు పుట్టినిల్లులో అడుగుతున్నారు.

రెండుచోట్లా రాజంకి తనొక పరాయివ్యక్తి అనే భావన కలిగింది. ఎందుకు అందరూ తన్నెక్కడో దూరంలో నిశ్చితంగా నిలిపినట్టు తన అంతర్బుద్ధి పదేపదే చెప్తోంది? ఎవరూ సముచిత భావంతో “రాజం, ఇది మన ఇల్లు!” అని అనరేం? అదేకదా తన ఆకాంక్ష?

ఆ రెండు పరసరాల్లోనూ తన సౌఖ్యంకి చేదోడుగా ఎన్నోవున్నాయని, తను అదృష్టవంతురాలనికూడా రాజం నమ్మింది. కాని మనసు శోకమయంగావుంది. ఏం, ఎందుకు?

తన గుండెకి ఒక పెద్ద దెబ్బ కలిగిందని రాజంకి తెలుసు. ఆ గాయపుమచ్చలు పూర్తిగా మానిపోవడానికిముందే అవి స్వేచ్ఛగా దండెత్తి రాజం ఆత్మని ఆక్రమించేసాయి. ఆ పరాభవంగురించి రాజంకే తెలుసు. మరెవరికీ తెలియదు.

‘నేనేంకావాలని అడుగుతున్నాను? స్వరాజ్యం; విముక్తి; నాగురించి నేను గర్వపడాలి. నా భవిష్యత్తుని రూపుదిద్దుకొనే మార్గం నాకు అందుబాటులో ఉండాలి. నాకు పెద్దలమీద పగలేదు; గాంధీజీకీ ఆంగ్లేయులమీద ద్వేషమా? లేదే? అతను

ఏవగించుకున్నది వాళ్ళ పాలన, రాజకీయ తంత్రం. ఆ ప్రభుత్వం అమాయక ప్రజలమీద అన్యాయంగా విధించిన ఆజ్ఞలు, పన్నులు ఆయన గాఢంగా తిరస్కరించారు. అతనేం ఆయుధాలూ వాడలేదు. అతనిది అహింసా ఉద్యమం. శాంతియుతమైన సమాధానం అతని గురి. నా పోరాటమూ. లక్ష్యమూ అలాంటివే. నాకూ చెడగొట్టే స్వభావం, పోట్లాటలంటే అసహ్యమే. నేను కోరేది నా కళాత్మక అభిలాషలు వర్ధిల్లడానికి తగిన వాతావరణం. నా మనోవేదన అందరికీ తెలియజేయాలని నేనే ఈ చెఱసాలకి వచ్చిచేరాను."

అవును. ఇప్పుడు రాజంకి పుట్టిల్లు ఒక చెఱసాలగా కనిపిస్తోంది. గతకాలంలో తను కోరి అనుభవించిన వినోదాలు ఇప్పుడు కటువుగా కనిపించాయి. ఇంటిలో కూతురులాగ మెలిగినా, ఆమె మనసులో కోడలనే ధోరణి చోటుచేసుకుంది. ఇంటిబయట ఎవరైనా రాజంని చూస్తే నియతంగా "ఓ, నువ్వింకా ఇక్కడేవున్నావా" అని అడిగారు. మరికొందరు ఏ ప్రశ్నలూ అడగక, చూసీచూడనట్టు తప్పించుకున్నారు. ఇదిచూసి రాజం కలవరపడింది; తల్లికి చెప్పింది. విశాలం అసలు సంగతి ఏమిటో కూతురికి చెప్పింది.

"'ఓ, నువ్వింకా ఇక్కడేవున్నావా?' అని వాళ్ళడిగే ప్రశ్నకి అర్థం ఏమిటో తెలుసా? వాళ్ళకి నీ మీద గౌరవం ఉంది; నువ్వు త్వరలో తల్లి అవబోతున్నావని వారి ఉద్దేశం. లేకపోతే నువ్వు మీ ఆయనతో దెబ్బలాడుకొని ఇక్కడకి వచ్చేసావని అనుమానం కలుగుతుంది. పనికిరానిమాటలు, కబుర్లు ఇలాగే పెరుగుతాయి."

"దేవుడా, నా పేరూ, ప్రతిష్టా ఇలా బిరబిరగా జారిపోవాలా?" అని రాజం నిర్ఘాంతపోయింది. "ఆ రోజుల్లో నా అభిరుచి, ప్రతిభ ఎంతమంది ఎలా పొగడేవారు! ఆ పాత రాజంని ఇప్పుడందరూ మరిచిపోయారు!" అని రాజం నొచ్చుకుంది.

అత్తగారిల్లునుంచి మొట్టమొదట తను పుట్టిల్లుకు వచ్చినరోజులు రాజం గుర్తుచేసుకుంది. ఒకరోజు అందరూకలిసి సక్కుబాయి సినిమా చూడడానికి వెళ్ళారు.

అందులో శ్రీకృష్ణ భగవానుడు సక్కుబాయి స్వరూపంలోవచ్చి అత్తగారికి సేవచేస్తాడు. ఆ వృద్ధురాలు - నిత్యమూ కోడల్ని క్రూరంగా పీడించిన స్త్రీ - సంతోషపడుతుంది.

ఇదిచూసి రాజంకి ఆశ్చర్యం కలిగింది:

'అత్తగారికి - ఆవిడ స్వభావం ఎలాగున్నా - తప్పులు వెదకని నారీమణీ లేక నిందించే స్త్రీ కానీ - సేవ చెయ్యడమంటే అంత కష్టమా? ఇంతకీ సక్కుబాయి ఒక ఆదర్శకోడలనలేం; ఆమె నిత్యమూ అత్తగారిని భక్తితో ఆరాధించిందని చెప్పలేం. అందుకేగా ఆ కృష్ణ పరమాత్ముడు మారువేషంలో వచ్చి ఆవిడకన్నీ చేసాడు?'

మరేం ఆలోచించకుండా రాజం గొణుక్కుంది: 'సక్కుబాయిగాని ఇంకా కొంచెం పట్టుదలతో అత్తగారి సంరక్షణకోసం పాడిపడవుంటే ఆవిడ ఇంత కఠినంగా మారివుండరు!

అందరి కళ్లూ రాజం పక్కన తిరిగాయి. పక్కనేవున్న ఒక ముత్తైదువ రాజంకి చెప్పింది: "అమ్మాయీ, సక్కుబాయి ఒక పుణ్య స్త్రీ. తన స్వాధీనంలోవున్నవన్నీ పూర్తిగా త్యాగం చేసిన భక్తురాలు. మనం ఆ స్థాయిని ఏనాడూ అందుకోలేం!"

రాజం కొంచెం ఆలోచించింది. ఆ ముత్తైదువకి విరుద్ధంగా మాటాడానికి జంకింది, కాని తన మనసులో ఏముందో చెప్పాలనుకుంది. "మామీ, నేను చెప్పదలచుకున్నది ఇది. నేను మీరాబాయిని గుర్తుచేసుకున్నాను. ఆవిడ తన భర్త, అతని సాంరాజ్యంగురించి లెక్కచేయలేదు. కాని సక్కుబాయి అలాంటి స్త్రీ కాదు.

తను భర్తగదిలో ప్రవేశించినప్పుడెల్లా ఆమె అతనికి ఒక గ్లాసు పాలు లేకపోతే నీరు అందించడం మనం చూసాం. కాని తన అత్తగారు రాత్రి నిద్రకి సిద్ధమౌతుంటే సక్కుబాయి ఒక గ్లాసు నీరుకూడా ఆవిడకి ఇవ్వలేదు. అందువలనే శ్రీకృష్ణుడు చిల్లర పనులు చేసినా ఆ వృద్ధురాలికి చాలా సంతోషం కలిగింది. అంటే స్త్రీకి భక్తి కంటే ధర్మమే ప్రధానం అని సక్కుబాయి కథ మనకి చెప్తోందికదా? "

దూరంలో కొంతమంది రాజంని సద్దుకోమని సైగ చేసారు. ఆ ముత్తైదువ రాజం అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పలేదు.

కాని ఇంకొక స్త్రీ రాజంని పొగడింది. "నువ్వు మంచి గాయకురాలని నాకు తెలుసు. నీకు మంచి వాక్పటిమకూడా ఉందని నాకు ఇప్పుడు తెలిసింది. చెప్పదలచుకున్నదేదో మంచి వాదనలతో నువ్వు నిరూపించడం ఇందుకు నిదర్శనం." అలా అంటూనే ఆవిడ పక్కనేవున్న వృద్ధురాలుకి - రాజంతో ముందు మాటాడినది ఆ వృద్ధురాలే - చెప్పింది: "పిన్నీ, మీకు తెలుసా. ఆమె పేరు రాజం. నవరాత్రి ఉత్సవాల్లో పాడిన గాయకురాలు!"

"ఓ, అలాగా? అమ్మాయికి పెళ్ళైందా?" అని ఆవిడ అడగ్గానే విశాలం జోక్యం చేసుకొని "కొన్నరోజులముందే అత్తగాలిల్లునించి వచ్చింది!" అని చెప్పింది.

"ఆ అత్తమామలు పుణ్యాత్ములు," అని ఆవిడ మళ్ళీ రాజంని శ్లాఘించారు.

'ఇవన్నీ గతకాల సంఘటనలు!' అని రాజం మళ్ళీ గుర్తుచేసుకుంది. ఇప్పుడు చుట్టిపట్ల ఎవ్వరూ తన సంగీత ప్రజ్ఞగురించి నోరెత్తలేదు. ఒకానొకప్పుడు అపరిచితులుకూడా రాజం గురించి గొప్పగా మాటాడేవారు. 'అద్భుత గాయకురాలు!' అనే వారి పొగడ్త చెవులకి ఎంత ఇంపుగా వినిపించేది! ఇప్పుడు ఆ అపరిచితులు "ఇదేనా **ఆ** రాజం?" అని అడుగుతూ గుసగుసలాడుతున్నారు.

‘అసలు వాళ్ళేమంటున్నారు? కళాత్మక అభిలాషతో, ధైర్యంగా, రంగస్థలమెక్కి జనసమూహంలో పాడే నావంటి యువతికి సాంప్రదాయక హిందూ కుటుంబంలో చోటు లేదంటున్నారా? వాళ్ళందరూ మాటాడే ధోరణిచూస్తే ఈ వక్కాణింపు ఒక యధార్థ సత్యంలా కనిపిస్తోంది. అందువలనే మన పెద్దలు కుటుంబస్త్రీలకీ, కళలకీ ఎటువంటి సంపర్కమూ ఉండకూడదని విధించారని వాళ్ల ఉద్దేశమా?

రాజమూ ‘తీయని కుటుంబం’ ఆశించింది. కాని ఆమె దృష్టిలో సంగీతం ఒక శాపంగా -మానసిక వ్యాధిగా - మారిపోయింది. ఐతే ఇతరులు రాజం వ్యాకులంకి అసలు కారణం తెలియక ఆమె రంగస్థలకీర్తికోసం తన భర్త ప్రేమ, ఆదరణ పోగొట్టుకుందని చెప్పుకున్నారు.

రాజంకి ఇప్పుడు బాహ్య ప్రపంచం బోధపడింది. భర్త ఆదరణ లేకుండా తనకెటువంటి గౌరవమూ, అర్హత లభించదని తెలుసుకుంది. భర్తకి తనపై ప్రేమ ఉంది. అది ఇతరులకి తెలియనట్టుంది.

“దయచేసి రండి! కొన్నిరోజులతరువాత మనమిద్దరం మీ ఇంటికి తిరిగివెళ్దాం. ఇక్కడ ఇద్దరం కలిసి దంపతులుగా వాహ్యాళి వెళ్దాం; త్వరగా రండి. ఒకప్పుడు నేను మా ఊరిలో గర్వంగా తలెత్తి నడవగలను అని గొప్పగా చెప్పకొనేదాన్ని. ఇప్పుడో? తలవంచుకొని ఎవరైనా చూస్తారేమో అనే భయంతో నడుస్తున్నాను. వాళ్ళు నన్నేం అడుగుతారో, వాళ్ళ మనసులో ఏముందో అని కల్పన చెయ్యడానికి నాకు దిగులుగావుంది! నాకెవరి ఆదరణా లేదు - ఇక్కడా, అక్కడా, మరెక్కడైనా సరే. ఇది నా ఆశ్రయం కాదని అందరూ అంటున్నారు; నాకూ అలాగే అనిపిస్తోంది. నేనొక అనాధ, దిక్కుమాలిన పక్షియని తెలుసుకున్నాను. నా బ్రతుకుగురించి ఆలోచిస్తే నాకే విసుగేస్తుంది. దయచేసి వెంటనే రండి. మీతో మద్రాసుకి రావడావికి నేను కొంచెం వెనకాడుతున్నాను, కాని ఇక్కడ నాకు శాంతి లేదు. ఇటీవల నేనొక సత్యం గ్రహించాను. మనిద్దరం పంచుకునే జీవితం అపూర్వమైనది. అందులో నా ఆదర్శాలకు చోటు లేదు. ఇది నా నిర్ణయం, సరియైన నిర్ణయం. ఇకముందెప్పుడో

ఒకసారి జీవితమన్నది తల్లిదండ్రులమీద ఆధారపడివుంటుందని అనుకునేదాన్ని. ప్రతీ ప్రాణి జీవితంలో ఒక విశిష్టలక్షణం వుందని ఇప్పుడే నేను గ్రహించాను. ఈ నిర్ణయం నాకెలా వచ్చిందో తెలియక చికాకుపడుతున్నాను. మీరు లేకుండా నేను నా జీవితం కల్పన చెయ్యలేను. ఇప్పుడు నాకు మనఃపూర్తిగా మనశ్శాంతి కావాలి -అది కొన్నాళ్ళకైనా సరే. ఆలస్యం చెయ్యక రండి.''

రఘుపతి రాజం కోరిన ప్రియమైన ఆజ్ఞ వినగానే సరే అన్నాడు. మరేం ఆలస్యం చెయ్యకుండా ఆమెను చూడడానికి వచ్చిచేరాడు.

**(సమాప్తం)**


**********

The book's story and characters are fictitious. The setting is India in the pre-independence years and certain long established institutions and political Events are mentioned. But the characters involved in them are imaginary.

Frontispiece
Author vindhiya with her husband Prof. V. Subrahmaniyan
Photo Credits: R. Dassen Studio, Coimbatore, India

Back Cover
G.K. Vale & Co., Madras, India

Front Cover
The front cover is a collage of events, and characters from the novel. The credits for the material used for the cover are gratefully acknowledged and listed below. Reprinted with permission:




| | |
|---|---|
| 1 | *Swadesamitran* issue dated July 7, 1955 |
| 2, 4, and 5 | National Archives, New Delhi, India |
| 3 | Gopulu, *Ananda Vikatan* issue date August 14, 1955 |

Cover Design: DeAndre Thurman



ISBN 978-0-578-11805-5
90000 >
9 780578 118055